నిఖిల ప్రపంచానికి నిరంతర ప్రేరణ

గోర్కీ

అమ్మ

ప్రజాశక్తి బుక్‌హౌస్

అమ్మ

మక్సీమ్ గోర్కీ

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర

హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013

82662

ప్రచురణ సంఖ్య : 1153

ప్రజాశక్తి ప్రథమ సంక్షిప్త ముద్రణ : నవంబర్, 2010
ద్వితీయ ముద్రణ : నవంబర్, 2012

వెల : రు.

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

ముందుమాట

ప్రపంచ సాహిత్యంలో దానితో పోల్చదగిన పుస్తకం మరొకటి లేదు. సరిహద్దు రేఖలనూ, తరాల అంతరాలనూ అధిగమించి దేశ దేశాల భిన్న కాలాల పాఠకులకు ప్రేరణగా నిల్చిన ఆ అద్భుత పుస్తకమే అమ్మ. సామాజిక మార్పుకు చోదక శక్తి అయిన శ్రామిక వర్గ చైతన్య ప్రజ్వలనను ప్రతిబింబించి, సామ్యవాద వాస్తవికతకు అంకురార్పణ చేసిన రచన. లక్షల ప్రతులు ప్రచురించి పంపిణీ చేయాలని లెనిన్ స్వయానా ప్రశంసించిన పుస్తకం.

అమ్మ 1906లో తొలిసారి వెలువడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కోట్ల కోట్ల ప్రతులు వెలువడుతూనే వున్నాయి. తెలుగునాట కూడా దాని ప్రభావం అమోఘమైంది.

అమ్మ అనే మాటలో కొంతమంది సెంటిమెంటు చూస్తుంటారు గాని వాస్తవంలో అమ్మ అనేదే ఏ సెంటిమెంటు లేని వాస్తవం. మానవాళి అస్తిత్వానికి ఆరంభ వాచకం అమ్మే. అన్ని బాధలూ గాథలకు ప్రథమ ప్రత్యక్ష సాక్షి అమ్మే. వాస్తవానికి అమ్మ పాత సమాజానికి ప్రతీక. దాని క్రమానుగత చైతన్య పతాక. అమ్మ పుస్తకంలోని ప్రతి పాత్రా, ప్రతి పరిణామమూ గోర్కి వాస్తవ జీవితంలో పరిశీలించి తెలుసుకున్నదే.

1905లో రష్యాలో తొలి విప్లవ వెల్లువ వచ్చింది. అయితే ప్రజలు అప్పటికింకా జారు చక్రవర్తిపై నమ్మకంతో వున్నారు. ఆయనే ఉద్ధరిస్తాడన్న విశ్వాసంతో సామూహికంగా వినతి పత్రం సమర్పించేందుకు వెళ్లారు. అయితే దానిపై తూటాల వర్షం కురిసింది. రక్తసిక్త ఆదివారం పేరుతో అది చరిత్రలో మిగిలిపోయింది. ఆ విఫల విప్లవం అక్టోబర్ విప్లవానికి డ్రస్ రిహార్సల్ వంటిదని లెనిన్ జేజేలర్పించాడు. దాని ప్రభావంతో రష్యాలో మూడు పుస్తకాలు వచ్చాయి. ఒక టాల్‌స్టాయ్ రాసిన ' ఐ కాంట్ రిమైన్ సైలెంట్. మరొకటి ఆండ్రేవ్ రాసిన ' ద సెవెన్ మెన్ హాంగ్‌డ్'. మూడవది గోర్కి అమ్మ. ఈ మూడింటిని నిశితంగా పరిశీలిస్తే అనేక పోలికలతో పాటు స్పష్టమైన తేడాలు కనిపిస్తాయి.

రష్యన్ సాహిత్యాన్ని గురించి. అందులోనూ గోర్కి రచనా ప్రక్రియ గురించి కూడా తెలుసుకుంటేనే తప్ప అమ్మ విశిష్టత అర్థం కాదు. 19 వ శతాబ్ది నాటికే రష్యన్ సాహిత్యం చాలా శక్తివంతంగానూ, కళాత్మకం గానూ రూపొందింది. టాల్‌స్టాయ్, చెకోవ్, గోగోయ్,

కుప్రిన్, దోస్తోవస్కీ వంటి కళాకోవిదులు ఐరోపాకే తలమానికమైన సాహిత్య సంపదను సమకూర్చిపెట్టారు.అంతకు ముందులా ప్రభువర్గానికి భజన చేసే రీతిలో కాక ప్రజల బాధలకూ, భావాలకూ పెద్ద పీట వేశారు. సమాజంలో పేరుకుపోయిన అవినీతిని, అక్రమాలనూ అన్నిటికన్నా మించి మానవ పతనాన్ని కళ్లకు కట్టేలా రచనలు చేశారు. దాన్నే సవిమర్శక వాస్తవికత అన్నారు. ఒక విధంగా రష్యాలో సామాజికంగా తీవ్రమైన భావాల వ్యక్తీకరణకు సాహిత్యం ఒక సాధనమై పోయింది. దానికి తోడు జారు ప్రభుత్వం సభా పత్రికా స్వాతంత్రాలపైన తీవ్రమైన ఆంక్షలు అమలు చేస్తుండడంతో కథా రూపంలో విషయాలు తెలియజేయవలసిన అవసరమూ ఏర్పడింది.

గోర్కి అసలు పేరు అలెగ్జీ మాగ్జిమోవిచ్ పెష్కోవ్. 1868 మార్చి 14న జన్మించాడు.....

వ్యక్తిగా చిన్నప్పుడే అనేక బాధలు పడ్డాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. దౌర్జన్య పూరితమైన తాతగారి పెంపకంలో పెరిగాడు. అయితే నానమ్మ చెప్పే కథలే అతనికి వూపిరి పోసేవి. వాటివల్ల బాల్యంలోనే కథన శిల్పమూ పరిచయమైంది. తర్వాత కాలంలో ఆ ఇంట్లో వుండలేక పారిపోయాడు. అనాధలూ, అశాంతులందరిలాగే పెరిగాడు. మూటలు మోశాడు. చెత్తకుప్పల పక్కన గడిపాడు. నేలమాళిగల్లో చీకటి గుయ్యారాల్లో బతికాడు. అలా ఆయన జీవితంలో అన్ని కోణాలూ చూడగలిగాడు. ఈ దరిద్రంలోనూ, దుర్భర జీవితంలోనూ ఆయనకు ఒకే ఒక ఉపశమనం – తన వానాకాలం చదువుతో పుస్తకాలు చదవడం. ఆ విధంగా ఆయన రష్యన్ సాహిత్యంతో పరిచయం పెంచు కున్నాడు. తను చూసిన జీవితాన్ని కూడా రాయాలనుకున్నాడు. కాని అంతకంతకూ జీవితంలో వైరుధ్యాలు ఆయనను అశాంతికి గురి చేశాయి. భరించలేక ఒక కొండపైకి వెళ్లి తుపాకితో కాల్చుకున్నాడు. ఆ గుండు కొంచెం పక్కనుంచి తప్పిపోయింది. అప్పుడు మిత్రులు ఆదరించారు. అంతకు ముందు ఎవరైతే తనకు ద్వేషపూరితంగానూ, నీచంగానూ కనిపించారో వారే ఇప్పుడు ప్రేమాస్పదంగా గోచరించారు. జీవితంలో చీకటి వెలుగులనూ మానవ స్వభావంలో ఉచ్చనీచాలనూ ఆయన స్వయంగా అనుభవంలో తెలుసుకోగలిగాడు. ఆ దశలోనే ఆయనకు కొత్తగా పెంపొందుతున్న రష్యన్ కార్మికోద్యమంతో సంబంధమేర్పడింది. అక్కడ మానవ చైతన్యానికి కొత్త నిర్వచనాలు తెలుసుకున్నాడు. విప్లవకారుడుగా మారాడు.

ఇన్ని పనులు చేయడమూ, ఇంత విస్తారమైన జీవితానుభవమూ గోర్కికి చిన్నప్పుడే గొప్ప అవగాహన నిచ్చాయి. 1896లో ఆయన పావలోనా వోల్జినాను పెళ్లాడాడు. ఒక క్లర్కుగా పనిచేస్తూ ఖాళీ వేళల్లో కథలు రాయడం మొదలెట్టాడు. ఆ కథలను మాగ్జిం గోర్కీ అనే కలం పేరుతో రాసేవాడు. ప్రముఖ నవలా కారుడైన వ్లదీమర్ కొర్లెంచెంకో తన పత్రికలో ఆయనకు ఉద్యోగమిచ్చాడు. అప్పటినుంచి గోర్కీకి రచననే వృత్తిగా చేసుకునే అవకాశం లభించింది. అతని రచనలు కొద్ది కాలంలోనే అందరినీ ఆకర్షించాయి. వాటిలో సామాన్య మానవులు అథోజగత్సహోదరులు, ముఖ్యంగా సజీవమైన స్త్రీ పాత్రలు వుండటం అందరినీ ఆకట్టుకుంది. ఒక ప్రచురణ కర్త ముందు కొచ్చి వాటిని సంపుటాలుగా ప్రచురించడంతో గోర్కీ ప్రసిద్ధి పెరిగి పోయింది.

క్రమంగా ఆయనలో కార్మిక వర్గ చైతన్యం పెరిగింది. సంపూర్ణ సమానత్వం, క్రియాశీలత గల ప్రధాన పాత్రధారి కార్మికవర్గమేనని ఆయన గ్రహించాడు. ప్రపంచంలో ప్రప్రధమంగా అధునిక కార్మిక వర్గ చైతన్యాన్ని అందుకున్న రచయిత కావడమే గోర్కి ప్రత్యేకత అని ప్రసిద్ధ రష్యన్ విమర్శకుడు లునచార్స్కీ నివాళులర్పించారు. సరిగ్గా ఆ కారణంగానే జారిస్టు ప్రభుత్వం అతన్ని చూసి భయపడటం మొదలెట్టింది.

ఇరవయ్యవ శతాబ్ది గోర్కీ కొత్త చైతన్యానికి ప్రతీక కాబోతున్న సూచనలు మొదట్లోనే స్పష్టమైనాయి. 1901లో రాసిన 'తుపాను పిట్ట పాట'(సాంగ్ ఆఫ్‌ద స్టార్మీ పెట్రెల్)లో ఆయన త్వరలోనే తుఫాను రాబోతుందని హెచ్చరించాడు. 1901లోనే గోర్కి రచనలు అన్ని యూరోపియన్ భాషలలోకి అనువాదమయ్యాయి. ఆరు సంపుటాలు అయిదు సార్లు ముద్రణ పొందాయి. గోర్కి వ్యక్తిగత జీవిత స్మృతులు కూడా రాశాడు. వాటిని బట్టి అతన్ని గురించి అనేక కథలు ప్రచారంలోకి వచ్చాయి. ప్రభుత్వం ఆయనపై రాజద్రోహ నేరం ఆపాదించి ఖైదు చేసింది. ప్రజలలో దానిపై ఎంత నిరసన వచ్చిందంటే చివరకు ఆయనను విడుదల చేయక తప్పలేదు. అయినా గోర్కిపై నిరంతరం నిఘా వేసి వుంచింది. సొర్మవో   నౌకా నిర్మాణ కేంద్రం కార్మికులు అప్పటికే కుత కుత వుడికిపోతున్నారు. ప్రభుత్వం గోర్కి అక్కడకు వెళ్లకూడదని, అజర్మాస్‌లోనే వుండాలని శాసించింది. దానిపై లెనిన్' నిరంకుశ ప్రభుత్వం ఐరోపాలోనే ప్రసిద్ధుడైన రచయిత వాక్స్వాతంత్ర్యాన్ని హరించి వేసి విచారణ లేకుండా వెళ్లగొట్టింది' అని నిరసించాడు. టాల్‌స్టాయ్ ఇంకా అనేకమంది ప్రముఖ రచయితలు కూడా గళమెత్తడంతో జారు దిగివచ్చి కొన్ని మాసాల పాటు క్రిమియా లో వుండేందుకు అనుమతిచ్చాడు.

1905 జనవరి9న రష్యన్ విప్లవంలో తొలి ఘట్టం. రెండు లక్షల మంది ప్రజలు చక్రవర్తిపై నమ్మకంలో మహజరు సమర్పించడానికి వెళ్లారు. ఆ నిరాయుధులపై సైనికుల కాల్పులతో ఆ అదివారం రక్తసిక్త ఆదివారంగా పేరొందింది. ప్రజలు కూడా ఎదురు తిరిగారు. ఆ సమయంలో గోర్కి ఒక విజ్ఞప్తి రాశాడు. నిరంకుశత్వాన్ని కూలదోసేందుకు బహిరంగ తిరుగుబాటకు పిలుపునిచ్చాడు. చివరకు ఆయనను అరెస్టు చేసి మళ్లీ ప్రజల వత్తిడిపై వదలిపెట్టారు. అప్పుడే గోర్కి లెనిన్‌ను కలుసుకున్నాడు. వారిద్దరి భావాలూ ఒకేలా వున్నాయని తెలుసుకున్నాడు. తనపై వారంటు వున్న సంగతి తెలిసి జర్మనీ వెళ్లి అక్కడి నుంచి ఫ్రాన్స్‌కు చివరగా అమెరికాకు చేరుకున్నాడు.

ప్రపంచ కార్మికోద్యమానికి ప్రేరణ అయిన అమ్మను గోర్కీ సామ్రాజ్యవాద అమెరికాలో వుండగా రచించడం విశేషం. 1905 విప్లవం తర్వాత తన అరెస్టుకు వారంటు రావడంతో ఆయన విదేశాలకు తరలిపోయాడు. దేశ దేశాలు తిరుగుతూ రష్యా విప్లవానికి సహాయం కూడగట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ క్రమంలో అమెరికా చేరాడు. అక్కడే ఈశాన్య న్యూయార్క్‌లోని ఒక పెద్ద పర్వతశ్రేణిలోని క్యాబిన్‌లో కూచుని అమ్మ నవలలో చాలా భాగం పూర్తి చేశాడు. అది మొదట ఇంగ్లీషులో వెలువడింది. ఆలస్యంగా రష్యన్ భాషలోకి తర్వాత అనువాదమైంది.

అమ్మ తొలి ముద్రణ రష్యాలో పెద్ద సంచలనమే రేపింది. దాన్ని ప్రచురించిన పత్రికను ధ్వంసం చేశారు. రెండవ భాగాన్ని పూర్తిగా తొలగించేలా వత్తిడిపెట్టారు. సెన్సారింగు వల్ల చాలా అరకొరగానే అందించగలిగారు. అయినా రహస్యంగా దాన్ని చదువుతుండేవారు. విదేశాలలో మాత్రమే దాని పూర్తి పాఠం లభించేది. ప్రపంచంలోని ప్రధాన భాషలన్నిటిలోకీ అది అనువదించబడింది. అమ్మ నవల ప్రచురణపై ఆగ్రహించిన ప్రభుత్వం గోర్కీపై మరిన్ని ఆంక్షలు విధించింది. అతన్ని పట్టుకోవాలనే ఉత్తర్వులలో రచయిత అని పేర్కొనడం కూడా మానేశారు. ప్రసిద్ధమైన అతని కలం పేరు మగ్జీం గోర్కి అని గాక అసలు పేరు- అలెక్సీ మాక్సీమోవిచ్ పెష్కోవ్, చేతిపని వాడు అన్న పేరుతోనే అరెస్టు వారంటు ఇచ్చారు. అయితే గోర్కీ జారిస్టు పోలీసులను తప్పించుకుని కాప్రి దీవి చేరుకున్నాడు.

'నేను ఆ తర్వాత అమ్మ పుస్తకం చూశాను. గోర్కీ రచన నేను చూడటం అదే మొదటి సారి. దాన్ని చూశాక మాత్రం అప్పటి వరకూ నేను చదివినదంతా అత్యంత నీరసమూ, నిర్జీవమూ అని తెలుసుకున్నాను. నూలు పోగులు, ముతక గుడ్డల తర్వాత అందమైన కుట్టుపనిలా అది తోచింది. చెక్కమొహాలను చూసిన తర్వాత జీవం తొణకిసలాడే మనుషులను చూసి నట్టయింది... మానవులందరి ఆశా విశ్వాసాలు అందులో తొణకిసలాడాయి..." అని ఒక ప్రముఖ విమర్శకుడన్నాడు. ఈ మాటలు నిజానికి చాలా మంది భావాలను ప్రతిబింబిస్తాయి.దీనంతటికీ కారణం ఆ నవలలో వున్న జీవిత వాస్తవికతే.

అమ్మ నవల గోర్కి జన్మస్థలమైన పాత నగరం నిజ్నినోవోగ్రాడ్‌లో జరుగుతుంది. (దానికి ఆయన గౌరవార్థం 1932లో గౌర్కి అని పేరు పెట్టారు) ఒకా నది వోల్గా నదిలో కలిసే చోటు. అక్కడ పెద్ద రేవు, రైల్వే మార్గం కూడా. పెద్ద వ్యాపార కేంద్రమైనా అక్కడ ఒకే ఒక ఫ్యాక్టరీ వుండేది. అదే క్రాసినో సొర్మావో నౌకా నిర్మాణ కేంద్రం. గోర్కీ దాన్నే తన నవలలో నమూనాగా తీసుకున్నాడు.ఆ కాలానికి రష్యాలో వేలాది మంది కార్మికులు వున్న ఒక ముఖ్యమైన కేంద్రం అది. అక్కడ 1902లో మేడే ప్రదర్శనను పోలీసులు చెదరగొట్టడమే కాక దానిలో పాల్గొన్నవారిపై తర్వాత విచారణ జరిపారు. ఇవన్నీ తనలో ఒక పుస్తకం రాయాలనే ఆలోచన కలిగించాయని, అప్పట్లోనే తాను ఆ ఘటనల వివరాలు సేకరించి రాసి పెట్టుకున్నానని గోర్కీ తర్వాత చెప్పారు. కనక ఆయన రచనపూర్తిగా కల్పన కాదు. కళఅద్దిన వాస్తవం.

ఈ ప్రదర్శనకు నాయకుడైన పోత్ జలమోవ్‌తో గోర్కీకి చాలా సన్నిహిత పరిచయం. అతన్ని దృష్టిలో పెట్టుకునే పావెల్ వ్లాసోవ్ పాత్ర రూపొందించాడు. ఇక అతని తల్లిగారే అమ్మ నీలోవ్నా. కొడోమోత్సెవ్ అనే మరో కార్మికుడి తల్లి లక్షణాలను కూడా గోర్కి ఆ పాత్రకే జోడించాడు. ఈ ఇద్దరు తల్లులూ అనేక విధాల బిడ్డలకు సహకరించేవారు. జలమోవ్ తల్లి క్రైస్తవ సన్యాసినిగా మారువేషం వేసి పోలీసుల కళ్లు గప్పేది.ఇక కొడోమొత్సోవ్ తల్లి అయితే అతన్ని జైలు నుంచి తప్పించడానికి బాంబును దొంగచాటుగా తీసుకెళ్లింది.ఇందుకు గాను ఆమెకు జైలు శిక్ష విధించారు కూడా.తమ పిల్లలను విప్లవోద్యమంలోకి పంపిన మరికొంత మంది స్త్రీల లక్షణాలనూ కలిపాడు.(ఒక పాత్ర అలాటి అనేక పాత్రల సమాహారంగా వుండాలనే గోర్కి సిద్ధాంతం బాగా తెలిసిందే)ఈ ఫ్యాక్టరీ కార్మికుల మేడే

ప్రదర్శనపై పోలీసుల దౌర్జన్యం గోర్కీపై చెరగని ముద్ర వేసింది. దాన్నే అతను అమ్మకు ప్రధాన ప్రేరణగా చేసుకున్నాడు. వాస్తవానికి ఇది 1905 విప్లవానికి ముందున్న రష్యన్ కార్మిక వర్గ జీవితమూ, పోరాటాల సాధారణ చిత్రణే.

గోర్కి లెనిన్‌ను కలుసుకున్నప్పుడు ఆయన 'మీ అమ్మ నవల పూర్తయిందా ' అని అడిగాడు. ' అయింది. అయితే కొంచెం హడావుడిగా పూర్తిచేయవలసి వచ్చింది' అని గోర్కి జవాబిచ్చాడు.' మంచిదే అయింది. ఇప్పుడు మనకు అలాటి రచన చాలా అవసరం.ఎందుకంటే సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలోకి వచ్చిన వారిలో చాలా మంది కొత్తవారు. వారికి పాత విషయాలు తెలియవు. ఈ పుస్తకం చదివి తె లుసుకుంటారు.దీన్ని లక్షల ప్రతులు ముద్రించి అందించాలి' అన్నాడు లెనిన్. ఆయన అది ప్రచురణ కాకముందే ఒక స్నేహితుడి దగ్గర రాతప్రతి సంపాదించి చదివాడని గోర్కి గ్రహించాడు.

ఎందుకంటే అది ప్రపంచంలోనే తొలి శ్రామికవర్గ నవల.

తను నివసించే నిజ్నినోవా గ్రాడ్‌లో జరిగిన మేడే ప్రదర్శననూ, దానిపై పోలీసు నిర్బంధాన్ని ప్రత్యక్షంగా చూసిన ప్రేరణతోనే గోర్కి అమ్మ రాశాడు. నవలలో ప్రధమ భాగం ఈ ప్రదర్శనలపై పోలీసుల దాడితో ముగుస్తుంది.

ఫ్యాక్టరీ యజమానులు కార్మికుల శ్రమను దోచుకోవడాన్ని వర్ణించే వాక్యాలతో అమ్మ ప్రారంభమవుతుంది. తర్వాత అక్కడి జనం జీవన దృశ్యాన్ని వర్ణిస్తుంది. ఇలా వుండి వుండీ ఒక రోజు చనిపోయేవారు అని ఆ వర్ణనముగుస్తుంది.

వారిలో పావెల్ కుటుంబం. తాగుబోతు తండ్రి మిహాయిల్ వ్లాసోవ్. అతని దాష్టీకాన్ని భరిస్తూ బతికే తలి నీలోవ్నా. రోజంతా చాకిరీ చేసే ఆ కార్మికుడి ప్రవర్తనను ఖండిస్తూనే దానికి కారణాలను విశ్లేషించడంలో గోర్కి వర్గ చైతన్యం ప్రదర్శిస్తాడు. అతనూ చనిపోతాడు. చనిపోయాక అతని కుక్క మాత్రం రోజూ సమాధి దగ్గర కూచుంటుంది. కొన్నాళ్లకూ దాన్నీ ఎవరోచంపేస్తారు.

తండ్రి దౌర్జన్యాన్ని ఒక రోజున ఎదుర్కొన్న పావెల్ తర్వాత తనూ తాగివస్తాడు! ఉన్నదానికన్నా నిషానునటిస్తాడు. అమ్మ మౌనంగా రోదిస్తుంది. తర్వాత మారిపోతాడు. రాత్రిళ్లు ఆలస్యంగా రావడం మొదలెడతాడు. వస్తూ వస్తూ ఏవో పుస్తకాలు తెస్తుంటాడు. చాలా మృదువుగా మాట్లాడతాడు. అతను ప్రేమలో పడ్డాడేమోనని మొదట్లో సరిపెట్టు కున్నా తర్వాత ఇదంతా అమ్మకు భయం కలిగిస్తుంది. అదే విషయం అడుగుతుంది. తాము చక్రవర్తికి వతిరేకంగా పనిచేస్తున్నామని చెబుతాడు. ఈ పుస్తకాలు చూస్తే జైల్లో పెడతారనీ అంటాడు. ఆ మాటలు వినగానే ఆమెకు వూపిరాడటం కష్టమై పోతుంది!

'ఆ పనెందుకు చేస్తావు పాషా' అని కొడుకును ముద్దుపేరుతో అడుగుతుంది అమ్మ.

'ఎందుకంటే నేను నిజానిజాలు తెలుసుకోవాలనుకుంటున్నాను గనక.' అంటాడు పావెల్. వారికి ఆపద రాకుండా చూడాలని అమ్మ ప్రభువును ప్రార్థించింది.

పావెల్ మేము సోషలిస్టులం అన్నప్పుడు అమ్మ నీలోవ్నా వాళ్లు చక్రవర్తిని చంపారు కదా అని అడుగుతుంది. మేము అలాటి పని చేయవలసిన అవసరం లేదు అంటాడు పావెల్. నా బిడ్డ తప్పు చేయడు అనుకుంటుంది అమ్మ.

అమ్మ కొడుకును ఏదైనా ప్రశ్నించడం అదే మొదటి సారీ, చివరి సారీ. తర్వాత ఆమె సందేహాలు తెంచుకుని అతని మార్గంలో నడవడం మొదలెట్టింది. కొడుకు కోసం వచ్చే రకరకాల మనుషులూ, వారి మాటలూ చేతలూ చర్చలూ, వాదనలూ అన్నీ గమనిస్తూ వారికి అవసరమైనవి అమరుస్తూ వచ్చింది. వారంతా ఒక కొత్త ప్రపంచాన్ని నిర్మించేందుకోసం పోరాడుతున్నారని ఆమెకు అర్థమైంది. వారి తీరు తెన్నులు తను చూసిన సమాజానికి భిన్నంగా వున్నాయి. ఆ వచ్చేవారు ప్రధానంగా కార్మికులు. అయితే అదే సమయంలో రైతులూ వస్తున్నారు. ఉన్నత వర్గీయులూ వున్నారు. ప్రశాంత చిత్తులూ, హడావుడి మనుషులూ, దూకుడు స్వభావులూ ఒకరేమిటి అన్ని రకాల వారూ. ఇప్పుడు ఆమె వారందరికీ అమ్మ అయిపోయింది. సాంత్వన ఇచ్చింది. తనేమో వారినుంచి ఉత్తేజం పొందింది.

అమ్మ అనగానే పావెల్ అతని కార్మిక మిత్రులూ గుర్తుకు వస్తారు. కాని అందులో అన్ని తరగతుల, తరాల ప్రతినిధులూ వున్నారు. కథానాయికే గత తరం ప్రతినిధి! అమ్మ నీలోవ్నా, రైతు రీబిన్, మేధావి వర్గానికి చెందిన నికోలాయ్ ఇవనావోచ్, పావెల్ అరెస్టు తర్వాత అతని స్థానాన్ని స్వీకరించి అనారోగ్యంతో కన్నుమూసే యెగోర్ వీరంతా పాతతరం వారే. ఇక యువ విప్లవ కారులలో మహిళలు గణనీయంగా వుంటారు. దూసుకు పోయే సోఫియా, పావెల్ స్నేహితురాళ్లు నటాషా, టాన్యా ఎవరూ పురుషులకు తీసిపోని విధంగా పనిచేస్తారు.

'పావెల్ విప్లవ మార్గమూ, నీలోవ్నా దయామయ న్యాయశీల హృదయమూ, మనస్సాక్షీ, జీవితాన్ని కరుణతో గడపాలనే ఆమె భావనలూ ఇవే ఈ పుస్తకంలో గోర్కీకి నైతిక ప్రమాణాలని' ఆయన సాహిత్యాన్ని మథించిన బొరిస్ బ్యాలిక్ అంటారు. ఈ కారణంగానే పాఠకులు నవలను అమ్మ కళ్లతోనే చూస్తారు. పావెల్ కామ్రేడ్లు కూడా ఆమెను అమ్మ అనడమే కాదు, పాఠకుడూ అమ్మ వెంట నడుస్తున్నాననుకుంటాడు. ఒక విధంగా అమ్మ అంటే సమాజమే. 'మేమంతా ఒక తల్లి బిడ్డలం. ప్రపంచం లోని కార్మికులంతా సోదరులనే అకుంఠిత విశ్వాసమే మా తల్లి' అంటాడు నవలలో పావెల్ సన్నిహితుడైన ఆన్ద్రేయ్ సహోర్క. వీరికి తోడుగా రీబిన్ వంటి బలమైన రైతు పాత్రలూ వుంటాయి. 'ప్రజలంతా ఒకటే ననే భావం వాళ్లకు కలిగించడం చాలా గొప్ప సంగతి. మనం చేస్తున్న పనినే లక్షలాది మంది ప్రజలు చేయదలుచుకున్నారని తెలిస్తే హృదయానికెంతో వూరట కలుగుతుంది' అంటాడు రీబిన్.

గోర్కీ సాధించిన విజయం ఇక్కడే వుంది. విప్లవ పోరాట క్రమంలో జన బాహుళ్యం ఎలా రాటు దేలతారో ఎలా పునీతులై పోతారో అమ్మ మనకు చెబుతుంది. అంతకు ముందు దోస్తోవస్కీ ప్రతివాడూ ప్రతివానికీ శత్రువే నన్న భావం విప్లవం కలిగిస్తుందని

పోరబడ్డాడు. టాల్‌స్టాయ్ అనా కెరెనినా మానవ వైరుధ్యాల తాకిడి తట్టుకోలేక రైలు కిందపడి ఘోరంగా ఆత్మహత్య చేసుకుంది. గోర్కీ ఈ రెంటికీ విరుగుడుగా అమ్మను, ఆమె పోరాట పథాన్ని సృష్టించాడు. ఇక్కడ మనుషులు కొత్త చైతన్యంతో ఐక్యతతో పునరుజ్జీవులవుతున్నారు. అనా కెరెనినాకున్న ఆలోచనా స్థాయిలేని పాతకాలపు శ్రామిక మహిళ అమ్మ నీలోవ్నా విప్లవ శక్తులకు పురుడు పోస్తుంది!

మనిషి భవితవ్యం ప్రజా రాశుల భవితవ్యంతో విప్లవాత్మక పరివర్తనతో ముడిపడివుందనే పరమసత్యం చెప్పిన గోర్కీ ఆ క్రమంలోనే మానవుడు స్వార్థపూరితమైన ఆహాన్ని త్యజించి సమిష్టి స్ఫూర్తి సాహసాన్ని సంతరించుకోవడాన్ని చిత్రించాడు. వీటినే బూర్జువా విశ్లేషకులు వ్యక్తిత్వ రహితమైన పాత్రలుగా చిత్రిస్తుంటారు గాని వాస్తవంలో అమ్మ నవలలో ప్రతి పాత్రలో జీవం తొణికిస లాడుతుంది. అంతులేని వైవిధ్యం వుంటుంది.

"మనిషి జన్మత: దుష్టుడు కాదనీ, వర్గ వ్యవస్థ తాలూకూ జుగుప్సాకరమైన సామాజిక ప్రభావం వల్లనే అతన భ్రష్టుపడుతున్నాడనీ రచయిత గుర్తించాలి. అలాటి వ్యవస్థ హింస లేకుండా వుండలేదు. అసూయ, పగ,సోమరి తనం ప్రకోపింప చేయకుండానూ వుండదు. నిర్బంధ పూరితమైన నిరర్థకమైన శ్రమ పట్ల వైముఖ్యాన్ని, సులభంగా సమకూరే లాభం పట్ల చవకబారు చెత్త సుఖాలపట్ల విషయ లౌల్యం పట్ల, తాగుడు తదితర దురలవాట్ల పట్ల ఆకర్షణ లేకుండానూ చేయలేదు. మనిషి జన్మత: నీచుడనీ, వాడి సహజ లక్షణాల్లో నీచత్వం భాగమనీ అది రాక్షస ప్రేరితమనీ అనుకునే స్థితి రాకూడదు..." ఇది గోర్కీ తరచనా తత్వం. మనిషి ఔన్నత్యం సమిష్టిలోనూ, సమరశీలతలోనూ వుందని ఆయన శక్తివంతంగా చిత్రించాడు.

అయితే విప్లవ పోరాటం కాల్పనికమైంది కాదు. వ్యక్తిగత సాహసమూ కాదు. దానిలో ఉద్వేగాలు లేని యాంత్రికతా కాదు. అమ్మలోని పాత్రల్లో ప్రేమలూ, వియోగాలూ, విషాదాలూ, వ్యాధులూ, బాధలూ వ్యక్తిగతమైన హెచ్చుతగ్గులూ అన్నీ చూస్తాము. పావెల్ స్వతహాగా ముక్తసరిగా మాట్లాడతాడు. అమ్మ నవలకు వచ్చిన ప్రఖ్యాతి వల్ల ఆ తరహా రచనల్లో నాయకుడు గంభీరంగా వుండాలనే భావన కూడా కొందరిలో వచ్చింది. కాని వాస్తవానికి అమ్మ స్వయానా కొడుకును మరింత అర్థమయ్యేలా మాట్లాడితే బాగుండనుకుంటుంది." నీవు బాగా మాట్లాడతావు. కాని హృదయాన్ని స్పందింప చేయలేవు. అదంతే. వాళ్ల హృదయాలు కంపింపచేసేట్టు చెప్పాలి. గుండెల్లోపల నిప్పు రవ్వ రగిలించాలి. వాళ్లతో వాదించి ఒప్పించలేము. బిగుతు జోడుకాలికి ఎక్కదు' అంటాడు రీబిన్. అమ్మ కూడా ఇతరులతో పోల్చుకుని అతనెందుకు అలా మాట్లాడలేదు అని ఆలోచిస్తుంది. హడావుడి చేసే అమ్మాయిని చూసి ఈమె రీబిన్‌కు నచ్చదు అనుకుంటుంది. తీరా ఆమెను అతను ఆమోదించిన తర్వాత హమ్మయ్య అనుకుంటుంది. కొడుకును జైలు నుంచి తప్పించాలన్ననిర్ణయానికి సంతోషిస్తుంది.అది సరైన నిర్ణయం కాదని అతను అన్నందుకు మౌనంగా బాధపడుతుంది.

'మన పిల్లలే మన పాలిట న్యాయాధిపతులు' అని జైలులో తనను ఎకసెక్కం చేసిన అధికారికి ధైర్యంగా బదులు చెబుతుంది. తను పూజించే క్రీస్తు బోధనలకు వారి కార్యాచరణలోనే చూసుకుంటుంది. చివరకు ఆధ్యాత్మికత కన్నా ఈ పోరాటాలే గొప్పవన్న నిశ్చయానికి వస్తుంది. గూఢచారుల కళ్లుగప్పి విప్లవ సాహిత్య ప్రచారంలో సహాయక కార్యకలాపాలలో భాగం పంచుకుంటుంది.

చాలా చాలా ఘటనలు జరుగు తాయి. నిర్బంధాలు, సాయుధు భటుల దౌర్జన్యాలు, శిక్షలూ అన్ని తట్టుకుంటుంది. చివరలో ఇలా చెబుతుంది:

'నా కొడుకు చెప్పిన మాటలను, నా రక్తంలో రక్తమూ మాంసంలో మాంసమూ అయిన నా కొడుకు మాటలను ఇతరులకు చెబుతుంటే నాకెంత సంతోషమో మీకు తెలిస్తేనా? నా ఆత్మను సమర్పిస్తున్నట్టే.

ఇదంతా చూస్తుంటే మానవుని కడుపున కొత్త దేవుడు అవతారమెత్తినట్టుగానే వుంది. ప్రతి ఒక్కటీ అందరికీ అంతా ప్రతి ఒక్కడికీ. నేనా దృశ్యాన్నే చూస్తున్నాను. నిజం చెప్పాలంటే మనమంతా కామ్రేడ్లం. ఆత్మీయులైన బంధువులం. అందరమూ సత్యమనే తల్లి బిడ్డలం. కామ్రేడ్స్ అనే మాటను నాలో నేను స్మరించే సరికి వారు నా హృదయంలోంచి పొంగి వస్తుండడం నేనే వినగలుగుతున్నాను'

నవల ముగింపు ఘట్టంలో పోలీసులు దౌర్జన్యం చేసినప్పుడు-

రక్తపుటేర్లు పారించినా సత్యాన్ని ముంచేయలేరు' అని గర్జిస్తుంది.

ఆ గర్జన ఇప్పటికీ ప్రపంచమంతా మార్మోగుతూనే వుంది. అమ్మ కావాలని అడిగే పాఠకులు అసంఖ్యాకం. ఇంటర్‌నెట్ చూస్తే అమ్మ నవలపై అపారమైన స్థాయిలో అభినందనా పూర్వకమైన అంశాలు కనిపిస్తాయి. దాన్ని యధాతథంగా అందించే సైట్లు లె క్కలేనన్ని . దాని పూర్ణ సంక్షిప్త ప్రచురణలు ఎన్నెన్నో. ఇప్పటికీ వాటిని చదివిన వారు ఉత్తేజితులవుతూనే వున్నారు. ఎందుకంటే అమ్మ అంటే జీవితం. జీవిత పోరాటం.

తన పుస్తకం ఫ్రెంచి ముద్రణకు ముందు మాట రాస్తూ గోర్కీ ఇలా అంటాడు:

.... ఇన్ని సంవత్సరాల నుంచి శ్రామికవర్గం అమ్మ నవల చదువుతూనే వుంది... గతించి పోతూవున్న పెట్టుబడిదారీ విధానపు ఏహ్యమైన ప్రకంపనాలు ఫ్రెంచి శ్రామికవర్గానికి ప్రపంచ శ్రామికవర్గానికీ ఇంకా ఇంకా స్పష్టంగా గోచరిస్తున్నప్పుడు ఈ పుస్తకపు నూతన ముద్రణ వెలువడుతోంది. "ఇలా అంటూ గోర్కీ ఆనాటి ప్రపంచ పరిస్థితులను ఫాసిజం ప్రమాదం వగైరాలను ప్రస్తావిస్తాడు. ప్రపంచీకరణ నేపథ్యంలోనూ అమ్మ శతజయంతికి అలాటి ప్రాధాన్యతే కలుగుతోంది!

- తెలకపల్లి రవి

రోజూ తెల్లవారేసరికి ఫ్యాక్టరీ కుయ్యిమని కూత పెడుతుంది. ఆ కూత వినడంతోనే కూలిపేటలోని జనమంతా నూనెకంపు విరజిమ్మే గాల్లో, నిద్రమత్తుతో చిరచిరలాడుతూ బెదిరిపోయిన బొద్దింకల్లా గబగబా వీధుల్లో పడతారు. చిరుచీకట్లో, బురద రోడ్ల మీద కాళ్లీడ్చుకుంటూ ఎత్తయిన రాతి బోనులవైపు నడుస్తారు. వాళ్ల పాదాల కింద కాళ్ళ రొచ్చు చితచితలాడుతుంది. బొంగురు గొంతుకతో కేకలు వేస్తూ తిట్లతో గాలిని చీలుస్తూ వారు నడుస్తుంటే యంత్రాల రొద, ఆవిరి బుసబుస వారికెదురు సన్నాహం చేస్తుంటాయి. కఠినంగా ధుమధుమలాడే ఉన్న ఎత్తయిన నల్లని పొగ చిమ్నీలు పేటపైన దుడ్డుకర్రల్లా అగపడుతూ ఉంటాయి.

సాయంకాలం అస్తమించుతున్న సూర్యుని నీరస కిరణాలు కిటికీ తలుపుల అద్దాల మీద పడి ప్రతిబింబించే సమయానికి ఫ్యాక్టరీ తన రాతి పేగుల్లోనుంచి విసర్జించినట్లుగా చిట్టెంతో సమానమైనట్టుగా జనాన్ని బయటికి గెంటేస్తుంది. మురికి ఓడుతూ మసిబారిన మొగాల్తో ఆకలి బిగిమీద జిగట వాసనలను వెడల గొట్టుతూన్న నూనె శరీరాలతో వారు మళ్ళీ రోడ్డెక్కుతారు. ఈ రోజు గొడ్డుచాకిరి ముగిసింది. ఇంటివద్ద భోజనమూ, విశ్రాంతీ తమ కోసం కనిపెట్టుకుని ఉన్నాయని వారి గొంతుకలు ఉత్సాహంగానూ, సంతోషంగా కూడానూ ఉంటాయి.

పగలంతటినీ ఫ్యాక్టరీ దిగమ్రింగింది. ఫ్యాక్టరీ యంత్రాలు, కార్మికుల శరీరాలలోని శక్తిని తమకు కావలసినంతవరకు పీల్చేశాయి. ఇంతటితో ఈ రోజు సరి. దాని ఛాయలేమీ కనుబడవు. మనిషి ఆయుర్దాయంలో ఒక రోజు తరిగిపోయిందన్నమాట. ఇక ఆనాటికి అతడాశించేది విశ్రాంతి, చుట్ట పొగతో నిండిన సారాదుకాణపు సరదాలు.

ఆదివారం రోజునా, శలవు రోజుల్లోనూ, కూలిజనం ఉదయం పది గంటల వరకూ నిద్రపోయేవారు. నిద్రనుంచి లేచిన తరువాత మర్యాదస్థులైన దంపతులు, ఉన్నంతలో ఉత్తమమైన

దుస్తులు ధరించి, మతం పట్ల అలక్ష్యంగా ఉండే కుర్రాళ్ళను చీవాట్లు పెడుతూ చర్చికెడతారు. అక్కడ ప్రార్థనలైపోయాక ఇంటికొచ్చి తిని సాయంకాలంవరకూ పడుకుంటారు.

అనేక సంవత్సరాల నుంచి పేరుకుంటూ వస్తున్న అలసట ఫలితంగా వారికి తినాలనే వాంఛ మందగించిపోతుంది. అందుచేత ఆకలిని రేకెత్తించడానికి, చురుకైన వోడ్క ఎక్కువగా త్రాగుతారు.

స్నేహితులను కలుసుక్నుప్పుడు, ఫ్యాక్టరీని గురించి, మిషనులను గురించీ, మేస్త్రీలను గురించీ మాట్లాడుకుంటారు. తమ పనికి సంబంధించని విషయాలను గురించి వాళ్లెప్పుడూ ఆలోచించరు, మాట్లాడరు. విసుగుపుట్టించే వారి దైనందిన చర్యలో అప్పుడప్పుడు మాత్రం కొన్ని ఆలోచనలు మిణుకుమిణుకుమనేవి. మగవాళ్లు ఇంటికొచ్చి భార్యలతో కజ్జాతెచ్చుకుని వాళ్లను తరుచుగా బాదుతూ ఉంటారు. యువకులు సారాదుకాణాలకో, స్నేహితులిండ్లకో పోయి అక్కడ ఎకార్డియన్ వాయించుకుంటూ, అసభ్యమైన పాటలు పాడుకుంటూ డాన్సుచేస్తూ తిట్టుకుంటూ తాగి తందనాలు తొక్కుతుంటారు. రోజూ చేస్తుండే కాయకష్టం వల్ల శరీరం అలసిపోయిన కారణంగా, తాగుడు త్వరగా తలకెక్కుతుంది. వారి హృదయాలలో చెప్పడానికి వీలులేని ఆవేశమేదో ఒకటి బయటకు ఉబ్బికొస్తుంది. దానితో ఏదో చిన్న కారణంతోనే తగువులాటకు దిగి పశుత్వానికి లోనై క్రూరంగా కొట్టుకుంటారు. కొన్నిసార్లు తీవ్రమయిన గాయాల పాలవుతారు. అప్పుడప్పుడు హత్యలు కూడా జరుగుతుంటాయి.

వారి పరస్పర మానవ సంబంధాలలో ఒక విధమైన కోపం గర్భితంగా దాగి ఉంది. వారి కండరాల అలసట ఎంతటి అనివార్యమో, వారిలోని ఈ కోపం అంతటి పురాతనమైనది. ఈ మానసిక రోగం వారికి తమ తండ్రితాతల దగ్గరనుండి పుట్టుకతోనే సక్రమించింది. చచ్చేవరకూ, అది నల్లని ఛాయలా వెంబడించి, అర్థంలేని క్రూర చేష్ఠలను చేయిస్తుంది.

ఆదివారంనాడు యువకులు చిరిగిపోయిన గుడ్డలతో ఒళ్లంతా మట్టీ బురదా కొట్టుకుని చితికిపోయిన ముఖాలతో రాత్రి చాలా ఆలస్యంగా ఇంటికొచ్చేవారు. ఒక్కొక్కప్పుడు తమ స్నేహితులను కొట్టిన దెబ్బలను గురించి అక్కసుకొద్దీ బడాయిలు చెప్పుకుంటూ ఇంటికొచ్చేవారు. మరొకప్పుడు తమకు జరిగిన పరాభావాలకు చిరచిరలాడుతూనో, ఆగ్రహపడుతూనో, ఏడుస్తూనో వచ్చేవారు. తప్పత్రాగి అసహ్యంగా, హీనంగా, నికృష్టంగా జాలి కొల్పేటట్లుగా ఉండేవాళ్లు.

ఏ యాభై ఏండ్లో ఈ జీవితాన్ని గడిపేక మనిషి చనిపోయేవాడు.

* * *

ఈ విధంగానే మహయిల్ వ్లాసావ్ అనే మెకానిక్ జీవనం గడుపుతుండేవాడు. అతడు రోమశుడు, కోపి. దట్టమైన కనుబొమ్మల్లోనుంచి చిన్న కళ్లు అనుమానంతోనూ కావేశంతో కూడిన ఛీత్కారంతోనూ మిలమిలలాడుతూ వుండేవి. అతడు ఫ్యాక్టరీలోకల్లా మంచి పని వాడైన మెకానిక్. ఆ పేటలోకల్లా బలవంతుడు. పై అధికారులతో కస్సుబుస్సుమంటూ ప్రవర్తించడంచేత డబ్బు సంపాదించలేకపోయేవాడు. ప్రతి శెలవు రోజునా అతడెవ్వరినో

చితగ్గొట్టేవాడు. అందుచేత ఊరందరికీ అతడంటే అసహ్యం, భయం కూడా. అతనిని తిరగబడి కొట్టాలని కొందరు ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఆ ప్రయత్నాలు ఫలించలేదు.

వ్లాసొవ్ ఎప్పుడోకాని మాట్లాడేవాడు కాదు. నోరువిప్పితే మాత్రం "కుక్కల కొడకా" అనే ఊతపదం రావలసినదే. పోలీసులను గురించి మాట్లాడినా, ఉద్యోగస్తులను గురించి మాట్లాడినా, ఫ్యాక్టరీ యజమానులను గురించి మాట్లాడినా అదే మాట. భార్యనెప్పుడూ "కుక్కముండా" అనే పిలిచేవాడు.

"ఏయ్, కుక్కముండా! నా పంట్లాం చినిగిపోయింది. కనబడడం లేదూ?" అనేవాడు.

* * *

అతని కుమారుడు పావెల్ పధ్నాలుగు సంవత్సరాల వయస్సులో ఉండగా, ఒకనాడు వ్లాసొవ్ అతనిని జుట్టు పట్టుకుని ఈడ్వడానికి ప్రయత్నం చేశాడు. పావెల్ బరువైన సుత్తిని చేత్తో పట్టుకుని, కరుగ్గా :

"చేతులొాదులు!" అన్నాడు.

"ఏమిటేమిటీ? అన్నాడు తండ్రి పొడుగ్గా, సన్నగా వున్న కొడుకు దగ్గరకు భూర్జవృక్షం దగ్గరకు మేఘచ్ఛాయలా – జరుగుతూ.

"ఇక చాలించు, ఇంతవరకూ సహించాను, ఇక సహించను" అంటూ సుత్తి పైకెత్తాడు కొడుకు.

తండ్రి ఒక్కసారి కొడుక్కేసి ఒకచూపు సారించాడు. రోమమయమైన చేతులు వెనక్కు లాక్కున్నాడు.

"సర్లేరా..." అన్నాడు. చిన్న నవ్వు నవ్వి, తరువాత దీర్ఘంగా నిట్టూర్చి,

"నువ్వు కుక్కల కొడుకువేరా నిజంగా" అన్నాడు.

ఇది జరిగిన కొద్ది రోజుల తరువాత అతడు భార్యతో :

"ఇక మీదట నువ్వు డబ్బూ గిబ్బూ నన్నడగొద్దు. ఇప్పట్నుంచి పావెలే నిన్ను పోషిస్తాడు" అన్నాడు.

"ఓహో, అయితే సంపాదించినదంతా నువ్విక తాగేస్తావు కాబోలు!' అని జవాబు చెప్పడానికామె సాహసించింది.

"ఛీ కుక్కముండా! ఆ సంగతి నీకెందుకు? నాకిష్టమైతే ఒక పిల్లను తెచ్చుకుంటాను!"

అతడే పిల్లనూ తెచ్చుకోలేదు. కాని రెండేళ్ల అనంతరం చచ్చిపోయేదాకా అతడు కొడుకును గురించి పట్టించుకోనేలేదు. ఎన్నడూ నోరెత్తి అతనితో మాట్లాడలేదు.

వ్లాసొవ్ ఒక కుక్కని పెంచాడు. అది కూడా అతన్లాగే భారీగా, రోమశంగా ఉండేది. ప్రతిరోజు పొద్దున్నే అతనిని ఫ్యాక్టరీ దాకా సాగనంపేది. సాయంకాలం అతనికోసం గేటు దగ్గర కనిపెట్టుకునుండేది.

చివరకు ఆంత్రవృద్ధివల్ల అతడు మరణించాడు. అయిదు రోజులపాటు ముఖం నల్లబడిపోయి, కండ్లు మూతపడిపోయి, పళ్లు పట పట కొరుకుతూ పక్కమీద పొర్లాడేవాడు.

శవపేటికను పూడ్చిపెట్టటంతోనే జనమంతా ఎవరి దారిని వాళ్లు పోయారు. కాని కుక్క మాత్రం సమాధి దగ్గరే కూచుని, తిరగవేసిన మట్టిని నిశ్శబ్దంగా చూస్తూ అక్కడే ఉండిపోయింది. కొన్ని రోజులు తర్వాత ఎవరో దాన్ని చంపేశారు....

* * *

తండ్రి చనిపోయిన రెండు వారాల తర్వాత ఒక ఆదివారంనాడు పావెల్ వ్లాసొవ్ చిత్తుగా తాగి తూలిపడుతూ ఇంటికొచ్చి, మెల్లగా పాకుతూ బల్లదగ్గర తన తండ్రి కూచునే చోట కూచున్నాడు.

పావెల్ తాగడమిదే మొదటిసారి. సారా అతని శరీరాన్ని నిస్సత్తువ చేసింది. కాని స్పృహ మాత్రం తప్పలేదు. తలలో "నేను తాగేనా? తాగేనా?" అనే ప్రశ్న పదేపదే మెదిలింది.

తల్లి ఆప్యాయత అతనినెంతో కలవర పెట్టింది. ఆమె కళ్లల్లోని విషాదచ్ఛాయలతని హృదయాన్ని స్పందింపచేశాయి. బావురుమని ఏడ్వాలనుకున్నాడు. కాని ఉన్నదానికన్న ఎక్కువ నిషాను నటిస్తూ కన్నీటి ధారలనాపుకున్నాడు.

తల్లి తడితడిగా ఉన్న అతని చింపిరి తలను మెల్లగా నిమిరింది.

"నువ్వీ పని చేసి యుండకూడదబ్బాయ్" అని మెల్లగా చెప్పింది.

తనకేదో సుస్తీగా ఉన్నట్లు అతడు బాధపడ్డాడు. ఎక్కువగా డోకెళ్లిపోయింది. తల్లి అతన్ని పక్కమీద పడుకోపెట్టింది.

దూరాన్నుంచి తల్లి మృదుస్వరం వినబడింది :

"నువ్వు ఈ విధంగా తాగడం ఆరంభిస్తే నన్నెలా పోషిస్తావురా నాయనా?"

"అందరూ తాగుతున్నారు కదా?" అని గట్టిగా కళ్లు మూసుకుని పావెల్ జవాబు చెప్పేడు.

తల్లి నిట్టూర్పు విడిచింది. అతను చెప్పిన మాట నిజమే. జనానికి ఒక తృణం సుఖాన్నిచ్చేది సారాదుకాణమొక్కటేనని ఆమెకూ తెలుసును.

"కాని నువ్వు మాత్రం తాగకూడదు సుమా... మీ నాయన మీ యిద్దరికి చాలినదానికన్న మించి తాగేశాడు. నన్నాయన నానా హింసలూ పెట్టాడు! నామీద నీకైనా కాస్తంత జాలి కలగడం లేదురా నాయనా?" అన్నది.

ఆమె విచారంగా చెప్పిన మెత్తని మాటలు వింటుంటే, తన తండ్రి జీవితకాలంలో తల్లి ఉన్నదో లేదో కూడా తనకు గుర్తులేని సంగతి జ్ఞప్తికొచ్చింది. కొడతాడేమోననే భయంతో ఆమె నిశ్శబ్దంగా ఉండేది. తన మటుకు తాను తండ్రిని కలుసుకోకుండా ఉండాలనే ఉద్దేశంతో వీలైనంతవరకు ఇంటికొచ్చేవాడుకాడు. అందుచేత తల్లికీ దూరంగానే బతికాడు. క్రమక్రమంగా నిషా తగ్గిన పిమ్మట ఆమెనెంతో పరిశీలనగా చూశాడు.

పావెల్ తల్లి పొడగరి. కొంచెం గూనివుంది. బండ చాకిరీవల్లా, భర్త కొట్టిన దెబ్బల వల్లా ఆమె నిశ్శబ్దంగానూ కొద్దిగా పక్కకు వంగుతూనూ నడుస్తుంది. దేనికైనా కొట్టుకుంటానేమోనన్న బెదురు ఆ నడకలో కనబడుతుంది. విశాలంగానూ గుండ్రంగానూ ఉండి, పొంగి ముడతలు పడిన ఆమె ముఖంలో, భయవిషాదాలతో నిండిన నల్లని కళ్లు వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఆ పేటలో ఉండే చాలామంది స్త్రీల కళ్ళు అలాగే ఉంటాయి. ఆమె కుడి కనుబొమకు పైగా లోతైన మచ్చ ఒకటుంది. అది కనుబొమను కాస్తంత పైకి ఎగదోసింది. అందువల్ల ఆమె కుడి చెవి ఎడమ చెవికన్న ఎత్తుగా ఉన్నట్లు కనబడుతుంది. ఆమె ముఖం ఎప్పుడూ ఏమొస్తుందోననే అదటల్లో ఉన్నట్లు కనిపిస్తుంది. ఒత్తుగా నల్లగా ఉండే ఆమె జుట్టులో అక్కడక్కడ తెల్లవెంట్రుకలు మెరుస్తున్నాయి. ఆమె మూర్తీభవించిన సౌమ్యత, విషాదం, అణకువ అని చెప్పాలి.

ఆమె చెక్కిళ్లమీద కన్నీటి ధారలు మెల్లగా జారుతున్నాయి.

"ఏడ్వకమ్మా! నాకు దాహమియ్యి" అన్నాడు మెల్లగా కుమారుడు.

"కొద్దిగా చన్నీళ్లు పట్టుకొస్తాను."

* * *

పావెల్ యువకులంతా చేయవలసిన పనులన్నీ చేస్తుండేవాడు. ఒక ఎకార్డియన్, గంజి పెట్టిన చొక్కా, నెక్‌టై, జత రబ్బరు జోళ్లు, బెత్తం కొనుక్కున్నాడు. ఈ విధంగా అతడు తన ఈడు అందరు కుర్రవాళ్లలాంటివాడే అయాడు. సాయంకాలపు పార్టీలకు వెళ్లేవాడు. నాలుగు జంటల డాన్సూ, పోల్కా డాన్సూ నేర్చుకున్నాడు. ఆదివారం రాత్రి తాగి ఇంటికొచ్చేవాడు. కాని వోడ్క అతని ఒంటికి పడలేదు. జబ్బు చేసేది. సోమవారం పొద్దున్న లేచేసరికి తలనొప్పి, గుండెల్లో మంట వచ్చేవి. ముఖం వెలవెలబారి వాడిపోయేది.

"రాత్రి బాగా కులాసాగా కాలక్షేపం చేశావా?" అని ఒక రోజున అతన్ని తల్లి అడిగింది.

"అబ్బ!! ఛండాలం!" అంటూ చిరాకుతోనూ విసుగుతోనూ ఆమెకు జవాబు చెప్పేదు. "ఇంతకన్న చేపలు పట్టుకుందుకు పోవడం నయం. లేకపోతే ఒక తుపాకి కొనుక్కొని వేట కెడతాను" అన్నాడు పావెల్.

* * *

పావెల్ ఫ్యాక్టరీలో కష్టపడి పనిచేసేవాడు. ఒక రోజైనా గైరుహాజరు కాకుండా, ఆలస్యంగా వచ్చినందుకు జరిమానా పడకుండా పనిచేశాడు. అతను మితభాషి. తల్లి కళ్లలాగే విశాలంగా ఉండే అతని నీలి కళ్లలో ఒక విధమైన అసంతృప్తి ద్యోతకమయేది. అతను తుపాకినీ కొనుక్కోలేదు, చేపలు పట్టుకుందుకు వెళ్లనూ లేదు. కాని అతను అందరివలె కాకుండా వేరే మార్గం పట్టినట్లు మాత్రం స్పష్టమైంది. మునుపటిలాగ అంతగా పార్టీల కెళ్లేవాడు కాదు. ఆదివారంనాడు ఇంట్లో ఉండేవాడు కాదు. కాని రాత్రి ఇంటి కొచ్చేటప్పుడు స్పృహతోనే ఉండేవాడు. సునిశిత దృష్టిగల అతని తల్లి, తన కొడుకు ముఖం చిక్కిపోతోందని గ్రహించింది. అతని కండ్లలోనూ, ముఖకవళికల్లోనూ ఏదో ఒక తీవ్రమైన ఆలోచనా తత్పరతనామె చూచింది. అతని మనసులో ఏదో కోపమో అంతర్గతంగా ఏదో జబ్బో ఉందేమోననిపించింది. ఇంతకు ముందు అతని స్నేహితులు కొందరు తరుచు వస్తుండేవారు. ఇప్పుడతను ఇంట్లో ఉండకపోవడం తెలుసుకుని రావడం మానేశారు. తన కొడుకు ఫ్యాక్టరీలో ఉండే ఇతర యువకుల్లాంటివాడు కాదని తల్లి సంతోషించింది. కాని అందరితోపాటు అంధకారబంధురమైన సామాన్య ప్రవాహాన్ని అనుసరించకుండా, వేరు దిశగా తన జీవిత నౌకకు చుక్కాని పట్టేటందుకు తన కొడుకు చేస్తున్న ప్రయత్నాలను చూస్తుంటే, ఎందుకో ఆమెకు చెప్పవలవికాని అస్పష్టమైన భయం కలిగింది.

పావెల్ పుస్తకాలను ఇంటికి తేవడం మొదలెట్టాడు. వాటిని రహస్యంగా చదివేవాడు. చదివేశాక వాటిని దాచేసేవాడు. అప్పుడప్పుడు వాటిలోని కొన్ని భాగాలను కాపీ రాసుకుని, ఆ కాగితాన్ని దాచి పెట్టుకునేవాడు...

తల్లీ కొడుకూ బొత్తిగా అపరిచితుల మాదిరిగా ఉండేవారు. ఇద్దరూ కలిసి మాట్లాడుకోవడం కూడా అరుదైపోయింది. పావెల్ ప్రొద్దున్నే ఒంటరిగా కూచుని మాటామంతీ లేకుండా టీ తాగేవాడు. తిన్నగా పనిలోకెళ్లి మధ్యాహ్నం భోజనానికి కొచ్చేవాడు. భోజన సమయంలో ముక్తసరిగా రెండు మాటలు మాట్లాడి అదృశ్యమై పోయేవాడు. మళ్లీ సాయంకాలందాకా కనబడేవాడు కాదు. సాయంకాలమింటికి రావడంతోనే ఒళ్లు కడుక్కుని, భోజనం చేసి ఓ పుస్తకం ముందరేసుకుని కూర్చునేవాడు. ఆదివారంనాడు పొద్దున్నే ఇంటినుండి బయలుదేరిపోయి, రాత్రి చాలా పొద్దు పోయిన తరువాత ఇంటికొచ్చేవాడు. అతను పట్టణంలో కెళ్లేవాడనీ, అప్పుడప్పుడు నాటకాని కెళ్లే వాడనీ తల్లికి తెలుసును. కాని పట్టణంనుండి ఎవ్వరూ తమ యింటికి రావడం లేదు. రోజు రోజూ అతడు మితభాషి కావడం ఆమె కనిపెట్టింది. కాని తనకర్థం కాని కొత్త మాటలనతడు ఉపయోగించడం ఆమె గ్రహించింది. పూర్వమతడు

మాట్లాడేటప్పుడు ఉపయోగిస్తూండిన మోటు మాటలిప్పుడు వినబడడంలేదు. పావెల్ ప్రవర్తనలోని కొత్త పోకడలెన్నింటినో ఆమె గమనించింది. ఆడంబరంగా దుస్తులు ధరించడం మానేశాడు. శరీర శుభ్రతకూ, బట్టల శుభ్రతకూ ఎక్కువ శ్రద్ధ వహించడం మొదలుపెట్టేడు. అతడు నడవడిలో ఎక్కువ స్వేచ్ఛ, నిరాడంబరత్వమూ ద్యోతకమైనాయి. వెనుకటి మోటుతనం తగ్గిపోయింది. ఈ మార్పు లెందుకొచ్చాయో తెలియక ఆమె చాలా ఆందోళన చెందింది. ఆమెపట్ల కూడా అతడి ప్రవర్తన మారింది. ఒక్కొక్కప్పుడు అతనే ఇల్లు తుడిచేవాడు. ఆదివారం రోజున తన పడకను తనే వేసుకునేవాడు. తఆమెకు సహాయం చేసేవాడు. ఈ పేటలో అలాటి పనులెవ్వరూ చేసి ఎరుగరు.

ఒక రోజున పావెల్ ఒక చిత్రపటాన్ని తెచ్చి గోడకు తగిలించాడు. అందులో ముగ్గురు మనుష్యులు రోడ్డు దిగువకు నడుస్తూ గాఢమైన సంభాషణలో నిమగ్నులైనట్లున్నది.

“సమాధి నుండి లేచి వచ్చి క్రీస్తు ఎమ్మాస్‌కు పోతున్నాడు” అని పావెల్ తల్లికా చిత్రపటాన్ని వివరించాడు.

ఆ బొమ్మ చూచి తల్లి చాలా సంతోషపడింది. “క్రీస్తు దేవునిపట్ల ఇంతటి భక్తి కలిగినవాడు చర్చికెందుకెళ్లడబ్బా?” అనుకుంది.

పావెల్ స్నేహితుడైన వడ్రంగి ఆకర్షణీయమైన గోడ అలమారా తయారుచేసిస్తే దానిలో పుస్తకాలు పెట్టాడు పావెల్. పుస్తకాల సంఖ్య పెరగజొచ్చింది. ఇప్పుడా గదెంతో అందంగా కనబడుతోంది.

పావెల్ తల్లిని మామూలుగా “మీరు” అనేవాడు, “అమ్మగారు” అని పిలిచేవాడు. అప్పుడప్పుడు తటాలున ఎంతో ఆప్యాయంగా పిలిచేవాడు.

“అమ్మా! ఈ రోజు రాత్రి ఇంటికి ఆలస్యంగా వస్తాను గాని, నన్ను గురించి బెంగ పెట్టుకోకు” అన్నాడు పావెల్.

ఆ మాట కామె ఎంతో సంతోషపడింది. అతడి మాటలో ఆమెకేదో అకుంఠితమైన దీక్ష గోచరించింది.

కాని ఆమెకు ఆందోళన ఎక్కువైంది. కాలం గడిచినా కారణం మాత్రం స్పష్టంపడలేదు. ఏదో అవ్యక్తమైన కారణంతో ఆమె హృదయంభారం క్రమంగా ఎక్కువైంది. ఒకొక్కప్పుడు ఆమె కొడుకును చూచి కోపం తెచ్చుకునేది. “అతడు కూడా అందరిలాగే ఎందుకుండకూడదు? విరాగిలాగున్నాడే! ఎప్పుడూ అంత తీవ్రమైన ఆలోచనలో ఉండడమెందుకు? వీడి వయస్సుకీ నడవడి ఒప్పదు” అని అనుకునేది.

ఈ విధంగా వారాలూ నెలలూ అస్పష్టమైన ఆలోచనలతోనూ, పెరుగుతున్న సంకోచాలతోనూ చిత్రమైన మౌన జీవితంతోనూ రెండు సంవత్సరాలు గడచిపోయాయి.

*   *   *

ఒక రోజు రాత్రి భోజనానంతరం పావెల్ కిటికీ తెర మూసేసి సీనారేకు దీపాన్ని వెలిగించి, కుర్చీకి ఎగువగా గోడకున్న మేకుకు దానిని తగిలించి చదవడం ప్రారంభించాడు. కంచాలు కడుక్కుని తల్లి వంట ఇంట్లోంచి తన దగ్గర కొచ్చింది. పావెల్ తలెత్తి ఎందుకొచ్చావమ్మా అన్నట్లు చూచాడు.

"ఏమీ లేదబ్బాయి" అని గొణుక్కుంటూ వంటింట్లో కెళ్లిపోయింది. ఆమె కనుబొమలు నరాల నీరసం చేత అదరడం మొదలెట్టాయి, కాని కొంచెం సపు తనలోతను గుంజాటన పడి, చేతులు కడుక్కుని మరల కొడుకు దగ్గరకొచ్చింది.

"ఇంతసేపూ ఏమి చదువుతున్నావని అడుగుదామనుకుంటున్నాను" అంది మెల్లగా. పావెల్ పుస్తకం మూసేశాడు.

"కూచో అమ్మా,!"

తల్లి భారంగా కూచుంది. ఏదో ముఖ్య విషయాన్ని వినడానికన్నట్లుగా ఆమె తలెత్తింది.

ఆమెకేసి చూడకుండానే పావెల్ స్వరం తగ్గించి మాట్లాడడం మొదలెట్టేడు. అతని కంఠధ్వనిలో ఎందుకో గాని కొంచె కరుకుదనం ద్యోతకమైంది.

"నేను నిషేధింపబడిన పుస్తకాలను చదువుతున్నాను. మన గురించి, కార్మికులను గురించి ఉన్నదున్నట్లుగా నిజం చెప్తున్న కారణంచేత అవి నిషేధింపబడ్డాయి. వీటిని చూస్తే, నన్ను జైల్లో పెడతారు. నేను నిజం తెలుసుకోవాలనుకుంటే జైల్లో పెడతారు. తెలిసిందా?"

హఠాత్తుగా ఆమెకు ఊపిరాడడం కష్టమైంది. కళ్లు తెరిచి కొడుకును చూసింది. అతన్ని గుర్తు పట్టడమే కష్టమైంది. అతని కంఠధ్వని మారిపోయింది, ఇదివరకటికంటె స్ఫుటంగా ఉత్తేజకరంగా ఉంది.

"ఆ పనెందుకు చేస్తావు పాషా?" అని అడిగింది.

పావెల్ తలెత్తి ఆమెకేసి చూశాడు.

"నేను నిజానిజాలు తెలుసుకో గోరుతున్నాను కనుక" అని తొణుకకూ బెణుకూ లేకుండా మెల్లగా జవాబుచెప్పేడు.

పావెల్ మెల్లగా ఎంతో అనురాగంతో,

"ఏడవకమ్మా" అన్నాడు. ఆ మాటలతో అతడు తన దగ్గరనుంచి శలవు తీసుకుంటు న్నట్లనిపించింది తల్లికి.

"చూడమ్మా! మనమిక్కడ గడుపుతున్న జీవితమెలాంటిదో ఆలోచించు. నీకు నలభై ఏళ్లు పైన బడ్డాయి. సుఖమనేదేమైన ఎరుగుదువా? నాన్న నిన్ను కొడుతూ ఉండేవాడు.

ఆయనెందుకు కొట్టేవాడో ఇప్పుడు నాకు తెలిసింది. ఆయన జీవితంలో ఉండే కటుత్వాన్నంతనీ నీ మీద తీర్చుకునేవాడు. ఆయనను ఏదో అణగదొక్కిపట్టేది. అదేమిటో ఆయనెరగడు."

పావెల్ చెప్పే మాటలను తల్లి ఆత్రుతతోనూ, భయంతోనూ విన్నది. తన కొడుకు కళ్లలో చూడముచ్చటైన వెలుగామెకు గోచరించింది. అతడు తన రొమ్మును బల్లకాన్చి, కన్నీటి చారికలు కట్టిన ఆమె ముఖం మీదకు ఒరిగి, తానిప్పుడే తెలుసుకున్న సత్యాన్ని గురించి మొట్టమొదటిసారిగా ఉపన్యసించాడు.

ఆమె అంతా విని తలూపింది. సంతోషకరమైన భావాలూ, విచారకరమైన భావాలూ ఆమె తలకెక్కాయి. ఆమె హృదయావేదనకు యీ మాటలు ఉపశాంతిని కలిగించాయి. ఇదివరకెన్నడూ తన జీవితాన్ని గురించి తనతో మాట్లాడినవారు లేరు. ఇప్పుడీ మాటలు, తానెన్నడో మరచిపోయిన ఆలోచనలను లీలగా రేకెత్తించాయి.

తల్లుల గురించి జాలిపడేవారు అరుదు.

ఆడవాళ్ల జీవితాలను గురించి అతడు చెప్పినదంతా నిజమని ఆమెకు తెలుసును. ఇదివరకెన్నడూ ఎరుగని సౌమ్యతతో ఆ విషయాలు చెప్పడంచేత ఆమె హృదయం ద్రవించింది.

"అయితే నువ్వేం చేద్దామనుకుంటున్నావు?" అని పావెల్ నడిగింది, అతని మాటకు అడ్డు తగులుతూ.

"ముందు చదువుకోవడం. తర్వాత ఇతరులకు బోధించడం. మన కూలిజనం బాగా చదువుకోవాలి. మన జీవితాలు ఇంత భారంగా ఎదుకున్నాయో బాగా గుర్తించి అవగాహన చేసుకోవాలి."

"ఇది సాధ్యమేనంటావా పాషా?" అని అడిగేది.

తెల్లవారుతున్నట్టుంది. యింక పోయి పడుకో" అంది.

"నేను పడుకుంటాన్లే. అయితే నన్ను బాగా అర్థంచేసుకున్నావా?" అని ఆమె వైపుకి వంగి పావెల్ ప్రశ్నించాడు.

"ఆ, తెలిసింది" అని నిట్టూర్చింది. ఆమె కళ్లవెంట జల జల అశ్రువులు రాలేయి, "అది నీ వినాశమే!" అంది.

పావెల్ లేచి గదిలో వచార్లు చేశాడు.

"సరే!! నేనేం చేస్తున్నానో, ఎక్కడికెడుతున్నానో తెలిసినట్లే కదూ! నేను నీకంతా చెప్పేశాను. నన్ను నువ్వు ప్రేమిస్తే నా దారికి అడ్డురాకు" అన్నాడు.

ఆమె ఏడ్చింది.

"నాయనా! ఇదంతా నువ్వు నాకు చెప్పకపోతేనే బాగుండేదేమో" అంది.

పావెల్ ఆమె చెయ్యి పట్టుకుని గట్టిగా నొక్కేడు.

ఎంతో ఆప్యాయంగా "అమ్మా!" అని పిలిచి ఎన్నడూ లేనట్లు చెయ్యి నొక్కడంతోనే ఆమె పరవశురాలైపోయింది.

పావెల్ నిద్రపోయాక, తల్లి మెల్లగా పడకమీదనుంచి లేచి అతని దగ్గరకెళ్లింది. అతడు వెల్లకిల పడుకున్నాడు. గౌరవర్ణంలో ఉన్న అతని తల తెల్లని తలగడమీద అని ఉంది. తల్లి రాత్రి దుస్తులు ధరించి, చెప్పులు లేకుండా, చేతులు గుండెకు హత్తుకుని నిలబడింది. నిశ్శబ్దంగా ఆమె పెదవులు కదిలాయి. పెద్ద కన్నీటి బొట్లు చెక్కిళ్లమీదగా మెల్లగా కారేయి.

వారం మధ్యలో వచ్చిన ఒక శలవు రోజున పావెల్ బయటికి వెడుతూ :

"అమ్మా, శనివారం నాడు పట్టణం నుంచి కొందరు నన్ను కలుసుకోడానికొస్తారు" అన్నాడు.

"పట్టణంనుంచా?" తల్లి రెట్టించింది. హఠాత్తుగా మెల్లగా ఏడ్వడం మొదలెట్టింది.

"మనల్ని నాశనం చేస్తున్నది. భయమే. మనమీద సవారీ చేసేవాళ్ళు మన భయం మూలంగానే మనలనణగదొక్కి బెదిరిస్తున్నారు."

"నామీద కోపం తెచ్చుకోకు బాబూ! నేను భయపడకుండా ఎలా ఉండగలను? నా బతుకంతా భయంతోనే గడిపాను. నా ఆత్మ చుట్టూ భయం అలముకుంది" అని దీనంగా ఏడుస్తూ చెప్పింది.

"క్షమించు. వాళ్లు రాక తప్పదు" అని మెల్లగా పావెల్ వెళ్లిపోయాడు.

* * *

మూడు రోజుల పాటు ఆమె భయంతోనూ గడగడలాడుతూ కాలక్షేపం చేసింది. కొత్త వాళ్లెవరో తన ఇంటికి వస్తారనే సంగతి జ్ఞాపక మొచ్చినప్పుడల్లా ఉలికిపడేది. ఈ భయంకరమైన మనుషులే తన కొడుకును ఈ కొత్త మార్గంలోకి మళ్లించారనుకుంది.

శనివారం సాయంకాలం పావెల్ ఫ్యాక్టరీనుండి వచ్చి, ఒళ్లు కడుక్కుని గుడ్డలు మార్చుకుని బయటి కెళ్లిపోయాడు.

ఇంతలో ఆమెకు ఎవరో పాడుతున్న ఈల పాట వినిపించింది. ఆ పాట విచారంగా శ్రావ్యంగా నిశ్శబ్దాన్నీ చీకటినీ మెల్లగా చీల్చుకుంటూ, ఎవరికోసమో వెతుక్కుంటూన్నట్లు క్రమంగా దగ్గర కొస్తోంది.

గుమ్మంలో ముందర అడుగుల చప్పుడైంది. తల్లి గభాలున లేచి ఆత్రంగా తలెత్తి చూచింది.

తలుపు తెరుచుకుంది. ముందుగా ఒక తలకాయ, దానిమీద బొచ్చుటోపీ కనబడింది. తర్వాత పొడుగాటి శరీరం గుమ్మంలోనుంచి వంగి లోపలికొచ్చి నిటారుగా నిలబడింది. కుడి చేత్తో తల్లికి వందనం చేస్తూ నిట్టూర్పు విడిచి, మెల్లని గొంతుకతో,

"నమస్కారమండీ" అన్నాడు ఆ మనిషి.

తల్లి మౌనంగా తలొంచి వందనాన్నందుకుంది.

అతని నినాదం, మృదు కంఠస్వరం, తీరువైన ముఖం ఆమెకు విశ్వాసం కలిగించాయి. అతని చూపులో నిర్మొగమాటం, స్నేహం ద్యోతకమయ్యాయి. స్వచ్ఛమైన అతడి కళ్లలో ఆనంద కిరణాలు నృత్యం చేస్తున్నాయి.

"మామ్మగారూ! మీ తలమీద అంత దెబ్బ కొట్టినవారెవరండి?" అని అడిగేడు.

అతనడగడం నెమ్మదిగానే అడిగాడు. అతని ప్రశ్న ఆమెకు కష్టం కలిగిందించింది.

"దాంతో మీకేమి పని పట్టింది?" అని నిదానంగా మర్యాదగా అడిగింది.

అతను ఆమెకేసి బాగా ముందుకు వంగి,

"కోప్పడకండమ్మా! నా పెంపుడు తల్లికి కూడా సరిగా అలాటి మచ్చే ఉండేది. అంచేత అడిగేను. ఆమె కాపురం చేస్తుండిన చెప్పులు కుట్టే ఆయనచేత ఆ దెబ్బ తిన్నది.

అతడి నిర్మొగమాటం ఆమెను నిరాయుధం చేసింది. అతనితో అంత చిరాకుగా మాట్లాడినందుకు పావెల్‌కు కోపమొస్తుందేమోనని భయపడింది.

"నాకేమీ కోపం రాలేదు నాయనా! కాని మీరు గభాలున ఆ ప్రశ్న అడిగేరు. నా భర్తే వడ్డించాడు. స్వర్గంలో దేవుడాయన్ని చల్లగా చూచును గాక!" అని తనేదో తప్పు చేసినట్లు చిరునవ్వు నవ్వుతూ చెప్పింది. "మీరు తాతారులా?"

తల్లికి అతడంటే ఇష్టం కలిగింది. తన కొడుకును గురించి చెప్పిన మంచి మాటలకు బదులుగా ఏమైనా చెయ్యాలనుకుంది.

"ఓ గ్లాసు టీ ఇవ్వనా?" అని అడిగింది.

"నాకొక్కడికే?" అని భుజాలెగరేసి జవాబు చెప్పేడు. "మిగతా వాళ్లు వచ్చేదాకా అగండి. అప్పుడందరికీ విందు చేయండి" అన్నాడు.

అతడి మాటలు మరల ఆమె భయాన్ని జ్ఞప్తికి తెచ్చాయి.

"మిగతావాళ్లు కూడా ఇలాంటి వాళ్లే అయితే బాగుండును" అనుకుంది.

మళ్లీ మెట్లమీద అడుగుల చప్పుడు ఆమె విన్నది. తలుపు తెరుచుకునేసరికి, తల్లి మళ్లీ లేచి నిలబడింది. ఒక యువతి వంటయింట్లో ప్రవేశించేసరికి ఆమె కాశ్చర్యం కలిగింది. ఆ అమ్మాయి పొట్టిగా ఉంది. సాదా ముఖం ఆమె పల్లెటూరు పిల్లని చెపుతోంది. తన దట్టమైన తెల్ల జుట్టుని వాలు జడ వేసుకుంది.

"నేనాలస్యం చేశానా?" అన్నాడు హొహోల్.

లేదు నడిచి వచ్చావా అన్నాడు హొహోల్

"మీరే పావెల్ మిహోయ్ లెవిచ్ తల్లిగారనుకుంటాను? నమస్కారం. నా పేరు నతాషా."

కోటు విప్పుతున్న ఆ అమ్మాయికి చెయ్యిస్తూ హొహోల్ :

"బాగా చలిగా ఉందా?" అన్నాడు.

"ఈ అమ్మాయి రబ్బరు బూట్లు తొడుక్కోవడం లేదే!" అనుకుంది తల్లి.

"హు-హు-హూ....చలికి నా ఒళ్ళు బిగుసుకుపోతోంది" అని ఆ అమ్మాయి వణుకుతూ చెప్పింది.

తల్లి గభాలున వంటయింట్లో కెళ్లి :

"సమొవార్ అంటిస్తున్నాను. ఒక్క నిమిషం" అంది.

తల్లికి ఆ అమ్మాయిని తాను చాలా కాలంగా ఎరుగున్నట్లనిపించి సానుభూతితో కూడిన అపూర్వమైన మాతృప్రేమ పొంగింది. పక్క గదిలో సంభాషణ వింటుంటే, తల్లి పెదవులమీద చిరునవ్వు నృత్యం చేసింది.

''నిజమే నాయనా!'' అనుకుంది తల్లి. హొహోల్‌కు మనశ్శాంతి కలిగేట్టు మాట్లాడాలనుకుంది. ఇంతలో తలుపు నెమ్మదిగా తోసుకుని నికొలాయ్ వెసొవ్‌శ్చికోవ్ లోపలి కొచ్చాడు. అతడు పాత దొంగ దనీల కొడుకు. నికొలాయ్ ఎవరితోటి కలిసిమెలసి ఉండేవాడు కాడని పేటంతా ప్రతీతి. నికొలాయ్ ఎప్పుడూ విచారంగా ఒంటెత్తుగా ఉండేవాడు. అందుచేత జనం అతనిని ఉడికించేవారు.

"ఏమిటిలా వచ్చావ్ నికొలాయ్?" అని ఆశ్చర్యంగా అడిగింది తల్లి.

అరచేతితో స్ఫోటకపు మచ్చల ముఖాన్ని తుడుచుకుంటూ, అమ్మని పలకరించకుండానే,

"పావెల్ ఇంట్లో వున్నాడా?" అని అడిగేడు.

"లేడు."

గది అంతా తేరిపారజూచి లోపల ప్రవేశించాడు.

"కామ్రేడ్స్, నమస్కారం" అన్నాడు.

"ఇతడా?" అసమ్మతిసూచకంగా అనుకుంది తల్లి. అతన్ని చూచినందుకు చాలా సంతోషపడుతున్నట్లు, నతాషా అతనితో ఆప్యాయంగా కరచాలనం చేయడం చూసి తల్లి తెల్లబోయింది.

మరిద్దరు కూడా వచ్చారు. వాళ్లు బొత్తిగా చిన్న కుర్రాళ్లు. అందులో ఒక అబ్బాయి ఆమెకు తెలుసు. చురుకైన ముఖం, ఉంగరాల జుట్టు, మెరక నుదురూ గల ఆ పిల్లవాడి పేరు ఫోదొర్. అతడు ఫ్యాక్టరీ కార్మికుడైన ముసలి సిజోన్ మేనల్లుడు. రెండవ వాడు కొంచెం పిరికివాడు. తిన్నటి జుట్టు పైకి ఎగదువ్వాడు. అతనామెకు పరిచితుడు కాదు. కాని అతనేమీ భయంకరంగా లేడు. చివరికి పావెల్ వచ్చాడు. తన కూడా ఇద్దరు ఫ్యాక్టరీ పనివాళ్లను వెంటపెట్టుకొచ్చాడు. వాళ్ళిద్దరూ తల్లికి పరిచితులే.

"సమొవార్ సిద్ధం చేస్తున్నావు కదా అమ్మా? ధన్యవాదాలు!" అన్నాడు పావెల్.

మరిగిన సమొవార్‌ని తల్లి గదిలోకి తెచ్చింది. అతిధులంతా బల్లచుట్టూ కూర్చున్నారు. ఒక మూల దీపంకింద నతాషా పుస్తకం చేత్తో పుచ్చుకుని కూచుంది.

"ప్రజలింత చెడ్డ బతుకెందుకు బ్రతుకుతున్నారో తెలుసుకోవాలంటే..." అంది నతాషా.

"చెడ్డవాళ్ళుగా ఎందుకున్నారో తెలుసుకోవాలంటే" అన్నాడు హొహోల్.

"వాళ్లు జీవితాలను ఎలా ఆరంభించారో పరిశీలించాలి..."

"పరిశీలించదండి, పిల్లలూ, పరిశీలించండి" అని టీ అందిస్తున్న తల్లి అన్నది.

అందరూ మాట్లాడ్డం మానేశారు.

"ఏంటమ్మా! మీ ఉద్దేశ్యం?" అని పావెల్ ముఖం చిట్లించుకుంటూ అడిగేడు.

"ఉద్దేశ్యమా?" అంటూ తలెత్తి చూసేసరికి అందరూ ఆమెకేసే చూస్తున్నారు. "ఏమి లేదు. నాలో నేనే ఏదో మాట్లాడుకుంటున్నాను. మీరు తెలుసుకోదలచుకుంటే, ఎందుకు చూడకూడదా అని ఆశ్చర్యపడుతున్నాను" అని మెల్లగా గొణిగింది.

నతాషా నవ్వింది. పావెల్ చిరునవ్వు నవ్వేడు.

"నేనేమైనా మీకడ్డొస్తున్నానా?" అని అడిగింది.

"అతిథ్యమిచ్చే అమ్మ అతిథులకడ్డేమిటి? త్వరగా నాకు టీ ఇవ్వండి. గడగడ ఒణుకుతున్నాను. నా కాళ్లు మంచుగడ్డల్లా ఉన్నాయి" అన్నది నతాషా.

పావెల్ నతాషా పక్కన కూర్చున్నాడు. అందరిలో అతడే అందగాడు. నతాషా పుస్తకం మీదకు వంగి చదువుతోంది. కణతల మీద పడుతున్న ముంగురులను మధ్యమధ్య వెనక్కి

తోసుకుంటోంది. తలకాయ ఊపుతూ, పుస్తకం చూడకుండా, ఎదుటనున్న వాళ్ల ముఖాలకేసి ఆప్యాయంగా చూస్తూ చిన్న గొంతుకతో తన అభిప్రాయాలను చెపుతోంది. హోహోల్ బల్లకొక చివరగా కాళ్లు జాపుకుని తాను సవరించుకుంటూన్న మీసాలకొనలను కళ్లు చిట్లించుకుని చూస్తున్నాడు. వెసొవ్‌శ్చికోవ్ తన కుర్చీమీద కర్రలాగున బారుగా నిటారుగా కూర్చున్నాడు. మోకాటి చిప్పలను అరచేతుల్తో నొక్కి పట్టుకున్నాడు. మశూచికం మచ్చలు, చిన్న నుదురు, సన్నటి పెదవులుగల అతని ముఖం భావశూన్యంగ కృత్రిమముఖం తగిలించుకున్నట్లుంది. తళతళ మెరుస్తున్న ఇత్తడి సమొవార్ మీద ప్రతిఫలిస్తున్న తన ముఖాన్ని తన సన్నని కళ్లతో తదేకధ్యాసతో చూస్తున్నాడు. అతని ఊపిరి పీలుస్తున్నట్లుగా కూడా కనబడడంలేదు. చిన్నవాడైన ఫ్యొదొర్, చదువుతున్న దానిని వింటూ, తాను లోపల్లోపల పునశ్చరణం చేసుకుంటున్నట్లు నిశ్శబ్దంగా పెదవులను కదిలిస్తున్నాడు. అతని స్నేహితుడు మోకాళ్ల మీద మోచేతుల నాన్చి అరచేతుల్లో చెక్కిళ్లు మోపుకుని ఆలోచనాపూర్వకమైన చిరునవ్వు నవ్వుతూ ముందుకు బాగా వంగి కూర్చున్నాడు. పావెల్‌తో వచ్చిన ఒక కుర్రాడికి ఎర్రని ఉంగరాలజుట్టూ, సంతోషం ఉట్టిపడే ఆకుపచ్చ కళ్లున్నాయి. అతను ఏదో చెప్పడానికి ఉబలాట పడుతున్నట్లుగా తను కూర్చున్న చోట ఊరకే కదులుతున్నాడు. లేరంగు అంటకత్తెర జుట్టుతో రెండవవాడు, నేల చూపులు చూస్తూ, ఎప్పుడూ చేత్తో తల నిమురుకుంటూనే ఉన్నాడు. అందుచేత తల్లి అతని ముఖాన్నే సరిగా చూడలేకపోయింది. ఆ గది చిత్రంగా సుఖంగా ఉన్నట్లనిపించింది. అదంతా ఏదో కొత్తగా కనబడుతోంది. నతాషా చదువుకు పోతుంటే, తన పడుచుతనపు వినోదాల సందడి తల్లికి జ్ఞాపకమొచ్చింది. ఆనాటి వినోదాలలో యువకులు చిత్తుగా తాగి సారాకంపు కొట్టేవారు. వారి అశ్లీల భాష, మానవ ద్వేషంతో కూడుకున్న పరాచికాలు స్ఫురణకొచ్చి తనమీద తనకే జాలేసి హృదయం కుంగిపోయిది.

తన భర్తతో తనకు పెళ్లి ఎలా కుదిరినదీ జ్ఞప్తి కొచ్చింది. ఆనాడామె ఒక సంబరంలో ఉండగా అతను ఆమెనొక చీకటి నడవలో పట్టుకుని గోడకేసి నొక్కేశాడు.

“నన్ను పెళ్లి చేసుకుంటావా?” అని మోటుగా అడిగాడు. ఆమెకు చాలా బాధ కలిగింది. కోపమొచ్చింది. కాని ఆమెకు నొప్పిపెట్టేటట్లుగా రొమ్ములు గట్టిగా పట్టుకుని వేడిగా చెమ్మగా వస్తూన్న ఊపిరిని ఆమె ముఖం మీద కురిపించాడు. అతని పట్టులోనుంచి తప్పించుకుని దూరంగా పోవాలని ప్రయత్నించింది.

“ఆగు! జవాబుచెప్పు, వినబడుతోందా?” అని భయపెడుతూ పళ్లు కొరికేడు.

సిగ్గుతో అవమానంతో, ఆమె జవాబుచెప్పలేకపోయింది.

ఇంతలో ఎవరో తలుపు తెరిచారు. అతడు మెల్లగా పట్టు వదిలేడు.

“ఆదివారంనాడు పెళ్లిళ్ల బేరగాడిని పంపిస్తాను” అన్నాడు.

అలాగే పంపించాడు.

వాళ్లు వాదించుకుంటూంటే మాటలు అగ్నిజ్వాలల్లా లేస్తున్నట్లనిపించింది. వాళ్లెందుకలా అరచుకొంటున్నారో తల్లికేమీ తెలియలేదు. ఆవేశంతో వాళ్ల మొగాలన్నీ ఎర్రగా కందిపోయాయి. కాని ఎవళ్లూ నిదానాన్ని పోగొట్టుకోలేదు. ఎవళ్లూ కూడా తన చెవుల కలవాటైన మోటు మాటల నుపయోగించలేదు.

"మనమన్నీ తెలుసుకోవాలనే వాళ్లు చెప్పిన మాటా నిజమే. మనం సదసద్వివేకమనే జ్యోతిని మనలో వెలిగించుకోవాలి. అంధకారంలో ఉక్కిరిబిక్కిరయే వాళ్లకు ఆ జ్యోతి కనపబడాలి. ప్రతి ప్రశ్నకూ సత్యసమ్మతంగా నిజాయితీగా మనం జవాబివ్వగలగాలి సత్యాసత్యాలను సంపూర్తిగా తెలుసుకోవాలి...."

నతాషా మాట్లాడ్డం ముగించగానే పావెల్ లేచాడు.

"కడుపునిండా కూడేనా మనకు కావలసినది?... కానే కాదు... మన భుజలమీదెక్కి సవారిచేస్తూ మన కళ్లకు గంతలు కడుతున్న వాళ్లకు, మనకంతా తెలుస్తోందని చూపించాలి. మనం మూర్ఖులం కామనీ, పొట్ట నింపుకోవడమే తప్ప మరేమీ అక్కర లేని పశువులం కాదనీ, కేవలం పొట్ట నింపుకోవడమే గాదు, మనుషుల్లా బతకాలని కోరుకుంటున్నామనీ వాళ్లకు రుజువు చేయాలి. మనం కూడా మనుష్యుల్లా జీవించాలని కోరుతున్నాం. మన శత్రువులు మనల్ని బండ చాకిరీతో ఎంత కుంగదీస్తున్నా, బుద్ధిలో వారికేవిధంగానూ తీసిపోమనీ, వాళ్లకన్న తెలివితేటల్లో మనది పైచెయ్యేననీ కూడా మనం ధ్రువపరచాలి!" అని ఆ ముగ్గురికేసీ చూస్తూ నిదానంగా చెప్పేడు.

అతనెంత బాగా మాట్లాడేడోననే గర్వం తల్లి హృదయంలో జనించింది.

పావెల్ చిరునవ్వుతో గుమ్మంలో నిలబడ్డాడు. తల్లి అతడికేసి చూసింది.

"ఎందుకలా నవ్వుతున్నావు?" అని అడిగింది.

"మరేమీ విశేషం లేదమ్మా! ఏదో సంతోషం కలిగింది."

"నేను ముసలిదాన్ని కావచ్చును. మూర్ఖురాల్ని కావచ్చును. కాని మంచేదో చెడ్డేదో చెప్పగలను సుమా!" అని కొంచెం కరుకుగా చెప్పింది తల్లి.

"అందుకు సంతోషమే. మీరింక పడుకోరాదూ?"

"ఇదిగో ఒక నిమిషంలో పడుకుంటా."

"పాషా! ఇదంతా బాగా జరిపించావు! హొహోల్ చాలా మంచివాడు సుమా! ఆ పిల్ల ఎంత చురుకైనది! ఎవరామె?"

"ఉపాధ్యాయిని" అని పచారు చేస్తూ ముక్తసరిగా జవాబిచ్చాడు పావెల్.

"ఆమె చాలా పేదరాలై ఉండాలి. బట్టలేమీ బాగాలేవు. అలా ఉంటే ఈ చలిలో ఇట్టే పడిశం పట్టేస్తుంది. ఆమె తల్లితండ్రులెక్కడున్నారు?"

"మాస్కోలో" అని తల్లి కెదురుగా ఆగి మెల్లగా చెప్పడం మొదలెట్టేడు. "ఆమె తండ్రి ధనవంతుడు. ఇనుప వ్యాపారం చేస్తున్నారు. బాగా ఆస్తిపాస్తులు వున్నాయి. ఈ ఉద్యమంలో చేరి ఈ జీవితాన్ని చేపట్టడంచేత, తండ్రి ఆమె నింట్లోంచి వెళ్లగొట్టేడు. చిన్నప్పుడు భోగభాగ్యాలతో సుకుమారంగా పెరిగింది. ఇప్పుడు రాత్రి చీకట్లో ఒంటరిగా ఏడు మైళ్లయినా నడుస్తుంది...."

ఆ మాటలు విని తల్లి అబ్బురపడింది. గది మధ్యలో కొయ్యబారి నిలబడి కనుబొమలు ముడుచుకుని మౌనంగా కొడుక్కేసి చూచింది. తర్వాత నెమ్మదిగా,

"ఇప్పుడామె పట్నం వెళ్లిందా?" అని అడిగింది.

"అవును."

"అయ్యో నా తల్లీ! భయం లేదూ?"

"మీరే చూశారుగా! ఆమె భయపడదు" పావెల్ నవ్వేడు.

"కాని ఆమె ఎందుకెళ్లిపోవాలి? రాత్రి ఇక్కడే ఉండి నా దగ్గరే పడుకోవచ్చుగా!"

"అట్లా కుదరదు. ఉదయం ఆమెనిక్కడెవరైనా చూస్తారు. అది మాకిష్టం లేదు." తల్లి కిటికీలోనుంచి చూస్తూ సాలోచనగా

"పాషా! నీకిందులో ఏమీ అంత ప్రమాదమైన పని కనిపించదే! అంత నిషేధించవలసినదిందులో ఏముందబ్బా? మీరేమీ తప్పుపని చేయడంలేదే? చేస్తున్నారా?" నెమ్మదిగా కొడుకునడిగింది.

ఇందులో ఆమె నమ్మకం కుదర్లేదు. అదేదో తెల్సుకోవాలనుకుంది.

"లేదమ్మా! మేమేమీ తప్పు చేయడం లేదు" పావెల్ ఖచ్చితంగా చెప్పేడు. నిదానంగా ఆమె కళ్లతో చూపు కలుపుతూ, "కాని ఎప్పుడో ఒకనాడు మేమంతా జైళ్లలో ఉంటాం. ఈ సంగతి నీకు తెలుసుంటే మంచిది" అన్నాడు.

ఆమె చేతులు వణికాయి.

"బహుశా దేవుడు మేలు చేస్తే ఎలాగో నువ్వు తప్పించుకోవచ్చు కదా!" అని గుసగుసగా అడిగింది.

"కుదరదు. నిన్ను మోసం చేయడం నాకిష్టం లేదు. తప్పించుకోవడం వీలు కాదు" అన్నాడు ప్రేమగా చిరునవ్వుతో.

"వెళ్లి పడుకో. బాగా అలసిపోయావు."

తానొక్కతే మిగలగానే, కిటికీ దగ్గరకెళ్లి బయటికి చూస్తూ నిలబడింది. బయట చలిగా ఉంది. మంచు కమ్మింది. గాలి వీస్తోంది. నిద్రమత్తుకమ్మిన చిన్న ఇళ్ల మీదనున్న మంచు

నురగలను గాలి ఎగురగొట్టేస్తోంది. గాలి గోడలకు కొట్టుకుని నేలకు దూకి వీధిలోని మంచు తునకల్ని తరిమేస్తోంది.

*　*　*

జపమాలలోని పూసల్లా రోజులు దొర్లిపోయి వారాలు, నెలలు గడిచిపోయాయి. ప్రతి శనివారం, పావెల్ స్నేహితులు తన ఇంట్లో సమావేశమవుతూ ఉండేవారు. సుదూరంగా ఉండే లక్ష్యాన్ని అందుకునేందుకు ఒక్కొక్క సమావేశమూ ఒక్కొక్క మెట్టు అవుతోంది.

కొత్త వాళ్లొచ్చి సమావేశాల్లో పాల్గొంటున్నారు. వ్లాసొవ్ ఇంట్లో ఉన్న గది జనంతో కిటకిటలాడుతూ వచ్చింది. నతాషా వచ్చినప్పుడల్లా అలసి ముద్దయి చలితో గడ్డ కట్టుకుపోయివచ్చేది. కాని ఎప్పుడూ నవ్వుతూనే వుండేది. పావెల్ తల్లి ఆమెకోసం మేజోళ్ల జత అల్లి స్వయంగా ఆమె చిన్ని పాదాలకు తొడిగింది. నతాషా నవ్వింది. కాని అంతలోనే నిశ్శబ్దంగా ఉండిపోయి ఆలోచనలో పడింది.

"ఒకప్పుడు నాకో దాది వుండేది. ఆమె నాపట్ల దయగా ఉండేది... సెలగేయా నీలొన్నా! అదేం చిత్రమో కాని, ఎంతో కఠినమైన జీవితాన్నీ, అభాగ్య జీవితాన్నీ గడుపుతున్నా కార్మికజనం ఇతరులకన్న దయగా ఉంటారు సుమా..." అంది నెమ్మదిగా నతాషా. ఆమె దూరంగా ఉన్నవారి నెవరినో, తనకు అతిదూరాన్నున్నవారి నెవరినో ఉద్దేశించి అలా చెప్పింది.

"మేమేం చేస్తున్నామో మీకు తెలిస్తే, ఎంతటి అమోఘమైన పని చేస్తున్నామో మీరు తెలుసుకోగలిగితే!" అని నెమ్మదిగా మనసుకు హత్తుకునేటట్లు చెప్పింది.

పెలగేయా నీలోన్నా హృదయానికి ఈర్ష్యలాంటిదేదో తాకినట్లయింది.

"అందుకు నాకు వయసు మించిపోయింది. పైగా చదువు సంధ్యలు రావు...." అంటూ విచారంగా లేచి నిలబడింది....

.... ఇటీవల పావెల్ మునపటికంటె తరుచుగా మాట్లాడుతూ వచ్చాడు. సుదీర్ఘంగా, మరింత తీవ్రంగా కూడా మాట్లాడుతున్నాడు. రోజుకు రోజూ చిక్కిపోతున్నాడు. అతడు నతాషాకేసి చూసినప్పుడు, ఆమె మాట్లాడినప్పుడు, అతని కళ్లలోని తీవ్రత కొంత మెత్తనవుతున్నట్లు తల్లి కనిపెట్టింది. కంఠస్వరం తగ్గుస్థాయిలో కొచ్చేది. చెప్పే ధోరణిలో కరుకుతనం తగ్గేది.

"భగవంతుడు అలాగే అనుగ్రహించాలి" అని తల్లి నవ్వుతూ అనుకునేది.

ఒక్కొక్కప్పుడు నతాషా బదులు నికొలాయ్ ఇవానొవిచ్ వచ్చేవాడు. కళ్లకు అద్దాలు. చిన్న గడ్డం. అతడెక్కడో మారుమూల రాష్ట్రంలో పుట్టాడు. అందుకనే అతడు మాట్లాడుతుంటే "ఒ" అనే అక్షరాన్ని పలకడంలో ఒక చిత్రమైన యాస ఉండేది. మొత్తం మీద అతను "మారుమూల" మనిషి. అతడు చాలా సాధారణమైన విషయాలను గురించి మాట్లాడేవాడు. కుటుంబ జీవనం, పిల్లలు, వర్తక వ్యాపారం, పోలీసులు, రొట్టె, మాంసం వగైరాల ధరవరలు,

మొదలైన ప్రజల నిత్య జీవితానికి సంబంధించిన సంగతులే చెప్పేవాడు. ఆ చెప్పడంలో ప్రజలకు ప్రతికూలమైన అన్ని అసత్యాలనూ, అసంబద్ధాలనూ, అవివేకాలనూ, బయట పెట్టేవాడు. అతడెక్కడో చాలా దూరాన్నుంచి వచ్చాడనీ, ప్రజలంతా సుఖంగా నిజాయితీగా బ్రతికే మరో ప్రపంచంనుంచి వచ్చాడనీ ఊహించుకునేది తల్లి.

పట్టణం నుంచి ఈ సమావేశాలకు ఇంకా చాలామంది వచ్చేవారు. తరుచుగా సన్నంగా ఉండే ఓ అమ్మాయి వచ్చేది. ఆమె ముఖం వెల్లబారి ఉండేది. ఆమె నేత్రాలు విశాలంగా ఉండేవి. ఆమెనందరూ "సాషెంకా" అని పిలిచేవాళ్లు. ఆమె నడకలో, కదలికల్లో కొంత మగవాలకం ఉండేది.

"మనం సోషలిస్టులం" అని మొట్టమొదటిసారి గట్టిగా తెగేసి చెప్పింది ఆమే.

తల్లి ఈ మాటలు వినేసరికి అదిరిపోయి, మౌనం దాల్చి, ఆ అమ్మాయికేసి తేరిపార చేసింది. సోషలిస్టులు రష్యా చక్రవర్తిని చంపేరని ఆమె తన చిన్నతనంలో విన్నది. ఇప్పుడు తన కొడుకూ, అతని మిత్రులూ తమనెందుకు సోషలిస్టులని పిలుచుకుంటున్నారో ఆమె కర్థం కావడం లేదు.

ఒక రోజున అందరూ వెళ్లిపోయాక ఆమె పావెల్ దగ్గరకెళ్లి,

"నిజమేనా పాషా? వాళ్లు జారుకి విరోధులు కదూ? వాళ్లొక జారును చంపేరు కూడా?"

పావెల్ చేత్తో చెక్కిళ్లు రాసుకుంటూ గదిలో ఆ చివరనుంచి ఈ చివరదాక అంగలేశాడు. వ్యంగ్యంగా చిరునవ్వు నవ్వి

"అలాంటి పనులు మాకక్కరలేదమ్మా!" అన్నాడు.

తర్వాత ఆమెతో చాలా సేపు గుంభితంగానూ, నెమ్మదిగానూ మాట్లాడేడు. ఆమె అతని ముఖంకేసి చూస్తూ,

"తప్పుడు పనులు చేయడు, చేయలేడు నా చిట్టి తండ్రి" అనుకుంది.

ఆతర్వాత ఈ భయంకరమైన మాట నెన్నోసార్లు ఆమె విన్నది. ఆ మాట మొద్దుబారిపోయింది. తన చెవికీమాట వాళ్లు ఉపయోగించుకునే అసంఖ్యాకమైన ఇతర కొత్త మాటలవలెనే పరిపాటైపోయింది.

ఒక్కొక్కప్పుడు వీళ్లందరూ హఠత్తుగా ఆనంద తరంగాల్లో తేలిపోతూ ఉండడం తల్లికి ఆశ్చర్యం కలిగించేది. సాయం సమయంలో, విదేశాల్లో కార్మిక జనుల ఉద్యమాల భోగట్టాను పత్రికల్లో చదువుతుండేటప్పుడు అలాటి ఆనందం వాళ్లకు కలిగేది. అప్పుడు వాళ్ల కళ్లలో ఆనందం తళుక్కున మెరిసేది. అదో చిత్రంగా చిన్న పిల్లల్లాగ సంతోషంలో మునిగి పకపక నవ్వుకునేవారు. ఒకళ్ల భుజాలనింకొకళ్లు ఆప్యాయంగా చరచుకునేవారు.

"జర్మనీ కామ్రేడ్సుకు జై!" ఒకడు ఆనందాతిరేకంగా అరిచేవాడు

మరొకసారి ఇంకొకడు :

"ఇటలీ కార్మికులు వర్ధిల్లాలి!" అని కేకేసేవాడు.

తమ నెరుగనట్టీ, తమ భాషనైనా ఎరుగనట్టీ దూరదేశాల కార్మికులకు తమ ఈ అభివందనలను వ్యక్తం చేస్తూన్నప్పుడు, తమ నెరుగని ఆ ప్రజలు వాటిని విన్నట్టూ, తమ ఆనందపారవశ్యాన్ని గ్రహించినట్లూ వీరు నిశ్చయంగా నమ్మినట్లు అగపడేది.

"వాళ్లకి రాస్తే బాగుంటుందేమో?" అన్నాడు హొహోల్ ఆర్ద్రదృష్టితో. అతని కళ్లు మెరిశాయి. "వాళ్లు ఏ మతాన్ని నమ్ముతున్నారో, ఏ ఆశయాన్ని విశ్వసిస్తున్నారో, ఏ లక్ష్యంకోసం జీవిస్తున్నారో, ఆ లక్ష్యంకోసం జీవించే స్నేహితులు రష్యాలో కూడా ఉన్నారనీ వాళ్లు సాధించిన విజయాలకు వీరు కూడా ఆనందిస్తున్నారనీ, వాళ్లకు మనం తెలియచేయాలి."

వికసిత వదనాలతో వాళ్లు ఫ్రెంచి, ఇంగ్లీషు, స్వీడిష్ జనాన్ని గురించి వారు తమకెంతో సన్నిహితులైన మిత్రులన్నట్లు మాట్లాడుకుంటారు. వాళ్లనెంతో గౌరవించి, వాళ్ల కష్ట సుఖాలలో పాల్గొనేటట్లు మాట్లాడుకునేవారు.

ప్రపంచంలో ఉండే కార్మికులంతా ఒక్కటే అన్న మానసిక సన్నిహితత్వం, ఈ చిన్న ఇరుకు గదిలో జన్మించింది. అపరిమితమైన ఆనందాన్నీ ఆశనూ కలిగించే ఈ భావసమైక్యతయొక్క జీవశక్తికి వారంతా ఆనందించేవారు. దాని అర్థం తెలియకపోయినా తల్లి కూడా దాని శక్తిని తెలుసుకుని సంతోషించింది.

ఒక సారి ఆమె హొహోల్‌తో ఇలా చెప్పింది.

"మీ సంగతి చూడండి! యూదులు, ఆర్మీనియనులు, ఆస్ట్రియనులు అన్ని దేశాల వారూ మీకు స్నేహితులేనే! వాళ్ల సుఖదుఃఖాలన్నీ మీకు కావాలి!"

"అవును మామ్మా! అవును. మాకు జాతులూ, తెగలూ లేవు. స్నేహితులూ, శత్రువులూ మాత్రమే. కార్మికులంతా మాకు స్నేహితులు. ధనికులూ, ప్రభుత్వాలూ మాకు విరోధులు.

ఈ దృఢమైన అమాయిక విశ్వాసం వాళ్లలో రోజురోజుకూ పెరిగింది. చాలా ఉదాత్తరూపంలో పెరిగింది. అదొక మహత్తర శక్తిగా పరిణమిస్తోంది.

తరుచుగా వాళ్లు పాడుతుండేవారు. అందరికీ వచ్చిన పాటలే గొంతెత్తి హాయిగా పాడుతుండేవారు.

కొత్త పాటల్లో ఒకటి తల్లికి చాలా హృదయ సంచలనం కలిగించింది. అది వ్యక్తిత్వ శూన్యులైన వారి నివేదనలు కావు. గుడ్డివాళ్లు తిరుగుతూ విడిచే విషాద నాశనం చేయడమే కాని పునర్నిర్మాణం చేయలేక, విచక్షణారహితులై ప్రతీకారాన్ని కాంక్షించేవారి ఆవేదనను ఆ పాట ధ్వనించలేదు. ఆ పాటలో పాతకాలపు బానిస ప్రపంచ అవశేషా లేమీ లేవు.

దాదాపుగా ప్రతిరోజూ, పనైపోయిన తర్వాత, పావెల్ స్నేహితుల్లో ఎవరో ఒకరు అతనితో ఇంటికొచ్చేవాళ్లు. అక్కడ చదువుతూ కూచుని కొన్ని విషయాలను కాగితాలమీద రాసుకుంటూ ఉండేవాళ్లు. కాళ్లూ చేతులూ ముఖం కడుక్కునేందుకు కూడా వ్యవధి లేనట్లుండేవాళ్లు. చేతుల్లో పుస్తకాలుంచుకునే టీ, రాత్రి భోజనం కూడా చేసేవాళ్లు.

"మనమొక పత్రికను ప్రారంభించాలి" తరుచుగా అంటుండేవాడు పావెల్.

* * *

జీవితం ఎక్కువ వేగంగానూ, ఉద్వేగంగానూ నడుస్తోంది. తీనెటీగలు ఒక పువ్వు మీదనుంచి మరొక పువ్వుమీద కెగిరిపోతున్నంత వేగంగా ఒకదాని వెంట మరో పుస్తకం చదివేస్తున్నారు జనం.

"వాళ్లు మన్ని గురించి మాట్లాడుకుంటున్నారు. త్వరలో మన్ని పట్టేస్తారు" అన్నాడు ఒకనాడు వెసొవ్శ్చికోవ్.

"చేప పుట్టిన తర్వాత ఎప్పుడో ఒకనాడు వలలో తగుల్కోక తప్పదు" అన్నాడు హొహోల్.

హొహోల్‌పై ఆప్యాయత తల్లికి రోజుకురోజూ హెచ్చింది. అతడు "మామ్మా" అని పిలిచినప్పుడల్లా చంటిబిడ్డ తన మృదుహస్తంతో చెక్కిళ్లు నిమిరినట్లుండేది ఆమెకు.

"హొహోల్‌ను మన ఇంట్లోనే ఉంచుకుందాం, అది మీకిద్దరకూ మంచిదే. మీరిద్దరూ అటూ ఇటూ తిరగక్కర్లేదు" అని తల్లి ఒకనాడు కొడుకుతో చెప్పింది.

పావెల్ భుజాలెగరేసి :

"ఎందుకమ్మా ఇంకా కష్టాన్ని నెత్తికెత్తుకుంటావ్?" అన్నాడు.

"తెలివితక్కువ మాట! నా జీవితమంతా నా ప్రమేయం లేకుండానే కష్టభరితమైంది. అలాంటి మంచివాడికోసం కొంచె కష్టమెక్కువైతే ఫరవాలేదు" అంది తల్లి.

"నీ యిష్టమమ్మా! అతడొస్తే నాకు సంతోషమే" అన్నాడు కొడుకు.

హొహోల్ వాళ్ల ఇంట్లోకే మకాం మార్చాడు.

పేట చివరనున్న పావెల్ చిన్న యింటిపైన జనం దృష్టి పడింది. ఒకరోజున వ్లాసొవాను సారాదుకాణందారు బెగున్‌త్సోవ్ వీధిలో నిలబెట్టాడు. ముసలాడు చూడ్డానికి చక్కగా వుంటాడు. తాబేలు చిప్పతో ఫ్రేముకట్టిన కళ్లద్దాలుండేవి. అందుచేత అతన్నందరూ "ఎముకల కళ్లు" అని పిలిచేవారు.

"పెలగేయా నీలొవ్నా! బాగున్నారా? మీ అబ్బాయి ఎలా ఉన్నాడు? పెళ్లి చేసుకునే ఆలోచనలో లేడా? నాకు చూడగా, పెళ్లి ఈడొచ్చినట్లు కనబడుతోంది. కొడుకులకెంత త్వరగా పెళ్లి చేస్తే తల్లితండ్రుల కంత మంచిది. జనం ఎవళ్లిష్టమొచ్చినట్టు వాళ్ళు నడుచుకోవడం మొదలెట్టేరు. బొత్తిగా తలా తోకా లేకుండా ఆలోచించడం, పనిచేయడం జరుగుతోంది. ప్రభునివాసమైన చర్చికెళ్లడం మానుకుంటున్నారు. నలుగురూ కూడే జాగాలకు కూడా దూరంగా ఉంటున్నారు. ఏవో చీకటి మూలల్లో చేరి గుట్టుగా గుసగుసలాడుకుంటున్నారు. గుసగుసలెందుకంటాను? జనానికి దూరంగా ఉండడమెందుకు? బహిరంగంగా సారాదుకాణంలో మాట్లాడుకోకూడనంతటి విషయాలేమున్నాయంటాను! రహస్యాలా? రహస్యాలకు స్థానం చర్చి ఒక్కటే. మూల మూలల్లో నుంచి వినబడే గుసగుసలు మనసులోని కలతకు చిహ్నం. పెలగేయా నీలోవ్నా! మీ ఆరోగ్యం బాగుండుగాక."

వీడ్కోలు సూచకంగా టోపి తీసి దాన్ని డాబుగా గాలిలో ఊపి అతడు వెళ్లిపోయాడు. తల్లి తబ్బిబ్బయిపోయింది.

మరోసారి వ్లాసొవ్‌ల పొరుగింటామె, ఫ్యాక్టరీ గేటు దగ్గర తినుబండారాలమ్ముకుని పొట్టపోసుకునే మర్యా కోర్‌సునోవా అనే కుమ్మరి విధవరాలు తల్లిని బజారులో కలుసుకుని, "పెలగేయా! నీ కొడుకు నొక కంటితో కనిపెట్టు" అంది.

"ఏమిటి నీ ఉద్దేశం?" అని తల్లి అడిగింది.

"మా తల్లీ! చెడ్డ పుకార్లు పుడుతున్నాయి. మీవాడేదో రహస్య సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నాడంటున్నారు. ఫ్లగెల్లాంట్ల కూటమి లాంటిది... వాళ్లలాగే ఒకళ్ల నొకళ్లు కొరడాలతో కొట్టుకుంటారుట" అని నెమ్మదిగా చెప్పింది మార్యా.

"ఉట్టి చెత్త ! బుద్ధితక్కువ మాట, మార్యా."

"నిప్పు లేకుండా పొగరాదు" అంది మార్యా.

ఈ సంభాషణలను తల్లి పావెల్‌తో చెప్తుతూ ఉండేది. అతడు భుజాలెగరేసి ఊరుకునేవాడు. మృదువుగా పైకి నవ్వేసేవాడు హొహోల్.

తల్లి ఆలోచనలో పడింది. పావెల్ వైరాగ్యతీవ్రత ఆమెకు చాలా చికాకు కలిగించింది. పావెల్ సలహాను అతనికన్న పెద్దవాడైన హొహోల్ వంటి వాళ్లతో సహా అందరూ పాటిస్తున్నారని ఆమె గుర్తించింది. కాని వాళ్ళంతా అతన్ని చూచి భయపడుతున్నారే కాని అతని తీవ్రత మూలంగా ఎవరూ పావెల్‌ను ప్రేమిచడం లేదని ఆమెకు తోచింది.

ఒక రోజు రాత్రి తల్లి తన పక్కమీద పడుకునుండగా ఆమె కొడుకూ, హొహోల్ ఇద్దరూ పక్క గదిలో చదువుకుంటున్నారు. వాళ్లు నెమ్మదిగా మాట్లాడుకునే మాటలు పలచని తడికెగుండా ఆమె చెవుల్లో పడ్డాయి.

"ఆ నతాషా నాకు నచ్చింది" అని చటుక్కున అన్నాడు హొహోల్.

"నాకు తెలుసా సంగతి! అన్నాడు పావెల్.

"ఆమెకేమైనా తెలిసిందంటావా?"

పావెల్ జవాబుచెప్పలేదు.

"నీ అభిప్రాయమేమిటి?" అని హొహోల్ మళ్లీ అతి నెమ్మదిగా అడిగేడు.

"ఆమె తెలుసుకుంది.... అందుకే ఇక్కడికి రావడం మానేసింది" అని పావెల్ జవాబిచ్చాడు.

హొహోల్ మళ్లీ గదిలో పచారు చేశాడు. అతని ఈల పాట గదిలో ధ్వనించింది.

"పోనీ నేనామెకు చెప్తే!" అని హొహోల్ అడిగేడు.

"నువ్వు చెప్పడ మెందుకు?" అని పావెల్ మాట కడ్డెళ్ళేడు.

హొహోల్ పచారు ఆపుచేసినట్లు తల్లికి వినబడింది. అతడు మొల్లగా నవ్వుతున్నట్లు వినిపించిది.

"నీవు ఒక పిల్లని ప్రేమిస్తే, ఆ సంగతి ఆమెతో చెప్పాలి. చెప్పకపోతే ఏమవుతుంది?"

పావెల్ చేతిలో ఉన్న పుస్తకాన్ని చటుక్కున మూసేశాడు.

"అన్‌ద్రేయ్, నీకేమి కావాలో దాన్ని గురించి నీకు స్పష్టమైన అభిప్రాయముండాలి. ఆమె నిన్ను ప్రేమించిందే అనుకో ఆ విషయం నాకు సందేహమే అయినా మాటవరసకు ప్రేమించిందనే అనుకుందాం మీరు పెళ్లి చేసుకుంటారు. చాలా మంచి సంబంధం! ఆమె మేధావి నువ్వు కార్మికుడవు. పిల్లలు పుట్టుకొస్తారు. వాళ్లను పోషించడానికి రాత్రింబగళ్లు నువ్వుచాకిరీ చేయాలి. తిండికోసం, పిల్లల పోషణకోసం, ఇంటి అద్దెకోసం, నీ బతుకంతా యాతనలో పడి తాకట్టయిపోతుంది. నువ్వూ, ఆమే కూడా మన ఉద్యమానికి ఎందుకూ పనికిరాకుండా పోతారు."

కొంచెం సేపు ఆగి పావెల్ మళ్లీ మాట్లాడ్డం మొదలెట్టాడు. ఈ సారి అతని మాట కొంచెం సరళంగా వచ్చింది.

"అన్‌ద్రేయ్! ఆ ప్రయత్నం విరమించుకో. ఆమెకేమీ కష్టం తెచ్చి పెట్టకు."

నిశ్శబ్దం. గడియారం టిక్కుటిక్కుమంటూ సెకండ్లను కొట్టింది.

"నా హృదయంలో సగభాగం ప్రేమిస్తోంది. సగభాగం ద్వేషిస్తోంది. దీన్ని ఒక హృదయమేనంటావా?" అన్నాడు హొహోల్.

పుస్తకంలోని పేజీలు తిరగవేస్తున్న చప్పుడవుతోంది. పావెల్ చదువుతూనే ఉన్నాడన్నమాట. తల్లి ఊపిరి పీల్చడానికి కూడా సంకోచిస్తూ కళ్లు మూసుకు పడుకుంది. హొహోల్ మీద ఆమె హృదయమెంతో జాలిపడింది. అయితే తన కొడుకుపట్ల ఇంకా ఎక్కువ జాలిపడింది.

"అయ్యో పాపం! వెర్రిపిల్లాడు" అనుకుంది.

"కనుక నేనామెతో ఏమీ చెప్పకూడదంటావ్?" చటుక్కున హొహోల్ అడిగేడు.

"అవును ఏమీ చెప్పకూడదు" అన్నాడు పావెల్.

"అయితే, సరే, చెప్పను" అన్నాడు హొహోల్. కొన్ని క్షణాలాగి, "పావెల్! ఇలాటి స్థితిలో పడినప్పుడు నువ్వూ చాలా యిబ్బందిలో పడతావు సుమా!" అన్నాడు.

"ఇప్పుడే ఆ కష్టంలో ఉన్నాను."

బయట గాలి జోరుగా విసురుతోంది. లోపల గడియారం టిక్‌టిక్‌మంటూ కాలం జారిపోతున్న సంగతిని జ్ఞాపకం చేస్తోంది.

"ఇదంతా ఆషామాషీ వ్యవహారం కాదు" నెమ్మదిగా అన్నాడు హొహోల్.

తల్లి ముఖాన్ని తలగడతో కప్పుకుని నిశ్శబ్దంగా ఏడ్చింది.

మరునాడు ఉదయం అన్‌ద్రేయ్ చాలా చిన్నవాడైపోయినట్లూ, అతడిమీద ఆప్యాయత మరింత పెరిగినట్లూ ఆమె మనసుకు తట్టింది. తన కొడుకు ఎప్పట్లాగునే మౌనంగా కనిపించాడు. ఇంతకుముందు ఆమె హొహోల్ నెప్పుడూ అన్‌ద్రేయ్ ఒనీసిమొవిచ్ అనే పిలుస్తుండేది. కాని ఈ రోజున అనుకోకుండా :

"అన్‌ద్రూషా, మీ బూట్లు మరమత్తు చేయించుకోండి, లేకపోతే పడిశంపడుతుంది" అంది.

అతడు నవ్వుతూ :

'ఈ సారి జీతాల రోజున కొత్త జత కొనుక్కుంటాను" అని జవాబిచ్చాడు. తర్వాత తన పొడుగాటి చేతి నామె భుజం మీద వేసి "నిజానికి మీరే నా కన్న తల్లేమో? కాని నా రూపంవల్ల మీరా సంగతి నంగీకరించడం లేదనుకుంటాను. అంతేనా?" అన్నాడు.

సోషలిస్టులు నీలిసిరాతో రాసి పంచిపెడుతున్న కరపత్రాలను గురించి పేటలో మాట్లాడుకోవడం మొదలుపెట్టేరు. ఈ కరపత్రాలు, ఫ్యాక్టరీ పరిపాలకులను ఘాటుగా విమర్శించాయి. పీటర్స్‌బుర్గులోనూ, దక్షిణ రష్యాలోనూ జరిగిన సమ్మెల గురించి చెపుతూ, కార్మికులంతా తమ హక్కుల రక్షణ కోసం ఏకంకావాలని ఆ కరపత్రాలు హెచ్చరించాయి.

ఫ్యాక్టరీలో బాగా డబ్బు సంపాదించుకుంటున్న నడివయస్కులు ఈ కరప్రతాలు చూచి చాలా ఆగ్రహావేశ పరువశులయారు.

యువకులు వాటిని చాలా ఉత్సాహంతో చదువుకున్నారు.

కార్మికుల్లో ఎక్కువమంది మాత్రం, రోజువారీ చాకిరీతో నలిగిపోయి ఉదాసీనంగా : “దీనివల్ల ఏం జరుగుతుంది? అసంభవం” అని పెదవి చప్పరించేసేవారు.

తన కొడుకు చేస్తున్న పనే ఈ అలజడి కంతకూ కారణమని తల్లి గ్రహించింది. జనం, అతనిపట్ల ఆకర్షితులవుతున్నట్లు ఆమె గుర్తించింది. అందుకామె ఎంత గర్వపడేదో, అంతగా అతని క్షేమం గురించి ఆత్రత పడేది.

ఒక సాయంకాలపు వేళ మార్యా కోర్సునొవా వ్లాసోవ్‌ల ఇంటి కిటికీ తలుపు తట్టింది. తల్లి కిటికీ తలుపు తెరిచేసరికి ఆమె బిగ్గరగా గొణిగింది.

తల్లి కిటికీ తలుపు వేసుకుని నెమ్మదిగా కుర్చీలో కూలబడింది. తన కొడుక్కి ఏదో ముప్పు రాబోతోందనే సంగతి గమనానికొచ్చేసరికి చటుక్కున లేచి నిలబడింది. గబగబా బట్టలేసుకుని, తలకు శాలువ కప్పుకుని తిన్నగా ఫ్యాదొర్ మాజిన్ ఇంటికి పరుగెత్తింది. అతడు సుస్తీగా ఉండడంచేత ఫ్యాక్టరీ కెళ్లలేదు. ఆమె అతనింట్లోకి వెళ్లేసరికి అతడు కిటికీపక్కన కూర్చుని ఓ పుస్తకం చదువుకుంటూ, బిర్రబిగిసిపోయిన బొటనవ్రేలిని మర్దన చేసుకుంటున్నాడు. ఈ వార్త వినడంతోనే అతడు తెల్లబోయి గభాలున గంతేశాడు.

“సరి సరి బాగుంది!” గొణుక్కున్నాడు. వణుకుతున్న చేత్తో నుదుటిమీది చెమట తుడుచుకుంటూ :

“ఏం చేద్దాం?” అడిగింది తల్లి.

“ఒక నిముషం ఆగండి. కంగారు పడకండి” అని బాగా ఉన్న చేత్తో ఉంగరాల జుట్టును వెనక్కు తోసుకుంటూ జవాబుచెప్పేడు.

“ఏమిటి? మీరే కంగారు పడుతున్నారే!” అంది ఆమె.

అతడు కొంచె సిగ్గుపడుతూ, చిరునవ్వు నవ్వేడు.

“నేనా?...హుఁ... పాడు వ్యవహారం... ఇదంతా పావెల్‌కు తెలియచేయాలి. నేను ఎవరినో పంపిస్తాను. మీరు ఇంటికెళ్ళండి. దిగులుపడకండి. వాళ్లు మనల్నేమీ కొట్టరు కదా? కొడతారంటారా?” అన్నాడు.

ఆమె ఇంటికెళ్లి పుస్తకాలన్నీ పోగుచేసి వాటిని గుండెలకి హత్తుకుని ఇల్లంతా తిరిగింది. పొయ్యిమీద, పొయ్యికింద, నీళ్ల తొట్టెలో అన్నిచోట్లా పరీక్షగా చూసింది. చివరకు అలసిపోయి, వంటింట్లో కెళ్లి బెంచిమీద పుస్తకాలెట్టి వాటిమీద కూచుంది. కదలడానికి భయపడి, పావెల్, హొహోల్ వచ్చేవరకూ ఆమె అలాగే కూచుండిపోయింది. వాళ్లు రావడంతోనే లేవకుండానే,

"విన్నారా?" అని అడిగింది.

"ఆ, విన్నాం–నీకు భయమేస్తోందా?" చిరునవ్వుతో పావెల్ అడిగేడు.

"చాలా...'

ఆమె కొడుకూ, హొహోల్ ఫక్కున నవ్వేరు. దానితో ఆమె మనసు కొంచెం కుదుటబడింది. ఆ పుస్తకాల్లోంచి పావెల్ కొన్నింటిని ఏరేడు. వాటిని దాచేయడానికి బయటికి పట్టుకుపోయాడు. సమొవార్ అంటిస్తూ హొహోల్ చెప్పడం మొదలెట్టేడు :

"మామ్మా! ఇందులో భయపడడానికేమీ లేదమ్మా! ఇలాంటి తెలివితక్కువ పనులతో కాలహరణం చేయడం వాళ్లకే సిగ్గుచేటు. చేయెత్తు మనుష్యులు, నడుముమీద ఖడ్గాలు వ్రేలాడేసుకుని, స్పర్స్ ఉన్న బూట్లు తొడుక్కుని ఉంటారు. వాళ్లిక్కడ కొచ్చి సామానులన్నీ కిందామీదా చెసేస్తారు. మంచాలకింద పొయ్యికింద సోదా చేస్తారు. నేల కొట్టులో దూరతారు. అటకలెక్కుతారు. ముఖంనిండా సాలె గూళ్లంటుకుంటాయి. విసుగుచెంది బుసలు కొడతారు. సిగ్గుతో చిరచిరలాడతారు. అంచేత చాలా భయకరంగా కనబడేట్టు, కోపంగా ఉన్నట్లు నటిస్తారు. వాళ్లు చేసే పనిలో ఉండే పశుత్వం వాళ్లకీ తెలుసు. ఒకసారి నా వస్తువులన్నీ చిందరవందర చేయడానికి సిగ్గుపడిపోయి, ముట్టుకోకుండానే వెళ్లిపోయారు.

"అన్ద్ర్యూషా! ఏమి చిత్రంగా మాట్లాడుతావు!" అని తల్లి ఆశ్చర్యం వెలిబుచ్చింది.

సమొవార్ని ఊది ఆర్పేయడానికి నేలమీదకు వంచిన ఎర్రని ముఖాన్ని అతడు పైకెత్తి, మీసాలు కిందకు దువ్వుకుని,

"ఏమిటి చిత్రం?" అని అడిగేడు.

"నీకెప్పుడూ ఎవరూ ఏ బాధా కలిగించనట్టే మాట్లాడుతున్నావే?"

హొహోల్ చిరునవ్వుతో లేచి తల పంకిస్తూ ఇలా చెప్పేడు :

"భూమిమీద ఏ బాధా పొందని ఆత్మ అంటూ ఉన్నదా? వాళ్లు నన్ను యింత అని చెప్పలేనంతగా బాధించారు. జనం అలాటివాళ్లు కనుక నువ్వు చేసేదేముంది? దాన్ని గురించి తలుచుకుంటుంటే, నువ్వు చేసే పనికి అడ్డొస్తుంది. నీవు అనుభవించిన బాధల గురించీ, నీకు తగిలిన గాయాలను గురించీ, ఆలోచించుకుంటూ ఉండడం వృధా ప్రయాస. జీవితమంతే! జనం మీద నాకు చాలా కోపమొచ్చేది. కాని అందువల్ల ఉపయోగం లేదని తెలుసుకున్నాను. ప్రతివాడూ, తన పొరుగువాడు తనను కొడతాడేమోనని భయపడుతుంటాడు. కనుక తనే ముందుగా అతని ముక్కు పట్టుకోవాలని చూస్తుంటాడు. మామ్మా! జీవితం అలాగే సాగిపోతోంది."

అతని మాటలు మెల్లని ప్రవాహంలా సాగేయి. రాబోయే సోదాను గురించి ఆమె

భయమంతా పటాపంచలైపోయింది. అతని విశాల నేత్రాలు చిరునవ్వును వికసింపచేశాయి. మనిషెంత వికారంగా ఉన్నా, అతనిలో ఉండే చలాకీ నామె కనిపెట్టింది.

తల్లి నిట్టూర్పు విడిచింది.

"వాళ్లకింక కనబడవు" అని ధీమాగా చెపుతూ చేతులు కడుక్కున్నాడు. చేతులు తుడుచుకుంటూ తల్లి కేసి తిరిగి చెప్పాడు :

"నువ్వు భయపడినట్లు కనిపించావా, ఈ ఇంట్లో ఏదో వున్నది కనుకనే ఆమె ఇల్లా హడలిపోతోందనుకుంటారు. మేమేమీ తప్పుపని చేయడం లేదని నువ్వు ఎరుగుదువు. న్యాయం మన వైపే ఉంది. జీవితకాలమంతా దానికోసం కృషి చేస్తాం. మా తప్పు అదొక్కటే. కనుక మన మెందుకు భయపడాలమ్మా?"

"పావెల్! నేను గుండెని నిబ్బరం చేసుకుని కుదుటపడతాను" అని మాటిచ్చింది. కాని ఉత్తరక్షణంతోనే బావురుమంది. "త్వరగా వాళ్లొచ్చి ఈ పనేదో పూర్తి చేసేస్తే బాగుండు" ననుకుంది.

దాదాపు నెలరోజులైన తర్వాత, పోలీసు లొచ్చారు. నికొలాయ్ వెసొవ్ శ్చికోవ్ పావెల్‌నూ అన్‌ద్రేయ్‌నీ చూడడానికి కొచ్చాడు. వాళ్లు ముగ్గురూ కూచిని తమ పత్రికను గురించి చర్చించుకుంటున్నారు. చాలా పొద్దుపోయింది. దాదాపు అర్థరాత్రి అయింది. తల్లి మంచంమీద పడుకుంది.

వెలవెలలాడే ఒక పొడుగాటి వ్యక్తీ, అతని వెంట మరొక వ్యక్తీ ప్రత్యక్షమయారు. ఇద్దరు పోలీసులు పావెల్‌ను వెనక్కి నెట్టి ఇరు పక్కలా నిలబడ్డారు.

"మీరు ఎదురుచూస్తున్న వాళ్లం కామేమోకదూ!" అని ఒకడు హేళనగా పలకరించాడు.

అతడు పొడుగ్గా సన్నంగా పలచని నల్లమీసంగల ఆఫీసరు. ఫెద్యాకిన్ అనే స్థానిక పోలీసు జవాన్ తల్లి పడక దగ్గరకెళ్లి,

"ఆమె అతని తల్లి దేవరా! ఇతనేనండి కథానాయకుడు" అని ఎడమ చేత్తో టోపీ సర్దుకుని కుడి చేత్తో పావెల్‌ను చూపించాడు.

"పావెల్ వ్లాసొవ్?" అంటూ ఆఫీసరు కళ్లు చిట్లించాడు.

పావెల్ తలూపేడు.

"నీ ఇల్లు సోదా చెయ్యాలి" అన్నాడు ఆఫీసరు మీసం మెలేసుకుంటూ. "లేవమ్మా! లే. ఎవరు వారు?" అంటూ రెండో గదిలో కెళ్లేడు.

గదంతా జన సమ్మర్దమైంది. ఏ కారణం చేతనో గాని బూట్‌పాలిష్ వాసన గదంతా ఆవరించింది. స్థానిక పోలీసు అధికారి, ఇద్దరు పోలీసులు గబగబా బీరువాల్లోంచి పుస్తకాలను లాగేసి ఆఫీసరు ఎదురుగా కుప్పగా పారేశారు.

భయం పోగొట్టుకునేందుకు, మామూలుగా పక్క కొదిగి నడవడానికి బదులు, అమ్మ రొమ్ములు విరుచుకుని తిన్నగా నడచి వచ్చింది. ఆ నడక తమాషాగా హుందాగా కనబడింది.

"ఈ బైబిల్ ఎవరు చదువుతారు?"

"నేను" అన్నాడు పావెల్.

"బాగుంది" అంటే ఆఫీసరు కుర్చీలో జార్లపడ్డాడు.

నిశ్శబ్దం అలుముకుంది. ఎవళ్లూ మారు మాటాడలేదు.

తల్లి ముఖంమీద మచ్చ వెలవెల బారింది. రీబిన్ నల్ల గెడ్డం చిత్రంగా అదరడం మొదలెట్టింది. వ్రేళ్లతో గెడ్డం దువ్వుకుంటూ అతడు కళ్లు వాల్చాడు.

"ఈ అడ్డగాడిదని అవతలికి తీసుకెళ్లండి" అని ఆఫీసరు ఆజ్ఞాపించాడు.

ఇద్దరు పోలీసులు నికొలాయ్ జబ్బలు పట్టుకుని బలవంతంగా వంటింట్లోకి ఈడ్చుకుపోయారు. అక్కడ అతడు పాదాలను నేలకు బిగతన్ని వాళ్లనాపు చేశాడు.

"నవోద్క అనే పేరు పెట్టుకున్న జారజుడు అన్‌ద్రేయ్ ఒనీసిమొవ్! మీరు అరెస్టులో ఉన్నారు!" అన్నాడు ఆఫీసరు.

"ఎందుకు?" అని తొణుకూ బెణుకూ లేకుండా హొహోల్ అడిగేడు.

"ఆ సంగతి తర్వాత తెలుస్తుంది" అన్నాడు పరమాసహ్యాన్ని కప్పిపుచ్చే తియ్యని గొంతుకతో. సెలగేయా వైపు తిరిగి,

"నీకు చదువొచ్చా?" అని అడిగేడు.

"రాదు" అని పావెల్ జవాబిచ్చాడు.

"నేను నిన్నడగడం లేదు" అని పావెల్ మీద చిరాకుపడి, "ముసల్దానా! చెప్పు!" అన్నాడు.

ఆ మనిషిమీద కలిగిన అసహ్యంతో ఆమెకు ఒళ్లు తెలియలేదు. మంచునీళ్లలో మునిగినట్లుగా గడగడ వణికింది. కాస్తంత ధైర్యం తెచ్చుకుంది. ముఖం మీద మచ్చ కమిలిపోయి నట్లయింది. కోపంతో బొమలు ముడిచి, చేయి చాపి:

"అలా అరవడమెందుకు? అభం శుభం ఎరగని చిన్నవాళ్లు మీరు. కష్టమంటే ఏమిటో ఎరుగరనుకుంటాను" అంది.

"శాంతించమ్మా!" అని పావెల్ ఆమెనాపడానికి ప్రయత్నించాడు.

"నువ్వాగు" అంటూ చటుక్కున బల్ల దగ్గరకెళ్లి, "ఎందుకు వీళ్లని తీసుకెళ్లడం?" అని గట్టిగా అడిగింది.

"అది నీ పనికాదు! ఊరుకో!" అంటూ ఆఫీసరు లేచాడు. "వెసొవ్‌శ్చికోవ్ కూడా అరెస్టులోనే ఉన్నాడు. అతడిని కూడా తీసుకురండి!" అని ఆజ్ఞాపించాడు.

"అన్‌డ్రేయ్ శలవు, నికొలాయ్ శలవు!" అంటూ పావెల్ వెచ్చగా కరచాలనం చేసి సాగనంపాడు.

"బహుశా త్వరలోనే కలుసుకుంటారు లెండి!" ఆఫీసరు చిన్న వెకిలి నవ్వు నవ్వేడు.

వెసొవ్‌శ్చికోవ్ బరువుగా నిట్టూర్పు విడిచాడు. అతని కంఠంలోని రక్తం పొంగి ఎర్రబారింది. కోపంతో కళ్లు జ్యోతుల్లా వెలిగేయి. హొహోల్ చిన్న నవ్వు నవ్వేసి తలూపుతూ, తల్లి చెవిలో మెల్లగా ఏదో గుసగుసలాడేడు.

"ఎవరిది న్యాయమో భగవంతుడు చూస్తున్నాడు" అంటూ ఆమె అతనిపై శిలువ చిహ్నం గీసింది.

పావెల్ చేతులు వెనక్కు పెట్టుకుని చిందరవందరగా పడున్న కాగితాలనూ గుడ్డలనూ తొక్కుకుంటూ మెల్లగా పచార్లు చేశాడు.

"చూశావా! వాళ్లు చేసే తంతు, యిలాగే ఉంటుంది" అన్నాడు విచారంగా.

"ఆ పసుపు పచ్చని ముఖంవాడు మనలను చాలా హేళన చేశాడు. మనలను బెదరగొట్టాలని చూశాడు..."

"సరే అమ్మా! బాగానే ఉంది. రా, మనం ఇదంతా సర్దుదాం" తటాలున పట్టుదలగా అన్నాడు పావెల్.

అమ్మా అని తనను పిలిచాడు. తల్లిమీద ఆప్యాయత కలిగినప్పుడల్లా అతని కంఠస్వరం అలాగే ఉంటుంది. దగ్గరకెళ్లి ఆమె అతడి ముఖంకేసి చూచింది.

"నీ మనసుకేమైనా వాళ్లు బాధ కలిగించారా?" అని మెల్లగా అడిగింది.

"అవును. చాలా కష్టం. మిగిలినవాళ్లతో పాటు నన్ను కూడా తీసుకుపోతే బాగుండేది."

అతని గ్రుడ్లలో నీరు తిరిగినట్లు ఆమె కగుపడింది.

"కొంచెం ఆగు! నిన్నూ తీసుకెడతారులే" అని నిట్టూర్చి అతని కుపశమనం కలిగించాలనుకుంది.

"తీసుకెడతారని నాకు తెలుసు."

ఆమె ఒక్క క్షణం మౌనం వహించింది. చివరకు,

"నువ్వెంత కఠినహృదయుడవైనావురా, పావెల్! అప్పుడప్పుడైనా ఒక చల్లని మాట చెప్పకూడదా! ఆ మాటనేనన్నదే చాలు. నువ్వు మరింత కటువుగా చెప్తున్నావు?"

అతడు ఆమెకేసి చూస్తూ దగ్గర కొచ్చాడు.

"అమ్మా! ఎల్లాగో నాకు తెలియదు, కాని నువ్వు అందుకు సిద్ధం కావాలి."

మరునాడు బూకిన్, నమోయ్‌లోవ్, సోమొన్ వగైరా మరి అయిదుగుర్ని కూడా అరెస్టు చేసిన భోగట్టా తెలిసింది. సాయంకాలం ఫ్యోదొర్ మాజిన్ పావెల్ ఇంటికొచ్చి, ఒక్క నిముషముండి వెళ్లాడు. అతని ఇంట్లో కూడా సోదా జరిగింది. అందుకతడెంతో సంతృప్తిపడి వీరుడల్లే ఉన్నాడు.

"నీకేమైనా భయమేసిందా, ఫ్యోదొర్?" అని తల్లి అడిగింది.

అతడు వెలవెలబోయాడు. ముఖకవళికలు ఉగ్రమయాయి. ముక్కుపుటాలు అదిరేయి.

"నన్నెవడైనా కొట్టడానికి సాహసిస్తే నేను వాడిమీదికి కత్తిలా ఎగిరి పడతాను. పళ్లతో కొరికేస్తాను. నన్ను ఒకేసారి చంపేస్తే చంపేయనియ్యి!"

"నువ్వు చాలా అర్భకుడివి. ఎలా దెబ్బలాడగలవు;" అన్నది తల్లి.

"ఏమైనా నేను దెబ్బలాడ్డం మానను" అన్నాడు ఫ్యోదొర్.

అతడు వెళ్లిపోవడంతోనే,

"మొదట్లో ఇతడే లొంగిపోతాడు" అంది తల్లి.

పావెల్ జవాబుచెప్పలేదు.

కొన్ని నిముషాల్లో వంటింటి తలుపు మెల్లగా తోసుకుంటూ రీబిన్ లోపలికొచ్చాడు.

"ఒక గ్లాసు టీ ఇవ్వండి" అన్నాడు.

అతడు విశాలమైన నల్లని ముఖాన్నీ, నల్లటి గడ్డాన్నీ, నల్లని కళ్లనూ జాగ్రత్తగా పరిశీలించాడు పావెల్. నిదానమైన అతని చూపులో ఏదో విశిష్టత ఉంది.

"పోతే..." అంటూ మధ్యలో ఆగిపోయిన సంభాషణను మళ్లీ సాగించుతూన్నట్లు అన్నాడు. "నీతో మనసు విప్పి కొన్ని విషయాలు మాట్లాడాలి. కొంతకాలం నుంచి నిన్ను కనిపెట్టి చూస్తున్నాను. ఇంచుమించు మీ యింటి పొరుగునే ఉంటున్నాను. మీ యింటికి చాలామంది వస్తూపోతూండడం గుర్తించాను.

మాటలు బరువుగానే పడుతున్నా, బాగా ఆలోచించి మాట్లాడుతున్నా, వాగ్ధోరణి ధారాళంగా నడిచింది. మాట్లాడేటప్పుడు చామనచాయ చేత్తో గడ్డం సవరించుకుంటూ పావెల్‌కేసి తదేకంగా చూస్తుండేవాడు.

"జనం నిన్ను గురించి చెప్పుకోవడం మొదలెట్టేరు. అన్నట్లు నువ్వు చర్చికెళ్లవుట కదూ? అంచేత నిన్ను మత వ్యతిరేకివంటున్నారు. ఆ మాటకొస్తే నేనూ వెళ్లను. సరి. ఇక కరపత్రాల సంగతి. అదంతా నీ పనేనా?"

"అవును" అన్నాడు పావెల్.

"సరే...బాగుంది" అన్నాడు రీబిన్.

తన మాటను వాళ్లు లక్ష్య పెట్టనందుకు విసుక్కుంటూ తల్లి వెళ్లిపోయింది.

"ఇక సోదా సంగతి అన్నిటికంటే ముఖ్యంగా దాని తర్వాత మీరు నాకు బాగా నచ్చారు. నువ్వూ, హొహోల్, నికొలాయ్ మీరంతా ఎలాంటి వాళ్లో బాగా రుజువు చేసుకున్నారు...."

"రుజువు చేసుకున్నారు. 'మహాప్రభూ! మీ పని మీరు చేసుకోండి. మా పని మేము చేసుకుంటామ'ని నిక్కచ్చిగా మీ నిశ్చయాన్ని చెప్పేశారు. హొహోల్ కూడా చాలా మంచి కుర్రాడు. అతడు ఫ్యాక్టరీలో మాట్లాడుతూండగా అప్పుడప్పుడు విన్నాను. 'అబ్బ! ఇతని నెవ్వరూ అణగదొక్కలేరు, మృత్యువొక్కటి తప్ప! బలే ఉక్కు పిండం' అనుకున్నాను... పావెల్ నన్ను నమ్ముతున్నావా?"

రీబిన్ మెత్తని సారవంతమైన మాటలను తల్లి ఆత్రంగా వింది. నడివయస్సులో వున్న మనిషొచ్చి తన కడుపులో ఉన్న కష్టాసుఖాలను తన కొడుకుతో చెప్పుకుంటున్నందుకు చాలా సంతోషించింది. కాని పావెల్ చాలా ఉదాసీనంగా ఉన్నట్లు ఆమెకు తోచింది.

"మిహాయిల్ ఇవానొవిచ్! తినడానికేమైనా తెమ్మన్నారా?" అని అడిగింది.

"ధన్యవాదాలు, అమ్మా! కాని నాకేమీ వద్దు. నేను భోజనం చేసొచ్చాను. అయితే పావెల్! మన జీవితం సక్రమంగా నడవడం లేదటావ్ అంతేనా?"

పావెల్ ఫ్యాక్టరీని గురించీ, దాని అధికారులను గురించీ, విదేశాల్లో కార్మికులు తమ హక్కులకోసం సాగిస్తున్న పోరాటాలను గురించీ చాలా ఆవేశంతో మాట్లాడేడు. అప్పుడప్పుడు పావెల్ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నందుకు సూచనగా :

"అద్గదీ సంగతి!" అని రీబిన్ బల్లమీద చరిచేవాడు.

ఒకసారి అతడు నవ్వేసి తాపీగా

అయితే, దేవుడి విషయంలో కూడా వాళ్లు మనల్ని మోసం చేస్తున్నారంటావ్! అంతేనా? హుం... నా అభిప్రాయం కూడా మన మతం సరియైనది కాదనే."

ఇంతవరకూ మాట్లాడకూరుకున్న తల్లి ఇక ఊరుకోలేకపోయింది. తాను అత్యంత పవిత్రమైన భక్తి విశ్వాసాలతో కొలుస్తున్న దేవుని గురించీ, అతడికి సంబంధించిన విషయాలను గురించీ తన కొడుకు చులకనగా ప్రసంగిస్తున్నప్పుడామె ఉండబట్టలేకపోయేది. అతని దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించేది. అలాంటి శూలాల్లాంటి నాస్తిక పదాలతో తన హృదయాన్ని గాయపరచవద్దని మౌనంగా కళ్లతోనే ఆర్థించేది. అయితే అతని నాస్తికత్వం మరుగున ఏదో గొప్ప విశ్వాసముందని మాత్రం ఆమె గ్రహించింది. ఆ భావమే ఆమెకు వూరట కలిగించేది.

“వీడి ఆలోచనలు నాకెక్కడ అంతు చిక్కుతాయి?” అనుకునేది.

తన కొడుకు చెప్పే మాటలు నడివయస్సులో వున్న రీబిన్ మనసుకు కష్టం కలిగిస్తాయని ఆమె అనుకుంది. కాని అతడు నిస్సంకోచంగా పావెల్ నడిగిన ప్రశ్నను వినేసరికి ఒక ఆగలేకపోయింది.

“దేవుణ్ణి గురించి మాట్లాడేటప్పుడు కాస్త జాగ్రత్తగా ఉండండి” అని దీర్ఘమైన ఊర్పు తీసింది.

పావెల్ మళ్లీ అందుకున్నాడు.

“మీరు నమ్మే దయామయుడైన దేవుణ్ణి గురించి కాదమ్మా నేను మాట్లాడుతున్నది! మతగురువులు ఏ దేవుని పేరు చెప్పి మనలను బెదరిస్తుంటారో, ఏ దేవుడ్ని మనకొక దుడ్డుకర్రలా చూపించి బెదురుపెట్టి, కొద్దిమంది అధికారుల దుర్ణయాలకు మనలను తలొగ్గేటట్లు చేస్తారో ఆ దేవుణ్ణి గురించే చెప్పేను.”

“అదీ సంగతి!” అంటూ రీబిన్ బల్ల చరిచి, “వాళ్లు దొంగ దేవుడిని మనమీద రుద్దేరు! దొరికిన ఆయుధాన్నల్లా చేత్తో పుచ్చుకుని మనతో పోరాడుతారు.

అతడు మాట్లాడ్డమైతే మృదువుగానే మాట్లాడేడు. కాని అతడు మాట్లాడిన ప్రతి మాటా తల్లికొక సమ్మెట దెబ్బలా తాకింది.

“నే వెళ్లిపోతున్నా, ఇలాంటి సంభాషణను వినడానికి నాకు శక్తి చాలదు” అని తలూపుతూ గభాలున వంటింట్లో కెళ్లిపోయింది.

కాని, అతడు తొణుకూ బెణుకూ లేకుండా గాఢమైన విశ్వాసంతో మాట్లాడుతూనే ఉన్నాడు.

“పవిత్ర స్థలాన్ని ఖాళీగా ఉంచకూడదు. మానవుని హృదయంలో భగవంతుడుండే చోటు అతి మెత్తనైనది. దానిని కోసి పారేస్తే, అక్కడ పెద్ద పుండైపోతుంది. పావెల్, మనమొక కొత్త మతాన్ని లేవ దీయాలి. మానవునికి మిత్రుడైన దేవుడిని సృష్టించాలి. అంతే!”

* * *

ఒకనాడు పావెల్ ఇంట్లో అంతా సమావేశమై ఉండగా, వారందరినీ తన నల్లని కళ్లతో సమీక్షించి చిరచిరలాడుతూ ఇలా చెప్పేడు: "విషయాలను మనం ఇప్పుడు ఉన్నవి వున్నట్లు మాట్లాడుకోవాలి. ముందు ఎలా జరగాలో కాదు. ముందు ఏమి కాబోతుందో ఎవరికి తెలుసు? ప్రజలకు స్వేచ్ఛంటూ లభిస్తే, వాళ్ళకేది మంచిదో వాళ్లే నిర్ణయించుకుంటారు. వాళ్లడగకుండానే వాళ్ల బుర్రల్లోకి చాలా సంగతులను కూరేయడం జరిగింది. ఇక వాళ్లంతటవాళ్లే ఆలోచించుకోవలసిన సమయం వచ్చేసింది. ఒకప్పుడు వాళ్లు ఈ జీవిత విధానాన్నీ, ఈ చదువునూ కూడా త్రోసిరాజంటే అనవచ్చు. చర్చిలోని దేవుడిలాగే ఇవి కూడా వాళ్లకి శత్రువులుగా తోచవచ్చు. పుస్తకాలను వాళ్ల ఎదుట పడెయ్యండి. వాళ్ల సమస్యల్ని వాళ్లే పరిష్కరించుకుంటారు. అదే అసలు సంగతి!"

రీబిన్, పావెల్, ఇద్దరు మాత్రమే ఉన్నప్పుడు వాళ్లు అంతులేకుండా చర్చించుకుంటూ ఉండేవారు. కాని ఎప్పుడూ శాంతాన్ని కోల్పోయే వాళ్లు కారు. తల్లి వాళ్ల మాటలను చాలా ఆసక్తితో వినేది. వాళ్లు మాట్లాడుకునే ప్రతి మాటనీ అవగాహన చేసుకునేందుకు ప్రయత్నించేది.

పేటలోని జనమందరి దృష్టి వ్లాసొవ్‌ల చిన్న ఇంటిమీద పడింది. కొందరా యింటి వ్యవహారాలను అనుమానంతో చూస్తూ వచ్చారు. కొందరు అకారణమైన శత్రుత్వం వహించారు. కొందరు అక్కడేదో మంచి జరుగుతోందనే నమ్మకంతో పరిశీలిస్తూ వచ్చారు.

క్రమక్రమంగా జనం శ్రద్ధాసక్తులతోనూ, అచంచల విశ్వాసంతోనూ పనిచేస్తుండే ఈ యువకుని గౌరవించడం మొదలెట్టేరు. అతడు తన చుట్టూ జరుగుతున్న విషయాలను జాగ్రత్తగా గమనించేవాడు. శ్రద్ధగా వినేవాడు. జనంలో అభిప్రాయ భేదాలు ఎప్పుడేర్పడినా వాటిని మొదలంటా పరిశీలించి, ప్రజలందరినీ ఒక తాటిమీదకి తెచ్చే సూత్రాన్ని కనుగొనేవాడు. అంచేత జనానికి పావెల్ యడల భక్తి విశ్వాసాలు కుదిరేయి.

ముఖ్యంగా "గుంట కోపెక్కు" సంఘటన జరిగిన తర్వాత పావెల్ పలుకుబడీ, ప్రతిష్ఠా బాగా పెరిగాయి.

ఆ కథ ఇది. ఫ్యాక్టరీకి కొంచెం దూరంగా ఒక గుంట ఉంది. దాని చుట్టూ దేవదారు చెట్లూ భూర్జ వృక్షాలూ బాగా వొత్తుగా ఉన్నాయి. ఇంచుమించు ఫ్యాక్టరీ చుట్టూ ఒక గుంట ఆవరించి కుళ్లు కంపు కొడుతుండేది. వేసవి కాలంలో నీరు పసరెక్కిపోయి, పచ్చటి పొగ పైకి లేచేది. దానిమీదనుంచి దోమలు మేఘాల్లా పైకి లేచేవి. అందువల్ల పేటంతా జ్వరాలతో బాధపడేవాళ్లు.

ఫ్యాక్టరీ పనివాళ్ల ఆరోగ్యాన్ని అభివృద్ధిచేయడానికే తానీ పని చేయిస్తున్నాననే మిషతో యజమాని కూలివాళ్ల కూలిలోనుంచి గుంట పూడ్చేందుకు రూబుల్‌కొక కోపెక్కు చొప్పున మినహాయించమని ఆజ్ఞాపించాడు.

కోపెక్కు మినహాయింపు ఉత్తరువును కొత్త డైరెక్టరు ఫ్యాక్టరీ నోటీసు బోర్డులో పెట్టించిన శనివారం నాడు, ఒంట్లో బాగుండకపోవడంచేత పావెల్ పనిలో కెళ్లలేదు. అంచేత దాని సంగతి అతనికేమీ తెలియలేదు. చాలా కాలంగా ఫ్యాక్టరీలో పోతపని చేస్తుండే సిజోవ్, పొడగరీ ముక్కోపీ అయిన మెకానిక్ మహోతిన్, ఇద్దరూ మర్నాడు పావెల్ ఇంటికొచ్చారు.

"పెద్దవాళ్లు కూడా నీ దగ్గర కొచ్చి సలహాచేస్తున్నారే" అంది.

ఆమెకేమీ జవాబుచెప్పకుండానే, పావెల్ ఏదో రాయడం మొదలెట్టేడు. కొంచెంసేపైనాక,

"అమ్మా! నువ్వొక పని చేసిపెడ్తావా! పట్నానికి వెళ్లి ఈ కాగితాన్ని అందిచ్చి రావాలి."

"అదేమైనా ప్రమాదకరమైనదా?"

"అవును. మన పత్రికను అచ్చువేసే చోటికి నిన్ను పంపుతున్నాను. ఏమైనా సరే, వచ్చే సంచికలో 'గుంట కోపెక్కు' కథ అచ్చు కావాలి."

"అట్లాగే! వెడతాను."

తన కొడుకు తనకి పని చెప్పడం ఇదే మొదటి సారి. అతడు ఏమీ దాచకుండా తనకు చెపుతున్నందుకు ఆమె చాలా సంతోషించింది.

తలనొప్పి కారణంగా పావెల్ సోమవారం నాడు కూడా ఫ్యాక్టరీ కెళ్లలేదు. భోజనం చేసే సమయానికి ఫ్యాదొర్ మాజిన్ సంతోషంతోనూ ఆవేశంతోనూ రోజుకుంటూ వచ్చాడు.

"లేచి రావాలి! ఫ్యాక్టరీ అంతా ఒక్కసారి తిరుగుబాటు చేసింది. వాళ్లు నిన్ను తీసుకురమ్మని నన్ను పంపేరు. మిగిలిన వాళ్లందరి కంటే విషయాలన్నీ నువ్వు బాగా చెప్పగలవని సిజోవ్, మహోతిన్ అంటున్నారు. అక్కడ జరుగుతున్న సంఘటనలను నువ్వు చూసి తీరాలి!" అన్నాడు.

ఒక్క మాట మాట్లాడకుండా, పావెల్ బట్టలేసుకోవడం మొదలెట్టేడు.

"ఆడవాళ్లు కూడా వచ్చారు. వాళ్లు చాలా గోల చేస్తున్నారు" అన్నాడు ఫ్యాదొర్.

"అయితే నేనూ వస్తున్నాను. వాళ్ల ఉద్దేశమేమిటి? నేనూ వస్తున్నా!" అంది తల్లి.

"రా!' అన్నాడు పావెల్.

ముగ్గురూ మౌనంగా, గబగబ అడుగులేసుకుంటూ వీధిలో నడక సాగించారు. ఆవేశంవల్ల తల్లికి ఊపిరి పీల్చుకోవడమే కష్టమనిపించింది. అక్కడేదో చాలా ముఖ్యమైన సంఘటన జరుగబోతున్నట్లామె స్ఫురించింది. ఫ్యాక్టరీ గేటుదగ్గర చాలామంది స్త్రీలు గుంపులు గుంపులుగా చేరేరు. వాళ్లలో వాళ్లు అరుచుకుంటున్నారు, తోసుకుంటున్నారు. వాళ్లు ముగ్గురూ ఫ్యాక్టరీ ఆవరణలో ప్రవేశించేసరికి ఆవేశంతో బొబ్బలెడుతున్న జనం వాళ్లని చుట్టుముట్టారు. ఫౌండ్రీ ఇటుక గోడ నానుకుని పాత ఇనుప కమ్ముల గుట్టమీద సిజోవ్, మహోతిన్, వ్యాలొవ్,

పలుకుబడి కలిగిన మరో అయిదారుగురూ నిలబడుండడం తల్లి చూసింది. జనమంతా గోడకేసి దృష్టి నిలిపి చూస్తున్నారు.

"అడుగో వ్లాసొవ్ వస్తున్నాడు!" అని ఎవడో కేక వేశాడు.

"వ్లాసొవ్? అతన్నిక్కడకి రమ్మనమనండి!"

"నిశ్శబ్దం!" అని చాలామంది అరిచారు.

దగ్గరగా ఒక మూలనుంచి వడిదుడుకులులేని రీబిన్ కంఠస్వరం వినబడుతోంది : "మనం పోరాడేది ఒక కోపెక్కు కోసం కాదు. న్యాయం కోసం. అదంతే! మనం అంతగా పట్టుపట్టేది కోసెక్కు కాదు. కొంచెం బరువెక్కువైనా ఇతర నాణేల కన్న అదెక్కున గుండ్రమని కాదు. డైరెక్టరు రూబులులోకన్న మన కోపెక్కులో మానవ రక్తం ఎక్కువ ఉంది సిసలైన విలువ ఉన్నది కోసెక్కులో కాదు. రక్తంలో. న్యాయంలో!"

అతని మాటలు జనానికి బాగా నచ్చేయి. ఆనందంతో వాళ్లనేక విధాలుగా భేష్ అంటే భేష్ అన్నారు.

"సరిగా చెప్పేవు రీబిన్!"

"మహ బాగా చెప్పేవయ్యా, ఫైర్‌మన్!"

"ఇదుగో! వ్లాసొవ్!"

ఈ కంఠధ్వనులన్నీ ఏకమై, ఫ్యాక్టరీలోని మిషన్ల చప్పుడునూ, ఆవిరి గొట్టాల బుసబుసలనూ, తీగెల ఝూంకారాన్నీ ముంచేశాయి. చేతులు ఊపుకుంటూ జనం నాలుగు మూలల్నుంచీ పరుగెత్తుకొచ్చారు. ఒకళ్లనొకళ్లు వేళాకోళంగా పురికొల్పుకుంటూ ఆవేశపూరితులై చేరుకుంటున్నారు. అలసటతో విసుగు చెందిన హృదయాలలో అణగి ఉన్న అసంతృప్తికి ఇప్పుడు ప్రాణంవచ్చి, ఒక్కసారి పొంగి బయటపడే మార్గాన్ని చూసుకుంటూంది.

సిజోవ్, మహోతిన్‌లు నిలబడ్డ ఇనప జాలరుమీదకే పావెల్ కూడా ఎక్కేడు.

"కామ్రేడ్స్!" అన్నాడు.

ఆ మాటనుండి బలాన్నీ, ఆనందాన్నీ పుంజుకుంటూ :

"కామ్రేడ్స్!" అని పావెల్ రెట్టించాడు "చర్చిలనూ, ఫ్యాక్టరీలనూ కట్టేవాళ్లం మనమే. గొలుసులను చేసేవాళ్లం, నాణేలను అచ్చుగుద్దేవాళ్లం మనమే. ఉయ్యాలలోని పసిబిడ్డలు మొదలు, కాటికి కాళ్లు చాచుకున్న ముసలివాళ్లవరకూ అందరికీ ఆహారాన్నిచ్చి ప్రాణాలను రక్షించే జీవశక్తి మనమే."

"అదీ మాటంటే!" అని అరిచాడు రీబిన్.

"కామ్రేడ్స్! మనకు మనమే సహాయం చేసుకోవాలనీ, ఇతరులెవరూ మనకు తోడ్పడరనీ తెలుసుకోవలసిన సమయమొచ్చింది. మన నిరోధులను జయించాలంటే ఒకడికోసం అందరం, అందరికోసం ప్రతి ఒక్కడూ అనే సూత్రమే మనకు శరణ్యం."

"ఓయ్! అబ్బాయిలూ! అతడు మాట్లాడేదంతా నిజం!" అన్నాడు మహోతిన్, పిడికిలి ఊపుతూ.

"డైరెక్టర్ని పిలవండి!" పావెల్ ప్రతిపాదించాడు.

ఆ గుంపు నంతనూ ఒక పెనుగాలి ఊపేసినట్లయింది. వందలాది గొంతుకలు అరిచాయి :

"డైరక్టర్ని పిలవండి!"

"అతనికోసం ఓ రాయబారవర్గాన్ని పంపండి!" అంటూ జనం ఒక్కుమ్మడిగా కేకలెట్టేరు.

కోసుగెడ్డం కోలముఖం గల పొడుగాటి వ్యక్తి ముందుకు రావడానికి జనం దారిచ్చారు.

"నన్నెళ్లనియ్యండి" అని చేతుల్తో సౌంజ్ఞ చేసుకుంటూ డైరెక్టరు ముందు కెళ్లేడు. అతని ముఖం ధుమధుమలాడుతోంది. పెత్తందారీ అహంకార దృష్టితో అతను కార్మికులందర్నీ పరిశీలనగా చూశాడు. మామూలు మర్యాదకొద్దీ కార్మికులు తమ టోపీలను తీసి వంగి నమస్కరించారు.

"ఏమిటీ సంత? మీరంతా పనెందుకు మానేశారు?"

కొద్ది క్షణాలపాటు నిశ్శబ్దం ప్రబలింది. జొన్న కంకులు గాలికి ఊగినట్లుగా జనం తలలూపేరు. సిజోవ్ టోపీ ఊపి, భుజాలెగరేసి తలొంచుకున్నాడు.

"అడిగిందానికి సమాధానం చెప్పండి!" అని డైరెక్టరు అరిచాడు.

పావెల్ ముందుకొచ్చి, సిజోవ్‌నూ, రీబిన్‌నూ చూపిస్తూ,

"కోపెక్కు మినహాయింపు విషయంలో మీ ఆర్డరు రద్దుచేసుకోమని మిమ్మల్ని కోరడానికి కార్మిక సోదరులందరూ మా ముగ్గుర్నీ ప్రతినిధులుగా ఎన్నుకున్నారు" అన్నాడు బిగ్గరగా.

"చూస్తే, నువ్వు కొంచెం చదువుకున్నవాడివిలా కనిపిస్తున్నావు! నా పథకం వల్ల కలిగే ప్రయోజనం నీక్కూడా అర్థం కాలేదా?

"ఫ్యాక్టరీ స్వంత ఖర్చుతో మరుగెండకడితే దాని లాభం ఎవరికైనా కనబడుతుంది" అని అందరికీ వినబడేలా పావెల్ జవాబుచెప్పేడు.

"ఫ్యాక్టరీ ధర్మసంస్థ కాదు" అని డైరెక్టరు పుల్లవిరుపుగా చెప్పి, "మీరంతా వెంటనే పనిలో కెళ్లండి. ఇది నా ఆజ్ఞ!" అన్నాడు.

"పోయి ఆ పనేదో నువ్వే చెయ్యి!" అని నిశ్శబ్దాన్ని పటాపంచలు చేస్తూ ఎవరో దూరాన్నుంచి కెకేశాడు.

"మీరంతా పదిహేను నిముషాల్లో ఎవరి పనిలోకి వాళ్ళెళ్ళకపోతే, జరిమానా విధిస్తాను" అని డైరెక్టరు ఖచ్చితంగా ఆజ్ఞాపించాడు.

గుంపులోనుంచి మళ్లీ దారి చేసుకుంటూ అతడు వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు. అతని వెనుకనుంచి హోరుమని గోల బయల్దేరింది. అతడు దూరం వెళ్లేకొద్దీ గోల హెచ్చిపోయింది.

"రావయ్యా వ్లాసొవ్! మేమిప్పుడేమి చేయాలో చెప్పు"

ఈ కేకలు చాలా ఎక్కువైనాక పావెల్ జవాబుచెప్పేడు :

"కామ్రేడ్స్! కోపెక్కు మినహాయింపు ఉత్తరవును రద్దు చేస్తానని అతడు వాగ్దానం చేసేదాకా, మనం పని మానెయ్యాలి."

ఆవేశపూరితమైన వ్యాఖ్యానాలు బయల్దేరేయి.

"మనమంతా ఉట్టి దద్దమ్మలమనుకుంటున్నాడు కాబోలు!"

"అంటే సమ్మె అన్నమాట!"

"ఒక వెధవ కోసెక్కు కోసమే?"

"సమ్మె చేస్తే తప్పేమిటి?"

"మనందర్నీ పనిలోంచి తీసేస్తారు!"

"వాళ్లకి పనెవరు చేస్తారు?"

"అతనికి పనిచేసేవాళ్లు కావలసినంత మంది దొరుకుతారు."

"ఎవళ్లు? కుళ్లు వెధవలూ ద్రోహులూనా?"

పావెల్ మౌనం వహించాడు. తనమీద ఎంతో ఆశపెట్టుకుని చూస్తున్న జన సమూహం అతని కళ్ల ముందు ఆడింది. గుండె దడదడ కొట్టుకుంది. బాగా ఎండి నెరియలు తీసిన భూమిమీద పడిన వానచినుకులు అదృశ్యమైనట్లే, తాను చెప్పిన మాటల ప్రభావం జనంలో ఎక్కడా కనిపించకుండా పోయినట్లనిపించింది.

చాలా అలసిపోయి, విచారంగా పావెల్ ఇంటికి నడిచాడు. తల్లీ, సిజోవ్ అతనివెంట వెళ్లారు. రీబిన్ కూడా అతని పక్కన నడుస్తూ చెవిలో ఏదో గొణగొణలాడుతూనే వున్నాడు.

"నువ్వు బాగా మాట్లాడుతావు. కాని హృదయాన్ని స్పందింప చెయ్యలేవు. అదంతే! వాళ్ల హృదయాల కంటేటట్లు చెప్పాలి. గుండెల్లోపల నిప్పురవ్వ రగలించాలి! వాళ్లతో వాదించి ఒప్పించలేము. బిగుతు జోడు కాలి కెక్కదు."

రీబిన్ ముఖాన మబ్బులు అలముకున్నాయి. అతడు బాగా తబ్బిబ్బైపోయినట్లు కంఠ స్వరమే చెపుతోంది.

“జనం కేవలం ఒట్టి మాటలు చెపితే వినిపించుకోరు కొంత బాధపడాలి. మాటలను రక్తక్షాళితం చెయ్యాలి...”

ఆ రోజంతా పావెల్ చాలా విసుగుతోనూ విషాదంతోనూ తిరిగేడు. మతి మతిలో లేదు.

“పావెల్! ఏమిటలా ఉన్నావ్?” అని జాగ్రత్తగా అడిగింది.

“తలనొప్పిగా ఉంది.”

“పడుకో. డాక్టర్ని పిలుస్తాను.”

“వద్దమ్మా! మరేం ఫర్వాలేదులే” అని చప్పున జవాబుచెప్పి మెల్లగా తనలో తానే ఇలా గొణుక్కున్నాడు: “నేను చాలా చిన్నవాణ్ణి, బలహీనుణ్ణి. అదే కారణం. వాళ్లు నన్ను నమ్మలేదు. నేను చెప్పిన సలహాను వినిపించుకోలేదు. అంటే, దాన్ని ఎలా చెప్పాలో నాకు తెలియలేదన్నమాట. నా మనసేమీ బాగా లేదు. నామీద నాకే చిరాకొస్తోంది.”

తల్లి, చిరాకుగా వున్న అతని ముఖాన్ని చూసింది. అతని కెలాగైనా ఉపశమనం కలిగించాలని ప్రయత్నించింది.

“కొంచెం ఓపిక పట్టు... నువ్వు చెప్పేది ఈ రోజు గాకపోతే రేపు అర్థం చేసుకుంటారు” అని మెల్లగా అంది.

“అమ్మా నువ్వు చాలా అద్భుతమైన మనిషివమ్మా!” అని, వెనక్కి తిరిగాడు. ఆ మెత్తని మాటలు ఆమెకు చురకేసినట్లనిపించి ఉలికిపడింది. గుండెలమీద చేయి వేసుకుని అతని లాలిత్యాన్ని తలుచుకుంది. ఆమె అతని దగ్గర్నుంచి వెళ్లిపోయింది.

ఆ రాత్రి తల్లి నిద్రపోతోంది. పావెల్ ఇంకా తన మంచం మీద పడుకుని చదువుకుంటున్నాడు. పోలీసులొచ్చి చిరచిరలాడుతూ ఇల్లంతా గలభాచెయ్యడం మొదలెట్టారు. అటకమీద కెక్కారు. పెరడంతా గాలించారు. పసుపుపచ్చటి ముఖం ఆఫీసరు సరిగ్గా మొదటి సారొచ్చినపుడు చేసినంత హంగామా చేశాడు. మొదటిసారి సోదా జరిగినప్పుడు భయపడినంతగా ఆమె ఈ సారి భయపడలేదు. నిశాచరులైన ఈ బూడిద రంగు ఆగంతువులపట్ల ఆమెకు ద్వేషం బాగా హెచ్చింది. ఆ ద్వేషం ఆమె భయాన్ని మింగేసింది.

“నన్ను పట్టుకుపోతారు” అన్నాడు గుసగుసగా పావెల్.

“నాకు తెలుసు” తలొంచుకుని తల్లి మెల్లగా బదులుచెప్పింది.

నీలొవ్నా కొడుకునొక్కసారి కౌగలించుకుని ఏడవాలనుకుంది. కాని ఆఫీసరు కళ్లు చిట్లించుకుంటూ తన పక్కనే నిలబడున్నాడు. అతడి పెదవులు, మీసాలు అదురుతున్నాయి. తల్లి కన్నీళ్లనూ ఆక్రందనాన్నీ వేడికోలునూ చూడ్డానికి అతడు కనిపెట్టుకుని ఉన్నట్లామెకు తోచింది. తనలో ఉన్న శక్తినంతా పుంజుకుని సాధ్యమైనంత తక్కువ మాట్లాడేందుకు ప్రయత్నింస్తూ కొడుకు చేతిని గట్టిగా పట్టుకుని ఊపిరి బిగబట్టి మృదువుగా మెల్లగా ఇలా చెప్పింది :

"పాషా! వెళ్లిరా. కావలసిన వస్తువులన్నీ తీసుకున్నావా?"

"తీసుకున్నానమ్మా! బెంగపెట్టుకోకు."

"దేవుడు నిన్ను చల్లగా చూడాలి."

* * *

చలి బాగా వేస్తోంది. కిటికీలమీద వర్షపు జల్లు కొడుతోంది. బూడిద రంగు దుస్తుల జనాభా, తమ పొడుగాటి చేతుల్తో కళ్లు మూసుకుపోయిన ఎర్రటి గుండు ముఖాల్తో ఇంటి చుట్టూ రాత్రంతా బూట్ల స్పర్స్ చప్పుడు చేసుకుంటూ తిరుగాడుతున్నట్లే ఆమెకు తోచింది.

"నన్ను కూడా పట్టుకుపోతే బాగుండేది!" అనుకుందామె.

కార్మికులను పనిలో హాజరుకమ్మని ఆజ్ఞాపిస్తూ ఫ్యాక్టరీ కూసింది. ఈరోజు కూత చాలా నెమ్మదిగానూ, బొంగురుగానూ ఉన్నట్లామె కనిపించింది. తలుపు తెరుచుకుని రీబిన్ లోపలికొచ్చాడు.

గడ్డం మీద పడిన వర్షపు చినుకులను తుడుచుకుంటూ :

"అతన్ని తీసుకెళ్లిపోయారా?" అని అడిగేడు.

"ఆ! తీసుకుపోయారు. దుర్మార్గులు!" అని ఆమె నిట్టూర్పు విడిచింది.

రీబిన్ ఒక చిన్ననవ్వు నవ్వి ఇలా అన్నాడు :

"అనుకున్నదే. నా కొంపా సోదా చేశారు. అన్నీ చేతుల్తో పట్టి చూశారు. తెగ తిట్టుకున్నారు. కాని అపకార మేమీ చేయలేదు. సరి! అయితే పావెల్‌ను పట్టుకున్నారన్నమాట! డైరెక్టరు కనుసైగ చేస్తాడు, పోలీసు తలూపుతాడు మరొక మనిషి కాళీ! బాగుంది వరస! వాళ్లూ వాళ్లూ ఒకటే. ఒకడు జనం కొమ్ములు పట్టుకుంటాడు. రెండోవాడు పూర్తిగా పాలు పిండేస్తాడు!"

"పావెల్‌కి మీరంతా అండగా నిలబడాలి! అతను చేసిన పని అందరికోసమే కదా!" లేచి నిలబడుతూ అంది తల్లి.

“ఎవరు నిలబడాలి?” అని అడిగాడు రీబిన్.

“అంతా!”

“హూ! నువ్వలా అనుకుంటున్నావ్! కాని అలా జరగదు!”

ఒక నవ్వు నవ్వి కాళ్లీడ్చుకుంటూ రీబిన్ వెళ్లిపోయాడు. అతడన్న నిరాశాపూరితమైన మాటలవల్ల తల్లి దుఃఖం యినుమడించింది.

“వాడిని కొడతారేమో! హింస పెడతారేమో....”

తన కొడుకు శరీరమంతా దెబ్బలతో పుండు పడినట్లూ, రక్తాలు కారుతున్నట్లూ ఆమె భ్రమచెందింది. మంచుముద్దలా ఆమె హృదయాన్ని భయమావహించింది. కళ్లు మంటలెత్తేయి.

ఆ రోజంతా ఆమె కుంపటి ముట్టించలేదు, భోజనం చేయలేదు, టీ కూడా తాగలేదు. రాత్రి ఆలస్యంగా ఒక రొట్టె ముక్క తింది. ఆమె రాత్రి పడుకున్నపుడు జీవితమంతా ఖాళీగా కనబడింది. ఇంతటి ఒంటరితనాన్నెప్పుడూ ఆమె ఎరగదు. ఇటీవల కొన్నేళ్లుగా ఆమె ఏదో ముఖ్యమైనదాన్ని ఆకాంక్షిస్తూ కాలం గడిపేందుకు ఆలవాటు పడింది. ఏదో అలజడిగా పనిచేస్తూ, ముఖాలు కళకళలాడే యువజనుమధ్య ఆమె జీవిస్తోంది. ప్రమాదకరమైన ఈ మంచి జీవితాని కంతకీ కారకుడైన తన కుమారుని గంభీరమైన ముఖం ఆమె కళ్ల ఎదుట ఉండేది. అతడిప్పుడు వెళ్లిపోవడంతో ఆమెకింక అంతా పోయినట్లే అనిపించసాగింది.

మరునాటి పగలూ, కన్ను మూతపడని ఆ రాత్రీ భారంగా మరుసటి దినం అంతకంటే భారంగా గడిచంది. తన దగ్గరకెవరో వస్తారని ఎదురుచూసింది. కాని ఎవరూ రాలేదు. సాయంకాలమైంది. రాత్రి చీకటి పడింది. చలిగాలీ వర్షం ప్రారంభమయాయి. వర్షపు జల్లులు గోడలకు కొడుతున్నాయి.

ఇంతలో ఎవరో కిటికీ తలుపు తట్టినట్లయింది. ఏదో ఆశకొద్దీ గభాలున లేచింది. భుజాల మీద శాలువ కప్పుకుని తలుపు తెరిచింది.

సమోయ్‌లొవ్ లోపలికొచ్చాడు. అతని వెంట తిరగేసిన కోటు కాలరుతోనూ, టోపితోనూ ముఖం కప్పుకున్న వ్యక్తి ప్రవేశించాడు.

సమోయ్‌లొవ్ వెంట వచ్చిన వ్యక్తి టోపీ తీసేసి, రాసిన గొంతుక సవరించుకుని,

“ఏవమ్మా! నన్ను గుర్తుపట్టలేదా ఏమి?” అని చాలా కాలంనుంచి ఎరిగిన మనిషి లాగున తన కురుచ చేయందిచ్చాడు.

“మీరా నాయనా! యెగోర్ ఇవానొవిచ్!” అంటూ ఆమె బిగ్గరగా ఆనందాన్ని వెలిబుచ్చింది.

యెగోర్ చర్చిగాయకుడిలాగ పొడుగాటి జుట్టు గలిగిన పెద్ద తలకాయను ముందుకు వంచి, "నేనే!" నని సమాధానం చెప్పేడు. అతడి ముఖంమీద చిరునవ్వు ఒక్క వెలుగు వెలిగింది. బూడిదవన్నె చిన్న కళ్లతో అతడు ఎంతో అనురాగంతో తల్లికేసి చూశాడు.

"మీ దగ్గరికి ఒక పనిమీద వచ్చాం" అన్నాడు సమోయ్‌లొవ్ తల్లితో.

"ఈవేళ ఉదయం నికొలాయ్ ఇవానొవిచ్ జైలునుంచి విడుదలయాడమ్మా!"

"రెండు నెల్ల పదకొండు రోజులున్నాడు. హొహోల్‌ని చూశాడు. అతడు మిమ్మల్నడిగేనని చెప్పమన్నాడు. పావెల్ కూడా మిమ్మల్ని బెంగ పెట్టుకోవద్దన్నాడు. తనలా జీవించే వాళ్లందరికీ మధ్య మధ్య జైలులోనే విశ్రాంతి లభిస్తూ వుంటుందని మీకు చెప్పమన్నాడు. మరి అసలు సంగతి కొద్దాం! నిన్న ఎంతమందిని అరెస్టు చేశారో మీకు తెలుసా?"

"ఏమిటి? పావెల్‌నే కాకుండా వేరే వాళ్లని కూడా అరెస్టు చేశారేమిటి!" అని ఆశ్చర్యంగా అడిగింది తల్లి.

"ఇతను నలభై తొమ్మిదోవాడు...బహుశా ఫ్యాక్టరీ యజమానులు మరో డజనుమందిని అరెస్టు చేయిస్తారు. ఉదాహరణకి ఈ పెద్దమనిషిని పట్టేస్తారు" అన్నాడు యెగోర్ తాపీగా.

"అవును. నన్ను కూడా!" కొంచెం విచారంగా అన్నాడు సమోయ్‌లొవ్.

ఎందుకో కాని వ్లాసొవాకి కొంత పూరట కలిగింది.

"కీడులో మేలు వాడక్కడ ఒంటరిగా లేడు" అనే భావం ఆమె మనస్సులో మెరిసింది.

దుస్తులు ధరించి, సంతోషంగా అతిథులను కలుసుకుంది.

"ఇంతమందిని పట్టుకుంటే, బహుశా వాళ్లను చాలా కాలముంచుతారనుకోను."

"అలాగే! ఉంచరు.... ఒక్కసారి వాళ్లాడే ఈ ఆటని కట్టించామా, తోకముడిచి పారిపోతారు. దాని సూక్ష్మమేమంటే, ఇప్పుడు ఫ్యాక్టరీలో కరపత్రాలు పంచిపెట్టడం మానేసినట్లయితే పోలీసులు ఆ సంగతి నాధారం చేసుకుని పావెల్ మీదా, జైళ్లలో మగ్గుతూన్న ఇతర మిత్రుల మీదా నేరం మోపు చేస్తారు" అన్నాడు యెగోర్ ఇవానొవిచ్.

"అదెట్లా?" అని భయపడుతూ తల్లి అడిగింది.

యెగోర్ ఇనానొవిచ్ నిదానంగా జవాబుచెప్పేడు :

"ఎట్లాగేముంది? స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఒక్కొక్కప్పుడు పోలీసుల బుర్రలు కూడా సరిగానే పనిచేస్తాయి. మీ మటుకు మీరే ఆలోచించుకోండి పావెల్ జైల్లో లేనప్పుడు కరపత్రాలు, కాగితాలు ఫ్యాక్టరీలో కొచ్చేవి. అతడిని జైల్లో పెట్టగానే కరపత్రాలూ లేవు, కాగితాలూ లేవు. కనుక అతడే ఈ కాగితాలను విరజల్లుతున్నాడని అర్థం! అంతేనా?

"సరి. సరి! ఇప్పుడు నా కర్థమైంది. అయ్యో పాపం! వాళ్లకోసం మనమిప్పుడేం చెయ్యాలి?" అని తల్లి విషాదంగా అడిగింది.

"వాళ్లు దాదాపు అందర్నీ పట్టేశారు. వాళ్లని కాకులకూ గద్దలకూ వెయ్యా!" అంటూ సమోయ్‌లొవ్ వంటింట్లోంనుంచి కేకేశాడు. "మనం ఇప్పుడు చేస్తున్న పనిని, మన ఉద్యమంకోసమే కాకుండా, జైల్లో ఉన్న మిత్రులను కాపాడుకునేందుకు కూడా కొనసాగించాలి" అన్నాడు.

"కాని పనిచేసేవాళ్లెవరూ లేరు..' అని చిరునవ్వు నవ్వి ఇలా అన్నాడు: "ఒకటో రకమైన కరపత్రాలు తయారుగా ఉన్నాయి. అన్నీ నా చేత్తో తయారుచేశాను. వాటిని ఫ్యాక్టరీలోకి ఏ విధంగా చేర్చాలన్న సమస్యే తేలడం లేదు."

"లోపలికెళ్లే గేటు దగ్గరే అందర్నీ సోదా చూడ్డం మొదలెట్టారు" అన్నాడు సమోయ్‌లొవ్.

తనేదో కొంత పనిచెయ్యాలనే అభిప్రాయం వాళ్లకున్నట్లు తల్లి గ్రహించింది.

"ఆ పని ఏ విధంగా చేయడానికి వీలుంది?" అని ఆత్రంగా అడిగింది.

సమోయ్‌లొవ్ గుమ్మం దగ్గర నిలబడి,

"పెలగేయా నీలొవ్నా! ఫ్యాక్టరీలో తినుబండారాలమ్మే మార్యా కోర్‌సునొవాతో మీకు పరిచయముందా?" అని అడిగేడు.

"ఉంది. ఎందుకూ?"

"ఆవిడతో మాట్లాడి చూడండి. వాటినేమైనా లోపలికి తీసుకెళ్ల గలదేమో?"

తల్లి చేయూపి అలాటి ఆలోచన లాభం లేదని చెప్పింది.

"కుదరదు. ఆమె వల్ల కాదు! ఆమె శుద్ధ వాగుడు పిట్ట. ఆ కాగితాలు నాద్వారా వచ్చాయని, ఈ ఇంట్లో నుంచి వచ్చాయని ఇట్టే తెలిసిపోతుంది. వద్దు" అంది. చటుక్కున ఆమెకొక ఆవేశం కలిగింది. "వాటిని నాకివ్వండి. నే నా పని చేస్తాను. దానికేదో మార్గం నేనే ఆలోచిస్తాను. మార్యాను తనకు సాయంగా నన్ను తీసుకెళ్ల మంటాను. ఏదో విధంగా నేను పొట్టపోసుకోవాలి కదా! ఫ్యాక్టరీలో తినుబండారాలమ్ముకుంటాను. నేనెలాగో ఓలాగ పని జరిపిస్తాను."

తల్లి తన చేతుల్ని గుండెలమీద అదిమి పట్టుకుని ఈ పనంతా ఎవరికీ అనుమానం కలగకుండా తను చేస్తానని తొందరగా హామీ ఇచ్చింది. సంతోషంతో పొంగిపోయి :

"జైల్లోనుంచి కూడా పావెల్ ఈ పనిని చేయగలడని వాళ్లు తెలుసుకోవాలి! ఆ సంగతి తెలుసుకుంటారుగా!" అంది.

ముగ్గురూ చాలా సంతోషపరవశులైనారు.

“నేను చేయవలసిన పనంతా చేస్తానని మావాడితో చెప్పండి. ఆ సంగతి వాడికి తెలియాలి!”

మర్నాడు పొద్దున్నే ఆమె మార్యా కోర్‌సునొవాను కలుసుకోవడానికెళ్లింది.

మార్యా యథాప్రకారంగానే, జిడ్డోడుతూ లొడలొడ మాట్లాడుతూ, తల్లిని సానుభూతితో పలకరించింది.

జిడ్డు చేత్తో తల్లి వీపుమీద తట్టి యిలా అంది :

“దిగులు పడ్డావా? పడకు! అతడిని పట్టుకుపోయారా? సరే. పట్టుకుపోనియ్యి! మనం సిగ్గుపడవలసిం దేమీ లేదు. మునుపు దొంగతనాలు చేసినవాళ్లను ఖైదు చేసేవారు. ఈ రోజుల్లో న్యాయంతప్పని వాళ్లని ఖైదులోకి పంపుతున్నారు. పావెల్ నేనే మీ యింటికొచ్చి నిన్ను చూసి పోదామనుకున్నాను. కాని తీరుబడి లేకపోయింది. రోజంతా వంటకాలు తయారుచెయ్యడం, అమ్మడంతో సరిపోతుంది. ఇంతా చేస్తే ఏమీ మిగలదు. నువ్వు చూస్తావుగా! ముష్టి ముండనై చస్తాను.

పెలగేయా ఆమె సోదె కడ్డెళ్లింది :

“నన్ను సహాయకురాలిగా తీసుకోమని నిన్నడగడానికి కొచ్చాను.”

“అదేమిటి” అని మార్యా ఆశ్చర్యపడింది. పెలగేయా వివరంగా సంగతులన్నీ చెప్పే సరికి మార్యా అంగీకరించింది.

ఈ సంభాషణ పర్యవసానంగా మర్నాడు మధ్యాహ్నం, మార్యా తయారుచేసిన రెండు బుట్టల తినుబండారాలతో తల్లి ఫ్యాక్టరీకెళ్లింది. మార్యా బజారులో వ్యాపారం చేసుకోడానికి వెళ్లింది.

సరుకులు అమ్మకానికి తెచ్చిన కొత్త వ్యాపారస్తురాలిని కార్మికులు వెంటనే గుర్తుపట్టేశారు.

“వ్యాపారంలోకి దిగేనా, నీలొవ్నా?” అని ఆమోదసూచకంగా తలలూపుతూ అడిగేరు.

కొందరు పావెల్‌ను తొందరలోనే విడుదల చేస్తారని ఆమెకు హామీ ఇచ్చారు. మరికొందరు తమ సానుభూతిని వ్యక్తపరచారు. ఇంకా కొందరు డైరెక్టరునూ, పోలీసులనూ బండబూతులు తిట్టేరు. వాళ్లు బాగానే తిట్టేరన్నట్లనిపించింది తల్లికి. జరిగిన పనికి సంతృప్తితో ఆమెను చూచి పండ్లికిలించేవారు. కూడా లేకపోలేదు. టైం కీపరు ఇసాయ్ గొర్‌బోవ్, పళ్లు పటపట కొరికి ఇలా అన్నాడు :

“నేనే గవర్నరునైతేనా నా కొడుకుని ఉరితీసేవాడిని! జనాన్ని తప్పు దారికి మళ్లించే వాళ్లకంతే శిక్ష!”

ఈ దుర్మార్గుని బెదిరింపు ఆమెను నిశ్చేష్టురాలినిగా చేసింది. ఇసాయ్‌కి ఆమె బదులు చెప్పలేదు.

ఫ్యాక్టరీ అంతా గంద్రగోళంగా ఉంది. కార్మికులందరూ చిన్న చిన్న గుంపులుగా చేరి గుసగుసలాడుకుంటున్నారు. మేస్త్రీలు ఆదుర్దాగా అటూ ఇటూ తిరుగుతున్నారు. మధ్య మధ్య తిట్లూ వెటకారపు పకపకలూ వినబడుతున్నాయి.

ఇద్దరు పోలీసులు సమోయ్‌లోవ్‌ను ఆమె ముందుర నుంచి తీసుకెడుతున్నారు. అతడొక చెయ్యి జేబులో పెట్టుకుని రెండో చేత్తో ఎర్రని తలవెంట్రుకలను వెనక్కి దువ్వుకుంటున్నాడు.

సుమారొక వందమంది కార్మికులు పోలీసులను తిడుతూ, వేళాకోళం చేస్తూ వాళ్ల వెంటబడ్డారు.

"ఒక ముందు దొంగల్ని పట్టుకుంటే ఏమీ ప్రయోజనం లేనట్లు తోస్తుంది. కనుక నిజాయితీపరుల్ని పట్టుకోవడం మొదలెట్టారు!" అని ఒక పొడుగాటి ఒంటి కన్ను కార్మికుడు కేకేశాడు.

సమోయ్‌లొవ్ తల్లిముందురగా వెడుతూ తలూపేడు.

"నన్ను లాక్కుపోతున్నారమ్మా!" అని సన్నగా నవ్వుతూ చెప్పేడు.

ఆమె నిశ్శబ్దంగా తలొంచింది. నిజాయితీపరులూ, నిదానస్థులూ అయిన ఈ యువకులందరూ నవ్వుతూ సరదాగా జైలుకెళ్లడం ఆమె మాతృహృదయాన్ని ఎంతో స్పందింపచేసింది. వాళ్లంటే జాలి కలిగింది.

* * *

ఫ్యాక్టరీ నుంచి తిరిగి రావడంతోనే ఆ రోజంతా ఆమె మార్యాతో కాలక్షేపం చేసింది. ఆమె చెప్పే సోదె అంతా వింటూ ఆమె చేస్తున్న పనికి తల్లి సాయపడింది. రాత్రి బాగా పొద్దు పోయాక, కళాహీనంగా, నిరుత్సాహ పూరితంగా శూన్యంగా వున్న తన ఇంటికి చేరుకుంది. చాలా సేపు ఏమి చేయాలో తోచక అశాంతితో లక్ష్యరహితంగా అటూ ఇటూ తిరిగింది. రాత్రి బాగా పొద్దుపోయినా యెగోర్ ఇవానొవిచ్ తెస్తానని చెప్పిన కరపత్రాలనింకా తీసుకు రానందుకు ఆమె చాలా ఆందోళన పడింది.

ఎవరో మెల్లగా తలుపు తట్టేరు. తల్లి గభాలున లేచి తలుపు గడియ తీసింది. సాషాలోపలికొచ్చింది. తల్లి ఆమెను చూచి చాలా కాలమైంది. చూడగానే ఆమె వికారంగా, లావెక్కినట్లు తల్లికి తోచింది.

"క్షేమంగా వున్నారా? మిమ్మల్ని చూచి చాలా కాలమైంది. ఏ వూరైనా వెళ్లేరా?" అని సాషాను పలకరించింది. ఈ రాత్రి కొంత సేపైనా తను ఒంటరిగా ఉండక్కర్లేదు కదా అని సంతుష్టి చెందింది.

"కరపత్రాలూ, కాగితాలూ తెచ్చాను."

"ఏవి, ఇలాతే!" ఆత్రంగా అంది తల్లి.

ఆ అమ్మాయి కోటు బొత్తాములు విప్పి వదులు చేసి, ఒక్కసారిగా దులిపింది. చెట్టు మీదనుంచి ఆకులు రాలినట్లు కాగితాలు జలజల రాలేయి. నవ్వుకుంటూ తల్లి వాటి నన్నిటినీ ఏరింది.

"మిమ్మల్ని చూడగానే, ఏమిటా ఇలా వికారంగా లావెక్కేరని ఆశ్చర్యపోయాను. పెళ్లి చేసుకున్నారు కాబోలు, గర్భిణితో ఉన్నారేమోననుకున్నాను. అయ్యో, అయ్యో ఎన్ని పట్టుకొచ్చారు! ఇంత దూరం నడిచే వచ్చారా?"

"అవును" అంది సాషా. మునుపటిలాగే ఆమె సన్నగా పొడుగ్గా ఉంది. కాని ఆమె బుగ్గలు గుంటలుపడినట్లు తల్లికి తోచింది. కండ్లు పెద్దవైనట్టుగా కనబడ్డాయి. కళ్లకింద నల్లటి గుండ్రటి రేఖలగుపడ్డాయి.

"ఎన్ని చెప్పినా, జైలు మనిషిని నీరసింపచేస్తుంది. అబ్బ! దిక్కుమాలిన సోమరితనం! అంతకన్న అధ్వాన్నమైనదింకొకటి లేదు. చేయవలసిన పని ఇంత ఉన్నదని తెలిసి కూడా, అక్కడ బోనులోని జంతువులా ఉండడం మహా కష్టం!" అన్నది సాషా.

"ఇంతా చేస్తే మీకు కిరీటం పెట్టేదెవరు?" అని తల్లి నిట్టూర్పు విడిచింది. తనకు తానే ఇలా జవాబుచెప్పుకుంది: "ఎవరు మెచ్చి ఏమిస్తారు? భగవంతుడు తప్ప? మీకు భగవంతుడిమీద కూడా నమ్మకం లేదాయె!"

"లేదు" అని తలూపుతూ సాషా జవాబుచెప్పింది.

"అదెలాగ?" అంది తల్లి, అప్రయత్నంగా. తుండు గుడ్డతో చేతి మసిని తుడుచుకుంది. గాఢమైన విశ్వాసంతో ఇంకా ఇలా చెప్పింది: "మీ మతమేమిటో మీరు తెలుసుకోరు. దేవుడిమీద విశ్వాసం లేకుండా ఇలాటి జీవితమెలా సాగించగలుగుతున్నారు?"

ఇంతలో ఎవరో దబదబ అడుగులేస్తూ గొణుక్కుంటూ గుమ్మమెక్కిన చప్పుడైంది. తల్లి ఉలికి పడింది. సాషా కూడా చటుక్కున లేచింది. మెల్లగా తల్లి చెవిలో చెప్పింది :

"తలుపు తియ్యకండి. వచ్చింది పోలీసువాళ్లైతే మీరు నన్నెరగనని చెప్పండి. చీకట్లో నేను దారి తప్పి మీ ఇంటికి వచ్చాననీ, గుమ్మంలో స్పృహ తప్పి పడుంటే లోపలికి మీరు తీసుకొచ్చి, దుస్తులు వదులు చేస్తే కరపత్రాలు దొరికేయని చెప్పండి. తెలిసిందాండి?"

తల్లికి చాలా జాలి కలిగింది.

"అమ్మడూ! నేనెందుకలా చెప్పాలమ్మా"

"ఒక్క క్షణమాగండి. ఆ వచ్చినది యెగోర్ కావచ్చు" అని తలుపు దగ్గర చెవిపెట్టి ఆలకించింది.

వచ్చినవాడు యెగోర్. శరీరమంతా తడిసిపోయింది. అలసట చేత ఆయాస పడుతున్నాడు.

"ఓహో! సమొవార్ మరుగుతోందన్నమాటే! బాగుంది. అమ్మా! మనిషిని ఉత్సాహపరచడానికి సమొవార్‌ని మించిన దింకొకటి లేదు. సాషా! అప్పుడే ఇక్కడకొచ్చావు?"

అతడు నిర్విరామంగా మాట్లాడుతూ బరువైన కోటును నెమ్మదిగా విప్పేశాడు. అతని బొంగురు ఉచ్ఛ్వాస విశ్వాసాలతో వంటిల్లంతా నిండిపోయింది.

"అమ్మా, జైలు అధికారులకు ఈ పిల్లంటే గిట్టదు. జైలరు ఈమెపట్ల అ గౌరవంగా ప్రవర్తించినప్పుడు, అతడు క్షమార్పణ చేసేవరకూ నిరశదీక్ష పట్టింది. ఎనిమిది రోజుల వరకూ ఈమె ఏవిధమైన ఆహారాలన్నీ మట్టుకోలేదు. మాకిక దక్కదనే అనుకున్నాం. నా పొట్టలాంటి పొట్ట ఎక్కడైనా చూశారూ?"

అదే పనిగా అలా మాట్లాడుతూనే, అసహ్యంగా కిందికి వాలిపోతూన్న పొట్టను చేతులతో పట్టుకుని ఇంకో గదిలోకెళ్లి తలుపు మూసుకుని అక్కడనుంచి కూడా ఏమేమిటో మాట్లాడాడు.

"నిజంగా మీరు ఎనిమిది రోజుల పాటు పచ్చిమంచినీళ్లు కూడా తీసుకోకుండా ఉపవాసం చేశారా?" అని ఆశ్చర్యంతో సాషా నడిగింది తల్లి.

"అతనిచేత క్షమార్పణ చెప్పించడానికి అలా చెయ్యక తప్పిందికాదు" అని జవాబు చెప్పింది సాషా. ఆమె ఇంకా చలితో వణుకుతూనే ఉంది. ఆమె చెప్పే ధోరణిలో కొంత మొండి పట్టుదలా, పెంకుతనం తల్లికి గోచరించాయి.

"మీరే నన్ను క్షమించాలి. ఈ పనిని నేనే నామీద వేసుకున్నాను. అప్పుడే పదకొండైంది. నేనింకా చాలా దూరం నడిచిపోవాలి.

"ఇప్పుడెక్కడికీ? పట్టణానికే?"

"అవును."

"ఇప్పుడెళ్లకపోతేనేం? బయట బాగా చీకటిగా, చలిగా ఉంది. పైగా మీరు బాగా అలసిపోయి ఉన్నారు. ఈ రాత్రి ఇక్కడే పడుకొండి. యెగోర్ ఇవానొవిచ్ వంటింట్లో పడుకుంటారు. మీరూ నేనూ ఇక్కడ పడుకుందా."

"వీల్లేదు. నేను వెళ్లి తీరాలి" అంది సాషా.

"దురదృష్టవశాత్తూ ఆ అమ్మాయి వెళ్లక తప్పదమ్మా! ఇక్కడ ఆమెనందరూ ఎరుగుదురు. రేపు ఈ వీధులలో ఆమె కనబడ్డం అంత మంచిది కాదు."

టీ తాగడంతోనే సాషా నిశ్శబ్దంగా యెగోర్‌తో కరచాలనం చేసి వంటింట్లో కెళ్లింది. తల్లి కూడా ఆమెవెంట వెళ్లింది.

"మీరు పావెల్‌ను చూస్తే, నేను అతన్ని చాలా చాలా అడిగానని చెప్పండి. మరచిపోకండి సుమా!" అంది సాషా.

తలుపుగడియమీద చేయి వేసి ఆమె చటుక్కున వెనక్కు తిరిగి: "మిమ్మల్నొకసారి ముద్దుపెట్టుకునేదా?" అని అడిగింది.

తల్లి మౌనంగా ఆమెను కౌగిలించుకుని ఆప్యాయతతో ముద్దుపెట్టుకుంది.

సాషా తల్లికి నమస్కారం చెప్పి శలవు తీసుకుని వెళ్లిపోయింది.

సాషాను పంపించి తల్లి గదిలోకొచ్చి ఆదుర్దాగా కిటికీలోనుంచి బయటకు దృష్టి సారించింది. చీకట్లో మంచు దూది పింజల మాదిరిగా రాలుతోంది.

"ప్రోజొరవ్‌లు జ్ఞాపకమున్నారా?" అని యెగొర్ అడిగాడు.

అతడు కాళ్లు జాపుకుని కూర్చుని నోటితో శబ్దం చేస్తూ టీని ఊదుకుంటున్నాడు. ముఖం ఎర్రగా, చిరుచెమటతో సంతృప్తి సూచకంగా ఉంది.

"ఆ! జ్ఞాపకముంది" అని తల్లి ఆలోచిస్తూ బల్ల దగ్గరగా వెళ్లి చెప్పింది. ఆమె విచారంగా యెగోర్ కేసి చూస్తూ కూచుంది.

"అయ్యయ్యో! ఆ సాషా! పట్టణానికి ఎప్పటికి చేరుకోగలుగుతుంది?"

"నిజమే. ఆమె చాలా అలసిపోయింది....జైలు జీవితం ఆమెకేమీ మంచి చేయలేదు. ఇదివరకింకా బలంగా ఉండేది. పైగా ఆమె సుకుమారంగా పెరిగింది... ఆమె ఊపిరితిత్తులలో చిన్న మచ్చ పడినట్లే ఉంది."

"ఇంతకూ ఆమె ఎవరు?"

"ఒక పల్లెటూరి భూస్వామి కూతురు. ఆమె చెప్పేమాటల ప్రకారమైతే అతడొకపంది.... వీళ్లిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఆ సంగతి మీకు తెలుసా?"

"ఎవరిద్దరూ?"

"ఆమె, పావెల్. కాని అదేమీ సందర్భపడలేదు. అతడు బయట ఉంటే ఆమె జైల్లో ఉంటోంది. ఆమె బయటకొస్తే అతడు జైల్లో ఉంటున్నాడు."

"నాకేమీ తెలియదే" అంటూ తల్లి ఒక క్షణమాగి, "పావెల్ తన స్వవిషయాన్ని గురించి నాతో ప్రస్తావించడు" అంది.

ఈ సంగతి తెలిశాక, తల్లికి ఆ పిల్లమీద మరింత జాలి కలిగింది.

"ఆ అమ్మాయి మంచిది" అన్నది తల్లి. యెగోర్ ఇప్పుడే చెప్పిన విషయాన్ని గురించి ఆలోచనలో మునిగింది. ఇటువంటి విషయాన్ని తన కొడుకు ద్వారా కాకుండా పరాయివాడి ద్వారా తెలుసుకున్నందుకు ఆమెకు కష్టం తోచింది. రోషంతో పెదవులు కొరుక్కుంది.

"అవును. మంచిదే... మీకామెపట్ల జాలి కలుగుతోందని నాకు తెలుస్తూనే ఉంది. కాని అందువల్ల ఏమీ ప్రయోజనం లేదు.....మాలాటి విప్లవకారులను గురించి జాలి పడడం ప్రారంభిస్తే, మీ గుండె పగిలిపోతుంది. నిజం చెప్పాలంటే, మా జీవితాలకు సుఖం అంటూ ఉండదు. మా స్నేహితుడొకడు ఈ మధ్యనే ప్రవాసంనుంచి తిరిగి వచ్చాడు. అతడు నీజ్ని నోవ్‌గొరొద్ చేరేసరికి అతని భార్యా, పిల్లా స్మొలెన్స్క్ దగ్గర అతడికోసం కనిపెట్టుకు కూచున్నారు. తీరా అతడు స్మొలేన్స్క్ చేరేసరికి భార్యనీ, బిడ్డనూ మాస్కో జైలుకు తీసుకుపోయారు. ఈ సారి సైబీరియా ప్రవాసం భార్య వంతు. నాక్కూడా భార్య ఉండేది. అద్భుతమైన మనిషి. అయిదేళ్లపాటు అలాటి జీవితాన్నే గడిపేసరికి ఆమెకు గోరీ కట్టవలసొచ్చింది."

యెగోర్ ఒక్క గుటకలో టీ తాగేసి తన కథను సాగించాడు. తను ఎన్నేళ్లు, ఎన్ని నెలలు జైలు శిక్షలననుభవించాడో తల్లికి వివరంగా చెప్పేడు. ఎంతకాలం ప్రవాసంలో ఉన్నాడో వివరించాడు. జైళ్లలో పడ్డ కష్టాలనూ, తిన్న దెబ్బలనూ విశదంగా తెలియజేశాడు. సైబీరియాలో ఆకలి బాధతో పడిన కడగండ్లన్నిటినీ చెప్పేడు. ఇంతటి కష్టభూయిష్ఠమైన కథను యెగోర్ ఏమీ తొణుకూ బెణుకూ లేకుండా అతి సామాన్య సంగతిగా చెపుతుంటే తల్లి ఆశ్చర్యంగా అతడికేసి చూస్తోంది.

చటుక్కున అతడు :

"ఇక మన పనిలో కొద్దాం" అన్నాడు.

అతని గొంతుక మారిపోయింది. ముఖం చాలా తీవ్రస్వరూపం దాల్చింది. కరపత్రాలను ఆమె ఫ్యాక్టరీలోకెలా పట్టుకెళ్లాలనుకుంటున్నదో చెప్పమన్నాడు. అతనికి ఇన్ని వివరాలు ఎట్లా తెలుసునాయని తల్లి ఆశ్చర్యపడింది.

యెగోర్ నవ్వు ముఖంతో :

"అమ్మా! మీరు చాలా అలసిపోయారు. ఇక పడుకుందాం" అన్నాడు.

ఆమె యెగోర్‌కు శలవు చెప్పి మెల్లగా వంటింట్లోకి వెళ్లిపోయింది. తన కొడుకు తన ప్రేమ విషయాన్ని తనకు చెప్పకుండా దాచిపెట్టినందుకు ఆమె హృదయం చాలా రోషపూరితమైంది.

మధ్యాహ్నం ఫ్యాక్టరీ కెళ్లడానికి తల్లి తయారైంది. కరపత్రాలను పైకేమీ కనబడకుండా భద్రంగా పేర్చుకుంది. యెగోర్ ఆ నేర్పుకు సంతోషించి "శభాష్" అన్నాడు.

"అమ్మా! కరపత్రాలు మీలో మార్పు కలిగించలేదు. నడి వయస్సులో ఉన్న పొడుగుపాటి స్త్రీ అచ్చంగా ఎలా ఉంటుందో అలాగే ఉన్నారు. కొంచెం లావెక్కుతున్న మనిషిలా ఉన్నారు. అసంఖ్యాకమైన దేవుళ్లు మీ ప్రథమ ప్రయత్నాన్ని ఆశీర్వదించెదరు గాక!"

* * *

ఒక అరగంటైన తర్వాత, ఆమె ఫ్యాక్టరీ గేటు దగ్గర ప్రశాంతంగా ధైర్యంగా నిలబడింది. తినుబండారాల బుట్టల బరువుతో కొంచెం ముందుకు వంగింది. ఆ ఆవరణలోకి ప్రవేశించే వాళ్లనందరినీ, ఇద్దరు కాపలాదారులు మోటుగా చేతుల్తో తడుముతూ సోదా చేస్తున్నారు. సోదాకు గురియైన కార్మికులు కాపలా వాళ్లకు ప్రతిఫలంగా తిట్లను కురిపిస్తున్నారు. ఒక పక్కగా పోలీసు నిలబడ్డాడు. అతని పక్కనే పొడుగాటి కాళ్లూ ఎర్రని ముఖం గల ఒకడు తీక్షణమైన చూపులు చూస్తూ నిలబడ్డాడు. తల్లి తన కావడిని భుజం మార్చుకుని పొడుగు కాళ్ల వాడిని చూసీ చూడనట్టుగా పరిశీలించింది. అతడు గూఢచారియని ఆమెకు స్ఫురించింది.

"దెయ్యాల్లారా! మా జేబుల్లో ఏముంది? తల తడిమి చూడండి" అని ఒక ఉంగరాల జుట్టుకార్మికుడు తన బట్టలను తడుముతున్న కాపలాదారులను మందలించాడు.

"నీ తలలో ఏముంటుంది? పేలు తప్ప!" అని కార్మికుడు తిరగేశాడు.

గూఢచారి అతడికేసి బాణంలా చూసి చిరాకుగా ఉమ్మేశాడు.

"నన్ను వదలిపెట్టండి. కావడి బరువుతో నా నడుం విరిగిపోయేటట్లుంది. చూడ్డం లేదూ?" అంది తల్లి.

"సరే. పో! పో! నువ్వేమీ చదవక్కర్లేదు చదువు!" అని కాపలాదారు చిర్రు బుర్రు మన్నాడు.

తల్లి తినుబండారాలమ్మే చోటుకెళ్లి బుట్టలను నేలమీద సర్దుకుంది. ముఖం మీది చెమటను తుడుచుకుని నాలుగు మూలలలా చూసింది.

మెకానిక్‌లుగా పనిచేస్తుండే గూసెవ్ సోదరులు ఆమెను సమీకపించారు.

"ఏమైనా 'పిరొగీ' బజ్జీ ఉందా?" అని వాళ్లలో పెద్దవాడైన వసీలియ్ బొమలు ముడిచి అడిగేడు.

"రేపు తెస్తాను" అని తల్లి జవాబిచ్చింది. ఇదొక సంకేతం. ఆ సోదరుల ముఖాలు వికసించాయి.

“మహా బాగా ఉంది!” అన్నాడు సంతోషంతో ఇవాన్.

బుట్టలో ఏముందో చూడ్డానికి వసీలియ్ బుట్టమీదకు వంగేడు. ఆ క్షణంలో కరపత్రాల కట్ట ఒకటి అతని చొక్కాలో కెళ్లిపోయింది.

తల్లి జాగ్రత్తగా నాలుగు మూలలా దృష్టి సారించింది.

“పులుసుసోయమ్మ పులుసు!... వేడి వేడి సేమ్యా” అని కేకలు వేసింది.

అలా అరుస్తూనే బొత్తులు బొత్తులుగా కరపత్రాలు తీసి కాౖమేద్సుకందిచ్చింది. ఒక్కొక్క కట్టే తీసి అందిస్తుంటే, ఆమె కళ్ల ఎదుట పోలీసాఫీసరు పసుపు పచ్చటి ముఖం, అగ్గి పుల్ల గీయడంతోనే గుప్పుమన్నట్లగుపించేది. “ఇదిగో తీసుకో... ఇంకొకటి... మరొకటి!” అంటూ సంతోషంతో అందించింది.

పనివాళ్లంతా గిన్నెలు చేత్తో పుచ్చుకుని రావడం మొదలెట్టేరు. ఒకడు దగ్గర కొచ్చేసరికి, ఇవాన్ గూసెవ్ బిగ్గరగా నవ్వడం ప్రారంభించేవాడు. తల్లి తొణుకూ బెణుకూ లేకుండా, కరపత్రాలనందివ్వడం మానేసి, తినుబండారాలకేసి దృష్టి మళ్లించేది.

“భలే హస్త లాఘవం కలదానివమ్మా, నీలొవ్నా!” అంటూ గూసెవ్ సోదరులు నవ్వుకున్నారు.

పక్కనే నిలబడి ఉన్న ఒక బొగ్గు పనివాడు విచారంగా ఇలా అన్నాడు :

“లేమి ఆమెనీ పని చేయిస్తోంది. లంజకొడుకులు! అన్నం పెట్టే కొడుకును కాస్తా పట్టుకుపోయారు. నాకో మూడు కోపెక్కులకి సేమ్యా ఇయ్యమ్మా! మరేమీ ఫర్వాలేదమ్మా! బెంగపెట్టుకోకు. నీకెలాగో గడిచిపోతుందిలే!”

“దయతో చెప్పిన మాటలకు సంతోషం” అంది చిరునవ్వుతో తల్లి.

“కాసిని మంచి మాటలు చెప్పడానికి ఖర్చేమవుతుందమ్మా” అంటూ అతను వెళ్లిపోయాడు.

“వేడి వేడి పులుసు! వేడి వేడి సేమ్యా!” అని తల్లి అరిచింది.

కరపత్రాలు పంచే విషయంలో తాను సంపాదించిన మొదటి అనుభవాన్ని తన కొడుకుకెలా చెప్పాలా అని ఆలోచనలో పడింది. కాని పోలీసు ఆఫీసరు ధుమధుమలాడే పసుపు పచ్చని ముఖం మాత్రం ఆమె కళ్లకు కట్టినట్లుంది.

* * *

సాయంకాలం తల్లి టీ తాగుతోంది. బయట బురదలో తపతప తొక్కుతూన్న డెక్కల చప్పుడు వినబడింది. ఎరిగున్న కంఠస్వరం చెవిని పడింది. ఆమె చటుక్కున లేచి వంటింట్లోంచి వీధి గుమ్మం దగ్గరకు పరుగెత్తింది.

"నమస్కారం, మామ్మా!" అంటూ పరిచయమైన కంఠస్వరం పలుకరించింది. సన్నని పొడుగాటి చేతులు ఆమె భుజాలపైన వాలాయి.

ఆమెకు మొదట్లో ఆశాభంగం అయింది. అన్‌ద్రేయ్‌ని చూడ్డంతోనే అనంద భరితురాలైంది.

అతడు కంపిస్తున్న చేతుల్తో ఆమెను గట్టిగా పట్టుకున్నాడు తల్లి మెల్లగా ఏడ్చింది. అతడామె జుట్టును నిమురుతూ, మధురమైన స్వరంతో ఇలా అన్నాడు:

"మామ్మా! ఏడవకండి. మనస్సు కష్టపెట్టుకోకండి. తప్పకుండా అతన్ని త్వరలోనే వాళ్లు విడుదల చేస్తారు అతనిమీద ఏ నేరమూ రుజువు చేయలేకపోయారు. అందరూ కూడా ఉడక పెట్టిన చేపల్లా నోరు మూసుకున్నారు."

"పావెల్ మీకు నమస్కారాలు చెప్పమన్నాడు. అతడు ఎంత కులాసాగా ఉండాలో అంత కులాసాగానూ ఉన్నాడు. అక్కడ చాలా ఇరుకుగా ఉంది. వాళ్లు సుమారు ఒక వందమందిని మన పేటవాళ్లనూ, పట్టణంవాళ్లనూ పట్టుకుని, కొట్టుకి ముగ్గురినీ నలుగురినీ చొప్పున కుక్కి తాళం వేశారు. జైలు అధికారులు మంచివాళ్లే. పోలీసు దయ్యాలు కల్పించిన ఈ పనితో వాళ్లు నలిగి సున్నమైపోతున్నారు. పెద్ద ఉద్యోగులు ఏమంత కఠినంగా ఉండరు. 'బాబూ! మా పీకలమీదకేమీ తేకుండా నెమ్మదిగా ఉండండి' అంటూ ఉంటారు. అంతా చక్కగా కాలక్షేపమైపోతోంది. మాట్లాడుకుంటారు. ఒకళ్ల పుస్తకాలు ఇంకొకరు మార్చుకుంటారు. తమకు అందిన భోజన పదార్థాలు పంచుకుంటారు. పాతదైన ఆ జైలు, అపరిశుభ్రంగా ఉన్నా, బాగానే ఉంది. మనుషుల కంత కష్టముండదు. మామూలు నేరస్థులైన ఖైదీలు కూడా చాలా మంచివాళ్లు. మన వాళ్లకెంతో సాయపడుతూ ఉంటారు. నన్ను, బూకిన్‌నీ, మరి నలుగురినీ విడుదల చేవారు. పావెల్ వంతు కూడా త్వరలోనే వస్తుంది. వెసొవ్‌శ్చికోవ్‌ను ఆఖరున విడుదలచేస్తారు. వాళ్లని నోటికొచ్చినట్లు తిడతాడు. కనుక, వాళ్లంతా అతనిమీద విరుచుకుపడుతుంటారు. పోలీసులతన్ని చూసేసరికి మండిపడతారు. అతడిని విచారణకు హాజరుపెడతారో, లేదా ఎప్పుడో చూసి చితకబాదుతారో, పావెల్ అతన్ని నిదానంగా ఉండమని పదేపదే చెప్తూంటాడు. తిట్టినంత మాత్రాన వాళ్ళు బాగుపడరంటాడు. కాని అతడు వినిపించుకోడు. 'పుండుమీద చర్మాన్ని వలిచేసినట్లుగా వాళ్లనీ భూమి మీదనుంచి తొలగిస్తా'నంటూ అరుస్తాడు. పావెల్ నడవడి బాగుంటుంది. దృఢం గానూ నిదానంగానూ ఉంటాడు. అతన్ని త్వరలో విడుదల చేస్తారనడానికేమీ సందేహం లేదు."

"త్వరలో విడుదల చేస్తారనడానికేమీ సందేహం లేదు" అని అతడన్న మాటను చిరనవ్వుతో రెట్టించింది తల్లి."

"అప్పుడన్నీ సర్దుకుపోతాయి. సరే గాని నాకొక గ్లాసు టీ ఇవ్వండి. తర్వాత మీ సంగతి. మీరెలా కాలక్షేపం చేస్తున్నారో చెప్పండి."

అన్‌డ్రేయ్‌కి ఆమె ఒళ్లంతా నోరై చిరనవ్వు నవ్వుతున్నట్లనిపించింది. విచారకరమైన ఆమె కళ్లలో ప్రేమపూరితమైన వెలుగు ద్యోతకమైంది. తల్లి పలుచబారిన అతని ముఖాన్నీ, నల్లగా గుబురుగా పెరిగిన పిచ్చి గడ్డాన్నీ తదేక దృష్టితో పరిశీలిస్తూ నిట్టూర్పు విడిచింది.

"అన్‌డ్ర్యూషా! మీమీద నాకెంతో ఆప్యాయత కలుగుతోంది" అంది.

"నన్ను ఆనందింప చేయడానికి కొంచెం చాలమ్మా! మీ హృదయం అందరినీ ప్రేమించడానికి తగినంత విశాలమైనది" అని కుర్చీలో కూచుని ముందుకూ వెనక్కూ ఊగేడు.

"అలాకాదు. మీమీద నా కెక్కువ ప్రేమ... మీ అమ్మ ఉంటే, మీలాటి కొడుకున్నందుకు ఆమెను చూచి అందరూ ఈర్ష్యపడేవాళ్లే" అంది తల్లి.

హొహోల్ తలూపేడు. రెండు చేతుల్తో గబగబా తల రుద్దుకుని మెల్లని కంఠ స్వరంతో:

"ఎక్కడో అక్కడ నా కొక తల్లి ఉంది కదా!" అన్నాడు.

"ఈ వేళ నేనేం చేశానో చెప్పుకో" అంటూ చిత్రంగా ప్రారంభించి, ఈ రోజున తాను ఫ్యాక్టరీలోకి కరపత్రాలునెలా తీసుకెళ్లినదీ విపులంగా కొద్దిగా అతిశయోక్తులతో చెప్పసాగింది.

మొదట్లో అతడు కొంచెం ఆశ్చర్యచకితుడై కళ్లు పెద్దవి చేసి చూశాడు. పిమ్మట పెద్ద నవ్వు నవ్వేడే.

"అబ్బో! ఇది తెలిగ్గా తీసేయవలసిన సంగతి కాదే! ఇది గొప్ప పని! పావెల్ పరమానందభరితుడైపోతాడు సుమా? పావెల్‌కే కాదు... అందరికీ కూడా... అద్భుతం! మామ్మా! అద్భుతం!"

''అన్‌ద్రూషా! మీకు శుభమగుగాక! నేను నా జీవితాన్ని గురించి ఆలోచించుకున్నప్పుడల్లా దయాళువైన జీసస్ ప్రభూ నేనెందుకోసం జీవించి ఉన్నాను? అనిపిస్తూ వుంటుంది. బండ చాకిరి దెబ్బలు: ఇంతే గదా! నా భర్తను తప్ప నేనెవ్వరినీ కన్నెత్తి చూడలేదు! భయం తప్ప మరేమీ ఎరగను! పావెల్ ఎలా పెరిగి పెద్దవాడయాడో కూడా నాకు గుర్తులేదు. నా భర్త బతికున్నంతవరకూ, పావెల్‌ను నేను ప్రేమించానో లేదో కూడా నాకు తెలియదు. ఏరోజూ నాకుండే ఆలోచనా, ఆత్రతా ఒక్కటే: పశుప్రాయుడైన నా భర్తకు బాగా మెక్కపెట్టడం, ఆ పిమ్మట తడవనేది లేకుండా అతడేమి చేయమంటే అది చేయడం. కోపమొచ్చి నన్ను కొట్టకుండా చూసుకోవడం. ఒక్కసారైనా నామీద జాలిపడతాడేమోనని నా కోరిక. కాని

అతనికెప్పుడూ నా మీద జాలి కలిగిందన్న జ్ఞాపకం నాకు లేదు. నేనతని భార్యను కానట్లూ, ఎవరో తనకు బాగా కసిగా ఉన్న వాళ్లకు మల్లే చావబాదేవాడు. ఇరవై ఏళ్లు అలా జీవించాను. పెళ్లికి ముందు నేనెలా ఉండేదాన్నో నాకు సుతరాం జ్ఞాపకం లేదు. వెనకటి విషయాలను జ్ఞాపకం చేసుకుందామంటే ఏమీ కనుబడదు. శుద్ధ శూన్యం.

ఈ మాటలు చెపుతుంటే నీటిలోనుండి బయటపడిన ఆమెకు ఊపిరాడలేదు. కొంచెం ముందుకు వంగి కంఠస్వరాన్ని బాగా తగ్గించి ఇలా చెప్పింది:

"నా భర్త చనిపోయాడు. ఇక కుమారుని మీద ఆధారపడ్డాను. అతడు ఈ వ్యవహారంలో దిగేడు. ఇది మరింత దుర్భరమైన విషయం. అతని కేమైనా ప్రమాదం సంభవించేట్లయితే నేను బతకడం ఎల్లాగ? అతన్ని గురించే నేనెప్పుడూ హడలిపోతూ ఉంటాను. ఏమి హింసల పాలైనావో కదా! అతని కేదైనా ప్రమాదం కలగవచ్చుననే ఆలోచన కలిగినప్పుడు నా హృదయం దాదాపు పగిలిపోయినట్లుంటుంది."

ఆమె కొద్ది క్షణాలపాటు ఆగింది. ఒక్కసారి తల ఊపి, గొప్ప భావముట్టిపడేటట్లుగా మరల ప్రారంభించింది :

"స్త్రీ ప్రేమ, నిష్కామమైన పరిశుద్ధ ప్రేమ కాదు. మా స్వార్థం కోసం ఏది అవసరమో దానినే ప్రేమిస్తాం. కాని నేను మిమ్మల్ని చూద్దును కదా, మీ తల్లిని గురించి మీరు పరితపిస్తున్నారు. మీకు ఆమేమి కావాలి? ఇతరులందరూ ప్రజల కోసం కష్టాలనుభవించే వాళ్లు జైలుకు సైబీరియా ప్రవాసానికీ వెళ్లేవాళ్లు ప్రాణాలర్పించేవాళ్లు.... రాత్రి వేళ ఒంటరిగా, బురదలోనూ, మంచులోనూ, వర్షంలోనూ మైళ్లకు మైళ్లు నడిచే పడుచుపిల్లలు, మన ఇంటికి నాలుగైదు మైళ్లు పట్టణం నుండి నడిచి వెళ్లేవాళ్లు. వాళ్లనెవరు నిర్బంధిస్తున్నారు? వాళ్లెందుకీ పని చేస్తున్నారు? వాళ్లలో గొప్పదైన పరిశుద్ధమైన ప్రేమ ఉన్నది కనుకనే, వాళ్లీ కష్టాలనెదుర్కొంటున్నారు. వాళ్లకొక గొప్ప విశ్వాసముంది. అన్‌డ్ర్యూషా! వాళ్లలో ఒక ప్రగాఢమైన నమ్మకముంది. కాని నా సంగతి చూడండి. వాళ్లలాగున నేను ప్రేమించలేను. నా స్వంతమనుకున్నదానినే, నాకు సన్నిహితమైనదానినే నేను ప్రేమించగలను."

"నిజమే! అంటూ హొహోల్ తన అలవాటు ప్రకారం చేతుల్తో తల, బుగ్గలు, కళ్లూ గబగబా రుద్దుకుని పక్కకు తిరిగి ఇలా చెప్పేడు:

"ప్రతివారూ తనకేది దగ్గరో దాన్నే ప్రేమిస్తారు. కాని విశాల హృదయులైనవారికి దూరంగా ఉన్నవి కూడా సన్నిహితమే అవుతాయి. మీలో గొప్పదైన మాతృప్రేమ ఉంది. మీరు గొప్ప పనులు చేయగలుగుతారు."

"భగవంతుడను గ్రహించును గాక!" అని నిట్టూర్పు విడిచి ఇలా అంది: "ఇది బ్రతకడానికి మంచి మార్గమని అనుకుంటున్నాను. అన్‌డ్రేయ్! నేనిప్పుడు మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. బహుశా పావెల్ కన్న ఎక్కువగానేమో! అతడు చాలా గుట్టు మనిషి. మాట

వరసకి చెప్తాను. అతను సాషాను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడు. కాని తల్లినైన నాతో ఒక్క మాటైనా చెప్పేడు కాడు."

"ఆ మాట నిజం కాదు" అని హొహోల్ ఆమె మాటకడ్డొచ్చాడు. "నిజం కాదని నాకు బాగా తెలుసు. అతడామెను ప్రేమిస్తున్నాడు. ఆమె కూడా అతన్ని ప్రేమిస్తోంది. అంత వరకు నిజమే కాని వాళ్లెన్నటికీ పెళ్లి చేసుకోరు. ఆమెకు చేసుకోవాలనే ఉంది. కాని అతడికిష్టం లేదు..."

"ఓహో! అదా సంగతి" అని విచారసూచకమైన దృష్టి సారించి ఆలోచనాయుతంగా "అదన్నమాట అసలు సంగతి! అంటే వాళ్లు స్వీయసుఖాన్ని కూడా పరిత్యజిస్తారన్నమాట" అంది.

"పావెల్ చాలా అపురూపమైన మనిషి. భల్లూకపు పట్టుదల కలవాడుసుమండీ!" అన్నాడు హొహోల్, మృదువైన స్వరంతో.

"ఇప్పుడు జైల్లో మగ్గుతున్నాడు" అంది సాలోచనగా తల్లి. "తలుచుకుంటే దిగులుగానే ఉన్నా మరీ దుర్భరంగా లేదు. జీవితం మారింది, నా దిగుళ్లూ మారాయి. నేనిప్పుడు అందరి కోసమూ దిగులుపడుతున్నాను. ఎందుచేతనంటే నా ఆత్మ హృదయం యొక్క కళ్లను తెరిపించింది. ఆ కళ్లతో చూస్తుంటే కొంచెం విచారం కలుగుతుంది. కాని వెంటనే సంతోషం కూడా కలుగుతోంది. నాకు అర్థంకాని సంగతులెన్నో ఉన్నాయి. సర్వేశ్వరునిలో మీకు నమ్మకం లేకపోవడం నాకు మహా బాధగా ఉంది. అయితే దానికి నేనేం చెయగలను? మీరంతా నిజంగా మంచివాళ్లని నాకు తెలుస్తూనే ఉంది. ప్రజల కోసం మీరు కష్టమైన జీవితాన్ని వరించారు. సత్యం కోసం కఠినమైన జీవితాన్నాను సరిస్తున్నారు. ఇప్పుడు మీ సత్యమేమిటో నాకు అర్థమైంది: ధనవంతులున్నంత కాలం, సామాన్య జనానికి ఏ విధమైన సంతోషం కాని న్యాయం కాని ఉండదంటారు! ఏమీ ఉండదు! ఇప్పుడు మీ అందరితో ఉంటున్నాను కనుక అప్పుడప్పుడు రాత్రివేళల్లో నా పూర్వ జీవితాన్ని గురించి ఆలోచించుకుంటూ ఉంటాను. చిన్ననాటి నా బలమంతా బూటుకాలికింద నలిగిపోవడం. నా నవహృదయం పిడికిలి పోట్లతో పొడుమైపోవడం, తలుచుకుంటే నామీద నాకే జాలి కలుగుతుంది. వెగటు కలుగుతుంది. అయితే ఇప్పుడు నాకు బతకడం సుళువుగా కనబడుతోంది. కొద్దికొద్దిగా నేనెల్లా ఉన్నానో చూడగలుగుతున్నాను...."

హొహోల్ లేచి నిలబడ్డాడు. పొడుగ్గా సన్నంగా ఉన్న అతడు ఆలోచనా నిమగ్నుడై చప్పుడు చేయకుండా పచారు చేస్తూ మృదువుగా అన్నాడు.

"ఎంత బాగా చెప్పేరమ్మా! చాలా బాగా చెప్పేరు. కేర్చ్‌లో పద్యాలు రాసే యూదు యువకుడొకడుండేవాడు. అతడొకనాడు ఈ పద్యం రాశాడు :

అమాయకులు హత్యల పాల్పడగా

సత్యమే వారిని బతికిస్తుంది.

కేర్చ్‌లో అతణ్ణి పోలీసులు చంపారు. అయితే అదేమంత ముఖ్యమైన సంగతి కాదు. అతడు సత్యాన్ని గ్రహించి దాన్ని ప్రజల్లో వెదజల్లేడు. మీరు కూడా ఆ అమాయకుల్లో ఒకరు...”

తల్లి మళ్లీ అందుకుంది.

“అయితే నేనిప్పుడు బిగ్గరగా మాట్లాడుతున్నాను. బిగ్గరగా మాట్లడుతూ నా మాటలు నేనే వింటున్నాను. కాని నా చెవులను నేనే నమ్మలేకపోతున్నాను. నా జీవితమంతా ఒక్కటే ఆలోచన. రోజెల్లా గడిచిపోతుందా అనేదే. ఎవ్వరూ నన్ను చూడకుండా, నా శరీరం మీద చెయ్యి వెయ్యకుండా ఉంటే అంతే చాలనిపించేది. కాని ఇప్పుడు ఇతరులను గురించి ఆలోచనలు నా తల నిండా ఉన్నాయి. మీ పనిని నేను పూర్తిగా అర్థం చేసుకోలేక పోవచ్చును. కాని మీరంతా నాకెంతో ఆప్తులు. మీ అందరిని గురించి నేను బాధపడుతుంటాను. మీరందరూ సుఖంగా ఉండాలని నా కోరిక. ముఖ్యంగా మీరు, అన్‌ద్ర్యూష!....”

అతడు ఆమె దగ్గరకొచ్చాడు.

“కృతజ్ఞుడిని” అన్నాడు ఆమె చేతిని తన చేతుల్లో పెట్టుకుని గట్టిగా నొక్కి, తరువాత వదిలేసి చటుక్కున వెనక్కి తిరిగాడు. తల్లి తన ఆవేశంతో తానే అలసటచెంది, మెల్లగా నిశ్శబ్దంగా గ్లాసులు కడుగుతూ, తన హృదయంలో ఆనందానుభూతిని పొందింది.

పచారు చేస్తున్న హాహోల్ ఆమెతో ఇలా చెప్పేడు:

“మామ్మా! మీ ప్రేమను కొంత వెసొవ్‌శ్చికోవ్‌కు ప్రసాదించాలి. అతని తండ్రి జైల్లో ఉన్నాడు. ఎందుకూ పనికిరాని ముసలి తాగుబోతు. నికొలాయ్ అతన్ని కిటికీ దగ్గర చూచేసరికల్లా, తిట్లు ప్రారంభిస్తాడు. అది చాలా చెడ్డలవాటు. నికొలాయ్ సహజంగా చాలా దయాదాక్షిణ్యాలు కలవాడు. అతడు కుక్కల్నీ ఎలుకల్నీ, అన్ని రకాల జంతువుల్నీ ప్రేమిస్తాడు. మనుష్యులను మాత్రం అసహ్యించుకుంటాడు. మనిషికి ఏమి సంభవిస్తుందో కొంచెం చూడండి!”

“తల్లి ఎక్కడికోపోయింది.... తండ్రి దొంగ, తాగుబోతు...” అంది తల్లి ఆలోచిస్తూ.

అన్‌ద్రేయ్ పడుకుందుకు సిద్ధంగా ఉన్నాడనగా అతనికి కనబడకుండా ఉండేట్టుగా, తల్లి అతనిపై శిలువ గుర్తు వేసింది. అతడు పడుకున్న ఒక అరగంటకు :

“నిద్రపోతున్నావా అన్‌ద్ర్యూషా?” అని మెల్లగా అడిగింది.

“లేదు. ఎందుకూ?”

“నిద్రపో, నాయనా!”

“సరేనమ్మా, నిద్రపోతాను” అన్నాడు కృతజ్ఞతతో.

* * *

మర్నాడు నీలోన్నా ఫ్యాక్టరీ గేటు దగ్గర కొచ్చేసరికి కాపలాదారులు ఆమె నటకాయించి బుట్టలన్నీ కింది పెట్టించారు. వాటినన్నింటినీ పూర్తిగా సోదా చేశారు.

ఆమె బట్టలను మోటుగా తడుముతుంటే :

"తినుబండారాలు చల్లారిపోతాయి!" అంటూ అసమ్మతిని తెలియచేసింది.

"నోర్మూయ్!" అని కాపలాదారు హుంకరించాడు.

"వాళ్లు కట్టవమీదనుంచి లోపలికి విసురుతారు. నా మాట విను" అంటూ మరో కాపలాదారు మెల్లగా ఆమె భుజంమీద ఒక చిన్న పోటు పొడిచాడు.

ఫ్యాక్టరీ లోపలికి ఆమె ప్రవేశించడంతోనే, ఆమె దగ్గర కొచ్చినవాళ్లలో మొదటివాడు వృద్ధుడైన సిజోవ్.

"ఏమమ్మోయ్! విన్నావా? అని నాలుగు మూలలా చూశాడు.

"ఏమిటి?"

"ఆ కాగితాల సంగతి. అవి మళ్లీ ప్రత్యక్షమయ్యాయి. బ్రెడ్డు ముక్కమీద ఉప్పు చల్లినట్లుగా అంతటా విరజల్లబడ్డాయి. సోదాలు, అరెస్టులూ చేస్తూనే ఉన్నారు. మా మేనల్లుడు మాజిన్‌ను జైల్లో పెట్టేరు. ఏమైనట్టు? నీ కొడుకునూ పట్టుకుపోయారు. కాని ఆ పని చేస్తున్నది వాళ్లు కాదని ఇప్పుడందరకూ తెలుస్తోంది కదా!"

అతడు తన గడ్డాన్ని చేత్తో పట్టుకుని తల్లికేసి చిత్రంగా చూశాడు.

"మా యింటికోసారి రాకూడదూ? బొత్తిగా ఒంటరిగా ఉంటున్నావు కదా!"

తల్లి అతనికి కృతజ్ఞత తెలియచేసింది. తినుబండారాలు అమ్మకం ప్రారంభించింది. ఫ్యాక్టరీలో ఏదో కొత్తగా అలజడి రేగినట్టామె గుర్తించింది. అందరూ ఆవేశపూరితులై వున్నారు. జనం గుంపులు గుంపులుగా చేరి, మళ్లీ విడిపోతున్నారు. ఒక కర్మాగారం నుంచి మరో కార్మాగారానికి పరుగులెడుతున్నారు. ఈ మసిగమ్మిన వాతావరణలో ధైర్యసాహసాలతో కూడిన పనేదో జరుగుతోందని ఆమె కనిపెట్టింది.

వడ్రంగి కార్ఖానా మేస్త్రీ నవీలొవ్, టైంకీపరు ఇసాయ్ మెల్లగా నడిచి వెళ్లారు. మేస్త్రీ జడలు కట్టిన గెడ్డం దులుపుకుంటూ లొడలొడ మాట్లాడుతూ నడుస్తూంటే, పొట్టివాడైన టైమ్‌కీపరు, అతని ముఖం చూడ్డానికి తల పైకెత్తి పక్కకు తిప్పి అతని వెంట నడుస్తున్నాడు.

"వాళ్లిదంతా వేళాకోళమనుకుంటున్నారోయ్ ఇవాన్ ఇవానొవిచ్! వాళ్ల కదొక ఆనందం! డైరెక్టరు చెప్పినట్లు రాజ్యం నాశనమైపోతే మాత్రం వాళ్లకేమి! అబ్బే! ఇలా ఒకరినీ ఇద్దరినీ కలుపు తీయడం కాదు. బాగా లోతుగా దున్నేయాలి..."

నవీలొవ్ చేతులు వెనక్కి పెట్టుకుని వేళ్లు పిడికిట్లో బిగించి నడుస్తున్నాడు.

"పొండి! మీ యిష్ట మొచ్చినదాన్ని అచ్చేసుకోండి, కుక్కలకొడకల్లారా! నన్ను గురించి ఒక్కమాటంటే మాత్రం జాగ్రత్త!" అని గట్టిగా అన్నాడు.

వసీలియ్ గూసెవ్ తల్లి దగ్గర కొచ్చాడు.

"ఏమమ్మోయ్! మీ వంటకాలు బాగున్నాయి. మరొకసారి భోజనం చేసి చూద్దామనుకుంటున్నాను" అని కళ్లు చిట్టించి మెల్లగా: "సరిగా అలాటివే మాకు కావాలి. మంచి పని చేస్తున్నారమ్మా!" అన్నాడు.

ఆమె ఎంతో అప్యాయంగా తలూపింది. ఆ పేటలోకల్లా పెంకె ఘటమని ప్రసిద్ధి కెక్కిన వసీలియ్ తన్నింతగా మన్నించి మాట్లాడ్డం ఆమెకెంతో సంతోషాన్ని చేకూర్చింది. ఫ్యాక్టరీలో జరుగుతున్న అలజడికి కూడా ఆమె సంతోషించింది. "ఇది నా మూలాన కాకపోతే..." అనే ఆలోచనలో పడింది.

"చదవడం రానందుకు జనం చాలా విచారపడుతున్నారు. నా చిన్నతనంలో నాకు చదవడం వచ్చు. కాని మరచిపోయాను" అని అన్‌ద్రేయ్‌తో చెప్పింది.

"ఇప్పుడు నేర్చుకోకూడదూ?" అన్నాడు హొహోల్.

"ఈ వయస్సులోనా? నలుగురూ నవ్వడానికా?"

అన్‌ద్రేయ్ అలమారలోనుంచి ఒక పుస్తకాన్ని తీసి, అట్టమీది ఒక అక్షరాన్ని చూపించి,

"ఇదేమక్షరం?" అని అడిగేడు.

"ఆర్" అని చిరునవ్వుతో ఆమె జవాబిచ్చింది.

"ఆ అక్షరం?"

"ఎ."

తల్లికి తన స్థితి అర్థమైంది. సిగ్గేసింది. అన్‌ద్రేయ్ లోపల్లోపల నవ్వుకుంటున్నట్లు ఆమెకగపడింది. అతని చూపు తప్పించుకుంది. కాని అతని కంఠస్వరం మెల్లగా మృదువుగా ఉంది. ముఖం మాత్రం గంభీరంగా ఉంది.

"అన్‌ద్రేయ్! నిజంగా నాకు నేర్పాలనుకుంటున్నారా?" అని అప్రయత్నంగా వచ్చిన నవ్వుతో అడిగింది.

"ఎందుకు రాదు? ఇదివరకొకసారి నేర్చుకుని ఉంటే, ఇప్పుడు మళ్లీ దానంతటదే వస్తుంది. శాస్త్రం చెప్పినట్లు ప్రయత్నిస్తే నష్టం లేదు కదా!"

"అయితే మరింకో సామెత ఉంది: "విగ్రహంకేసి చూస్తూ కూచుంటే సన్యాసి కాడు."

"ఉహూం! సామెతలు కొల్లలుగా ఉన్నాయి. 'ఎంత తక్కువగా తెలుసుకుంటే, అంత సుఖంగా నిద్రపడుతుంది' అన్న సామెతను ఉదాహరణగా తీసుకోండి. నిజానికి అలా

లోచించవలసినది పొట్ట ఒక్కటే. సుళువైన మార్గాలు పట్టడానికి ఆ విధమైన సామెతలతో ఆత్మను పెడదారి పట్టించడమే" అన్నాడు అన్‌ద్రేయ్ తలూపుతూ. "ఈ అక్షరమేమిటి?" అని తల్లిని అడిగేడు.

"యల్" అంది.

"బాగుంది. ఇది?"

మరచిపోయిన అక్షరాలను జ్ఞాపకం చేసుకునేందుకు ఆమె ఏకాగ్రచిత్తంతో కళ్లకు పనిచెప్పింది. కాని కళ్లకి బాగా శ్రమనిపించింది. అలసటచేత కళ్ల వెంబడి నీరు కారింది. నిస్పృహ వచ్చింది.

"చదువడం నేర్చుకుంటున్నావన్నమాట!" అని మూలిగింది. "నలభై ఏళ్లు మీద కొచ్చాక అక్షరాలు నేర్చుకోవడమన్నమాట!"

హొహోల్ ఓదార్చుడం మొదలెట్టేడు!"

సాయంకాలం హొహోల్ బయటికి వెళ్లేడు. తల్లి దీపం వెలిగించి బల్లదగ్గర కూర్చుని మేజోడల్లడం మొదలెట్టింది. అంతలోనే లేచి ఏమీ తోచక గదిలో అటూ ఇటూ తిరుగాడింది. ఇంతకు ముందు జాగ్రత్తపడి కూడా ఆమె పుస్తకం మీదకు వంగి చదవడానికి ప్రారంభించే ముందు నాలుగు మూలలా అనుమానంగా చూడడం తప్పలేదు. తర్వాత కళ్లు మూస్తూ తెరుస్తూ తనలో తాను గొణుక్కోడం మొదలుపెట్టింది.

* * *

"యల్-లెటర్, బి-బాక్సు."

ఎవరో తలుపు తట్టినట్టైంది. తల్లి గభాలున లేచి పుస్తకాన్ని అలమారలో పెట్టేసింది.

"ఎవరు వారు?" అని కంగారుగా అడిగింది.

"నేను."

గెడ్డం సవరించుకుంటూ రీబిన్ లోపలికొచ్చాడు.

రీబిన్ ఆమెకేసి భావపూరితంగానూ, గుంభితంగానూ చూశాడు. ఆమెకేదో అస్పష్టమైన ఆందోళన కలిగింది.

"ఏ పనికైనా డబ్బవుతుంది" అంటూ తనకు స్వాభావికమైన భారమైన కంఠ స్వరంతో మాట్లాడ్డం మొదలెట్టేడు. "పుట్టడానికి డబ్బు కావాలి. చావడానికి డబ్బు కావాలి. పుస్తకాలకూ కరపత్రాలకూ కూడా డబ్బు ఖర్చవుతుంది. ఈ కరపత్రాలకు డబ్బు ఎక్కడ నుంచి వస్తోందో నీకేమైన తెలుసా?"

"నువ్వేమనుకుంటున్నావు?" అని అడిగింది.

భల్లూకంలాగున రీబిన్ ఆమెకేసి తిరిగేడు.

"మోసంలో పడ్డాం...మనల్ని మోసం చేశారని అనుకుంటున్నాను. నాకేమీ ఇదమిద్ధమని విశదంగా తెలియదు. కాని ఇందులో ఏదో వంచన ఉంది. అంతే. పెద్ద మనుషులున్నారే వాళ్లు, చాలా వంచనోపాయం తెలిసినవాళ్లు. ఇక ముందునుంచి నేనీ పెద్దమనుష్యుల వెంట పోదలచుకోలేదు. వాళ్ల కవసరమైతే, నన్ను పడగొట్టి వంతెన మీద నుంచి నడిచేటట్లుగా నా మీదనుంచి నడిచిపోతారు..." అన్నాడు రీబిన్.

అతడి మాటలు తల్లి హృదయాన్ని మెలిపెట్టేశాయి.

"ఓ భగవంతుడా! పాషా ఈ సంగతి ఎరగడా? అతని తోటివారందరూ..." అని విచారంతో ఆమె బిగ్గరగా అంది.

ఆమె అసమ్మతి సూచకంగా తలూపుతూ అంది:

"కాదు కాదు! నేను నమ్మలేను! వాళ్లందరూ అంతరాత్మకలవాళ్లు..."

"అమ్మా! నువ్వు సరియైన చోట చూడ్డం లేదు. కొంచెం దూరంగా చూడు" అన్నాడు రీబిన్ తలవంచుకుని. "మనతో చేరిపోయిన వాళ్లకు ఏమీ తెలియకపోవచ్చు. వాళ్లందరికీ ఒక విశ్వాసమంటూ ఉంది. అది చాలా మంచిది. వాళ్ల వెనకాల కొందరు స్వార్థపరులుండవచ్చు.

తల్లి మళ్లీ సంశయంలో పడి :

"మరి నువ్వేమి చెయ్యాలనుకుంటున్నావు?" అని అడిగింది.

"నేనా?" అని రెట్టించి రీబిన్ తల్లికేసి చూసి, ఒక క్షణమాగి, "ఈ చదువుకున్న పెద్దమనుషులకు మనం దూరంగా ఉండాలి. అదీ సంగతి" అన్నాడు.

అతడు మరల విచారంతో నోరు మెదల్పకుండా కొంచె సేపు కూచున్నాడు. తర్వాత,

"నేను కూడా మన కుర్రాళ్లతోపాటు ముందుకు పోదామనుకున్నాను. అలాటి పనికి నేను బాగా తగినవాడినే. ప్రజలకేం చెప్పాలో నాకు తెలుసు. కాని నేనిప్పుడు వెళ్లిపోతున్నాను. నాకు విశ్వాసం పోయింది. కనుక వెళ్లిపోక తప్పదు" అన్నాడు.

అతడు తలవంచుకుని ఆలోచనా నిమగ్నుడయాడు.

"నేను ఒంటరిగానే నా పని నేను చేస్తాను. పల్లెల వెంటా గ్రామాల వెంటా తిరిగి ప్రజలను లేవగొడతాను. వాళ్లు తమ పనిని స్వయంగా తమే చేసుకోవాలి. ఒకసారి వాళ్లకు అసలు విషయం తెలిస్తే, మార్గాలు వాళ్లే తెలుసుకుంటారు. విషయాన్ని తెలియచెప్పడమే నాపని. వాళ్ల ఆశలు వాళ్లవే. వాళ్ల బుద్ధి వాళ్లదే" అన్నాడు రీబిన్.

తల్లికి అతని మీద జాలి కలిగింది. అతడిని గురించి భయం కూడా కలిగింది. ఏ కారణం చేతనో మొదట్లో అతనంటే అయిష్టత కలిగిన తల్లికి, ఇప్పుడెందుచేతనో అతడెంతో సన్నిహితుడయాడు.

"నిన్ను పట్టుకుంటారు" అంది మెల్లగా.

రీబిన్ ఆమెకేసి చూసి,

"అవును. పట్టుకుంటారు. కాని వదిలి పెట్టేస్తారు. మళ్లీ మొదలెట్టి ఆ పనే చేస్తాను" అన్నాడు.

"పల్లె రైతులే నిన్ను పట్టుకుని వప్పుచెపుతారు. వాళ్లు నిన్ను జైల్లో పారేస్తారు."

రీబిన్ నెమ్మదిగా ప్రతి మాటనీ తూచి మాట్లాడేడు.

"ఈ మధ్య నేనూ చాలా కష్టాలు దిగమింగేను. ఒకటి రెండు విషయాలు తెలుసుకున్నాను..."

"మిహాయిల్ ఇవానొవిచ్! ఇంతటితో నీ పని ఆఖరు" అని విచారంగా తలూపుతూ అంది తల్లి.

"క్రీస్తు విత్తనం గురించి ఏమి చెప్పేడో జ్ఞాపకముందా? మరల జన్మెత్తడానికి ముందు అది నశించాలి. కాని నన్నింత త్వరలో చావు వరించదు. నేను జిత్తులమారి ముసిలినక్కని."

అతడు కుర్చీలోనుంచి నిదానంగా లేచి నుంచున్నాడు.

"బాగుంది. నేనొచ్చి వెళ్లేనని అతనితో చెప్పు"

ఉభయులూ పక్కపక్కగా నడిచి వంటింట్లో కెళ్లేరు. ఒకళ్ల నొకళ్లు చూడకుండానే అభిప్రాయాలను వెలిబుచ్చుకున్నారు.

"సరే. శలవు" అన్నాడు రీబిన్.

"శలవు. ఫ్యాక్టరీ వాళ్లకు నోటీసెప్పుడిస్తావు?"

"ఇవ్వడమైంది."

"అయితే ఎప్పుడెళ్లిపోతున్నావు?"

"రేపు ఉదయం. శలవు!"

చిరాకుగానూ అయిష్టంగానూ రీబిన్ గుమ్మంలోనుంచి వాకిట్లోకెళ్లేడు. అమ్మ ఒక నిముషం అతని అడుగుల చప్పుడు వింటూ నిలబడింది. తన హృదయాన్ని కలచివేస్తున్న సంశయాలను కూడా వింటోంది.

ఒడ్డూ పొడుగూ బలమూ కలిగి హుందాగా ఉండే ఆ రైతుపట్ల ఆమెకు విచారం కలిగింది.

అన్‌ద్రేయ్ మంచి ఉషారుగా ఇంటికొచ్చాడు.

ఆమె రీబిన్ సంగతి అతనితో చెప్పింది.

"న్యాయాన్ని గురించి కేకలేసుకుంటూ గ్రామాల వెంట తిరుగుతూ అతడు ప్రజలను రెచ్చగొట్టవలసిందే!" అన్నాడు అన్‌ద్రేయ్. "అతడు మా అందరితోపాటు అడుగు కలపడం తేలికగాదు. అతని బుర్రంతా రైతుల భావాలతో నిండుగా ఉంది. మా భావాల కందులో చోటు లేదు."

"అతడు చదువుకున్న పెద్ద మనుషులను గురించి ప్రస్తావించాడు. అతను చెప్పిన మాటల్లో కొంత ఆలోచించవలసినదుంది... వాళ్లు మిమ్మల్ని మోసం చేయకుండా చూసుకోండి!" అని తల్లి హెచ్చరిక చేసింది.

హొహోల్ నవ్వి ఇలా అన్నాడు :

"వాళ్లేమైనా నిన్ను బాధిస్తున్నారా? ఏయ్! మామ్మా! డబ్బు! అదే మా దగ్గరుంటేనా! మేమిప్పటివరకు ఇతరుల సొమ్ముతోనే ఈ పనంతా చేస్తున్నాం. ఉదాహరణకు చెపుతున్నాను. నికొలాయ్ ఇవానొవిచ్‌కి నెలకు డెభై ఐదు రూబుళ్లు వస్తాయి. ఆయన మాకు ఏభై ఇచ్చేస్తాడు. అలాంటివాళ్లింకా ఉన్నారు. ఒక్కొక్కప్పుడు విశ్వవిద్యాలయ విద్యార్థులు అర్ధాకలితో కాలక్షేపం చేసి కోపెక్కు చొప్పున చందాల పోగుచేసి మాకు పంపిస్తుంటారు. చదువుకున్న పెద్దమనుష్యులలోనూ ఉన్నారు అన్ని రకాలవాళ్లూను. కొందరు నిన్ను దారిలో వదిలేస్తారు. కొందరు దగా చేస్తారు. కాని వాళ్లలో ఉండే ఉత్తములు మాతో కలిసి పనిచేస్తారు."

తన రెండు చేతులతో చప్పట్లు కొడుతూ ఎంతో విశ్వాసంతో చెప్పేడు :

"మన అంతిమ విజయం ఇంకా దూరంగా ఉంది. అయినప్పటికీ మేడే రోజున చిన్న ఉత్సవాన్ని జరిపిస్తాం! అది చాలా అద్భుతంగా జరుగుతుంది!"

ఆమెకు రీబిన్ కలుగచేసిన సంశయాలన్నీ అన్‌ద్రేయ్ ఉత్సాహంతో ఎగిరిపోయాయి. హొహోల్ జుట్టు నిమురుకుంటూ నేలకేసి చూస్తూ పచారుచేశాడు.

"ఒక్కొక్కప్పుడు నువ్వు భరించలేనంతగా నీ హృదయం అద్భుతమైన దేనితోనో నిండిపోతుంది. నీవెక్కడి కెళ్లినా అంతా మిత్రులే. వారందరి హృదయాల్లోనూ ఒకే జ్వాల ప్రజ్వరిల్లుతుంది. అంతా మంచివాళ్లు. దయాళువులు. కులాసా మనుష్యులు. ఒకళ్ల నొకళ్లు అర్థం చేసుకోవడానికి మాట్లాడుకో నక్కర్లేదు. ఎవరి హృదయంలోనుంచి ఏ పాట వచ్చినా అందరూ కలిసి ఒకే పల్లవి పాడతారు. ఆ పాటలన్నీ ఒకే నదిలోకి పారే సెలఏళ్ల లాంటివి. ఆ నది సువిశాలంగానూ స్వేచ్ఛగానూ ప్రవహించి ఆనందమయమైన నవజీవన సముద్రంలో కలిసిపోతుంది."

అతని ఆలోచనలకి అడ్డు రాకూడదనీ, ప్రవాహంగా సాగుతున్న వాగ్ధోరణికి అడ్డు రాకూడదనే భయంతో తల్లి కదలకుండా కూచుంది. మిగిలిన వాళ్లందరికన్నా, అతను మాట్లాడేటప్పుడామె ఎక్కువ శ్రద్ధగా వినేది. ఇతరులకన్న అతడు సులువైన భాషలో మాట్లాడతాడు. అతని మాటలు సూటిగా హృదయానికి హత్తుకుంటాయి. ముందు జరగబోయే విషయాలను గురించి పావెల్ ఎన్నడూ ప్రస్తావించేవాడు కాదు. హొహోల్ హృదయంలో ఒక భాగం ఎప్పుడూ భవిష్యత్తులోనే జీవించుతూన్నట్లు ఉండేది. అతను మాట్లాడినప్పుడు భూమిమీద ఉండే జనాని కందరికీ కలగబోయే పండగని గురించి చెప్పేవాడు. తల్లికి ఈ దృశ్యమే జీవితంయొక్క పరమార్థాన్ని తెలియజేసింది. తన కుమారుడూ, అతని స్నేహితులందరూ చేస్తున్న పనియొక్క ఆంతర్యాన్ని తెలియజేసింది.

తలకాయ ఊపుకుంటూ హొహోల్ తన ప్రసంగాన్ని సాగించాడు.

"తర్వాత గభాలున నీకు తెలివొస్తుంది. నలుపక్కలా చూసుకుంటే ఎక్కడా ఉత్సాహం కనబడదు. అంతా అపరిశుభ్రంగా ఉంటుంది. ప్రతివాళ్లూ చిర్రుబుర్రుమంటారు. అలసిపోయి వుంటారు..."

అతని కంఠధ్వనిలో విషాదం ద్యోతకమైంది: "మనుషులను నీవు ఎక్కువగా నమ్మకూడదు. అది బాధ కలిగిస్తుందని నాకు తెలుసు కాని వాళ్లను చూసి భయపడక తప్పదు. ఒకప్పుడు ఏవగించుకోవాలి కూడా. ప్రతి మనిషిలోనూ బొమ్మ బొరుసు ఉంటాయి. నీవు అతన్ని పూర్ణంగా ప్రేమించాలనుకుంటావు. కాని అదెలా సాధ్యం? అడవి జంతువులాగ నీమీదకు దూకే మనిషిని క్షమించడం ఎట్లా? నీలో ఒక సజీవాత్మ ఉన్నదనే సంగతి గుర్తించకుండా నీ ముఖాన్ని చితగొట్టేవాడిని క్షమించడం ఎట్లాగ? నీవు క్షమించలేవు! నీకోసం కాకపోవచ్చు. నీ మట్టుకు నీవెన్ని బాధలకైనా గురి కాగలవు. కాని అందువల్ల నీవు వాళ్లు చేసే పనిని హర్షిస్తున్నావనే భావం వాళ్లకు కలగనివ్వకూడదు. ఇతరులకు కొట్టే అభ్యాసం చేసుకునేందుకు నీ వీపును అరువివ్వకూడదు." అతని కళ్లలో చల్లని జ్యోతి ప్రజ్వలిస్తున్నట్లగుపడింది. తలను నిబ్బరంగా పెట్టి మరింత నిశ్చలంగా ప్రస్తావన సాగించాడు. "తప్పు అనేది ఎక్కడ జరిగినా, అందువల్ల నాకు అపాయం కలగకపోయినా, దాన్ని క్షమించడానికి నా కధికారం లేదు. ఈ భూమి మీద ఉండేది నేనొక్కడినే కాను. ఈ రోజున నన్నెవరైనా బాధిస్తే పోనీలే అని నవ్వుతూ ఊరుకోవచ్చు. కాని ఈవేళ తన బలాన్ని నామీద చూపించిన మనిషి రేపు ఇంకొకళ్లను బాధపెట్టి బెదిరిస్తాడు. అందర్నీ ఒక్కలాగే చూడ్డానికి వీల్లేదు. నీవు నిర్మొగమాటంగా ఎంచుకోవాలి: వీళ్లు నా శ్రేణికి చెందివాళ్ల, వాళ్లు కాదు, అని విచక్షణం చేసుకోవాలి. ఇదంతా సుఖంగా కనబడ్డం లేదు కదూ? కాని నిజానికంతే."

ఎందుకోగాని తల్లికి సాషా, పోలీసు ఆఫీసరూ జ్ఞాపకానికొచ్చారు.

"జల్లెడ పట్టని పిండితో మంచి రొట్టె ఎలా తయారవుతుంది?" అని ఒక నిట్టూర్పు విడిచి చెప్పింది.

ఈ సంభాషణ అయిన తర్వాత తల్లీ, హొహోలు ఎన్నోసార్లు ఇలాంటి మాటలు మాట్లాడుకున్నారు.

హొహోల్‌ను మళ్లీ ఫ్యాక్టరీ పనిలోకి తీసుకున్నారు. అతడు సంపాదించిన జీతాన్ని తల్లి చేతిలో పెట్టేవాడు. పావెల్ దగ్గర్నుంచి పుచ్చుకున్నట్లుగానే, ఆమె నిస్సంకోచంగా అతని దగ్గర్నుంచి దాన్ని పుచ్చుకునేది.

ఒక్కొక్కప్పుడు అన్‌డ్రేయ్ చిరునవ్వుతో కన్ను గిలిపి:

"మామ్మా! కొంచెం చదువుకుంటేనో?" అనేవాడు.

ఆమె నవ్వేసి వద్దనేది. అతడు చిరునవ్వుతో కన్ను గిలవడం ఆమెకు బిడియంగా ఉండేది.

"అది అంతటి అపహాస్యమైన విషయమైతే దాన్ని గురించి ఎందుకు బాధపడాలి?" అని తనలో తనే అనుకునేది.

కాని రానురాను, తరుచుగా ఆమె అతన్ని ఏదో ఒక మాట కర్థమేమిటని అడుగుతుండేది. తనా విషయాన్నంత పట్టించుకోవడం లేనట్లుగానూ యథాలాపంగా అడుగుతున్నట్లూ పక్కకు తిరిగి అడుగుతుండేది. ఆమె రహస్యంగా చదువుకుంటోందని అతడు గ్రహించాడు. అందుకతడు మెచ్చుకుని, తన దగ్గర చదవమని కోరడం మానేశాడు.

"నాకు చూపు బాగా ఆనడం లేదు అన్‌డ్ర్యూషా. కళ్ళజోడు కావాలనుకుంటాను" అని ఒకరోజున ఆమె అడిగింది.

"దానికేమీ కష్టం లేదు. ఆదివారంనాడు మిమ్మల్ని పట్నంలో ఉన్న కంటి వైద్యుని దగ్గరుకు తీసుకెడతాను. కళ్లద్దాలు పట్టుకొద్దాం" అన్నాడు.

* * *

పావెల్‌ను చూడ్డానికి తల్లి మూడు సార్లు అధికారులను కోరింది. నెరిసిన వెంట్రుకలు, ఉదారంగు బుగ్గలు, పెద్ద ముక్కూ గల ముసలి పోలీసు అధికారి మర్యాదగా వీల్లేదని చెప్పి పంపేశాడు.

"ఒక వారం రోజులు పోవాలమ్మా! అప్పుడు చూద్దాం. ఇప్పుడు మాత్రం అసంభవం..."

చివరకొకనాడు పావెల్‌ను చూడ్డానికి తల్లికి అనుజ్ఞ ఇచ్చారు. ఆదివారం నాడు ఆమె జైలాఫీసులో ఒక మూల కూచుంది. అపరిశుభ్రంగా ఉన్న ఆ చిన్న గదిలో ఖైదీలను చూడ్డానికొచ్చినవాళ్లు చాలామంది ఉన్నారు. వాళ్లకి ఇక్కడకి రావడం ఇది మొదటిసారి కాదని

స్పష్టమవుతోంది, ఎందుకంటే వాళ్లు ఒకళ్లనొకళ్లు ఎరుగుదురు, ఓడిపోడం సంభాషణను వాళ్లు సాగిస్తున్నారు.

ఖైదీలు మధ్యమధ్య వస్తుండేవాళ్లు. అందరూ ఒకే రకమైన బూడిదరంగు దుస్తుల్లోనూ బరువైన చెప్పుల్లోనూ ఉండడం చేత అంతా ఒకలాగే కనబడ్డారు. బొత్తిగా మసక వెలుతురుతో ఉండే ఆ గదిలోకి రావడంతోనే వాళ్లకు కళ్లు మెరమెరలాడేవి. ఒకడి కాళ్లకు బేడీలున్నాయి.

జైలు వాతావరణలో చిత్రమైన శాంతి కనపించింది. ప్రతీదీ అదేమిటో గాని, అతి సరళంగా జరిగిపోతున్నట్లుంది. వాళ్లందరూ చాలా కాలంగా తమ అవస్థకు అలవాటై పోయినట్లుగా తోచింది. కొందరు శిక్షలైపోయేదాకా ఓపిక పట్టి ఉన్నారు. కొందరు బద్ధకంగా కాపలా కాస్తున్నారు.

ఆమె పక్క వామనాకారంలో వున్న ఒక ముసలమ్మ కూచుంది. ఆమె ముఖం బాగా చిక్కిపోయింది. కళ్లు తేటుగా ఉన్నాయి. సన్నని మెడ తిప్పుకుంటూ వాళ్లకేసి ఓరగా చూస్తూ అందరు చెప్పుకునే మాటలనూ ఆమె ఆలకిస్తోంది.

"ఎవర్ని చూడడానికొచ్చారు?" అని వ్లాసోవా ఆమె నడిగింది.

"నా కొడుకును విశ్వవిద్యాలయ విద్యార్థి. మీరో?"

"నేనూ నా కొడుకుకోసమే. కార్మికుడు"

"అతని పేరు?"

"వ్లాసోవ్."

"ఆ పేరు వినలేదే. చాలా కాలంనుంచి ఉన్నాడా?"

"దాదాపు ఏడు వారాలైంది...."

"ఓ! మావాడు పది మాసాలనుంచి ఉన్నాడు." ఆ మాట చెపుతుంటే ఆమె కంఠస్వరంలో గర్వం ఉట్టిపడింది.

నలుచదరంగా ఉండే ఎర్రటి గడ్డంగల లావుపాటి జైలరు ఆమె పేరు పిలిచాడు. ఆవిడకేసి నఖశిఖ పర్వతం చూసి "నాతో రా" అని కుంటిగా అడుగేశాడు.

అతని వెంట నడుస్తూ కొంచెం తొందరగా అడుగెయ్యమని అతని నొక తోపు తోద్దామనిపించింది తల్లికి.

పావెల్ ఒక చిన్న గదిలో నిలబడున్నాడు. చిరునవ్వు నవ్వుతూ చేయి అందించాడు. తల్లిచిన్న నవ్వుతూ చేయి పుచ్చుకుని గబగబా కళ్లు మిటకరించింది. మాటలు తొణక్క :

"బాగున్నావా?" అంది.

"అమ్మా గాభారా పడకు" అన్నాడు పావల్ ఆమె చేతిని గట్టిగా పట్టుకుని.

"ఫరవా లేదులే..."

"అమ్మా!" అని జైలరు నిట్టూరుస్తూ అన్నాడు. "కొంచెం దూరంగా నిలబడు" అని బిగ్గరగా ఆవులించాడు.

పావెల్ తల్లి యోగక్షేమాల నడిగేడు. ఇంటి దగ్గర సంగతి సందర్భాల నడిగేడు అతడింకా వేరే ఏవో ప్రశ్నలడుగుతాడని ఆమె ఎదురు చూసి కళ్లలోకి పరీక్షగా చూసింది. కాని అలాటిదేమీ జరగలేదు. అతడు ఎప్పటిలాగే తొణుకూ బెణుకూ లేకుండా శాంతంగా ఉన్నాడు. ముఖం కొంచెం తెల్లబారింది. కళ్లు మాత్రం పెద్దవైనట్లగుపడ్డాయి.

"సాషా నిన్నడిగేనని చెప్పమంది" అంది తల్లి.

పావెల్ రెప్పలు అదిరేయి. ముఖం వికసించింది. చిరునవ్వు తొణికిసలాడింది. తల్లికి మాత్రం గుండెల్లో ఒక్క పోటు పొడిచినట్లనిపించింది.

"నిన్ను త్వరలో విడుదల చేస్తారంటావా?" అని కొంచెం బాధతో అడిగింది. "ఇంతకూ నిన్నెందుకు నిర్బంధించారంటావు? ఫ్యాక్టరీలోకి ఆ కరపత్రాలు మళ్లీ వచ్చాయి కదా?"

"సరేలే ఇంటి దగ్గర సంగతులు చెప్పమ్మా. నువ్వేం చేస్తున్నావు!" అని పావెల్ అడిగేడు.

"ఓ! ఆ వస్తువులన్నీ నేను ఫ్యాక్టరీలోకి తీసుకెడుతున్నాను" అని కొంటెతనంగా చూచి చిరునవ్వుతో ఇలా చెప్పింది, "అవే నీకు తెలుసు కదా! కేబేజీ పులుసు, అంబలి మార్యా తయారుచేసే తినుబండారాలన్నీ."

పావెల్‌కి అర్థమైంది. చేతుల్తో తల పై కెగదువ్వుకుంటూ, నవ్వాపుకుని కొంటెచూపు చూశాడు.

"అదిగో మళ్లీ ఆ సంగతే మాట్లాడుతున్నావు. అలాటి మాటలు మాట్లాడకూడదని ఖచ్చితంగా చెప్పేను. బయట జరుగుతున్న విషయాలు తెలియకుండా ఉండాలనే కదా మనిషిని జైల్లో పెడతున్నారు! నువ్వు చేసే పనేమిటీ? ఏది నిషేధమో నీకీపాటికి తెలిసివుండాలే!" అని జైలరు కోపంతో అన్నాడు.

"చాలమ్మా! మత్వేయ్ ఇవానొవిచ్ మంచి హృదయం కలవాడు. అతనికి కోపం తెప్పించడం మంచిదికాదు. మేమంటే అతనికి దయే. ఇవేళ నువ్వొచ్చినప్పుడు ఆయన ఉండడం చాలా విశేషమే. మామూలుగా అసిస్టెంటు జైలరు ఉంటూ ఉంటాడు."

జైలరు గడియారం చూసి:

"టైమైంది!" అన్నాడు.

"అమ్మా! చాలా సంతోషం. నువ్వేమి బెంగ పెట్టుకోకు. వాళ్లు నన్ను త్వరలోనే వదిలిపెట్టేస్తారులే" అన్నాడు పావెల్.

ఆమెను మనసారా కౌగిలించుకుని ముద్దు పెట్టుకున్నాడు. ఆమె చలించిపోయి ఆనందావేశంతో మెల్లగా ఏడ్చింది.

"రావమ్మా రా! ఏడవకు. అతన్ని త్వరలోనే వదిలేస్తారులే. అందరినీ వదిలేస్తారు. ఇక్కడ చోటులేక ఇరుగ్గా ఉంది" అంటూ జైలరు ఆమెను నడవలోంచి బయటికి తీసుకొచ్చాడు.

ఆమె ఇంటికి రావడంతోనే హొహోల్‌తో అన్ని విషయాలూ చిరునవ్వు నవ్వుతూ కనుబొమ లెగరేస్తూ చెప్పింది.

* * *

ఒకరోజు రాత్రి తల్లి బల్లదగ్గర కూచుని మేజోళ్లు అల్లుతోంది. హొహోల్ పురాతన రోమ్ నగరంలో బానిసల తిరుగుబాటును గురించిన పుస్తకాన్ని ఆమెకు చదివి వినిపిస్తున్నాడు. ఇంతలో ఎవరో గట్టిగా తలుపు తట్టేప్పటికి హొహోల్ లేచి తలుపు తీసేడు. వెసొవ్‌శ్చికోవ్ ఒక మూట చంకనెట్టుకుని లోపలి కొచ్చాడు. టోపీ తలమీద వెనక్కి పెట్టుకున్నాడు. మోకాళ్ల వరకూ బురద చిందుతున్నాయి.

"ఇప్పుడే జైలు నుంచి వస్తున్నాను. ఇలా వెడుతుంటే వెలుతురు కనిపించింది. కనుక ఒకసారి పలకరించి పోదామని వచ్చాను" అంటూ నీలోవ్నా చెయ్యి పట్టుకుని హృదయ పూర్వకంగా చాలనం చేశాడు. "పావెల్ నిన్ను మరీమరీ అడిగేడు. వందనం చెప్పమన్నాడు" అన్నాడు.

ఇంతకు పూర్వం తల్లికి అతనంటే అంత ఇష్టముండేది కాదు. నలుపలకలగా ఉండే అతని తల, చిన్న కళ్లూ, చూస్తే ఆమెకేదో భయంగా ఉండేది. ఈ రాత్రి మాత్రం అతన్ని చూస్తే ఆమెకెంతో సంతోషమైంది. అతనితితో నవ్వుతూ మాట్లాడింది.

"ఎంత చిక్కిపోయావు! ఇతనికి కొంచెం టీ ఇద్దమా, అన్‌ద్ర్యూషా?"

"నేనప్పుడే సమొవార్ రాజబెడుతున్నాను" అని హొహోల్ వంటింట్లో నుంచి కేకేశాడు.

"పావెల్ ఎలా ఉన్నాడు? నిన్నేనా ఇంకెవర్నైనా విడుదల చేశారా?"

నికోలాయ్ తలొంచుకున్నాడు.

"పావెల్ అక్కడ ఓరిమితో కాచుకున్నాడు. నన్ను ఒక్కడినే వదిలిపెట్టేరు" అని తల్లికేసి తలెత్తి చూశాడు.

"ఆహా! అదా సంగతి!" అంది తల్లి తటాలున వెనక్కి తగ్గి. అప్రయత్నంగా ఆమె గుడ్లు మిణకరించింది. సినిశితమైన అతని సన్ననని కళ్లకేసి చూసిది.

"నీకు ఇంటికెళ్లడానికేముంది? ఖాళీ యిల్లు. కుంపట్లో నిప్పేసే దిక్కు లేదు. అంతా చప్పగా చల్లారిపోయింది...." అని తల్లి సానుభూతితో జాలి చెప్పింది.

అతడేమీ మాట్లాడలేదు. ఆమెకేసి ఓరకంటితో కొంత సేపు చూశాడు. తర్వాత జేబులోనుంచి సిగరెట్ పాకెట్ తీసి దానిలోనుంచి ఒక సిగరెట్ ముట్టించి, చిరాకుగా కుక్క మొరిగినట్లు సంతోషంలేని నవ్వు నవ్వేడు. సిగరెట్‌లోనుంచి లేస్తున్న బూడిదరంగు పొగలు గాలిలో కలిసిపోతుంటే ఇలా అన్నాడు:

"ఈ రోజుల్లో కొందరు తల్లితండ్రులను చూచి సిగ్గు పడవలసొస్తోంది..." అన్నాడు నికొలాయ్.

"ఏమిటీ?" అని తల్లి అదిరిపడి ఆగింది.

"తల్లిదండ్రులను చూసి పిల్లలు సిగ్గుపడవలసొస్తోందంటున్నా" అని నిట్టూర్చి రెట్టించాడు. "పావెల్ నిన్ను గురించి ఎప్పుడూ సిగ్గుపడడు. కాని మా ముసలాయాన్ని గురించి నేను సిగ్గుపడుతున్నాను. ఆయనింట్లో ఎన్నడూ నేను అడుగు పెట్టదలచుకోలేదు.

అన్‌ద్రేయ్ వంటింట్లోంచి ఇవతల కొచ్చాడు.

"ఏమిటంటున్నావు?" అని నవ్వేడు.

"ఇసాయ్ గొర్‌బోవ్ తలకాయ తీసేస్తాను ... తీసెయ్యకపోతే.... నువ్వే చూస్తావుగా!"

"ఎందుకు?"

"అతడు గూఢచారి,... అధికారుల దగ్గరకి మాటలు మోస్తుంటాడు. వాడే మా నాన్నను పాడు చేసిన వాడు వాడే ఆయన్ని కూడా మచ్చుపిట్టగా తయారుచేశాడు" అని వెసొవ్‌శ్చికోవ్ అన్‌ద్రేయ్‌కేసి చిరచిరలాడుతూ చూశాడు.

"అదంతే! కాని దానికి నిన్ను బాధ్యుని చేసే అవివేకులుండరు కదా!" అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు హొహోల్.

"తెలివైనవాళ్లూ, తెలివితక్కువవాళ్లూ ఒకలాగే ఉంటారు!" అని నికొలాయ్ గట్టిగా రెటించాడు. "పావెల్, నువ్వూ ఉన్నారు కదా. మీరిద్దరూ తెలివైనవాళ్లే. మీ దృష్టిలో నేను. ఫ్యోదొర్ మాజిన్, సమోయ్‌లొవ్ ఒక్కటే నంటావా? లేక పావెలూ, నువ్వూ ఒకరి నొకరు చూసుకునేటట్లే నన్నూ చూస్తావా? అబద్ధమాడకుండా చెప్పు. ఏమైనా నిన్ను నమ్మనులే! మీరంతా నన్నొక పక్కకు నెట్టేస్తుంటారు. నన్నుంచవలసిన చోట ఉంచుతారు..."

"నికొలాయ్! నీ ఆత్మకొక తెగులు పట్టింది!" అని హొహోల్ అతని పక్కన కూచుని మెల్లగా చెప్పేడు.

"నిజమే. తెగులే. అయితే నీ ఆత్మ కూడా అలాటిదే. కాకపోతే నీ ఆత్మకు పట్టిన తెగులు, నా ఆత్మకు పట్టిన జబ్బుకంటె ఉన్నత స్థాయిలోదని నీ అభిప్రాయం. మనమంతా ఒకళ్ల నౌకళ్లు కుక్కలకొడుకుల్లా చూస్తుంటాం. నేను చెప్పగలిగింది యింతే. ఏమంటావ్? అంతేనా నిజం చెప్పు.

అంటూ అతడు తన దృష్టిని అన్‌ద్రేయ్ ముఖంమీద సారించి, జవాబుకోసం నోరు తెరుచుకు కూచున్నాడు.

వెసొవ్‌శ్చికోవ్ చూపులోని తీవ్ర దృష్టిని పరికించడంతోనే హొహోల్ విచారంతో నవ్వి :

"నేనేమి చెప్పలేకపోతున్నాను. హృదయంలోని గాయాలన్నిటినుండీ రక్తం కారుతున్నప్పుడు ఆ మనిషితో వాదించడంవల్ల అతన్నింకా బాధించడమే అవుతుందని నేనెరుగుదును. ఆ సంగతి నాకు బాగా తెలుసు!" అన్నాడు.

"నేను నీతో వాదించలేను. ఎలా వాదించాలో నాకు తెలియదు" అని నేలకేసి చూస్తూ నికొలాయ్ గొణిగేడు.

"మనమిద్దరం, ఎవళ్లంతట వాళ్లం, కంటక మార్గాల్లో సంచరించాం. కష్టాలొచ్చినప్పుడు నీలాగే ఎవరి మట్టుకు వాళ్లు దుఃఖంతో మూలిగేం...." అని హొహోల్ ఇంకా చెప్పబోతున్నాడు.

వెసొశ్చికోవ్ మాటాకడ్డొచ్చి మెల్లిగా ఇలా చెప్పేడు :

"నువ్వు నాకు చెప్పగలిగిందేమీ లేదు. నా ఆత్మ తోడేలులా మొరుగుతోంది!"

"నేనేమీ చెప్పదలచుకోలేదు. ఈ అవస్థ దాటిపోతుందని నాకు తెలుసు. పూర్తిగా కాకపోయినా దాటిపోతుంది."

ఒక నవ్వు నవ్వి నికొలాయ్ భుజం తట్టుతూ కూచున్నాడు.

ఇది పొంగులాంటి చిన్నపిల్లల జబ్బు. ఎప్పుడో ఒకప్పుడు మనకందరికీ ఇది సోకుతుంది. బలమైనవాళ్లకు సోకితే తేలిగ్గా తగ్గిపోతుంది. బలహీనులకు సోకినప్పుడు వాళ్లు కొంచెం కష్టపడతారు. మన సంగతేమిటో మనకు కొద్దికొద్దిగా తెలిసే రోజుల్లో, పూర్తిగా జీవితాన్ని అవగాహన చేసుకుని, అందులో మన స్థానమేమిటో తెలియని సమయంలో ఇది మనల్ని ఆవహిస్తుంది. ప్రపంచంలోకల్లా నువ్వే గొప్పవాడవనీ, ప్రతివాళ్లూ నీ దగ్గర్నుంచి ఏదో సంగ్రహించదలచుకున్నారనీ అనిపిస్తుంది. కొంతకాలం పోయాక, ఇతరుల గుండెల్లో కూడా పెద్ద ఆత్మే ఉన్నదనీ, అది నీ ఆత్మ కేవిధంగానూ తీసిపోదనీ తెలుస్తుంది. అంతటితో సంగతులన్నీ తేలిగ్గా అర్థమవుతాయి. అప్పుడు బుల్లి గంట నొకదాన్ని పుచ్చుకుని, గంటల గోపురాన్నెక్కినందుకు నీకు సిగ్గేస్తుంది. ఆ గంటలగోపురం నుండే అసంఖ్యాకమైన గంటల గణగణ శబ్దానికి నీ చిన్ని గంట కూడా బాగానే శ్రతి కలిపిందని తెలుసుకుంటావు. చమురులో

పడి మునిగి పోయిన ఈగలాగ నువ్వు వాయించే చిన్న గంట ధ్వని గంటల ధ్వనిలో ఏష్యమైన సరే. నేనేమి చెప్పడానికి ప్రయత్నిస్తున్నానో తెలుస్తోందా?"

"తెలుస్తోందనుకుంటాను. కాని నేనేమీ నమ్మదలచుకోలేదు" అన్నాడు తలూపుతూ నికొలాయ్.

హొహోల్ నవ్వుతూ ఎగిరి గంతేసి చప్పుడు చేస్తూ నడవడం మొదలెట్టేడు.

"నేనూ నమ్మేవాడికి కాదోయ్, బండరాయ్!"

"బండరాయి అనెందుకంటావు?" చిరచిరలాడుతూ నవ్వి నికొలాయ్ హొహోల్ నడిగేడు.

"ఎందుకంటావా? నువ్వల్లాగన్నావు కనుక."

హఠాత్తుగా నికొలాయ్ విరగబడి నవ్వేడు.

హొహోల్ అతని ఎదురుగా నిలబడి :

"ఎందుకలా నవ్వుతున్నావ్?" అని అడిగేడు.

"నీ మనస్సును నొప్పించె వాడెంత అవివేకి అనే భావం స్ఫురించింది" అని నికొలాయ్ జవాబు చెప్పేడు.

వాళ్లు టీ తాగడం ప్రారంభించారు.

నికొలాయ్ ఉడికిన ఒక బంగాళా దుంపను తీసుకుని, బ్రెడ్డుమీద కాస్త ఉప్పు చల్లుకుని నెమ్మదిగా, నిదానంగా ఎద్దులాగా నమలడం మొదలెట్టేడు.

"ఇక్కడ వ్యవహారాలెలా సాగుతున్నాయి" అని నోటి నిండా నములుతూనే అడిగేడు.

అన్‌ద్రేయ్ ఫాక్టకరీలో ప్రచారం బాగానే సాగుతున్న శుభవార్త చెప్పగానే అతడు మళ్లీ విచారగ్రస్తుడైనాడు.

"ఈ పని చాలా ఆలస్యమవుతోంది! చాలా ఆలస్యం... మనమింతకన్న చురుగ్గా పని సాగించాలి!"

తల్లి అతనికేసి చూస్తుంటే, ఆమె హృదయంలో ఒక విధమైన ప్రాతికూల్యం ఉత్పన్నమైంది.

"కొరడాతో కొట్టి పరుగెత్తించడానికి జీవితం గుఱ్ఱంలాంటిది కాదు" అన్నాడు అన్‌ద్రేయ్.

నికొలాయ్ అనంగీకారసూచకంగా తూలపేడు.

“అబ్బే! చాలా కాలం. నేనిలా ఓపిక పట్టలేను. నన్నేం చెయ్యమంటావ్?”

జవాబు కోసం హొహోల్ కేసి చూస్తూ నిస్పృహసూచకంగా చేతులూపాడు.

“మనమంతా బాగా చదువుకుని ఇతరులకు బోధించాలి. మనం చేయవలసిన పని అది” అని తలవాల్చి అన్‌ద్రేయ్ చెప్పేడు.

“అయితే మనం పోరాటాన్ని ప్రారంభించడమెప్పుడు?” అని వెసొవ్‌శ్చికోవ్ అడిగేడు.

“మనం పోరాటమెప్పుడు ప్రారంభిస్తామో నాకు తెలియదు కాని, ఈ లోపుగా వాళ్లు మనల్ని చాలా సార్లు వీపులు చిట్లగొడతారని మాత్ర నేనెరుగుదును” అని నవ్వుతూ హొహోల్ బదులు చెప్పేడు. “నేను చూడగలిగినంతలో, మనం చేతుల్తో ప్రయోగించే ఆయుధాలకన్న బుర్ర ఉపయోగించే ఆయుధాలను సేకరించుకోవాలి” అన్నాడు.

నికొలాయ్ మళ్లీ తినడం ప్రారంభించాడు. తల్లి అతని విశాలమైన ముఖంకేసి రహస్యంగా పరిశీలించింది. అతనిలో ఉండే మంచి ఏమిటో తెలుసుకోవాలని ప్రయత్నించింది.

“అతడు చాలా భయంకరమైన ఆలోచనలు చేస్తున్నాడు” అని తల్లి అన్‌ద్రేయ్ చెవిలో చెప్పింది.

హొహోల్ తలూపుతూ :

“అతను చాలా క్లిష్టమైన మనిషి! కాని త్వరలో ఈ అవస్థ మారిపోతుంది. ఒకప్పుడు నేనూ అలాగే ఉండేవాడిని. నిప్పు మండడానికి ముందు చాలా పొగలను చిమ్ముతుంది. హృదయంలో అగ్నిజ్వాల వెలుగొందే ముందు పొగ రాకతప్పదు. మామ్మా! పడుకోండి. నేను కాస్సేపు చదువుకుంటాను అన్నాడు”

ఒక మూల గుడ్డతెరల వెనుకనున్న మంచంమీద తల్లి పడుకుంది. చాలా సేపటి వరకూ ఆమె నిట్టూర్పులు విడుస్తుండడం, ప్రార్థన చేస్తుండడం అన్‌ద్రేయ్ వింటూనే ఉన్నాడు.

జీవితం త్వరితంగా సాగిపోతుంది. ఒక రోజులా లేదు ఇంకో రోజు. రోజు రోజూ కొత్తదేదో జరుగుతూనే ఉంది. మునుపటిలాగున కొత్తవాళ్లొస్తే బెదరడం తల్లి మానేసింది. మునుపటికన్న తరుచుగా కొత్త మనుష్యులు రాత్రిళ్లొచ్చి అన్‌ద్రేయ్‌తో గుసగుసలాడి పోతుండే వాళ్లు. రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత కోటు కాలర్లు పైకెత్తుకుని టోపీలను కళ్లమీదకు దింపుకుని చీకట్లో నిశ్శబ్దంగా పోతుండేవాళ్లు. పొంగుతున్న ఉద్రేకాన్ని వాళ్లు అణచిపెట్టుకుంటున్న సంగతి నామె గమనించింది. వాల్లంతా నవ్వుతూ పాటలు పాడుకోవాలని కోరుకుంటున్నా, వాళ్లకు వ్యవధి లేకుండా పోతోంది. వాళ్లెప్పుడూ ఏదో తొందరలోనే ఉంటున్నారు. కొందరు గంభీరంగా వెటకారంగా కనబడతారు. మరికొందరు యౌవనోత్సాహంతో కేరింతాలు ఆడుతూ వుంటారు. ఇంకా కొందరు నెమ్మదిగా ఆలోచన నిమగ్నులైవుంటారు. మొత్తం మీద వారంతా ఆత్మవిశ్వాసమూ పట్టుదలా కలవారని తల్లి తెలుసుకోగలిగింది. ఎవరి వ్యక్తిత్వం వారికున్నా

అందరి ముఖాలూ ఇమ్మాస్‌కు పోతున్న క్రీస్తు ముఖంలాంటి ముఖంలో ఐక్యమైపోతున్నట్లు ఆమెకగుపించింది. పలచని ముఖం, దీక్ష ప్రస్ఫుటమయే ముఖం, నల్లని కళ్లలో తీక్షణంగా ప్రసరించే వీక్షణాలను ఆమె గుర్తించింది.

ఒక రోజున ఉంగరాల జుట్టు గల చురుకైన పిల్ల అన్‌డ్రేయ్ కోసం పట్టణం నుంచి ఒక కాగితాల కట్ట పట్టుకొచ్చింది. ఆమె వెళ్లిపోతూ తల్లికేసి ఉషారుగా ఒక తళుకు చూపు చూసి

"కామ్రేడ్, శలవు!" అంది.

"శలవు" అని చిరునవ్వాపుకుంటూ తల్లి సెలవిచ్చింది.

ఆ పిల్లను బయటకి సాగనంపి, కిటికీలోంచి ఆమె చరచర వీధిలో నడుస్తూ పోవడం చూసి తల్లి చిరునవ్వు నవ్వుకుంది. వసంత పుష్పంలోని నవ్యతా, సీతాకొకచిలుక లాటి చురుదనం చూచి ఆనందిందింది.

పట్టణంనుంచి వచ్చే ఈ మనుషుల్లో చిన్న పిల్లలకుండే అమాయకత్వంలాంటిదేదో గోచరించడంతో తనలో తానే జాలితో నవ్వుకుంది. కాని వాళ్లలో ఉండే ఆత్మవిశ్వాసం, పట్టుదల ఆమె కాశ్చర్యం కలిగించి, వారిపట్ల ఎంతో ప్రేమను పురిగొల్పాయి. రోజు రోజుకూ వాళ్ల మంచితనాన్నీ, కార్యదీక్షనూ ఆమె గుర్తించకలిగింది. న్యాయానికి విజయం కలిగి తీరుతుందని వారు కలలు కుంటుంటే ఆమె హృదయం ఉప్పొంగేది. మనసుకొక సంతృప్తి కలిగేది. కాని వాళ్లు మాట్లాడుకునే మాటలు విన్నప్పుడు మాత్రం ఆమె విచారంగా నిట్టూరుస్తూ ఉండేది. ముఖ్యంగా, పరిపూర్ణమైన వాళ్ల నిరాడంబరత్వమూ, స్వీయ సుఖంపట్ల పూర్తి ఆలక్ష్యమూ, ఆమెను బాగా ఆర్షించాయి.

తల్లికి చాలావరకు జీవితాన్ని గురించి వాళ్లనుకునే మాటలు అవగాహనైనాయి. మానవుల కష్టాలకు మూలకారణాలను వాళ్లు తెలుసుకున్నారని ఆమెకు విశ్వాసం కలిగింది. వాళ్ల భావాలను చాలావరకామె అంగీకరించింది. కాని ఆమె హృదయాంతరాళంలో మాత్రం వాళ్లు జీవితాన్ని పునర్నిర్మించగలరనే నమ్మకం కలగలేదు.

"పాపం! పిల్లలు" అనుకుంది.

ఫ్యాక్టరీలోకి కరపత్రాలను అందచేయడం తన ధర్మంగా భావించి తల్లి క్రమం తప్పకుండా ఆ పని చేసింది. గూఢాచారులామెను చూడ్డానికి అలవాటుపడ్డారు. కొన్ని సార్లు ఆమెను సోదా చేశారు. కాని కరపత్రాలు లోపలి కొచ్చిన మర్నాడే ఆ పని జరుగుతుండేది. ఆమె దగ్గర కాగితాలేమీ లేనప్పుడు, కాపలావాళ్ల కనుమానం కలిగేటట్లు చెయ్యడమెలాగో ఆమెకు తెలిసింది. ఆ పనిచేయడంతోనే వాళ్లు ఆమెను పట్టుకుని సోదా చేస్తుండేవాళ్లు. వాళ్లతో వాదన పెట్టుకుని తనను అగౌరవ పరుస్తున్నట్లు నటించేది. ఆ విధంగా వాళ్లను సిగ్గుపడేటట్లు చేసి,

తన తెలివితేటలకు గర్వపడుతూ ఫ్యాక్టరీలోపలి కెళ్లిపోయేది. ఈ నాటకమామెకెంతో సంతోషదాయకంగా ఉండేది.

వెసొవ్‌శ్చికోవ్‌ను ఫ్యాక్టరీ వాళ్ళ మళ్లీ పనిలోకి తీసుకోలేదు. ఒక కలప అడితిలో అతడు పనికి కుదిరేడు. దుంగలను, పలకలను, వంటచెరుకునూ తర్లిస్తూ ఉండడం అతని పని.

* * *

ఒక ఆదివారంనాడు తల్లి బజారు కెళ్లి సరుకులు కొనుక్కుని ఇంటికొచ్చి తలుపు తెరుచుకుని, సంతోషంతో గుమ్మంలోనే నిలబడిపోయింది. లోపల నుంచి పావెల్ విస్పష్టమైన కంఠధ్వని వినబడింది.

"అదిగో! ఆమె వచ్చింది!" అని హొహోల్ కేకేశాడు.

పావెల్ తనకేసి చటుక్కున తిరగడం ఆమె చూసింది. అతని ముఖంలో ఒక్క వెలుగు వెలిగింది. ఆమె కెంతో ఆనందం కలిగింది.

"ఆఖరుకు ఇంటి కొచ్చావే!" అని గొణుగుతూ, చతికిలబడింది. అనుకోకుండా అతడు తిరిగి రావడంవల్ల ఆమె ఆశ్చర్యచకితురాలైంది.

పావెల్ వెల్లబారిన తన ముఖాన్ని ఆమె ముఖానికి చేర్చాడు. పెదవులు అదురుతున్నాయి. కనుకొలకుల్లో నీటిబిందువులు తళతళలాడుతున్నాయి. కొన్ని క్షణాలపాటు నోటంట మాట తొణకలేదు. తల్లి కూడా అతనికేసి మౌనంగా చూసింది.

"చాలా సంతోషం అమ్మా! ప్రేమస్వరూపమైన అమ్మా! చాలా ధన్యవాదాలు!" అని మెల్లని స్వరంతో వణుకుతున్న వేళ్లతో, పావెల్ ఆమె చేతిని గట్టిగా నొక్కేడు.

అతని ముఖంలోని వికాసాన్నీ సంతృప్తినీ చూసి ఆమె పరమానందభరితురాలైంది. అతని కంఠస్వరంలోని మృదుత్వాని కామె సంతోషించి, మెల్లగా చేత్తో అతడి తల తట్టింది. తన గుండెల్లోని దడను శాంతింపచేసుకోవడానికి ప్రయత్నించింది.

"బాగానే ఉంది, మధ్యలో నాకెందుకు ధన్యవాదాలు?" అంది.

"మేము చేస్తూండే మహత్కార్యానికి తోడ్పడినందుకు. మరీమరీ ధన్యవాదాలు" అని పావెల్ రెట్టించాడు. "ఎవరికైనా తనూ తన తల్లీ ఏకమనస్కులు అని చెప్పుకోగలగడం ఎంతో అపురూపమైన ఆనందం."

ఆమె మాట్లాడుకుండా కొడుకు మాటల్లోని మాధుర్యాన్నాస్వాదించింది. ఎదుట నిలబడి ఉన్న కొడుకు మంచితనాన్నీ ప్రేమనూ మెచ్చుకుంది.

"అమ్మా! నీవెంత కష్టాన్ననుభవించావో నాకు తెలుసు. మేము చేసే పని నీకు నచ్చలేదని నేనెరుగుదును. మా పనిని నీ వంగీకరిస్తావని నేనెన్నడూ అనుకోలేదు. మా భావాలు నీ భావాలవుతాయనుకోలేదు. నీ జీవితమంతా ఓర్చుకున్నట్లే, విధిలేక మా భావాలను కూడా ఓర్చుకుంటాననుకున్నాను. అది నాకు కష్టమనిపించింది!"

"సంగతులన్నీ తెలుసుకోవడానికి అన్‌ద్ర్యూష చాలా తోడ్పడ్డాడు" అంది ఆమె.

"అతను నాతో నీ సంగతి చెప్పేడు" అని పావెల్ నవ్వేడు.

"యెగోర్ కూడా. మేమిద్దరం ఒకే ఊరువాళ్లం. అన్‌ద్ర్యూష నాకు చదవడం కూడా నేర్పాలనుకున్నాడు."

"అందుచేత సిగ్గేసి, నీ అంతట నువ్వే రహస్యంగా చదవడం మొదలెట్టానన్నమాట!"

తల్లి ఫక్కున నవ్వింది. ఆమెకుసంతోషంతో ఇంకా తలదిమ్ముగానే ఉంది. గుండె కూడా ఆనందంతో కొట్టుకుంటూనే వుంది. అయితే కొంత వివేచనా, మర్యాదా పాటించి, సహజ శాంతంతో ఉండే తన కొడుకును చూసుకోవాలని ఆమె ఆత్రపడింది. జరుగుతున్నదంతా చాలా అద్భుతంగా ఉంది.

"మనం భోజనం చేద్దాం. పాషా! నువ్వు భోజనం చేసినట్టులేదే?" అంది తల్లి.

"లేదు. నన్ను వాళ్లు వదిలిపెట్టేయడానికి నిశ్చయించుకున్నారని నిన్న జైలరు చెప్పేడు. అందుచేతేమీ తినడానికి గాని తగడానికి గాని మనస్కరించలేదు."

తన కొడుకుకేసి దృష్టి తప్పించకుండానే తల్లి అటూ ఇటూ తిరిగింది. అన్‌ద్రేయ్ చేతులు వెనక్కి పెట్టుకుని కిటికీ దగ్గర నిలబడి పావెల్ చెప్పేమాటలు వింటున్నాడు. పావెల్ పచారుచేస్తున్నాడు. అతడు గెడ్డం పెంచాడు. చక్కని నల్ల వెంట్రుకలు అతని చెంపలమీద ఒత్తుగా ఉంగరాలు తిరిగి ఉన్నాయి. వాటి మూలంగా అతడి ముఖం నలుపు విరిగినట్టుంది.

"రండి. కూర్చోండి" అని తల్లి భోజనం వాళ్ల ముందర పెట్టింది.

"ఏమైనా సరే! మనం ముందుకు చొచ్చుకువెళ్లవలసిందే. వెనకడుగన్న మాటుండకూడదు" అని పావెల్ దృఢనిశ్చయాన్ని ప్రకటించాడు.

"వెళ్లి మనల్ని శత్రువులుగా భావించే లక్షల జనాన్ని ఢీకోవాలన్నమాట, అంతేనా?"

వాళ్లిద్దరూ వాదించుకుంటూటే తల్లి శ్రద్ధగా వింది. రైతులవల్ల ఏమీ ప్రయోజనం లేదని పావెల్ అభిప్రాయమనీ, హొహోల్ రైతుల పక్షంగా ఉన్నాడనీ, రైతులకు కూడా మంచీ చెడ్డా తెలియచెప్పాలని అతని అభిప్రాయమనీ తల్లి గ్రహించింది.

"పావెల్! అది నిజమేనంటావా?" అని తల్లి మధ్యమధ్య అడుగుతుండేది.

"ముమ్మాటికీ నిజం" అని అతడు చిరనవ్వు నవ్వుతూ బదులుచెప్పేవాడు.

* * *

మే దినోత్సవాన్ని జరిపించడానికి ప్రయత్నాలు ప్రారంభమైనాయి.

ఆ ఉత్సవం యొక్క ప్రాముఖ్యాన్ని విశదీకరిస్తూ, కరపత్రాలు ఫ్యాక్టరీలోనూ పేటలోనూ వెదజల్లడం జరిగింది. ప్రచారంవల్ల ఆనాటివరకూ ప్రభావితం కాని యువజనులు కూడా వాటిని చదువుకుని "మనం కూడా వీటిలో పాల్గొనాలి!" అనుకున్నారు.

"ఇక ఆగడానికి వీల్లేదు!" అన్నాడు వెసొవ్‌శ్చికోవ్. "చాలా కాలంగా దాగుడు మూత లాడుకుంటూ వస్తున్నాం!" అని విషాదంగా నవ్వేడు.

ఫోదొర్ మాజిన్ చాలా ఉత్సాహభరితుడయాడు. అతడు పంజరంలోని భరద్వాజ పక్షిలా ఉన్నాడు. చాలా చిక్కిపోయాడు. మాట్లాడినా కదిలినా భయసంకోచాలతో గడగడ వణికిపోతున్నాడు. అతన్నెప్పుడూ యాకోవ్ సొమొవ్ నిశ్శబ్దంగా వెంటాడుతూవుంటాడు.

అతడు వయసుకు పిల్లవాడైనా వయసుకు మించి గంభీరంగా ఉంటాడు. యాకొవ్‌కు పట్టణంలో ఇప్పుడు పని దొరికింది. సమోయ్‌లొవ్ (జైలు నివాసంవల్ల అతని వెంట్రుకలు ఎర్రబడినట్లున్నాయి), వసీలియ్ గూసెవ్, బూకిన్, ద్రగూనొవ్, ఇంకా కొందరూ ఆనాడు సాయుధ ప్రదర్శనం జరిపించాలని పట్టుబట్టేరు. పావెల్, హొహోల్, సోమొవ్, ఇంకా కొందరూ ఆ అభిప్రాయాన్ని వ్యతిరేకించారు.

యెగోర్ వ్లాసొవ్‌ల ఇంటికి వస్తూ ఉండేవాడు. ఎప్పుడూ ఆయాసపడుతూ, ఊపిరాడక చెమటలు కక్కుతూ వేళాకోళాలాడుతూ:

"కామ్రేడ్స్! ప్రస్తుతం ఉన్న సాంఘిక విధానాన్ని మార్చడానికి మనం చేస్తున్న కృషి చాలా గొప్పదే. కాని మన విజయాన్ని త్వరితంగా సాధించాలంటే, నేనొక కొత్త బూట్సు జత కొనుక్కోవడం విధాయకం." తడిసి చినిగిపోయిన బూట్సును అందరికీ చూపించాడు.

ఇటువంటి అలంకారభూయిష్టమైన భాషలో అతడు ఇతర దేశాల్లోని కార్మికులు తమ జీవితాలనుద్ధరించుకోవడానికి పడుతున్న పాట్లు అన్నీ చెప్పాడు. అతని ఉపన్యాసాలను వినాలని తల్లి ఎంతో ముచ్చటపడేది వాటిని విన్నాక ఆమె మనస్సుకి అవి చిత్రంగా హత్తుకునేవి.

ఒక రోజున యెగోర్ చెప్పిన మాటలన్నీ తనేవిధంగా అవగాహన చేసుకుందో ధైర్యం చేసి యెగోర్‌తో చెప్పింది.

"యెగోర్ ఇవానొవిచ్! దాని సంగతంతేనా?" అని తత్తరపడి చిరునవ్వుతో అడిగింది.

ఒకరోజున యెగోర్‌ను గురించి పావెల్, అన్‌డ్రేయ్‌తో ఇలా అన్నాడు :

"అసలు సంగతేమంటే, అన్‌డ్రేయ్! పైకెక్కువగా వేళాకోళాలాడే మనుష్యులు, సాధారణంగా లోపల ఎక్కువ బాధపడేవాళ్లే.

హొహోల్ కొంచెం సేపు నిదానించి, కళ్లు చిట్లించి, జవాబిచ్చాడు.

"నువ్వు చెప్పినమాటే నిజమైతే, రష్యా అంతా నవ్వలేక చస్తుందనే అనుకోవాలి."

నతాషా వస్తూ ఉండేది. ఆమె కూడా మరొక పట్నంలో జైల్లో ఉండేది. ఆ అనుభవం ఆమెలో ఏమంత మార్పు తెచ్చినట్లు కనబడ్డం లేదు. ఆమె ఎదురుగా ఉంటే హొహోల్ చాలా ఉత్సాహంగా ఉంటాడనీ, అందరితోనూ వేళాకోళాలాడుతుంటాడనీ తల్లి గ్రహించింది. కాని నతాషా వెళ్లిపోవడంతోనే ఈలమీద విషాద గీతాలు పాడుకుంటూ గదిలో పచారుచేస్తూ ఉంటాడు.

సాషా తరుచుగా వస్తూ ఉండేది. కాని ఎప్పుడూ హడావిడిగా, చిర్రుబుర్రుమంటూ వచ్చేది. ఎందుచేతనో కాని ఇటీవల మరీ చిరచిరగానూ ముక్తసరిగానూ ఉంటోంది.

ఒకరోజు పావెల్ ఆమెను సాగనంపడానికి గుమ్మందాకా వెళ్లి తలుపు చేరవేయడం మరచిపోయాడు. తల్లి వాళ్లిద్దరి సంభాషణా విన్నది.

"జండా మీరు పుచ్చుకుంటారా?" అని నషా మెల్లగా అడిగింది.

"అవును"

"తుది నిర్ణయమేనా?"

"అవును. అది నా ప్రత్యేకమైన హక్కు."

"అంటే మళ్లీ జైలు కెళ్లడమన్నమాటేనా?"

పావెల్ బదులు చెప్పలేదు.

"పోనీ మీరు మానే...."

"ఏమిటి?"

"ఇంకెవరినైనా ఆ పని చేయనియ్యకూడదా"

"కూడదు" అన్నాడు ఖచ్చితంగా.

"బాగా ఆలోచించండి. మీరు బాగా పలుకుబడి కలవారు. అందరికీ మీరంటే ఇష్టం. మీరన్నా, అన్‌డ్రేయ్ అన్నా ప్రజలకు చాలా ఇష్టం. మీరిద్దరూ ఇక్కడుంటే మీరెంత

మంచి పని చేయగలుగుతారో ఆలోచించండి! జండాను మీరు పుచ్చుకుంటే వాళ్లు మిమ్మల్ని ప్రవాసానికి పంపుతారు. చాలా కాలంపాటు చాలా దూరానికి పంపేస్తారు."

తల్లికి ఆ అమ్మాయి కంఠధ్వనిలో భయం, ఆపేక్ష ప్రత్యక్షంగా ద్యోతకమవుతున్నాయి. సాషా చెప్పిన మాటలు ఆమె హృదయం మీద మంచునీళ్లు చల్లినట్లనిపించాయి.

"నేను కోరినా తిరుగుండదా?

పావెల్ మాటలో అమాంతంగా చురుకుదనమూ కరుకుదనమూ వచ్చేసింది.

"అలాంటి మాట మీరు చెప్పకూడదు! చెప్పకూడదు!"

"నేనూ మానవమాత్రురాలినే" అంది ఆమె మృదువుగా.

"అద్భుతమైన మానవులు!" అని మెల్లగా గద్గదస్వరంతో అతడు జవాబిచ్చాడు. "నా కత్యంత ఆప్తులు మీరు! అందుచేతనే అందుచేతనే మీరలాంటి మాటలు చెప్పకూడదు."

"శలవు" అంది ఆ అమ్మాయి.

ఆమె మడమల చప్పుడును బట్టి ఆమె పరుగెత్తుతోందని తల్లి గ్రహించింది. పావెల్ తోటలో కెళ్లాడు.

తల్లి హృదయం భయంచేత కుంగిపోయింది. వాళ్లిద్దరూ ఏమి మాట్లాడుకుంటున్నారో ఆమెకు బాగా అర్థం కాలేదు. కాని తనకేదో పెద్ద ముప్పు రాబోతోందని మాత్రం ఆమె గ్రహించింది.

"ఇతనేం ఆలోచిస్తున్నాడో' అనే ఆలోచనలో పడింది.

"నువ్వేమీ చెయ్యాలని ఆలోచిస్తున్నావ్, పాషా?" అని అడిగింది.

"ఎప్పుడు? ఇప్పుడా?"

"కాదు. మే ఒకటవ తేదీని."

"ఓ! అదా? నేను మన జండాను పట్టుకుని ఊరేగింపుకు ముందు నడవదలచుకున్నాను. బహుశా ఆ కారణంచేత వాళ్లు మళ్లీ జైలుకు పంపుతారనుకుంటాను" అన్నాడు పావెల్ మెల్లగా.

తల్లికి కళ్లు పీకడం మొదలుపెట్టేయి. నోరెండింది. పావెల్ ఆమె చేయి పట్టుకుని మెల్లగా బుజ్జగించాడు.

"నేను ఆ పని చేసితీరాలి. అమ్మా! బాగా అర్థం చేసుకో."

"నేనేమీ అనలేదే" అని మెల్లగా తలెత్తి జవాబుచెప్పింది. కాని అతని నేత్రాల్లో కరుకైన మెరుపామె కంటబడడంతోనే ఆమెకు భయం కలిగింది.

అతడు నిట్టూర్పు విడిచి ఆమె చేతిని వదిలిపెట్టేడు.

"అదొక రకమైన ప్రేమ. జీవితానికి ప్రతిబంధకం కలిగించే ప్రేమ."

"వద్దు పాషా! వద్దు" అంది తల్లి. తన మనసుకు క్షోభ కలిగించే మాటలింకా ఏమైనా చెపుతాడేమనని ఆమె భయపడింది. "నా కర్థమైంది.... నువ్వు ఇంకో పనిచెయ్యలేవు.... నీ కామ్రేడ్సు కోసం..."

"వాళ్లకోసం కాదు. నాకోసమే" అని పావెల్ సవరించాడు.

తల్లికి ఏడుపొచ్చింది.

"అయ్యయ్యో! మరచిపోయాను" అంటూ బయటి కెళ్లిపోయింది. తను ఏడుస్తుంటే కొడుకు చూడకూడదని ఆమె అభిప్రాయం.

ఓరగా తెరచి ఉన్న గుమ్మంలో నుంచి వాళ్లిద్దరూ మెల్లగా వాదించుకోవడం ఆమె చెవిలో పడింది.

"ఏమిటి నీ అభిప్రాయం? ఆమెనలా బాధించడం నీకు సరదాగా ఉందా?" అని హోహోల్ అడిగేడు.

"ఇలాంటి విషయాల్లో నిష్కర్షగా ఉండాలి. అవునో కాదో చెప్పడానికి జంకకూడదు."

"ఆమెతోనా?"

"ఎవరితోనైనా సరే. నా కాళ్లకు చుట్టుకుని నన్ను దిగదీసే ప్రేమ కాని, స్నేహం కాని నా కక్కర లేదు..."

"గొప్ప వీరుడవులే! వెళ్లి ముక్కు తుడుచుకో! సాషాకు చెప్పు.. ఆమె..."

"నేనామెతో అప్పుడే చెప్పేశాను..."

"ఓ! చెప్పలేదు! నువ్వామెతో మెల్లగా, ప్రేమ ఒలికేటట్టుగా చెప్పేవు. నేను వినకపోయినా, నువ్వు చెప్పేవులే. కాని అమ్మ దగ్గర మాత్రం గొప్ప వీరుడవుగా కనబడాలి! నీ తలతిరుగుడంతకీ పిసరంత విలువ లేదు. ఆ సంగతి తెలుసుకో..."

నీలొవ్నా త్వరత్వరగా కళ్లు తుడుచుకుంది. హోహోల్ ఇంకా ఏమి దుడుకుగా మాట్లాడుతాడోనని భయపడుతూ గభాలున తలుపు తోసుకుని వంటింట్లో ప్రవేశించిది.

"హూ!" ఎంత చలిగా ఉందో!" అని ఆమె బిగ్గరగా అంది. భయంతోనూ, దుఃఖంతోనూ వణుకుతున్న గొంతుకతో "ఇది వసంతమని ఎవరనుకుంటారు?" అంది.

మాటలు ఆగిపోయాయి. తల్లి వంటింట్లో మధ్యగా నిలబడి వింటోంది.

"ఆమె ఏమంటోందో విన్నావా? ఇప్పటికైనా నువ్వామెను సరిగా అర్థం చేసుకోవాలి. మాటలకేం గాని, నిజానికి నీకన్న ఆమె ఎక్కువ ధైర్యస్థురాలు!" అన్నాడు హొహోల్ మెల్లగా.

"టీ తాగుదామా?" అని అమ్మ వణుకుతూ అడిగింది. తానెందుకు వణుకుతున్నదీ చెప్పడానికి అన్నట్లు "అబ్బ! చలి! నేను ముద్దకట్టుకుపోతున్నాను" అంది.

మెల్లగా పావెల్ ఆమె దగ్గరకెళ్లేడు. తలంవచుకుని తన తప్పు నంగీకరించినట్లుగా చిన్న నవ్వు నవ్వేడు:

"అమ్మా! క్షమించాలి. నేనింకా చిన్నవాడిని... తెలివితక్కువవాడిని కూడా."

తల్లి అతన్ని దగ్గరకు లాక్కుని తల రొమ్ముకు చేర్చుకుని ఎక్కిఎక్కి ఏడ్చింది.

"నా పాటికి నన్నొదిలెయి! నాకేమాటా చెప్పద్దు. నీ జీవితం నీ చేతిలోనే ఉందని భగవంతుడికి తెలుసు. దాన్ని నీ యిష్టమొచ్చినట్లు ఉపయోగించుకో. కాని నన్నొదిలెయ్యి. అయితే తల్లి కొడుకును ప్రేమించడం మానగలదా? ప్రేమించక తప్పదు. నేను మిమ్మల్ని అందరినీ ప్రేమిస్తున్నాను. మీరంతా నాకు ప్రేమాస్పదులే. మీరందరూ ప్రేమించదగినవారే. నేను ప్రేమించకపోతే మిమ్మల్ని ప్రేమించే వాళ్లెవరు? నీవు వెళ్లిపోతావు. మిగిలిన వాళ్లు నిన్ను అనుసరిస్తారు. అన్నీ వదులుకుని నీ వెంట వస్తారు!"

ఆమె హృదయంలో ఎన్నో గొప్ప గొప్ప ఉజ్వలభావాలు పొంగుకొచ్చాయి. హృదయం విషాదభరితమైన సంతోషసాగరంలో తేలి ఆడింది. దాన్ని వ్యక్తం చేయడానికి మాటలు తొణకలేదు. ఆవేదనతో కొడుకును చురచుర చూసిది. ఆమె కళ్లలో తీక్షణమూ ప్రగాఢమూ అయిన బాధ కనబడుతోంది.

"సరేనమ్మా! సరే! నన్ను క్షమించు. నాకిప్పుడంతా అర్థమౌంది. దీన్ని నేనెన్నడూ మరచిపోను. మరచిపోనని ప్రమాణం చేస్తున్నాను!" అంటూ పావెల్ చిరునవ్వుతో ఆమె ముఖంకేసి చూశాడు అతడికి సంతోషమైంది. కాని కొంచెం సిగ్గుపడ్డాడు.

ఆమె పావెల్‌ని వదిలిపెట్టి పక్క గదిలోకి తొంగిచూసి:

"అన్‌ద్రూష్యా! అతనిమీద కేకలెయ్యకండి. మీరు అతనికంటె పెద్దవారు కదా..." అని మృదువుగా హెచ్చరించింది.

"ఓహో అలాగా! కేకలెయ్యడం మానను సరికదా, రెండు గుద్దులు కూడా గుద్దతాను..." అన్నాడు తిరిగి చూడకుండానే.

ఆమె అతని దగ్గరగా వెళ్లి చేయి చాస్తూ:

"ఎంత మంచివాడవోయ్!"

అతడు చర్రున తిరిగి, ఆమె పక్కనుంచి వంటింట్లో కెళ్లేడు. చేతులు వెనక్కి పెట్టుకుని ఆబోతులా తలదించి తీవ్రమైన వెటకారంతో మాట్లాడేడు:

"నన్ను లాగకు నన్ను తిరగతోసెయ్యగలవు!" అన్నాడు హొహోల్.

"మీరు సిగ్గుపడడమెందుకు? కానివ్వండి. మీరిద్దరూ ఒకరినొకరు గట్టిగా కౌగిలించుకుని ముద్దెట్టుకోండి" అంది తల్లి.

"ఆ పని చేద్దామా?" అన్నాడు పావెల్.

"రా" అంటూ హొహోల్ లేచి నిలబడ్డాడు.

వాళ్లిద్దరూ గాఢంగా కౌగిలించుకున్నారు. శరీరాలు వేరు కాని స్నేహంచేత ఆత్మ ఒక్కటైంది. తల్లి చెక్కిళ్లమీదనుంచి ఈ సారి ఆనందాశ్రువులు ప్రవహించాయి.

పావెల్ మాట్లాడబోతున్నట్లు, చెయ్యి పైకెత్తేడు. కాని తల్లి అతని చెయ్యి పట్టుకుని కిందికి లాగింది.

"అతని మాటకడ్డెళ్లకు" అని మెల్లగా చెవిలో చెప్పింది.

హొహోల్ గుమ్మాని కడ్డంగా నిలబడి మాట్లాడ్డం సాగించాడు.

"ప్రజలింకా చాలా కష్టాలనుభవిస్తారు. ఇంకా ఎంతో రక్తాన్ని స్రవింపచేస్తారు. కాని నా హృదయం దేన్ని భరిస్తోందో, మనస్సు దేన్ని కాంక్షిస్తోందో, దానికి మాత్రం ఈ కష్టాలూ, ఈ రక్తబలీ అందవు. నక్షత్రమూ దాని కిరణాలు ఎంత గొప్పవో నేనంత గొప్పవాడిని. నేను దేనినైనా భరించగలను. ఎంతటికైనా ఓర్వగలను. ఏమంటే నాలో ఒక మహదానందం ఉంది. దానిని ఏదీ, దాన్ని ఎవ్వరూ నా దగ్గరనుంచి లాక్కోలేరు. ఈ ఆనందమే నా బలం!"

టీ తాగుతూ వాళ్లు ముగ్గురూ జీవితాన్ని గురించీ, ప్రజలను గురించీ, వాళ్ల భవిష్యత్తును గురించీ మాట్లాడుకుంటూ అర్ధరాత్రిదాకా కూచున్నారు.

* * *

ఒక రోజు ఉదయం, పావెల్, అన్ద్రేయ్ పనిలో కెళ్లిన తర్వాత కోర్సునొవా కిటికీ తలుపు తట్టింది.

"ఇసాయ్‌ని చంపేశారు. చూసి వద్దాం రా!" అంది.

తల్లి ఉలికిపడింది. హంతకుడి పేరామె మనసుకు చటుక్కున స్ఫురించింది. శాలువ భుజం మీద నేసుకుంటూ,

"ఎవరు చేశారంటావు?" అని అడిగింది.

"చంపినవాడక్కడే ఇసాయ్ పక్కన కూచుంటాడనుకుంటున్నావా? దెబ్బతో పడగొట్టి పారిపోయాడు."

వాళ్లిద్దరూ దూరంగా పోతుంటే కోర్సునొవా ఇలా చెప్పింది: మళ్లీ కొత్తగా సోదాలు ప్రారంభమవుతాయి. హంతకుడిని పట్టుకునేందుకు ప్రయత్నాలు జరుగుతాయి.

ఫ్యాక్టరీ సమీపంలో తగలబడిపోయిన ఇంటి ముందు జనం గుంపుగా చేరి కందిరీగల్లా ధ్వని చేస్తున్నారు. కాలిపోయిన దూలలెక్కి బూడిద రేగ గొడుతున్నారు. ఆ గుంపులో స్త్రీలు, అంతకన్న ఎక్కువగా పిల్లలు, దుకాణాదారులు, సారాదుకాణంలో పనిచేసేవాళ్లు, పోలీసులూ ఉన్నారు. పొడుగాటి విగ్రహం, నెరిసిన కుచ్చుగడ్డం, రొమ్మునిండా పతకాలు గల పోలీసు ఉద్యోగి పేట్లిన్ కూడా ఉన్నాడు.

ఇసాయ్ సగం కూచున్నాడు. సగం నేల కొరిగేడు. నల్లగా బొగ్గయిన దూలాని కానుకున్నాడు. తల కుడి భుజం మీదకు వ్రేలబడిపోయింది. కుడి చెయి లాగుజేబులో ఉండిపోయింది. ఎడమ చేతి వేళ్లు మెత్తని మట్టిలో కూరుకుపోయాయి.

తల్లి అతని ముఖంకేసి చూసింది. అతని కాళ్ల సందున పడున్న టోపీని కళావిహీనమైన ఒక కన్ను తేరిపారచూస్తోంది. అతని నోరు, ఆశ్చర్యపడుతున్నట్లుగా సగం తెరుచుకుంది. ఎఱ్ఱటి గడ్డం పక్కకు తొలిగింది. అతని పలచని శరీరం, కోసుతల నిడుపైన మచ్చల ముఖం చావువల్ల మరింత కుంచించుకుపోయినట్లు కనబడింది. తల్లి శిలువ గుర్తు వేసుకుని నిట్టూర్పు విడిచింది. అతడు బతికున్నప్పుడామె కతనంటే అసహ్యంగా ఉండేది. కాని ఇప్పుడు అతడిని చూస్తుంటే ఆమెకు జాలేసింది.

"ఎక్కడా రక్తం కనబడ్డంలేదు. పిడికిలితో కొట్టి ఉండాలి" ఎవడో గుసగుసగా అన్నాడు.

"తను తీసుకున్న గోతిలో తనే పడ్డాడు. దొంగముండాకొడుకు" అన్నాడు మరొకడు కసితీరా.

పోలీసు ఉద్యోగి, ఆడవాళ్లను తోసుకుంటూ వచ్చి బెదిరిస్తూ:

"ఎవరా మాట్లాడేది?" ప్రశ్నించాడు.

జనం అతనికి దారిచ్చారు. కొందరు గబగబా వెళ్లిపోయారు. ఒకడు వికటంగా నవ్వేడు.

తల్లి ఇంటికెళ్లింది.

"అతన్ని గురించి అయ్యో అనేవాళ్లు లేరే" అనుకుంది, తనలో తనే.

ఆమె మనోనేత్రాలనికి స్థూలకాయుడైన నికొలాయ్ తనకేసి నిస్పృహతో రెప్ప వాల్చకుండా చూస్తున్నట్లగుపడింది. అతడి కుడి చెయ్యి ఇప్పుడే కొట్టేసినట్లుగా ఊగుతూ కనబడింది.

అన్‌డ్రేయ్, పావెలూ ఇంటికి రాగానే వాళ్లని ఆ సంగతి అడిగింది.

"ఇప్పటి కెవరినైనా అరెస్టు చేశారా?"

"ఏమీ వినలేదు" అన్నాడు హొహోల్.

వాళ్లిద్దరూ కూడా కుంగిపోయి ఉన్నట్లామె గ్రహించింది.

"ఎవరైనా నికొలాయ్ పేరు చెప్పేరా?"

"లేదు" అన్నాడు పావెల్. అతడి చూపులో ఒక విధమైన కరుకుదనమూ, మాటలో ఒక ప్రత్యేకతా ఆమె గమనించింది.

"వాళ్లు అతని అనుమానిస్తున్నారని అనుకోను. అతడెక్కడో ఉన్నాడు. నిన్న మధ్యాహ్నమే అతడు ఏటికెళ్లిపోయాడు. ఇంకా తిరిగి రాలేదు. అతడిని గురించి నేను వాకబు చేశాను" అన్నాడు పావెల్.

తల్లి ఉపశమించి నిట్టూర్పు విడిచి,

"దేవుడు చల్లగా చూడాలి! దేవుడు చల్లగా చూడాలి" అంది.

హొహోల్ ఆమెకేసి తేరిపార చేసి తలొంచుకున్నాడు.

"ఏమీ ఎరగనివాడిలా అక్కడు పడున్నాడు. అతడి గురించి విచారపడేవారెవ్వరూ లేరు. ఒక్క మంచిమాట మాట్లాడేవారు కనబడరు. తలపెట్టేవారు కూడా లేరు. నరికి పారేసిన వస్తువులా పడి ఉన్నాడు" సాలోచనగా అంది తల్లి.

భోజనం చేస్తూ చటుక్కున పావెల్ చెంచా పారేసి:

"అది నావల్ల కాదు!" అని ఒక్క కేకేశాడు.

"ఏమిటి?" అని హొహోల్ అడిగేడు.

"ఆహారం కోసం పశువులను చంపుతాం. అదే చెడ్డపని. అడవి జంతువులు ప్రమాద కరమైనప్పుడు వాటిని చంపక తప్పదు. మానవుడు క్రూరజంతువుగా మారి తోటి మానవులను చంపుకు తింటుంటే, అలాటివాడిని నేను చంపగలను. కాని అలాంటి సన్నాసి వెధవను చంపడానికి ఎవరికి చెయి వచ్చిందో?"

హొహోల్ భుజాలెగరేశాడు.

“ఏ క్రూరజంతువుకన్నా అతడు ప్రమాదకరమైనవాడు. దోమ ఒక్క రక్తం చుక్క పీల్చినదుకే దాన్ని చంపుతాం కదా.”

“అది నిజమే. నా అభిప్రాయం అది కాదు. అది చాలా అసహ్యమైన పని అంటున్నాను.”

“కాని వేరే శరణ్యం లేదు. తప్పదు.”

“నువ్వలాంటి అధముణ్ణి చంపగలవా?” అని కొంచెం సేపు ఆలోచించి పావెల్ అన్‌ద్రేయ్ నడిగేడు.

హొహోల్ అతన్ని, విశాలమైన నేత్రాలతో, తదేక దృష్టితో చూసి తటాలున తల్లివైపు తన చూపు మరల్చాడు. విచారంతోనే అయినా ఖచ్చితంగా అన్నాడు:

“నా కామ్రేడ్సు కోసం నా ఉద్యమం కోసం నేనే పనిచేయవలసొచ్చినా చేస్తాను. చివరకు నా సొంత కొడుకునైనా చంపుతాను” అన్నాడు.

“ఓయ్, అన్‌ద్ర్యూషా!” అని తల్లి ఆశ్చర్యంతో కేకవేసింది.

“తప్పదమ్మా! జీవితమంతే” అని చిన్న నవ్వు నవ్వేడు.

“నిజమే, నువ్వ చెప్పేది నిజమే. జీవితమంతే” అన్నాడు పావెల్.

హఠాత్తుగా అన్‌ద్రేయ్ చాలా ఆవేశంతో లేచి ఒక్క గంతేశాడు. ఏదో అంతశ్శక్తి అతన్నలా ప్రేరేపించింది, చేతులు ఊపుకుంటూ మాట్లాడేడు:

పావెల్ తెల్లబోయి తల పైకెత్తి తేరిపారి అతనికేసి చూశాడు. ఆందోళనకరమైన ఆలోచన తనను ఆవరించుతూన్నట్టు తల్లికి అనిపించింది.

“ఏమిటది, అన్‌ద్రేయ్?” అని పావెల్ మెల్లగా ప్రశ్నించాడు.

హొహోల్ తలూపి, నిలువుగా నిలబడి సూటిగా తల్లికేసి చూశాడు.

“అది జరగడం నేను చూశాను... నాకంతా తెలుసు...”

తల్లి ముందుకు చొచ్చుకెళ్లి అతని చేతులను గట్టిగా పట్టుకుంది. అతడు తన కుడిచేతిని వదిలించుకోవడానికి ప్రయత్నించాడు. కాని ఆమె పట్టు వదల్లేదు.

“ఉష్! ఊరుకో నాయనా! ఊరుకో!...” అని చెవిలో చెప్పింది.

“ఉండండి! అదెలా జరిగిందో చెప్తాను” అన్నాడు హొహోల్.

“చెప్పద్దు, అన్‌ద్ర్యూషా!” అని నీరు నిండిన కళ్లతో అతని వంక చూస్తూ తల్లి గొణిగింది.

పావెల్ మెల్లగా దగ్గర కొచ్చాడు. అతని ముఖం వెల్లబారింది. గ్రుడ్లలో నీళ్లు తిరిగేయి. చిన్న నవ్వు తెచ్చుకుని,

"అమ్మ నువ్వేమోనని భయపడుతోంది" అన్నాడు.

"నేను భయపడ్డ లేదు! నేను నమ్మను! నా కళ్లతో చూసినా నేను నమ్మను..."

"ఉండండి" అని చేతులు విడిపించుకోవడానికి ప్రయత్నించాడు హొహోల్. "నేను కాదు. కాని నేను ఆపాలంటే ఆపగలిగేవాడినే" అన్నాడు.

"ఇష్! అన్‌ద్రేయ్" అన్నాడు పావెల్.

పావెల్, హొహోల్ చేతిని తన చేత్తో పుచ్చుకుని రెండవ చేతిని అతని భుజం మీద వేశాడు. వణుకుతున్న పొడుగాటి శరీరాన్ని శాంతపరచేందుకా అన్నట్టు గద్గద స్వరంతో అన్‌ద్రేయ్ ఇలా అన్నాడు :

"పావెల్ నేనది జరగాలని అనుకోలేదు సుమా. జరిగిన సంగతిది: నువ్వు నన్నూ, ద్రగూనొవ్‌నూ ఆ మూల వదిలిపెట్టి వెళ్లేవు కదా. మేమిద్దరం మాట్లాడుకుంటుంటే ఇసాయ్ వచ్చి మమ్మల్ని చూస్తూ, వెక్కిరించాడు. 'చూశావా? వాడు రాత్రంతా నన్ను వెంబడించే ఉన్నాడు. వాడిని గట్టిగా ఉతికెయ్యాలి' అన్నాడు ద్రగూనొవ్. తర్వాత అతడు వెళ్లిపోయాడు – ఇంటికెళ్లిపోయాడనుకుంటాను... పిమ్మట ఇసాయ్ నా దగ్గర కొచ్చాడు..." హొహోల్ పెద్దగా నిట్టూర్చేడు.

"అప్పుడు నన్నెవరూ ఎప్పుడూ అవమాన పరచనంతగా అవమానించాడు. కుక్క వెధవ!"

తల్లి నెమ్మదిగా అతన్ని బల్ల దగ్గరకు తీసుకెళ్లి కూచోపెట్టింది. తన భుజాలు అతనికి తగిలేటట్టు అతని దగ్గరగా కూచుంది. పావెల్ చిరచిరలాడుతూ గడ్డం దువ్వుకుంటూ నిలబడే ఉన్నాడు.

"మన పేర్లన్నీ వాళ్లకు తెలిసిపోయాయనీ, మనమంతా పోలీసు జాబితాలో ఉన్నామనీ, మేడే ఉత్సవాలకు ముందుగానే మనల్ని అరెస్టు చేస్తారనీ వాడు చెప్పేడు. లోపల మండుతున్నా, నేనేమీ జవాబు చెప్పలేదు. నవ్వేసి ఊరుకున్నాను. నేను చాలా చురుకైనవాడిననీ, ఈ మార్గాన్ని అనుసరించడం దురదృష్టమనీ అన్నాడు. నువ్వు..." ఆగి ఎడం చేతో ముఖం తుడుచుకున్నాడు. అతని కళ్లు మెరిశాయి.

"నా కర్థమైందిలే!" అన్నాడు పావెల్.

"నువ్వు అధికార్లకి సాయంచెయ్యడం మంచిది' అన్నాడు."

హొహోల్ పిడికిలి ఊపి పళ్లు పటపట కొరికి ఇలా అన్నాడు:

"అధికార్లకట వాడి శ్రాద్ధం! అంతకన్న వాడు ముఖంమీద గుద్దినా బాగుండేది. అది నాకూ వాడికీ కూడా మంచిదే. వాడలా నా హృదయం మీద, కుళ్ళుకంపు కొట్టే శ్లేషాన్ని ఉమ్మడం నేను భరించలేకపోయాను."

అన్‌ద్రేయ్ ఆవేశంతో పావెల్ చేతిలోనుంచి తన చేతిని విసురుగా లాక్కున్నాడు. అసహ్యించుకుంటూ మెల్లని స్వరంతో ఇలా చెప్పేడు:

"నేను వాడి ముఖం మీద ఒక్క దెబ్బ కొట్టి వెళ్లిపోయాను. ద్రగూనొవ్ నా వెనకాలే మెల్లగా 'దొరికావురా ఆఖరికి!' అనడం విన్నాను. అతడు ఆ మూలనే కాసుకుని ఉండి ఉండాలి. నేను వెనక్కి తిరిగుదామా అని అనుకున్నాను. కాని తిరగలేదు. దెబ్బ కొట్టిన చప్పుడు వినబడింది. కాని నా దారిన నేను కప్పమీద కాలేసి దాటిపోయినట్లు ముందుకెళ్లి పోయాను. పనిచేసే చోటికి కొందరొచ్చి, 'ఎవరో ఇసాయ్‌ని చంపేశారు!' అని అరిచారు. నేను నమ్మలేకపోయాను. కాని నా చెయ్యి తీపు పెట్టడం మొదలెట్టింది. పనిచెయ్యలేక పోయాను. నిజానికి నాకేమీ నొప్పట్టలేదు, కాని చెయ్యి కురుచ అయిపోయినట్టు అనిపించింది." అన్‌ద్రేయ్ తన చేతికేసి తీక్షణంగా చూశాడు. "ఈ అసహ్యమైన మచ్చను ఈ జీవితంలో కడిగెయ్యలేననుకుంటాను."

"నీ హృదయం నిష్కళంకంగా వుండాలి అదే ముఖ్యమైన సంగతి" అంది తల్లి మృదువుగా.

"నావల్ల ఏ తప్పూ వుందని నేననుకోవడం లేదు ఎంత మాత్రం అనుకోవడం లేదు!" అన్నాడు హోహోల్ దృఢంగా. "అసహ్యం వేస్తోంది, అంతే. దీనిలో ఇరుక్కోకుండా వుండవలసింది నేను,"

పావెల్ భుజాలెగరేసి:

"నీ మాట నాకర్థం కావడం లేదు. నువ్వు చంపలేదు కదా! చంపితే మాత్రం..." అన్నాడు.

"వినవయ్యా సోదరా ఒక హత్య జరుగుతోందని నీకు తెలిసినప్పుడు, దాన్ని నువ్వు ఆపకపోతే..."

"అదేనమ్మా జీవితం! ప్రజలు ఒకళ్ల మీద కొకళ్లు ఏ విధంగా రెచ్చగొట్టబడుతున్నారో చూడు. అనుకోకుండానే నువ్వొకళ్లను దెబ్బ తియ్యవలసొస్తోంది. ఇంతకూ నువ్వెవరిని కొడుతున్నావు? నీలాగే నీ హక్కులూ లేని నిర్భాగ్యపు జీవిని. ఈ సందర్భంలో అతడు నీకన్న అదృష్టహీనుడు. ఏమంటే వాడు వట్టి మూర్ఖుడు. పోలీసులు, గూఢచారులు అంతా మనకు శత్రువులే. కాని వాళ్లంతా మనలాటి మనుష్యులే. మనకు మల్లేనే వాళ్ల రక్తం కూడా పీల్చబడుతోంది. మనల్ని చూసినట్లుగానే వాళ్లని కూడా హీనంగానే చూస్తారు. మనమంతా ఒక్క తరహా వాళ్లమే. కాని యజమానులు మాత్రం ప్రజల్ని ఒకళ్ల మీద ఇంకొకళ్లను రెచ్చగొట్టి

ఉంచుతారు. భయంతోనూ, అవివేకంతోనూ వాళ్లను అంధులను చేస్తారు. చేతులూ కాళ్లూ కట్టేసి, బాగా నలిపేసి రక్తం పీల్చేస్తారు. చివరికి ఒకళ్లనొకళ్లు కొట్టుకుని అంతా నలిగిపోతారు. వాళ్లు ప్రజలను తుపాకులుగానూ, కర్రలుగానూ, రాళ్లుగానూ మార్చేసి, 'ఇదే రాజ్యం' అంటారు."

అతడు తల్లికి దగ్గరగా వెళ్లేడు.

"అమ్మా! అది చాలా అపరాధం. లక్షలాది ప్రజలను దుర్మార్గంగా హత్యచెయ్యడం. మానవుల ఆత్మలను బలవంతంగా హత్యచెయడం. ఆ సంగతి కనిపెట్టేవా? ఆత్మలను హత్య చేసేవాళ్లని గుర్తించావా? మాకూ వాళ్లకీ ఉండే తేడాను గ్రహించావా? మే మెవళ్లనైనా కొట్టినపుడు అది అసహ్యం, సిగ్గుచేటు, బాధాకరం. ఎక్కువగా అసహ్యకరం. కాని వాళ్లు వేలాది ప్రజలను చల్లగా నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు. ఏ విధమైన సంకోచం లేకుండా చంపి గొప్పగా సంతృప్తి చెందుతారు. జనాన్ని ఈ విధంగా నలిపేసి చంపడమెందుకంటే మనల్ని బానిసలుగా చేసే తమ వెండి బంగారాలనూ, వస్తువాహనాది భాగ్యాలనూ రక్షించుకోవడానికి. బాగా ఆలోచించు ప్రజల్ని చంపి, వాళ్ల ఆత్మలను ముక్కలు చెక్కలు చెయ్యడం వాళ్ల ప్రాణాలను రక్షించుకోవడానికి కాదు వాళ్ల ఆస్తిపాస్తులను రక్షించుకోవడానికి! ఆస్తిపాస్తులు మానవునికి వెలుపల ఉండే ఆడంబరాలే కాని అతని హృదయంలో ఉండేవి కావు."

* * *

ఎవరో చప్పుడు చేసుకుంటూ వాకిలి గుమ్మం ఎక్కేరు. తల్లీ కొడుకూ ఒకళ్ల కేసి ఒకళ్లు తెల్లబోయి చూసేరు.

నెమ్మదిగా తలుపు తెరుచుకుని రీబిన్ లోపలికి ప్రవేశించాడు.

తల పైకెత్తి చిరునవ్వు నవ్వుతూ:

"ఇదిగో వచ్చాను. అనుమానాల మనిషిని. అన్న మాటప్రకారం నడిచేవాడిని. అక్కడికీ ఇక్కడికీ తిరుగుతూ, అన్నిటిలో వేలెట్టేవాడిని!"

అతడు నార చెప్పులు తొడుక్కున్నాడు. బొచ్చుటోపీ ధరించాడు. గొర్రెతోలు కోటు కప్పుకున్నాడు. దాన్నిండా తారుమరకలే. పటకాలో నల్లని చేతి తొడుగులు దోపుకున్నాడు.

"మీ ఆరోగ్యం ఎలా ఉంది? పావెల్! నిన్ను వదిలిపెట్టేరే? బాగుంది. నీలొవ్నా! బాగా ఉన్నావా?" తెల్లటి పళ్లు బయటపెట్టి నోరారా నవ్వేడు. అతని కంఠస్వరం మునుపటికన్న మృదువైంది. ముఖంమీద బాగా ఒత్తుగా గెడ్డం పెరిగింది.

అతన్ని చూసి తల్లి చాలా ఆనందపడింది. నల్లటి మరకలతో ఉన్న అతని బరువైన చేతిని పట్టుకుంది. ఘాటుగా కొడుతున్న తారు వాసన నొక్కసారి గట్టిగా పీల్చింది.

"అబ్బ! నిన్ను చూస్తే నాకెంత సంతోషం కలుగుతోందనుకున్నావు?" అంది.

"మిహయిల్ ఇవానొవిచ్, మీరెల్లా కాలక్షేపం చేస్తున్నారు?" రీబిన్‌కి ఎదురుగా కూచుని పావెల్ అడిగేడు.

"బాగానే ఉన్నాను. యెగిల్‌దేయెవొలో ఉంటున్నాను. ఆ పేరెప్పుడైనా విన్నావా? అందంగా ఉండే పెద్ద పల్లెటూరు. సంవత్సరానికి రెండు సంతలు సాగుతాయి. జనాభా రెండు వేల పైచిలుకు. నిరుపేదలు. ఎవళ్లకీ స్వంత భూమి లేదు. అంతా కవులుకు పుచ్చుకోవలసిందే. అదీ అంత సారవంతమైనది కాదు. నేనొక రక్తం పీల్చేవాడి దగ్గర పనిలో చేరేను. శవానికి పట్టిన పురుగుల్లాగ అలాటివాళ్లక్కడ చాలామంది ఉన్నారు. బొగ్గు కాల్చి తారు తయారుచేస్తారు. ఇక్కడ సంపాదిస్తుండిన దానిలో నాలుగో వంతు సంపాదిస్తున్నాను. అయితే ఇక్కడకన్న రెట్టింపు కష్టపడుతున్నాను. రక్తం పీల్చేవాడి దగ్గర ఏడుగురం పనిచేస్తున్నాం. నేను తప్ప అంతా ఆ వూరివాళ్లే. మంచివాళ్లు, అందరూ యువకులు. అందరూ చదవడం రాయడం నేర్చుకున్నవాళ్లే. అందులో యెఫీమ్ అనే అగ్గి బరాటా వున్నాడు. అతడినేం చెయ్యాలో తెలియడం లేదు."

"వాళ్లను మాట్లాడించుతూంటారా? వాళ్లకి ఏమైనా చెపుతూంటారా?" అని పావెల్ ఆత్రంగా అడిగేడు.

"నేనేమంత మౌనంగా వుండను. మీ కరపత్రాలన్నీ మొత్తం ముప్ఫైనాలుగూ నాతో పట్టుకెళ్లేను. అయితే నేనెక్కువగా బైబిల్ నుపయోగిస్తాను. బైబిలులో నుంచి తెలుసుకో వలసింది చాలా ఉంది. హోలి చర్చి వాళ్ల అంగీకారాన్ని పొందిన లావుపాటి పుస్తకం. దాన్ని నమ్మవచ్చు!"

రీబిన్ నవ్వుతూ పావెల్‌కు కన్ను కొట్టేడు.

"కాని అది చాలదు. నిన్ను అడిగి కొన్ని పుస్తకాలు పట్టుకెడదామని వచ్చాను. మేమిద్దరం వచ్చాం. యెఫీమ్‌ను కూడా నాతో తీసుకువచ్చాను. యజమానులు తారు ఇచ్చి రమ్మని పంపేరు. అది ఇచ్చేసి నిన్ను చూసిపోదామని దారి మళ్లి వచ్చాం. ఆ యెఫిమ్ వచ్చేలోగానే పుస్తకాలియ్యి. అతడికి విషయాలంత ఎక్కువగా తెలియకూడదు." యేమోననే భయంతో వాళ్లిద్దరూ నిషిద్ధ గ్రంథాలనుపయోగించరు. కాని నాకు కావలసినవి నిషిద్ధ గ్రంథాలే. అందులోనూ, కొంచెం గరమ్‌గరంగా ఉండేవి కావాలి. నేను అందచేసే పుస్తకాలు పోలీసు ఇన్‌స్పెక్టరు చేతుల్లో పడినా, మతగురువు చేతుల్లో పడినా, వాళ్లెవరినంటారు? ఆ టీచర్లనే అనుమానించి వాళ్లనే తొందర చేస్తారు. ఈలోగా నే నెక్కడో దాక్కుని కాలం వెళ్లబుచ్చేస్తాను."

రీబిన్ మోకాటి చిప్పమీద కొట్టుకుంటూ :

"తమాషా మనిషివే! నిన్నెవరూ అనుమానించరు. రైతులు అలాంటి పనిచేయరు కదా. పుస్తకాల వ్యవహారమంతా నడిపించేవాళ్లు చదువుకున్న పెద్దమనుషులు. ఆ పనికంతా జవాబ్దారీ వాళ్లదే" అని నవ్వేడు.

"మామ్మా! ఇదంతా చాలా సూక్ష్మమైన వ్యవహారం" అన్నాడు. తర్వాత పావెల్‌కేసి తిరిగి ఉపదేశ ధోరణిలో మాట్లాడ్డం మొదలెట్టేడు.

తల్లి కొడుక్కేసి చూసింది. అతడు ఖిన్నుడైనాడు.

పావెల్ కేసి సంతృప్తితో చూస్తూ, వేళ్లతో గడ్డం దువ్వుకుంటుంటే రీబిన్ కళ్లలో నల్లని వెలుగు అగుపించింది.

అతడు తన ఉపదేశాన్ని సాగించాడు :

"ఇది మర్యాదల గురించి ఆలోచించవలసిన కాలం కాదు. జీవితం చాలా కటకటగా ఉంది. కుక్కల దండు గొర్రెలమంద కాదు. ఏ కుక్క మొరుగు ఆ కుక్కదే."

"చదువుకున్న పెద్దమనుషుల్లో సామాన్య ప్రజలకోసం ప్రాణాలర్పించడానికి కూడా సిద్ధపడిన వాళ్లున్నారు. జీవితమంతా జైళ్లలో మగ్గుతున్న వాళ్లున్నారు" అంది తల్లి. తానెరుగున్న జనమంతా ఆవిడ తలపుకొచ్చారు.

రీబిన్ నాలుగు మూలలా చూసి పావెల్‌కేసి తిరిగి బల్లనానుకుని ప్రసంగాన్ని కొనసాగించాడు.

"నీ సహాయం నాకు కావాలి. నాకు పుస్తకాలియ్యి. ఎలాటి పుస్తకాల్లో తెలుసా? ఆ పుస్తకాలు చదివినవాడెవ్వడూ మరి నిద్రపోకూడదు. పుర్రెలో సన్నని ముళ్లు కలిగిన ఏదుపందిని పెట్టినట్లుండాలి. మీకు పుస్తకాలను రాసేవాళ్లతో గ్రామస్థులకుపయోగపడేలా కూడా రాయమని చెప్పు. మాటలు మనిషిని లేపేసేటట్లు రాయమను. వాటిని చదివినవాళ్లు ఈ ఉద్యమంకోసం తమ ప్రాణాలర్పించేటంత తీవ్రంగా రాయాలి." రీబిన్ చెయ్యి పైకెత్తి ప్రతి మాటనూ విడివిడిగా స్పష్టంగా ఇలా చెప్పేడు: "మృత్యువు మృత్యువును జయిస్తుంది! విశదీకరించి చెప్పాలంటే ప్రజలు పునర్జన్మ నెత్తడానికి చావాలన్నమాట. ప్రపంచమంతటా లక్షలాది జనం పునర్జన్మ ఎత్తి బతకాలంటే మనం కొన్ని వేలమంది చావాలి. అదీ సంగతి! ప్రజలు ఉద్ధరింపబడేటట్లయితే చావడం తేలికే! ప్రజలు లేవాలి గాని!"

తల్లి సమొవార్ పట్టుకొచ్చి రీబిన్‌కేసి ఓరగా చూసింది. ఆమెకు అతడు మాట్లాడిన మాటల బరువుచేతనూ, తీవ్రతచేతనూ తను అణిగిపోతున్నట్లనిపించింది. తన భర్తను జ్ఞప్తికి తెచ్చే లక్షణాలు కొన్ని అతనిలో కనబడ్డాయి.

తల్లి తన కొడుక్కేసి చూసి నవ్వుతూ తలూపింది. మళ్లీ మాట్లాడకుండా బట్టలు వేసుకుని ఇంట్లోంచి వెళ్లిపోయింది.

"బాగుంది! రాయడానికి సంగతులన్నీ మేము చెప్తాం. కాని చాలా తేలికైన భాషలో రాయాలి. దూడలకు కూడా అర్థం కావాలి!" అన్నాడు రీబిన్.

వంటింటి తలుపు తోసుకుని ఒక మనిషి లోపలికొచ్చాడు.

"యెఫీమ్" అన్నాడు రీబిన్, వంటింటికేసి చూస్తూ, "రావోయ్ యెఫీమ్! ఇతడు యెఫీమ్, ఇతడు పావెల్. అతన్ని గురించి నీకు చెప్పేను కాదూ?"

వెల్లబారిన జుట్టు, వెడదైన ముఖంగల పొడుగాటి యువకుడు కురచయిన గొర్రెతోలు కోటు తొడుక్కుని పావెల్ ఎదుట నిలబడ్డాడు. టోపీ చేత్తో పుచ్చుకుని బొమలు ముడిచి పావెల్‌కేసి రెప్ప వాల్చకుండా చూశాడు. గట్టివాడనే అభిప్రాయాన్ని పావెల్‌కు కలుగజేశాడు.

"చదవడానికి ఎన్ని పుస్తకాలో! కాని చదవడానికి మీకు తీరిక వుండదేమో? గ్రామాల్లో చదువుకోవడానికి ఎక్కువ సావకాశం ఉంటుంది" అన్నాడు.

"కాని కోరిక లేదేమో?" అని అడిగాడు పావెల్.

"అక్కర్లేదు. కావలసినంత కోరిక కూడా ఉంది" అన్నాడు యెఫీమ్, గడ్డం రుద్దుకుంటూ."జనం బుద్ధిని ఉపయోగించడం మొదలెట్టేరు" అన్నాడు.

"యెఫీమ్! టీ తాగెయ్యి. ఇక మనం త్వరగా వెళ్లాలి" అన్నాడు రీబిన్.

"సరే" అని ఇంకొక ప్రశ్న వేశాడు. "విప్లవం అటే తిరుగుబాటేనా?"

స్నానం చేసి, ఎర్రగా ఆవిరి కక్కుతూ చిరచిరలాడుతూ అన్‌ద్రేయ్ లోపలికొచ్చాడు. యెఫీమ్‌తో ఏమీ మాట్లాడకుండా కరచాలనం చేసి రీబిన్ పక్కన కూచుని అతనికేసి నఖశిఖ పర్వతం చూచి చిన్న బుసకొట్టేడు.

"నీవేమంత కులాసాగా లేనట్లుందే? ఏమొచ్చింది కష్టం?" అంటూ రీబిన్ అతని మోకాటి చిప్పమీద చరిచాడు.

"ప్రత్యేకంగా చెప్పదగిందేమీ లేదు" అన్నాడు హొహోల్.

"ఇతడు కూడా కార్మికుడేనా?" అని అన్‌ద్రేయ్‌కేసి చూపించి యెఫీమ్ అడిగేడు.

"అతనెప్పుడూ ఫ్యాక్టరీ పనివాడిని చూడలేదు. వాళ్లు ఇతరుల్లాంటి మనుషులు కారనుకుంటున్నాడు" అని రీబిన్ విశదీకరించాడు.

"ఇతరులకూ మాకూ తేడా ఏమిటి?" అని పావెల్ ప్రశ్నించాడు.

"మీ ఎముకలు కోసుగా ఉంటాయి. రైతుల దుమ్మలు గుండ్రంగా ఉంటాయి" అని యెఫీమ్ అన్‌ద్రేయ్‌ని పరిశీలనంగా చూసి జవాబిచ్చాడు.

"రైతు, కాళ్లను భూమిమీద నిలదొక్కి నిలుచుంటాడు" అంటూ రీబిన్ ప్రారంభించాడు. "భూమి తనది కాకపోయినా రైతు దానిమీద నిలబడతాడు. దానికి సన్నిహితంగా ఉంటాడు. కాని ఫ్యాక్టరీ కార్మికుడు పక్షిలాంటివాడు. అతనికి నా అన్న స్థలముండదు. ఇల్లూ వాకిలీ ఉండదు. ఇవ్వేళ ఇక్కడుంటాడు. రేపెక్కడికో పోతాడు. ఆడది కూడా అతడినొక చోట ఉండేటట్లు

చెయ్యలేదు. కాస్తంత ఆమెతో తగాదా వస్తే, ఆమెను వదిలేసి పోతాడు. ఉన్నదానికన్న మేలైన పనికోసం వెతుక్కుంటూ పోతాడు. కాని రైతు మాత్రం తాడు తెంచుకుని పోడు. ఉన్నదాని బాగు చేసుకోవాలని తంటాలు పడతాడు.... ఇదిగో మీ అమ్మ వచ్చిందే."

యెఫీమ్ పావెల్ దగ్గర కొచ్చి,

"మీ పుస్తకమొకటి నాకు చదువుకునేందుకిస్తారా?" అని అడిగేడు.

"తప్పకుండా" అన్నాడు పావెల్.

ఆ కుర్రవాని కళ్లు సంతోషంతో చమక్ మన్నాయి.

"నేను దాన్ని మళ్లీ తెచ్చి ఇచ్చేస్తాను. మా పనివాళ్లు తారు డబ్బాలు ఇక్కడికి తెస్తుంటారు. వాళ్లచేత పంపిస్తాను" అని హామీ ఇచ్చాడు.

"మనం వెళ్ళవలసిన వేళయింది" అంటూ రీబిన్ లేచాడు. అప్పటి కప్పుడే గొర్రెతోలు కోటు తొడుక్కుని పటాకా బిగించుకుంటున్నాడు.

యెఫీమ్ పుస్తకాన్నందుకుని, చిరునవ్వు నవ్వుతూ,

"ఈ పుస్తకం నాకెంతో ఆనందాన్నిస్తుంది!" అన్నాడు.

వాళ్లు వెళ్లడంతోనే పావెల్ ఉద్రేకంతో అన్‌ద్రేయ్ నడిగేడు:

"వాళ్లను గురించి నీ అభిప్రాయమేమిటి?"

"తుపానును సూచించే రెండు మేఘాలు."

కొంచెం సేపట్లో వెసొవ్‌శ్చికోవ్ లోపలి కొచ్చాడు. చినిగిన గుడ్డలతో ఉన్నాడు, ఎప్పటిలాగే అసంతృప్తిగా ఉన్నాడు.

"ఇసాయ్ నెవరు చంపేరో విన్నావా?" అని అటూ ఇటూ తిరుగుతూ పావెల్ నడిగేడు.

"లేదు" అని పావెల్ ముక్తసరిగా జవాబిచ్చాడు.

"అంత పని చేయడానికి అసహ్యించుకోనివాడొకడు దొరికేడు. ఆ పని చేయడానికి నేనే తయారవుతున్నాను. నేను కాకపోవడం నిజంగా బాగా లేదు. ఆ పనిచేయడానికి నేనే తగినవాడిని."

"నికొలాయ్, అలాంటి మాటలు మాట్లాడకు" అన్నాడు స్నేహభావంతో పావెల్.

"అసలు అలాటి ఆలోచనెందుకు!" అని తల్లి ఎంతో ఆప్యాయంగా మందలించింది. "గుండె చూస్తే మేకపిల్ల గుండె. కాని గర్జన మాత్రం సింహ గర్జన. ఎందుకలాంటి మాటలు మాట్లాడ్డం?" అంది.

ఈ రోజు రాత్రి నికొలాయ్‌ని చూస్తే తల్లి కెంతో సంతోషమైంది. అతని మశూచికపు మచ్చల ముఖం కూడా ఆమెకెంతో ఆకర్షణీయంగా ఉంది.

వాళ్లు ముగ్గురూ గుమ్మం దాటి వెళ్లేక, తల్లి కిటికీలోనుంచి వాళ్లను కొంచెంసేపు చూస్తూ నిలబడింది. తర్వాత వెనక్కు తిరిగి పూజా విగ్రహంకేసి చూసింది.

"ఓ భగవంతుడా! వాళ్ల ననుగ్రహించు. వాళ్లకు మేలు చెయ్యి!" అని గొణుక్కుంటూ ప్రార్థించింది.

* * *

రోజులు చరచరా గడిచిపోయాయి. తల్లికి త్వరలో రానున్న మే డే ఉత్సవాన్ని గురించి ఆలోచించడానికైనా తీరిక లేకపోయింది. కాని పగలల్లా పని పాటలతో అలసిపోయి రాత్రి వేళ మంచంమీద పడుకునేసరికి ఆమె గుండెల్లో ఏదో బాధగా ఉండేది.

కార్మికులను మే దినోత్సవంలో పాల్గొనవలసిందని పిలుపు ఇస్తూ, ప్రతి రాత్రి గోడల మీద ప్రకటన లతికింపబడ్డాయి. ఆఖరికి పోలీసు స్టేషన్ తలుపుల మీద కూడా అతికింపబడ్డాయి. ప్రతిరోజు ఫ్యాక్టరీలో కరపత్రాలు పంచిపెట్టబడ్డాయి. ప్రతి ఉదయమూ పోలీసులు కూలీపేటంతా తిట్టుకుంటూ తిరిగి గోడల మీద నోటీసులను చింపేస్తుండేవారు. కాని మధ్యాహ్నం భోజన సమయంలో ఎక్కడనుంచో కరపత్రాలు గాలికి కొట్టుకొచ్చి కాళ్లకడ్డం తగిలేవి.

కార్మికులు గుంపులు గుంపులుగా చేరి ఆవేశంతో కరపత్రాలను గురించీ, ప్రకటనల గురించీ చర్చించుకుంటుండేవారు. అపారమైన ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ వసంతంలో జీవితం ఎక్కువ రసవంతంగా తోచింది.

పావెల్‌కూ, అన్‌ద్రేయ్‌కీ దాదాపు నిద్ర లేనేలేదు. ముఖం తెల్లబారి, గొంతుక బొంగురపోయి, చాలా అలసిపోయి ఇంటికొచ్చేవాళ్లు. వాళ్లు ఎక్కడో అడవుల్లో సమావేశాలు జరుపుతున్నారని తల్లికి తెలుసు.

ఏదో ఒక అజ్ఞాత కారణంగా, టైమ్ కీపర్ ఇసాయ్ హత్యను గురించి ఎవరూ పట్టించు కోకుండా మాపుచేసేశారు. రెండు రోజులపాటు స్థానిక పోలీసులు కొంత విచారణ జరిపించారు. కాని డజనుమందిని విచారించి అంతటితో విరమించుకున్నారు.

హొహోల్‌లో స్పష్టంగా కనబడే మార్పు వచ్చింది. ముఖం చిక్కి పొడుగైంది. రెప్పలు వాచి కళ్లు సగం మూతలు పడ్డాయి. ముక్కు పుటాల దగ్గరనుంచి నోటివరకూ ముడత కనబడుతోంది. అతడు మామూలు విషయాలను గురించి ప్రస్తావించడం మానేశాడు.

చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్న మే 1వ తేదీ వచ్చింది.

యథాప్రకారంగానే ఫ్యాక్టరీ సైరను జబర్‌దస్తీగా కూసింది. రాత్రంతా కంటిమీద కనుకు లేని తల్లి మంచంమీద నుంచి ఉలికిపడి లేచి, టీకి క్రితం సాయంకాలమే సిద్ధపరిచి ఉంచిన సమొవారంటించింది. కుర్రవాళ్లు పడుకునే గది తలుపు మామూలుగా తట్టాలని లేచింది. కాని కొంచెమాలోచించి వెనక్కు తగ్గింది. కిటికీ దగ్గర, పన్ను పోటుతో బాధపడేవాళ్లు లాగున అరచెయ్యి దవడ కింద పెట్టుకుని కూచుంది.

నీలి ఆకాశంమీద వెలి మబ్బులు, గులాబి రంగు మబ్బులు, ఫ్యాక్టరీ గొట్టాలలో నుంచి వచ్చే ఆవిరి బుసలకు, బెదిరిపోతున్న పక్షుల దండు లాగున పారిపోతున్నాయి. కలలోలాగున తల్లి ఆ మేఘాలను చూస్తూ కూచుంది.

కిటికీలోనుంచి ఉదయభానుని కిరణాలు సంతోషంతో తొంగిచూశాయి. ఆమె చేయి చాచి ఆ కిరణాలనందుకుని ఆలోచనాపూర్వకంగా నవ్వుకుంటూ రెండవ చేతితో వాటిని బుజ్జగించింది. చివరకు లేచి నెమ్మదిగా సమొవార్ మీదనుంచి గొట్టాన్ని తీసేసింది. తర్వాత ముఖం కడుక్కుని, భక్తితో తనపై శిలువను గీసుకుని పెదవులు మెదుపుతూ ప్రార్థన మొదలెట్టింది. ఆమె ముఖం వికసించింది. కుడి కనుబొమ అదరడం మొదలెట్టింది....

ఫ్యాక్టరీ సైరను రెండవ కూత మొదటి కూతంత గంభీరంగానూ, ధాటీగానూ లేదు. దాని బొంగురు ధ్వనిలో కొంచెం వణకుకూడా పుట్టింది. మామూలుకన్న ఎక్కువ సేపు కూసినట్లనిపించింది తల్లికి.

పక్క గదిలో హొహోల్ స్వరం స్పష్టంగా వినబడింది.

"విను, పావెల్?"

చెప్పులు లేని పాదాలచప్పుడు వినబడింది. ఎవరో దర్జాగా ఆవులించారు.

"టీ సిద్ధంగా ఉంది" అంది తల్లి.

"లేస్తున్నాం" అన్నాడుపావెల్ హుషారుగా.

"సూర్యోదయమవుతోంది. ఆకాశం మబ్బు పట్టింది. ఈ వేళ మబ్బులేకుండా ఉండాలి" అన్నాడు హొహోల్.

నిద్రచేత ముడతలుబడ్డ ముఖంతో అతడు వంటింట్లో ప్రవేశించాడు. కాని మంచి కులాసాగా ఉన్నాడు.

"మామ్మా! శుభోదయం! బాగా నిద్రపట్టిందా?"

"తల్లి అతన్ని సమీపించి మెల్లగా,

"అన్‌ద్ర్యూషా! నువ్వతని పక్కనే నడవాలి సుమా!" అంది.

"తప్పకుండా మామ్మా, మీకు మాట ఇస్తున్నాను. ఎల్లప్పుడూ మేమిద్దరం కలసే నడుస్తుంటాం" అని చెవిలో చెప్పేడు.

"ఏమిటోయ్! మీరిద్దరూ గుసగుసలాడుతున్నారు?" అని పావెల్ అడిగేడు.

"ఏమీ లేదు, పావెల్!"

"చెవుల వెనకాల బాగా కలుక్కుమంటోంది! పడుచు పిల్లలు ఇవేళ నాకు కన్ను కొడుతారులే!" అని జవాబిస్తూ హొహోల్ ముఖం కడుక్కునేందుకు బయటికి వెళ్లేడు.

"కార్మికులారా లేవండోయ్! పోరాటానికి లేవండోయ్" అని పావెల్ మెల్లగా పాడేడు.

పొద్దెక్కినకొద్దీ వాతావరణం తెరిపైంది. మేఘాలన్నింటినీ గాలి తరిమేసింది. పొద్దుటి ఫలహారానికి బల్ల సర్దుతూ తల్లి తలపంకిస్తూ ఈ చిత్రమంతా ఏమిటాయని ఆలోచిస్తూంది. ఈ రోజున, మరి కొంత సేపట్లో వీళ్ళ పని ఏమవుతుందో ఎవరూ చెప్పలేరు. కాని పొద్దుటి వేళ నవ్వుతూ తుళ్లుతూ వేళాకోళాలాడుకుంటున్నారేమిటని, ఆమె ఆలోచించింది. కాని ఏ కారణం చేతనో ఆమె కూడా ప్రశాంతతను, సంతోషాన్ని పొందింది.

కాలహరణం కోసం నిదానంగా ఫలహారం చేశారు. పావెల్ టీ గ్లాసులో చక్కెర వేసుకుని జాగ్రత్తగా చెంచాతో కలుపుకున్నాడు. బ్రెడ్డుమీద సమానంగా ఉప్పు చల్లుకున్నాడు.

"మనం షికారుగా నడిచి వెడితే?" అన్నాడు పావెల్.

"ప్రస్తుతం ఇంటిదగ్గరుండడం మంచిది. ఇప్పటి నుంచీ పోలీసులను వేధించడమెందుకూ? ఇప్పటికే వాళ్లకు నీ సంగతి బాగా తెలుసు" అని జవాబిచ్చాడు అన్‌ద్రేయ్.

ఇంతలో ఫ్యొదొర్ మాజిన్, పరుగెత్తుకుంటూ లోపలికొచ్చాడు. అతని ముఖం విప్పారివుంది. బుగ్గలెర్రబడ్డాయి. సంతోషపూరితమైన అతని ఉత్సాహంతో తాపీగా కూచున్న వాళ్ల విసుగు ఎగిరిపోయింది.

"ప్రారంభమైంది! ప్రజల్లో కదిలిక పుట్టింది. దృఢ నిశ్చయంతో వాళ్లంతా వీధుల్లో కొచ్చేస్తున్నారు. వెసొవ్‌ష్చికోవ్, వాస్య గూసెవ్, సమోయ్‌లొవ్ ఫ్యాక్టరీ గేటుదగ్గర నిలబడి ఉపన్యాసాలిస్తున్నారు. చాలామంది పనివాళ్లు ఇళ్లకు తిరిగిపోయారు. లేవండి! వెళ్లవలసిన సమయమైంది! అప్పుడే పది గంటలైంది!" అని హెచ్చరించాడు మాజిన్.

"నేను వస్తున్నాను!" అన్నాడు ఖచ్చితంగా పావెల్.

"ఇదిగో మీరే చూస్తారుగా. మధ్యాహ్నం భోజనమైనాక ఫ్యాక్టరీలో ఒక్క మనిషి ఉండడు!" అంటూ ఫ్యొదొర్ పరుగెత్తు కెళ్లిపోయాడు.

"గాలిలో కొవ్వొత్తిలాగున్నాడు!" అంది తల్లి. తర్వాత లేచి బట్టలు మార్చుకునేందుకు వంటింట్లో కెళ్లింది.

"మామ్మా! మీరెక్కడికి?" అని అన్‌ద్రేయ్ అడిగేడు.

"మీతోటే" అని ఆమె జవాబిచ్చింది.

అన్‌ద్రేయ్ మీసాలు మెలేస్తూ పావెల్‌కేసి తేరి చూచాడు. పావెల్ వేళ్లతో జుట్టు బరుక్కుంటూ ఆమె దగ్గర కెళ్లేడు.

"అమ్మా! నిన్ను ఆగమని నేనొక్కమాట చెప్పను మరి నాతో కూడా నువ్వేమీ చెప్పద్దు సరేనా?"

"సరేలే. సరే. భగవంతుడు మిమ్మల్ని రక్షించుగాక!" అని ఆమె గొణుక్కుంది.

తల్లి పావెల్ అన్‌ద్రేయ్‌ల వెంట బయలుదేరివెళ్లింది. ఎక్కడ చూసినా ప్రజల కలకల ధ్వనులతో చెవులు గింగురుమంటున్నాయి. ప్రజలు గుమ్మాలదగ్గరా కిటికీలదగ్గరా గుంపులుగుంపులగా నిలబడి, తన కొడుకూ, అన్‌ద్రేయ్ కలిసి నడుస్తుంటే వాళ్లకేసి తేరి చూడడం తల్లి కనిపెట్టింది. ఆమె కళ్ల ముందర ఆకుపచ్చరంగూ, బూడిదరంగూ కలసినట్లుగా ఛాయలగుపించాయి.

ప్రజలు వాళ్లకు నమస్కారాలు పెట్టేరు. ఈ రోజున ప్రజలనుకునే మాటల్లో కొంత విశిష్టత కనబడింది. వాళ్లు మెల్లగా మాట్లాడుకునే మాటలు కొన్ని ఆమె చెవుల్లో పడ్డాయి.

"అరుగోనయ్యా! నాయకులు వెడుతున్నారు!"

"నాయకులెవరో మనకేం తెలుసు?"

"నేనేమీ వాళ్ల కపకారం జరగాలనడం లేదు."

పక్కనే ఒక పెరట్లో నుంచి ఎవరో విరసంగా ఒక కేక వేశాడు.

"పోలీసువాళ్లు వాళ్లని పట్టుకుంటారు. దానితో వాళ్ల పని ఆఖరు."

"ఇదివరకొకసారి పట్టుకున్నారు కదా!"

ఒక కిటికీలోనుంచి ఒక ఆడమనిషి మొర వినబడింది:

"నువ్వేమి చేస్తున్నావో బాగా ఆలోచించుకో! పోషించవలసిన కుటుంబ మొకటున్నదన్న సంగతి మరచిపోకు!"

వాళ్లు కాలు విరిగిపోయిన జోసీమోవ్ ఇంటి ముందునుంచి నడుస్తున్నారు. పనిలో కాలుపోవడంచేత ఫ్యాక్టరీవాళ్లతనికి నెలవారీ పింఛనిస్తారు. అతడు కిటికీలోనుంచి తల బయటపెట్టి :

"ఏయ్ పావెల్! నీ మెడలు విరగ్గొడతారులే. వెధవా! నీ రోగం కుదురుతుందిలే!" అన్నాడు.

తల్లి ఉలిక్కిపడి అలా నిలబడిపోయింది. చర్రున కోపం పొడుచుకొచ్చింది. అవి వాడి ముఖంకేసి తేరిపార జూచింది. వాడు తిట్టకుంటూ కిటికీలోనుంచి ముఖం వెనక్కి

లాక్కున్నాడు. తల్లి గబగబ అడుగేసి కొడుకు దగ్గరకు చేరుకుంది. వెనకబడకుండా అతని అడుగులో అడుగేసి ముందుకు సాగింది.

పావెల్ అన్‌డ్రేయ్‌లు ఈ మాటలేమీ వినిపించుకుంటున్నట్లు లేదు. తొణుకూ బెణుకూ లేకుండా చరచరా నడిచేస్తున్నారు. వారికి నడి వయస్కుడు మిరొనొవ్ కనబడ్డాడు. అతడు చాలా వినయశీలుడు. అతని నిజాయితీకీ, నిదానానికీ అందరూ అతడిని మన్నిస్తారు.

“నువ్వు కూడా జైల్లో కెడతావమ్మోయ్!” అని నవ్వేడు పావెల్.

క్రమంగా సూర్యుడు పైకొస్తున్నాడు. వసంతకాలపు నవ్యతకు లేత ఎండ తోడైంది. ఆకాశంమీద మేఘాల చలనవేగం తగ్గింది. వాటి నీడలు మరింత ప్రకాశమానమైనాయి. మేఘాలు తాపీగా వీధుల పైనా ఇళ్ల పైనా జారుగా పోతున్నాయి. ఇళ్లమీదా వీధుల్లోనూ ఉన్న దుమ్మంతా గాలికి కొట్టుకుపోయింది. అంతా శోభస్కరంగా కన్పడింది. ప్రజల కోలాహల ధ్వని ఫ్యాక్టరీ మిషనుల చప్పుడును ముంచేసింది.

పెద్ద వీధి నుండి పోయే యిరుకు సందులో దాదాపు నూరుమంది సమావేశమైనారు. వాళ్ల మధ్యలో నిలబడి వెసొవ్‌శ్చికోవ్ ఉపన్యసిస్తున్నాడు:

“మన రక్తాన్ని వాళ్లు నల్లులు పీల్చేసినట్లు పీల్చేస్తున్నారు!” అతడు మోటుగా చెప్పిన ఆ మాటలు వాళ్ల తలలకు బాగా ఎక్కాయి.

“నిజానికి అంతేకదా?” అని చాలామంది ఒక్కసారిగా అరిచేరు.

“కుర్రాడు కొంత శ్రమ పడుతున్నాడు. నేవెళ్లి సాయం చేస్తే బాగుంటుందనుకుంటాను” అన్నాడు హొహోల్.

పావెల్ అతని నాపడానికి ప్రయత్నించేలోగానే, అన్‌డ్రేయ్ చర్రున జనంలోకి తోసుకెళ్లిపోయాడు.

అన్‌డ్రేయ్ గొంతుక మరింత లేచింది.

“ఇతర దేశాల్లోని కార్మికులు సూక్ష్మమైన ఈ సత్యాన్ని ఈపాటికే తెలుసుకుని ఉండవలసింది. ఈ మే దినంనాడు...”

“పోలీసులు!” అని ఒకడు కేకేశాడు.

గుర్రాలమీద స్వారి చేసుకుంటూ నలుగురు పోలీసులు సందులో ప్రవేశించారు. చేతిలోని కొరడాలను విసురుతూ:

“పొండి! పొడి!” అని కేక వేశారు.

ప్రజలు చురచురమన్నారు. అయిష్టంగానే ఎవరి మట్టుకువారు తప్పుకున్నారు. కొందరు కంచె గోడలెక్కేరు.

"చూడండి! పందులను గుర్రాలమీద కూచోబెట్టారు. మేమెంత ధైర్యవంతులమైన సైనికులమో అని గుర్రుగుర్రుమంటున్నాయి ఆ పందులు!"

హోహోల్ వీధి మధ్య ఒంటరిగా వుండిపోయాడు. రెండు గుర్రాలు తలలు విసరుకుంటూ అతనిమీద కెళ్లేయి. అతడొక పక్కకు తప్పుకునేసరికి, తల్లి అతని చెయ్యి పట్టుకుని తనకేసి లాక్కుంది.

"కామ్రేడ్స్!" అని పావెల్ బిగ్గరగా ఖంగుమనే ధ్వనితో జనాన్ని హెచ్చరించాడు.

తల్లి కళ్లతో వేడి కన్నీటి బిందువులేర్పడ్డాయి. అమాంతంగా ఆమెలో గొప్ప బలం చేకూరినట్లనిపించింది. ఒక్క గంతేసి తన కొడుకు పక్కనే నిలబడింది. జనం సూదంటురాయిని ఇనుప ముక్కలు పట్టినట్లు అతని చుట్టూ కడియం కట్టేరు.

తల్లి అతని ముఖంకేసి తీక్షణంగా చూసింది. ధైర్యమూ, గర్వమూ ఉట్టిపడే జ్యోతి అతని కళ్లలో ఆమె కగుపడింది.

"కామ్రేడ్స్! ఈ రోజున మన మెవరమో, మన ఆదర్శమేమిటో విస్పష్టంగా తెలియచేసి మన పతాకాన్ని ఎగురవేయడానికి నిశ్చయించుకున్నాం. న్యాయానికీ, ధర్మానికీ, స్వేచ్ఛకీ చిహ్నమైనదీ పతాకం!"

పావెల్ అలా అనేసరికి జండాకర్ర జనంలోనుంచి లేచింది. పెద్దదైన ఎర్రని పక్షిలాగున కార్మికుల జండా పైకెగిరింది.

పావెల్ చెయ్యెత్తేసరికి జండా గాలిలో రెపరెపలాడింది. డజనుమంది, తెల్లటి జండా కర్రను గట్టిగా పట్టుకున్నారు. తల్లి కూడా చెయ్యేసింది.

"కార్మికులు చిరస్థాయిగా వర్ధిల్లాలి!" అని పావెల్ నినాదాన్నిచ్చాడు.

వందలాది జనం ప్రతిధ్వానం చేశారు.

"కామ్రేడ్స్! మన భావాలకన్నిటికీ జన్మస్థానమైన మన పార్టీ, సోషల్ డెమోక్రటిక్ వర్కర్సు పార్టీ చిరస్థాయి అగుగాక!"

జనం ఒక్కసారిగా పొంగిపోయారు. జండాయొక్క ఆంతర్యాన్ని గుర్తించివారు దాని దగ్గర కొత్తుకొచ్చారు. మాజిన్, సమోయ్‌లొవ్, గూసెవ్ సోదరులు, పావెల్ దగ్గరకు చేరుకున్నారు. నికొలాయ్ తలవంచుకుని జనంలోనుంచి తోసుకుంటూ ముందుకొచ్చాడు. తాను ఎరగని యువజనులు, ఉద్వేగంతో తనను ప్రక్కకు నెట్టేస్తున్నారనుకుంది తల్లి.

"కార్మికవర్గం వర్ధిల్లాలి!" అని పావెల్ అరిచాడు.

ఒక వెయ్యి గొంతుల్లోంచి, ఒక్క సారిగా, ఆనందంతోనూ, శక్తితోనూ హృధయాన్ని కంపింపచేసే ఆ నినాదం ప్రతిధ్వనించింది.

తల్లి నికొలాయ్ చేతినీ మరొకరి చేతినీ గట్టిగా పట్టుకుంది. కళ్లలో నీళ్లు తిరిగి ఉక్కిరిబిక్కిరయింది. కాని ఆమె ఏడవలేదు. మోకాటి చిప్పలు వణికేయి. అదురుతున్న పేదవుల్లోంచి,

"అయ్యో నాయనలారా!..." అని గొణిగింది.

స్ఫోటకపు మచ్చల ముఖం విప్పారేటట్లుగా నికొలాయ్ నవ్వేడు. జండాకేసి రెప్పవాల్చకుండా చూస్తూ చేయి చాచేడు. గభాలున తల్లిని కౌగిలించుకుని, పకపక నవ్వుతూ ఆమెను ముద్దాడేడు.

మృదుమధురమైన కంఠాన్ని ఎత్తి, జనంయొక్క రొద అణిగిపోయేటట్లు :

"కామ్రేడ్స్!" అని కేకేశాడు హొహోల్. "మనం నేడొక నూతన దేవుని పేరిట ఒక పవిత్ర యాత్ర ప్రారంభించాం. జ్ఞానం, సత్యం, న్యాయం, మంచితనం అన్నిటికీ ఆధారభూతుడు యీ దేవుడే. మన లక్ష్య మింకా చాలా దూరాన ఉంది! ముళ్ల కిరీటం మాత్రం దగ్గరగా చేతి కందేటట్లున్నది! సత్యం జయించి తీరుతుందనే విశ్వాసం లేనివారు. ఈ సత్యంకోసం ప్రాణార్పణకు ధైర్యం చాలనివారు అందుకు కష్టపడే శక్తి తమకు లేదని భయపడే వారు పక్కకు తప్పుకోండి! మన అంతిమ విజయంలో విశ్వాసమున్నవారే మాకు కావాలి! మన లక్ష్యాన్ని అర్థం చేసుకోలేనివారు మాతోపాటు నడవనక్కరలేదు! ఏమంటే వాళ్లు దుఃఖపడతారు. కామ్రేడ్స్! మాతో చేరేవాళ్లు చేరండి! స్వేచ్ఛాపరులైన జనంయొక్క పండగ రోజు చిరస్థాయి యగుగాక! మే దినం చిరస్థాయి యగుగాక!"

గుంపు పెరిగిపోయింది. పావెల్ జండాను పైకెత్తి పట్టుకున్నాడు. పావెల్ ముందుకు నడుస్తుంటే, జండా గాలిలో విప్పారి రెపరెపలాడింది. సూర్య కిరణాలు దానిమీద ప్రసరిస్తుంటే అది చిరునవ్వు నవ్వుతూ విహరించిది.

ఫోదొర్ మాజిన్ పాట మొదలెట్టేడు:

"పాత ప్రపంచాన్నే పరిత్యజిద్దాం..."

డజన్ల కొద్దీ కంఠాలు లేచి, అతని పాట నందుకున్నాయి:

"పాదాలనంటిన ధూళిని దులిపేద్దాం!..."

తల్లి మాజిన్ వెనకాలే నడిచింది. ఆమె పెదవుల మీద చిరునవ్వు తొణికిసలాడుతోంది. దృష్టి మాత్రం జండామీదా, తన కొడుకుమీదా లగ్నమై ఉంది. ఆమె చుట్టూ సంతోషపరవశులైన జనం ముఖాలే కనుబడుతున్నాయి. వివిధమైన రంగులుగల కళ్లు ప్రకాశిస్తున్నాయి. ఎదుట తన కొడుకూ, అన్‌ద్రేయ్ నడుస్తున్నారు. వాళ్లిద్దరి పాటా ఆమెకు వినబడుతోంది. అన్‌ద్రేయ్ మృదుమధుర స్వరం, పావెల్ జీర గొంతుతో మిళితమై పాట సాగుతోంది:

"కార్మికులారా లేవండోయ్! సమరానికి లేవండోయ్!

కష్టపడినా కడుపులు మండే కార్మికులారా, లేవండోయ్!"

జనం ఎఱ్ఱ జండా తోసుకుంటూ ముందుకొచ్చారు. కేకలేసుకుంటూ పరుగెత్తుకొచ్చారు. కాని వారి కేకలు పాటలు మునిగిపోయాయి. ఈ పాట, వాళ్లు రోజూ మెల్లగా ఇళ్ల దగ్గర పాడుకుంటున్నదే. కాని ఈరోజున ఏ అడ్డూ లేకుండా వీధుల్లో పాడుతుంటే దాని అద్భుత శక్తి వెల్లడైంది. నిరుపమానమైన ధైర్యాన్ని ఆ పాట ప్రతిధ్వనింపజేసింది. ఉజ్జ్వలమైన భవిష్యత్తుకోసం, సుదీర్ఘమైన పథాన నడవాలని ప్రబోధిస్తూ ఆ పాట ఆ మార్గంలో సంభవించే కష్టాలనెదుర్కోవాలని నిస్సంకోచంగా స్పష్టీకరించింది. నిదానంగా మండే మంటకు, మసి పోయినట్లుగా ఆ పాట జనాన్ని అంటిపెట్టుకున్న పాత భావాలను తొలగించింది. కొత్తదంటే భయాన్ని బుగ్గిచేసేసింది.

తల్లి తన ముందరనుంచి స్త్రీలూ పురుషులూ, ముందుకెళ్లిపోతుంటే, కొందరి ముఖాలు చాలా కలతచెంది ఉన్నట్లు చూసింది. జనం అలా ప్రవాహంలాగా పోతూనే ఉన్నారు. ఆపాట, వాళ్లనలా ముందుకు లాక్కుపోతుందా అనుకుంది. ఆ పాట ఊపుతో, రోడ్డు మీద జనాన్నందర్నీ తోసేస్తున్నట్లనిపించిది. ఎఱ్ఱ జండాకేసి తలెత్తి చూసేసరికి, ఆమె మనోనేత్రానికి, ఆత్మవిశ్వాసంతో ధగధగలాడే తన కొడుకు ముఖం కనబడింది.

గభాలున ఊరేగింపు మొగ దేనికో గుద్దుకున్నట్లయింది. భయకరంమైన శబ్దంతో బారు బారంతా వెనక్కు దబాయించబడింది. ప్రవాహంలా సాగే పాట గజగజ వణికింది. కాని వెంటనే మరింత బిగ్గరగానూ వేగంగానూ సాగింది. కాని మళ్లీ ఆగిపోయింది. ఒక్కొక్కళ్లే పాడడం మానుకుంటున్నారు. మళ్లీ పాటను వెనుకటిలా విజృంభింప చేయడానికి కొన్ని స్వరాలు లేచాయి:

"కార్మికులారా లేవండోయ్! సమరానికి లేవండాయ్!

కష్టపడినా కడుపులు నిండని కార్మికులారా, లేవండోయ్...."

కాని ఈ పిలుపులో మునుపటి పటుత్వం లేదు. మునుపటి ఏకాగ్రత లేదు. ఐకమత్యంతో కూడిన విశ్వాసం లోపించింది. వాళ్ల గొంతుల్లో భయం ధ్వనిస్తోంది.

ఊరేగింపుకు ముందేమి జరుగుతున్నదో తల్లి కగుపడ్డంలేదు. అక్కడ ఏమైందో ఆమెకు తెలియదు. కనుక జనాన్ని పక్కకు నెట్టుకుంటూ ముందుకెళ్లడం మొదలెట్టింది. ఆమె ముందుకెడుతుంటే తిట్టుకుంటూ వెనక్కొచ్చేవాళ్లనూ, తలలొంచుకుని దౌడాయించే వాళ్లనూ ఢీకొంది. ఏడవలేక నవ్వేవాళ్లూ, వెటకారంగా ఈల లేసేవాళ్లూ ఆమె కెదురయ్యారు. ఆమె వాళ్ల ముఖాలను పరిశీలనగా చూసింది. వాళ్లను కళ్లతో హెచ్చరించింది.

పావెల్ కంఠస్వరంలో తొణుకూ బెణుకూ లేదు. మాటలు నిశితంగానూ స్పష్టంగానూ వెలువడ్డాయి. కాని జనం గుంపు పల్చబడుతోంది. ఒక్కొకళ్లే వరుసలోంచి తప్పుకుని ఇంటి ముఖం పడుతున్నారు. కొందరు గోడలకానుకుని చూస్తున్నారు. ఊరేగింపు కొయ్య సీల రూపం దాల్చింది. ముందు పావెల్ నిలబడ్డాడు. కార్మికుల అరుణ పతాకం అతని నెత్తి మీద

రెపరెపలాడుతూ ఎగురుతోంది. నల్లటి పక్షి రెక్కలార్చుకుని ఎగిరిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లుంది ఆ ఊరేగింపు, ఆ పక్షికి ముక్కు స్థానంలో పావెల్ వున్నాడు.

వీధి చివరగా చౌకుకు వెళ్లే దారికి అడ్డంగా, బూడిదరంగు దుస్తులను ధరించిన మనుషులు గోడకట్టినట్లు నిలబడున్నారు. అందరూ ఒక్కలాగే ముఖాలు కనబడకుండా ఉన్నారు.

ఆమె జనాన్ని తోసుకుంటూ ముందుకు సాగింది. జండా చుట్టూ వలయం కట్టి ఉన్న తన స్వజనం దగ్గరగా చేరుకోవాలని ఆమె ప్రయత్నం. వాళ్ల నంటిపెట్టుకుని వాళ్లని బలపర్చే స్నేహితులు చుట్టూ ఉన్నారు. ఇలా తోసుకుపోవడంలో ఆమె ఒక పొడుగాటి మనిషిని నున్నటి గడ్డం, ఒకే కన్ను గలవాడిని ఢీక్కుంది. అతడు వెనక్కి తిరిగి:

"ఏం కావాలి నీకు? ఎవరు నువ్వు?" అని అడిగేడు.

"నేను పావెల్ వ్లాసొవ్ తల్లిని" అంది. ఆమెకా సమయంలో మోకాళ్లు వణికేయి. కింద పెదవి వశం తప్పింది.

"ఓ!" అన్నాడు ఏకాక్షి.

"కామ్రేడ్స్! మనం జీవితమంతా ముందుకు సాగుతూనే ఉండాలి. మనకు మరో గత్యంతరంలేదు!" అన్నాడు పావెల్.

తల్లి రెప్పవాల్చకుండా ఆ దృశ్యాన్ని చూసింది. వీధివెడల్పునా సిపాయిలు బూడిదరంగు తరంగంలో ముందుకు చొచ్చుకొచ్చారు. సన్నీల వెండి వెలుగులతో నిర్దాక్షిణ్యమైన పట్టుదలతో వారు ముందుకు చొచ్చుకొస్తున్నారు. గబగబా నాలుగు అడుగులేసి ఆమె తన కొడుకును సమీపించింది. అప్పుడే అన్‌ద్రేయ్ తన పొడుగైన శరీరాన్ని పావెల్‌ను కాపాడడానికి అతనికి అడ్డుగా పెట్టడం చూసింది.

"నా ప్రక్కకి వచ్చేయ్, కామ్రేడ్!" అన్నాడు పావెల్ కఠినంగా.

అన్‌ద్రేయ్ తల వెనక్కు వాల్చి, చేతులు వెనక్కు పెట్టి పాట పాడుతున్నాడు. పావెల్ అతన్ని భుజంతో తోసేసి, మళ్లీ కఠినంగా చెప్పాడు:

"పక్కకు రా! నువ్వల్లా చెయ్యడానికి నీకు హక్కు లేదు! జండా ముందు వెళ్లాలి!"

"చెదిరిపోండి!" అని ఒక పొట్టి ఆఫీసరు, కత్తిని ఝళిపిస్తూ సన్నని గొంతుకతో కేకేశాడు. అతడు ముందుకు సాగుతూ, మోకాళ్లు వంచకుండా కాళ్లు ముందుకు విసురుతూ బూటు మడమలతో నేలమీద దడదడ శబ్దం చేస్తున్నాడు. తల్లికి ఆ బూట్ల నిగనిగ ఇది వరకే తెలుసు.

తన వెనకాలనుండి జనం పరుగెత్తుతూ ఆవేశంతో అరుస్తూ ఉండడం తల్లి చెవిన బడింది:

"సోదరులారా! చెదిరిపోండి!"

"వ్లాసొవ్! పరుగెత్తు!"

"వెనక్కొచ్చేయ్, పావెల్!""

"జండా ఒదిలెయ్, పావెల్!" దాన్ని నా చేతికియ్యి దాచేస్తాను" అన్నాడు వెసొవ్‌శ్చికోవ్. అతడు జండాకర్రను పట్టుకున్నాడు, జండా వెనక్కి వాలిపోయింది.

"వద్దు! అలాగే ఉండనియ్యి!" అని పావెల్ హుంకరించాడు.

నికొలాయ్ చటుక్కున చేతిని వెనక్కు తీసుకున్నాడు చేయి కాలితే తీసుకున్నట్లు. పాట ఆగిపోయింది. జనం ఆగిపోయి, పావెల్ చుట్టూ గోడ కట్టినట్టు కడియం కట్టేరు. అయినప్పటికీ అతడు ముందుకు తోసుకెడుతూనే ఉన్నాడు. హఠాత్తుగా అనుకోనంతగా ఆకాశం మీద నుంచి పడినట్లుగా నిశ్శబ్దమేర్పడింది. కంటి కగుపడని మేఘమా వరించినట్లయింది.

సుమారు ఇరవైమంది జండాను చుట్టుముట్టేరు. జనం ఎక్కువమంది లేకపోయినా ఉన్నవాళ్లు మాత్రం ధైర్యంగా దృఢంగా నిలబడ్డారు. తల్లి తన ఆదుర్దా కొద్దీ వాళ్ల దగ్గర కెళ్లింది. వాళ్లతో ఏమిటో చెప్పాలనే కోరిక ఆమెకు కలిగింది.

కొందరు సిపాయిలు ముందుకు పరుగెత్తేరు. అందులో ఒక సిపాయి తుపాకి మడమతో ఒక దెబ్బ కొట్టాడు. జండా ఊగిసలాడి ముందుకు పడింది. సిపాయిల గుంపులో అది మాయమైపోయింది.

"అయ్యో!" అని ఎవరో చాలా బాధగా కేకవేశారు.

తల్లి దెబ్బ తిన్న జంతువులా కెవ్వుమంది. దానికి జవాబుగా సిపాయిల మధ్యనున్న పావెల్:

"శలవు, అమ్మా! శలవు" అన్న మాటలు వినబడ్డాయి.

"అతడు బతికున్నాడు! నన్ను జ్ఞాపకముంచుకున్నాడు!" అనే రెండాలోచనలామెకు చటుక్కున తట్టేయి.

"మామ్మా! శలవు!"

ఎవడో తల్లిని రొమ్ముమీద ఒక్క పోటు పొడిచాడు. ఆగ్రహోదగ్రుడైన పొట్టి ఆఫీసరు ఎదురుగా నిలబడినట్లామె లీలగా గుర్తించింది.

"పో! ముసలమ్మా, పో!" అని అతడు హుంకరించాడు.

తల్లి అతడిని ఆపాదమస్తకం చూసింది. అతని కాళ్ల ముందర విరిగిపోయిన జండా కర్రలున్నాయి. ఒకదాని చివర ఎర్ర గుడ్డ ఇంకా అంటి పెట్టుకునే ఉంది. ఆమె కిందకు వంగి దాన్ని తీసుకుంది. ఆఫీసరు దాన్ని ఆమె చేతుల్లోంచి లాక్కుని ఆమెను పక్కకు నెట్టేడు.

"చెప్తున్నాను, పో!" అని గట్టిగా అరుస్తూ కాళ్లతో నేలమీద చరిచాడు.

సిపాయిల వలయంలో నుంచి పాట లేచింది:

"కార్మికులారా లేవండోయ్! సమరానికి రారండోయ్!"

అంతా గిర్రున తిరిగింది. గజగజలాడింది. టెలిగ్రాఫ్ తీగెల్లోంచి వచ్చే జుంయ్యిమనే శబ్దంలాగ, గాలి చిరాకెత్తించేటట్లు ధ్వనించిది. ఆఫీసరు గభాలున వాళ్లమీద కెళ్లేడు.

"మీ పాట కట్టిపెట్టండి! సార్జెంటు మేజర్ క్రయ్‌నోవ్!" అని ఆగ్రహంతో ఉరిమేడు.

తూల్తూనే తల్లి, అతడు పారేసిన విరిగిపోయిన జండా కర్ర దగ్గరకెళ్లి దాన్ని పైకి తీసింది.

"ఏయ్, వాళ్ల నోళ్లు నొక్కెయి!"

పాట గిజగిజలాడింది. కంపించింది. తడబడింది. ఆగిపోయింది. ఎవరో తల్లి భుజం మీద చెయ్యేసి వెనక్కి తిప్పి ఒక్క తోపు తోసి,

"ఫో! ఫో!" అన్నాడు.

"వీధి ఖాళీ చెయ్యండి!" అని ఆఫీసరు అరిచాడు.

పది అడుగుల దూరంలో కొంతమంది జనం గుమికూడి ఉండడం తల్లి చూసింది. కొందరు అరుస్తూ, కొందరు తిడుతూ, మరికొందరు ఈలవేస్తూ మెల్లగా వెనక్కు మళ్లీ దొడ్లలో దూరుతున్నారు.

"ఏయ్ ఆడపిశాచం! వెనక్కి ఫో!" అంటూ ఒక యువ సిపాయి ఆమె చెవిదాకా వచ్చి అరిచాడు. పక్కనున్న కాలిబాట వరకూ, ఆమెను గెంటేశాడు.

శక్తి తగ్గిపోవడంచేత నెమ్మదిగా జండా కర్ర ఊతంతో ముందుకు నడిచింది. రెండవ చేత్తో గోడలను, కంచెలను పట్టుకుని పడిపోకుండా నడిచింది. "పొండి, పొండి!" అని వెనకనుంచి ప్రక్కనుంచి సిపాయిలు అరుస్తూంటే జనం వెనక్కెళ్లిపోతున్నారు.

ఆ సందు ఎడమ పక్కకు మళ్లింది. దాని మొగలో జనం గుమిగూడి ఉండడం చూసింది. వాళ్లు బిగ్గరగా ఆవేశంతో మాట్లాడుకుంటున్నారు:

"వాళ్లు తమాషాకోసం సన్నీలబారు కెదురెళ్లలేదు! ఆ సంగతి గ్రహించాలి!"

"ఇలాంటి దెప్పుడైనా చూశారయ్యా? సన్నీలల్లా మీదకొస్తుంటే పిసరంతైనా జంకు లేకుండా పర్వతాల్లా నిలబడ్డం!"

"ఆ పావెల్ వ్లాసొవ్‌ని చూడండి!"

"అతనో! ఆ హొహోల్?"

"చేతులు వెనక్కు పెట్టుకుని నవ్వుతూ అలాగే నిలబడున్నాడు. వాడి తస్పాదియ్యా, భయంలేని దయ్యమే!"

"నాయనలారా!" అంటూ తల్లి వాళ్ల మధ్యకు చొచ్చుకెళ్లింది. సగౌరవంగా వాళ్లామెకుకు దారియిచ్చారు. ఎవరో నోటి నిండా నవ్వేడు.

"చూడండి! చూడండి! ఆమె జండా పట్టుకొచ్చింది. జండా!"

"నోర్ముయ్!" అని ఎవరో అతడిని గట్టిగా మందలించాడు.

తల్లి చేతులు బారసాచి మాట్లాడ్డం మొదలెట్టింది:

"నాయనలారా! వినండి. దేవుడి పేరు తలుచుకుని వినండి! మీరంతా చాలా మంచివాళ్లు. ఆత్మీయులైన నాయనలారా! జరిగిన సంగతులను చూడ్డానికి భయపడకండి! సాక్షాత్తూ మన పిల్లలు మన రక్తంలో రక్తమైన పిల్లలు అందరికీ సమానంగా న్యాయం జరగాలనే సంకల్పంతో కొత్త ప్రపంచంలో పడ్డారు. మీకందరికీ, మీకు పుట్టబోయే పిల్లలందరికీ మంచి జరిగే రోజుల కోసం వెదకడానికి వారు కంకణం కట్టుకున్నారు... సత్యమూ, న్యాయమూగల మరొక జీవిత విధానాన్ని వాళ్లు అన్వేషిస్తున్నా వాళ్లు అన్వేషిస్తున్నారు... జనానికందరికీ వాళ్లు మంచిని కోరుతున్నారు!"

"నీలొన్నా, ఇక ఇంటికెళ్లవమ్మా. వెళ్లు తల్లీ, వెళ్లు. ఈ వేళకిది చాలు నీకు!" అన్నాడు సిజోవ్.

అతడి ముఖం వెలవెలలాడుతోంది. గెడ్డం చెదిరిపోయింది. గభాలున అతడు నిటార్గా నిలబడి నాల్గు పక్కలా తీక్షణంగా చూశాడు:

"నా కొడుకు మత్వేయ్‌ని ఫ్యాక్టరీ తన పొట్టను పెట్టుకున్న సంగతి మీరంతా ఎరుగుదురు వాడే బతికుంటే, నేను స్వయంగా వాడిని వీళ్లవెంట పంపి ఉండేవాడిని. నేనే స్వయంగా వాడితో 'మత్వేయ్! నువ్వు కూడా వాళ్లతో వెళ్లు! అదొకటే సరియైన దారి. అదొక్కటే నిజాయితీతో కూడిన మార్గం!' అని చెప్పేవాణ్ణి."

అతడంతటితో ఆగి మౌనం దాల్చేడు. మిగిలినవాళ్లు కూడా మౌనం దాల్చేరు. ఏదో మహత్తరమైన కొత్త విషయం వాళ్ల నావహించింది. దాన్ని గురించి జనానికిప్పుడే విధమైన భీతీ కలగడం లేదు. సిజోవ్ బిగించిన పిడికిలిని పైకెత్తి ఊపుతూ ఇలా అన్నాడు:

"ముసలివాడిని మాట్లాడుతున్నాను. వినండి... మీరంతా నన్నెరుగుదురు. నాకు ఏభై మూడేళ్లు నెత్తినబడ్డాయి. ముప్పై తొమ్మిది సంవత్సరాలనుంచి ఇక్కడ పనిచేస్తున్నాను. ఈ రోజున నా మేనల్లుడిని మళ్లీ అరెస్టు చేశారు. వాడు చాలా మంచివాడు. తెలివైనవాడు. వాడు కూడా ఊరేగింపులో ముందే నిలబడ్డాడు. పావెల్ పక్కన, సరిగ్గా జండా దగ్గరే, నిలబడ్డాడు...."

సిజోవ్ తన చేతిని అటూ ఇటూ ఊపేడు. అతడి ప్రాణం పోతోందా అనిపించింది. తల్లి చెయ్యి పట్టుకుని:

"ఈ అవ్వ చెప్పిందంతా నిజం. మన పిల్లలు నిజాయితీగానూ, న్యాయంగానూ బతకాలంటున్నారు. మనం వాళ్లని మధ్యలో వదిలేసి చక్కావచ్చాం! నీలొవ్నా! రా పోదాం" అన్నాడు.

ఆమె ఎర్రబారిన కళ్లతో, జనాన్ని నలుమూలలా చూసి,

"నాయనలారా! జీవితం మన బిడ్డలకోసమే. ఈ ప్రపంచమే వాళ్లకోసం..." అంది.

సిజోవ్ విరిగిపోయిన జండా కర్రనామె చేతి కందిచ్చి,

"రావమ్మా, నీలొవ్నా! ఇదిగో నీ కర్ర చేత్తో పుచ్చుకో" అన్నాడు.

జనం విచారంతోనూ, గౌరవంతోనూ చూచారు. సానుభూతితో మెల్లగా మాట్లాడుకున్నారు. సిజోవ్ ఏమీ మాట్లాడకుండా ఆమెకు దారి చేశాడు.

ఆమె ఇంటి గుమ్మం దగ్గర చేరుకున్నాక, వెనక్కు తిరిగి, కర్ర ఊతంతో నిలబడి, తలవంచి వందనం చేసింది.

"చాలా కృతజ్ఞురాలిని...." అని నెమ్మదిగా చెప్పింది.

*　　*　　*

ఆరోజంతా తల్లికి అదే ధ్యాస. శరీరాన్నీ, ఆత్మనూ కూడా వేధిస్తున్న అలసటకొద్దీ, కన్ను మూసేసరికి మధ్యాహ్నం జరిగిన సంఘటనలన్నీ జ్ఞాపకానికొచ్చేవి. పొట్టి ఆపీసరు, పావెల్ కంచు వన్నె ముఖం, నవ్వుతూ కళకళలాడే అన్‌ద్రేయ్ కళ్లూ, అన్నీ ఆమె కళ్లకు కట్టినట్టు ప్రత్యక్షమైనాయి.

ఏమీ తోచక గదిలో అటూ ఇటూ తిరిగింది. కిటికీ దగ్గర కూచుని వీధిలోకి చూసింది. మళ్లీ లేచి పచారు చేసింది. ఏమాత్రం చప్పుడైనా గభాలున లేచి అర్థం లేకుండా దేని కోసమో వెదకుతున్నట్లు తచ్చాడింది. నీళ్లు తాగింది. కాని ఆ నీళ్లు ఆమె దాహాన్ని కాని, ఆమె గుండెలను కుతకుతలాడించే అగ్నిని కాని చల్లార్చలేకపోయాయి.

ఆ రోజు సాయంకాలం పోలీసు లొచ్చారు. ఏవిధమైన ఆశ్చర్యమూ, భయమూ లేకుండా ఆమె వారిని కలుసుకుంది. వాళ్లు ఆర్భాటం చేసుకుంటూ ఇంట్లోకి ప్రవేశించారు. చాలా సంతోషంగానూ, సంతృప్తిగానూ ఉన్నారు. పసుపుపచ్చని ముఖంగల ఆఫీసరు, పల్లికిలిస్తూ:

"ఏయ్ ముసలమ్మా, బాగున్నావా? మనం కలుసుకోవడమిది మూడోసారి కదూ?" అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు. పొడి ఆరిపోయిన నాలుకతో పెదవులను తుడుచుకుంది. ఆఫీసరు అతిధోరణిలో పడి ఆమెకు బోధించడానికి ప్రయత్నంచేశాడు. అతిగా మాట్లాడ్డం అతనికొక సరదా కాబోలనుకుంది. అతడన్న మాటలామె కేమీ బాధ కలిగించలేదు. నిజానికి వాటి నామె పట్టించుకోనే లేదు. కాని చివరకి, "ఏమమ్మోయ్! ఈ తప్పంతా నీదే. నీ కొడుకును చిన్నప్పటినుంచీ అదుపాజ్ఞల్లో పెట్టకపోవడం, దేవుడన్నా చక్రవర్తి అన్నా భక్తి గౌరవాలు కలిగించకపోవడం నీదే తప్పు..." అనేసరికి ఆమె తలుపు దగ్గరే నిలబడి మెల్లగా జవాబు చెప్పింది:

"మన మంచి చెడ్డల్ని నిర్ణయించే న్యాయాధిపతులు మన పిల్లలే.... వాళ్లు ఆ విధమైన కఠోర మార్గాన్ననుసరించి పోతుంటే, వాళ్ల పాటుకు వాళ్ల నొదిలిపెట్టినందుకు వాళ్లే మన మంచి చెడ్డల్ని నిర్ణయిస్తారు."

"ఏమిటంటున్నావ్? బిగ్గరగా చెప్పు!" అరిచాడు ఆఫీసరు.

"మన పిల్లలే మన పాలిటి న్యాయాధిపతులు అంటున్నాను" అని తల్లి నిట్టూర్చి జవాబుచెప్పింది.

అతడు రుసరుసలాడుతూ ఏదో లొడలొడ మాట్లాడేడు. అవేమీ ఆమె వినిపించుకోలేదు.

ఇంటిని సోదాచేసేటప్పుడు, సాక్షిగా మార్యా కోర్సునొవాను రప్పించారు. ఆమె తల్లికి పక్కనే నిలబడింది గాని తలెత్తి ఆమెకేసి చూడలేదు. ఆఫీసరు ఆమెను ఏదైనా ప్రశ్నించినప్పుడు మాత్రం వంగి సలాం కొట్టి ఒకటే జవాబు చెప్పేది:

"మహాప్రభూ! నాకేమీ తెలియదు. నేను అమాయకురాలిని. అవీ ఇవీ అమ్ముకుంటూ పొట్టపోసుకుంటున్నాను. నాకే పాపమూ తెలియదు..."

"నోరు ముయ్!" అని ఆఫీసరు మీసాలు దువ్వుకుంటూ ఆజ్ఞాపించాడు. మళ్లీ వంగి సలాం చేసింది. కాని అతడు చూడకుండా వున్నప్పుడు వెక్కిరించింది.

"వాడి మొహానికి అంతే!" అని తల్లి చెవిలో అంది.

వ్లాసొవాను సోదా చెయ్యమని ఆఫీసరు ఆజ్ఞాపించాడు. ఆమె బిత్తరపోయి, ఆఫీసరు ముఖంకేసి చూసింది.

"మహాప్రభూ! అలాటి పని చెయ్యడం నాచేత గాదండీ!" అని భయపడుతూ చెప్పింది.

ఆఫీసరు బూటుకాలితో నేలమీద కొట్టి నానా హంగామా చేసి హుంకరించాడు. మార్యా తలొంచుకుంది.

"సరి! సెలగేయా నీలొవ్నా తప్పదు. బొత్తాము విప్పు" అని తల్లితో చెప్పింది.

చేతుల్తో తల్లి దుస్తులను తడుముతుంటే, మార్యా ముఖం ఎర్రబడిపోయింది.

"కుక్కల కొడుకులు!" అని గొణిగింది.

"ఏయ్? ఏమిటా సణుగుడు?" అని సోదా జరుగుతున్న వైపు తీక్షణంగా చూస్తూ ఆఫీసరు హుంకరించాడు.

మార్యా గడగడలాడుతూ,

"ఏమీ లేదు బాబూ! ఆడవాళ్ల వ్యవహారం లెండి..." అని నసిగింది.

చివరకు, ఆఫీసరు తల్లిని కాగితంమీద సంతకం చేయమని ఆజ్ఞాపించాడు. అలవాటు లేని చేత్తో "సెలగేయా వ్లాసొవా, కార్మికుని విధవరాలు" అని అక్షరాలు చెక్కింది.

"ఏమిటి రాశావు? అదంతా ఎందుకు రాశావు?" అని ఆఫీసరు ఆశ్చర్యంగా కోల ముఖం చేసి అడిగేడు. "అడవి మనుషులు!" ముసిముసి నవ్వుతూ అన్నాడు.

వాళ్లు వెళ్లిపోయారు. తల్లి రొమ్ముమీద చేతులు కొట్టుకొని కిటికీ దగ్గర నిలబడి రెప్పవాల్చకుండా, కనుబొమలు పైకెత్తి సూటిగా చూసింది. పెదవులు బిర్రబిగుసుకున్నాయి. దవడలు గిట్టకరుచుకుపోయి బాధనిపించింది.

ఒళ్లంతా గగురుపాటుతో తల్లికి మెళకువ వచ్చింది. ఎవరో మోటు మనిషి తన బరువైన చేత్తో ఆమె గుండె పట్టుకుని మెల్లగా పిండేస్తున్నట్లనిపించింది. కూలీలను పనిలోనికి రమ్మని విరామం లేకుండా ఫ్యాక్టరీ సైరను కూతవేస్తోంది. అది రెండవ కూత అని ఆమె గుర్తుపెట్టింది. గది నిండా పుస్తకాలూ, దుస్తులూ చెల్లాచెదరుగా పడివున్నాయి. అంతా తలకిందులుగా ఉంది. నేలంతా బూటుకాళ్ల మట్టి మరకలతో నిండిపోయింది.

"ఇప్పుడిక చెయ్యవలసిందేమిటి? అని ప్రశ్నించుకుంది.

ఇంతలో తను పొద్దుటిపూట ప్రార్థన చెయ్యలేదనే సంగతి ఆమెకు జ్ఞప్తికొచ్చింది. లేచి పూజావిగ్రహం దగ్గరకెళ్లి ఎదురుగా కొన్ని క్షణాలు నిలబడి మళ్లీ కూచుంది. హృదయం ఖాళీయైపోయింది.

తన కోరిక సిద్ధించిందా అన్నట్లు, మధ్యాహ్నం నికొలాయ్ ఇవానొవిచ్ ఆమెను చూడ్డానికొచ్చాడు. కాని అతన్ని చూడ్డంతోనే ఆమెకు హఠాత్తుగా గాభరా పుట్టింది. అతడు చేసిన వందనాన్ని అందుకోకుండానే ఆమె మెల్లగా:

"ఏమిటిలా వచ్చారు? మీరు ఇలా రావడం తెలివితక్కువ పని. మీరిక్కడకు రావడం వాళ్లెవరైనా చూశారంటే, మిమ్మల్ని కూడా పట్టుకుపోతారు!" అంది.

అతడామె చేతిని గట్టిగా పట్టుకుని, సులోచనాలను నుదుటిమీదికి తోసి ఆమె దగ్గరగా వంగి:

"పావెల్, అన్‌ద్రేయ్, నాకూ మధ్య ఒక ఖరారు జరిగింది. వాళ్లను అరెస్టు చేసినట్లయితే, మర్నాడు నేను పట్నానికి మిమ్మల్ని తీసుకెళ్లాలని" అన్నాడు. అతని కంఠధ్వని చాలా మృదువుగాను, ఆమెపట్ల ఎంతో సానుభూతి సూచకంగానూ ఉంది. "ఏమైనా సోదా జరిగిందా?" అని అడిగాడు.

"అవును. సిగ్గుశరాలు లేకుండా, కొంపంతా గాలించి నానా హంగామా చేశారు!"

"వాళ్లకి సిగ్గెందుకు?" అని నికొలాయ్ భుజాలెగరేస్తూ అన్నాడు. ఇక ముందామె పట్టణంలో ఎందుకు కాపురముండాలో చెప్పడం మొదలెట్టేడు.

స్నేహభావంతోనూ ఆప్యాయంగానూ అతడు చెప్పిన మాటలన్నీ ఆమె విని, చిన్న నవ్వు నవ్వింది. అతడు చెప్పిన వాదనలన్నీ ఆమె వినిపించుకలేదు. కాని అతని యడల తనకు కలిగిన ఆప్యాయతకూ విశ్వాసానికీ ఆమె ఆశ్చర్యపడింది.

"పాషా కోరికల్లా ఉంటే, మీకేమీ ఇబ్బంది లేకుండా ఉంటే...."

"దాన్ని గురించి మీకేమీ ఆలోచనక్కరలేదు. నేనొక్కణ్ణే ఉంటున్నాను. అప్పుడప్పుడు మా అక్క వస్తూ ఉంటుంది" అని మాటకడ్డొచ్చాడు.

"అయితే నేను మీ ఖర్చుమీద జీవించను."

"మీకు కావాలంటే పని చూడగలం" అన్నాడు నికొలాయ్.

ఆమెకు పని అంటే, తన కొడుకూ, అన్‌ద్రేయ్, వాళ్ల స్నేహితులూ చేసే పని అనే అర్థం. నికొలాయ్ దగ్గర కొచ్చి, అతని కళ్ల కేసి తేరిపారచూసింది.

"నిజంగానే పని చూస్తారా?" అని అడిగింది.

"నాకు పెళ్లీగెళ్లీ లేదు. కనుక నా యింట్లో అంత పని లేదు..."

"ఇంట్లో పని కాదు.... నేనడుగుతున్నది" అంది మెల్లగా.

అతడీ మాత్రం అర్థం చేసుకోలేకపోయినందుకు కొంచెం బాధపడి నిట్టూర్పు విడిచింది. అతడు మాత్రం చిరునవ్వు నవ్వేసి కొంచెం ఆలోచనాపూర్వకంగా ఇలా అన్నాడు:

"పత్రికను అచ్చువేయమని కోరిన రైతుల చిరునామాను పావెల్‌ని అడిగి మీరు తెలుసుకుంటే...."

“వాళ్లని నేనెరుగుదును! వాళ్లని వెదికి పట్టుకుని మీరేమి చెయ్యమంటే అది చేస్తాను! నిషిద్ధ పత్రాలను తీసుకువెళ్తున్నానని ఎవరూ అనుకోరు. మీ కడుపు చల్లగా ఉండా! నేను ఫ్యాక్టరీలోకి కరపత్రాలు పట్టుకెళ్లలేదూ? అని సంతోషంతో తల్లి చెప్పింది.

హఠాత్తుగా ఆమె కొక గాఢమైన కోరిక కలిగింది. భుజాన సంచి వేసుకుని, కర్ర చేత్తో పుచ్చుకుని, గ్రామాలను, అడవులను దాటి దేశమంతా తిరగాలనిపించింది.

నికొలాయ్ లేచి గడియారం కేసి చూశాడు.

“అయితే అంగీకరించినట్టేనా? మీరు పట్టణానికొచ్చేసి నాదగ్గర ఉంటారన్న మాటేగా?”

ఆమె తలూపింది.

“ఎప్పుడు? సాధ్యమైనంత త్వరలో” అన్నాడు నికొలాయ్. “మీరు వచ్చేసేదాకా నేను చాలా ఆదుర్దాగా ఉంటాను” అని మెల్లగా చెప్పేడు.

ఆమె ఆశ్చర్యంతో అతడికేసి చూసింది. అతనికి తనేమవుతుంది? అతడు తల పక్కకువాల్చి, బిడియంతో చిరునవ్వు నవ్వుతూ కొంచెం వంగి నిలబడ్డాడు. సాధారణమైన నల్లకోటు ధరించాడు. అతడి వాలకం అతని స్వభావానికి భిన్నంగా ఉంది.

“మీ దగ్గరేమైనా డబ్బుందా?” అని రెప్పలు వాల్చి అతడామెనడిగేడు.

“లేదు!”

నికొలాయ్ నెమ్మదిగా నవ్వుకున్నాడు.

“డబ్బుందే అది చాలా అసహ్యమైనది. పుచ్చుకోవడానికీ ఇవ్వడానికీ కూడా చాలా చికాకైనది...”

అతడామె చెయ్యి పట్టుకుని గట్టిగా నొక్కేడు.

“సాధ్యమైనంత త్వరలో రండి!” అన్నాడు.

తర్వాత అతడు నెమ్మదిగా వెళ్లిపోయాడు.

* * *

నికొలాయ్ వచ్చిన నాల్గన రోజు తల్లి అతని ఇంటికి బయల్దేరింది. రెండు ట్రంకు పెట్టెల సామానుతో ఆమె బండి, కూలిపేటను వదిలిపెట్టి పొలాలపక్కనుంచి పోతూంది.

తన పొగగొట్టాలను ఆకాశంలోకి చొనువుతూన్న ఫ్యాక్టరీ ఎర్రటి పెద్ద సాలీడు లాగ మసిబారిన నేలమీద కాళ్లు పారజాపుకుని ఉంది. దాని చుట్టూ ఒంటి అంతస్తుగల కార్మికుల ఇల్లు బాడవ కానుకుని గుంపులుగా ఉన్నాయి. ఆ ఇళ్లు వెలవెల లాడుతూ ఒకదానిమీద

ఒకటి కట్టకట్టినట్లుగా ఉన్నాయి. వాటికన్న ఎత్తుగా, ఫ్యాక్టరీలాగే ఎర్రటి రంగు చర్చి కనుబడుతోంది. దాని గోపురం మాత్రం పొగ గొట్టాలకంటె కిందగానే ఉంది.

తల్లి నిట్టూర్పు విడిచి, తన బ్లౌజు కాలరు వదులు చేసుకుంది. అది ఆమెకు ఊపిరి సలపకుండా చేస్తున్నట్లనిపించింది.

"ఛల్ ఛల్!" అని బండివాడు కళ్లెపు వారు పుచ్చుకుని గుర్రాన్ని అదిలించాడు. బండిమనిషి పొట్టిగా ఉన్నాడు. వంకర కాళ్లు. వయస్సింతని చెప్పడానికి వీల్లేదు.

"ఛల్ ఛల్!" అని ఈసురోమని గుర్రాన్ని అదలిస్తూ పెళ్లలు పెళ్లలుగా మట్టి అంటుకున్న బూటు కాళ్లను తమాషాగా గాలిలోకి తన్నుతుండేవాడు.

నికొలాయ్ ఇవానొవిచ్ పట్టణం చివర ఒంటరిగా ఉండే వీధిలో కాపురమున్నాడు. అతని యిల్లు పాతదైన రెండంతస్తుల మేడలో భాగం. ఇంటి ముందర చిన్న తోట ఉంది.

"ఇక్కడ మీకు సౌకర్యంగా ఉంటుందా?" అంటూ నికొలాయ్ తల్లి కొక చిన్న గది చూపించాడు. ఆ గదిలో ఒక కిటికీలోనుంచి తోట కనబడుతుంది. మరొక కిటికీలోనుంచి పచ్చిక పెరిగిన పెరడు కనబడుతుంది. ఈ గదిలో కూడా గోడలకు పుస్తకాల అలమారాలు అమర్చబడివున్నాయి.

నికొలాయ్ ఇమ్ముగా ఉండే తన ఇంట్లో కూడా, నిదానంగా, తన ఇల్లు కానట్లుగా నడుస్తూండడం గమనించింది ఆమె. గదిలో ఉండే వస్తువులను ముఖం బాగా దగ్గర పెట్టి, సులోచనాలను సున్నింతమైన కుడి చేతి వేళ్లతో పైకెత్తి పట్టుకుని తన దృష్టి నాకర్షించిన వస్తువును పరిశీలనగా చూస్తూండేవాడు.

పువ్వుల చెట్లకామె నీళ్లు పోసి, పియానోమీద చిందరవందరగా పడేసి ఉన్న సంగీతపు పుస్తకాలను సర్దింది. సమొవార్‌కేసి చూసి:

"దాన్ని నిగనిగలాడేటట్లు తోమించాలి" అంది.

తెరచి ఉన్న కిటికీలోనుంచి రాత్రివేళ పట్టణంలోని అపరిచితమైన ధ్వనులన్నీ ఆమె చెవ్వులో పడుతున్నాయి. తోటలోని చెట్లమీద ఆకుల రెపరెప ధ్వనులు చేస్తున్నాయి. వాటిని ఆలకిస్తూ....

"లోకంలో ముందుకు పోతున్నారు పిల్లలు" అనుకుంది.

"మీరు విద్యార్థులా?" అని తల్లి అతడినడిగింది.

"కాదు. నేను ఉపాధ్యాయుడిని. మా నాయన వ్యాత్క ఫ్యాక్టరీ మేనేజరు. నేను మాత్రం ఉపాధ్యాయుడిగా చేరేను. గ్రామంలో రైతులకు పుస్తకాలను ఇచ్చినందుకు పట్టుబడి

జైలు శిక్షననుభవించాను. ఆ తర్వాత ఒక పుస్తకాల దుకాణంలో విక్రయదారుగా పనిచేశాను. అక్కడ నా అజాగ్రత్తవల్ల మళ్లీ జైల్లో పడ్డాను. తర్వాత నన్ను అర్హాంగెల్స్కు ప్రవాసం పంపేరు. అక్కడ కూడా గవర్నరుతో పేచీపడి అతని ఆగ్రహానికి గురయ్యాను. అంచేత తెల్ల సముద్ర తీరాన ఉన్న ఒక కుగ్రామానికి నన్ను పంపేశారు. అక్కడ అయిదేళ్లున్నాను."

ఆ గదిలో అతని కంఠస్వరం అలా తాపీగా ప్రతిధ్వనించింది. తల్లి ఇలాంటి కథన నెన్నింటినో ఇదివరకు వింది. కాని చెప్పేవాళ్లు తొణుకూ బెణుకూ లేకుండా, ఆగ్రహావేశాలకు చోటివ్వకుండా, ఇవన్నీ తప్పనిసరిగా జరగాల్సినవే అన్నట్లు ఎలా చెప్పగలుగుతారో మాత్రం ఆమెకు అర్థం కాలేదు.

"మా అక్కయ్య ఇవేళ వస్తోంది" అన్నాడు నికొలాయ్.

"ఆమెకు పెళ్లి అయిందా?"

"ఆమె విధవరాలు. ఆమె భర్తను సైబీరియాకి ప్రవాసం పంపేరు. అతడు అక్కడ నుంచి తప్పించుకుని పారిపోయాడు. రెండేళ్ల కిందట యూరప్‌లో క్షయవ్యాధివల్ల మరణించాడు."

"ఆమె మీకన్న ఎన్నేళ్లు పెద్ద?"

"నాకన్న ఆరేళ్లు పెద్దది. నేనామెకు ఎంతైనా ఋణపడున్నాను. ఆమె ఎంత చక్కగా పియానో వాయిస్తుందో వినండి. ఆ పియానో ఆమెదే. ఇక్కడున్న వస్తువులు చాలా వరకామెనే. పుస్తకాలు నావి."

"ఆమె ఎక్కడుంటుంది?"

"ఎక్కడ పడితే అక్కడే... ఎక్కడ ధైర్యంగల మనిషి అవసరమో అక్కడ ఆమె ఉంటుంది" అని అతడొక చిరనవ్వు నవ్వేడు.

"ఆమె కూడా ఇలాటి పనే చేస్తోందా?

"ముమ్మాటికీ!"

ఇంతలో అతడు ఆఫీసు కెళ్లిపోయాడు. తల్లి "ఇలాటి పని" అంటే ఏమిటో ఆలోచించడం మొదలెట్టింది. పట్టుదలతో, నిదానంగా ఏరోజుకారోజు ఈ పనిలో నిమగ్నులై ఉన్న మనుషుల్ని గురించి కూడా ఆలోచించింది. దానితో వాళ్ల ముందర తను నిలబడినట్లనిపించింది. దానిలా అనిపించింది. రాత్రివేళ మహోన్నత పర్వతం ముందర తను నిలబడినట్లనిపించింది.

దాదాపు మధ్యాహ్నం అయేసరికి నల్లటి దుస్తులను ధరించిన ఒక పొడుగుపాటి సన్నని స్త్రీ ప్రత్యక్షమైంది. తల్లి తలుపు తీయడంతోనే, ఆ స్త్రి తన పసుపుపచ్చటి సంచిని కింద పడేసి చేతిని గట్టిగా పట్టుకుంది.

మీరు పావెల్ మిహాయ్‌లొవిచ్ తల్లి అనుకుంటాను?" అని అడిగింది.

"అవును" అని తల్లి జవాబుచెప్పింది. ఆ స్త్రీ ధరించిన నాజూకైన దుస్తులను చూసి ఆమె కొంచెం కంగారుపడింది.

"మీరు నేనూహించుకున్నట్లుగానే ఉన్నారు. మా తమ్ముడు మీరిక్కడ కొచ్చేసి ఇక్కడే ఉండిపోతారని రాశాడు" అని చెప్పి, ఆమె అద్దం దగ్గర నిలబడి టోపీ తీసేసింది. "నేను చాలా కాలం నుంచి పావెల్ మిహాయ్‌లొవిచ్‌ని బాగా ఎరుగుదును. అతడు మీ సంగతి చెప్పేడు" అంది.

ఆమె కంఠస్వరం బొంగురుగా ఉంది. మాటలు నెమ్మదిగా మాట్లాడింది. కాని నడక చాలా చలాకీగా ఉంది. ఆమె కచికవన్నె కళ్లలో యవ్వనం కనిపిస్తున్నా, కణతలమీద సన్నని ముడతలు, సున్నితమైన చెవి దొప్పల పైన మెరుస్తూన్న నెరసిన వెంట్రుకలు ఆమె పెద్దతనాన్ని సూచిస్తున్నాయి.

"నాకు ఆకలేస్తోంది! ఒక కప్పు కాఫీ కావాలి" అని అడిగింది.

"ఇప్పుడే ఒక నిమిషంలో తయారుచేసిస్తాను!" అని అలమారాలోనుండి కాఫీ పాత్రనందుకుంటూ "పాష మీతో నా ప్రస్తావన చేశాడనికదూ మీరన్నది?" అని అడిగింది.

"చాలా తరుచుగా మీ సంగతే చెప్పేవాడు." ఆమె తోలు సిగరెట్ పెట్టెలోనుంచి ఒక సిగరెట్ తీసి ముట్టించి గదిలో పచారు చెయ్యసాగింది.

"అతన్ని గురించి మీరు చాలా భయపడుతున్నారా?" అని తల్లి నడిగింది.

కాఫీ పాత్ర కింద వెలుగుతున్న స్పిరిటు పొయ్యినుండి లేస్తూన్నట్టి సన్నని నీలి మంటలను చూస్తూ తల్లి నవ్వింది. కొత్తగా వచ్చిన స్త్రీ సమక్షంలో తన కుండే సంకోచాలన్నీ సంతోషంలో ఏష్యమైపోయాయి.

"అంటే, మా చిట్టినాయన నన్ను గురించి చెప్పేదన్నమాటే" అని తల్లి తనలో తనే అనుకుంది. "నిజమే అతని విషయమై భయం లేకపోలేదు. కాని కొంత కాలం కిందట ఇలాంటిది సంభవిస్తే నేనింతకన్న చాలా బాధపడేదాన్ని. ఇప్పుడో, ఈ పనిలో అంతడొక్కడే కాదని నాకు తెలుసు" అని ఆమెతో మెల్లగా చెప్పింది.

ఆమె ముఖంకేసి చూసి తల్లి ఆమె పేరడిగింది.

"సోఫ్యా" అని ఆమె బదులుచెప్పింది.

తల్లి ఆమెను ఎంతో ఆసక్తితో పరిశీలించింది. చాలా ధైర్యసాహసాలు, ఉద్వేగం ఆమె యదమితంగా ఉన్నట్లామె గ్రహించింది.

"ఇప్పుడు ముఖ్యమైన దేమిటంటే వీళ్లందరూ ఇక అట్టేకాలం జైల్లో ఉండకూడదు. వాళ్లు ఈ విచారణను త్వరలో ముగిస్తే బాగుండును! వీళ్లకు ప్రవాస శిక్షను విధిస్తారు. అక్కడనుంచి పావెల్ మిహాయ్‌లొవిచ్ తప్పించుకు వచ్చేసే ఏర్పాట్లను మనం చేస్తాం. అతని అవసరం యిక్కడ చాలా ఉంది" అని సోఫ్యా ధీమాగా చెప్పింది.

తల్లి సోఫ్యాకేసి సంకోచంతో చూసింది. సిగరెట్టు పీకెను ఎక్కడ పారెయ్యాలా అని సోఫ్యా ఇటూ అటూ చూసి చివరకామె సిగరెట్ట పీకెను పువ్వుల కుండీ మట్టిలో పడేసి నలిపేసింది.

"అలా చేస్తే మొక్కలు పాడైపోతాయి" అంది తల్లి అప్రయత్నంగా.

"క్షమించండి. నికొలాయ్ కూడా నాకు ఆ మాటే చెబుతూ ఉంటాడు" అని సోఫ్యా ఆ సిగరెట్టు ముక్కను తీసి కిటికీలోంచి బయట పారేసింది.

తల్లి కొంచెం ఇరుకున పడింది. తను తప్పుచేసినట్లుగా సోఫ్యాకేసి చూసి:

"మీకేమైనా ఇక్కడ కొత్తగా ఉందా?" అని అడిగింది.

తల్లి చిన్ననవ్వు నవ్వింది.

"సిగరెట్ ముక్కను గురించి నేనంత నిర్మొగమాటంగా మాట్లాడిన తర్వాత నాకింకా కొత్తేమిటి?... నేను నిన్ననే ఈ ఇంట్లో కొచ్చాను. కాని అప్పుడే ఇది నా స్వంత ఇల్లనిపిస్తోంది... నాకేమీ భయమనేది లేదు. నాకు తోచిందేదో అనేస్తాను..." అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతూ తల్లి చెప్పింది.

"సరిగా అలాగే ఉండాలి!" అంది సోఫ్యా.

నికొలాయ్ సాయంత్రం అయాక వచ్చాక. భోజనం చేస్తుండగా, సోఫ్యా, ప్రవాసం నుండి పారిపోయి వచ్చిన ఒకమనిషిని తానెలా దాచినదీ, కనిపించిన వాడల్లా గూఢచారి అనుకుని తానెలా ఝడిసినదీ, తప్పించుకు వచ్చినవాడెంత తమాషాగా ప్రవర్తించినదీ, నవ్వుతూ వర్ణించింది. తల్లికామె ధోరణి చూస్తుంటే బడాయి మాటలు చెపుతోందా అనిపించింది. ఒక కార్మికుడు తను చాలా కఠినమైన పనిని నేర్పుతో నిర్వహించినప్పుడు చెప్పేలా ఆమె చెప్పింది.

ఇప్పుడు సోఫ్యా గచ్చకాయ రంగు తేలిక దుస్తుల్ని ధరించింది. ఆ దుస్తుల్లో ఆమె బాగా పొడుగ్గా కనిపించింది. నేత్రాలు బాగా నల్లగా కనబడ్డాయి. కదలికలో ఎక్కువ పొందిక కనబడింది.

భోజనాంతరం నికొలాయ్:

"చూశావా, సోఫ్యా, నువ్వు మరొక పని చెయ్యవలసి ఉంటుంది. రైతుల కోసం ఒక పత్రికను ప్రకటించేటందుకు మనం పూనుకున్నాం. కాని ఈ అరెస్టులమూలంగా, వాటిని పంచిపెట్టే మనిషితో సంబంధం తెగిపోయింది. అతన్ని వెదికి పట్టుకోవడానికి మనకు సెలగేయా

నీలొవ్నా ఒక్కరు మాత్రమే తోడ్పడగలరు. నువ్వామెవెంట పల్లెటూళ్ల కెళ్లాలి. ఎంత త్వరగా వెడితే అంత మంచిది” అన్నాడు.

సోఫ్యా సిగరెట్టు దమ్ము పీల్చి,

“సరే, అలాగే. పెలగేయా నీలొవ్నా, మనం వెడతాం, ఔనా?” అని అడిగింది.

“వెడదాం.”

“చాలా దూరమా?”

“దాదాపు ఎనభై మైళ్లు.”

“అయితే సరే! ఇప్పుడు నాకు కొంచెం సంగీతం కావాలి. అమ్మా! నేను కొద్దిగా పియానో వాయిస్తే మీకేమీ యిబ్బంది కలగదు కదా?”

“నా విషయమై అలాటి సంకోచాలు పెట్టుకోకండి. నేనసలిక్కడ లేనట్టుగానే భావించి, మీ పని మీరు చూసుకోండి” అంటూ తల్లి సోఫాలో ఒక పక్కకు జరిగింది. అక్కా, తమ్ముడూ ఆమెను చూస్తున్నట్లగుపడలేదు, కాని ఆమెను ఏదో వంకపెట్టి సంభాషణలోకి లాగడానికి ప్రయత్నం చేస్తూనేవున్నారు.

సోఫ్యా సంగీత పుస్తకాన్ని విప్పి, పియానోమీద ఎదుటగా పెట్టుకుని, ఎడమచేత్తో పియానో వాయిస్తూ పాట మొదలెట్టింది. పియానో తంతులు షడ్జమ స్థాయిలో మోగేయి.

ఆకారణంగా తల్లికి అంధకారమయమైన తన గత జీవితంలోని ఘట్టమొకటి స్ఫురణ కొచ్చింది. తానా సంగతి ఏనాడో మరచిపోయింది. నేడు అదంతా నిస్పష్టంగా జ్ఞప్తికొచ్చింది.

ఒక రోజు అర్ధరాత్రివేళ ఆమె భర్త తప్ప తాగి ఇంటికొచ్చాడు. మంచం మీద పడుకున్న ఆమెను చెయ్యిపట్టుకుని బర బర కిందకు లాగి డొక్కలో తన్నేడు.

“లంజముండా! ఇక్కడనుంచి పో! నువ్వంటే నాకు అసహ్యమేస్తోంది!” అన్నాడు.

అతడు కొట్టే దెబ్బలు తప్పించుకోవడానికి రెండేళ్ల కొడుకును చేతుల్లోకి తీసుకుని ముందర అడ్డం పెట్టుకుని నేలమీద మోకరించింది. నగ్నంగా, వెచ్చగా ఉండే పిల్లవాడు ఏడుస్తూ ఆమె చేతుల్లో గిజగిజలాడేడు.

“ఇక్కడనుంచి పో!” అని మిహయీల్ ముకరించాడు.

ఆమె చటుక్కున లేచి వంట ఇంట్లోకి పారిపోయింది. తన భుజం మీద జాకెట్టు పడేసుకుని, పిల్లవాడికి శాలువ కప్పి, మారు మాటాడకుండా, నిశ్శబ్దంగా, రాత్రి దుస్తులూ, జాకెట్టూ మాత్రం ధరించి, కాలికి జోడైనా వేసుకోకుండా బయటికి వచ్చేసింది. అది మే నెల. రాత్రివేళ చాలా చలిగా ఉంది.

రాగం ఆఖరు కొచ్చింది. నిర్లక్ష్యమైన కఠిన స్వరంతో సంగీతం మెల్లగా అంతమైపోయింది.

"బాగా నచ్చింది! బాగా" అని నిద్రలోనుంచి లేచినవాడిలాగున అతడు జవాబు చెప్పేడు.

తల్లికి జ్ఞప్తికొచ్చిన సంఘటనలు ఆమె హృదయంలో తటతట కొట్టుకున్నాయి. స్పృహ ఉండీ ఉండని స్థితిలో ఆమెకీ ఆలోచన తట్టనారంభించింది:

"ప్రపంచంలో స్నేహంగానూ, ప్రశాంతంగానూ కలిసి జీవించే మనుషులుంటారు. అంధకారమయమైన ఆ జీవితంలోలాగ వారు తమలో తాము పోరాడుకోరు... తప్పతాగి ఒళ్లు తెలియకుండా ఉండరు. చిన్న రొట్టెముక్కకోసం దెబ్బలాడుకోరు..."

సోఫా మరొక సిగరెట్ ముట్టించింది. ఆమె తెరపి లేకుండా సిగరెట్లు తాగుతుంది.

తల్లి తన కడుపులోని వేదనను దాచుకోలేకపోయింది.

ఈ అప్పా తమ్ముళ్లకు ఏదో మంచిమాట చెప్పాలనిపించింది తల్లికి సంగీతం ఆమె హృదయాన్ని మైమరిపించింది. చిరునవ్వు నవ్వింది. అప్పకీ తమ్ముడికీ ఏదో విధంగా తను ఉపయోగపడాలనుకుంది.

ఆమె నాలుగు మూలలా చూసింది. తనేమి చెయ్యగలదు? మెల్లగా వంటింట్లోకి వెళ్లి టీకి సమొవార్ వెలిగించింది.

అంతటితో ఆమెకు తృప్తి కలగలేదు. టీ తయారుచేసుకొచ్చి గ్లాసుల్లో పోస్తూ కలవరపాటుతో చిరునవ్వు నవ్వింది. తన మనస్సంతృప్తి కోసం, వాళ్ల సంతృప్తికోసం మాట్లాడ్డం మొదలెట్టింది :

"మూర్ఖులమై, అంధకారయుతమైన జీవితంలో పడున్న మాలాంటి వాళ్లకి కూడా అన్నీ తెలుస్తాయి. కాని మా హృదయంలో ఉన్న భావాన్ని మాత్రం పైకి మాటల్లో చెప్పలేము. అంచేత మాకే సిగ్గేస్తుంది. ఆ సిగ్గుచేత మా ఆలోచనలపట్ల విసుగు జనిస్తుంది. జీవితం నాలుగు మూలల్నుంచీ పోట్లు పొడుస్తూ ఉంటుంది. ప్రాణం విశ్రాంతిని కోరుతుంది. కాని మా ఆలోచనలు విశ్రాంతి నివ్వవు."

నికొలాయ్ కళ్లజోడు తుడుచుకుంటూ తల్లి చెప్పే మాటలను శ్రద్ధగా వింటున్నాడు. సోఫ్యా చేతిలో ఆరిపోతున్న సిగరెట్టు సంగతి కూడా మరచిపోయి గుడ్లప్పగించి వింటోంది.

"ఇప్పుడిప్పుడే నాకు జీవిత రహస్యం తెలుస్తోంది. అంచేత, నన్ను గురించీ, ప్రజల్ని గురించి కొంచెం చెప్పగలుగుతున్నాను. ఇంతకు ముందు అర్థంచేసుకోవడం, పోల్చి చూడటం చేతనయేది కాదు. మాలో అందరూ ఒకలాగే బతుకుతూ ఉండేవారు. కాని ఇప్పుడు ఇతరులెలా

జీవిస్తున్నారో చూస్తూ, నేనెలా జీవించానో జ్ఞప్తికి తెచ్చుకుంటే, పొలపొలమంటూ అది ఎంత బాధగానో ఉంటుంది.” ఆమె కంఠస్వరాన్ని తగ్గించింది.

వాళ్ళు నిశ్శబ్దంగా ఆమె గాథంతా విన్నారు. పశువుగా పరిగణింపబడి తలవంచి బతికిన ఆమె జీవిత కథలోని అంతరార్థాన్ని గమనించి ఆశ్చర్యచకితులయారు. ఆమె మాట్లాడుతుంటే వేలాదిమంది ఆమెద్వారా మాట్లాడుతున్నట్లుంది. ఆమె జీవిత విధానం చాలా సాధారణమైనదే, మామూలుగా ఈ ప్రపంచంలో అత్యధిక సంఖ్యాకుల బతుకు వంటిదే. కనుక ఆమె కథ ఒక చిహ్నమైంది. ప్రపంచంలోకల్లా నేనే నిర్భాగ్యురాలననుకునేదాన్ని కాని నా కష్టాలన్నీ, పది రెట్లయినా కూడా, మీ జీవితంలో ఒక్క నెలకు సరిరావు! మీ జీవితం రోజూ యమబాధే.... అలా రోజులు ఏళ్ల తరబడి గడిచాయి. ఇలాటి బాధలను సహించే ఓర్పు జనాని కెక్కడినుంచి వస్తుందో కదా?” అని మెల్లగా సోఫ్యా చెప్పింది.

“వాళ్ల కదే అలవాటైపోతుంది” అని నిట్టూరుస్తూ సెలగేయా నీలొన్నా చెప్పింది.

“నాకు జీవితం సంగతి బాగా తెలుసునన్న అతిశయం వుండేది నాకు. కాని ఇలాంటి ప్రత్యక్షమైన కథ వింటే మాత్రం చాలా ఘోరంగా కనిపిస్తుంది. ఇది పుస్తకాల్లోని కథ కాదు. నా ఊహ కాదు. ఇలాంటి చిన్న చిన్న ఘోరసంఘటనలే ఏళ్ల తరబడి జరగడం...” అని ఆలోచనాపూర్వకంగా నికొలాయ్ అన్నాడు.

కొద్ది రోజులు పోయినతర్వాత, తల్లీ, సోఫ్యా పేదవారైన పట్టణ స్త్రీల వేషం ధరించి నికొలాయ్ ఎదుట నిలబడ్డారు. వాళ్లు చిరిగిపోయిన నూలు దుస్తులూ, జాకెట్టూ ధరించారు. భుజాన సంచులు వేసుకుని చేతుల్లో కర్రలు పుచ్చుకున్నారు.

అప్పగారి చేతిని పట్టుకుని గట్టిగా నొక్కి నికొలాయ్ సాగనంపేడు. వాళ్లిద్దరి మధ్యా నిరాడంబరానుబంధం తల్లికెంతో అబ్బురమనిపించింది. వాళ్లు ఒకళ్ల నొకళ్లు ముద్దెట్టుకోలేదు. తియ్యని మాటలు మాట్లాడుకోలేదు. కాని ఒకరి క్షేమాన్ని గురించి ఇంకొకరు ఎంతో ఆదుర్దాపడుతుండేవారు. తానిదివరకుండే ప్రపంచంలో జనం ఒకరినొకరు ముద్దులెట్టుకునేవారు. తేనెలొలికే మాటలు మాట్లాడుకునేవారు. కాని సమయమొచ్చినప్పుడు ఆకలితో వున్న కుక్కల్లాగ ఒకర్నొకరు కరుచుకునేవారు.

ఈ స్త్రీలిద్దరూ పట్టణంలోని వీధుల్లోంచి నెమ్మదిగా నడచిపోయి పొలాల్లో పడ్డారు. పక్క పక్కగా నడుచుకుంటూ, ఇరు పక్కలా పురాతన భూర్జవృక్షాలున్న వెడల్పాటి పుంతలో నడక సాగించారు.

“మీకు అలసట కలగడం లేదా?” అని తల్లి సోఫ్యా నడిగింది.

“నేను నా రోజుల్లో చాలా నడిచాను. నాకు అలవాటే.”

సోఫ్యా, తన చిన్నతనం నాటి చిలిపి చేష్టలను ఎకరవు పెట్టినట్లుగా, విప్లవోద్యమంలో తాను చేసిన పనులను ఉషారుగా చెప్పడం ప్రారంభించింది. ఆమె అనేక సార్లు పేర్లు మార్చుకుంది. దొంగ ప్యాస్‌పోర్టులతో కాలక్షేపం చేసింది. గూఢచారులనుండి తప్పించుకోవడానికి ఎన్నో వేషాలు మార్చింది. ఒక పట్టణం నుంచి మరొక పట్టణానికి నిషిద్ధ కరపత్రాలను కట్టలు కట్టలుగా చేరవేసింది. ప్రవాసంలో ఉన్న కామ్రేడ్సు తప్పించుకు పారిపోయేందుకు ఏర్పాట్లు చేసింది. వాళ్లను విదేశాల్లోని నగరాలకు కూడా వెళ్లి సాగనంపింది. ఒకసారి తన మకాంలో రహస్యంగా ఒక అచ్చుయంత్రాన్ని నెలకొల్పింది. పోలీసులకా సంగతి తెలిసి సోదా చెయ్యడాని కొచ్చేసరికి, ఆమె దాసీ వేషం వేసుకుని గుమ్మంలో నిలబడున్న పోలీసుల్ని తప్పించుకుపోయింది.

ఈ కథలన్నీ వింటుంటే తల్లికి నవ్వొచ్చింది. ఎంతో ఆప్యాయతతో ఆమెకేసి చూసింది. పొడుగ్గా సన్నంగా ఉండే సోఫ్యా, తన అందమైన పాదాలతో నాజుకుగా నడుస్తూ ఆమెతో అడుగు కలిపి నడిచింది. ఆమె నడకలో, మాటల తీరులో, సంతోషం ఉట్టిపడే బొంగురు గొంతుకలో అన్నిటికన్నా పొడుగాటి ఆమె విగ్రహంలో తల్లి కొక నిండుతనమూ, సాహసమూ గోచరించాయి.

"రీబిన్‌కి ఈమె నచ్చదు" అని ఆత్రంగా అనుకుంది.

మరుక్షణంలోనే సోఫ్యా నిరాడంబరంగానూ, ప్రేమతోనూ మాట్లాడింది. తల్లి ఆమెకేసి తేరిపార చూసి నవ్వింది.

"మీరింకా చిన్న పిల్లలానే ఉన్నారు!" అని నిట్టూర్చింది.

"అప్పుడే నాకు ముప్పై రెండేళ్ల పైన బడ్డాయి" అంది సోఫ్యా.

" మిమ్మల్ని చూస్తూన్నాను, మీ మాటలు వింటూన్నాను, ఆలోచించుతున్నాను. మీరు మనిషి హృదయాన్ని సమీపించే మార్గాన్ని తెలుసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఏ మనిషైనా, నిర్భయంగా తన అంతరంగంలో మెదుల్తున్న విషయాలను మీకు చెప్పుకుంటాడు. తనంతట తానే తన హృదయంలో ఉన్న సంగతులను మీకు వెల్లడిస్తాడు. మీ అందర్నీ గురించీ ఆలోచిస్తూంటే, జీవితంలోని చెడుగును మీరు జయిస్తారనే విశ్వాసం నాకు రూఢిగా కలుగుతోంది. అందుకు నాకేమీ సంశయం లేదు" అని ఆలోచనాపూర్వకంగా చెప్పింది తల్లి.

ఒకొక్కప్పుడు సోఫ్యా, ఆకాశాన్ని గురించో, ప్రేమను గురించో, మృదుమధుర స్వరంలో ఒక కొత్త పాటను పాడుతుండేది. ఇంకొకప్పుడు ఆమె పొలాలలను గురించీ, అడవులను గురించీ, వోల్గనదిని గురించీ పద్యాలు చదువుతుండేది. తల్లి వాటిని వింటూ చిరునవ్వు నవ్వుతుండేది. అప్రయంత్నంగా కవితా మాధుర్యానికి మైమరిచిపోయి పద్యానికి లయగా తలూపేది.

* * *

మూడవ నాడు వాళ్లు తమ గమ్యస్థానాన్ని చేరుకున్నారు. తల్లి పొలంలో పనిచేస్తున్న ఒక రైతుని, తారు పరుశ్రమ ఎక్కడుందని అడిగింది. దారి తెలుసుకుని వాళ్లొక ఏటవాలుగా ఉండే అడవి బాటవెంట దిగారు.

"సరి వచ్చేశాం!" అంది తల్లి నాలుగు వైపులా గభారాగా పరకాయించి చూస్తూ.

కర్ర స్తంభాలతో, కొమ్మలతో ఆకులతో వేసిన ఒక పందిరి ఎదుట, మూడు బల్ల చెక్కలతో ఒక బల్ల అమారు చేయబడి వుంది. దాని దగ్గర, బొత్తాములు పెట్టుకోని తారు మరకల చొక్కా తొడుక్కున్న రీబిన్, యెఫీమ్‌తోనూ, ఇంకా ఇద్దరు కుర్రవాళ్లతోనూ కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్నాడు.

"అన్నా! మిహయిల్! నమస్కారం!" అని దూరాన్నుంచే తల్లి పలకరించింది.

అతడు లేచి నింపాదిగా వాళ్ల కెదురెళ్లేడు. ఆమెను గుర్తుపట్టడంతోనే ఆగి, నల్లబారిన చేత్తో గడ్డం సవరించుకుంటూ చిరునవ్వు నవ్వేడు.

తల్లి దగ్గరకొస్తూ:

"మేము యాత్రకు బయలుదేరేం. ఈమె నా స్నేహితురాలు పేరు ఆన్నా. మీ దగ్గరకొచ్చి మీరెలా ఉన్నారో చూసిపోదామని వచ్చాం."

తన సమయస్ఫూర్తికి గర్వపడుతూ, ఓరకంటితో చాలా తీవ్రంగానూ, కఠినంగానూ ఉన్న సోఫ్యా ముఖం కేసి చూసింది.

"ఏమమ్మా! క్షేమంగా ఉన్నావా?" అని రీబిన్ కరచాలనం చేస్తూ వంకర నవ్వు నవ్వేడు. సోఫ్యాకు వంగి నమస్కారం చేశాడు. "ఇది నగరం కాదు అబద్ధాలాడక్కర్లేదులే. ఇక్కడున్న వాళ్లంతా మనవాళ్లే" అన్నాడు.

"ఇక్కడ మేము సన్యాసుల్లాగ జీవిస్తున్నాం. మా దగ్గర కొచ్చి మమ్మల్ని పలకరించే వాళ్లెవరూ లేరు. మా యజమాని ఊళ్లో లేడు. అతడు భార్య ఆస్పత్రిలో ఉంది. దాదాపు యిదంతా ప్రస్తుతం నా అదుపులోనే వుంది. కూచోండి. బహుశా తినడానికేమైనా కావాలనుకుంటాను. యెఫీమ్! కొంచెం పాలు పట్టుకురా!"

యెఫీమ్ పందిట్లో కెళ్లేడు. యాత్రికులు వీపులమీదనున్న సంచులు కింద పెట్టేరు.

తారు ఘాటుతోనూ కుళ్లిపోయిన ఆకుల దుర్వాసనతోనూ అతిథుల తలలు దిమ్మెక్కిపోయాయి.

"ఇతని పేరు యాకొవ్. అతని ఇగ్నాతియ్" అని వరుసగా పొడుగాటి పిల్లవాడినీ, లావుపాటి అతన్నీ రీబిన్ పరిచయం చేశాడు. "సరి, మీ అబ్బాయి ఎలా ఉన్నాడు?" అని అడిగేడు.

"అతను జైల్లో ఉన్నాడు" అని తల్లి నిట్టూర్చింది.

"మళ్ళీనా? అదే బాగుంది కాబోలు" అని ఆశ్చర్యపడ్డాడు.

ఇగ్నాతియ్, పాట కట్టిపెట్టేడు. యాకొవ్ తల్లి చేతుల్లోని కర్ర అందుకున్నాడు.

యెఫీమ్ ఒక జాడీతో పాలు పట్టుకొచ్చాడు. బల్లమీదనున్న కప్పు తీసి అందులో పాలు పోసి సోఫ్యా కందిచ్చాడు. ఆ పని చేస్తూనే ఏమీ చప్పుడు కాకుండా తల్లి చెపుతున్న కథను శ్రద్ధగా విన్నాడు.

"ఊహూ. అదల్లా జరిగిందన్నమాట. బహిరంగంగా!..." అని నెమ్మదిగా నిరుత్సాహంగా అన్నాడు రీబిన్.

"మనమే అలాటి ఊరేగింపు నెప్పుడైనా జరిపితేనా, రైతులు మనల్ని కొట్టి చంపుతారు" అని ముసి ముసి నవ్వుతో యెఫీమ్ అన్నాడు.

"తప్పకుండా వాళ్లు చంపుతారు" అని ఇగ్నాతియ్ తలూపేడు. "నేను ఫ్యాక్టరీ పనిలోకి పోతాను. అక్కడింతకన్న నయం."

"పావెల్‌ను న్యాయస్థానంలో విచారణ చేస్తారంటున్నావు కదూ? ఏమి శిక్ష వేస్తారంటావ్? నువ్వేమైనా విన్నావా? అని రీబిన్ తల్లి నడిగేడు.

"కఠిన శిక్ష. లేకపోతే సైబీరియాకు శాశ్వత ప్రవాసం..." అని ఆమె మెల్లగా జవాబిచ్చింది.

"హుం!" అంటూ రీబిన్ గంభీరంగా మాట్లాడ్డం మొదలెట్టేడు. "అతను పర్యవసానం తెలుసుకోనిదే గుడ్డిగా దూకడు. నాకాసంగతి కచ్చితంగా తెలుసు. చాలా ఆలోచనాపరుడు. కుర్రాళ్లూ, వింటున్నారా? వాళ్లు సన్నీలతో పొడుస్తారనీ, సైబీరియాకు పంపుతారనీ అతనికి తెలుసు. అయినా అతను వెనుకంజవెయ్యలేదు. సాక్షాత్తూ తల్లి దారి కడ్డంగా పడకున్నా, ఆమెను తొక్కుకునైనా ముందుకెళ్లేవాడే. అంతేకాదూ, నీలొవ్నా?"

"అవును. అంతే" అంది తల్లి, ఉలిక్కిపడి. ఒకసారి నిట్టూర్చి సోఫ్యా వైపు చూసింది. సోఫ్యా నిశ్శబ్దంగా ఆమె చేతిని తట్టుతూ, కనుబొమలు ముడుచుకుని రీబిన్‌కేసి చూసింది.

రీబిన్ నల్లటి కళ్లతో నెమ్మదిగా అందర్నీ చూశాడు.

"చూశారా, మనిషంటే అతడు!" అన్నాడు. ఆరుగురు మనుష్యులూ మరోమారు మౌనంగా ఉండిపోయారు. బంగారురంగు పీలికల్లాగా సన్నని సూర్య కిరణాలు ప్రసరిస్తున్నాయి. ఎక్కడనుంచో ఒక కాకి కావుమంది. మే దినోత్సవం నాటి సంఘటనలు తలపుకొచ్చి తల్లి ఆందోళనపడింది. ఆమె మనసంతా పావెల్ అన్ద్రేయ్‌ల మీదకు పోయింది.

"ఓరబ్బాయిలూ! ఒక నిముష మూరుకోండి" అని రీబిన్ చెయ్యెత్తేడు. తల్లికేసి వేరెట్టి చూపిస్తూ, "ఇదిగో ఒక స్త్రీ... ఆమె కొడుకు బహుశా ఇక ఆమెకు దక్కడు..." అన్నాడు.

"అలా ఎందు కంటున్నావు?" అని తల్లి బాధతో అడిగింది.

"ఆ సంగతి చెప్పక తప్పదు" అని అతడు జవాబు చెప్పాడు గంభీరంగా. "అకారణంగా నీ తల నెరియకూడదు. ఆమె కొడుకును ఈ విధంగా హింసపెట్టి వాళ్లు ఆమెను చంపగలిగేరా? నీలొవ్నా, కరపత్రాలు పట్టుకొచ్చావా?"

తల్లి అతనికేసి రెప్పవాల్చకుండా చూసింది ఒక్క క్షణం ఆగి:

"పట్టుకొచ్చాను..." అంది.

రీబిన్ పిడికిలితో బల్లమీద గుద్దేడు:

"చూశారా? నిన్ను చూడ్డంతోనే నాకా సంగతి తెలిసింది. అందుకు కాకపోతే మరెందుకు నువ్విక్కడికొస్తావ్? చూశారా? ఆమె కొడుకుని రంగంలోనుంచి వాళ్లు తప్పించారు. ఆ స్థానాన్ని అతని తల్లి ఆక్రమించింది!" అన్నాడు.

రీబిన్ పిడికిలి ఝూండించి గట్టిగా కసిగా తిట్టేడు.

"ఈ మధ్యనే, మా జిల్లా ప్రధానాధికారి నన్ను పిలిపించి, 'తుంటరి వెధవా! మతగురువుతో ఏం చెప్పేవు?" అని అడిగేడు. దానిమీద, 'తుంటరినా! నేను చెమటోడ్చి నా బతుకు నేను బతుకుతున్నాను. నేనెవరికీ చెడుగు చెయ్యను' అని చెప్పేను. అతడు నామీద హుంకరించి, పళ్లూడేట్లు దవడ మీద కొట్టేడు. మూడు రోజులు నన్ను జైల్లో పెట్టేరు. 'అయితే, సాధారణమైన జనంతో మీరిలాగే నన్న మాట, మాట్లాడేది?' అని అనుకున్నాను. 'అలాగైతే మేమిదంతా మరచిపోతామనుకోకురా ముసలిదయ్యం! నేను చెయ్యకపోయినా, ఎవళ్లో ఒకళ్లు మీకో, మీ సంతతి వాళ్లకో తగిన శాస్తి చేస్తారు. ఆ సంగతి గుర్తుంచుకోండి! మీ ఇనుపగోళ్లతో ప్రజల హృదయాలను మీరు దున్ని అక్కడ ద్వేషబీజం నాటేరు. కనుక పాపిష్ఠి ముండాకొడుకుల్లారా, మిమ్మల్ని జాలి తలుస్తారనుకోకండి!" అని అనుకున్నాను. అంతే మరి!"

అతని హృదయం కోపంతో తుకతుకలాడింది. ముఖం ఎర్రబారింది. అతని కంఠ ధ్వనులు వింటుంటే తల్లికి చాలా భయమేసింది.

"ఇంతకీ, నేను మతగురువుతో ఏం చెప్పానో తెలుసా?" అని రబిన్ కొంచెం నిదానంగా ఇలా అన్నాడు. "ఒక రోజున మతగురువు గ్రామమంతా తిరిగొచ్చి కొందరు రైతులతో కబుర్లు చెప్పడం మొదలెట్టేడు. మామూలు జనం ఉట్టి గొర్రెల మందల్లాంటి వాళ్లనీ, వాళ్లని కాపలా కాసే గొల్లడొకడుండాలనీ చెపుతున్నాడు. నేను వేళాకోళంగా, 'జంతువులమీద నక్కకి పెత్తనం కట్టబెడితే, అప్పుడిక ఈకలెగురుతుంటాయి. కాని పక్షులుండవు' అన్నాను. అతను నాకేసి పొగరుగా చూసి, ప్రజలు చాలా కాలం బాధలు పడవలసి వస్తుందనీ వాటిని

భరించే శక్తిని ప్రసాదించమని దేవుని ప్రార్థించాలనీ ఏమేమిటో చెప్పేడు. దానిమీద, ప్రజలు ఇప్పటికే దేవుడిని చాలా ఎక్కువగా ప్రార్థిస్తున్నారనీ, వాళ్ల మొరలు ఆలకించడానికి దేవుడికి తీరిక లేకుండా ఉందనీ చెప్పేను. ఓహో! అయితే నువ్వు దేవుడిని ఏమీ ప్రార్థిస్తున్నావు అని నన్నడిగేడు. 'నేను సామాన్య జనమందరిలాగే జీవితమంతా ఒకే ప్రార్థన చేస్తున్నాను. ఓ భగవంతుడా! పెద్ద మనుష్యులకోసం, రాళ్లు తిని దుంగలను మోసే సూక్ష్మాన్ని నాకు బోధించవయ్యా' అన్నాను. పూర్తి చేసేందుకు నాకు అతడు సావకాశ మివ్వలేదు." నాకు బోధించవయ్యా' అన్నాను. పూర్తి చేసేందుకు నాకు అతడు సావకాశ మివ్వలేదు." హఠాత్తుగా రీబిన్ సోఫ్యా కేసి తిరిగి "మీరు కూడా పెద్ద మనుషుల వర్గంలోని వారేనా?" అని అడిగేడు.

"పెద్ద మనుషుల వర్గమనెందుకుంటారు?" అని సోఫ్యా చటుక్కున ఆశ్చర్యంగా అడిగింది.

"ఎందుకంటానా?" అని రీబిన్ బుసకొట్టాడు. "మీరు కూడా ఆ వర్గంలోనే జన్మించారనుకుంటాను. ఎవరైనా సరే, ఏ వర్గంలో జన్మిస్తే, వాళ్ల కర్మమంతే. మీరు రైతుల్లాగ రుమాలు తలకు చుట్టుకున్నంత మాత్రాన, ధనిక వర్గాలవారి పాపాలను దాని కింద దాచగలరనుకుంటున్నారా? మతగురువును చూడ్డంతోనే, అతడు గోగెగుడ్డలు కట్టుకున్నా, చటుక్కున గుర్తుపడతాం బల్లమీద చిందిన పదార్థానికి మీ మోచెయ్యి తగిలేసరికి, మీరు ఉలికిపడి ముఖం చిట్లించుకున్నారు. కూలి పనిచేసే మనుషులైతే మీ నడుమింత నిటారుగా ఉండదు" అన్నాడు రీబిన్.

అతని మోటు వెటకారంతో సోఫ్యా మనసునెక్కడ నొప్పిస్తాడోననే భయంతో తల్లి అతని మాటకడ్డొచ్చింది.

"మిహయిల్ ఇవానొవిచ్! ఆమె నా స్నేహితురాలు. చాలా మంచి మనిషి. మన లక్ష్యం కోసం ఆమె తల నెరసిపోయింది. నువ్వు కొంచెం దురుసుగా మాట్లాడుతున్నావు."

రీబిన్ దీర్ఘంగా నిట్టూర్చేడు.

ఒక క్షణమాగి,

"మాకు పనిలోకెళ్లే వేళైంది. మీరు కాస్త విశ్రాంతి తీసుకోవాలనుకుంటే, తీసుకోండి. ఆ పాకలో కొన్ని బల్లకూరుపులున్నాయి. యాకొవ్, వెళ్లి ఎండాకులు కాసిన పట్టుకురా. నీలొన్నా, పుస్తకాలు మాకియ్యి" అన్నాడు.

తల్లీ, సోఫ్యా తమ మూటలు ఊడదియ్యడం మొదలెట్టేరు. రీబిన్ సంతోషంతో వాటిమీదకు వంగి ఆశ్చర్యంగా :

"చాలానే పట్టుకొచ్చారే! చాలా కాలంనుంచి ఈ పని చేస్తున్నట్లున్నారేమో కదూ?... మీ పేరేమిటన్నారు? అని సోఫ్యా నడిగేడు.

"ఆన్నా ఇవానొవ్నా... పన్నెండేళ్లుగా చేస్తున్నాను. ఎందుకలా అడుగుతున్నారు?" అని సోఫ్యా జవాబు చెప్పింది.

"నా మాటలేమీ పట్టించుకోకండి. ధనికులూ, రైతులూ తారూ నీళ్లు లాటివాళ్లు. వాళ్లిద్దరూ కలవరు!"

"నేనేమీ పెద్దమనుషుల వర్గానికి చెందినదాన్ని కాను.... నేను మామూలు మనిషిని" అంటూ సోఫ్యా చిరునవ్వు నవ్వి మాటకడ్డొచ్చింది.

"కావచ్చు... కుక్కలు ఒకప్పుడు తోడేళ్లంటారు... నేనెళ్లి ఈ సరుకును దాచేస్తాను" అని రీబిన్ జవాబిచ్చాడు.

ఇగ్నాతియ్, యాకొవ్ చేతులు చాచుకుని రీబిన్ దగ్గర కెళ్లేరు.

"మమ్మల్ని చూడనియ్యి" అన్నాడు ఇగ్నాతియ్.

"అవన్నీ ఒక రకమేనా?" అని రీబిన్ సోఫ్యా నడిగేడు.

"కాదు. కొన్ని వార్తాపత్రికలు కూడా ఉన్నాయి."

"అయితే మంచిదే!"

"అయితే మంచిదే!"

మగాళ్లు ముగ్గురూ పాకలో కెళ్లేరు.

రీబిన్ కేసి తల్లి ఆలోచనాపూర్వకంగా చూస్తూ :

"మనిషిలో సంచలనం కలిగింది" అంది మెల్లగా.

"అవును. నేనిదివరకెన్నడూ ఇలాటి ముఖం చూడలేదు... ఆత్మార్పణం చెయ్యగల వీరుడు. వాళ్లేమి చేస్తారో చూడాలి. మనం కూడా లోపలికి వెడదాం" అంది సోఫ్యా.

"అతడు మోటుగా మాట్లాడితే, మీరేమీ బాధపడకండి" అంది తల్లి, మెల్లగా.

సోఫ్యా నవ్వింది.

పనిచెయ్యవలసిన సమయం ముగిసిందనే సంతోషంతో తారు పనివాళ్లు ఇంటికి తిరిగొచ్చారు.

వాళ్ల మాటలతో తల్లికి మెళుకువ వచ్చింది. చిరునవ్వు నవ్వుతూ, ఆవులిస్తూ, పాక బయటి కొచ్చింది. వాళ్లకేసి ఆప్యాయంగా చూస్తూ,

"మీరంతా పనిచేయడం, నేను దొరసానమ్మలాగున నిద్రపోవడమూనా?" అంది.

"దానిలో ఏమీ తప్పులేదు" అన్నాడు రీబిన్. అలసట చేత అతడు చాలా నిదానంగా ఉన్నాడు.

"అదిగో సాక్షి వస్తున్నాడు. ఆ మాట వినేవాళ్లుంటే నేనతన్ని ఊరూరా తిప్పుతాను. జనమంతా వినేలాగున ప్రతి సంతలోనూ నిలబెట్టి, మాట్లాడిస్తాను. అతనెప్పుడూ ఒకే విషయాన్ని చెపుతూ ఉంటాడు. కాని అది అందరూ విని తీరవలసిన విషయం..." అన్నాడు సోఫ్యాతో.

సంధ్య చీకటి దట్టమైన. నిశ్శబ్దం కూడా హెచ్చింది. సోఫ్యా, తల్లీ మగవాళ్లను సరీక్షగా చూస్తున్నారు. వాళ్లు ఏదో నెమ్మదిగా భారంగా చిత్రమైన హెచ్చరికతో అటూ ఇటూ తిరుగుతున్నారు. వాళ్లు కూడా అతిదులైన స్త్రీలను పరికిస్తున్నారు.

అడవిలోంచి పొడుగుపాటి వ్యక్తి నడుం వంచి కర్ర నూతంగా చేసుకుని అక్కడికొచ్చాడు అతడాయనకగుపడుతుండడం అందరూ గమనించారు.

"నేను చేరుకున్నాను" అంటూ ఉక్కిరిబిక్కిరై దగ్గేడు.

అతడు నేలను అంటుతుండే చిరుగుల చొక్కా తొడుక్కున్నాడు. సొట్టలుడి అణిగిపోయిన గుండ్రని టోపి కింద నుంచి పసుపు రంగు జుట్టు పల్చని జడలు జడలుగా బయట కొచ్చింది, ఎముకలు కనబడుతున్న పసుపురంగు ముఖంమీద లేత గోధుమ రంగు గడ్డం గుబురుగా పెరిగింది. పెదవులు శాశ్వతంగా విప్పారిపోయాయి. నల్లని గుంటల్లోకి దిగబడిపోయిన కనుగుడ్లు జ్వరమొచ్చినట్లుగా మిలమిల మెరుస్తున్నాయి.

రీబిన్ అతన్ని సోఫ్యాకు పరిచయం చెయ్యడంతోనే,

"మీరు పుస్తకాలు పట్టుకొచ్చారని విన్నాను" అన్నాడు.

"అవును" అంది సోఫ్యా.

"ప్రజలందరి తరుపునా కృతజ్ఞతాభివందనాలర్పిస్తున్నా. వాళ్లింకా సత్యాన్ని గుర్తించలేరు. కాని తెలిసిన నా బోటివాడు వాళ్ల తరుపున ధన్యవాదాలర్పించాలి."

అతని స్వరం వింటుంటే చాలా బాధనిపించింది. అతడి శరీరం అపాదమస్తకం అపారమైన జాలి గొల్పింది. అందువల్ల ఏమీ ప్రయోజనం లేదని గుర్తుకు రావడంతోనే విచారకరమైన రోషం రేకెత్తింది. విరిగిపోతాయా అని భయపడుతున్నట్లుగా మోకాళ్లు వంచి నెమ్మదిగా అతడు పీపామీద కూచుని నొసటి మీద చెమటను తుడుచుకున్నాడు. అతని జుట్టు పెటపెటలాడుతూ నిర్జీవంగా వేలాడుతోంది.

"జరిగిపోయిన ఒక మహా అపరాధానికి సాక్షిగా నేనిప్పటికీ జనానికుపయోగ పడగలను.... ఇప్పుడు నాకేసి చూడండి.... నా వయస్సు ఇరవై ఎనిమిది ఏళ్లు మాత్రమే. కాని నేను చచ్చిపోతున్నాను! పదేళ్ల క్రిందట నేను అవలీలగా మూలుగైనా లేకుండా మూడు వందల ఏభై పౌనులు బరువెత్తేసేవాణ్ణి! నాలాటి బలవంతుడు సామాన్యంగా డెభ్భై ఏళ్లైనా

బతకాలి. కాని నేను మరో పదేళ్లు మాత్రమే బతికేను. ఇప్పుడంతా అయిపోయిది. నా యజమానులు నన్ను దోచేశారు... నలభై ఏళ్ల నా జీవితాన్ని దోపిడి చేశారు.... నలభై ఏళ్లు!"

"ఆ పాటనే అతనెప్పుడూ పాడుతుంటాడు" బొంగురుగా అన్నాడు రీబిన్.

"అది నా పాట కాదు. వేలాది ప్రజలు పాడే పాటే. వాళ్ల దౌర్భాగ్యం వేలాది ప్రజలకు గుణపాఠమౌతుందనే గుర్తులేకుండానే ఆ పాట పాడుతుంటారు. ఎంతమంది పనులు చేస్తున్నప్పుడు కాళ్లూ చేతులూ విరగ్గొట్టుకుని, నిస్సహాయులై ఆకలిచేత చస్తుంటారో..." అంటూ దగ్గు తెరొచ్చి అతడు నేలమీద కొంగిపోయాడు.

"అతన్నిక్కడికెందుకు తీసుకొచ్చినట్లు? ఏ క్షణంలోనైనా అతడు చచ్చిపోవచ్చు" అని సోఫ్యా రీబిన్ నడిగింది.

"ఆ సంగతి నాకు తెలుసు. కాని ఎంతవరకూ ఓపికుంటుందో అంతవరకూ మాట్లాడనిద్దాం... అతని జీవితం వృథాగా పనికిమాలిన పనికి బలియైపోయింది. ఒక మంచి పనికి కొంచెమైనా ఓపిక పట్టనియ్యి. బాగానే ఉంది. అతన్ని గురించి ఆదుర్దా పడనక్కర్లేదు" అని జవాబు చెప్పేడు.

"మీకిది సరదాగా ఉన్నట్లుందే" అంది సోఫ్యా ఆశ్చర్యంగా.

రీబిన్ ఆమెకేసి తేరిపారజూసి చిరచిరలాడుతూ జవాబిచ్చాడు:

"పెద్దమనుషు లనిపించుకునేవాళ్లు, శిలువమీద మూలుగుతున్న జీసస్‌ను ప్రశంసించడానికి కుతూహలపడుతుంటారు. ఇతడి దగ్గర నుండి మేము పాఠం నేర్చుకో దలచుకున్నాం. మిమ్మల్ని కూడా నేర్చుకోమంటున్నాం."

తల్లి ఒక కనుబొమ పైకెత్తి అతడికేసి చూస్తూ :

"ఇక చాలు" అంది.

బల్ల దగ్గర కూచున్న రోగిష్టి మళ్లీ మాట్లాడ్డం మొదలెట్టేడు:

"వాళ్లు జనాన్ని పనితో చంపడమెందుకు? ఒక మనిషి ప్రాణాలను వాళ్లు హరించడమెందుకు? నేను నెఫేదొవ్ ఫ్యాక్టరీలో పనిచేశాను. మా యజమాని, ఒక నాట్యకత్తెకు బంగారపు స్నానాల తొట్టేనూ, బంగారపూ మూత్ర పాత్రనూ చేయించి ఇచ్చాడు. నా బలమూ, నా జీవితం ఆ పాత్రలోకి పోయింది! నా జీవితాన్ని దాని కంకితం చేశానన్నమాట. ఒక మనిషి నా రక్తంతో తన ఉంపుడుకత్తె నానంద పరచడానికి, పనితో నా ప్రాణం తీశాడన్నమాట! నా జీవ రక్తంతో ఆమెకొక బంగారు మూత్ర పాత్రను కొన్నాడన్నమాట!"

"భగవంతుని ఆకారంలో, ఆయన పోలికల్లో మనిషి సృష్టింపబడతాడు. మనిషికి వాళ్లు చేసే పని ఇది..." అని యెఫీమ్ వెటకారంగా అన్నాడు.

"మనం నోరు మూసుకుని ఊరుకోకూడదు!" అని అరచేత్తో బల్లగుద్ది రీబిన్ అన్నాడు.

"మనం సహించకూడదు!" అన్నాడు మెల్లగా యాకొవ్.

ఇగ్నాతియ్ ఒక నవ్వు నవ్వేశాడు. ఈ ముగ్గురు యువకులూ, రీబిన్ మాట్లాడినప్పుడల్లా ఆకలిగొన్నవారిలాగ, తృప్తి నెరగని ఆత్రుతతో ఆయన్ని చూస్తున్నట్లు తల్లి గ్రహించింది. సవేలియ్ చెప్పిన మాటలు వాళ్ల ముఖంలో ఒక చిత్రమైన హేళన భావాన్ని రేకెత్తించాయి. జబ్బుగా ఉన్న మనిషిమీద వాళ్ల కేమి జాలి వున్నట్లు కనిపించలేదు.

తల్లి, సోఫ్యా కేసి తిరిగి,

"ఇతడు చెప్పిందంతా నిజమేనంటారా?" అని ఆమె చెవిలో అడిగింది.

"అవును. నిజమే. మాస్కో పత్రికల్లో ఆ బహుమానాలను గురించి రాశారు కూడా" అని సోఫ్యా బిగ్గరగా జవాబుచెప్పింది.

"నాకు చలేస్తోంది" అన్నాడు జబ్బు మనిషి

యాకొవ్ అతన్ని లేవదీసి మంట దగ్గరకు తీసుకొచ్చాడు.

"పుస్తకాలకన్న విస్పష్టంగా రుజువు చేస్తున్నాడు. యంత్రం మనిషిని చంపేసినా, ఒక చేతిని నరికేసినా, వాళ్లు కార్మికుడిదే తప్పంటారు. కాని వాళ్లు కార్మికుని రక్తమంతా పీల్చేసి, వాడిని చెత్త కింద పారేస్తే, దానికేమీ సమాధానమివ్వనక్కర్లేదు. ఒక్కసారిగా మనిషిని హత్యచేయడమంటే నాకర్థమవుతుంది. కాని కేవలం సరదా కోసం, ఒక మనిషిని చచ్చేదాక హింసపెట్టడ మెందుకో నాకర్థం కాదు. జనాన్ని వాల్లెందుకిలా హింసపెడతారు? మన్నందరినీ ఎందుకీ హింస పెట్టడం? ఉత్తి తమాషాకి. కేవలం వాళ్ల ఆనందం కోసం. మానవ రక్తంతో ఏమి కావలిస్తే దాన్ని కొనుక్కునేటందుకు. నటీమణులు, పందెపు గుర్రాలన్నీ కొనుక్కునేటందుకు. యజమాని, 'బాగా పనిచెయ్యండి. కష్టపడి పని చెయ్యండి. మీ కష్టంలోంచి నేను బాగా డబ్బు సంపాదించి నా ఉంపుడుకత్తెకు బంగారపు మూత్ర పాత్రను కొంటాను!" అంటాడు."

తల్లి అతనికేసి చూస్తూ ఆ మాటలు వింటుంటే, ఆ చీకట్లో పావెల్, అతని సహచరులూ ఆవలంబించిన వెలుగు బాట ఆమెకు మెరుస్తూ కనబడింది.

రాత్రి భోజనం చేసినతర్వాత అందరూ మంటచుట్టూ కూచున్నారు. మంటలు దుంగలను ఆవురావురని దహించేస్తున్నాయి.

యాకొవ్ అతన్ని సమీపించి, అతనిమీద వంగి,

"సవేలియ్, నువ్వు పాకలో కెళ్లడం మంచిదేమో?" అడిగాడు.

జబ్బు మనిషి చాలా ప్రయాసపడుతూ,

"ఎందుకూ? నేనెంతో సేపు మనుషుల మధ్య ఉండను!" అన్నాడు.

అతడు నాలుగు మూలలా చూశాడు. ఒక క్షణమాగి పాలిపోయిన చిరునవ్వొకటి నవ్వేడు.

"మీతో ఉండడం మంచిది. మిమ్మల్ని చూస్తుంటే, మనుషులను దోపిడిచేసి చంపిన దురాశాపరులమీద కసితీర్చుకుంటారని ఆశపడుతుంటాను" అన్నాడు.

ఎవరూ అతనికి బదులు చెప్పలేదు. కొద్ది క్షణాల్లో అతడు నిద్రపోయాడు. తల గుండెలమీదకు నిర్జీవంగా వాల్చేశాడు. రీబిన్ అతనికేసి చూస్తూ మెల్లగా ఇలా అన్నాడు :

"రోజూ ఇతనిక్కడకొచ్చి కూచుని ఎప్పుడూ ఒకే సంగతి మాట్లాడుతూవుంటాడు. ఈ మోసం గురించే. అతని ఆత్మంతా దీనితోనే నిండిపోయివుంది. మరొకటేమీ చూడలేదు. అదొక్కటే అతని కంటికి కట్టినట్లుంటుంది."

జబ్బు మనిషి ఊగిసలాడి కళ్లు తెరిచి చూశాడు. అక్కడే నేలమీద పడుకున్నాడు. యాకొవ్ నిశ్శబ్ధంగా పాకలోకి వెళ్లి, ఒక గొర్రెతోలు కోటు తెచ్చి, తన దాయాదిమీద కప్పేడు. పిమ్మట, మళ్లీ సోఫ్యా పక్కనే కూర్చున్నాడు.

మంటలు ఎగిరి గంతులేస్తూ నవ్వుతూన్న చిరునవ్వు చుట్టూ కూచున్న జనం ముఖాలను ప్రకాశింపచేసింది. ఆలోచనాపూర్వకమైన వాళ్ల కంఠస్వరాలు అగ్ని జ్వాలల మెల్లని చిటపట రెపరెప ధ్వనులలో మిళితమైపోయాయి.

ప్రపంచంలోని సామాన్య ప్రజలు తమ జీవితం కోసం సాగించిన పోరాటాలను గురించి వాళ్లకు సోఫ్యా విశదంగా చెప్పింది. చాలా కాలం కింద జర్మనీ దేశంలో రైతుల తిరుగుబాటులను గురించీ, ఐర్లండులోని ప్రజల కడగళ్లను గురించీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ఫ్రెంచి దేశపు కార్మికులు సలిపిన అనేక పోరాటాలను గురించీ ఆమె చెప్పింది...

సోఫ్యా బొంగురు గొంతుక సన్నగలింది. ఆమె కంఠధ్వని ఎక్కడో గతంలోంచి వచ్చి, ఇతర దేశాల్లోని తమ సోదరుల విషాద గాథలను మౌనంగా వింటున్న ఈ మనుషుల హృదయాల్లో ఆశనూ, విశ్వాసాన్నీ రగుల్కొల్పింది. తెల్లగా చిక్కి ఉన్న సోఫ్యా ముఖంకేసి వాళ్లు రెప్ప వాల్చకుండా చూస్తుంటే, స్వేచ్ఛకోసం ప్రపంచంలోని ప్రజలంతా సాగిస్తున్న అనంతమైన పోరాటం యొక్క పవిత్రతను వారు స్పష్టంగా తెలుసుకోగలిగేరు. ఎప్పుడో పూర్వ కాలపు చరిత్రయొక్క చీకట్లలో లీనమైపోయిన అజ్ఞాతజాతుల ఆశలకూ, లక్ష్యాలకూ, నేడు తమ కలలకూ లక్షాలకూ ఏమీ తేడా లేదని వారు తెలుసుకున్నారు. వాళ్లు హృదయాలతోనూ, మనసులతోనూ సువిశాలమైన ఈ ప్రపంచాన్నంతా చుట్టివచ్చారు.

"అన్ని దేశాల్లోని కార్మికులూ తలెత్తి 'ఇక చాలు! ఈ జీవితంతో మాకు మొహం మొత్తిపోయింది!' అని గట్టిగా చెప్పే రోజు అచిరకాలంలోనే వస్తుంది. అప్పుడు కేవలం తమ దురాశే తమ ఆయుధంగా కల్గిన వారి బలం కుంగిపోతుంది. వాళ్ల కాళ్లకిందనున్న మట్టి

జారిపోతుంది. వాళ్లు పట్టుకొమ్మనేది లేకుండా నిరాధారులైపోతారు" అని సోఫ్యా విశ్వాసంతో ఉద్ఘాటించింది.

"నిజం. అలాగే జరుగుతుంది! స్వార్థమనేది చూసుకోకుండా, మనక్కున్నదంతా సమర్పించినవాడు, మనం సాధించలేనిదేదీ ఉండదు!" అని తలవంచి అన్నాడు రీబిన్.

తల్లి కనుబొమలు పైకెత్తి, చిరునవ్వు నవ్వుతూ ఈ సంభాషణను వింది. సోఫ్యా ఈ కథలన్నీ చెప్పేటప్పుడు, దురుసుగా ఉన్నదనీ, బిగ్గరగా చెపుతోందనీ, విచక్షణా రహితంగా విసిరేస్తున్నదనీ తాననుకున్న భావాలన్నీ ఏప్పుమైపోయాయి. ఆమె సాఫీగా చెప్పిన ఆ కథకు ఆ భావాలన్నీ సరిపోయాయనుకుంది. రాత్రి ప్రశాంతత, చలిమంట జ్వాలల నాట్యాలు, సోఫ్యా ముఖం అన్నీ ఆమెకు బాగా నచ్చాయి. అన్నిటికన్న రైతు యువకుల శ్రద్ధాసక్తులు ఆమెకు చాలా సంతుష్టిని కలిగించాయి.

ఒకసారి యాకొవ్ లేచి:

"ఒక నిముషం..." అన్నాడు మెల్లగా.

పాకలోకి పరుగెత్తి కెళ్లి రగ్గులు పట్టుకొచ్చాడు. అతనూ, ఇగ్నాతియ్ వాటిని అతిధుల భుజాల మీదా మోకాళ్లమీదా కప్పేరు. పిమ్మట సోఫ్యా విజయోత్సవం చేసే రోజును గురించి చక్కగా వర్ణించడం మొదలెట్టింది.

"భగవంతుడు వాళ్లనను గ్రహించునుగాక!" అనుకుంటూ తల్లి కళ్లు మూసుకుంది.

అరుణోదయమవుతుంటే, అలసట చెందిన సోఫ్యా తనచుట్టూ ఆలోచనలతో వికసించిన ముఖాలకేసి నవ్వుతూ చూసి తన కథను ముగించింది.

"ఇక మనం వెళ్లాలి" అంది తల్లి.

"అవును" జవాబుచెప్పింది సోఫ్యా.

ఒక కుర్రవాడు నిట్టూర్పు విడిచాడు.

"మీరు వెళ్లిపోవలసిరావడం చాలా బాధగా ఉంది.... మీరు చెప్పే మాటలు వింటుంటే బాగా ఉంది. ప్రజలంతా ఒకటేననే భావం వాళ్లకు కలిగించడం చాలా గొప్ప సంగతి! మన ంచేస్తున్న పనినే లక్షలాది ప్రజలు చేయదలచుకున్నారని తెలిస్తే, నీ హృయానికెంతో దయ కలుగుతుంది. మరి దయ చాలా బ్రహ్మాండమైన శక్తి కదా!" అన్నాడు రీబిన్ మెత్తని స్వరంతో.

"ధన్యవాదాలమ్మా! నువ్వు చాలా శ్రమపడ్డావు. నిన్ను చూసినప్పుడల్లా నాకు పావెల్ జ్ఞాపకమొస్తాడు. ఎంత మంచిపని చేస్తున్నావమ్మా!" అన్నాడు.

రీబిన్ సోఫ్యాతో కరచాలనం చేసి,

"మరిక శలవివ్వండి" అన్నాడు. "పట్టణంలో మిమ్మల్ని కలుసుకోవడం ఎల్లాగ?" అని అడిగేడు.

"నువ్వు నన్ను కలుసుకోవాలి" అంది తల్లి.

యువకులు ముగ్గురూ లేచి వచ్చి మర్యాదగా సోఫ్యాతో కరచాలనం చేశారు. వాళ్లందరి ఆంతర్యాల్లోనూ ఆమెపట్ల చక్కని మైత్రీపూర్వకమైన అపూఐర్వానందం కలిగింది. ఈ భావమే దాని నవ్యతవల్ల వాళ్లకు తత్తరపాటు కలిగించింది. నిద్రలేని కళ్లతో బరువుగా వాళ్లు ఆమెను చిరనవ్వుతో చూశారు.

"బయల్దేరేముందు కాసిన పాలు తాగకూడదూ?" అని యాకొవ్ అడిగేడు.

వాళ్లు పాల సంగతి ప్రస్తావించారు. కాని తల్లి మరొక సంగతి ఆలోచిస్తోంది. తన మీదా, సోఫ్యా మీదా వాళ్ల కెంత సద్భావముందా అని సంతోషిస్తోంది. సోఫ్యాక్యూడా అలాటి ఆలోచనే కలిగింది. అందువల్ల ఆమె కొంచెం కలవరపడింది. వినయంగా

"కామ్రేడ్స్, ధన్యవాదాలు" అని మాత్రమే అనగలిగింది.

ఆ మాట యువకులకు ఒక పోటు పొడిచినట్లనిపించింది. ఒకరి ముఖాలకేసి ఒకళ్లు చూసుకున్నారు.

జబ్బు మనిషి బాధపడుతూ దగ్గేడు. చలి మంట దగ్గర నిప్పులు జ్వలించడం లేదు.

"శలవు" అన్నారు రైతులు మెల్లగా. విషాదభరితమైన ఆ మాట వాళ్ల చెవిన పడింది.

ఆ స్త్రీలిద్దరూ, అరుణోదయానికి పూర్వం తెలివెలుగులో నిదానంగా అడవిదారిని పుచ్చుకున్నారు.

కాలమెంత నవనవలాడుతోందో, అంతటి నవనవలాడే చక్కని పాటను సోఫ్యా మధురస్వరంతో పాడటం మొదలెట్టింది.

* * *

తల్లి జీవితం ప్రశాంతంగా గడిచిపోతోంది. చిత్రమైన ఈ ప్రశాంతత ఆమెకే ఆశ్చర్యాన్ని కలిగించేది. ఆమె కొడుకు జైల్లో ఉన్నాడు. అతడికి చాలా కఠినశిక్ష విధిస్తారని ఆమెకు తెలుసు. అయినప్పటికీ ఆ విషయం మాలోచించేసరికి, ఆమెకు అన్‌ద్రేయ్, ఫ్యోదొర్ మొదలైనవాళ్లందరూ తలపుకొచ్చేవారు. తన కొడుకూ, అతని సహచరులూ ఒక్కటిగా ఆమె కళ్ల కగుపడేవారు.

సోఫ్యా ఎక్కడికో వెళ్లిపోయి, అయిదు రోజులైనాక కేరింతలు కొడుతూ ఇంటి కొచ్చింది. వెంటనే కొన్ని గంటలసేపట్లో వెళ్లిపోయి రెండు వారాలదాకా రాలేదు.

సోఫ్యా అశుభ్రతను భరించడం తల్లికి చాలా కష్టమైంది. ఇల్లంతా ఆమె బట్టలు చెత్తగా పడుండేవి. సిగరెట్టు పీకెలు, నుసీ ఎక్కడ పడితే అక్కడే ఉండేవి. అంతకన్నా కూడా సోఫ్యా ఆవేశపూరితమైన ఉపన్యాసాలను తల్లి హర్షించలేకపోయేది. నికొలాయ్ ఆత్మ విశ్వాసంతో, నిదానంగా, మృదుగాంభీర్యంతో మాట్లాడేవాడు. అంచేత ఇద్దరి పద్ధతులకీ తేడా స్ఫుటంగా కనబడేది. సోఫ్యా, యువకుడుగా ఉండేవాడు పెద్దవాళ్లవలె మన్నింపబడాలని ఉబలాట పడుతూ, జనాన్ని ఆటవస్తువుగా పరిగణించే అహంకారంగల మనిషిలాగున తల్లికి తోచింది. ఆమె కాయకష్టం యొక్క పవిత్రతను గురించి విశేషంగా మాట్లాడేది. కాని తన అపరిశుభ్రతవల్ల తల్లికి అధికంగా పని కల్పించేది. ఆమె సేచ్ఛాస్వాతంత్ర్యాలను గురించి ధారళంగా మాట్లాడేది. కాని, ఇతరులను మాట్లాడనివ్వకుండా, అనంతమైన వాదనతో బాధపెట్టడం తల్లి కనిపెట్టింది. సోఫ్యాలో ఎన్నో పరస్పర విరుద్ధమైన లక్షణాలుండేవి. ఆ సంగతి గ్రహించి, తల్లి ఆమెతో మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండేది. నికొలాయ్ యడల ఉండేటంత అచంచలమైన ఆప్యాయత తల్లికి సోఫ్యా పట్ల ఉండేది కాదు.

నికొలాయ్ రోజూ ఒకే విధంగా విసుగుపుట్టే జీవితాన్ని గడుపుతున్నప్పటికీ, ఇతరుల కష్ట సుఖాలను ఎక్కువగా ఆలోచించేవాడు. ఉదయం ఎనిమిది గంటలకు టీ తాగేవాడు. అప్పుడే వార్తాపత్రిక చదివి, తల్లికి వార్తలు తెలియచెప్పేవాడు. అతడు చెప్పే మాటలు వింటుంటే, జీవితమనే యంత్రం, నిర్దాక్షిణ్యంగా డబ్బుకోసం ప్రజలనెలా రాసి రంపాన పెడుతుందో స్పష్టంగా గ్రహించగలిగేది. నికొలాయ్‌కి అన్‌ద్రేయ్ పోలికలు చాలా ఉన్నట్లామె గమనించింది. హొహోల్‌లాగే జనాన్ని గురించి మనసులో ఏవిధమైన ద్వేషమూ లేకుండానే, గమనించిది. ప్రపంచంలోని బాధలన్నిటికీ ప్రజలే కారణమంటాడు. కాని నవజీవనంలో అన్‌ద్రేయ్ కుండే విశ్వాసమంత దృఢంగానూ సుందరంగానూ నికొలాయ్‌కు లేదు. అతడెప్పుడు మాట్లాడినా కరుకుదనమూ నిజాయితీగల న్యాయధిపతిలాగ నిశ్చలమైన కంఠస్వరంతో మాట్లాడేవాడు. చాలా భయంకరమైన విషయాలను చర్చించేటప్పుడు కూడా అతని పెదవులమీద విచారకరమూన చిరునవ్వు తొణికిసలాడేది.

ప్రతిరోజూ నికొలాయ్ ఉదయం తొమ్మిది గంటలకు పనిలో కెడతాడు. అతను వెళ్లడంతోనే తల్లి, ఇల్లంతా తుడిచి శుభ్రంచేస్తుంది. మధ్యాహ్నం వంటచేస్తుంది. తర్వాత స్నానంచేసి పరిశుభ్రమైన బట్టలు కట్టుకుని, పుస్తకాల్లో ఉన్న బొమ్మలు చూస్తూ తన గదిలో కూచుంటుంది. అప్పటికి ఆమె చదవడం చేర్చుకుంది. కాని చాలా ప్రయాస పడవలసి వచ్చేది.

సాయంకాలమప్పుడు, తరుచుగా జనం అతన్ని చూడ్డానికొచ్చేవారు. అలా వచ్చే అతిధుల్లో ఒకడు, అలెక్సేయ్ వసీల్యెవిచ్ తెల్లని ముఖం, నల్లని గెడ్డం గల అందగాడు. మితభాషి, గంభీరమైన వ్యక్తి. మరొకడు రొమాన్ పెత్రోవిచ్. గుండ్రని తలకాయ, మొటిమల ముఖం గల అతడు తరుచుగా ఏదో పొరబాటు జరిగినట్లు "అరరె..." అని నాలుక కరుచుకునేవాడు. ఇంకొకడు ఇవాన్ దనీలొవిచ్. పొట్టిగా సన్నంగా ఉండేవాడు. కోసుగెడ్డం. గొంతుక మాత్రం పెద్దది. లొడలొడ మాట్లాడుతూ కత్తిలా చలాకీగా ఉండేవాడు. నాలుగోవాడు యెగోర్

అతడెప్పుడూ తనను చూసుకునీ, అతని స్నేహితులను చూసుకునీ నవ్వుతూ ఉండేవాడు. రోజురోజూ ముదురుతున్న తన రోగాన్ని గురించి కూడా నవ్వుతుండేవాడు. వీళ్లు కాక, దూరంగా ఉండే పట్టణాలనుంచి కూడా వస్తుండేవారు. నికొలాయ్ వాళ్లతో చాలా సేపు నిదానంగా మాట్లాడుతుండేవాడు.

కార్మికుల జీవితాన్ని గురించి, వాళ్లకన్న తనకే బాగా తెలుసుననుకుంది తల్లి. వాళ్లు చెయ్యదలచుకున్న పని భారం తనకే తెలుసునని ఆమెకు తోచింది. అందుచేత ఆమె వారినొక విధమైన అనుగ్రహంతో జాలితో చూడగలిగేది.

"వీళ్లకు ఎక్కువ విషయాలు తెలుసు గనుక, బిగ్గరగా మాట్లాడతారు" అని తనలో తాను సమర్థించుకునేది.

అయితే, వీళ్లలో వీళ్లు, ఒకర్ని మించి ఇంకొకరు, తమ లక్ష్యశుద్ధిని ప్రదర్శించుకోవడంకోసం, ఈ విధంగా ఒకళ్లమీద ఒకళ్లు బుద్ధి పూర్వకంగా రెచ్చిపోతూంటారని తరుచుగా అనుకునేది. ఈ సత్యంపట్ల ఎదుటి వారికన్న తనకే ఎక్కువ గౌరవముందని రుజువు చేయాలనే ఆవేశం వారినీ విధంగా పురిగొల్పుతోందనుకుంది.

"వీళ్లు పావెల్‌ను, అతని మిత్రులనూ మరిచిపోయినట్లుంది" అని వాళ్లకేసి చూస్తూ అనుకునేది. అప్పుడామె కనుబొమలు అదిరేవి. కళ్లు ఆర్ధ్రస్తున్నట్లుండేవి.

అప్పుడప్పుడు సాషా వచ్చేది. చాలా సేపు ఉండేది కాదు. ముక్తసరిగా మాట్లాడేది. నవ్వూ త్రుళ్లూ ఉండేది కాదు. వెళ్లిపోయేటప్పుడు మాత్రం విధిగా తల్లిని పలకరించేది:

"పావెల్ మిహాయ్‌లొవిచ్ ఎలా ఉన్నాడమ్మా?"

"బాగానే ఉన్నాడు. దేవుడి దయవల్ల కులాసాగానే ఉన్నాడు."

"నేనడిగేనని చెప్పండి" అని చెప్పి సాషా వెళ్లిపోతుండేది.

ఒకసారి తల్లి ఆమెతో పావెల్‌ను విచారణ లేకుండా చాలా కాలం నిర్బంధించారని బాధతో చెప్పింది. సాషా కనుబొమలు ముడిపడ్డాయి, వేళ్లు అదిరేయి.

"నువ్వతడిని ప్రేమిస్తున్నావని నేనెరుగుదునమ్మాయీ" అని ఆమెతో చెపుదామని తల్లి ఉబలాటపడింది. కాని ఆమెకు ధైర్యం చాలింది కాదు. అమ్మాయి విషాదకరమైన ముఖం, గిట్టకరుచుకున్న పెదమలు, ముక్తసరి మాటలూ చూస్తే తల్లికి ఆమెయడల ప్రేమ భావం స్ఫురించలేదు. సాషా చెయ్యి చాచేసరికి, తల్లి మాట్లాడకుండా ఆమె చేతిని పట్టుకుని:

"అయ్యో నా తల్లీ, ఎంత కష్టపడుతున్నావమ్మా!" అనుకుంది.

ఒకనాడు నతాషా వచ్చింది. తల్లి అక్కడుండటం చూసి ఆమె చాలా సంతోషించింది. తల్లిని ముద్దెట్టుకుని,

"మా అమ్మ చచ్చిపోయింది. వెర్రి తల్లి!" ఆకస్మికంగా చెప్పింది. తలూపి గభాలున కళ్లు తుడుచుకుని చెప్పడం మొదలెట్టింది: "అయ్యో, పాపం! ఆమెకు ఏభై ఏళ్లైనా నిండలేదు. ఇంకా చాలా కలం బతకవలసిందే. అయితేనేమి? బతుకుకన్న చచ్చిపోవడమే మేలనుకుంటున్నాను. ఆమె దెప్పుడూ ఇంటి బతుకే. ఆమెను ప్రేమించే ఆప్తులెవరూ లేరు. ఎవరికీ ఆమె పనికి రాదు. మా నాన్న నిరంతరం ఆవిడ మీద కేకలేస్తూ హడలిగొడుతూనే ఉండేవాడు. అలాటి బతుకూ ఒక బతుకే నంటారా? ఏదో ముందు ముందు మంచి కలుగుతుందనే ఆశతోనే బతుకుతుంటారు. మా అమ్మకు బతికున్న కొద్దీ అవమానాలే కాని మంచి ఆశించడానికేమీ లేదు."

"మీరు చెప్పే మాట నిజమే నతాషా! ప్రజలు ఏదో ముందు ముందు మేలు కలుగుతుందనే ఆశతోనే బతుకుతుంటారు. అలాటి ఆశ లేకపోతే, వాళ్ళ బతుకెందుకు?... అయితే, ఇప్పుడు మీరు ఒంటరిగానే ఉంటున్నారా?" అని అడిగింది తల్లి.

నతాషా ఒక జౌళి మిల్లు వారు నడిపించే పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరింది. తల్లి ఆమెకు నిషిద్ధ పుస్తకాలను, ప్రకటనలను వార్తాపత్రికలను అందిచ్చేది.

* * *

తల్లికిదే పనైంది. ప్రతినెలా అనేక సార్లు మారువేషాలు ధరించి, వీపున మూట పెట్టుకునో, సూట్‌కేసు చేత్తో పుచ్చుకునో రాష్ట్రమంతటా సంచారం చేసివచ్చేది. సన్యాసిని వేషం, అల్లిక వస్తువులమే విక్రేత వేషం, పట్టణంలో ఉండే ధనికురాలి వేషం, దైవ భక్తురాలైన యాత్రికురాలి వేషం, మొదలైన వేషాలెన్నో ధరించింది. రైళ్లల్లో, పడవల్లో, హోటళ్లలో నిరాడంబరంగా నెమ్మదిగా ఉంటూ తోటివారిని ముందుగా పలకరించి పరిచయం చేసుకునేది. తన జీవితంలో అనేక విషయాలను స్వయంగా తెలుసుకున్న ఆత్మ విశ్వాసంతో, చనువుగా మాట్లాడే నేర్పుతో ఆమె నిర్భయంగా జనాన్ని ఆకర్షించగలిగేది.

జనంతో మాట్లాడ్డానికీ, వాళ్ల కథనూ కష్టాలూ వినడానికీ ఆమె ఎంతో కుతూహలపడుతుండేది. వాళ్ల సమస్యలేమిటో తెలుసుకోవడానికికాత్రుత ఉండేది. అసంతృప్తితో బాధ పడుతుండే వ్యక్తిని కలుసుకున్నప్పుడామెకు చాలా సంతోషం కలిగేది.

తను చూసిన బొమ్మలను బట్టీ, తన విన్న కథలను బట్టీ క్రీస్తు చాలా నిరాడంబరమైన బట్టలు ధరించేవాడనీ, పేద ప్రజలకు పరమ మిత్రుడనీ ఆమెకు తెలుసు. కాని తను చూస్తున్న చర్చీలలో ఆయన విగ్రహం బంగారపు అలంకరణలతోనూ, పట్టు బట్టలతోనూ కనబడుతోంది. మనశ్శాంతి కోసం ఆయన దగ్గర కొచ్చిన పేద ప్రజలకు ఆ అలంకరణలు కొట్టొచ్చినట్లు పెళపెళలాడుతుంటాయి. అప్రయత్నంగా రీబిన్ చెప్పిన మాటలు ఆమెకు స్ఫురణ కొచ్చాయి.

"భగవంతుని విషయంలో కూడా వాళ్లు మనల్ని మోసం చేశారు!"

తనకు తెలియకుండానే ఆమె ప్రార్థనలు చెయ్యడం తగ్గించింది. క్రీస్తును గురించీ, ఆయన పేరు చెప్పకుండానే, ఆయన్ను గురించి తెలుసుకుంటున్నట్లగుపడ కుండానే, ఆయన సిద్ధాంతాల ప్రకారం, ఆయన మార్గంలో, ప్రపంచాన్ని పేదల రాజ్యంగా భావించి సర్వ సంపదలనూ సమంగా పంచుకుని అనుభవించాలనే భావంతో జీవిస్తున్నవారిని గురించీ విశేషంగా ఆలోచించడం మొదలెట్టింది. దీన్ని గురించి చాలా ఎక్కువగా ఆలోచించింది. ఆమె ఆలోచనలు వేళ్ళుతన్ని విస్తరించాయి. తను విన్న విషయాలనూ చూసిన సంగతులనూ బాగా ఆకళింపు చేసుకుంది. ఆ ఆలోచనలన్నీ ఒక ప్రార్థనగా వెలుగొంది, అంధకార బంధురమైన యావత్ప్రపంచాన్ని, యావత్తు జీవితాన్ని, ప్రజలందరినీ ప్రకాశింపచేశాయి. తను అనిర్దిష్టమైన ఆప్యాయతతో ప్రేమించే క్రీస్తు ఇప్పుడు మరింత ప్రేమాస్పదుడైనట్లామెకు తోచింది.

"ఇలా సంచారం చేసి ప్రపంచాన్ని చూడ్డం చాలా మంచిది" అని ఆమె ఒకరోజు సాయంకాలం నికొలాయ్‌తో అంది. "అందువల్ల నీకు జీవితమంటే ఏమిటో బాగా తెలిసొస్తుంది. జీవితంలో సామాన్య ప్రజలను వెనక్కి నెట్టెయ్యడం జరుగుతోంది. జీవితాంతం వరకూ నెట్టేస్తే, వాళ్ళు అంధకారంలో పడి దేవులాడుతూ ఇదేమిటని అడుగుతుంటారు. వాళ్ళ నెందుకలా నెట్టెయ్యాలి? ఇంత ఆహారముంటుండగా వాళ్లెందుకాకలితో బాధపడాలి? ఇంత విజ్ఞానం ఉంటుండగా వాళ్లెందుకు అజ్ఞానంలో ఉండాలి? ధనికులు, పేదలు అనే తేడా లేమీ లేకుండా అందరినీ తన ప్రేమాస్పదులైన బిడ్డలుగానే భావించుకునే పరమ దయాళువైన భగవతుడెక్కడున్నాడు? తమ జీవితాలను గురించి ఆలోచించుకుంటుంటే జనానికి ఆవేశం కలుగుతుంది. ఏదో ప్రతీకారం చేయకపోతే, అన్యాయం తమని తుడిచి పెట్టేస్తుందని వాళ్లకి అనిపిస్తుంది."

ప్రజల జీవితాల్లో వాళ్లకు జరుగుతున్న అన్యాయాలను గురించి వాళ్లతో తను స్వయంగా మాట్లాడాలనే కుతూహలం అంతకంతకు తరచుగా ఆమెకు కలుగుతుండేది.

తల్లి బొమ్మల పుస్తకాలను తదేక దీక్షతో చూస్తుంటే, నికొలాయ్ నవ్వుతూ వచ్చి, ప్రపంచంలో జరిగిన ఏదో గొప్ప వింతను గురించి చెప్పేవాడు. మనిషి చెయ్యదలచుకున్న సాహసాలకామె ఆశ్చర్యచకితురాలయ్యేది.

తల్లి అతని మాటలను మొదట్లో బాగా అర్థం చేసుకోలేకపోయేది. కాని క్రమక్రమంగా ఆ మాటలను ప్రేరేపించే నిర్మలమైన విశ్వాసాన్ని అవగాహన చేసుకుంది.

"భూమిమీద తగినంతమంది స్వేచ్ఛాజీవులు లేరు.. అదే ఇప్పుడున్న బాధ!" అన్నాడు నికొలాయ్.

ఆమెకీ మాట అర్థమైంది. దురాశనూ, ద్వేషాన్నీ జయించిన మనుషులతో ఆమెకు పరిచయమున్నది. అలాటి వాళ్ళింకా చాలామంది ఉన్నట్లయితే, జీవితమింత అంధకారంగానూ, భయంకరంగానూ ఉండేదికాదని ఆమెకు తెలుసు. అది చాలా ఆర్భాటరహితంగా, తేజోవంతంగా, ఉదారంగా పరిణామం చెందుతుంది.

"మనుషులు విధిలేక క్రూరంగా ఉండవలసివస్తోంది" అన్నాడు నికొలాయ్ విషాదంగా.

ఆమె అవునన్నట్లు తలూపింది. హొహోల్ చెప్పిన మాటలామెకు జ్ఞప్తికి వచ్చాయి.

సాధారణంగా వేళ తప్పకుండా ఇంటి కొచ్చే నికొలాయ్, ఒకరోజున ఆలస్యంగా వచ్చాడు.

కోటు తీసెయ్యకుండానే, బెదురుతూ చేతులు నలుపుకుంటూ :

"నీలొవ్నా, ఈ వేళ మన స్నేహితుడొకడు జైలు నుంచి తప్పించుకుపోయాడు... అదెవరై ఉంటారో? నేను కనుక్కోలేకపోయాను" అన్నాడు.

తల్లీ కాళ్లు వణికాయి.

"పావెల్ అయి వుంటాడా?" అని మెల్లగా అని చతికిలపడింది.

"కావచ్చు" అని భుజాలెగరేస్తూ అతడు జవాబిచ్చాడు. "కాని అతన్ని దాచడం ఎలాగనేదే సమస్య. ఇప్పుడు అతన్నెక్కడ పట్టుకోగలం? అతడెక్కడైనా కనబడతాడేమోనని ఇంతవరకు వీధులన్నీ తిరిగేను. అది తెలివితక్కువే అనుకోండి. కాని మనమేదో చెయ్యాలి. నేను మళ్లీ బయటికి పోతున్నాను..."

"నేనూ వెడుతున్నాను" అంది తల్లి.

నికొలాయ్ తొందరగా బయటికి వెడుతూ,

"మీరు యెగోర్ దగ్గరకెళ్లి అతడి కేమైనా తెలుసునేమో కనుక్కోండి" అని సూచించేడు.

అతడు వెళ్లిపోయిన తరువాత తల్లి తలమీద ఒక రుమాలు కప్పుకుని, ఎంతో ఆశతో నడక సాగించింది.

వాతావరణం వేడిగా ఉంది. అలసటతో ఆమె ఒగిర్చింది. యెగోర్ యింటివాటా మెట్ల దగ్గర కొచ్చేసరికి ఆమె ముందుకు సాగలేకపోయింది. అక్కడ ఆగిపోయి వెనక్కు తిరిగి చటుక్కున చిన్న కేక వేసి కళ్లు మూసుకుంది. ఆ యింటి ముందర జేబుల్లో చేతులు పెట్టుకుని నికొలాయ్ వెసొవ్శ్చికోవ్ నిలబడినట్లామెకగుపించింది. కాని మళ్లీ చూసేసరికి అక్కడెవరూ కనబడలేదు.

"నేనలా ఊహించుకున్నాను కాబోలు" అని అనుకుంటూ మెట్లెక్కుతూ వింటోంది. దొడ్లో ఎవరివో మెల్లని అడుగుల చప్పుడు ఆమె చెవిని పడుతోంది. మెట్లెక్కి, పెద్ద మెట్టుపైన

ఆగి కిందకు చూసింది. తనకేసి చూసి నవ్వుతున్న స్ఫోటకం మచ్చల ముఖాన్నామె మరల చూసింది.

"నికొలాయ్! నికొలాయ్!" అని అరుస్తూ అతన్ని కలుసుకోడానికి మెట్లు గబగబ దిగింది. హృదయానికి మాత్రం ఆశాభంగం వల్ల బాధ కలిగింది.

"వెళ్లు, వెళ్లు!" మెల్లగా అని అతడు చెయ్యి ఊపేడు.

త్వరత్వరగా ఆమె మెట్లెక్కి యెగోర్ గదిలో ప్రవేశించింది. సోఫామీద పడుకుని ఉన్న యెగోర్‌ను చూసింది.

"నికొలాయ్ తప్పించుకొచ్చాడు జైల్లోంచి!" అని ఆయాసపడుతూ చెప్పింది.

యెగోర్ తలగడమీద నుంచి తలెత్తి :

"వెసొవ్‌శ్చికోవ్. అతడినిక్కడికే వస్తున్నాడు!"

"మంచిది!"

అదే క్షణంలో నికొలాయ్ గదిలో ప్రవేశించాడు. తలుపు గడియవేసి టోపీ తీసేసి జుట్టు సవరించుకున్నాడు. యెగోర్ మోచేతులమీద లేచి తల పంకించి :

"స్వాగతం" అన్నాడు.

నికొలాయ్ మెల్లగా నవ్వుతూ తల్లి దగ్గర కొచ్చి ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"నువ్వు నాకు కనిపించకపోతే, నేను మళ్లీ జైలుకే పోయి ఉండేవాడిని. ఈ పట్టణంలో నేనెవ్వరినీ ఎరగను. పేటలో కెడితే ఒక్క నిముషంలో పట్టేస్తారు. అంచేత వీదుల్లో తిరుగుతూ తప్పించుకు రావడం ఎంత పొరబాటాయని పస్తాయిస్తున్నాను. హఠాత్తుగా నీలొవ్నా చరచరా నడుస్తుండడం చూశాను. వెంటనే ఆమె వెంటబడ్డాను."

"నువ్వు ఎలా పారిపోయెచ్చావ్?" అని తల్లి అడిగింది.

అతడు సోఫా అంచున వ్యాకులపడుతూ కూచుని, భుజాలు ఎగరేసి అన్నాడు :

"అనుకోకుండా ఒక సావకాశం లభించింది. నేను షికారు తిరుగుతుండగా మామూలు ఖైదీలు తమ కాపలాదారుని బజాయించ మొదలెట్టారు. ఆ గార్డు ఒకప్పుడు సాయుధ పోలీసు దళంలో ఉండేవాడు. దొంగతం చేసినందుకు అతడిని ఆ ఉద్యోగంలోంచి తొలగించారు. ఇప్పుడతను అందర్నీ రహస్యంగా కాపలా కాస్తుంటాడు. ఎప్పుడూ అందరి కూపీలూ బయట పెడుతూంటాడు, ఎవరినీ ప్రశాంతంగా బ్రతక నివ్వడు. అంచేత వాళ్లు అతన్నక్కడ పట్టుకుని బాగా తన్నడం మొదలెట్టేరు. గార్డులందరూ ఈలలూదుకుంటూ అటూ ఇటూ పరుగెత్తుతుండడం చేత అంతా గోల్‌ముల్‌గా ఉంది. నేను తల పైకెత్తి చూసేసరికి

గేటు తలుపులు తెరిచి ఉన్నాయి. బయట నాలుగురోడ్ల కూడలి, పట్టణం ఎదురుగా కనిపించాయి. నిద్రలోలాగున నెమ్మదిగా నడిచి బయటికొచ్చి వీధిలో కొంత దూరం వచ్చాక, నాకు స్పృహ వచ్చింది. ఎక్కడికెళ్లాలా అని ఆలోచించాను. తీరా వెనక్కి చూసేసరికి అప్పుడు గేటు తలుపులు మూతబడున్నాయి."

"హూ! మళ్లీ వెనక్కి వెళ్లలేకపోయావ్? మర్యాదగా గేటుతలుపు తట్టి, 'నన్ను లోపలికి రానివ్వండయ్యా! నేనొక చిన్న పొరబాటు చేశాను. క్షమించండి' అని అనలేక పోయావూ?" అన్నాడు యెగోర్.

"అవును" అని నవ్వేశాడు నికొలాయ్. "అది తెలివి తక్కువే కాని, నా స్నేహితులకది సరియైనదిగా తోచదు, ఎవరికీ ఏమీ చెప్పకుండా రావడం. కాని ముందుకు నడుస్తూనే ఉన్నాను. దారిలో చిన్నపిల్ల శవంవెంట జనం ఊరేగింపుగా పోతూండటం చూశాను. తలకాయ వంచుకుని ఎవరికేసీ చూడకుండా శవపేటిక వెనకాలే నడిచాను. స్మశానంలో గాలి పీలుస్తూ కాస్సేపు కూచున్నాను. చటుక్కున నాకొక ఆలోచన తట్టింది..."

"ఒక్కటేనా? నీ తలలో దానికి ఇరుకైపోలేదు కదా?" అన్నాడు యెగొర్ నిట్టూరుస్తూ.

వెసొవ్‌శ్చికోవ్ తలకాయ గోక్కుంటూ,

"కామ్రేడ్సు ఆదుర్దాపడుతూంటారు..." అన్నాడు.

"మరి అధికారుల మాటేమిటి? వాళ్లను గురించి నీకు జాలెయ్యడం లేదా? వాళ్లు కూడా ఆదుర్దాపడుతూనే ఉంటారు" అన్నాడు యెగోర్.

"పావెల్ బాగానే ఉన్నాడు. ఆరోగ్యంగా ఉన్నాడు. అతను మాకందరికీ పెద్ద. అతనే అధికారులతో మాట్లాడుతుంటాడు. పెత్తనమంతా అతనిదే. అందరూ కూడా అతన్ని గౌరవంగా చూస్తుంటారు."

"తినడానికేమైనా పెట్టండి, నాకు విపరీతంగా ఆకలేస్తోంది!" అన్నాడు నికొలాయ్ హఠాత్తుగా.

"అమ్మా! ఆ అలమారాలో పైన కొంచెం రొట్టె ఉంటుంది... ఆ తర్వాత సావిడిలోకి వెళ్లి, ఎడమ వైపు రెండవ తలుపు తట్టండి. ఒక ఆడమనిషి తలుపు తీస్తుంది. తినడానికేముంటే వాటినన్నింటినీ పట్టుకుని ఇక్కడికి రమ్మనండి" అన్నాడు యెగోర్.

"అన్నీ ఎందుకు?" అన్నాడు నికొలాయ్.

"ఎన్నో వుండవులే. బెంగెట్టుకోకు."

తల్లి బయటికెళ్లి తలుపు తట్టింది. తలుపు తీసేలోగా,"యెగోర్ చచ్చిపోతున్నాడు..." అనుకుంది.

"ఎవరు వారు?" అని గదిలోంచి ఎవరో అడిగేరు.

"యెగొర్ ఇవానొవిచ్ పంపేడు.. మిమ్మల్ని తన గదిలోకి రమ్మంటున్నాడు" అని నిదానంగా తల్లి బదులు చెప్పింది.

"ఇప్పుడే" అని తలుపు తీయకుండానే ఆ స్త్రీ చెప్పింది. తల్లి ఒక్క క్షణమాగి మళ్లీ తలుపు తట్టింది. వెంటనే తలుపు తెరుచుకుని సులోచనాలు ధరించిన ఒక పొడుగాటి స్త్రీ సావిట్లోకొచ్చింది. తొందరగా చొక్కా చేతుల ముడతలను సాపు చేసుకుంది.

"ఏం కావాలి?" అని కఠినంగా అడిగింది.

"యెగోర్ ఇవానొవిచ్ పంపించాడు."

"రండి, వెళ్దాం. అయితే మిమ్మల్ని నేను ఎరుగుదుననుకుంటాను. అవునా? కులాసాగా ఉన్నారా? ఇక్కడ చీకటి" అని ఆ స్త్రీ తల్లిని మృదువుగా పలకరించింది.

తల్లి ఆమెకేసి పరిశీలనగా చూసి, అప్పుడప్పుడామెను నికొలాయ్ ఇంటి దగ్గర చూసిన సంగతి జ్ఞాపకానికి తెచ్చుకుంది.

"వీళ్లంతా మనవాళ్లే" అనుకుంది.

ఆ స్త్రీ, నీలొవ్నాను ముందు నడిపించింది.

"అతడికేమైనా జబ్బెక్కువగా ఉందా?" అని అడిగింది.

"అవును. పడుకునే ఉన్నాడు. తినడానికేమైనా పట్టుకురమ్మని మీతో చెప్పమన్నాడు."

"అదేమీ అవసరం లేదు"

వాళ్లిద్దరూ యెగోర్ గదిలో ప్రవేశించడంతోనే అతడు గురకతో ఊపిరి పీలుస్తుండడం విన్నారు.

"లుద్మీలా వసీల్యెవ్నా! నేను మా పెద్దల దగ్గరకెళ్లిపోతున్నాను. చూడండి. ఈ యువకుడు అధికారుల అనుజ్ఞ లేకుండా జైల్లోనుంచి చక్కగా నడిచి వచ్చేశాడు. ముందతనికి తినడానికేమైనా పెట్టి, తర్వాత ఎక్కడో దాచెయ్యండి."

ఆ స్త్రీ తలూపి, చటుక్కున జబ్బు మనిషికేసి తేరిపారజూసింది.

"యెగోర్, వాళ్లు రావడంతోనే నాకు కబురు చెయ్యవలసింది" అంది. "ఇదిగో యెగోర్! మీరు రెండుసార్లు మందు పుచ్చుకోవడం మానేశారు. సిగ్గు లేదూ! అంత నిర్లక్ష్యం కూడదు! నాతో రండి యెగోర్‌ను ఆసుపత్రికి తీసుకుపోడానికి మనుషులొస్తున్నారు. ఏ క్షణంలోనైనా వాళ్లు రావచ్చు."

"అయితే ఇంతకీ నన్ను ఆసుపత్రిలో చేర్చడానికి సంకల్పించుకున్నారన్నమాట."

"అవును. అక్కడ కూడా మీతో నేనూ ఉంటాను."

"మీరు కూడానా! అయ్యో దేవుడా!"

"తెలివి తక్కువగా మాట్లాడకండి!"

మాట్లాడుతూనే ఆమె కంబళిని యెగోర్ గుండెలమీదకు లాగింది. నికొలాయ్‌ని బాగా పరిశీలించింది. మందు ఇంకా ఎంత మిగిలిందో చూడడానికి సీసాలు పైకెత్తి చూసింది. ఆమె ఒడుదుడుకులు లేకుండా మంద్రస్వరంతో మాట్లాడింది. హుందాగా సంచరించింది. ఆమె ముఖం వెలవెలబారుతోంది. నల్లని కనుబొమలు ముక్కు మొదట్లో దాదాపు కలుసుకుపోయాయి. తల్లికామె ముఖం నచ్చలేదు. కొంచెం కోపదారి ముఖంలా కనబడింది. ఆమె కళ్లలో చిరునవ్వు కాని, బెణుకుగాని లేదు. మాటలో అధికార లక్షణం కనబడుతోంది.

"ఇప్పుడు మిమ్మల్నిక్కడ వదిలేసి పోతున్నాం. కాని నేను త్వరలోనే తిరిగి వస్తాను. యెగోర్‌కు ఈ మందొక చెంచా యియ్యండి. అతన్ని మాట్లాడనివ్వకండి" అని చెప్పింది.

నికొలాయ్‌ని వెంటపెట్టుకుని ఆమె బయటికి వెళ్లిపోయింది.

యెగోర్ నిట్టూర్చి:

"బలే మంచి స్త్రీ... అద్భుతమైన మనిషి నిజంగా! అమ్మా, మిమ్మల్ని ఆమెకి అప్పజెప్పాలి. ఆమె ఎక్కువగా అలసిపోతోంది..." అన్నాడు.

"నువ్వు మాట్లాడకూడదు. ఈ మందు తీసుకో" అని తల్లి మెల్లగా బుజ్జగించింది.

అతడు మందు తీసుకుని ఒక కన్ను మూశాడు.

"నేను నోరు మూసుకుని కూచున్నా చచ్చిపోతాను" అన్నాడు.

రెండవ కంటితో తల్లిని చూశాడు. పెదవుల మీద చిరునవ్వు తొణికిసలాడింది. తల్లి తలవంచుకుంది, జాలి పొంగుకొచ్చి కన్నీరు కార్చింది.

"మాట్లాడకపోవడంలో అర్థమేమీ లేదమ్మా! అందువల్ల నాకొచ్చే లాభమేముంది? మరి కొన్ని క్షణాలు చావకుండా ఉంటాను. కాని, మీలాంటి మంచి మనిషితో మాట్లాడే ఆనందాన్ని పోగొట్టుకుంటాను. మరొక ప్రపంచంలో ఉండే మనుషులింత మంచివాళ్లు కారనుకుంటాను" అన్నాడు మొండిగా.

తల్లి ఆత్రంగా మాటకడ్డొచ్చి,

ఆ కులీన స్త్రీ తిరిగి వచ్చి, నిన్ను మాట్లాడనిచ్చినందుకు నన్ను చివాట్లు పెడుతుంది" అంది.

"ఆమె కులీన స్త్రీ కాదు. ఆమె విప్లవవాది. కామ్రేడ్. చాలా అద్భుతమైన స్త్రీ. ఆమె మిమ్మల్ని చివాట్లు పెట్టేమాట నిజమే. మిమ్మల్నే కాదు. ఆమె అందర్నీ చివాట్లు పెడుతుంది.."

చాలా ప్రయాసపడుతూ, ఆమె జీవిత కథను యెగోర్ చెప్పడం మొదలెట్టేడు. అతని కంటిలో ఒక చెమక్ కనిపించింది. ఇతడు తనను ఉడికిస్తున్నాడని ఆమె గ్రహించింది. పాలిపోయి, చెమటతో చెమ్మగిలిన అతడి ముఖం చూసి తల్లి :

"ఇతడు చచ్చిపోతున్నాడు" అనుకుంది.

లుద్మీలా తిరిగి వచ్చింది. తలుపు గడియ వేసి తల్లికేసి తిరిగింది.

"మీ పరిచితుడు బట్టలు మార్చుకుని, నా గదిలోంచి వెళ్లిపోవాలి. కనుక మీరు వెళ్లి అతనికి కట్టుకునేందుకేవో బట్టలు పట్టుకురావాలి. వాటినిక్కడికే తీసుకురండి. సోఫ్యా ఇక్కడ లేకపోవడం ఏమీ బాగాలేదు. జనాన్ని దాచడంలో ఆమె ప్రజ్ఞ చాలా గొప్పది ."

"ఆమె రేపొస్తోంది" అంది తల్లి తన శాలువను భుజాల మీద వేసుకుంటూ.

తల్లికి ఏ పనైనా అప్పచెప్తే, దానిమీద మనసంతా లగ్నంచేసి త్వరగా జయప్రదంగా నెరవేర్చాలని ఆత్రపడేది.

గేటులోంచి బయటికొస్తూ ఆమె ఒక క్షణం ఆగి శాలువ సర్దుకుంటూ నాలుగు వైపులా పరికించింది. ఎంత గుంపులోనైనా గూఢచారులను గుర్తుపట్టడంలో ఆమె ఎన్నడూ పొరబాటు పడలేదు. పొగరుపోతుతనం ఉట్టిపడే వాళ్ల నడక తీవీ, వాళ్ల హావభావ విలాసాల్లో ఉండే అసహజత్వం, వాళ్ల ముఖాలమీద కనబడే అలసటా విసుగూ, బెదురుబెదురుగా అనుమానంతో చూస్తుండే వాళ్ల కళ్లూ ఇవన్నీ ఆమెకు బాగా గుర్తే.

ఈ రకమైన జనమెవరూ కనబడకపోవడంతో ఆమె వీధిలో హడావిడిగా నడక సాగించింది. ఒక గుర్రపు బండిని కేకేసి మార్కెట్ దగ్గరకు తీసుకెళ్లమంది. అక్కడ బట్టల దుకాణంలో నికొలాయ్‌కోసం ఒక కోటునూ, టోపీనీ బేరం చేసింది. తన భర్త తాగుబోతనీ తనే నెలనెలా అతనికి కొత్త బట్టలు కొనవలస్తోందనీ, కట్టుకథ అల్లి, ఆ కల్పిత భర్తను ఆడిపోసింది. ఈ కథవల్ల ఆ దుకాణదార్లలో ఏమీ మార్పు కలగలేదు కాని తనే చాలా సంతోషించింది. బండిలో కూచున్నప్పుడు, నికొలాయ్‌కి బట్టలు మార్చుకోవలసిన అవసరముంటుంది కనుక, పోలీసులు మార్కెట్టులో తప్పకుండా గూఢచారుల నుంచుతారనుకుంది. అంత జాగరూకతతోటే, ఆమె యెగోర్ మకాం దగ్గర కొచ్చింది. తర్వాత పట్టణం పొలిమేర దాకా నికొలాయ్‌ని సాగనంపింది. వాళ్లిద్దరూ వీధికి చెరో పక్కగా నడిచారు. నికొలాయ్ తలొంచుకుని మెల్లగా నడుస్తున్నాడు, కోటు కాళ్ల కడ్డంపడుతూంది. ముందుకు జారిపోతున్న టోపీని సర్దుకుంటుండే దృశ్యాన్ని చూసి తల్లి నవ్వుకుంది. నిర్మానుష్యమైన ఒక సందులో సాషా వారి కెదురైంది. తల్లి వెసొవ్‌ష్చికోవ్‌కు వీడ్కోలు సూచకంగా తలవూపి తను ఇంటికి వెనక్కు మళ్లింది.

"పావెల్ ఇంకా జైల్లోనే ఉన్నాడు... అన్‌ద్రేయ్ కూడా..." అని విషాదమైన ఆలోచనలో పడింది.

తల్లి ఇంట్లోకి వచ్చేసరికి నికొలాయ్ ఆమెను చాలా ఉద్రిక్త స్థితిలో కలుసుకున్నాడు.

"యెగోర్ జబ్బు బాగా ముదిరిపోయింది! చాలా జబ్బుగా ఉన్నాడు! అతన్ని అస్పత్రికి తీసుకెళ్లేరు. లుద్మీలా ఇక్కడ కొచ్చి మిమ్మల్ని రమ్మనమని చెప్పింది..."

"ఆస్పత్రికా?"

తల్లి చాలా అలసిపోయింది. నికొలాయ్ ఉద్రిక్తత, రాబోయే విషాదాంతాన్ని ఆమెకు స్ఫురింపజేసింది.

"అతను చచ్చిపోతున్నాడు" అనే ఆలోచనే ఆమె మనస్సులో కొట్టుకుంటోంది.

పరిశుభ్రమైన చిన్న గదిలో, యెగోర్ తెల్లని తలగడల గుట్టమీద ఆనుకుని బొంగురుగా నవ్వుతూ ఉండడం ఆమె చూచి అమ్మయ్య అనుకుంది. గుమ్మం దగ్గర నిలబడి అతను డాక్టరుతో ఏమి చెప్తున్నాడో వింది.

"జబ్బువాళ్లకి వైద్యం చేయడం, సంస్కరణలు చెయ్యడం లాంటిది."

"యెగోర్! వేళాకోళం పట్టించకు" అని డాక్టర్ ఆత్రుత వెలిబుచ్చుతూ చెప్పేడు.

"నేను విప్లవకారుడిని, కనుక నాకు సంస్కరణలు గిట్టవు."

డాక్టరు నెమ్మదిగా యెగోర్ చేతిని రజాయిపైన ఉంచి, లేచి నిలబడ్డాడు. ఆలోచనలో పడి ఒక చేత్తో ఒక గడ్డాన్ని సవరించుకుంటూ, రోగి ముఖం మీద వాపులు నొక్కి చూశాడు.

అతడు ఆయాసపడుతూ కొంచెం కొంచెంగా ఊపిరి పీలుస్తుంటే, గుండెల్లోంచి గురగుర శబ్దం బయలుదేరింది. మొగమంతా చిరుచెమటలు కమ్మేయి. ఎంతో శ్రమపడితే కాని చెయ్యిపైకెత్తి నుదుటి మీద చెమట తుడుచుకోలేకపోయాడు. ఉబ్బిన దవడలు, దయ ఉట్టిపడే అతని విశాల ముఖాన్ని చైతన్య హీనంగా మార్చేశాయి. కళ్లు మాత్రం ఎంత లోతుకుపోయినా, బహుతేటగా చిరునవ్వు లొలికిస్తున్నాయి.

"ఏమయ్యోయి ధన్వంతరీ! నేను చాలా అలసిపోయాను. పడుకోవచ్చునా?"

"వద్దు. పడుకునేందుకు వల్ల కాదు" అన్నాడు డాక్టరు, ఖచ్చితంగా.

"నువ్వు వెళ్లిపోయిన ఉత్తర క్షణంలో నేను పడుకుని తీరుతాను!"

"నీలొవ్నా అతడిని పడుకోనివ్వద్దు, తలగడలు కుదిపి బొద్దుగా చేయండి, దయచేసి అతన్ని మాట్లాడనివ్వకండి. అది చాలా ప్రమాదకరం."

తల్లి అలాగే నన్నట్లు తలూపింది. డాక్టరు చరచర అడుగులు వేస్తూ బయటికెళ్లేడు. యెగోర్ తల వెనక్కి వాల్చేశాడు. కళ్లు మూసేశాడు. శరీరం కొయ్యబారిపోయింది. వేళ్లు మాత్రం లాక్కుపోతున్నాయి. ఆ చిన్న గదిలోని తెల్లగోడలు కఠినంగానూ, మనిషిని కుంగదీసేస్తున్నట్లుగానూ ఉన్నాయి. పెద్ద కిటికీలోనుంచి, లిండెన్ వృక్షాగ్రాహలపై నడికొప్పులనున్న దమ్ముపట్టి ఉంగరాలు తిరిగి నల్లని ఆకుల మధ్య పసుపుపచ్చని మచ్చలు శరత్కాల హిమశీతల స్పర్శలు అగపడుతున్నాయి.

"మృత్యువు అయిష్టంగా, నెమ్మదిగా నన్ను తీసుకుపోవాలనుకుంటోంది. నన్ను చూస్తే దానికి జాలేస్తున్నట్లుంది. నేనందరితోనూ సాయిలాపాయిలాగా ఉండే మనిషిని" అని కళ్లు తెరవకుండానే అన్నాడు యెగోర్.

"యెగోర్ ఇవానొవిచ్, మాట్లాడకు" అని మెల్లగా అతని చేతిని తట్టి తల్లి బతిమాలింది.

"మానేస్తాను.. త్వరలోనే."

ఎంతో ప్రయాసపడి ఊపిరిపీలుస్తూ మధ్య మధ్య మాట్లాడలేక చాలాసేపు ఆపేస్తూ యెగోర్ మాట్టాడ్డం కొనసాగించాడు.

"మీరు మాతో ఉండడమనేది చాలా గొప్ప సంగతి మీ ముఖం చూట్టానికెంతో సంతోషంగా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు మీరేమైపోతారోనని అనుకుంటూంటాను. అందరిలాగే మీరు కూడా జైలులో కెళ్లాలి... బాధలు పడాలి కాబోలని అనుకుంటే చాలా విచారం కలుగుతుంది... మీకు జైలు కెళ్లడం అంటే భయమా?"

"లేదు!" అని తల్లి మామూలుగా జవాబుచెప్పింది.

"అవును. అందుకేమీ సందేహం లేదు. కాని ఎన్ని చెప్పినా జైలు అసహ్యంగా ఉంటుంది. జైలే నన్నింత కాడికి తెచ్చింది. నిజం చెప్పాలంటే, నాకు చచ్చిపోవాలని లేదు..."

"నువ్వు చచ్చిపోవేమో" అని తల్లి అనాలనుకుంది. కాని అతడి ముఖంకేసి చూడ్డంతోనే మనసు మార్చుకుంది.

"నేను ఇంకా పనిచెయ్యగలను... పనిచెయ్యలేకపోతే బ్రతకడంలో అర్థమేమీ లేదు..."

తల్లి నిట్టూర్చి:

"ఇది అక్షరాలా నిజం కాని ఇది మననేమీ ఓదార్చదు" అని అన్‌డ్రేయ్ తరుచుగా అంటుండే మాటలు జ్ఞప్తికి తెచ్చుకుంది.

యెగోర్ శరీరమంతా ఒక్కసారి వణికింది. అతడు గుండెల దాకా చెయ్యెత్తేడు.

"ఏమిటది?" అని అరుస్తూ లుద్మీలా అతడి దగ్గరకు పరుగెత్తింది.

అతడు తల్లికేసి రెప్పవాల్చకుండా చూశాడు. అవిప్పుడు పెద్దవిగా, తేజోవంతంగా అగపడ్డాయి.

నోరు బాగా తెరిచి తల బాగా పైకెత్తి చెయ్యి బాగా చాచాడు. తల్లి తన చేత్తో అతని తల పట్టుకుని ముఖంకేసి చూసింది. ఆమెకు ఊపిరి ఆడలేదు. ఇంతలో ఒక్క విసురుతో తల వెనక్కు వాల్చేసి పెద్ద గొంతుకతో:

"ఇక నా వల్ల కాదు! అంతా అయిపోయింది!" అన్నాడు.

అతని శరీరమంతా ఒక్కసారి కొంచెం వణికింది. తల భుజం మీదకు వాలిపోయింది. పైన నిరుత్సాహంగా వెలుగుతూన్న దీపపు వెల్తురు బాగా తెరిచి ఉన్న అతని కళ్లలో నిర్జీవంగా ప్రతిఫలించింది.

"అయ్యో నాయనా!" అంది మెల్లగా తల్లి.

లుద్మీలా కిటికీ దగ్గర కెళ్లి బయటికి చూస్తూ నిలబడిపోయింది.

"చచ్చిపోయాడు!" అని ఉలికిపరచేంతటి పెద్ద గొంతుకతో అంది: కిటికీ గడప మీద మోచేతులాన్చి వంగి నిలబడింది. తర్వాత ఎవరో తలమీద కొడితే పడిపోయినట్టుగా గభాలున మోకాళ్లమీద కూలబడి, ఏడుస్తూ రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకుంది.

* * *

యెగోర్ చేతులు ఒకదానిపై ఒకటి అడ్డుగా ఉండేటట్టు వాటిని తల్లి అతని గుండెలమీద సర్దింది. తలను తలగడమీద తిన్నగా మోపింది. తన కన్నీటిని తుడుచుకుని లుద్మీలా దగ్గరకెళ్లింది. కొంచెం వంగి బరువైన ఆమె జుట్టును నిమిరింది. లుద్మీలా నెమ్మదిగా తలెత్తి, విచారంతో నిండిన కళ్లు బాగా తెరచి ఆమెకేసి చూస్తూ లేచింది.

"మే మిద్దరం ప్రవాసంలో కలిసి ఉన్నాం. ఇద్దరం కలిసి వెళ్లేం... కలిసే శిక్షననుభవించాం.. ఒక్కొక్కప్పుడు యమబాధగా ఉండేది... నిజంగా దుర్భరంగా ఉండేది. చాలామందికి గుండెలు జారిపోయాయి...." అని ఆమె హీనమైన కంఠస్వరంతో చెప్పింది.

ఆమెకు కళ్లు పొడారిపోయాయి, బిగ్గరగా ఏడవాలనే ఆవేశం వచ్చింది కాని మనో నిబ్బరంచేత దాన్ని నిగ్రహించుకుంది. విషాదపూరితమైన మృదువైన ముఖంతో, ఆమె తల్లిని సమీపించింది. దుఃఖంతో కోమలంగా ఉన్న ఆమె ముఖాన్ని చూస్తుంటే ఆమె చిన్నపిల్లలా కనబడింది.

"ఎప్పుడు చూసిన అతడు సంతోషంగా ఉండేవాడు. గుండె నిబ్బరం లేనివాళ్లను ప్రోత్సాహపరచేందుకని, తన బాధను కప్పిపుచ్చి నవ్వుతూ వేళాకోళాలు చేస్తుండేవాడు. అందరిపట్లా దయగానూ మంచిగానూ ఉండేవాడు. అందరి సంగతీ ఆలోచిస్తుండేవాడు. ఆ

సైబీరియాలో సోమరితనంవల్ల జనం అవినీతితో పాల్పడుతుంటారు. నీచమైన వాంఛలకు లోనైపోతుంటారు. ఈ అవలక్షణాల్నెదుర్కోడం అతడికి చాలా బాగా తెలుసు. అతడెంత అద్భుతమైన కామ్రేడో మీకు తెలుస్తేనా! వ్యక్తిగతంగా అతని జీవితం చాలా అసౌఖ్యకరమైనది. కాని దాన్ని గురించి అతని నోటి వెంట ఎన్నడూ ఫిర్యాదు రూపమైన పల్లెత్తుమాట నెవ్వరూ విని ఎరుగరు! ఎన్నడూ! నేనతనికి సన్నిహిత స్నేహితురాలిని. అతడు చూపిన దయకెంతో ఋణపడున్నాను. బహుగొప్పదైన అతని ధీశక్తి నుండి తానివ్వగలిగిందంతా నాకిచ్చాడు. కాని దానికి బదులుగా ఎన్నడూ ఏ విధమైన ఆప్యాయతను గాని, వ్యక్తిగతమైన పరామరికను గాని కోరలేదు" అంటూ విషాదభరితమైన ఆపేక్షతో తల్లితో చెప్పింది.

లుద్మీలా యెగోర్ దగ్గర కెళ్లి అతడి చేతిని ముద్దెట్టుకునేందుకు వంగింది.

మిత్రమా, ప్రియమిత్రమా ధన్యవాదాలు.... హృదయపూర్వక ధన్యవాదాలు... శలవు. నువ్వేలా విసుగూ విరామం లేకుండా అకుంఠిత విశ్వాసంతో పనిచేశావో, అలాగే నేను నా జీవితాంతం వరకూ పనిచేస్తాను!" అంటూ పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకొని శలవు తీసుకుంది.

ఎక్కెక్కి ఏడ్వడంచేత ఆమె శరీరమంతా వణికింది. ఆమె తలను యెగోర్ మంచం మీద అతని కాళ్ల దగ్గర పెట్టింది. తల్లి మౌనంగా రోదించింది. ఏ కారణంచేతనో ఆమె ఏడుపు నాపుకోవడానికి చాలా ప్రయత్నించింది.

"ఎప్పుడు జరిగింది?" అని గాభరా స్వరంలో బిగ్గరగా అడిగేడు.

ఎవరూ జవాబు చెప్పలేదు. అతడు నుదుటి మీద చెమటను తుడుచుకుని, యెగోర్ దగ్గర కొచ్చి అతడి చేతిని నొక్కి పక్కకు తప్పుకున్నాడు.

"ఇందులో అనుకోనిదేమీ లేదు. అతనికున్న గుండెజబ్బుకు అధమం, ఇది ఆర్నెల్ల కిందట జరగాల్సింది."

"మరొక డెళ్లిపోయాడు" అన్నాడు మెల్లగా.

లుద్మీలా లేచి, కిటికీ తలుపు తెరవడానికి వెళ్లింది. వెంటనే అందరూ లేచి దగ్గర దగ్గరగా నిలబడ్డారు.

ఇక్కడ తను వాళ్ల కడ్డుగా ఉన్నానేమోననే సంకోచంతో, తల్లి మెల్లగా తన చేతిని లాక్కుని, తలుపు దగ్గర కెళ్లి అక్కడ నుంచి యెగోర్‌కు తలవంచి నమస్కరించింది.

"మీరెళ్లిపోతున్నారా?" అని డాక్టరు వెనక్కి తిరగకుండానే అడిగేడు.

"అవును."

బయటకెళ్లడంతోనే ఆమె లుద్మీలాను తలుచుకుంది. ఆమె తన ఏడుపునెలా ఉగ్గబట్టుకుందా అనుకుంది.

"పాపం ఆమెకు ఏడవడం ఎలాగో కూడా తెలియదు."

చచ్చిపోయే ముందు యెగోర్ చెప్పిన మాటలను జ్ఞప్తికి తెచ్చుకుని ఆమె నిట్టూర్పు విడిచింది. వీధి వెంట నడుస్తూ, మిలమిలలాడే అతని కళ్లనూ అతని ఆనందాన్నీ, సరదాగా అతడు చెపుతుండే కథలనూ తలచుకుంది.

"మంచివాళ్లు బతకడం చాలా కష్టం, చచ్చిపోవడం సులభం. నేనెలా చచ్చిపోతానో కదా!" అనుకుంది.

"త్వరగా వెళ్లాలి!" అనుకుంది దిగులుతో కూడినదే అయినా ధైర్యంతో కూడిన అంతశ్శక్తి ఈ విధంగా ఆమెను ప్రేరేపించింది.

మరుసటి రోజంతా శవసంస్కార ప్రయత్నాలతోనే సరిపోయింది. తల్లికి. సాయంత్రం ఆమె, సోఫ్యా, నికొలాయ్ టీ తాగుతుంటే, సాషా వచ్చింది. మామూలుకన్న ఉషారుగా, బడబడ మాట్లాడే వైఖరిలో ప్రవేశించింది.

"మేమిప్పుడు యెగోర్ ఇవానొవిచ్ గురించి మాట్లాడుకుంటున్నాం" అని సోఫ్యా జ్ఞాపకం చేసింది.

"అతడు చాలా అద్భుతమైన మనిషి! మొగం మీద నువ్వులేకుండా నేనెప్పుడూ చూడలేదు. ఎప్పుడూ వేళాకోళాలాడుతూ ఉండేవాడు. పనెంత బాగా చేసేవాడో! విప్లవాన్ని తీర్చిదిద్దిన కళావేత్త, విప్లవాత్మకమైన భావ ప్రకటన చేయడంలో సిద్ధహస్తుడు. హింస, అసత్యం, అన్యాయం, వీటిని గురించి అతిసూక్ష్మమైన భాషలో చాలా బలంగా చిత్రించేవాడు!" అని ఆశ్చర్యకరంగా సాషా వర్ణించింది.

యెగోర్‌ను గురించి వాళ్లు పడుతుండే సంతాప స్థానే సాషా ఆనందాన్ని ప్రవేశపెట్టడం వాళ్ల అభిమతం కాదు. ఆమెను కూడా తమ విచార స్థితిలోకి లాక్కురావడానికి ప్రయత్నించారు.

"సరి. ఇప్పుడతను మరణించాడు." అంది సోఫ్యా పరిశీలనగా సాషాను చూస్తూ.

"అతడు చనిపోయాడూ! చనిపోవడమంటే ఏమిటర్థం? చనిపోయిన దేమిటి? యెగోర్ యడల నాకుండే గౌరవం చచ్చిందా? అతనిమీద నాకుండే సోదర ప్రేమ చచ్చిందా? అతని అభిప్రాయాలను గ్రహించే శక్తి నాలో చచ్చిందా? నా హృదయంలో అతడు రేకెత్తించిన భావాలు నశించాయా? అతడు నిజాయితీ పరుడైన ధైర్యశాలి అనే జ్ఞానం నాలో చచ్చిందా? ఇదంతా చచ్చినట్లా? నాకు సంబంధించినంతవరకు ఇవేమీ ఎన్నటికీ చావవు. ఒక వ్యక్తిని గురించి మనం చాలా తొందరగా 'అతడు చచ్చిపోయాడ'ంటూ ఉంటాం. 'అతడి పెదవులు నిర్జీవములే అయిన నేమి? అతడి మాటలు సజీవుల హృదయాల్లో చిరస్థాయిలే!" అటువంటి ఉద్వేగస్థితిలో,

మరల ఆమె బల్లదగ్గర కూచుని, మోచేతులు బల్లమీద ఆన్చి, మరింత తాపీగా, ఆలోచనాయుతంగా మాట్లాడింది.

సోఫ్యా మెల్లగా నవ్వుతూ,

"ఏమిటి సాషా! మీకీ రోజున ఏదో మంచి జరిగినట్లుందే?" అని అడిగింది.

"అవును. చాలా మంచి సంగతనిపిస్తోంది! రాత్రంతా వెసొవ్‌శ్చికోవ్‌తో మాట్లాడుతూనే ఉన్నాను. అతనంటే నాకెప్పుడూ గిట్టేది కాదు. అతను చాలా మోటు మనిషి, అజ్ఞాని అనుకునేదాన్ని. నిజానికి అతడలాగే ఉండేవాడు. తనను రోగం పట్టుకుని పీడించుతూన్నట్టుగా అందరిపట్లా అకారణమైన శత్రుత్వం అతన్ని పట్టుకుని పీడించుతూండేది. ఎప్పుడూ ఏ విషయాన్ని గురించి మాట్లాడినా తననే కొట్టుకొయ్యగా పెట్టుకుని, 'నేను, నేను' అంటూ మోటుగా చెడ్డగా ప్రసంగించేవాడు. చాలా అసహ్యమైన సంకుచితత్వం అతడిలో ఉండేది" అంది సాషా. ఆమె చిన్న నవ్వు నవ్వి, మిలమిలలాడే కళ్లతో వాళ్లందరినీ చూసింది. "కాని ఇప్పుడతను 'కామ్రేడ్స్!' అంటున్నాడు. అతడు ఆ మాటంటే విని తీరాలి! మాటలతో చెప్పడానికి వీల్లేని బిడియం, సాధుత్వం అతని మాటల్లో ద్యోతకమవుతున్నాయి. ఇప్పుడతను చాలా నిరాడంబరంగా నిష్కపటంగా ఉన్నాడు. బ్రహ్మాండమైన కార్యదీక్షతో వున్నాడు. తన్ను తాను తెలుసుకున్నాడు తనలో ఉన్న మంచి గుణాలనూ లోపాలనూ గ్రహించుకున్నాడు. అన్నిటికన్న గొప్ప విశేషమేమంటే, అతనిలో చాలా గొప్ప నికార్సైన సోదరభావం ఉత్పన్నమైంది."

సాషా మాటలు వింటుంటే, ఖచ్చితంగా నిష్ఠగా ఉండే అమ్మాయి కూడా సాధువుగా సంతోషంగా ఉండడం తల్లికి ఆనందాన్ని కలిగించింది. కాని ఆమె హృదయపు లోతుల్లో "పావెల్ సంగతేమిట"నే ఈర్ష్యాలోచన మాత్రం వేధిస్తూనే ఉంది.

తల్లి ఆమె దగ్గరకెళ్లి జుట్టు నిమిరింది. సాషా ఆమె చేతిని పట్టుకుని, వికసించిన ముఖాన్ని పైకెత్తింది. తల్లి మందహాసం చేసి నిట్టూర్చింది. ఆమెకు మాటలు స్ఫురించలేదు. సోఫ్యా సాషా ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని భుజాలమీద చెయ్యేసింది. ప్రశ్న పూర్వకమైన చిరునవ్వుతో ఆమె కళ్లలోకి చూస్తూ :

"బలే తమాషా పిల్లలండీ మీరు!" అంది.

"బహుశా నేను చాలా తెలివి తక్కువ..."

"మీరెప్పుడైనా అలా ఎందుకాలోచించి ఉంటారు?" అంది సోఫ్యా. నికొలాయ్ యధాలాపంగా కలుగ చేసుకుని :

"అది సాధ్యమైతే వాళ్లు పారిపోయే ఏర్పాట్లు చేసితీరాలి. కాని అసలు జైల్లో ఉన్న వాళ్లకది అంగీకారమో కాదో మనం తెలుసుకోవాలి కదా!"

సాషా తలొంచుకుంది.

సోఫ్యా సిగరెట్టు ముట్టించి, తమ్ముడి కేసి చూస్తూ అగ్గి పుల్లనొక మూలకు విసిరేసింది.

“వాళ్లెందుకభ్యంతరం చేస్తారు? కాని అది సాధ్యమని మాత్రం నేననుకోవడం లేదు” అని తల్లి నిట్టూర్పు విడిచింది.

అది సాధ్యమేనని వాళ్లు ధైర్యంగా చెప్తారని ఆమె ఆశించింది. కాని వాళ్లా మాట చెప్పలేదు.

“నేను వెసొవ్‌శ్చికోవ్‌ని చూడాలి” అంది సోఫ్యా.

“ఎప్పుడు ఎక్కడ అతన్ని చూడ్డానికి వీలవుతుందో రేపు చెప్తాను” అంది సాషా.

సోఫ్యా గదిలో పచారు చేస్తూ :

“అతని కార్యక్రమమేమిటి?” అని అడిగింది.

“కొత్తగా స్థాపించబోయే ప్రెస్సులో అతడు కంపోజిటరుగా పనిచేస్తాడు. ఈలోగా అతడు అడవి కాపలాదారుతో ఉంటాడు.”

సాషా ధుమధుమలాడింది. ఆమె ముఖం వెనుకటి తీవ్రతలో కొచ్చేసింది. ఆమె కరుగ్గా మాట్లాడింది.

నికొలాయ్, కప్పులు కడుగుతున్న తల్లి దగ్గర కెళ్లి :

“మీరు ఎల్లుండి పావెల్‌ను చూడ్డానికెళ్లినప్పుడు ఒక చీటీ నందివ్వాలి... వాళ్ల అభిప్రాయమేమిటో మనకు తెలియాలి...” అన్నాడదు.

“అలాగే, అదా!... నేనెలాగో అందించే ఏర్పాట్లు చేస్తాలే” అని తల్లి ఖరారు చేసింది.

“ఇక నే వెడుతున్నాను” అంటూ సాషా అందరితో నిశ్శబ్దంగా చరచర కరచాలనం చేసి బిర్రబిగుసుకున్నట్టు నిటారుగా నిల్చుని, మామూలుకంటె మరీ దృఢంగా అడుగులు వేసుకుంటూ బయటికెళ్లింది.

“అలాంటి కోడల్ని మీరు ప్రేమించగలరా, నీలొవ్నా?” అని అడింగింది.

“ఒక్కరోజు పాటైనా వాళ్లిద్దరూ కలసి సుఖంగా ఉండంగా నేను చూడ కలుగుతానా!” తల్లి అంది. అప్రయత్నంగా ఆమెకు ఏడుపు వచ్చింది.

“అవును. కాస్తంత సుఖం అందరికీ మంచిదే. కాని కొంచెం సుఖంతో ఎవరూ సంతృప్తి చెందరు. ఆ సుఖం చాలా ఎక్కువైతే చవకైపోతుంది” అన్నాడు నికొలాయ్, నిదానంగా.

సాఫ్యా పియానో దగ్గర కెళ్లి ఒక విషాద గీతాన్ని ఆలాపన చేసింది.

మర్నాటి ఉదయం, ముప్పయి నలభై మంది జనం, తమ స్నేహితుడి శవపేటిక కోసం హాస్పటలు గేటు దగ్గరకని పెట్టుకుని నిలబడ్డారు. జనం మధ్య గుఢచారులు తిరుగుతూ ఉన్నారు. వాళ్ల మాటలు వింటూ, వాళ్ల ముఖాలనూ చెహరాలనూ మనస్సుకు పట్టించుకుంటున్నారు. తుంటి మీద రివాల్వర్లను వేలాడేసుకున్న పోలీసు ముఠా వీధి చెరో వైపూ నిలబడుంది. గూఢచారుల జొరావరీకీ, తమ బలాన్ని ప్రదర్శించడం కోసం సిద్ధంగా కాచుకుకూచున్న పోలీసుల వెటకారపు నవ్వులకూ ప్రజలు రెచ్చిపోతున్నారు.

తల్లి గుంపు మధ్యన నిలబడింది.

"వీళ్లాట్టే మంది లేరే. ఎక్కువమంది లేరు. కార్మికులు అసలే లేరు" అని, ఎరుగున్న ముఖాలకేసి చూస్తూ ఆమె అనుకుంది.

గేటు తలుపులు తెరవడంతోనే గేటులో నుండి శవపేటిక మూతను మనుషులు మోసుకొచ్చారు. ఆ మూతంతా ఎర్ర రిబ్బన్లతో కట్టిన పూల గుత్తులతో కప్పబడింది. కనిపెట్టుకున్న జనం ఒక్క క్షణంలో టోపీలన్నీ పైకెత్తేరు. చూచేవాళ్లకా దృశ్యం నల్లని పక్షులొక్కసారిగా గభాలున ఎగిరిపోతున్నాయా అనిపించేటట్టుంది.

ఆ ఎర్ర రిబ్బన్లు తీసెయ్యండి!" అని ఆఫీసరు బొంగురు గొంతుకతో ఆజ్ఞాపించాడు.

"దౌర్జన్యం నశించు గాక!" అని ఒక యువకుడు అరిచాడు. వాద ప్రతివాదాల గలభాలో ఆ అరుపు ఏష్యమైపోయింది.

తల్లి హృదయాన్ని పొడిచినట్లైంది. తన పక్కనే చవకబారు సూటులో ఉన్న యువకునికేసి తిరిగి :

"అదేమిటి? ఇష్ట ప్రకారం శవసంస్కారం కూడా చేసుకోనివ్వరన్నమాట!" అని తీవ్రమైన కోపంతో అంది.

"మా కామ్రేడ్‌ని అంతిమయాత్రకు తీసుకెళ్లే హక్కు మాకుండాలి. మీరెవర్ని హింసపెట్టి ప్రాణాలు తీసేరో ఆ మా కామ్రేడ్‌ని తుది యాత్రకి సాగనంపే హక్కు మాకుండాలి."

"మహత్తర త్యాగం చేశావూ..."

అంటూ ఎవరో బిగ్గరగా పాట మొదలెట్టేడు.

"రిబ్బన్లు ఆగేయ్, యాకొవ్‌లెవ్! కోసిపారెయ్యి!"

ఖడ్గమొకటి గాలిలో ఝుణఝుణమంది. జనం కెవ్వుమంటారనుకుని తల్లి కళ్లు మూసుకుంది. కాని ప్రజలు మాత్రం గొణుక్కున్నారు. కోపంతో తోడేళ్లలాగ గురగురలాడేరు. పాదాల చప్పుడు మార్మోగుతూండగా తలలు వంచుకుని మౌనంగా, ముందుకు సాగేరు.

శవపేటిక మూత, నలిగిపోయిన పూలదండంతోనూ తెగిపోయిన రిబ్బను ముక్కలతోనూ జనం తలలమీద తేలి ఆడుతోంది. వారి పక్కనే గుర్రాలమీద పోలీసురౌతులు ఊగిసలాడుతున్నారు. పక్కనున్న చప్టామీద నడుస్తూన్న తల్లికి శవపేటిక కనబడటమేలేదు. దాని చుట్టూ జనం క్రమేణా మూగిపోయి వీధంతా నిండిపోయారు. బూడిదరంగు దుస్తులను ధరించిన పోలీసురౌతులు వెనుకకు మోహరించారు.

"శలవు మిత్రమా! శలవు!"

అంటూ విషాద గీతాన్ని రెండు స్వరాలు ఆలపించాయి.

"ఆ పాటా వొద్దు. మౌనంగా నడుద్దామండి" అని ఎవరో కేక వేశారు.

ఆ కేకలో భయసంభ్రమాలను స్ఫురింపజేసేదేదో ఉంది. విషాద గీతం ఆగిపోయింది. సంభాషణలు సద్దుమణిగిపోయాయి.

మతగురువులు లేని ఆత్మానందం కలిగించే సంగీత మేమీలేని ఈ శవసంస్కారం, నిశ్శబ్దంగా ఆలోచనా నిమగ్నమైన ముఖాలూ, ముడిపడిన బొమలూ తల్లికి తీవ్రమైన బాధను కలిగించాయి. ఆమెకు మనసులో నిదానంగా ఆలోచనలు రేకెత్తేయి. ఆమె వాటిని విషాదపూరితమైన మాటల్లోకి మార్చింది:

"సత్యం కోసం నిలబడే మీరు ఎంతోమంది లేరు..."

తలవంచుకుని ముందుకెళ్లింది. ఆరోజున సమాధి చేస్తున్నది యెగోర్‌ని కాదు తనకెంతో సన్నిహితమూ ఆప్యాయమైన, ముఖ్యమైన దేన్నో పూడ్చి పెడుతున్నట్లామె కనిపించింది. ఆమె దిగులుతో అస్థిమితంతో కలతచెందింది. యెగోర్‌ని సమాధి చేస్తుండే వారిపట్ల అస్పష్టమైన భయంకరమైన అసమ్మతి భావమేదో ఆమె హృదయాన్ని ఆవరించింది.

"యెగోర్‌కి దేవునియందు నమ్మకం లేదు... వీళ్లెవరికీ కూడా..." అనుకుంది.

ఆ ఆలోచనను కొనసాగించడానికామె ఇష్టపడలేదు. ఆత్మనావహించిన భారాన్ని దులుపుకునేందుకా అన్నట్లు నిట్టూర్పు విడిచింది.

"ఓ భగవంతుడా! ఓ జీసస్! నా గతి కూడా ఇంతేనా..."

అంతా స్మశానికి చేరుకున్నారు. సమాధులమధ్య కొంతసేపు దారిచేసుకుని నడిచారు.

పోలీసులు తమ అధికారి కేసి చూస్తూ బారు తీరి ఠంచగా నిలబడ్డారు. పొడుగాటి జుట్టు, నల్లని కనుబొమలు, వెల్లబారిన ముఖం గల ఒక పొడుగాటి యువకుడు సమాధి మొగను నిలబడ్డాడు.

"ఏమయ్యా పెద్దమనుషులూ!" అని బొంగురు గొంతుకతో పోలీసు ఆఫీసరు అరిచాడు.

"కామ్రేడ్స్" అంటూ ఒక యువకుడు విస్పష్టమైన కంఠధ్వనితో ప్రారంభించాడు.

"ఒక్క నిముషంలో ముగించాలి! ఉపన్యాసాలేమీ ఇవ్వడానికి వీల్లేదని ముందుగానే హెచ్చరిస్తున్నాను!" అంటూ ఆఫీసరు అరిచాడు.

"నేను కొద్ది మాటలు మాత్రమే చెప్తాను" అని యువకుడు తొణుకూ బెణుకూ లేకుండా బదులుచెప్పేడు. "కామ్రేడ్స్! మన స్నేహితుడూ గురువూ మనకు నేర్పిన సంగతులను మన జీవితంలో ఎన్నడూ విస్మరించమనీ, మన జన్మభూమి నావహించిన సమస్త అరిష్టాలకూ మూలకారణమైన ఏ నిరంకుశ ప్రభుత్వమున్నదో దానికి గోరి తవ్వడానికి మన మందరమూ మన జీవితాంతం వరకూ నిర్విరామంగా కృషిచేస్తామనీ, ఈ సమాధి దగ్గర మనమంతా ప్రతిజ్ఞను స్వీకరించాలి!"

"అతని అరెస్టు చెయ్యండి!" అన్నాడు ఆఫీసరు.

"నిరంకుశత్వం నశించుగాక!" అనే కేకలు ఆ ఉత్తరవును మించేశాయి.

పోలీసులు గుంపులోంచి ముందుకు తోసుకొచ్చి ఉపన్యాసకుని మీద పడ్డారు. అతని స్నేహితులు అతడి రక్షణకోసం దగ్గరగా కడియం కట్టేరు.

"స్వేచ్ఛ వర్ధిల్లుగాక!" అని అతడు చెయ్యి పైకెత్తి ఊపుతూ నివాదం చేశాడు.

తల్లిని ఒక పక్కకు తోసేశారు. ఆమె భయపడి ఒక శిలువ కానుకుని, ఒక దెబ్బమీద పడబోతున్నదనుకుంటూ కళ్లు మూసుకుంది. రణగొణధ్వనిలో ఆమె చెవులు గడియలుపడి పోయాయి. కాళ్లకింద నేల జారిపోతున్నట్లనిపించింది. గాలి హోరువల్లా, భయంవల్లా ఊపిరాడ్డం కష్టమైపోయింది. పోలీసువాళ్ల ఈలలు రేగేయి. కరుకైన కంఠధ్వనులతో ఉత్తరువులు విజృంభించాయి.

గుంపులో ఆ యువకుని వెలవెలలాడే ముఖం ప్రముఖంగా కనిపిస్తోంది. ఈ ఉద్రిక్త ప్రవృత్తుల తుపానులోంచి అతని దృఢ స్వరం పైకి లేచింది.

"కామ్రేడ్స్! మీ శక్తిని వృథా చెయ్యకండి!"

అతని మాటలు మన్నింపబడ్డాయి. జనం కర్రలు విసిరిపారేసి పారిపోసాగారు. తల్లి మాత్రం ముందుకు సాగుతూనే ఉంది. ఏదో ఒక అతీతమైన శక్తి ఆమెను ముందుకు నడిపించింది. నికొలాయ్ టోపీ వెనక్కి పెట్టుకుని ఆగ్రహావేశపరువశులైన జనాన్ని తోసేస్తూండడం ఆమె చూసింది.

"మీకేమైనా మతిపోయిందా? శాంతిచండి!" అని జనాన్ని అతడు మందలించాడు.

అతని చేతికి రక్తమైనట్లు తల్లికగుపడింది.

"నికొలాయ్ ఇవానొవిచ్ మీరిక్కడనుంచి వెళ్లిపోండి!" అని ఆమె అతని దగ్గర కెళ్లిచెప్పింది.

"ఎక్కడి కెడుతున్నారు? వాళ్లు మిమ్మల్ని కొడుతారు!"

ఆమె భుజంమీద ఎవరో చెయ్యివేశారు. సోఫ్యా నెత్తిన చోపీలేకుండా జుట్టంతా రేగిపోయి, తల్లి పక్కనే నిలబడుంది. ఒక పిల్లవాడికి చేత్తో పట్టుకుంది. ఆ పిల్లవాడు ముఖంమీద రక్తాన్ని చేత్తో తుడుచుకుంటున్నాడు.

"నన్ను పోనియ్యండి... దీనికేమీ ఫరవాలేదు" అని వణుకుతున్న పెదవులతో అతడు గొణిగేడు. ఆపిల్లవాడిని జాగ్రత్త పెట్టండి...... వాడిని మనింటికి తీసుకెళ్లండి. ఇదిగో ఈ చేతి రుమాలుతో అతని ముఖానికి కట్టు కట్టండి" అంది సోఫ్యా తొందరగా. ఆ పిల్లవాని చేతిని తల్లి చేతిలో పెట్టి సోఫ్యా పరుగెత్తి వెళ్లిపోయింది.

"త్వరగా వెళ్లండి లేకపోతే మిమ్మల్ని అరెస్టు చేస్తారు!" అని వెనక్కి తిరిగి హెచ్చరించింది.

జనం స్మశాన వాటికలో నాల్గుమూలలా చెల్లాచెదరైపోయారు. పోలీసువాళ్లు కత్తులు ఝుళిపించుకుంటూ తిట్టుకుంటూ, అల్లల్లాడుతూన్న ఓవర్‌కోటు అంచులు కాళ్లలో పడగా స్మశానవాటికను కలదొక్కేశారు. ఆ పిల్లవాడు వాళ్లను తోడేలులాగున కోరచూపులు చూశాడు.

"త్వరగా నడు" అంటూ తల్లి చేతి రుమాలుతో అతడి ముకాన్ని తుడిచింది.

"నన్ను గురించి మీరేమీ కంగారుపడకండి... నాకేమీ నొప్పిపెట్టడం లేదు. వాడు నన్ను కత్తి పిడితో కొట్టేడు. కాని వాడికి శాస్తి అయిందిలెండి! నేను కఱ్ఱతో ఒక్క ఊపు ఊపి కొట్టేసరికి వాడు మొఱ్ఱోమన్నాడు!" అని రక్తాన్ని ఊసేస్తూ అన్నాడు కుఱ్ఱాడు. "కొంచెం ఆగండి, రాబోయే దానిముందు ఇదేపాటిది! మా కార్మికులంతా ఒక్కసారి లేస్తే, పోరాటమనేదక్కర్లేకుండానే మిమ్మల్ని తుడిచేస్తాం!" అని రక్తసిక్తమైన పిడికిలిని ఝుళిపిస్తూ అన్నాడు.

"కామ్రేడ్! నన్నెక్కడికి తీసుకుపోతున్నారు? మీ సహాయమక్కర్లేకుండా నేనే వెళ్లిపోగలను" అని నోటికి కట్టిన కట్టును తప్పించుకుని అడిగేడు.

కాని ఆమె అతని చెయ్యి వణకడం గమనించింది, అతడు పాదాలమీద ఊగిసలాడ్డం కనిపెట్టింది. అతను జవాబులకోసం ఆగకుండానే ప్రశ్న మీద ప్రశ్నలడిగేడు. అతని కంఠస్వరం క్రమక్రమంగా నీరసపడింది.

"మీరెవరు? నేను తగరపు పనివాడిని. నాపేరు ఇవాన్. యెగోర్ ఇవానొవిచ్ ఆధ్యయన బృందపు పదకొండుగురిలోనూ మేము ముగ్గురం తగరపు పనివాళ్లం. మాకు ఆయనంటే ఎంత ప్రీతో చెప్పడానికి వీల్లేదు. నాకు దేవుడంటే నమ్మకం లేదు కాని... అయినా ఆయన ఆత్మ శాంతించుగాక."

వీధిలో తల్లికొక గుర్రపు బండి కనబడింది. ఇవాన్‌ను దానిలో కూర్చోబెట్టి, “నోరు మెదపవద్దు” అని గుసగుస గొంతుకతో చెప్పి, చేతి రుమాలుతో నోటికి అడ్డం కట్టింది.

అతడు చేతిని ముఖందాకా పైకెత్తేడు. కాని అప్రయత్నంగా చెయ్యి ఒడిలోకి జారిపోయింది. ముఖంమీద కట్టును ఊడదీసుకునేందుకు శక్తి చాలలేదు. కాని కట్టులోంచే గొణిగేడు.

“నేనీ దెబ్బల్ని మరచిపోతాననుకోకండి!... ఈయన రాక పూర్వం తీతొవిచ్ అనే విద్యార్థి ఒకడుండేవాడు... అతడు మాకు... అర్థశాస్త్రాన్ని గురించి పాఠాలు చెపుతుండే వాడు... అతన్ని వాళ్లు అరెస్టు చేశారు...”

తల్లి ఇవాన్‌ను చేత్తో దగ్గరకు లాక్కొని అతని తలను రొమ్ముమీద అన్చుకుంది. హఠాత్తుగా ఆ పిల్లవాడు అలాగే కూలబడిపోయేడు. ఆమె భయపడి నాలుగు మూలలా చూసింది. ఏ మూలనుంచైనా పోలీసులొచ్చి, ఇవాన్ తలకు కట్టిన కట్టు చూసి, అతడిని పట్టుకు చంపేస్తారేమోనని ఆమె భయం.

బండివాడు వెనక్కు తిరిగి చూసి నవ్వుతూ,

“తాగేడా?” అడిగేడు.

“అవును. మరీ ఎక్కువ పుచ్చుకున్నాడు” అని తల్లి నిట్టూర్చింది.

“విన్నావా స్మశానంలో జరిగిన కొట్లాటసంగతి? రాజకీయాల్లో పనిచేసే అతనెవరినోసమాధి చేశారుట. పైనుండే గొప్పవాళ్ల కతడు వ్యతిరేకిట. వాళ్లతో ఏదో పేచీ పెడుతూ ఉంటాట్ట. అతన్ని సమాధి చెయ్యడానికొచ్చిన వాల్లంతా ఒకే రకం మనుష్యులట అంటే వాళ్లంతా స్నేహితులు అన్నమాట. వాళ్లంతా ‘హేమా హేమీలు నశించాలి! వీళ్లే ప్రజలను దోచుకుంటున్నారు!” అని అరిచారట.

ఎగుడుదిగుడుగా ఉండే చప్టామీద బండి నడుస్తుంటే ఆ కుదుపులో ఇవాన్ తల తల్లి గుండెలకు మెల్లగా కొట్టుకొంది. బండివాడు తన పెట్టిమీద సగం అడ్డంగా తిరిగి గొణగొణలాడ్డం మొదలెట్టేడు.

“జనంలో అశాంతి ప్రబలిపోయింది.... అరాజకం వ్యాపించిపోతోంది. నిన్నరాత్రి పోలీసులు మా ఇంటిపక్క వాళ్లింటి కొచ్చి తెల్లవారేవరకు వాళ్ల ఇల్లంతా నానా గల్లంతూ చేశారు. చివర కొక కమ్మరి పనివాడిని పట్టుకుపోయారు. అతడిని అర్ధరాత్రి వేళ నదికి తీసుకుపోయి, అందులో ముంచేస్తారని జనం చెప్పుకుంటున్నారు. ఆ కమ్మరతను చాలా మంచివాడు.”

“అతడి పేరేమిటి” అని తల్లి అడిగింది.

"కమ్మరి పేరా? సవేలియ్. సవేలియ్‌యేవ్‌చెన్కో. చిన్నవాడే. కాని అతడికి చాలా సంగతులు తెలుసు. సంగతులు ఎక్కువగా తెలుసుకోవడం కూడా అపరాధమే ననుకుంటాను. అతడు తరుచుగా మా దగ్గరకొచ్చి, 'బండివాళ్ల జీవితం ఏమి జీవితం?' అనేవాడు. 'కుక్కల జీవితంకన్న కనాకష్టమనాలి' అంది తల్లి.

"ఆపు. ఇంటికొచ్చాం" అంది తల్లి.

అప్పటికప్పుడే సోఫ్యా ఇంటికి చేరుకుంది. ఆమె కంగారుగా, ఉద్విగ్నంగా వుంది. పళ్లతో సిగరెట్టును కరుచుకుంది.

గాయాలు తగిలిన పిల్లవాడిని సోఫామీద పడుకో పెట్టడంతోనే, సోఫ్యా అతని కట్టు విప్పేసి, సిగరెట్టు పొగలోంచి కళ్లు తిప్పుకుంటూ, ఉత్తరువు లివ్వడం ప్రారంభించింది.

"ఇవాన్ దనీలొవిచ్! అతన్ని తీసుకొచ్చారు! అలసిపోయారా నీలొన్నా? భయపడ్డారా? కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి. నికొలాయ్! నీలొన్నాకు పోర్టువైను కొంచెం ఇయ్యి."

పక్క గదిలోంచి నికొలాయ్ వచ్చాడు. అతడి చేతికి కట్టు కట్టుండడం తల్లి చూసింది. డాక్టరు ఇవాన్ దనీలొవిచ్ అతనితో కూడా వచ్చాడు. చింపిరి జుట్టుతో ఏదుపందిలాగ ఉన్న డాక్టరు సరాసరి ఇవాన్ దగ్గర కెళ్లి అతనిమీదకు వంగి చూశాడు.

"నీళ్లు....చాలా నీళ్లు కావాలి. శుభ్రమైన దూది, పరిశుభ్రమైన గుడ్డ, తీసుకురండి" అన్నాడు.

తల్లి వంటింట్లోకి బయల్దేరింది. కాని నొకొలాయ్ ఆమె చెయ్యి పట్టుకుని భోజనాల గదిలోకి తీసుకుపోయాడు.

"ఆ మాట చెప్పింది మీకు కాదు.. సోఫ్యాకు... అమ్మా, మీరు చాలా హడలిపోయినట్లున్నారు. ఔనా?" అని అడిగేడు.

తల్లి సానుభూతియుతమైన అతని కళ్లను చూడ్డంతోనే, వశం తప్పిపోయింది.

"అబ్బ! ఏం ఘోరం జరిగిందయ్యా! వాళ్లు ప్రజల ఒళ్లు చీల్చేశారు, నరికి పారేశారు...." అని ఏడ్చింది.

"నేనంతా చూశాను" అంటూ తలూపుతూ ఆమె కొక గ్లాసు ద్రాక్షసారాయ మిచ్చాడు. "ఉభయపక్షాలవారికీ మతిపోయింది. దాన్ని గురించి మీరు ఏమీ బెంగ పెట్టుకోకండి. వాళ్లు కత్తులు ఉపయోగించారు. ఒక్కడికే బాగా ప్రమాదమైన గాయాలు తగిలేయి. అతడికి దెబ్బలు తగలడం నేను చూశాను. పోట్లాటలోంచి వెనక్కి లాగేశాను."

నికొలాయ్ మాటలవల్ల కొంత ఉపశమనం కలిగింది. గదిలోని వెల్తురు, వెచ్చదనం కూడా కొంత మనశ్శాంతికి తోడ్పడ్డాయి. తల్లి అతనికేసి కృతజ్ఞతతో దృష్టిసారించింది.

"మిమ్మల్ని కూడా కొట్టేరా?" అని అడిగింది.

"ఆ పని నేనే చేశాననుకుంటాను, ఆలక్ష్యంగా నా చేతిని దానికీ దీనికీ కొట్టేను. అంచేత చర్మమూడింది. ఇదిగో కొంచె టీ తాగండి. బయట చలిగా ఉంది, మీ దుస్తులు చలిని ఆపేవిగా లేవు.

ఆమె టీ కప్పును చేత్తో అందుకుంటుంటే తన వేళ్ల మీద రక్తం పేరుకుని ఉండడం చూసింది. వెంటనే చేతిని ఒడిలో పెట్టుకుంది. ఆమె పావడ తడితడిగా ఉంది. కళ్లు బాగా తెరిచి వేళ్లను చూసుకుంది. గుండెలు దబదబా కొట్టుకున్నాయి. తల తిరిగిపోయింది.

"సాషాని కూడా ఇలాగే చేస్తారు కాబోలు!" అనుకుంది.

ఇవాన్ దనీలొవిచ్, చొక్కా చేతులు పైకి మడత పెట్టుకుని, వేస్టు కోటుతో గదిలో కొచ్చాడు. నికొలాయ్ మౌన ప్రశ్నకు గట్టిగా ఇలా సమాధానం చెప్పేడు.

"ముఖం మీది గాయమేమంత ప్రమాదం కాదు. కాని మూతి పగిలింది. అయితే అంత ఎక్కువగా కాదు. చాలా బండమనిషీ, కాని చాలా రక్తం పోయింది. హాస్పిటల్‌కి పంపిద్దామా?"

"ఎందుకూ? ఇక్కడే ఉండనియ్యి" అన్నాడు నికొలాయ్.

"ఇవేళా, రేపూ ఉండనిద్దాం. కాని ఇతను హాస్పిటల్లో ఉంటే నాకెక్కువ సౌకర్యంగా ఉంటుంది. నేను తరుచుగా ఇక్కడికి రావడానికి వీలుండదు. స్మశానవాటికలో జరిగిన కథంతా ఒక కరపత్రంగా రాస్తావా?"

"తప్పకుండా" అన్నాడు నికొలాయ్.

తల్లి మెల్లగా లేచి వంటింటికేసి ప్రయాణమైంది.

"ఎక్కడి కెడుతున్నారు? నీలొన్నా!" అంటూ ఆప్యాయంగా నికొలాయ్ ఆమె నాపుచేసి "మీ సహాయం అక్కర్లేకుండానే సోఫ్యా అన్ని పనులూ చేసుకోగలదులెండి" అన్నాడు.

ఆమె అతనికేసి తేరిపారజూసింది. ఆమె ఒళ్లు కొంచెం కంపించింది. చిత్రంగా నవ్వుతూ:

"నా వొళ్లంతా రక్తమైంది" అంది.

తన గదిలో కెళ్లి బట్టలు మార్చుకుంటూ, ఇలాంటి భయకరమైన విషయాలను వీళ్లింత తేలికగా, తొణుకూ బెణుకూ లేకుండా ఎలా భరిస్తూన్నారా అని ఆశ్చర్యపడింది. ఈ ఆలోచనలతో ఆమెకుండే భయమంతా పోయి, మనసు కుదుటబడింది. గాయపడిన పిల్లవాడు పడున్న గదిలోకి ఆమె వెళ్లేసరికి సోఫ్యా అతడిమీదకు వంగి చూస్తోంది.

వాళ్లంతా భోజనాలగదిలో కెళ్లి చాలా సేపు దాకా ఆనాడు జరిగిన సంఘటనలను చర్చిస్తూ కూచున్నారు. ఆ సంఘటనలన్నీ ఎప్పుడో గతంలో జరిగిన వాటినిగా భావించి మర్నాటి కర్తవ్యానికై పథకం వేసుకుంటూ భవిష్యత్తును విశ్వాసంతో నిరీక్షించుతున్నారు. వాళ్ల ముఖాలు బడలికగా ఉన్నా, ఆలోచనలు మాత్రం చాలా సాహసికంగా ఉన్నాయి. జరిగిన పనిని సమీక్ష చేసుకున్నప్పుడు, తమపట్ల అసంతృప్తిని వారేమీ దాచలేదు. డాక్టరు సంకోచంతో కుర్చీమీద ఇటూ అటూ జరిగేడు.

"ఈనాడు మనం చేస్తున్న ప్రచారం చాలదు, కార్మికులు చెప్పే ఆ మాట నిజం! మన ఆందోళనయొక్క స్థాయిని పెంచాలి. మన కార్యకర్తలు చెప్పేమాటలు నిజం!"

నికొలాయ్ చిరచిరలాడి, డాక్టరులాగున మాట్లాడ్డం మొదలెట్టేడు.

"కరపత్రసాహిత్యం సరిపోవడం లేదని అందరూ అంటారు కాని, ఇంతవరకూ మనం కాస్త చక్కని ముద్రాణాలయాన్ని నెలకొల్పలేకపోయాం. పాపం లుద్మీలా ఒక్కతే శ్రమపడుతోంది. ఆమెకు కొంచెం సాయం చెయ్యకపోతే, ఆమె పడిపోతోంది."

"మరి వెసొవ్శ్చికోవ్ మాటేమిటి?" అని సోఫ్యా అడిగింది.

"అతడు పట్టణంలో ఉండేందుకు వీల్లేదు. కొత్త ముద్రణాలయాన్ని ప్రారంభించాకే అతని పనికందుకుంటాడు. కాని ప్రారంభించడానికి ముందే మనకింకో మనషి కావాలి."

"ఆ పనికి నేను పనికిరానా?" అని తల్లి మెల్లగా అడిగింది.

ఆ ముగ్గురూ ఒకేసారి నిశ్శబ్దంగా ఒక క్షణం ఆమెకేసి చూశారు.

"అదీ ఒక మంచి ఆలోచనే!" అంది సోఫ్యా.

"నీలొవ్నా! ఆ పని మీకు చాలా కష్టం" అన్నాడు నికొలాయ్ పొడిగా. "మీరు పట్టణం బయట నివసించాలి. అంటే పావెల్‌ని చూడ్డానికి వీలుండదు. మొత్తంమీద..." అని నికొలాయ్ చెప్పబోతుంటే తల్లి నిట్టూర్చి మాటకడ్డొచ్చింది.

"నేను చూడకపోతే పావెల్‌కి నష్టమేమీ లేదు కదా! నిజం చెప్పాలంటే నాకైనా ఈ చూపులు నా ప్రాణానికొక పరీక్షలా వున్నాయి. నన్నతనితో ఏమీ మాట్లాడనివ్వరు అతనికేసి మాటామంతీ లేకుండా చూస్తూ బొమ్మలా నిలబడాలి. అంతలో చెప్పకూడని మాటేమైనా చెప్పిపోతానేమో అన్నట్లుగా వాళ్ల కళ్లన్నీ నా నోటిమీదే ఉంటాయి."

ఇటీవల కొద్దిరోజుల నుండి జరుగుతున్న సంఘటనలతో ఆమె ఆలసిపోయింది. పట్టణానికి కొంచెం దూరంగా ఉండే సావకాశం లభించింది కనుక దాని నుపయోగించుకోవాలనిపించింది.

నొకొలాయ్ మాటతప్పించాడు. డాక్టరుకేసి చూసి:

"ఇవాన్ నీవేమిటి ఆలోచిస్తున్నావు?" అని అడిగేడు.

డాక్టర్ వంచిన తల పైకెత్తేడు.

"మనం ఇంత తక్కువమంది ఉన్నామే అని ఆలోచిస్తున్నాను. మనం యింతకన్న ఎక్కువ ఉత్సాహంతో పట్టుదలతో పనిచేయవలసిన అవసరముంది. పావెల్ అన్‌ద్రేయ్‌లు తప్పించుకు రావలసిన అగత్యాన్ని గురించి వాళ్లకు నచ్చచెప్పాలి. వాళ్ల పనిపాటలు లేకుండా గోళ్లు గిల్లుకుంటూ కూచోవలసినవాళ్లు కారు. వాళ్లు చేయవలసిన అమూల్యమైన కృషి చాలా ఉంది" అని విచారంగా అన్నాడు.

నికొలాయ్ చిరాకుగా తలూపి తల్లికేసి చూశాడు. తన కొడుకును గురించి తన ఎదుట మాట్లాడ్డానికి వాళ్లు సంకోచిస్తున్నారనే సంగతి ఆమె గ్రహించి చటుక్కున లేచి వెళ్లిపోయింది. తన కోరికను వాళ్లు మన్నించలేదని కూడా ఆమెకు కష్టం తోచింది. మంచంమీద పడుకుని, కళ్లు తెరుచుకుని వాళ్ల గుసగుసలను వినేసరికి ఆమెను ఆందోళన ఆవహించింది.

ఆ రోజున గురించి ఆమె తలుచుకునేసరికి కారు మబ్బులగుపడ్డాయి. అంతా చెడుగేముందున్నట్టగుపడింది. ఆమెకా విషయాలను గురించి ఆలోచించాలని లేదు. మనసును చికాకుపరచే భావముద్రలను ఒక పక్కకు నెట్టివేయడానికి ప్రయత్నించింది. పావెల్ మీదనే తన మనసంతా లగ్నంచేసింది. అతడు తప్పించుకొస్తే బాగుండుననుకుంది. కాని అదేసమయంలో భయం కలుగుతోంది. తన చుట్టూ జరుగుతున్న సంఘటనలన్నీ ఒక పతాకస్థాయికి వస్తున్నట్టూ, తీవ్ర సంఘర్షణకు దారితీస్తూన్నట్టూ ఆమెకు తోచింది. ప్రజలు మౌనంగా చూపుతున్న ఓరిమి స్థానంలో ఉద్రేకపూరితమైన నిరీక్షణ ప్రవేశించుతూంది. వాళ్ల కోపం గణనీయంగా హెచ్చింది. ఎక్కడికెళ్లినా తీవ్రమైన మాటలు ఆమె చెవిని బడుతున్నాయి. ఎక్కడ చూసిన అశాంతి ప్రబలమైపోయింది. ప్రతి ప్రకటన గురించీ, బజారుల్లోనూ, దుకాణాల్లోనూ, నౌకర్లలోనూ, పనివాళ్లలోనూ చాలా ఆవేశపూరితమైన చర్చలు జరుగుతున్నాయి. పట్టణంలో అరెస్టు జరిగినప్పుడల్లా వెనువెంటనే దాని కారణం గురించి బెదురుపాటు వాఖ్యానాలూ, గందరగోళపు వ్యాఖ్యానాలూ, ఒక్కొక్కప్పుడు ఆ ప్రయత్నంగా సానుభూతితో కూడిన వ్యాఖ్యానాలూ బయల్దేరేవి. ఒకప్పుడు ఆమె భయపడుతూ విన్న తిరుగుబాటు, సోషలిస్టులు, రాజకీయాలవంటి మాటలను సామాన్య ప్రజలు అలవొకాగా మాట్లాడుకుంటూంటే ఆమె చాలా తరుచుగా వింటోంది.

ఒక్కొక్కప్పుడు తన కొడుకును గురించి ఆలోచించుకుంటుంటే, అతడు వీరగాథల్లోని వీరుని ఉన్నతిలో ఆమెకగుపడేవాడు. తను విన్న అన్ని చక్కని మాటలూ, మనసును ఉద్విగ్నంవేసే అన్ని పలుకులూ, తను ప్రశంసించిన అందరు వ్యక్తులూ, తను ఎరిగిన సర్వ తేజస్సూ,

శౌర్యమూ అన్నీ ఆ మూర్తిలో సాక్షాత్కారమయేవి. అలాంటప్పుడు ఆమె హృదయం గర్వంతోనూ, ఆర్ద్రతతోనూ నిండిపోయేది. అతన్ని గురించి ప్రశాంతమైన ఆనందపారవశ్యంతో ఆలోచించుకుంటూ ఉండేది.

"అన్నీ చక్కగా సర్దుకుంటాయి" అనుకునేది.

కాని ఆమెలోని మాతృత్వం ప్రకోపించి విశాల మహత్తర మానవతా భావాలను అగ్ని హోత్రంలాగున హుతం చేసివేసి, తీవ్రవేదనతో స్పందించుతున్న ఒక్క ఆలోచనను మాత్రమే ఆ పారవశ్యతా భస్మంలో మిగుల్చుతూండేది.

"వాడిని చంపుతారు.... చంపేస్తారు."

ఒకరోజున మధ్యాహ్న సమయంలో ఆమె జైలు కార్యాలయంలో పావెల్ కెదురుగా కూచుని, గెడ్డం పెరిగిన అతని ముఖంకేసి, నీరు కమ్మిన కళ్లతో తదేక ధ్యాసతో చూసింది. వేళ్ల మధ్యన ఉండగా నలిపి ఉంచిన కాగితం ముక్కను అతడి కందివ్వడానికి సమయమెప్పుడా అని ఆమె చూస్తోంది.

"నేను కులాసాగానే ఉన్నాను. మిత్రులంతా కూడా బాగానే ఉన్నారు. నువ్వెలా ఉన్నావు?" అన్నాడు పావెల్ మెల్లగా.

"బాగానే ఉన్నాను. యెగోర్ ఇవానొవిచ్ చచ్చిపోయాడు."

"అలాగా!" అని అతడు మెల్లగా తలొంచుకున్నాడు.

"సమాధి జరిగేటప్పుడు పోలీసులు దెబ్బలాటకొచ్చారు. ఒకడిని అరెస్టు కూడా చేశారు" అంటూ తల్లి అమాయకంగా చెప్పడం మొదలెట్టింది. అసిస్టెంటు జైలరు నాలుక కరుచుకుని గభాలున లేచి నుంచున్నాడు.

"అలాంటి సంగతులు మాట్లాడకూడదని తెలియదుటమ్మా? రాజకీయాలు మాట్లాడకూడదు" అని సణిగేడు.

తల్లి కూడా లేచి నిలబడింది.

"త్వరలో విచారణ ప్రారంభిస్తారా?" అని తల్లి అడిగింది.

"ప్రాసిక్యూటరు ఈ మధ్యనే వచ్చి వెళ్లేడు. విచారణ త్వరలోనే జరుగుతుందన్నాడు..."

వాళ్లిద్దరూ ఏవో సాధారణ ప్రస్తావనలు చేసుకున్నారు. పావెల్ ఎంతో ఆప్యాయంగా తనకేసి తేరిపారచూడ్డం తల్లి గమనించింది. ఎప్పటిలాగే అతడు తొణుకూబెణుకూ లేకుండా నిదానంగా ఉన్నాడు. చేతులు కొంచెం తెల్లబడడం, గెడ్డం బాగా పెరగడం తప్ప అతనిలో పెద్ద మార్పేమీ లేదు. గెడ్డం పెరగడంవల్ల వయసు మళ్లినవాడులా కనబడ్డాడు. అతనికి ఏదో

శుభవార్త చెప్పాలని ఆమె అనుకుంది. నికొలాయ్ సంగతి తెలియచెయ్యాలని అభిలాషపడింది. కనుక ఏమీ ఎరుగట్టుగానే అమాయకంగా:

"ఈ మధ్యనే నీ పెంపుడు కొడుకు కనబడ్డాడు" అంది.

పావెల్ ఎవరా అన్నట్లుగా కళ్లు చిట్లించాడు. వెసొవ్ష్చికోవ్ ముఖంమీది మశూచికపు మచ్చలను గుర్తుకుతెస్తూ ఆమె తన చెక్కిళ్లమీద సౌంజ్ఞ చేసింది.

"ఆ కుర్రాడు బాగానే కాలక్షేపం చేస్తున్నాడు. త్వరలో అతనికొక పని వప్ప చెపుతున్నారు."

పావెల్ ఆ సంకేతాన్ని అర్థంచేసుకుని తలూపేడు. కళ్లలోనే నవ్వు తొణికిసలాడింది.

"చాలా బాగుంది" అన్నాడు.

"ఇంతే సంతులు!" అంది. తను చేసిన పనికామె చాలా సంతృప్తిపడింది. పావెల్ సంతోషంగా ఉన్నందుకు సంతోషించింది.

అతనికి జవాబు చెప్పడానికి మాటరాక మౌనంగా అతడి చెయ్యి గట్టిగా నొక్కింది.

ఇంటికి చేరరడంతోనే సాషా తనకోసం కాసుకు కూచోవడం చూసింది. సాధారణంగా తను జైలుకు వెళ్లొచ్చిన రోజున సాషా తనను చూడ్డానికొచ్చేంది. ఆమె ఎప్పుడూ పావెల్ సంగతి అడిగేది కాదు. తల్లి తనంతట తానే అతడి సంగతి చెప్పకపోతే, తల్లి కళ్లకేసి చిత్రంగా చూసి సంతుష్టిచెందేది. కాని ఈసారి మాత్రం ఆమె రావడంతోనే ఆత్రంగా:

"అతనెలా ఉన్నాడు?" అని అడిగింది.

"బాగానే ఉన్నాడు."

"చీటిని అందిచ్చారా?"

"ఆ! దాన్ని అతని చేతికెల్లా అందిచ్చానో మీరు చూసి ఉండవలసింది!"

"అతడు దాన్ని చదువుకున్నాడా?'

"అక్కడా? అదెలా సాధ్యం?"

"అవునవును. మరిచేపోయాను. మన మొక వారంరోజులు ఆగాలి.... ఆ పూర్తిగా వారం! అతడు ఒప్పుకుంటాడంటారా?"

సాషా ముఖం చెట్లించి, తల్లికేసి రెప్పవాల్చకుండా చూసింది.

"ఆ సంగతి నేను చెప్పలేను... అందులో ప్రమాదం లేకపోతే ఎందుకొప్పుకోడు?" అంది తల్లి.

సాషా తల ఎగరేసింది.

"మీకొక మాట చెపుదామనుకుంటున్నాను... అతడు అంగీకరించడని నా నమ్మకం ఆ విషయమై మీరు అతనితో మాట్లాడి అతన్ని ఒప్పించాలని నేను ప్రాధేయపడుతున్నాను! ఇక్కడ మనకతని అవసరం చాలా ఉంది! మన పనికోసమే అతడు ఇక్కడవసరమని నచ్చచెప్పాలి. అతని ఆరోగ్యాన్ని గురించి కూడా నాకు చాలా భయంగా ఉందని చెప్పండి. ఆ సంగతి మీరే చూస్తున్నారు కదా! ఇంతవరకు విచారణ తేదీ కూడా నిర్ధారణ కాలేదు..."

ఈ మాటలు చెప్పడానికి ఆమె ఎంతో శ్రమపడినట్లు స్పష్టమవుతూనే ఉంది.

నీలొవ్నాను ఈ ఉద్వేగం కలవరపరచింది. ఆమె సాషాను అర్థంచేసుకుని ఆమెను కౌగలించుకుంది.

"అయ్యో నా తల్లీ! అతడు తనకు తోస్తే తప్ప ఎవరి మాటా వినడు కదా! ఎవరి మాటా వినడు" అని విచారంగా చెప్పింది.

"మీరు చెప్పిన మాట నిజమేనమ్మా. ఇది తెలివితక్కువ. నరాల బడలిక" అని కంపిస్తూ చెప్పింది. తర్వాత కుదుటపడి వ్యవహార సరళిలో "సరే.. మనం రోగికి ఏమైనా తిండి పెడదాం" అంది.

ఆమె ఇవాన్ పక్కన కూచుని, తలనొప్పిగా వుందా అని అడిగింది.

"అంతలేదు. కాని ఇంకా అంతా ఏదో అస్పష్టంగా ఉంది. చాలా నీరసంగా ఉంది" అని ఇవాన్ జవాబుచెప్పేడు. తత్తరపాటుతో దుప్పటి పైకి లాక్కున్నాడు.

అతడి నీలికళ్లు ఉల్లాసంగా ఉన్నాయి. చిన్న పళ్లవరుస అందంగా ఉంది. కంఠస్వరం ఇంకా మార్పుచెందుతోంది.

"నీకెన్నేళ్లు?" అని తల్లి అతన్నడిగింది.

"పదిహేడు"

"తల్లిదండ్రులెక్కడున్నారు?"

"గ్రామంలో. నాకు పదేళ్లొచ్చినప్పటి నుంచీ నేనిక్కడే ఉంటున్నాను. స్కూలు వదిలిపెట్టడంతోనే ఇక్కడ కొచ్చేశాను. మీ పేరేమిటి, కామ్రేడ్?"

ఎవరైనా "కామ్రేడ్" అని తన్ను పిలిస్తే తల్లికి సరదాగా వుండేది, పట్టరాని సంతోషం కలిగేది.

"నా పేరు నీకెందుకు?" అని చిరునవ్వుతో అతడి నడిగింది.

అతడు కొంచెం ఇరుకునపడి తటపటాయిస్తూ ఇలా చెప్పేడు:

"చూశారా? మా అధ్యయన బృందంలోని విద్యార్థి ఒకడు అంటే మాకు చదువు చెప్పే అతడు కార్మికుడైన పావెల్ వ్లాసొవ్ తల్లిని గురించి చెప్పేడు. మే ఒకటవ తేదీన జరిగిన ప్రదర్శన జ్ఞాపకముందా?"

తల్లి వెంటనే తలూపింది.

"మన జండాను వీధుల్లో ఊరేగించినప్పుడు ముందు నిలబడినవాడతనే" అని ఆ పిల్లవాడు సగర్వంగా ప్రకటించాడు. ఆ గర్వం తల్లి హృదయంలో ప్రతిధ్వనించింది.

"నేనప్పుడక్కడ లేను. మా ప్రదర్శనాన్ని మేము వేరుగా చెయ్యాలనుకున్నాం. కాని అది సాగలేదు. మేము చాలా కొద్దిమందిమైపోయాం. మళ్లీ సంవత్సరం మేం తప్పకుండా చేస్తాం, మీరు చూస్తారుకదా!"

ముందు సంగతి తల్చుకునేసరికి అతనికి సరిగా ఊపిరి ఆడలేదు.

"ఇదిగో, ఆ వ్లాసొవ్ తల్లిని గురించే నే చెప్తున్నది... దాని తర్వాత ఆమె పార్టీలో చేరింది కూడా. ఆమె చాలా అద్భుతమైన మనిషని అంటారు!" అని చెమ్చాను ఆడించుతూ ముగించాడు.

తల్లి నోరారా చిరునవ్వు నవ్వింది. ఆ పిల్లవాడి పొగడ్త వినడానికి ఆనందంగానే ఉంది. కాని కొంచెం బాధగా మాత్రం తోచింది. "నేనే ఆ వ్లాసొవ్ తల్లిని" అని చెప్పాలనుకుంది. కాని తటపటాయించి తనలో తానే కొంచెం వెటకారంగా "తెలివితక్కువ ముసలమ్మవు. అంతే" అనుకుంది.

"ఇదిగో, ఇంకా కొంచెం తిను. మన మంచి పనికోసం నువ్వు తొందరగా కోలుకోవాలి" అని చటుక్కున ఆందోళనగా అతని శరీరం మీదకు వంగి చెప్పింది.

ఇంతలో వీధితలుపు తెరుచుకుంది. తేమగా చల్లని శరత్కాలపు నిశ్వాస లోపలికి చొరబడింది. సోఫ్యా చిరునవ్వుతో గులాబి పువ్వులా నిలబడి ఉండడం తల్లి చూచింది.

"అబ్బ! ఏమి చెప్పమంటారు! గూఢచారులు నావెంట పడుతున్న పద్ధతి చూస్తే, నేనొక ధనికురాలైన పెళ్లికూతురు కాబోలనుకుంటారు మీరు. నేనింక వెళ్లిపోవాలి... ఇవాన్ ఎలా ఉన్నావు? బాగా ఉన్నావా?....నీలొవ్నా, పావెల్ కబుర్లేమిటి?... సాషా ఇక్కడుందా?"

తన బూడిదెరంగు కళ్లతో ఆమె తల్లికేసీ, పిల్లవానికేసీ చాలా ఆప్యాయంగా చూసింది. ఒక సిగరెట్టు ముట్టించి, జవాబులొస్తాయని ఆశించకుండానే ప్రశ్నలడిగింది. తల్లి ఆమెను గమనిస్తూ చిరునవ్వు నవ్వింది.

"నన్ను కూడా ఈ మంచివాళ్లందరిలోనూ ఒకదాన్నిగా లెక్క వేసుకుంటున్నారు!" అని అనుకుంది.

తర్వాత ఆమె భోజనాలగదిలో కెళ్లింది. అక్కడ సోఫ్యా సాషాతో మాట్లాడ్డం చూసింది.

"ఆమె అప్పుడే మూడు వందల కాపీలు తయారుచేసింది. ఆమె పనిచేస్తే ఆత్మహత్య చేసుకున్నట్లే అవుతుంది. చాలా గొప్పగా చేస్తోందిలే. సాషా! అలాంటి మనుషులతో తిరుగుతూ వాళ్లతో కలసి పనిచెయ్యడం చాలా గొప్ప అదృష్టం సుమండీ!"

"నిస్సందేహంగా!" సాషా మెల్లగా జవాబు చెప్పింది.

ఆరోజు సాయంకాలం టీ తాగేటప్పుడు సోఫ్యా తల్లికేసి తిరిగి: "నీలొన్నా! మీరు మరొకసారి పల్లెటూళ్లు తిరిగిరావలసుంటుంది" అని చెప్పింది.

"ఈసారి మీరు తపాలా గుర్రపుబండిలో ప్రయాణం చెయ్యాలి. మరొక దారిని వెళ్లాలి. నికోల్స్కాయె ప్రాంతం మీదుగా వెళ్లాలి'' అన్నాడు నికొలాయ్. అతడు రుసరుసలాడుతున్నాడు. సాధారణంగా అతడలాటి స్వభావం కలవాడు కాడు.

"నికోల్స్కాయె ద్వారా వెళ్లడం దూరమే... పైగా, గుర్రాలను అద్దెకు తీసుకోవడం ఖర్చు ఎక్కువ..." అంది తల్లి.

"నిజం చెప్పాలంటే, నేనీ ప్రయాణానికి వ్యతిరేకిని. అక్కడ వ్యవహారాలేమీ సాఫీగా లేవు. కొన్ని అరెస్టులు జరిగాయి. ఎవరో ఒక ఉపాధ్యాయుణ్ణి పట్టుకున్నారుట. మనం ఇంకా కొంచెం జాగ్రత్తగా ఉండాలి. కొంత కాలం ఆగితే బాగుంటుందేమో?"

"వాళ్లకు మనం నిరంతరం సాహిత్యాన్ని అందిస్తూనే ఉండాలి" అంది సోఫ్యా, బల్లమీద వేళ్లతో చప్పుడు చేస్తూ. "మీకేమైనా వెళ్లడానికి భయమేస్తోందా, నీలొన్నా?" అని గభాలున తల్లి నడిగింది.

తల్లి నొచ్చుకుంది.

"నేనెప్పుడైనా భయపడ్డానా? మొదటిసారి వెళ్లినప్పుడే నేను భయపడలేదు కదా! ఇప్పుడు మీరెందుకు" అని వాక్యాన్ని ముగించకుండానే తలొంచుకుంది.

"నేను భయపడుతున్నానా అనిమీరు నన్నడగడమెందుకు? మీరు ఒకళ్ల నొకళ్లు ఆవిధంగా ప్రశ్నించుకోరుకదా? అని ఆమె గద్గదస్వరంతో అడిగింది.

నికొలాయ్ తన సోదరిని తదేక దీక్షతో చూస్తూ సులోచనాలను తీసి మరల ధరించాడు. ఎబ్బెట్టుగా ఉన్న వాళ్ల మౌనాన్ని భరించలేక తల్లి ఏదో తప్పుచేసినట్లుగా లేచి నిలబడి ఏవో కొన్ని మాటలు చెప్పబోయింది. సోఫ్యా ఆమె చేతిని పట్టుకుని ఆపుచేసింది.

"క్షమించండి. ఇక ముందెప్పుడూ ఇలాంటి పొరపాటు చెయ్యను" అని మెల్లగా చెప్పింది.

తల్లి ముఖంమీద చిరునవ్వు తొణికిసలాడింది. కొద్ది నిమిషాల్లో వాళ్లు ముగ్గురు హడావిడిగా జరగాల్సిన ప్రయాణం సంగతి చర్చించుకుంటున్నారు.

* * *

అరుణోదయం వేళ తల్లి శరత్కాలవర్షాల వల్ల గతుకులు పడిన రోడ్డుమీద తపాలా బగ్గీలో ఊగిసలాడుతూ ప్రయాణం సాగిస్తోంది. ఈదర గాలి విసురుగా వీస్తోంది. అందరి చేతులమీదా బురద చిందుతోంది. బండివాడు తన స్థానం లోంచి వెనక్కి తిరిగి ముక్కుమాటతో ఆమెతో ఫిర్యాదు చేశాడు:

"మా అన్నయ్యతో చెప్పేను. ఏమనంటే మనం పంచుకుందామని. కనుక పంచుకోవడం మొదలెట్టేం...." గభాలున కొరడాతో దాపటి గుఱ్ఱానికొక చురకేశాడు. కోపంతో అరుస్తూ, "ఏయ్ మాయదానా నడు!" అని అదిలించాడు.

ఆకురాలు కాలపు బలిసిన కాకులు ఖాళీగా ఉన్న నాగటిచాళ్ల మీద గంతులేస్తున్నాయి. శీతగాలి రయ్యిమని వీస్తోంది. గాలి దెబ్బల నెదుర్కోవడానికి కాకులు దృఢంగా నిలబడ్డాయి. గాలి వాటి రెక్కల నెగరగొట్టి పైకి లేవనెత్తుతుంటే బలవంతంగా రెక్కలను తపతప కొట్టుకుంటూ బద్ధకంగా మరొక చోటికి చేరుకుంటున్నాయి.

బండివాడు తన సోద మళ్లీ మొదలెట్టేడు:

"ఆ మీద మా అన్నయ్య నా వాటాను కాజేశాడు. కనుక ఇక నాదన్నదేమీ లేదు.."

తల్లి అతడి సొదనంతటినీ కలలో లాగున వింది. గడచిన కొద్ది సంవత్సరాల సంఘటనలు ఆమె స్మృతిపథాని కొచ్చాయి. వాటన్నిటిలోనూ తాను జోరుగా పనిచేస్తున్నట్లామె కగుపడింది.

స్టేషను చేరగానే బండివాడు గుఱ్ఱాలను విప్పేశాడు.

"తాగడానికొక అయిదు కోపెక్కులియ్యండి" అని తల్లిని బతిమాలుకున్నాడు.

ఆమె ఇచ్చిన నాణేన్ని అతడు అరచేతిలో ఎగరేసి ఆడించాడు.

"మూడు సారాకి పోతాయి. రెండు రొట్టెకి..." అన్నాడు.

మధ్యాహ్నం తల్లి చాలా అలసిపోయి, చలితో వణుకుతూ పెద్ద గ్రామమైన నికోల్స్కొయె చేరుకుంది. ఒక గ్లాసు టీ తాగాలని స్టేషన్‌లో కెళ్లి కిటికీ పక్కనే కూచుంది. బరువుగా ఉన్న పెట్టెను బల్లకింద పెట్టుకుంది. కిటికీలోంచి చూస్తుంటే ఎదుట చిన్న మైదానం కనబడింది.

గభాలున ఒక పోలీసు సార్జెంటు గుఱ్ఱం మీద దౌడు తీస్తూ మైదానంమీద కొచ్చి ప్రభుత్వ కార్యాలయం దగ్గర ఆగేడు. కొరడాను గాలిలో ఝుళిపించి, రైతుమీద కేకలేశాడు.

మళ్లీ అంతా నిశ్శబ్దమైపోయింది. రెండుసార్లు గుర్రం గిట్టలతో మెత్తటి నేలను తవ్వింది. పసుపుపచ్చని జుట్టని పొట్టిజడగా ధరించి, గుండ్రని ముఖం, ఆర్ద్రమైన కళ్లూ గల పదమూడు పధ్నాలుగేళ్ల యువతి తల్లి కూచున్న గదిలో కొచ్చింది. సొట్టలు పడిన పళ్లెంనిండా తినబండారాల ప్లేట్లను పేర్చుకుని పెదవులు కరుచుకుని తలూపుతూ ప్రవేశించింది.

“అమ్మాయీ! నీకు మేలగుగాక!” అని తల్లి ఆమెను పలకరించింది.

“నమస్కారం!”

ఆమె టీ సరుకులన్నిటినీ బల్లమీద పెట్టి హఠాత్తుగా ఆవేశంతో,

“వాళ్లొక దొంగను పట్టుకున్నారు. ఇప్పుడే ఇక్కడికే తీసుకొస్తున్నారు!” అని చెప్పింది.

“ఎవరతను?”

“అతను ఎవరి సొత్తును దొంగిలించాడు?”

“అది నాకు తెలియదు. వాళ్లు అతన్ని పట్టుకున్నారని మాత్రమే నాకు తెలుసు. పోలీసు అధికారిని తీసుకు రావడానికి కాపలా మనిషి వెళ్లేడు.”

తల్లి కిటికీలోంచి తదేక ధ్యాసతో చూసింది. మైదానంమీద రైతులు చేరుతుండడం గమనించింది. కొందరు నిదానంగా మందకొడిగా చేరుకుంటున్నారు.

ఆమె వసారాలో కెళ్లేసరికి శీతగాలి విసురుగా వచ్చి కళ్లమీదా, గుండెలమీదా కొట్టినట్లయింది. ఊపిరి తీసుకోలేక ఉక్కిరిబిక్కిరైంది. కాళ్లు తడబడ్డాయి. మైదానానికి అడ్డంపడి రీబిన్ వచ్చాడు. అతని చేతులు వెనక్కు విరగదీసి కట్టబడున్నాయి. ఇరుపక్కలా పోలీసులు నేలమీద కర్రలను తాటిస్తూ నడుస్తున్నారు. గుంపులుగా జనం వసారా కెదురుగా నిశ్శబ్దంగా కాచుకు నిలబడ్డారు.

తల్లి నిశ్చేష్టురాలై తన చూపును అటువైపు నుండి మరల్చడానికి శక్తిలేక అలా చూస్తూ నిలబడిపోయింది. రీబిన్ ఏదో మాట్లాడుతున్నాడు. అతని కంఠస్వరమైతే ఆమెకు వినబడుతోంది. కాని అంధకార బంధురమైన ఆమె శూన్యహృదయానికి మాటలందడంలేదు.

ఆమె దీర్ఘంగా నిట్టూర్చి మనసును కుదురుపరుచుకుంది. వసారా దగ్గర విశాలమైన నీలి నేత్రాలుగల రైతు నిలబడున్నాడు.

“ఏం జరిగింది?” అని కష్టంమీద అతడి నడిగింది.

“మీరే చూడండి” అని జవాబుచెప్పి అతడు వెళ్లిపోయాడు. మరొక రైతొచ్చి ఆమె పక్కన నిలబడ్డాడు.

రీబిన్‌ను తీసుకొస్తున్న పోలీసులు గుంపుకెదురుగా ఆగిపోయారు. గుంపు క్రమక్రమంగా పెరుగుతోంది. కాని ప్రజలు మాత్రం నిశ్శబ్దంగా ఉన్నారు. హఠాత్తుగా రీబిన్ కంఠం పైకి లేచింది.

"సోదరులారా! మన రైతుల జీవితంయొక్క వాస్తవికతను విశదపరచే కరపత్రాలను గురించి మీరు విన్నారా? సరే కానివ్వండి. ఆ కరపత్రాల కారణంచేతనే నేనీ శిక్షనను భవిస్తున్నాను. నేనే వాటిని ప్రజల్లో వ్యాప్తం చేశాను!"

జనం రీబిన్‌కు దగ్గరగా చేరేరు. అతని కంఠధ్వని ప్రశాంతంగా తొణుకూ బెణుకూ లేకుండా ఉంది. దానితో తల్లికి బాగా స్పృహ వచ్చింది.

"విన్నావా ఆ సంగతి?" అని రెండవ రైతు నీలి నేత్రాల రైతునొక పోటు పొడిచి మెల్లగా అడిగేడు. అతడు తల పైకెత్తి, జవాబు చెప్పకుండానే తల్లికేసి తేరిపారజూశాడు.

"సత్పురుషులారా! చూడండి!..."

"నోర్మూయ్!" అంటూ సార్జెంటు అతడి గూబమీద ఒక్క దెబ్బ కొట్టేడు. రీబిన్ అదిరిపోయాడు, భుజాలను కుంచించుకున్నాడు.

"వాళ్లు మనిషిని చేతులు వెనక్కు విరిచికట్టి ఏపనైనా చేస్తారు..."

"ఏయ్ పోలీసులూ! వీణ్ణి తీసుకుపొండి. ఏమర్రోయ్ జనం, ఇళ్లకు పొండి! ఎముకను కరుచుకున్న కుక్కలాగ సార్జెంటు, రీబిన్ ఎదుట గంతులేస్తూ రీబిన్ని ముఖంమీద, గుండెలమీద పొట్ట మీద పిడికిలితో పొడిచాడు.

ఎవరో గుంపులోంచి,

"అతడిని కొట్టడం మానెయ్యి!" అని కేకేశాడు.

అతన్నెందుకలా కొట్టడం?" అని ఇంకొకరు వత్తాసు పలికారు.

"మనం పోదాం పద" అంటూ నీలి నేత్రాల రైతు తన స్నేహితుడికి సౌంజ్ఞ చేశాడు. వాళ్లిద్దరూ నెమ్మదిగా జారిపోయారు. తల్లి వాళ్లను దయార్ద్ర దృష్టులతో అనుసరించింది. పోలీసు సార్జెంటు మోటుగా వసారా మెట్లెక్కడంతోనే ఆమె హమ్మయ్య అనుకుని నిట్టూర్పు విడిచింది.

"వాడినిక్కడికి తీసుకురా! నా తడాఖా చూపిస్తాను!" అని అరుస్తూ సార్జెంటు పిడికిలి ఝూడించాడు. జనంలోంచి బిగ్గరగా:

"ఆ పని చెయ్యకు" అనే దృఢ స్వరం వినవచ్చింది. నీలి నేత్రాల రైతే ఆ మాటనడం తల్లి చూచింది.. "సోదరులారా! అతడిని తీసుకుపోనివ్వకండి! తీసుకెళ్లనిస్తే వాళ్లు అతన్ని చచ్చే దాకా కొడతారు. అప్పుడా పని మనమే చేశామంటారు. తీసుకెళ్లనివ్వకండి!"

"రైతులారా!" అంటూ రీబిన్ బిగ్గరగా గొంతెత్తేడు. "మీ జీవితాలెలా ఉన్నాయో మీరు చూడలేకపోతున్నారా? వాళ్లు మీ సొత్తు నెలా దొంగిలించి, దగాచేసి మీ రక్తాన్నెలా

పీలుస్తున్నారో మీకు కనబడ్డంలేదా? సర్వమూ మీ దగ్గర్నుంచే వస్తుంది. ప్రపంచంలో మీ శక్తి అన్నిటికన్న గొప్పది కాని మీకున్న హక్కులేమిటి? ఆకలి బాధతో చావడమే మీకున్న హక్కు!"

హఠాత్తుగా రైతులు ఒకరి మాటకొకరు అడ్డొస్తూ కేకలెయ్యడం ప్రారంభించారు:

అతను నిజం చెబుతున్నాడు.

ఈ కంఠధ్వనులన్నిటినీ ముంచేసేటంత బిగ్గరగా ఖంగుమనే గొంతుకతో రీబిన్ ఇలా అన్నాడు:

"ఈ తాళ్లు నా చేతులకు బాధని కలిగిస్తున్నాయి. రైతు మిత్రుల్లారా! నేను పారిపోను. నేను సత్యాన్ని తప్పించుకుని దాక్కోలేను. సత్యం నాలోనే నివసిస్తోంది!"

కొంతమంది మనుషులు గుంపులోంచి తప్పుకుని, పక్కగా నిలబడి, తలలూపుతూ ఏవో మాటలంటున్నారు. కాని చాలామంది చినిగిన గుడ్డలు ధరించినవారు ఆవేశంతో పరుగులెత్తుకుంటూ వచ్చి గుంపులో చేరేరు. వాళ్లంతా రీబిన్ చుట్టూ హడావిడి పడుతూ చేరేరు. వాళ్ల మధ్య అతను అడవిలో దేవాలయంలాగున నిలబడి చేతులు పైకెత్తి ఆడిస్తూ బిగ్గరగా మాట్లాడేడు:

"ధన్యవాదాలు! సత్పురుషుల్లారా, మీకు ధన్యవాదాలు! మనం ఒకళ్ల చేతులకున్న బంధనాలను ఇంకొకరు ఛేదించుకోకపోతే, మనకా పని ఇంకెవరు చేస్తారు?"

అతడు తన గెడ్డాన్ని తుడుచుకుని రక్తసిక్తమైన చేతిని పైకెత్తేడు.

"ఇదిగో నా రక్తం... సత్యంకోసం నేను దీని నోడ్చేను!"

తల్లి వసారా మెట్లు దిగింది. గుంపులో ఉన్న రీబిన్‌ని ఆమె చూడలేకపోవడం చేత మళ్లీ వసారాపైకెక్కింది. ఆమె హృదయంలో ఏదో అనిర్వాచ్యమైన సంతోషం రెపరెప కొట్టుకుంది.

"రైతు సోదరుల్లారా! ఆ కరపత్రాల కోసం ఎదురుచూడండి! వాటిని చదవండి! ఈ కరపత్రాల్లోని ప్రచారం చేసేవారంతా దేవునియందు నమ్మకంలేని వారనీ, తిరుగుబాటు దారులనీ చెప్పే మతగురువుల, అధికారుల మాటల్నీ నమ్మకండి. సత్యం భూమి మీద రహస్యంగా సంచారం చేస్తోంది. ప్రజల్లో గూడు కట్టుకుని నివసించాలని కాంక్షిస్తోంది. అధికారులకు మాత్రం అది నిప్పులాంటిది. ఖడ్గంలాంటిది. వాళ్లు సత్యాన్ని ఒప్పుకోలేరు. సత్యం వాళ్లని ఖండించేస్తుంది, దహించేస్తుంది! మీకు మాత్రం సత్యం చాలా గొప్ప మిత్రుడులాంటిది. వాళ్ల పాలిట ప్రబలమైన శత్రువు. అంచేతనే అది భూమిమీద రహస్యంగా సంచారం చేస్తోంది!"

మరొకసారి ప్రజల్లోంచి రకరకాల హాహాకారాలు రేగేయి:

"సోదరులారా! వినండి!"

"సోదరా! నీవు చాలా అధమస్థితిలో పడిపోతావు కదా!"

"నిన్ను పోలీసులకు పప్పచెప్పిందెవరు?"

"మత గురువు!" అని ఒక పోలీసు జవాబు చెప్పేడు.

ఇద్దరు రైతులు కసితీరా గట్టిగా తిట్టేరు.

"జాగ్రత్తగా చూసుకోండర్రా!" అని ఎవరో హెచ్చరించారు.

పోలీసు ప్రధానాధికారి గుంపుకేసి వస్తున్నాడు. అతడు పొడుగ్గా లావుగా ఉన్నాడు. గుండ్రని ముఖం. అతడు తన టోపీని ఒక చెవిమీదకు ఒరిగేట్టు ధరించాడు. ఒకవైపు మీసం పైకి మెలేశాడు, అంచేత అతని ముఖం మీదెప్పుడూ ఆనందరహితమైన చిరునవ్వు కనబడుతుంది. ఎడమ చేత్తో కత్తిని పట్టుకున్నాడు. కుడి చేత్తో జోరుగా సౌంజ్ఞలు చేస్తున్నాడు. వచ్చేటప్పుడు ఆయన అడుగుల చప్పుడు ఖచ్చితంగా అందరూ విన్నారు. జనం పాయగా చీలి అతనికి దారిచేశారు. నీళ్లు భూమిలో ఇంకిపోయినట్లు, జనం గోలంతా అణిగిపోయింది. అందరి ముఖాల్లోనూ కోపం కనబడింది. తల్లికి కళ్లు మండుతున్నట్లనిపించింది, నుదుటి కండరాలు అదిరినట్లనిపించింది. ఆమె మళ్లీ గుంపులో చేరాలనుకుంది. ముందుకు వంగి నరాలు బిగపట్టుకుని కదలకుండా నిలబడింది.

పోలీసు ప్రధానాధికారి రీబిన్ ముందర నిలబడి అతన్ని గర్వంగా చూశాడు.

"ఇదంతా ఏమిటి? అతని చేతులెందుకు కట్టెయ్యలేదు? ఏయ్! కట్టెయండి!" అన్నాడు.

అతను గట్టిగా ఖంగుమనేట్టు మాట్లాడేడు. కాని అందులో ఏ భావమూ కనబడలేదు.

"కట్టేం. జనం విప్పేశారు" అని ఒక పోలీసు జవాబు చెప్పేడు.

"ఏమిటీ? జనమా? ఏ జనం?"

పోలీసు అధికారి తన ఎదుట అర్ధచంద్రాకారంగా నిలబడ్డ గుంపుకేసి తీక్షణంగా చూశాడు.

"జనమా? ఎవరు వాళ్లు?" అని కంఠస్వరంలో ఏ హెచ్చుపూ లేకుండా ప్రశ్నించాడు. అతను నీలి నేత్రాల రైతును, కత్తి పిడితో తాకాడు.

"చుమకోవ్, జనమంటే నువ్వేననుకుంటానేం? ఇంకా ఎవరు? మీషిన్, నువ్వు కూడానా?" కుడి చేత్తో ఒకరిని గడ్డం పట్టుకుని లాగి: "మీరు వెంటనే వెళ్లిపోవడం మంచిది. లేదంటారా, లంజాకొడుకుల్లారా! మీకు గట్టిగా తగిలిస్తా. నా తడాఖా చూపిస్తా!" అన్నాడు.

చటుక్కున అతడు రీబిన్ ముఖంమీదొక దెబ్బ కొట్టేడు.

"పిడికిలితో సత్యాన్ని హత్య చెయ్యలేవు" అని రీబిన్ బిగ్గరగా అరిచాడు. "ఓరి కుళ్లు కుక్కా! నన్ను కొట్టడానికి నీకు హక్కు లేదుసుమా!" అని అతడి మీద కెల్లి చెప్పేడు.

"నాకు హక్కు లేదూ? నాకు?" అంటూ పోలీసు అధికారి మొరిగేడు.

రీబిన్ తలమీద కొట్టడానికి గురిచూసి పోలీసు తన పిడికిలిని విసురుగా ఎత్తేడు. రీబిన్ గభాలున తప్పుకునేసరికి దెబ్బ తప్పిపోయింది. పోలీసు అధికారి దాదాపుగా పల్టీ కొట్టినంతపనైంది. జనంలోనుంచి ఎవరో బుస కొట్టేరు. మరల ఆగ్రహంతో కూడిన రీబిన్ కంఠధ్వని మోగింది.

"నా ఒంటిమీద చెయ్యేశావంటే జాగ్రత్త! ఏయ్ దెయ్యం!"

పోలీసు అధికారి వత్తుగా ఆగ్రహంతో మీదకు చుట్టుకొస్తున్న జన సమూహాన్ని పరిశీలనగా చూశాడు.

"నికీత! వాడి గూబమీద ఒక్క దెబ్బ ఇచ్చుకో గట్టిగా వెయ్యాలి సుమా!" అని నిదానంగా మీసాలు మెలేసుకుంటూ పోలీసాఫీసరు ఆజ్ఞాపించాడు.

ఆ రైతు ముందుకొచ్చి రీబిన్ ముందర నిలబడి తల పైకెత్తేడు. రీబిన్ అతడి ముఖంమీదికి మాటలు సూటిగా విసిరేడు:

"సోదరులారా! చూడండి. ఈ పశువులు మన చేతుల్తో మన గొంతుక నులిమేస్తున్నారు! బాగా చూడండి! జాగ్రత్తగా ఆలోచించుకోండి! అన్నాడు.

రైతు నెమ్మదిగా చెయ్యెత్తి రీబిన్ తలమీద మెల్లగా ఒక దెబ్బ కొట్టేడు.

"లంజకొడకా! అల్లాగేరా కొట్టడం?" అని అరిచాడు. కాని నికీత తలొంచుకుని ఇవతల కొచ్చేశాడు.

"ఏయ్ నికీత! దేవుడున్నాడనే మాట మరచిపోకు!" అని గుంపులోంచి ఎవరో కేకేశాడు.

పోలీసాఫీసరు వెనకనుంచి నికీత మెడ పట్టుకుని,

"కొట్టు! నేను చెప్తున్నాను. కొట్టు!" అని అరిచాడు. కాని నికీత తలొంచుకుని ఇవతల కొచ్చేశాడు.

"ఈ చేసిన పని చాలు" అని అతడు గొణుక్కున్నాడు.

"ఏమిటీ?"

పోలీసు అధికారి ముఖం కోపంతో కందగడ్డ అయింది. బూటు కాలితో నేలమీద ఒక్క చరుపు చరిచి తిడుతూ రీబిన్‌మీద కురికేడు. ఠప్‌మని ఒక్క దెబ్బ కొట్టేసరికి రీబిన్‌కి తల తిరిగింది. అతడు కూడా చెయ్యేత్తేడు. కాని రెండో దెబ్బ తగిలేసరికి కింద పడిపోయాడు. పోలీసు అధికారి అతన్ని తలమీద, గుండెలమీద, పక్కలోనూ బూటుకాలితో తన్నడం మొదలెట్టేడు.

జనంలోంచి కోపఘూర్ణితమైన గొణుగుడు లేచింది. జనం పోలీసుమీద కొత్తుకురావడం ప్రారంభించారు. అతనా సంగతి గ్రహించి ఒరలోంచి కత్తి దూసి ఝళిపిస్తూ వెనుక్కు గంతేశాడు.

“ఏమిటిది? తిరుగుబాటా? ఆహా, అదన్నమాట సంగతి!”

అతని కంఠధ్వని వణికింది. మాటసరిగా రాలేదు. కీచుమన్నాడు. కాని ప్రయోజనం లేకపోయింది. మాట రాలేదు. బలం కూడా ఉడిగింది. తల ఒరిగింది. భుజాలు పట్టుడిగిసడలిచ్చాయి. నాలుగు వైపులా చూసుకుంటూ, వెనక్కెల్లిపోయాడు.

“సరే బాగానే ఉంది.... అతన్ని తీసుకుపొండి. నే వెళ్లిపోతున్నాను. చెప్పేమాట వినండి, లంజకొడకల్లారా! వాడు రాజకీయ నేరస్థుడనే సంగతి మీకు తెలియదా? జార్ చక్రవర్తి మీద వాడు తిరుగుబాటు చెయిస్తున్నాడని మీరెరగరా? అలాంటి వాడికి మీరు రక్షణనిస్తున్నారు! అంటే మీరు కూడా తిరుగుబాటుదారులే అన్నమాట! అంతేనా?” అని అతడు బొంగురుపోయిన గొంతుకతో అరిచాడు.

తల్లి కదలకుండా అలాగే నిలబడిపోయింది. బలమంతా ఉడిగిపోయింది. మనసంతా శూన్యమైపోయింది. భయం, జాలీ ఆమెను నిశ్చేష్టురాలిని చేశాయి.

“అతడు నేరస్థుడైతే, కోర్టుకు తీసుకెళ్లు!...”

“అతన్ని కొంచెం అనుగ్రహించండి, దొరా!”

“నిజమంతే. ఏ చట్టమూ అలాటి దౌర్జన్యాన్ని సహించదు!”

“సందేహమేమిటి? అలాటి చట్టమే ఉంటే ఎవరైనా ఎవరినైనా కొట్టెయ్యవచ్చు. బలే సంగతే!...”

జనం రెండు గుంపులుగా విడిపోయారు. ఒక గుంపు పోలీసు అధికారిని చుట్టుముట్టేరు. కొందరు కేక లెట్టేరు. కొందరు వాదించారు. రెండవ గుంపు తక్కువమంది నేలమీద సాచుకు పడిపోయిన మనిషి చుట్టూ చిరాకుతో గొణుక్కుంటున్నారు. చిన్న గుంపులోని జనం రీబిన్‌ను లేవదీయడానికి సాయపడ్డారు. పోలీసువాళ్లు మళ్లీ అతని చేతులు కట్టెయ్యడానికి ప్రయత్నిస్తుంటే:

“దెయ్యాల్లారా! తొందర పడకండి!” అని కేకలేశారు.

రీబిన్ తన ముఖంమీదా గడ్డంమీదా ఉన్న మట్టినీ, రక్తాన్నీ తుడుచుకుని మాట్లాడకుండా నాలుగు వైపులా చూశాడు. అతని దృష్టి తల్లిమీద పడింది. ఆమె అదిరిపడి అతని వైపుకు వంగి అప్రయత్నంగా చెయ్యి వూపింది. కాని అతను తల పక్కకు తిప్పేశాడు.

కొద్ది నిముషాలైన తర్వాత అతని కళ్ళు ఆమె ముఖంకోసం వెతుకుతున్నట్లనిపించింది. అతను లేచి తల పైకెత్తేసరికి రక్తపు మరకలుగల చెక్కిళ్ళు కంపించినట్లు కనుపించింది.

"అతను నన్ను గుర్తు పట్టేడు నిజంగా పట్టి ఉంటాడా అని?" అనుకుంది.

విపరీతమైన ఆసక్తితో వణికిపోతూ ఆమె తలూపింది. మరుక్షణంలోనే, నీలి కళ్ల రైతు తన పక్కనే నిలబడి తనకేసి చూస్తున్నట్లామె గుర్తించింది. ఒక్క నిముషం పాటు అతని దృష్టి ఆమెకు చాలా భయం కలిగించింది.

"నేనేం చేస్తున్నట్లు? వాళ్లు నన్ను కూడా పట్టుకుపోతారు!"

ఆరైతు రీబిన్‌తో ఏదో చెప్పేడు. అతను తలూపేడు.

"సరే, బాగానే ఉంది... ఈ భూమిమీద నేనొక్కడినే కాదు! వాళ్లొక్క సారిగా సత్యాన్నంతనీ ఎన్నడూ బంధించలేరు. నేనెక్కడి కెళ్లిపోయినా నా స్మృతి ఉండనే ఉంటుంది. గూటినంతటినీ ఛిన్నాభిన్నం చేసి పారేసినా... కామ్రేడ్సునందర్నీ బంధించినా..." అన్నాడు రీబిన్. వణుకుతున్నా, అతని కంఠం స్పష్టంగా ధైర్యంగా ఉంది.

"ఈ మాటలన్నీ నాకే చెపుతున్నాడు" అని ఊహించుకుంది తల్లి.

"కాని గరుడపక్షులు స్వేచ్ఛగా ఎగిరే రోజొస్తుంది జనం తమ సంకెళ్లను బద్దలు కొట్టేసుకుంటారు!"

ఒక స్త్రీ చెంబుతో నీళ్లు పట్టుకొచ్చి ఏడుస్తూ రీబిన్ ముఖం కడిగింది. ఆమె బిగ్గరగా ఏడుస్తూ ఉండడంవల్ల రీబిన్ మాటలందులో లీనమైపోయాయి. కనుక తల్లి వాటిని వినలేపోయింది. పోలీసు ప్రధానాధికారిని ముందు పెట్టుకుని కొందరు రైతులక్కడి కొచ్చారు.

ప్రజల కేకలు వేడుకోలు ధోరణిలో రాజీకి అనుకూలంగా ఉన్నాయి. అవన్నీ అస్పష్టమైన రొదగా ఉన్నాయి. అశాజనకంగా లేవు. పోలీసులు రీబిన్ చేతులు పట్టుకుని నెమ్మదిగా ఆఫీసు మెట్లెక్కించి లోపలికి తీసుకెళ్లేరు. రైతులు ఒక్కరొక్కరే వెళ్లిపోయారు.

పాతికమంది రైతులు టోపీలు తీసేసి ఆ మాటలు వింటూ నిలబడ్డారు. మబ్బులు కిందికి వాలినకొద్దీ, చీకటి ముదరసాగింది. నీలి కళ్ల రైతు తల్లి నిలబడున్న వసారాలో కొచ్చి,

"ఏం జరుగుతోందో చూశావా?" అన్నాడు.

"ఆహా" అంది తల్లి మెల్లగా.

"ఇక్కడేమి పనిచేస్తున్నావు?"

"రైతుల ఆడవాళ్ల దగ్గరనుంచి లేసులూ, చేనేత నారగడ్డలూ ఖరీదుచేస్తాను."

రైతు మెల్లగా గడ్డం దులుపుకున్నాడు.

"మా ఆడవాళ్లు లేసులల్లరు" అని నిరుత్సాహంగా తలుపుకేసి చూస్తూ చెప్పేడు.

తల్లి అతనికేసి చటుక్కున ఒక చూపు విసిరింది. లోపలికెళ్లడానికి వీలైన సమయం కోసం చూసింది. ఆ రైతు ముఖం అందంగా ఉంది, ఆలోచనాపరుడి లక్షణాలున్నాయి.

ఏ కారణంచేతనో కాని, తల్లి "హమ్మయ్య" అని నిట్టూర్పు విడిచింది. తనలో తచ్చాడుతున్న ఆలోచనలచేతకంటె త్వరగా సహజ జ్ఞానంచేత ప్రేరితురాలై, చటుక్కున:

"ఈ రాత్రికి మీ ఇంట్లో ఉండ నిస్తావా;" అని అడిగింది.

ఈ మాట అంటుండగానే ఆమె శరీరమంతా ఎముకలూ నరాలూ బిగుసుకుపోయాయి. కష్టంమీద నిబ్బరంగా నిలబడి అతడికేసి నిశ్చలంగా చూసింది. కాని ములుకు ల్లాంటిఆలోచనలు ఆమె మనస్సును వేధించాయి: "నికొలాయ్ ఇవానొవిచ్ నాశానానికి నేను కారణమవుతాను. చాలా కాలానికి కాని పావెల్‌ను చూడను. వాళ్లు నన్ను కొడతారు."

ఆ రైతు నేలకేసి చూస్తూ జుబ్బాను గుండెలమీదకు లాక్కుని తాపీగా జవాబు చెప్పేడు:

"రాత్రి మా యింట్లో ఉండనివ్వమంటావా? ఎందుకుండనివ్వకూడదు? కాకపోతే నాది చాలా చిన్న గుడిసె."

"నేనంతకన్న మంచి ఇళ్లకు అలవాటు పడినదాన్ని కానులే" అంది తల్లి.

"అయితే సరే" అని రైతు తలెత్తి ఒక్కసారి ఆమెను నఖశిఖ పర్వతం చూసి, అంగీకరించాడు. అప్పటికి చాలా పొద్దుపోయింది. సంధ్య చీకటిలో అతని కళ్లు మిలమిల మెరిసేయి అతని ముఖం వెలవెలబారినట్లు కనిపించింది.

"అయితే నేను త్వరగా వచ్చేస్తాను. నా పెట్టె పట్టుకొస్తావనుకుంటాను" అని మెల్లగా చెప్పింది. తను కొండమీదనుంచి జారిపోతున్నట్లామెకు అనిపించింది.

"అలాగే" అని భుజాలు పైకెత్తి కోటు దగ్గరగా లాక్కున్నాడు.

"ఇదిగో బండి యిలాగే వస్తోంది" అన్నాడు.

రీబిన్ వసారాలో కొచ్చాడు. అతని తలకూ ముఖానికీ బూడిదరంగు కట్టు కట్టి ఉంది. చేతులు కట్టేసి ఉన్నాయి.

బండి నడక సాగింది. ఇద్దరు పోలీసులమధ్య కూచున్న రీబిన్ బిగ్గరగా కేకేశాడు. "చచ్చేదాక కడుపు మాడ్చుకోడమెందుకు? మీకు స్వేచ్ఛ లభిస్తే, రొట్టె దొరుకుతుంది, న్యాయం దొరుకుతుంది! శలవు, సత్పురుషులారా! శలవు!"

బండిచక్రాల కిరకిర ధ్వనిలోనూ, గుర్రపు డెక్కల టకటక శబ్ధంలోనూ పోలీసు అధికారి అరుపుల్లోనూ, రీబిన్ కంఠధ్వని మునిగి పోయింది.

రైతు తలపంకిస్తూ తల్లికేసి తిరిగి:

"ఇక అంతా అయిపోయినట్లే. నాకోసం స్టేషను దగ్గర కనిపెట్టుకుండు. నేను తర్వాత వస్తాను" అన్నాడు.

* * *

తల్లి గదిలో కెళ్లి బల్లదగ్గర సమొవార్ కెదురుగా కూచుంది. ఒక బ్రెడ్డుముక్కను చేత్తో పుచ్చుకు చేసి మరల పళ్లెంలో పెట్టేసింది. ఆమెకు ఆహారమేమీ తినలానే వాంఛ కలగలేదు. కడుపులో తిప్పు మళ్లీ మొదలెడుతూంది. ఉక్క ఉండి అసౌకర్యంగా ఉన్నట్టనిపించింది. ఈ బాధ ఆమెనెంతో బలహీనపరిచింది.

"అతడు నన్ను గుర్తించాడు. గుర్తించి ఊహించాడు" నీరసంగా అనుకుంది.

మైదానంమీద జరిగిన గలభా చప్పగా సర్దుమణిగిపోవడంతో గ్రామస్థులు భయపడిపోయారని తేలిపోయింది. అంచేత తాను ఒంటరిదానైపోయాననే భావం, ఆమె మనస్సును బూడిదలా మెత్తగా వెలవెలబోతూన్నట్టి దిగులుతో నింపింది.

ఆ అమ్మాయి మళ్లీ గుమ్మంలో కొచ్చింది.

"కోడిగుడ్ల వేపుడు తెమ్మంటారా?" అని అడిగింది.

"వద్దులే. నాకేమీ తినాలని లేదు. వాళ్లు కేకలతోనూ అరుపులతోనూ నన్ను భయపెట్టేశారు" అంది తల్లి.

ఆ అమ్మాయి బల్లదగ్గర కొచ్చి, ఆవేశంతో గుసగుస చెప్పింది:

"పోలీసు అధికారి అతన్ని కొట్టినప్పుడు మీరు చూడవలసింది!... నే నప్పుడు దగ్గరే నిలబడున్నాను. పళ్లు ఊడేటట్లు కొట్టేడు. అతడు రక్తాన్ని ఉమ్ముతుంటే నేను చూశాను చిక్కగా అతి ఎర్రగా ఉంది. కనుగుడ్లు అంతంత వాచిపోయాయి! అతను తారుపని చేస్తుంటాడు. పోలీసు సార్జెంటు మేడమీద తప్పతాగిపడుకున్నాడు. ఇంకా కావాలంటున్నాడు.

"ఈ గొడవలన్నీ పంటలు పోవడం మూలాన వస్తున్నాయంటాడు మానాన్న. రెండేళ్ల నుంచి పంటలేమీ పండడంలేదు. రైతులు చాలా కటకటలాడిపోతున్నారు. అందుచేత వాళ్లు ఇంత అసహ్యమైన స్థితిలో ఉన్నారు. గ్రామస్థుల సమావేశాల్లో కేకలేసుకుంటూ దెబ్బలాడుకుంటారు. ఒకరోజు వస్యుకోవ్ చేసిన అప్పులను తీర్చే నిమిత్తం అతని ఆస్తిని అమ్మడానికి వాళ్లు సమావేశమైనప్పుడు, గ్రామ పెద్దను అతను ఫెళ్లుమని ఒక్క చెంపకాయకొట్టేడు, 'నా అప్పు ఇదే తీసుకో' అన్నాడు."

తలుపు అవతల బరువుగా అడుగుల చప్పుడైంది. తల్లి ఆసరాకోసమని ఎదుట నున్న బల్లను గట్టిగా పట్టుకుని లేచి నిలబడింది.

నీలి కళ్ల రైతు గదిలోకొస్తూనే టోపీ తియ్యకుండానే:

“నీ పెట్టె ఏదీ?” అని అడిగేడు.

తేలిగ్గా దాన్ని పైకెత్తి కదిపి చూశాడు.

“ఖాళీ పెట్టే! మార్యా! ఈమెను మా యింటికి తీసుకెళ్లు.”

వెనక్కి తిరిగి చూడకుండానే అతడు పెట్టె పట్టుకెళ్లిపోయాడు.

“నేనేం చెయ్యాలి? ఇదంతా ఏమీ దాచకుండా చెప్పేస్తేనో?...” అని ప్రశ్నించుకుంది.

రాత్రి చల్లగా తేమగా మిణకరింపు లేని ఎర్రని దీపాలు గుడిసెల కిటికీల్లో వెలుగుతున్నాయి. గొల్లలు పశువులను అదలిస్తున్న కేకలూ, పశువుల మెల్లని నిద్దరమత్తు అరుపులూ రాత్రి నిశ్శబ్దాన్ని ఛేదిస్తున్నాయి. గ్రామమంతా అంధకారమయమూ, చింతా క్రాంతమైన ధ్యానావస్థలో మునిగి ఉంది.

“ఇదే ఇల్లు. ఈ రాత్రి ఉండడానికి మీరు చాలా అధ్వాన్నమైన స్థలాన్ని ఎంచుకున్నారు... అతడు చాలా పేద రైతు...” అని చెప్పింది ఆ అమ్మాయి.

ఆమె తలుపుకోసం తడిమి తలుపు తెరిచింది.

“తత్యానా! అత్త!” అని ధైర్యంగా కేక వేసింది.

వెంటనే పరుగెత్తు కెళ్లిపోయింది. చీకట్లో నుంచి :

“శలవు” అని ఆమె మాట వినబడింది.

తల్లి లోపలికెళ్లి, కనుబొమల మీదకు చెయ్యెత్తి, గుడిసె నాలుగు మూలలూ పరకాయించి చూసింది. అది చిన్నదే కాని పరిశుభ్రంగా ఉండడం ఆమె కాశ్చర్యమేసింది. పిన్న వయస్కురాలైన ఒక స్త్రీ పొయ్యి వెనకనుంచి ఆమెను చూసి తలూపి మాట్లాడకుండానే అంతర్ధానమైపోయింది. బల్లమీద ఒక దీపం వెలుగుతోంది.

గుడిసె యజమాని బల్లదగ్గర కూచుని, కంగారుగా వేళ్లతో బల్లమీద చప్పుడు చేస్తూ తల్లి కళ్లను పరిశోధనగా చూశాడు.

“రండి తత్యానా! వెళ్లి ప్యోత్ర్‌ను పిలుచుకురా. త్వరగా వెళ్లు.”

ఆ స్త్రీ తల్లికేసి చూడకుండానే బయటి కెళ్లిపోయింది. తల్లి యజమాని కెదురుగా వున్న బెంచీమీద కూచుని నాలుగు మూలలా చూస్తోంది. ఆమె పెట్టె ఎక్కడా కనబడ్డంలేదు.

గుడిసెలో భయంకరమైన నిశ్శబ్దం ఏర్పడింది. మధ్యమధ్య దీపం మాత్రం టుప్‌టుప్‌మని శబ్దం చేస్తోంది. తన కళ్ల ముందర వచ్చినట్టే వచ్చి వెళ్లిపోయిన రైతుయొక్క చిరచిరలాడే ముఖం చూసి ఆమెకు చిరాకెత్తింది.

"నా పెట్టె ఎక్కడ?' అని చటుక్కున తత్తరపాటుతో ప్రశ్నించింది.

రైతు భుజాలెగరేశాడు.

"అదెక్కడికీ పోదులే. స్టేషన్ దగ్గర, అది ఖాళీగా ఉందని ఆ పిల్ల వినాలనే బుద్ధిపూర్వకంగానే అన్నాను. కాని అది ఖాళీగా లేదు. చాలా బరువుగా ఉంది" అని మెల్లగా జవాబిచ్చాడు.

"సరే. ఉంటేనేమి?" అని తల్లి అడిగింది.

అతడు లేచి తల్లి దగ్గర కెళ్లేడు.

"ఆ మనిషిని మీరెరుగుదురా?" అని బాగా వంగి నెమ్మదిగా చెవిలో అడిగేడు.

హఠాత్తుగా వేయబడిన ఆ ప్రశ్నకామె కొంచె మాశ్చర్యపడి,

"ఎరుగుదును" అని దృఢమైన గొంతుకతో జవాబుచెప్పింది.

ఆ ఒక్క మాటా, గభాలున ఒక్క వెలుగులా వెలిగి పరిసరాలన్నిటినీ విస్పష్టం చేసింది. ఆమెకు మనశ్శాంతి కలిగి, అమ్మయ్య అనుకుని బెంచీమీద సావకాశంగా కూచుంది.

రైతు నోరారా నవ్వుకున్నాడు.

"అక్కడ మీరు అతనికి సౌంజ్ఞ చేయడం, మళ్లీ అతను మీకు సౌంజ్ఞ చేయడం చూడ్డంతోనే నేనా సంగతి గ్రహించాను. 'ఆ వసారామీద నిలబడిన వ్యక్తిని మీరెరుగుదురా?' అని చెవిలో అడిగేను."

"అతడేమన్నాడు?" అని వెంటనే తల్లి ప్రశ్నించింది.

"మేము చాలామందిమి ఉన్నాం... చాలామందిమే అన్నాడు."

రైతు అతిథి కళ్లను ప్రశ్నపూర్వకంగా పరికించాడు. చిరునవ్వు నవ్వుతూ,

"దిట్టమైన మనిషంటే అతగాడే! మంచి ధైర్యశాలి కూడా! నేనే ఆ పని చేశానని నిస్సంకోచంగా చెప్పేశాడు వాళ్లెంత కొట్టినా, తను చెప్పదలచుకున్నదంతా చెప్పుకుంటూనే వచ్చాడు" అన్నాడు.

నిస్సత్తువగానూ, సంకోచించుతూనూ ఉన్న అతని గొంతుక, అసంపూర్ణంగా ఉన్నట్లగుపడే అతడి ముఖం, దాపరికమెరుగని కళ్లు, తల్లికి క్రమంగా ధైర్యాన్ని చేకూర్చేయి.

ఆమెకుండిన భయ సంకోచాలు, నిస్పృహ క్రమక్రమంగా తొలగిపోయి, రీబిన్ పట్ల గాఢమైన దయా, జాలీ కలిగాయి.

"దుర్మార్గులు! పశువులు!" అని అపారమైన క్రోధంతో ఏడవడం మొదలెట్టింది.

రైతు కొంచెం దూరంగా తొలగి, విచారంగా తల పంకిస్తూ :

"ఇటువంటివాళ్లే అధికార్ల స్నేహితులు!" అన్నాడు.

మరల తల్లికేసి తిరిగి నెమ్మదిగా:

"చూడు. ఆ పెట్టెలో వార్తాపత్రికలు లేవా?" అని

కన్నీళ్లు తుడుచుకుంటూ తల్లి ముక్తసరిగా జవాబుచెప్పింది.

"ఉన్నాయి. అతనికోసమే వాటిని తెచ్చాను" అని

కన్నీళ్లు తుడుచుకుంటూ తల్లి ముక్కసరిగా జవాబు చెప్పింది.

అతడు చిరచిరలాడుతూ గడ్డాన్ని చేత్తో పుచ్చుకుని ఒక మూలకు తేరిపార జూస్తూ నిలబడ్డాడు.

"అవి మాకోసమే వచ్చాయి.... పుస్తకాలు కూడా మాకోసమే వచ్చాయి... మేమతని నెరుగుదుము.. ఇదివరలో చూశాం."

ఒక నిముషం సేపు ఆగి అలాగే ఆలోచిస్తూ నిలబడ్డాడు.

"అయితే ఆ పెట్టె నేమి చెయ్యాలనుకుంటున్నారు?" అని తల్లి నడిగేడు.

ఆమె అతడికేసి ఏమంటావన్నట్లుగా చూస్తూ :

"ఇక్కడ మీదగ్గర వదిలిపెట్టేస్తాను" అంది.

అందుకతడేమీ అభ్యంతరమూ చెప్పలేదు, ఆశ్చర్యాన్నీ వెలిబుచ్చలేదు.

"మంచిదే" అన్నాడతను.

అంగీకారసూచకంగా తలాడిస్తూ, వేళ్లతో గడ్డం దువ్వుకుంటూ బల్లదగ్గర కూచున్నాడు.

"వాళ్లొస్తున్నారు" అన్నాడు.

"ఎవరు?"

"మనవాళ్లనుకుంటాను."

అతని భార్య మరొక రైతును వెంటపెట్టుకొచ్చింది. అతడు వస్తూనే టోపీనొక మూలకు విసిరేసి, బల్ల దగ్గరికి గబగబ వచ్చి,

"ఏమిటి సంగతి? అడిగాడు.

మొదటి రైతు తలూపేడు. పొయ్యి దగ్గర నిలబడున్న అతని భార్య,

"సైపాన్, మన అతిథికి ఆకలేస్తున్నదేమో?" అంది.

"లేదు. నాకు ఆకలి వెయ్యడం లేదు!" అని తల్లి బదులుచెప్పింది.

రెండవ రైతు తల్లికేసి తిరిగి, గబగబా, గద్గద స్వరంతో ఇలా అన్నాడు :

"నన్ను నేనే పరిచయం చేసుకుంటున్నాను... నా పేరు ప్యోత్ర్ యెగోరొవ్ ర్యబీనిన్. అందరూ వేళాకోళంగా 'కంటాణీ' అంటారు. మీ వ్యవహారం గురించి కొన్ని సంగతులు నాకు తెలుసు. నాకు చదవడం రాయడం వచ్చు. కేవలం తెలివితక్కువవాడిని కాను.'

అతడు గబగబా, గుక్క త్రిప్పుకోకుండా నిస్పష్టంగా మాట్లాడేడు. అతని గెడ్డం కంగారుతో అదిరింది. తల్లి ముఖంకేసీ, విగ్రహంకేసీ పరీక్షగా చూస్తూ మాట్లాడేడు. గుడ్డలు చిరిగి పీలికలు వేలాడుతున్నాయి. జుట్టు జడులకట్టేసింది. అవతారమంతా చూస్తే, ఇప్పుడే దెబ్బలాటనుంచి విజయోత్సాహంతో వచ్చినవాడిలాగున్నాడు. తల్లికి అతని ఉత్సాహధోరణి నచ్చింది.

"సైపాన్! ఇది పరిశుద్ధమైన పని. చాలా మంచి పని. ఇదంతా ప్రజల్లోనుంచే వస్తుందని నేను చెప్పలేదా? కాని గొప్పావిడ నీకు నిజం చెప్పడం లేదు. నీకు నిజమంతా తెలిస్తే, ఆమెకే ప్రమాదం సంభవిస్తుంది. నిజానికి నేను ఆమెను చాలా గౌరవిస్తాను. అందుకేమీ సందేహం లేదు. ఆమె హృదయం చాలా మంచిది. మనకు సహాయం చెయ్యాలనుకుంటోంది. తనకేమాత్రమూ హాని జరగకుండా ఏదో కొంచెం చెయ్యాలనుకుంటోంది.

"అవును. ఈమె పెట్టె గురించి చాలా ఆత్రుతపడుతోంది" అన్నాడు తలూపుతూ సూపాన్.

ప్యోత్ర్ తల్లికి కనుసైగ చేశాడు.

"దాన్ని గురించి బెంగ పెట్టుకోకండి" అని ధైర్యం చెప్పేడు. "అమ్మా! అన్నీ సక్రమంగానే జరుగుతాయి. మీ పెట్టె మా యింట్లో ఉంది. ఈ వేళ ఇతను మీ సంగతి చెప్పినప్పుడు ఈ వ్యవహారంతో మీకు చాలా సంబంధమున్నదనీ, ఆ మనిషిని మీరు ఎరుగుదురనీ చెప్పినప్పుడు 'ఇటువంటి వ్యవహారంలో మనమేమీ పొరపాటు చెయ్యకూడదు. కనుక త్వరగా కానియ్యి, సైపాన్' అని చెప్పేను. మీ పెట్టె కోసం మరేమీ బెంగపడకండి."

అతడామె పక్కనే కూచుని ఆమెను ప్రశ్నించుతూన్నట్టు చూశాడు.

"ఆ పెట్టెలో ఉండే సరుకును వదిలించుకోవాలని అనుకుంటే, మేము పరమ సంతోషంతో మీకు తోడ్పడతాం. ఆ పుస్తకాలను మేం ఉపయోగించుకోగలం."

"వాటన్నిటినీ మన కిచ్చెయాలనే ఆమె అనుకుంటోంది" అన్నాడు సైపాన్.

"అలాగైతే చాలా బాగుంది, అమ్మా!... వాటన్నిటికీ తగిన చోటు చూద్దాం!" అంటూ సన్నగా నవ్వి, చెంగున లేచి నిలబడి పచారుచెయ్యడం మొదలెట్టేడు.

అతడొక నిమిషం నిశ్శబ్దంగా ఉన్నాడు.

"ఈవేళ వచ్చిన ఆ మనిషి, మీకు చుట్టమా అమ్మా?" అని అడిగేడు.

"కాదు" అని తల్లి బదులు చెప్పింది.

ప్యోత్ర్ మెల్లగా నవ్వి, ఎందుకో చాలా సంతృప్తి చెందినట్లుగా తలూపేడు.

"అతడు నాకు బంధువు కాదు. కాని చాలా కాలంనుంచి ఎదుగుదును. మా పెద్దన్నగా భావించి గౌరవిస్తాను!" అని వెంటనే చెప్పింది. రీబిన్‌ను బంధువు కాదనడం ఆమెకు తప్పనిపించింది.

మనస్సులోని భావాలు వ్యక్తపరచడానికి తగిన మాటలు స్ఫురించకపోవడంచేత అందుకు బాధపడి ఆమె మళ్లీ ఏడ్వడం మొదలెట్టింది. ఆ గుడిసె అంతా బాధకరమైన ప్రతిక్షణా నిశ్శబ్దంతో నిండిపోయింది.

"అయితే అతను మీకు స్నేహితుడన్నమాటే... బలే మనిషి! స్వంతంగా ఆలోచన చెయ్యగలవాడే! తన విలువ హెచ్చుగానే ఉంచాడు. అది చాలా సబబే. తత్యానా! ఏమంటావు?... నువ్వంటూ ఉంటావ్" అని ప్ర్యోత్ర్ మెల్లగా అన్నాడు. తత్యానా తన చిరునోటి పెదవులు నొక్కుకుని మాటకడ్డొచ్చింది.

"అతనికి పెళ్లయిపోయిందా?"

"భార్య చచ్చిపోయింది" అని విచారంగా తల్లి జవాబు చెప్పింది.

"అందుకే అతడంతా ధైర్యంగా ఉన్నాడు... పెళ్లైనవాడు అలాటి మార్గాన్నను సరించలేడు... భయపడతాడు" అని తత్యానా ఖంగుమనే కంఠంతో చెప్పింది.

"అయితే నామాటేమిటి? నాకు పెళ్లి కాలేదా?" అన్నాడు ప్యోత్ర్.

తత్యానా వంకరనవ్వు నవ్వి పెడమొగం పెట్టి :

"ఛఛ! చాల్లేవయ్యా! నువ్వేం చేస్తున్నావు? ఊరికే మాట్లాడతావు. అప్పుడప్పుడు ఒకటి రెండు పుస్తకాలు చదువుతావు. నువ్వూ, సైపాన్ ఒక మూల చీకట్లో కూచుని గుసగుసలాడుతుంటే జనానికేమీ ప్రయోజనం కలగదు" అంది.

"మీ భర్త ఉన్నాడా?"

"చచ్చిపోయాడు. ఒక కొడుకున్నాడు..."

"అతను మీతోటే ఉంటాడా?"

"జైల్లో ఉన్నాడు" అంది తల్లి.

ఈ మాటలంటుంటే ఆమెకు మామూలుగా కలిగి విచారంతోబాటు ఇప్పుడు గర్వం కూడా కలిగింది.

"అతన్ని రెండోసారి వాళ్లు జైల్లో పెట్టేరు. భగవంతుని సత్యాన్ని ప్రజల్లో నాటుతూన్నందుకే ఆ పని చేశారు. అతను అందచందాలగల యువకుడు, తెలివైనవాడు. మీ వార్తాపత్రిక సంగతి ఆలోచించినవాడు అతనే. మిహయిల్ ఇవానొవిచ్‌కి సరైన దారిని చూపినవాడతనే, మిహయిల్ వయస్సు అతని వయస్సుకు రెట్టింపు ఉన్నా కూడా! త్వరలోనే విచారణ జరుగుతుంది, నా కొడుకును సైబీరియా పంపేస్తారు. కాని అతడు పారిపోయి వచ్చేసి ఈ పని కొనసాగిస్తున్నాడు..."

ఆమెకు మాట్లాడుతున్న కొద్దీ గర్వం హెచ్చింది. తన కాప్తుడైన వీరుని రూపం కళ్లకు కట్టినట్లయి, ఆ రూపాన్ని వర్ణించడానికి మాటలు పెదవుల్లోనుంచి ఉక్కిరిబిక్కిరయేటంతగా దొర్లుకుంటూ వచ్చాయి.

"అతనిలాంటి వాళ్లెందరో ఉన్నారు. ఇంకా చాలామంది పుట్టుకొస్తున్నారు. వాళ్లు జీవించి ఉన్నంత కాలం సత్యంకోసం, ప్రజల స్వేచ్ఛకోసం, నిలబడుతూనే ఉంటారు..."

"కష్టపడి జీవిస్తుండే వారంతా లేమిచేత కటకటలాడే వారంతా, ధనికులచేతా వారి నౌకరులచేతా అన్యాయంగా అణగదొక్కబడిన వారంతా తమ సోదరులకోసం జైళ్లల్లో చిత్రహింసలపాలై చస్తూన్నవాళ్లతో చేతులు కలపాలి. తమ స్వార్థాన్ని గురించిన ఆలోచన పిసరంతైనా లేకుండా, ప్రజలందరికీ క్షేమకరమైన మార్గాన్ని వాళ్లు చూపిస్తున్నారు. వాళ్లకు ఎవరినీ మోసం చెయ్యాలనే ఉద్దేశం లేకపోవడంచేత, 'ఈ మార్గం కఠినమైనద'ని స్పష్టంచేస్తున్నారు. ఈ మార్గాన నడవమని వాళ్లెవరినీ బలవంతం చేయడంలేదు! కాని ఒక్కసారి ఎవరైనా వాళ్ల పక్కన నిలబడినట్టైతే, అలాటివాడు వాళ్లను మరి వదిలిపెట్టడు! ఏమంటే, అదే సరియైన మార్గమనీ, మరొక మార్గం లేదనీ అతను తెలుసుకో గలుగుతాడు!"

చిరకాలంగా తను చెయ్యాలని కోరికపడుతుండిన పనిని, ఈనాడు చెయ్యగలుగుతున్నదుకామె హృదయం ఆనందంతో పులకరించింది. తను కూడా ప్రజలకు సత్యాన్ని తెలియజేస్తోంది!

"ఇటువంటి వారి వెంట మీరు సురక్షితంగా నడవచ్చు. స్వల్ప లాభాలతో వాళ్లు సంతుష్టిపడరు. యావత్తు మోసాన్నీ, దురాశనూ, దౌష్ట్యాన్ని నాశనం చేసేవరకూ వాళ్లు ఊరుకోరు. జనమంతా ఒక్కటై ఏకగ్రీవంగా 'నేనే యజమానిని! అందరికీ సమానంగా వర్తించే చట్టాలను నేనే చేస్తాను!' అని అనేదాక వాళ్లు చేతులు కట్టుకు కూచోరు."

హఠాత్తుగా ఆమెకు అలసట వచ్చింది. మాట్లాడ్డం మానేసి శ్రోతలకేసి తదేక ధ్యాసతో చూసింది. తను మాట్లాడిన మాటలు వృధాపోలేదని గుర్తించి సంతోషపడింది.

“అదీ సంగతి” అని మెల్లగా అంటూ ప్యోత్ర్ బెంచీమీద కూలబడ్డాడు.

సైపాన్ నిటాగ్గా కూచుని భార్యకేసి చూసి రెండు చేతులూ బారసాచేడు. అక్కడున్న వాళ్లనందర్నీ కౌగిలించుకుంటాడా అనిపించింది.

“ఒక్కసారి ఇలాంటి పనిలోకి దిగేమంటే, సర్వాత్మనా దానితో ఏకమైపోవాలి” అని ఆలోచనాపూర్వకంగా అన్నాడు.

“ఇక మళ్లీ వెనక్కి తిరిగి చూడకూడదు” అని కొంచెం సంకోచిస్తూ ప్యోత్ర్ చెప్పేడు.

“ఈ పనికి చాలామందే కావలసి వచ్చేట్లున్నారు” అన్నాడు స్తైపాన్.

ప్రపంచానికంతకీ పని చెప్తుంది” అన్నాడు ప్యోత్ర్.

తల్లి గోడకాను కూచుని మెడ వెనక్కు వాల్చి, వాళ్లీ విషయాలను గురించి నెమ్మదిగా అనుకునే మాటలను శ్రద్ధగా వింది. తత్యానా లేచి నాలుగు వైపులా పరికించి మళ్లీ కూచుంది.

“అమ్మా! మీ రోజుల్లో మీరు చాలా కష్టాలనుభవించి ఉండాలి!” అంది.

“అనుభవించాను” అని తల్లి బదులుచెప్పింది.

“మీరు మాట్లాడుతుంటే నాకు వినాలనుంది. మీ మాటలు హృదయతంతులను కదిలిస్తున్నాయి. మీ మాటలు విన్నప్పుడు, ‘ఓ దేవుడా! ఈమె చెప్పేటటువంటి మనుషులను చూడడానికి ఏమిమ్మన్నా ఇస్తాను!’ అనుకున్నాను. బతుకు సంగతి ఆలోచించాను ఇక్కడేముంది. మేమంతా ఉట్టి గొర్రెల మంద, అంతే. మాట వరుసకు నా సంగతే చూడండి! నాకు చదవడం రాయడం వచ్చు. నేను పుస్తకాలు చదువుతుంటాను. చాలా చాలా ఆలోచనలు చేస్తుంటాను. ఒక్కొక్కప్పుడు ఆ ఆలోచనల వల్ల రాత్రిళ్లు నిద్ర కూడా పట్టదు. కాని ఇందువల్ల ప్రయోజనమేముంది? ఆలోచించకపోతే వృధాగా వాడిపోతాను. ఆలోచించినా ఏమీ కనబడదు.”

ఆమె నేత్రాల్లో వ్యంగ్యం కనబడింది. అప్పుడప్పుడామె, మాటలను దారాన్ని మాదిరిగా కొరికొనట్లు కనిపించింది. రైతులేమీ మాట్లాడలేదు.

“తత్యానా, మనం ఏదైనా కొంత తిని దీపమార్పెయ్యడం మంచిదనుకుంటాను. మామూలుకన్న చాలా రాత్రి వరకూ చుమకోవ్ ఇంట్లో దీపాలు వెలుగుతున్నట్లు జనం గ్రహిస్తారు. అందువల్ల మనకు కలిగే బాధేమీ లేదు. కాని ఆమెకు బాధ కలగవచ్చు” అని సైపాన్ కనుబొమలుచిట్లిస్తూ మెల్లగా చెప్పేడు.

తత్యానా లేచి పొయ్యి దగ్గర కెళ్లింది.

"అవును. ఈ రోజుల్లో అడుగేసేటప్పుడు ముందూ వెనకా చూసుకుంటూ ఉండాలి... ఈ వార్తా పత్రికలిక్కడ కనబడ్డంతోనే...' అంటూ ప్యోత్ర్ చిరునవ్వు నవ్వేడు.

"నేను నా సంగతి ఆలోచించుకోవడం లేదు. నన్ను అరెస్టు చేస్తే కలిగే ప్రమాదం ఏమీ లేదు."

అతడి భార్య బల్ల దగ్గర కొచ్చి,

"లేవండి' అంది.

అతను లేచి, ఆమె బల్లను సర్దుతుంటే చూస్తూ నిలబడ్డాడు. వెటకారంగా నవ్వుతూ,

"సోదరులారా, మీరూ, నేనూ మన విలువ, గెల అయిదు కోపెక్కులే. అదైనా గెలకు నూరుంటేనే" అన్నాడు.

తల్లికి అతన్ని చూస్తే జాలేసింది. అతన్ని చూసినకొద్దీ ఆమెకు అతని పట్ల అభిమానం ఎక్కువైంది. తను మాట్లాడిన తర్వాత, ఆ రోజు మకిలంతా కడిగేసినట్లనిపించింది. తను చేసిన పనికామె పూర్ణమైన సంతుష్టి పొందింది. అందరిమీదా సద్భావం కలిగింది.

"మీరు పొరపాటు పడుతున్నారు. మీ రక్తం పీల్చేవాళ్లు కట్టే మీ విలువలను మీరు ఒప్పుకోకూడదు, మీ విలువను మీరే నిర్ణయించుకోవాలి. మీ ఆంతర్యాన్ని బట్టి మీ విలువ మీరే నిర్ణయించుకోవాలి. మీ స్నేహితులు కట్టిన విలువే ప్రధానం కాని శత్రువులు కట్టే విలువ కాదు" అంది తల్లి.

''మాకు స్నేహితులెవరు?... మేమెప్పుడూ బ్రెడ్డుమీద పెచ్చుకోసం తగవులాడుకుంటూనే ఉంటాం" అన్నాడు ప్యోత్ర్.

"కాని నేను చెపుతున్నానుగా మనకి స్నేహితులున్నారు."

"ఎక్కడైనా ఉండవచ్చునేమోగాని ఇక్కడ కాదు" అన్నాడు సైపాన్ సాలోచనగా.

"వాళ్ల నిక్కడే కనుక్కోవడానికెందుకు ప్రయత్నించకూడదు."

సైపాన్ ఒక్క క్షణమాలోచించి జవాబుచెప్పేడు:

"హు! అవును. ఆ పనే మనం చెయ్యాలనుకుంటాను."

"కూచోండి. భోజనం సిద్ధంగా ఉంది" అంది తత్యానా.

వాళ్లు భోజనం చేస్తుంటే, తల్లి చెప్పిన మాటలవల్ల ప్రభావితుడైన ప్యోత్ర్, మళ్లీ హుషారుగా మాట్లాడ్డం ప్రారంభించాడు.

"అమ్మా! ఎవరూ మిమ్మల్ని చూడకుండానే, తెల్లవారకుండా, మీరిక్కడనుంచి వెళ్లిపోవాలి. పట్టణానికి వెళ్లకుండా తిన్నగా ముందు స్టేషన్‌కే వెళ్లండి. అక్కడ తపాలా బగ్గీ ఎక్కండి" అన్నాడు.

"ఎందుకు? నేనామెను నా బండిమీద తీసుకెడతాను" అన్నాడు సైపాన్.

"వద్దు. ఆ పని చెయ్యద్దు. వాళ్లు నిన్ను 'ఆమె రాత్రి మీ ఇంట్లో ఉందా?' అని అడుగుతారు. 'అవును' అంటావు. 'ఇప్పుడెక్కడుంది?' అని అడుగుతారు. 'నేను స్టేషన్‌కు బండిమీద తోలుకెళ్లి దిగబెట్టే' నంటావు. 'ఆహా! అయితే ఆమె తప్పించుకుపోవడానికి నువ్వు తోడ్పడ్డావన్నమాట!' అని నిన్ను జైలుకు పంపుతారు. తెలిసిందా? జైల్లో కెళ్లడానికి తొందర పడడంలో అర్థమేమీ లేదు. ఏ పనైనా సరైన కాలంలో చెయ్యాలి. 'చక్రవర్తైనా కాలం తోసుకొస్తే మరణిస్తాడ'ని సామెతుంది. దీనికి సమాధానం ఇలా చెప్పుకోవాలి. ఆమె రాత్రి మా యింట్లో పడుకుంది. పొద్దున్నే గుర్రాలను బాడుగకు కుదుర్చుకుని వెళ్లిపోయింది. మావూరు రహదారి పక్కనే ఉంది కనుక ఎంతోమంది రాత్రిళ్లు ఇక్కడ పడుకుంటారు."

"ప్యోత్ర్, ఇంత పిరికితనం నీకెవరు నేర్పేరయ్యా?" అని తత్యానా వ్యంగ్యంగా అడిగింది.

"ఏమమ్మోయ్! మనిషైనవాడు అన్ని సంగతులూ తెలుసుకుని ఉండాలి. ఎప్పుడు పిరికితనం చూపాలో, ఎప్పుడు ధైర్యంగా ఉండాలో తెలుసుకోవాలి" అని ప్యోత్ర్ మోకాటి చిప్పమీద కొట్టుకుంటూ చెప్పడం మొదలెట్టేడు: "ఆ వార్తాపత్రికతో వగానొవ్ దొరికిపోయినప్పుడు వాళ్లెలా కలబెట్టేశారో జ్ఞాపకం లేదూ? ఇప్పుడు బతిమాలి గాని, డబ్బిచ్చిగాని ఒక పుస్తకాన్ని అతడిచేత పట్టించలేము. తల్లీ! మా మాట నమ్మండి. నేను చురుకైన మోసగాణ్ణి. మీరు తెచ్చిన కరపత్రాలనూ, వార్తాపత్రికలనూ నేను జాగ్రత్తగా పంచిపెడతాను. మీ యిష్టమొచ్చినన్నిటిని సరైన చోట పంచిపెడతాను. మా జనంలో చాలామందికి చదవడం రానిమాట నిజమే. పైగా భయం కూడాను. ఒక్కొక్కప్పుడు మీరెలాంటి ఇబ్బందిలో పడతారంటే, తప్పనిసరిగా కళ్లు తెరుస్తారు, దీన్నేం చెయ్యాలి అనేక సందిగ్ధంలో పడతారు. ఈ కరపత్రాలు నీకు విస్పష్టంగా ఆలోచించు, బుర్రనుపయోగించు అని చెప్తాయి.

సరి. నేనిక ఇంటికి పోయే వేళైంది. అమ్మా! శలవు" అని కరచాలనం చేస్తూ ఇలా అన్నాడు: "మనమిక ముందు ఎప్పుడూ కలవక పోవచ్చు. కాని ఈ జరిగిందంతా చాలా బాగుందని నేననుకుంటున్నాను. మిమ్మల్ని కలుసుకోవడం, మీతో మాట్లాడ్డం చాలా బాగా ఉంది. కాగితాలు కాక మీ పెట్టెలో ఏదైనా ఉందా? ఉన్ని శాలువా? సరే. ఉన్ని శాలువ. సైపాన్ జ్ఞాపక ముంచుకో. నీ పెట్టెనితడు ఒక నిముషంలో పట్టుకొస్తాడు. రా సైపాన్. శలవు. మీకు అదృష్టం కలిసిరావాలి!"

"అతడు ఉత్సాహవంతుడైన యువకుడే" అంది తల్లి. రెండవ స్త్రీ ఆమెకేసి చిరాకుగా చూసింది.

"చాలా గడబిడ చేస్తాడు. కాని కార్యశూరత్వం లేదు."

"మీ భర్త సంగతేమిటి?" అని అడిగింది తల్లి.

"అతను మంచివాడే. వాగడు. మేమిద్దరం సయోధ్యగానే ఉంటాం కాని మనిషికి స్థిర సంకల్పం లేదు."

పొడారిపోయిన ఆమె ఆకుపచ్చని కళ్లలోని వెలుగును బట్టి తల్లి ఆమె దుస్థితినీ, బాధనూ గ్రహించింది. ఆ బాధనామె కంఠస్వరంలోనే తల్లి వినగలిగింది. ఆమెను ఓదార్చాలనుకుంది.

తల్లి ఆమె పక్కకు తిరిగింది. అగాధమైన చీకటి కిటికీలోంచి ఆమెకేసి తేరిచూచింది. చిన్న చిన్న శబ్దాలు, కదలికలు ఆ నిశ్శబ్దంలో ఆమె చెవిని పడ్డాయి. బయపడుతూ, చెవిలో గుసగుసలాడినట్లుగా ఆమె తత్యానాకు జవాబుచెప్పింది:

"దేవుడి విషయంలో నాకేమీ ఇదమిద్ధమని తెలియదు. కాని నాకు క్రీస్తుయందు నమ్మకముంది. అతడు చెప్పిన 'నీ పొరుగువారిని నీవలెనే ప్రేమించు' అనే మాటల్లో నాకు విశ్వాసముంది."

తత్యానా మాట్లాడలేదు. నల్లగా ఉన్న పొయ్యి కానుకుని ఉన్న నిడుపాటి ఆమె గోధుమ రంగు విగ్రహాన్ని తల్లి లీలగా చూసింది. ఆమె కదలిక లేకుండా నిలుచుంది. తల్లి విచారంతో కళ్లు మూసుకుంది. హఠాత్తుగా తత్యానా అన్న కఠోరమైన మాటలు ఆమె చెవిలో పడ్డాయి:

"నా బిడ్డలు చనిపోయినందుకు నేను దేవుడినీ క్షమించను, మానవుడినీ క్షమించను.... ఎన్నటికీ క్షమించను!"

నీలొవ్నా ఆత్రంగా లేచింది. ఆ మాటల్లో ఉండే బాధను ఆమె గ్రహించింది.

తల్లికి మగతనిద్ర పట్టింది. ఆ నిద్రలో వాకిట్లోనూ లోపలా అడుగుల చప్పుడు వినిపించింది. మెల్లగా తలుపు తెరుచుకుంది.

"పడుకున్నావా తత్యానా?" అని మగగొంతుక వినబడింది.

"లేదు."

"ఆమె నిద్రపోయిందా?"

ఒక దీపం గప్పుమని వెలిగి ఆరిపోయింది. రైతు తల్లి పక్క దగ్గరకొచ్చి ఆమె కాళ్ల మీద వేసుకున్న కోటును ఒళ్లంతా కప్పేడు. అతడు తనపట్ల తీసుకుంటున్న శ్రద్ధకామె చాలా

సంతోషపడింది. చిరునవ్వు నవ్వి కళ్లు మూసుకుంది. సైపాన్ దుస్తులు వదిలేసి మాట్లాడకుండా చిట్టి అటకమీద కెక్కేడు. అంతా నిశ్శబ్దమైంది.

చాలా సేపటికివరకూ, అతడలా గుసగుసలాడుతూనే ఉన్నాడు. మధ్యమధ్య అతని మాటలు తల్లికి వినబడనంత మెల్లగా మాట్లాడేవాడు. ఒక్కొక్కప్పుడు కొంచెం బిగ్గరగా మాట్లాడుతుంటే:

"ఇష్, ఆమెకు నిద్రాభంగం కలుగుతుంద"ని భార్య వారించేది.

తనపై మేఘంలా వాలి తనను తన రెక్కలమీద ఎక్కించుకుని ఎగిరిపోయిన గాఢ నిద్రలో తల్లి మునిగిపోయింది.

ధూసరవర్ణపు వేకువ కిటికీల్లోంచి తొంగిచూడ్డంతోనే, రాత్రి కడపటి జాము అంతమైందని నిద్రమత్తుతో తెలియజేస్తూన్న చర్చిగంటల మోత భయంకరమైన చీకటిలోనుంచి తేలుతూ రావడంతోనే, తత్యానా తల్లిని మేల్కొల్పింది.

"సమొవార్ ముట్టించాను. ఒక గ్లాసు టీ తాగి బయల్దేరండి. లేచీ లేవడంతోనే బండెక్కితే మరీ చలి అనిపిస్తుంది."

సైపాన్ చిక్కుబడిన గడ్డాన్ని నిమురుకుంటూ, తల్లి నడిగి పట్టణంలోని ఆమె చిరునామాను తెలుసుకున్నాడు. రాత్రి విశ్రాంతితో అతడి ముఖం తేటగా ఉండడం ఆమె చూసింది.

"ఇది ఇలా జరగడం చాలా చిత్రంగా ఉంది సుమండీ!" అన్నాడు, టీ తాగుతూ.

"ఏమిటి?" అని తత్యానా అడిగింది.

"ఇంత సులువుగా మనం పరిచయం కావడం."

"మన పనికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ అద్భుతమైన నిరాడంబరత్వముంది" అంది తల్లి సాలోచనగా.

భార్యాభర్తలిరువురూ తల్లి వెళ్లిపోతుంటే చాలా బాధపడ్డారు. వాళ్లేమీ పైకి అనలేదు కాని, అనేక చిన్న చిన్న విషయాల్లో ఆమె సౌకర్యాన్ని గురించి ఆత్రుత వ్యక్తపరిచారు.

* * *

తల్లి తపాలాబండిలో కూచుని తనలో ఆలోచించుకోవడం ప్రారంభించింది. సైపాన్ మెల్లగా జాగ్రత్తగా పని ప్రారంభిస్తాడనీ, కాని అలుపు లేకుండా పని చేస్తాడనీ ఊహించుకుంది.

జీవితం, దున్నేవాడికోసం మూగపోయి ఆత్రంగా కాచుకున్న మిట్టపల్లాల పొలంవలే ఉన్నట్లామెకు తోచింది.

"నామీద సత్యాన్నీ ధర్మాన్నీ వెదజెల్లండి. మీ కష్టానికి నూరు రెట్లు ఫలితాన్నిస్తాను!" అని ఆ పొలం నిజాయితీగల స్వేచ్ఛాళువులను ఆహ్వానిస్తున్నట్లు ఆమెకు స్ఫురించింది.

తను చేసిన కృషి సఫలీకృతమైన సంగతి నామె స్ఫురణకు తెచ్చుకునేసరికి ఆనందం వెల్లువగా వచ్చింది. కాని ఆమె వినయంతో దాన్ని లోలోపల అణచుకుంది.

నికొలాయ్, బట్టలు సరిగా సర్దుకోకుండానే ఒక పుస్తకం చేత్తో పుచుకుని తల్లికి తలుపు తీశాడు.

"నిన్న రాత్రి వాళ్లు మన ఇంటిని సోదా చేశారు. మీకు ఏదో జరిగి ఉండవచ్చునని నేను భయపడ్డాను. అయితే, నన్ను వాళ్లు అరెస్టు చెయ్యలేదు. మిమ్మల్ని అరెస్టు చేసి ఉంటే, తప్పకుండా వాళ్లు నన్ను పట్టుకుపోయేవాళ్లే" అన్నాడు.

ఆమెను భోజనాల గదిలోకి తీసుకెడుతూ కబుర్లు చెప్పేడు. లేని రైతులను లెక్కపెడుతూ బల్లదగ్గర కూచోవడం నాకు విసుగ్గానే ఉంది."

గదంతా రాక్షసుడెవడో వచ్చి కోపంతో గోడలను కుదిపేసి ఇల్లంతా తలకిందులు చేసినట్లుంది. గోడమీద చిత్రపటాలన్నీ నేలమీద చిందరవందరగా పడివున్నాయి. గోడల కంటించిన కాగితాలన్నీ ఊడపీకబడి, పీలికలుగా వేలాడుతున్నాయి. ఒక చోట చప్టా బల్ల పీకేయబడింది. కిటికీ తలుపులు ఊడబెరికి ఉన్నాయి. పొయ్యిలో బూడిదంతా నేలమీద విరజిమ్మబడింది.

"వాళ్లు చేసిన గలభా కాకుండా ఈ గత్తరకు నేనూ కొంత కారణమే ననుకోండి. దానికేమి లెండి నీలొవ్నా! వాళ్ళు మళ్లీ వస్తారేమోనని ఇంతలో సర్దుకోవడమెందుకని శుభ్రం చెయ్యలేదు. సరే కాని, మీ ప్రయాణ మెలా జరిగింది?"

ఆ ప్రశ్న ఆమె హృదయానికి భారంగా తగిలింది. మరల రీబిన్ మూర్తి ఆమె ఎదుట సాక్షాత్కరించింది. వస్తూనే ఆ విషయాన్ని అతనికి చెప్పనందుకు కొంచెం సిగ్గుపడింది. ముందుకు వంగి తొట్రుపాటేమీ పడకుండా ఏ సంగతినీ మరచిపోకుండా ఉండాలని ప్రయత్నించుతూ కథంతా చెప్పడం మొదలెట్టింది.

"వాళ్లు అతడి నరెస్టు చేశారు."

నికొలాయ్ తల వాల్చేశాడు.

"నిజంగానే?" అన్నాడు.

తల్లి ఆగమని సౌంజ్ఞ చేసి, సాక్షాత్తూ న్యాయం ఎదుట నిలబడి, తన కళ్ల ఎదుట ఒక మానవుని పెట్టిన దారుణ హింసకు అసమ్మతిని తెలియచేస్తున్నట్లుగా చెప్పింది. నికొలాయ్

తెల్లబోయి, కుర్చీలో జార్లపడిపోయి, పెదవులు కొరుక్కున్నాడు. మెల్లగా సులోచనాలను తీసేసి బల్లమీద పెట్టి, ఏదో కంటికగవడని బూజును తుడుచుకున్నట్లు ముఖాన్ని తుడుచుకున్నాడు.

"ఈ సంగతి ఎంత దారుణమో ఆలోచించండి ! నాశనహేతువైన తమ అధికారాన్ని జనంమీద చలాయించడంకోసం, కొద్దిమంది మూర్ఖులు వారిష్టమొచ్చినవారి నెవరినైనా సరే కొడతారు, చంపుతారు! కిరాతకం అధికమవుతుంది, క్రౌర్యమే దేశ చట్ట మవుతుంది. ఏమిటి? అందులో కొందరు తాము చట్టాని కతీతులమనే ధీమాతో అడవి జంతువుల్లాగ క్రూరంగా విజృంభిస్తారు. చిత్రహింసలపాల్జేయడం వాళ్లకొక సహజాత వాంఛ సంకెళ్లు లేని బానిసలు తమ బానిస భావాలనూ, పశు ప్రవృత్తులనూ వ్యక్తం చేసేందుకు క్షుద్రవాంఛ. ప్రతీకార బుద్ధితో కొందరి హృదయాలు విషపూరితమవుతున్నాయి. కొందరు తాము స్వయంగా తిన్న కొరడా దెబ్బలవల్ల మొద్దుబారిపోతున్నారు. జనాన్ని నీతిహీనులను చేసేస్తున్నారు. యావత్తు జనాన్నీ!"

అతను నిలబడిపోయి పళ్లు బిగించాడు.

"మన గుమ్మం దగ్గర గూఢచారులున్నారు. వాళ్ల కళ్ల బడకుండా ఇన్ని కాగితాలను బయటికి దాటించలేము. వాటిని దాచడానికిక్కడ చోటు కూడా లేదు. ఈ రాత్రి వాళ్లింకొక సారి సోదాచేస్తారని అనుకుంటున్నాను. కనుక మన కెంత కష్టంగా ఉన్నా, వాటినన్నింటినీ తగలెయ్యక తప్పదు."

"వేటిని తగలెయ్యాలి?" అని తల్లి అడిగింది.

"మీ పెట్టెలో ఉన్న సరుకును."

చటుక్కున అతనే మనుకుంటున్నాడో ఆమె గుర్తుకు తెచ్చుకుని, అంత విచారంలో కూడా సగర్వంగా చిన్ననవ్వు నవ్వింది.

"అందులో ఏమీ లేవు ఒక్క కరపత్రం కూడా లేదు" అంది. తర్వాత అక్కడ జరిగినదంతా చెప్పడం మొదలెట్టింది. దానితో ఆమెకు క్రమక్రమంగా బలం చేకూరింది.

మొదట్లో నికొలాయ్ ఆత్రంగా చిరచిరలాడేడు. పిమ్మట ఆశ్చర్యచకితుడయాడు. చివరకు ఆవేశంతో ఆమె మాటకడ్డెళ్లేడు.

"అద్భుతం! మీ అదృష్టం ఎంత గొప్పదో! ప్రజల మీద మీకుండే విశ్వాసం ఆమోఘం. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నా కన్నతల్లిలాగే ప్రేమిస్తున్నాను!" అని ఆమె చేతులను గట్టిగా పట్టుకున్నాడు.

ఎందుకితడింత హఠాత్తుగా సంతోషంతో ఉత్తేజితుడైనాడాయన ఆమె ఆశ్చర్యంతో అతనికేసి చూస్తూ చిరునవ్వు నవ్వింది.

"చాల గొప్ప అదృష్టమనుకోండి!" అని సంతోషం వెలిబుచ్చాడు. "మీరు కూడా తేలిగ్గా దొరికిపోయేవారే.. దానికి బదులు... అవునులెండి. రైతులు మేల్కొంటున్నారు అదీ సహజమే. ఆ స్త్రీ ఆమె మూర్తి నా కళ్ల ఎదుట మెదుల్తోంది.... గ్రామాల్లో పనిచేయడానికి, మనం ప్రత్యేకమైన మనుషులను పంపవలసిన అగత్యముంది. అయితే మనుషులేరి? చాలినంతమంది లేరు. మనకు వందలాదిగా కావాలి!"

"పాషయే బయట ఉంటేనా! అన్‌ద్రేయ్ కూడా!" అంది మెల్లగా తల్లి.

అతడామెకేసి చూసి, తల వాల్చేశాడు.

"నీలొవ్నా! నేను చెప్పే మాట మీకు చాలా కష్టంగా ఉండవచ్చు. కాని నేను పావెల్‌ను బాగా అర్థంచేసుకున్నాను. అతడు జైలు నుంచి తప్పించుకు రావడానికి ఇష్టపడడు. అతడు విచారణే కోరుకుంటాడు. తలెత్తుకుని నిలబడి తను చెప్పవలసినదంతా చెప్పడానికి అతనికొక సావకాశం కావాలి. అలాటి సావకాశాన్ని అతను వదలుకోడు. ఎందుకు వదులుకోవాలి? సైబీరియానుంచే పారిపోయి వస్తాడు."

నికొలాయ్ బల్లదగ్గర కూచుని రాయడం మొదలెట్టేడు. బల్లను సర్దుతూ, అతడికేసి చూసీ చూడనట్టుగా చూసింది. అతని చేతిలోని కలం వణకడం ఆమె గ్రహించింది.

చివరకు అతడు లేచి నిలబడి :

"తయారైంది. ఇదిగో ఈ కాగితాన్ని మీ వంటిమీద దుస్తుల్లో ఎక్కడో రహస్యంగా దాచండి. కాని గూఢచారులొస్తే మిమ్మల్ని కూడా సోదా చేస్తారు. సుమండీ!"

"వాళ్ల కర్మకు వాళ్లనొదిలేద్దురూ!" అని అలక్ష్యంగా జవాబుచెప్పింది.

ఆ సాయంకాలం డాక్టర్ ఇవాన్ దనీలొవిచ్ వచ్చాడు.

"హఠాత్తుగా అదికారులింత ఖంగారు పడుతున్నారేమిటి? నిన్న రాత్రి ఏడు ఇళ్లను సోదాచేశారు. నేను చికిత్స చేసే రోగి ఏడి?" అని గబగబా అటూ ఇటూ తిరుగుతూ అడిగేడు.

"సరే, ఇవాన్! నీకిక్కడేమీ పనిలేదు. అతిథులొస్తారనుకుంటున్నాం. వెళ్లిపో! నీలొవ్నా, కరపత్రాన్ని అతని కియ్యండి."

"ఇంకొక కరపత్రమా!" అని డాక్టర్ ఆశ్చర్యపడ్డాడు.

"అవును. దీన్ని తీసుకెళ్లి అచ్చాఫీసులో ఇచ్చెయి."

"అలాగే ఇచ్చేస్తాను. ఇంకేమైనా పనుందా?"

"ఇంకేమీ లేదు. గేటు దగ్గర గూఢచారి నిలబడ్డాడు."

"నేను చూశాను. నా ఇంటి గుమ్మం దగ్గర కూడా ఒకడున్నాడు. సరే. మరి వెళ్లొస్తాను. కఠిన హృదయురాలా! శలవు. సరే కాని, మరొక సంగతి. స్మశానం దగ్గర జరిగిన దెబ్బలాట మంచికే వచ్చింది సుమా! ఊరంతా ఆ సంగతే చెప్పుకుంటున్నారు. నువ్వు రాసిన కరపత్రం బాగుంది. పైగా, సరైన సమయాని కందింది. అందుచేతనే నేనెప్పుడూ నిర్ధకరమైన శాంతికన్న ఉపయుక్తమైన పోరాటం మేలంటూ ఉంటాను."

"సరేలే. వెళ్లు."

"నువ్వు ఎక్కువ అతిధ్య గౌరవాన్నిచ్చావని నేను చెప్పను. నీలొన్నా, చెయ్యియ్యండి. ఆ కుర్రవాడు మాత్రం చాలా అవివేకమైన పనిచేశాడు. అతడెక్కడుంటాడో నీకు తెలుసునా?"

నికొలాయ్ ఆ యువకుని చిరునామా ఇచ్చాడు.

తల్లి వాళ్ల సంభాషణను విని, కార్మికవర్గానికి చెందిన ఆ పిల్లవాడి విషయంలో వాళ్లు పడుతున్న ఆదుర్దాకు చాలా సంతోషపడింది.

"ఇక పోలీసులు రారన్నమాటే!" అన్నాడు హఠాత్తుగా నికొలాయ్.

"వాళ్ల కార్మం వాళ్లదే! మనకెందుకూ?" అని తల్లి నికొలాయ్‌కేసి తేరిపార చూచింది.

వంటింటి తలుపును గట్టిగా ఎవరో తట్టడంతో తల్లికి మెళకువ వచ్చింది. తట్టే వారెవరో కాని విడవకుండా ఓపికతో తట్టుతూనే ఉన్నారు.

"ఎవరు వారు?" అని అడిగింది.

"నేను" అని అపరిచితమైన కంఠం జవాబిచ్చింది.

"నే నంటే?"

"తలుపు తియ్యవమ్మా!" అని సన్నని గొంతుకతో అతడు ప్రాధేయపడ్డాడు.

తల్లి గడియ పైకెత్తి కాలితో తలుపు తోసి తెరిచింది. ఇగ్నాతియ్ లోపలికొచ్చాడు.

అయితే, నేనేమీ పొరబాటు పడలేదన్నమాటే!" అని సంతోషంతో కేకేశాడు.

అతనికి మొలదాకా అడుసు చిందులున్నాయి. ముఖం వెలవెల బారింది. కళ్లు గుంటలట్టేయి. ఉంగరాలజుట్టు టోపీలోనుంచి నాల్గు వైపులా బయటికొచ్చింది. వెనకనుంచి తలుపేస్తూ,

"మేము ప్రమాదంలో పడ్డాం!" అని చెవిలో చెప్పేడు.

"నాకు తెలుసు."

ఆ మాట చెప్తూంటే, యువకుడు ఆశ్చర్యపోయాడు.

"మీకెలా తెలిసింది?" అని కళ్ళు చిట్లిస్తూ అడిగేడు.

క్లుప్తంగా ఆమె కథంతా చెప్పింది.

"మీ కామ్రేడ్సున్నారే, వాళ్ళిద్దర్నీ కూడా వాళ్ల పట్టుకున్నారా?"

"వాళ్లక్కడ లేరు. వాళ్లు సైన్యంలో చేరేరు. హాజరు చెప్పుకునేందుకు వెళ్లిపోయారు. మిహయిల్ మామతో కలిసి అయిదుగుర్ని పట్టుకుపోయారు."

"ఎంతయినా మిహయిల్ మామ వెనుకాడలేదు. 'ఇగ్నాతియ్, నువ్వు వెంటనే పట్టణానికెళ్లు! త్వరగా! ఆ అవ్వ నెరుగుదురువుకదా?' అంటూనే కాగితంమీద గెలికేడు. 'ఇదిగో ఈ వుత్తరం తీసుకెళ్లి ఆమెకియ్యి' అన్నాడు. వెంటనే నేను పొదల్లో దూరిపోయాను. వాళ్లు వస్తున్న చప్పుడు విన్నాను. నాలుగు మూలలనుంచీ పాక్కుంటూ వాళ్లు చాలామంది వచ్చారు. పిశాచపు వెధవలు! అంతా మా తారుకార్ఖానాను ముట్టడించారు. నేను పొదల్లో నేలబారుగా పడుకుని దాక్కున్నాను. వాళ్లు నా పక్కనుంచే దాటిపోయారు. వాళ్లంతా దాటిపోయాక, లేచి సరాసరి నడక లంకించుకున్నాను. శక్తివంచనలేకుండా ఎక్కడా ఆగకుండా రెండు రాత్రిళ్లూ ఒక పగలూ నడిచి వచ్చాను."

ఈ పని చేసినందుకు అతని ముఖం మీద సంతృప్తిని తల్లి గుర్తించింది. అతడి లేడి చూపుల్లో చిరునవ్వు తొణికిసలాడింది. ఎఱ్ఱటి పెదవులు అదిరేయి.

"ఒక్క నిముషంలో నీకు టీ చేసిస్తాను" అంటూ తల్లి సమొవార్ అందుకుంది.

"ఇదిగో చీటీ" అంటూ ఎంతో కష్టంగా బాధతో రోజుకుంటూ ముఖం చిట్లిస్తూ అతడు తన పాదాన్ని బల్లమీద మోపేడు.

నికొలాయ్ గుమ్మంలోంచి ప్రవేశించాడు.

"నమస్తే కామ్రేడ్, నేను సాయం చేస్తానుండు" అన్నాడు కళ్లు చికిలిస్తూ.

ముందుకు వంగి ఇగ్నాతియ్ పాదానికి చుట్టబడి ఉన్న గుడ్డ పీలికలన్నింటినీ విప్పెయ్యడం మొదలెట్టేడు.

"వొద్దొద్దు" అన్నాడు బాధతో ఆ కుర్రవాడు, తన పాదాన్ని బల్లమీద నుండి లాగేసుకుని, తల్లికేసి ఆశ్చర్యంతో చూస్తూ.

"ఇతడి పాదాన్ని ఆల్కహాలుతో మర్దనా చెయ్యాలి" అంది తల్లి అతని చూపుని లెక్కచేయకుండా.

"ఆహాఁ" అని నికొలాయ్ ప్రత్యుత్తరం ఇచ్చాడు.

నికొలాయ్ తలుపు తోసుకుని లోపలికొచ్చి ఇలా అన్నాడు :

"రెండింటికీ మధ్య ఏముందా? ఎవరు నీ ముక్కుమీద గుద్ది నీ రక్తం కారుస్తున్నారో వాళ్ల చేతులు నాకే వాళ్లున్నారు. ముక్కు వెంబడి రక్తం కారుతుంటే దాన్ని పీల్చేవాళ్లున్నారు."

ఇగ్నాతియ్ అతనికేసి చాలా గౌరవంతో చూశాడు. ఒక్క క్షణమాగి :

"అలాగే కనబడుతూంది!" అన్నాడు.

లేచి నిలబడి మెల్లగా నాలుగడుగు లేశాడు.

"ధన్యవాదాలు. కొత్తగా కాళ్లొచ్చినట్లుంది" అన్నాడు.

తర్వాత అందరూ టీ కోసం భోజనాల గదిలో కెళ్లేరు. అక్కడ ఇగ్నాతియ్ చాలా స్ఫుటమైన కంఠంతో తన జీవిత గాథనంతా చెప్పేడు.

"నేను మన వార్తాపత్రికను పంచిపెడుతుండేవాడిని. నేను నడవడంలో చాలా ఘటికుడిని."

ఆరోజు సాయంకాలం, ఒక నేలకొట్టులో వెసొవ్‌శ్చికోవ్‌కు ఎదురుగా ఇగ్నాతియ్ కూర్చుని నిగూఢంగా చెపుతున్నాడు :

"మధ్య కిటికీని నాల్గుసార్లు..."

"నాలుగు సార్లా?" అని ఆత్రంగా నికొలాయ్ అడిగేడు.

"ఇదిగో ఇలా మూడు సార్లు. ఒకటి, రెండు, మూడు. ఒక క్షణమాగి మరొకసారి ఇలా తట్టు" అని ఇగ్నాతియ్ బల్లమీద తట్టి చూపించాడు.

"సరే."

ఒక ఎర్ర తలకాయగల రైతు తలుపు తెరిచి, 'నువ్వు మంత్రసాని కోసం వచ్చావా?' అని అడుగుతాడు. నువ్వు 'ఔను, ఫ్యాక్టరీ యాజమాని భార్యకోసం' అని చెప్పు. అంతే. అతని కర్థమవుతుంది."

ఇద్దరూ బలమైన మనుషులు దృండంగా తలలు దగ్గరగా పెట్టుకుని గుసగుసలాడుకుంటూ ఉంటే, తల్లి చేతులు కట్టుకు నిలబడి పరిశీలనగా చూసింది. గూఢంగా తట్టడం, సాంకేతికంగా మాట్లాడుకోవడం ఆమె కెంతో తమాషాగా తోచింది.

"నిజంగా, వీళ్లు చిన్నపిల్లలే" అని తనలో అనుకుంది.

అతడు ఛాతీ విరుచుకుని, చేతులు జేబులో పెట్టుకుని, టోపీని ఓరగా ధరించి బయటికెళ్లేడు. బంగారురంగు ఉంగరాల జుట్టు కణతలమీద నాట్యం చేస్తోంది. మెల్లగా తల్లి దగ్గర కొచ్చి,

"అంటే, నాకు కూడా పని చెప్పేరన్నమాట. పనీ పాట లేక నాకు విసుగెత్తిపోతోంది. జైలు నుంచి ఎందుకు పారిపోయివచ్చానా అనిపిస్తోంది. అక్కడ నేనేదో ఒకటి నేర్చుకుంటూ ఉండేవాడిని. ఇక్కడ రాత్రింబగళ్లు దాక్కోవడంతో సరిపోతోంది. పావెల్ మాకు ఆలోచించడం నేర్పేడు. వాళ్లని జైల్లోనుంచి తప్పించడం మాట ఏం చేస్తారు. నీలొవ్నా?" అన్నాడు వెసొవ్‌శ్చికోవ్.

"నాకేమీ తెలియదు" అని అప్రయత్నంగా నిట్టూర్పు విడిచింది.

తలుపు వెనకాల అడుగుల చప్పుడైంది. దగ్గు వినబడింది. లోహపు ముక్కల గణగణ శబ్దమైంది.

"అతనే" అన్నాడు నికొలాయ్.

ఒక సీనారేకు స్నానాల తొట్టె గుమ్మంలోంచి తోసుకొచ్చింది. బొంగురు గొంతుకతో, "దూరు పాత డొక్కు" అంటూ మాటలు వినబడ్డాయి.

తొట్టె ఎగువ ఒక సహృదయుడైన వ్యక్తి ముఖం కనిపించింది. మిడిగుడ్లు, నెరిసిపోయిన జుట్టూ, మీసాలూ స్ఫుటంగా కనిపించాయి.

తొట్టెను లోపలికీడ్వడానికి నొకొలాయ్ తోడ్పడ్డాడు. కొద్దిగా గూనున్న పొడుగాటి మనిషి లోపల ప్రవేశించాడు. గడ్డంలేని బుగ్గలు పూరించి ఖంగుమంటూ దగ్గి, కళ్లెనుమ్మేశాడు. తర్వాత బొంగురు గొంతుకతో అతిథులను పలకరించాడు.

"క్షేమమా?"

"ఆయన్నడగవమ్మా!"

"నన్నడిగేదేమిటి?"

"జైల్లోనుంచి తప్పించడం గురించి."

"అదా" అంటూ మాట్లేసేవాడు మసితో ఉన్న వేళ్లతో మీసాలొత్తుకున్నాడు.

"అతనెంత మారిపోయాడు ! నమ్మడానికి అశక్యంగా వుందే !"

మాట్లేసేవాడి సంగతి జ్ఞాపకమొచ్చి, ఆమె దాదాపు ప్రార్థనాపూర్వకంగా తనలో తానే అనుకుంది : "ఈ కొత్త జీవితాన్ని అవలంబిస్తున్నదాన్ని నేనొక్కర్తినే కాదన్నమాట!" తర్వాత ఆమె ఆలోచన కొడుకు మీదకు పోయింది. "అతనొప్పుకుంటేనా!" అనుకుంది.

* * *

మరుసటి ఆదివారం, జైలాఫీసులో పావెల్‌తో మాట్లాడి వచ్చేస్తుంటే, తల్లి చేతినాతడు పట్టుకుని చిన్న కాగితపు ఉండను అందిచ్చాడు.

"వెళ్లొస్తా" అని తల్లి నిట్టూర్చింది.

అతడు మళ్లీ చెయ్యి అందిచ్చాడు. అతని ముఖంమీద ప్రేమ ద్యోతకమైంది.

"అమ్మా, వెళ్లిరా!" అన్నాడు.

ఆమె చెయ్యి పట్టుకుని అలాగే నిలబడిపోయింది.

"బెంగపెట్టుకోకమ్మా. కోపం తెచ్చుకోకు" అన్నాడు.

మరల అతనికేసి చూడకుండానే బయటి కొచ్చేసింది. తన కళ్లలోని నీటి బిందువులను, పెదవుల అదురుబాటును అతడు చూడకూడదనుకుంది.

"నాకా సంగతి తెలుసు. అతను రాసింది వినండి. 'కామ్రేడ్స్! మేము తప్పించుకు పారిపోవడానికి ప్రయత్నం చెయ్యం. చెయ్యలేము. మాలో ఎవ్వరూ అందుకొప్పుకొం. అలాటి ప్రయత్నం చేస్తే మా ఆత్మగౌరవానికి భంగం. కాని ఈ మధ్యనే అరెస్టయిన రైతుకు మాత్రం సహాయం చెయ్యండి. అతనికి మీ సహాయం ఎంతయినా కావాలి. ఎంత చేసినా చెయ్యదగినవాడు. ఇక్కడతను చాలా చిక్కుల్లో ఉన్నాడు. ప్రతి రోజూ అధికారులతో దెబ్బ లాడుతున్నాడు. అప్పుడే ఇరవై నాలుగు గంటలు చీకటి కొట్లో ఉన్నాడు. వాళ్లు అతన్ని చిత్రహింస పెట్టి చంపేస్తారు. అతనికి సహాయం చెయ్యాలని మేమందరం మిమ్మల్ని కోరుతున్నాం. మా అమ్మను ఓదార్చండి. ఆమె కంతా చెపితే, అర్థం చేసుకుంటుంది."

తల్లి తల పైకెత్తింది.

"చెప్పడానికేముంది? నా కప్పుడే అర్థమైపోయింది" అని గద్గద స్వరంతో చెప్పింది.

నికొలాయ్ పక్కకు తిరిగి, జేబు రుమాలు పైకి తీసి, ముక్కు చీదుకున్నాడు.

"నికొలాయ్ ఇవానొవిచ్ ! నన్ను గురించి మీరేమీ ఆదుర్దాపడకండి. నాకు మీరేమీ విపులంగా చెప్పనక్కర్లేదు. ఓదార్చనక్కర్లేదు. పావెల్ సరైన పనే చేస్తాడు. వాడు తననూ తన స్నేహితులనూ వృథాగా బాధపడనివ్వడు. వాడికి నేనంటే ఎంతో ప్రేమ. నన్ను గురించి ఎంతగా ఆలోచిస్తున్నాడో మీకు కనబడుతోంది. 'ఆమెకు విశదంగా తెలియపరచండి, ఓదార్చండి'..."

ఆమె గుండె దడదడ కొట్టుకుంది, తల తిరిగింది.

"మీ కొడుకు అద్భుతమైనవాడమ్మా! అతనంటే నాకెంతో గౌరవమో చెప్పలేను" అని అసహజంగా బిగ్గరగా అన్నాడు నికొలాయ్.

"రీబిన్‌కు సహాయం చేసే మార్గమేమిటో ఆలోచిద్దాం" అని తల్లి సూచించింది.

ఆ క్షణమే ఆమె ఏదో పనిలో పడాలనుకుంది, ఎక్కడకో పోవాలనుకుంది, అలసటొచ్చి పడిపోయేవరకూ నడవాలనుకుంది.

గంట మళ్లీ మోగింది. ఈసారి అంత గణగణ మోగలేదు. లోపలి కొద్దామా వద్దా అనే సంకోచంతో గంట నొక్కినట్లనిపించింది. ఇద్దరూ తలుపు తియ్యాలని బయల్దేరేరు. తీరా వంటింటి దగ్గ కొచ్చేసరికి నికొలాయ్ పక్కకు తప్పుకుని,

"మీరే వెళ్లండి" అన్నాడు.

తల్లి తలుపు తియ్యడంతోనే,

"అతను నిరాకరించాడా?" అని ఆ పిల్ల అడిగింది.

"ఔను."

"మనం రీబిన్‌ను విడిపించాలని రాశాడు" అని తల్లి ఆమెకేసి చూడకుండానే చెప్పింది.

"అలాగా? ఆ పని చెయ్యాలంటే, మనం పాత పథకాన్నే ఉపయోగించాలి" అంది సాషా.

"నన్ను చెయ్యనివ్వండి. నాకు టైముంది" అని సాషా చటాలున లేచి చెప్పింది.

"సరే. కాని మీరు మిగిలినవాళ్లందర్నీ కలుసుకుని సంప్రదించాలి...."

తల్లీ, నికొలాయ్ కిటికీ దగ్గరకెళ్లారు, ఆమె తోటను దాటి గేటు తీసుకెళ్లిపోవడం కిటికీలోంచి చూచారు. నికొలాయ్ మెల్లగా ఈల వేశాడు, బల్లదగ్గర కూచుని రాయడం మొదలెట్టేడు.

" చేతినిండా పనుంటేనే ఆమెకు నయంగా ఉంటుంది" అంది తల్లి ఆలోచిస్తూ.

"అవును. ఆ మాట నిజమే" అని నికొలాయ్ బదులు చెప్పేడు. తర్వాత తన దయార్ద్ర వదనంపై చిరునవ్వు తొణికిసలాడగా ఆమెకేసి తిరిగి, "నీలొవ్నా, అలాటి అనుభూతిని మీరెప్పుడూ పొందలేదనుకుంటాను. మీరు ప్రేమించిన మనిషికోసం బాధపడ్డం. పడ్డారా?" అన్నాడు.

"ఉఫ్" అని చెయ్యాడిస్తూ, "నాకు తెలిసినదల్లా పెళ్లిచేస్తారనే భయమొక్కటే!" అంది.

"మీరెప్పుడూ ఎవర్నీ ప్రేమించలేదా?"

"నా కేమీ జ్ఞాపకం లేదు. నేనూ ఎవరినో ప్రేమించాలనుకుంటాను. అయితే నాకిప్పుడేమీ జ్ఞాపకం లేదు. నా భర్త నన్ను కొట్టిన దెబ్బలతో పెళ్లి ముందు జరిగిన సంఘటనలన్నీ తల్లోంచి ఎగిరిపోయాయి" అని తెలిగ్గా, తొణుకూబెణుకూ లేకుండా చెప్పింది.

నికొలాయ్ మళ్లీ బల్లకేసి తిరిగి రాతలో పడ్డాడు. తల్లి కాసేపు బయటి కెళ్లింది. తిరిగి వచ్చేసరికి అతడు పాత కథలను జ్ఞాపకం చేసుకోవడంలో పరవశమైనాడు.

"నాకు మాత్రం సాషాకు జరిగిన అనుభవంలాంటిదే జరిగింది..." అంటూ అతడు ఆమెకేసి ఆప్యాయంగా చూస్తూ అన్నాడు. "నేనొక అమ్మాయిని ప్రేమించాను చాలా అద్భుతమైన పిల్ల. ఇరవై ఏళ్ల వయస్సులో నాకామెతో పరిచయమైంది. అప్పటి నుంచీ నేనామెను ప్రేమించాను. ఇప్పటికీ ప్రేమిస్తూనే ఉన్నాను. హృదయపూర్వకంగా, కృజ్ఞతతో ప్రేమిస్తున్నాను. ఎప్పటికీ ప్రేమిస్తాను."

అతని పక్కనే నిలబడున్న తల్లి అతని కళ్లలో వెచ్చని తేట వెలుగు చూడగలిగింది. అతడు కుర్చీకానుకుని, చేతుల్లో తల పెట్టుకుని ఎక్కడో దూరంగా ఉన్నదాన్ని చూస్తున్నట్లు చూపు నిగిడ్చాడు. సన్నంగా బలంగా ఉండే అతని శరీరం, సూర్యునికేసి పుష్పం సాగినట్లు ఏదో ఒక దృశ్యం వైపు సాగింది.

"ఆమె నెందుకు పెళ్లి చేసుకోకూడదు?" అని తల్లి సూచించింది.

"ఆమెకు నాలుగేళ్ల కిందట పెళ్లి అయిపోయింది."

"మీరే ముందుగా ఎందుకు పెళ్లి చేసుకోలేదూ?"

అతడొక క్షణం ఆలోచించాడు.

"ఏమైతే నేమి. నా పని జరగలేదు. నేను బయట ఉన్నప్పుడు ఆమె జైల్లోనో, ప్రవానంలోనో ఉండేది. ఆమె స్వేచ్ఛగా ఉన్నప్పుడు జైల్లో ఉండేవాడిని. సాషా, పావెల్ వ్యవహారంలాగే. ఔనా? చివరకు ఆమెను పదేళ్ల పాటు సైబీరియాకు, బాగా దూర ప్రాంతానికి పంపేరు. నేను కూడా ఆమె వెంట పోవాలనుకున్నాను. కాని సిగ్గుపడ్డాను. ఆమె కూడా అంతే. అక్కడ ఆమె కింకొకడితో పరిచయమైంది. అతనూ మంచివాడే. నా కామ్రేడ్సులో ఒకడే. వాళ్లిద్దరూ కలిసి ప్రవాసంనుంచి పారిపోయారు. ప్రస్తుతం వాళ్లు పరదేశంలో ఉంటున్నారు."

నికొలాయ్ సులోచనాలను తీసి గుడ్డతో తుడిచి, వెలుతురులో చూసి మళ్లీ తుడిచాడు.

"అయ్యో నాయనా!" అని తల్లి. ఆప్యాయంగా తలపంకిస్తూ అంది. అతన్ని చూస్తే ఆమెకెంతో విచారం కలిగింది. కాని అతనిలో ఏదో వింత స్ఫురించి, తల్లి బిడ్డను చూసి నవ్వినట్లు చిరునవ్వు నవ్వింది. అతను స్థలం మారి, కలం తీసుకుని తను మాటాడే మాటలకు లయబద్ధంగా ఊపుతూ ఇలా అన్నాడు:

"కుటుంబ జీవితం విప్లవకారుని సత్తానంతనీ పీల్చేస్తుంది. దానికి దోహదమివ్వదు. పిల్లలు, రక్షణ లేకపోవడం, కుటుంబపోషణ కోసం పనిచెయ్యవలసిన అగత్యమేర్పడడం,

మొదలైనవన్నీ ప్రతిబంధకాలే. విప్లవకారుడు తన శక్తిని నిలవచేసుకుని తన కార్యక్రమాలను విస్తరింపచెయ్యాలి. ప్రస్తుత కాలాన్ని బట్టి అలా చెయ్యక తప్పదు. పాత ప్రపంచాన్ని నాశనం చేసి కొత్త ప్రపంచాన్ని నిర్మించడానికి చరిత్ర మనల్ని కార్మికులను ఎన్నుకొన్న కారణంచేత, మనం మిగిలిన వాళ్లందరికన్నా ఎల్లప్పుడూ ముందే అడుగెయ్యాలి. ఈ విషయంలో, అలసటవల్లనో, స్వల్ప విజయాల నాశించో మనం వెనకాడితే, అపరాధం చేసిన వాళ్లమవుతాం. దాదాపు మన లక్ష్యానికి ద్రోహం చేసినవాళ్లమవుతాం. మన లక్ష్యానికి నష్టం కలుగకుండా, పక్కపక్కగా నడవదగినవారెవరూ లేరు. మన లక్ష్యం చిన్నచిన్న విజయాలు సాధించడం కాదనీ పరిపూర్ణమైన విజయం సాధించడమేననీ ఎన్నటికీ మరచిపోకూడదు."

అతని కంఠధ్వని చాలా స్ఫుటమైంది. ముఖం వెల్లబారింది. కళ్లు మామూలుగానే నిర్మలంగా ప్రకాశించాయి. తలుపుగంట మోగింది. చలిచేత బుగ్గలెర్రపడి, శరీరమంతా వణుకుతూ లుద్మీలా ప్రవేశించింది. ఆమె కోటు చలికాలానికి పనికొచ్చేటట్లు లేదు.

"వచ్చేవారం విచారణ జరుగుతుంది" చినిగిన రబ్బరు జోళ్లు విప్పేస్తూ చెప్పింది.

"మీకు నిశ్చయంగా తెలుసా?" అని పక్కగదిలోనుంచి నికొలాయ్ కేకేశాడు.

తల్లి అతని దగ్గరకు పరుగెత్తింది. తన హృదయాన్ని కలచివేస్తున్నది భయమో, సంభ్రమమో ఆమెకు తెలియడం లేదు. ఆమెతో కూడా లుద్మీలా వెళ్లింది.

"అవును, తెలుసు. శిక్ష కూడా అప్పుడే నిశ్చయమైపోయిందని కోర్టు భవనంలో విపరీతంగా చెప్పుకుంటున్నారు" అంది.

మూడు రోజులపాటు తల్లి ఏమీ తోచక విచారంగానూ, ఆదుర్దాగానూ కాలక్షేపం చేసింది. మూడవ నాడు సాషా ప్రత్యక్షమైంది.

"సర్వం సంసిద్ధమైంది. ఇవ్వేళే ఒంటి గంటకు" అంది నికొలాయ్‌తో.

"ఇంత త్వరలోనే? రీబిన్ కట్టుకునేందుకు బట్టలూ, ఉండేటందుకు స్థలమూ ఇప్పుడు నేను చూడాలి. మిగిలిన పనంతా గొబూన్ చేసేశాడు. రీబిన్ ఒక ఫర్లాంగు నడిచి వెళ్లాలి. వెసోవ్‌శ్చికోవ్ అతన్ని కలుసుకుని కోటూ, టోపీ ఇచ్చి, దారి చూపిస్తాడు. కొంచెం ముందుకు సాగేక, నేను ఇతర బట్టలతో కనిపెట్టుకుంటాను."

"బాగుంది. కాని ఈ గొబూన్ ఎవరు?"

"అతన్ని మీరెరుగుదురు. మెకానిక్‌లతో మీ అధ్యయన గోష్ఠి అతడి గదిలోనే జరుగుతుండేది."

"ఔనౌను. జ్ఞాపకమొచ్చింది. చాలా తమాషా మనిషే."

ముగ్గురూ కిటికీ దగ్గర నిలబడ్డారు. నికొలాయ్ సాషాల వెనుక తల్లి నిలబడింది. వాళ్లు గబగబ మాట్లాడుకుంటుంటే ఆమె హృదయంలో భయమూ, సంతోషమూ కలిగేయి. చటుక్కున :

"నేనూ వెడతాను" అంది.

"ఎందుకు?" అని సాషా అడిగింది.

"అమ్మా! మీరెళ్లవద్దులెండడి. మీ కేదైనా ప్రమాదం రావచ్చు. మీరెళ్లద్దు" అని సలహా చెప్పేడు నికొలాయ్.

మీతో నన్ను తీసుకెళ్లండి. మీకు నేనేమీ అడ్డురాను! నేను వెళ్లితీరాలి! పారిపోయి రావడం సాధ్యమని నాకు నమ్మకం కలగడం లేదు."

"ఆమె కూడా మనతో వస్తుంది." అంది సాషా నికొలాయ్‌తో.

"సరే. మీ యిష్ట మొచ్చినట్లే కానియ్యండి" అన్నాడు తలొంచుకుని నికొలాయ్.

ఒక గంటైన తర్వాత ఆమె జైలు దగ్గర ఉన్న ఖాళీ జాగా మధ్యకు చేరుకుంది. గాలి జోరుగా వీచి పావడంమీద కొట్టింది, ఆమె నడుస్తున్న తోటయొక్క పాత కంచెను ఊగిసలాడించింది, తన శక్తి అంతటితోనూ గాలి జోరుగా జైలు గోడమీద విరుచుకుపడింది. జైలు ఆవరణలోంచి మనుషుల కేకలను ఈ గాలి మేఘావృతమైన ఆకాశానికి ఎగరేసింది.

తల్లి వెనక తోట ఉంది. ముందు స్మశాన భూమి ఉంది. కుడి వైపున సుమారు డెబ్బై అడుగుల్లో జైలుంది. స్మశానం దగ్గర ఒక సిపాయి గుర్రానికి కవాతు నేర్పుతున్నాడు. మరొక సిపాయి అతని పక్కనే నిలబడి, అరుస్తూ, నవ్వుతూ ఈలేసుకుంటూ నేలను కాలితో గట్టిగా తట్టుతున్నాడు. జైలు సమీపాన మరెవ్వరూ లేదు.

తల్లి వాళ్ల పక్కనుంచే, వెనక్కీ పక్కకూ దొంగచూపులు చూసుకుంటూ, స్మశానం కంచెదాకా వెళ్లింది. హఠాత్తుగా ఆమె మోకాళ్లు పట్టేశాయి. పాదాలు గడ్డకట్టి భూమికంటుకు పోయినట్లయినాయి. ఆ మలుపులోకి దీపాలు వెలిగించే గూని మనిషి ఒక భుజాన నిచ్చెన వేసుకుని తొందరగా వచ్చాడు. సాధారణంగా దీపాలు వెలిగించేవాళ్లు అలాగే తొందర పడుతుంటారు. భయంచేత బిత్తరచూపులు చూస్తూ, తల్లి సిపాయిలకేసి చూసింది : వాళ్లు ఒకే చోట నిలబడున్నారు. గుర్రం వాళ్ల చుట్టూ దవుడు తీస్తోంది. తల్లి, నిచ్చెన భుజాన వేసుకున్న మనిషిని చూసింది. అతనప్పుడే నిచ్చెనను గోడకాన్చి, తాపీగా పైకెక్కుతున్నాడు. గోడమీద కెళ్లిన తర్వాత, అతను చేతిని విసిరేడు. వెంటనే కిందకు దిగిపోయి మలుపు తిరిగి అదృశ్యమైపోయాడు. తల్లి గుండె దగదడ కొట్టుకుంది. క్షణాలు యుగాల్లా గడుస్తున్నాయి. డాగులు పడి రంగుపోయి, బెల్లులూడిపోయి, ఇటికలు అగపడుతూ మచ్చలతో నల్లగా ఉన్న

జైలు గోడమీద, నిచ్చెన ఎక్కడా ఆనవాలు ఆగపడ్డం లేదు. ఆకస్మాత్తుగా గోడపైన నల్లని తల కనపడింది. తర్వాత ఒక ఆకారం గోడమీద అడ్డుగా కూచుని కిందకు జారిపోయింది. బొచ్చు టోపీతో మరొక తల కనపడింది. నల్లని ఉండలాటి దొకటి భూమిమీదకు దొర్లి మళుపులో మాయమైపోయింది. మిహయిల్ లేచి నిలబడి ఒళ్లు విరుచుకుని, నాలుగు మూలలా చూసి తలాడించాడు....

తల్లి పాదాన్ని నేలమీద తట్టుతూ :

“పరుగెత్తు ! పరుగెత్తు ! ” అని గొణిగింది.

ఆమె చెవులు గింగురు మన్నాయి. పెద్ద పెద్ద అరుపులామె వింది. గోడమీద మూడవ తలకాయ అగుపడింది. తల్లి రొమ్ము గట్టిగా నొక్కుకుని ఊపిరి ఉగ్గ బట్టి చూసింది. గెడ్డం లేని యువకుని గోధుమవన్నె తల పైకి లేచింది. కాని వెంటనే గోడ వెనకనే మాయమైపోయింది. కేకలు మరింత పెద్దవైనాయి. మరింత ఆవేశపూరితంగా ఉన్నాయి. కుంయ్యిమని ఈలలు గాలిలోకి జోరుగా లేచాయి. మిహయిల్ గోడ పక్కగానే పొడుగునా నడిచాడు.

“త్వరగా, త్వరగా!” అని ఆమె గొణుక్కుంది.

జైలు గోడ వెనకాల ఏదో ఖంగుమని శబ్దమైంది. అద్దం బద్దలైన చప్పుడామెకు వినబడింది. ఒక సిపాయి పాదాలను నేలమీద నిలదొక్కుకుని గుర్రం తాడును లాక్కున్నాడు. రెండవ సిపాయి నోటి దగ్గర చెయ్యి పెట్టుకుని జైలుకేసి తిరిగి బిగ్గరగా అరిచాడు. జావాబుకోసం గాలి వైపుకు చెవొగ్గేడు.

తల్లి ఎంతో కష్టంమీద, నాల్గు వైపులా చూస్తూ నిలబడింది. ఆమె కళ్లకన్నీ కనబడుతున్నాయి, కాని అవి దేన్నీ నమ్మడం లేదు. ఎంతో క్లిష్టమైనదీ, ప్రమాద భరితమైనదీ అనుకున్న వ్యవహారం, అతి చురుగ్గానూ సూక్ష్మంగానూ జరిగిపోయింది. ఈ చురుకుదనం ఆమెను పరువశురాలిని చేసి, ఏమీ తోచకుండా చేసింది. రీబిన్ మాయమైపోయాడు. పెద్ద కోటు తొడుక్కున్న పొడుగాటి మనిషి వీధంట నడుచుకుంటూ వచ్చాడు. చిన్న పిల్ల ఒకామె అతనికన్న ముందు పరుగెత్తింది. ముగ్గురు జైలు వార్డర్లు పరుగెత్తుకుంటూ వచ్చి జైలు మూల మళుపు తిరిగేరు. వాళ్ల కుడి చేతులను చాపుకుంని ఒకరికొకరు దగ్గరగానే పరుగెత్తేరు. సిపాయిల్లో ఒకడు పరుగెత్తు కొచ్చి వాళ్ల కెదురైనాడు. రెండవ వాడు గుర్రం మీదెక్కడానికి గెంతులేస్తున్నాడు.

“అతను కూడా ఇంత తేలిగ్గానూ చెయ్యగల్గేవాడే” అనుకుంది. చటుక్కున ఇద్దరు పోలీసులు మళుపు తిరిగి ఎదురొచ్చారు. అందులో ఒకడు ఒగుర్చుకుంటూ,

“ఆగు! గెడ్డం ఉన్న మనిషిని చూశావూ?” అని అడిగేడు.

ఆమె తోటకేసి వేలు చూపిస్తూ,

"అలా పరుగెత్తేడు ఎందుకూ?" అని నిదానంగా అడిగింది.

"యెగోరొవ్! ఈల ఊదు!"

తల్లి ఇంటికి చేరుకుంది. దేన్ని గురించో ఆమె విచారపడుతోంది. మనసుకు కష్టం, పశ్చాత్తాపం కలిగాయి. ఆ ఖాళీ జాగా దాటి వీధిలోకి రావడంతోనే ఆమె కొక బండి కనిపించింది. అందులోకి చూసేసరికి గోధుమవన్నె మీసాల యువకుడొకడు కంటబడ్డాడు. అలసటచేత అతడి ముఖం వెలవెలాడుతోంది. అతను కూడా ఆమెను చూశాడు. అతను పక్కకు తిరిగి కూచున్నాడు. అందుచేత ఎడమ భుజంకన్న కుడి భుజం ఎత్తుగా కనబడింది.

నికొలాయ్ సంతోషంగా ఆమెను పలకరించాడు.

"సరి. ఏమైంది?"

"అంతా బాగానే జరిగింది."

ఆమె ప్రతి చిన్న విషయాన్నీ జ్ఞాపకం తెచ్చుకుని జైలు నుంచి పారిపోయినవాళ్ల కథంతా పూసగుచ్చినట్లు చెప్పింది. కాని, దాని నిజాన్ని శంకిస్తున్నట్లుగా, ఎవరి కథో తాను మళ్లీ చెప్పినట్లు చెప్పింది.

"అదృష్టం మనపాలిట ఉంది" అన్నాడు నికొలాయ్, చేతులు నులుపుకుంటూ. "మీకేం ప్రమాదమొస్తుందోనని నేను ఎంత ఆదుర్దాపడుతున్నానో దేవుడికే తెలియాలి. వినవమ్మా నీలొవ్నా! స్నేహితుడు చెప్పే సలహా వినండి. ఆ విచారణ గురించి భయపడకండి. అదెంత త్వరగా జరిగిపోతే పావెల్ అంత త్వరగా స్వేచ్ఛను పొందుతాడు. బహుశా ప్రవాసాని కెళ్లే దారిలోంచే అతను పారిపోయి వస్తాడు. ఒక కేసు విచారణ మాటకేమిలే. అది యిలా జరుగుతుంది..."

అతను విచారణ విధానాన్నంతనీ వర్ణించాడు. అతడు మాట్లాడుతుంటే, ఆమెకు ధైర్యం చెప్పాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, అతనికే ఏదో భయమున్నట్లు ఆమె గ్రహించింది.

"నేను అలాంటి ఆలోచనలు చెయ్యకుండా ఉండలేకపోతున్నాను..." అందామె మెల్లగా. "అంచేతనే నాకు విచారణంటే భయమేస్తోంది.... వాళ్లన్నీ పరిశీలనగా చూసి, సుళువు బరువులు తూకం వేస్తే ! అబ్బ ! భయంకరం ! నాకు శిక్షంటే భయమెయ్యడం లేదు. విచారణంటేనే భయంగా ఉంది. దానినెలా వ్యక్తపరచాలో నాకు తెలియడం లేదు..."

నికొలాయ్ తనను అర్థం చేసుకున్నట్లు లేదని ఆమె నిశ్చయించుకుంది. అందుచేత తన భయాన్ని మాటల్లో విశదీకరించడం ఆమెకు మరింత కష్టమైంది.

* * *

భయం, కడుపులో ఒక దిమ్మ పెరిగనట్లు పెరిగి ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసింది. విచారణ రోజున కోర్టు కెడుతుంటే, ఆమెకు తల పైకెత్తడం కష్టమనిపించింది. నిటాగ్గా నిలబడి నడవలేకపోయింది.

"కూర్చో" అంటూ సిజోవ్ బెంచీ మీద ముందుకు జరిగేడు.

తల్లి మాట్లాడకుండా కూచుని పావడా సాపు చేసుకుంది. ఆకుపచ్చనివి, ఎర్రనిచుక్కలు, చారలు, సన్నని పసుపుపచ్చని దారాలు ఆమె కళ్ల ముందరు నాట్యం చేశాయి.

ఒక స్త్రీ ఆమె పక్కనే కూర్చుని :

"నీ కొడుకే మా గ్రీషనీకాడికి తెచ్చాడు" అని సణిగింది.

"ఆ మాటలు కట్టిపెట్టు, నతాల్యా" అన్నాడు సిజోవ్ చిరచిరలాడుతూ.

తల్లి ఆ స్త్రీకేసి చూసింది. ఆమె సమోయ్‌లొవ్ తల్లి. ఆమె పక్కనే ఆమె భర్త కూచున్నాడు. అతడు బట్టతల, పలుచని ముఖం, ఎర్రని జీరాడుతూన్న గడ్డంగల అందగాడు. కళ్లు చిట్లించి ముందుకు తేరిపార జూస్తుంటే, బాధతో అతడి గడ్డం వణికింది.

ఎడమ పక్క ఒక ఎత్తయిన తలుపు తెరుచుకుంది. సులోచనాలు పెట్టుకున్న ఒక ముసలాయన కాళ్లీడ్చుకుంటూ లోపలి కొచ్చాడు. ఆయన గౌరవర్ణపు బుగ్గలమీద సన్నని మీసాలు అదురుతున్నాయి. మీసం లేని పై పెదవి పళ్లు లేని చిగుళ్ల నంటిపెట్టుకుంది. కింది దవడలూ, గెడ్డం ఆయన ఎత్తయిన యూనిఫారం కోటు కాలరు మీద ఆనుకున్నాయి.

పొడుగాటి బల్లదగ్గర వాళ్లందరూ తమతమ స్థానాల్లో కూచునేటప్పటికి చాలా సేపైంది. అది జరిగిన తర్వాత, నిర్దాక్షిణ్యమైన ముఖంతో ఒక గడ్డం లేని మనిషి, ముందుకు వంగి ముసలాయన చెవిలో ఏదో గుసగుసలాడుతూ దట్టంగా ఉండే పెదవులను మెదిపాడు. అతని మాటలు వింటూ ముసలాయన చిత్రంగా నిలువుగా బిర్రుగా కూచున్నాడు. ఆయన సులోచనాల జోడులో, ఏరంగూ లేని రెండు చుక్కలను తల్లి చూసింది.

బల్లకు ఒక చివరనున్న రాత బల్లదగ్గర ఒక పొడుగాటి బట్టతల పెద్దమనిషి నిలబడి, గొంతుక సవరించుకుంటూ కాగితాలు తిరగేస్తున్నాడు.

ముసలాయన ముందుకు వంగి, మాట్లాడ్డం మొదలెట్టేడు. మొదలెట్టేడు. మొదట్లో ఆయన మాట్లాడిన మాటలు స్పష్టంగానే వినిపించాయి. కాని రాను రాను అవి ఒకదానికొకటి సంబంధం లేకుండా పోయాయి.

"నేను విచారణ ప్రారంభిస్తున్నాను... వాళ్లని తీసుకురండి..."

"చూడు" అంటూ సిజోవ్ మెల్లగా తల్లిని తట్టి, లేచి నిలబడ్డాడు.

కమ్ముల వెనుకనున్న తలుపు తెరవబడింది. ఒక సిపాయి తళతళలాడే కత్తిని భుజాన పెట్టుకుని లోపలి కొచ్చాడు. అతని వెంట పావెల్, అన్‌ద్రేయ్, ఫ్యోదొర్ మాజిన్, గూసెవ్ సోదరులు, సమోయ్‌లొవ్, బూకిన్, సోమొవ్, ఇంకా తల్లికి పేర్లు తెలియనివాళ్లు అయిదుగురు యువకులు ప్రవేశించారు. పావెల్ ఆమెను చూసి ఒక చిరునవ్వు నవ్వేడు. అన్‌ద్రేయ్ చిన్న నవ్వు నవ్వి తలాడించాడు. ఎందుచేతనైతేనేమి, వాళ్ల చిరునవ్వులు, ఉత్సాహ పూరితమైన ముఖాలు, సౌంజ్ఞలూ, కృతకంగా ఎబ్బెట్టుగా ఉన్న కోర్టుహాలు వాతావరణాన్ని కొంత తేలికపరచినట్లనిపించింది.

ముసలాయన తలను మెడ పట్టీమీద మోపి, చలనమనేది లేకుండా, ఖైదీలకేసి చూడకుండానే, అవ్యక్తంగా ధ్వనించే ప్రశ్నలను వాళ్ల నడుగుతూ ఉంటే తల్లి ఆలకించింది. తన కొడుకు తొణుకూ బెణుకూ లేకుండా క్లుప్తంగా ఇచ్చే సమాధానలను వింది. ప్రధాన న్యాయమూర్తీ, ఆయన సహాయకులూ, అతని పట్ల క్రూరంగా ఉండలేరనిపించింది.

పింగాణీ ముఖంగల ఉద్యోగి రీవి గొంతుకతో ఒక పత్రాన్ని చదివేడు. దాన్ని వింటుంటే విసుగెత్తి జనం విమూఢులైపోయినట్లు కూర్చున్నారు. నలుగురు న్యాయవాదులు ముద్దాయిలతో చాలా ఆవేశంతో చర్చచేశారు. వాళ్లు చాలా చురుగ్గానూ దృఢంగానూ వ్యవహరించారు. వాళ్లను చూస్తుంటే తల్లికి నల్లగా పెద్దవిగా ఉండే పక్షులు జ్ఞప్తికి వచ్చాయి.

"ఇక్కడ నేరస్తులూ లేరు, న్యాయాధిపతులూ లేరు.... బంధితులూ, బంధించే వాళ్లూ మాత్రమే ఉన్నారు" అని పావెల్ గంభీర స్వరంతో అన్నాడు.

హాలంతా నిశ్శబ్దమైంది. కొన్ని క్షణాల పాటు తల్లికి, కలంతో గబగబ రాస్తున్న శబ్దం, తన హృదయం కొట్టుకుంటున్న శబ్దం తప్ప మరేమీ వినబడలేదు.

ప్రధాన న్యాయమూర్తి కూడా శ్రద్ధగా వింటున్నట్లే కనబడ్డాడు. సహాయ న్యాయాధిపతుల్లో సంచలనం పుట్టింది. చివరకి ఆయన :

"హు. అన్‌ద్రేయ్ నహోద్క! మీరు దోషినని అంగీకరిస్తారా?" అని అడిగేడు.

"నేను దోషినని ఎలా అంగీకరిస్తాను? నేనెవరినీ చంపలేదు. ఎవరి సొమ్మునూ దొంగిలించలేదు. జనం ఒకరినొకరు దోచుకుని చంపుకునేందుకు దారితీసే జీవిత విధానానికి నేను వ్యతిరేకిని. అంతే."

"క్లుప్తంగా జవాబులు చెప్పాలి" అన్నాడు ప్రయత్నంమీద ముసలాయన.

"విన్నావా వాళ్లేమంటున్నారో?" అని సిజోవ్ తల్లి చెవిలో చెప్పేడు.

"ఫ్యోదొర్ మాజిన్, మీ జవాబు చెప్పండి..."

"నేనేమీ చెప్పను" అని అతను చటుక్కున లేచి చెప్పేడు.

సిజోన్ గట్టిగా ఊపిరి తీసుకున్నాడు. తల్లి కళ్లు ఆశ్చర్యంతో వికసించాయి.

"నా తరుపున వాదించడానికి నేను వకీలును పెట్టుకోను. నేనేమీ చెప్పదలచుకోలేదు! ఈ విచారణ చట్టవిరుద్ధమని నా అభిప్రాయం! మీరెవరు? మమ్మల్ని విచారించడానికి ప్రజలు మీకేమైనా అధికార మిచ్చారా? లేదు! వాళ్లేమీ ఇవ్వలేదు. మీ అధికారాన్ని నేను గుర్తించదలుచుకోలేదు!"

"మీ అభిప్రాయమేమిటి?" అని అడిగేడు.

బట్టతల ప్రాసిక్యూటరు నిలబడి ఒక చేతిని బల్లమీద మోపి, గబగబా అంకెలు ఉదహరిస్తూ ఉపన్యసించాడు. అతడి కంఠధ్వని ఏమంత కర్కశంగా లేదు.

అయినప్పటికీ, తల్లికి హృదయంలో మాత్రం ఏదో గుచ్చుకుంటున్నట్లే ఉంది. ఆ వాతావరణంలో ఏదో శత్రుత్వమున్నట్లామెకు ఛాయగా గోచరించింది. అది, పిడికిలి ఊపుతూ అరవడం లేదు కాని, చాల కింద నీరులాగా పైకి కనబడకుండానే, పెరుగుతున్నట్లుంది.

తర్వాత, వాళ్ల ఎదుట ఒక పోలీసు నిలబడి బొంగుర గొంతుకతో,

"పావెల్ వ్లాసొవ్ ప్రధానమైన ప్రోత్సాహకుడని చెప్తారు" అన్నాడు.

"నహోద్క మాటేమిటి?" అని లావుపాటి జడ్జీ ప్రశ్నవేశాడు.

"అతను కూడా..."

ఒక న్యాయవాది లేచి,

"నన్నొక మాట చెప్పనిస్తారా? అని అడిగేడు.

"ఏమైనా అభ్యంతరాలున్నాయా?" అని ముసలాయన అడిగాడు

న్యాయాధీశులందరూ ఏదో రుగ్మతతో బాధపడుతున్నట్లే కనబడుతున్నారు. వాళ్ల వైఖరిని చూసిన మాటలను చూసినా అనారోగ్యంతో ఎంతో అలసిపోయినట్లున్నారు. ముఖంమీద కూడా విసుగూ, నీరసమే గోచరించాయి. ఈ జరుగుతున్న తంతు దుస్తులు, కోర్టు హాలు, పోలీసులు, న్యాయవాదులు, ఈ కుర్చీలలో కదలకుండా కూచుని ప్రశ్నలెయ్యడం, వాటికి సమాధానాలు వినడం అంతా తమకు చాలా శ్రమతో కూడిన వ్యవహారంగా వాళ్లు భావిస్తున్నారన్న విషయం స్పష్టం.

కోర్టు హాల్లో సాక్షులు గబగబా హావభావశూన్యంగా మాట్లాడుతున్నారు. జడ్జీలు ఇదంతా ఎందుకొచ్చిందిరా భగవంతుడా అన్నట్లు అనాసక్తితో వింటున్నారు. లావుపాటి జడ్జీ నోటికి కొవ్వుతో దళమెక్కిన చెయ్యి అడ్డుపెట్టుకుని ఆవులించాడు. ఎర్రమీసాల జడ్జీ ముఖం

మామూలుకన్న వెలవెల బారింది. ఆయన పదే పదే, వేలితో కణతను నొక్కుకుంటూ, కళ్లు మూసుకుని పైకి సరంబీకేసి ఏదో బాధగా చూస్తుండేవాడు. ప్రాసిక్యూటరు మధ్య మధ్య కాగితంమీద గొలుక్కుంటూ, మార్షల్ ఆఫ్ ది నొబిలిటీతో విరామం లేకుండా మాట్లాడుతున్నాడు.

జనం వరండాలో తిరుగుతూ బృందాలుగా చేరి ఆవేశంతో మెల్లగా మాట్లాడుకున్నారు. మొత్తం మీద ఒంటరిగా ఎవడూ నిలబడలేదు. అందరూ ఏదో మాట్లాడాలనీ, ప్రశ్నలు వెయ్యాలనీ, ఇతరులు చెప్పే సంగతులు వినాలనీ ఆతురపడుతున్నారు.

కాపలాదారు కోర్టు హాలు తలుపులు తెరిచాడు.

“చుట్టాలూ! మీ టిక్కెట్లు చూపించండి!” అని కేకవేశాడు.

“టిక్కెట్లట!” అని ఎవరో వెటకారంగా వ్యాఖ్యానించాడు.

ప్రజల్లో అవ్యక్తమైన ఆవేశం రేగినట్లగుపడింది. ఎక్కువగా మాటల్లో పడ్డారు. ఉద్రిక్తత తగ్గింది. కాపలాదార్లతో వాదోపవాదాలు వేసుకున్నారు.

సిజోవ్ బెంచీమీద యధాస్థానంలో కూచుంటూ ఏదో గొణుక్కున్నాడు.

“ఏమిటది?” అని తల్లి అడిగింది.

“ఏమీ విశేషం లేదు. జనం మూర్ఖులు…”

గంట మోగింది.

“నిశ్శబ్దం…”

జడ్జీలు వరసగా ప్రవేశించి ఇదివరకు మల్లేనే తమతమ స్థానాల్లో ఆసీనులయ్యేవరకు అందరూ లేచి నిలబడ్డారు. ఖైదీలు వారి స్థానాల్లోకి తీసుకు రాబడ్డారు.

“మనస్సు చిక్కబట్టుకో! ప్రాసిక్యూటరు వాదించబోతున్నాడు” అన్నాడు సిజోవ్.

ఏదో గొప్ప భయంకరమైన సంగతి జరగబోతున్నట్లుగా తల్లి శరీరాన్నంతనీ ముందుకు వంచింది.

ప్రాసిక్యూటరు జడ్జీలకు కుడి వైపున నిలబడ్డాడు. ఒక మోచెయ్యి బల్లమీద ఆన్చి దీర్ఘంగా నిట్టూర్చి, కుడి చేతిని పైకి విసిరి ఉపన్యాసం ప్రారంభించాడు. మొదట్లో అతను చెప్పిన మాటలను తల్లి గ్రహించలేకపోయింది.

“అతను బొంకుతున్నాడు” అని సిజోవ్ ఆమె చెవిలో చెప్పేడు.

ఆమెకలా ఆవుపడలేదు. ప్రాసిక్యూటరు మినహాయింపులేమీ లేకుండా అందరిమీదా నేరారోపణ చేస్తున్నాడు. పావెల్‌ను గురించి చెప్పిన తర్వాత ఫ్యోదొర్ గురించి చెప్పేడు. తర్వాత బూకిన్ గురించి ప్రస్తావించాడు. వాళ్లందరినీ చక్కగా ఒకే సంచీలో మడతొక్కే

స్తున్నట్లున్నాడు. తల్లికి అతడు చెప్పే మాటల అర్థం సంతృప్తిని కలిగించలేదు. ఆ మాటలామెను ఆవేశపరవశురాలిని చెయ్యలేదు. భయపెట్టనూ లేదు.

ప్రాసిక్యూటరు ఉపన్యాసం అనుకున్న దానికన్న ముందుగా చటుక్కున ముగిసింది.

జడ్జీలు అతడి ఉపన్యాసంతో తృప్తిపడినట్లు కనిపించలేదు. వాళ్లలో ఏమీ చలనం కలుగలేదు. ముసలి జడ్జీ ఒక కాగితాన్ని ముఖాని కడ్డు పెట్టుకుని,

ఇప్పుడింక కోర్టువారు, ముద్దాయిలైన ఫెదొసేయెవ్, మార్కొవ్, జగారొవ్‌ల తరపున న్యాయవాది వాదాన్ని వింటారు" అన్నాడు.

"అర్థమైందా అతనేమి చెప్పేడో?" అని సిజోవ్ ఆమె చెవిలో గొణిగాడు. "అర్థమైందా? ఖైదీలు మతి తప్పినవారని చెప్పేడు. మా ఫ్యోదొర్ మతి తప్పినవాడా?"

ఆమె మనస్తాపం చేత జవాబు చెప్పలేకపోయింది. హృదయానికి తగిలిన గాయం పెద్దదై భారాన్ని హెచ్చరించింది. న్యాయం జరుగుతుందని తాను ఆశించినట్లామెకు స్పష్టమైంది. తన కొడుకు మీద చేయబడిన నేరారోపణలను, నిష్పక్షపాతంతోనూ నిజాయితీతోనూ తూకం వేస్తారనుకుంది.

అలసట చేత తల్లికి విసుగుపుట్టి, విచారణయందు ఆసక్తి పోయింది. తర్వాత జరిగిన సంగతుల నామె వినిపించుకోనే లేదు.

"దీని నొక విచారణంటారా?" అని అసమ్మతిగా తనకు తానే ప్రశ్న వేసుకుంది.

ఇంతట్లో పావెల్ లేచి నిలబడ్డాడు. కోర్టు హాలంతా నిశ్శబ్దమైంది. తల్లి బాగా ముందుకు నడుము వాల్చింది. పావెల్ ప్రశాంతంగా మాట్లాడేడు.

"పార్టీ మెంబరుగా నేను నా పార్టీ వారి తీర్పునే గుర్తిస్తాను. కనుక నాకేసుపరంగా నేనేమీ చెప్ప దలచుకోలేదు. కాని నావలెనే వాదించడానికి నిరాకరించడానికి మిత్రుల కోరికపైన, మీరు అర్థం చేసుకోని కొన్ని విషయాలను మీకు తెలియచెప్పడానికి ప్రయత్నిస్తాను. సోషల్ డెమోక్రటిక్ పార్టీ పతాకం ఆధ్వర్యాన మేము జరిపిన ప్రదర్శన ప్రభుత్వాధికారం మీద తిరుగుబాటని ప్రాసిక్యూటర్ అన్నాడు. జారును కూలదోసేందుకు ప్రయత్నించే వాళ్లనుగానే ఆయనెప్పుడూ మమ్మల్ని పరిగణించాడు. నిరంకుశ ప్రభుత్వమొక్కటి మాత్రమే మన దేశాన్ని బంధిస్తున్న గొలుసని మా అభిప్రాయం కాదని ఇందు మూలంగా స్పష్టీకరిస్తున్నాను. అది మొదటి బంధనం మాత్రమే. ప్రజలను ఆ సంకెళ్ల నుంచి తప్పించడం మా విధియని భావిస్తున్నాం."

పావెల్ గంభీరంగా మాట్లాడుతుంటే నిశ్శబ్దం మరింత ప్రగాఢమైంది. హాలు పెద్దదైనట్లనిపించింది. పావెల్‌ను పైకెత్తి ఉన్నతాసనం మీద కూర్చోపెట్టినట్లనిపించింది.

"మేము సోషలిస్టులం, అంటే సొంత ఆస్తి సంపాదనకు వ్యతిరేకులం. సొంత ఆస్తి వ్యవస్థవల్ల సంఘం విచ్ఛిన్నమవుతుంది. ప్రజలు ఒకరితో ఒకరు కలహిస్తారు... వ్యక్తిగతమైన లాభంకోసం, జనం ఒకరితో ఒకరు కలవకుండా నిరోధపడుతూ ఉంటారు, ఈ శత్రు వైరుధ్యాన్ని కప్పిపుచ్చడానికీ, సమర్థించుకొడానికీ అబద్ధాలాడుతారు. సొంత ఆస్తి జనాన్ని అబద్ధాలాడిస్తుంది. అవినీతిపరులను చేస్తుంది. దగా చేయిస్తుంది. ద్వేషాన్ని పెంచుతుంది. ఏ సంఘమైతే, వ్యక్తిని కేవలం కొద్దిమందిని ధనవంతులను చేసే సాధనంగా మాత్రమే భావిస్తుందో, ఆ సంఘం అమానుషమైందనీ, మా ప్రయోజనాలకు భంగకరమైనదనీ మా విశ్వాసం. అలాటి సంఘం చెప్పే నీతులు శుద్ధ అబద్ధాలనీ, మోసపూరితములనీ భావిస్తూ వాటిని మేము తిరస్కరిస్తున్నాం. వ్యక్తిపట్ల ఈ సంఘం వ్యక్త పరచే విద్వేషాన్నీ, దౌష్ట్యాన్నీ మేము ఖండిస్తున్నాం. ఈ సంఘం, వ్యక్తులను దాస్య శృంఖలాలతో బంధించడానికి చేసే సకల ప్రయత్నాలనూ మేము ఎదుర్కొంటాం. స్వార్థపరమైన ఆశకోసం మానవులను అణగదొక్కడానికి చేసే పనులను ప్రతిఘటిస్తాం. మేము కార్మికులం. అనగా ఎవరి కాయకష్టంచేత పిల్లల ఆటవస్తువులు మొదలు పెద్ద పెద్ద భారీ యంత్రాల వరకూ తయారవుతున్నాయో, ఆ కార్మికులం. అయినప్పటికీ మా ఔన్నత్యాన్ని సంరక్షించుకునే హక్కు మాకు లేకుండా చెయ్యబడింది. తమ స్వార్థం కోసం ఎవరైనా మమ్మల్ని ఉపయోగించుకో గలుగుతున్నారు. ప్రస్తుతానికి కొంత స్వేచ్ఛను సంపాదించుకోవా లనుకుంటున్నాం. మా నినాదాలు చాలా సరళమైనవి. 'సొంత ఆస్తి నశించుగాక!' 'ఉత్పత్తి సాధనాలన్నీ ప్రజల చేతుల్లోకి రావాలి!', 'రాజకీయ అధికారమంతా ప్రజల చేతుల్లోకి రావాలి!', అందరూ పనిచేసి తీరాలి!' ఈ నినాదాలవల్ల మేము కేవలం తిరుగుబాటుదారులం కామని మీరు తెలుసుకోగలరు!"

పావెల్ ఒక చిన్న నవ్వు నవ్వేడు. నెమ్మదిగా వేళ్లతో జుట్టు సవరించుకున్నాడు. అతని నీలి కళ్లలో వెలుగు ఎన్నడూ లేనంతగా ప్రకాశించింది.

"అసలు విషయానికి పరిమితం కమ్మని చెప్తున్నాను" అని ముసలాయన బిగ్గరగా, నిస్పష్టంగా హెచ్చరించాడు. ఆయన పావెల్‌కేసి ముఖం తిప్పేడు. అతడి ఎడమ కంట్లోంచి దురాశాపూరితమైన, దుష్టమైన వెలుగు తల్లికగుపడింది. జడ్జీలందరూ తన కొడుకు ముఖంకేసి దృష్టులు సారించారు. ఆ దృష్టులతో, అతని శక్తినంతా చూరగొని, అతని రక్తాన్ని పీల్చి, తమ శుష్క శరీరాలకు పుష్టి కలిగించుకుంటున్నట్లనిపించింది. కాని అతను పొడుగ్గా నిటారుగా, బలంగా, ధైర్యంగా అలాగే నిలబడి చెయ్యి పైకెత్తి చెప్పేడు:

"మేము విప్లవకారులం. ఎంతకాలమైతే, కొందరు ఏ పనిపాటులూ తాము చేయకుండా ఇతరులను ఆజ్ఞాపిస్తూ ఉంటారో, మరికొందరు పనిచేయడం తప్ప ఇంకేమీ చేయకుండా ఉంటారో, అంతకాలం వరకూ మేము విప్లవకారులుగానే ఉంటాం. జడ్జీలైన మీరు ఏ సంఘం యొక్క క్షేమలాభాలను సంరక్షించడానికి ఆజ్ఞాబద్ధులై ఉన్నారో, ఆ సంఘానికి మేము బద్ధ విరోధులం. ఆ సంఘానికీ మీకూ కూడా మేము విరోధులం. మా పోరాటంలో మేము విజయాన్ని సాధించే వరకూ మనకు ఏ విధమైన రాజీ సాధ్యం కాదు. కార్మికులమైన

మేము జయించి తీరుతాం! మీ అధికారులు తామనుకునేటంత బలవంతులు కారు. దేన్ని పోగుచేసుకుని రక్షించుకోవడం కోసం తమ అధీనంలో ఉన్న లక్షలాది జీవుల ప్రాణాలను వారు ఆహుతి చేస్తున్నారో, ఏదైతే మాపై అధికారం చెలాయించే శక్తిని వారికిస్తున్నదో, ఆ సొంత ఆస్తే, వాళ్లలో వాళ్లకు సంఘర్షణ కారణమవుతుంది. దాని మూలంగానే వారు శరీరకంగా నైతికంగానూ కూడా నాశనమవుతారు. సొంత ఆస్తిని సంరక్షించుకోవడం చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. నిజానికి మా యజమానులైన వీరంతా, మాకన్న కూడా ఎక్కువ బానిసల వంటి వాళ్లు. మేము శారీరకంగానే బానిసలం. మీరు మానసికంగా బానిసలు. అలవాట్లు, దురభిప్రాయాలు అనే కాడిని మీ మెడమీద నుంచి మీరు తొలగించలేకుండా ఉన్నారు. ఆ కాడే మిమ్మల్ని మానసికంగా చంపేసింది. మానసికమైన స్వేచ్ఛ ననుభవించడానికి మా కడ్డేమీ లేదు. మీరు మాచేత తినిపంచే విషాలు మీరు ఇష్టం లేకపోయినా మా తలకెక్కించే విరుగుళ్ల కన్న బలహీనమైనవి. సత్యాన్ని గురించి మా విజ్ఞానం రోజుకు రోజూ పెరుగుతోంది. మానసికమైన పవిత్రతగల వాళ్లందరినీ, మీ వర్గాల్లో నుంచి కూడా ఉత్తములైన వారిని ఈ సత్యం ఆకర్షిస్తోంది. కొంచెం పరిశీలించండి. మీ వర్గం యొక్క భావాలను సమర్థించగలవాడెవ్వడూ మీలో ఇప్పటికే లేడు. చారిత్రక న్యాయం యొక్క వత్తిడి నుండి మీరు అణిగిపోకుండా రక్షించుకోగల వాదనాసమర్థత మీలో ఏష్యమైపోయింది. మీరు నూతన భావాలను సృష్టించలేకపోతున్నారు. మానసికంగా మీరు వట్టిపోయారు. మా భావాలు పెరుగుతున్నాయి, బలాన్ని పుంజుకుంటున్నాయి, సామాన్య జనాన్ని ఉత్తేజపరచి వాళ్లను స్వాతంత్ర పోరాటానికి సమీకరిస్తున్నాయి. కార్మికవర్గం తను వహించవలసిన పాత్రను గుర్తించిన కారణంచేత ప్రపంచ కార్మికులందరూ ఒక మహాశక్తిగా ఏకమైపోతున్నారు. ప్రపంచానికి వాళ్లు తెస్తున్న పునరుజ్జీవానాన్ని ఆపడానికి క్రౌర్యమూ, పరిహాసమూ తప్ప మీ దగ్గరే మరే సాధనమూ లేదు. అసహనం స్పష్టంగానే కనబడుతోంది. క్రౌర్యం మరింత రేపృదుతుంది. ఈనాడు మా కుత్తకలమీద వెయ్యబడిన చేతులే రేపు మమ్మల్ని సోదర భావంతో కౌగిలించుకుంటాము. మీ శక్తి బంగారాన్ని పెంచే యాంత్రికశక్తి మాత్రమే. ఆ శక్తే మిమ్మల్ని పరస్పరం గుటకాయస్వాహా చేసుకోవలసిన ముఠాలుగా చీలుస్తుంది. శ్రమజీవులందరి సౌభ్రాతృత్వం పట్ల రోజుకు రోజూ ప్రవృద్ధమవుతూన్న సజీవమైన మా చైతన్యంలోనే మా శక్తి యిమిడి ఉంది. మీరు చేస్తున్నదంతా అపరాధం. ఏమంటే, అది ప్రజలను బానిసలుగా చేస్తుంది. మీ అబద్ధాలు, మీ దురాశ, మీ దుర్మార్గం ప్రజలను భయపెట్టే పిశాచాలూ రాక్షసులూ ఉండే ప్రపంచాన్ని సృష్టించాయి. ఈ రాక్షసుల బారినుండి జనాన్ని తప్పించడం మా వంతు. మీరు మానవుడిని జీవితాన్నుంచి విడదీసి నాశనంచేశారు. మీరు నాశనం చేసిన ప్రపంచాన్ని సోషలిజం చేపట్టి, దాన్నొక మహత్తరమైన ఏక ప్రపంచంగా పునర్నిర్మాణం చేస్తుంది. దాని నాపడానికి మీరేమీ చెయ్యలేరు!"

పావెల్ ఒక్క క్షణమాగి మెల్లగానే అయినా, దృఢ స్వరంలో ఆ మాటే మళ్లీ ఉద్ఘాటించాడు.

"దాని నాపడానికి మీరేమీ చెయ్యలేరు!"

జడ్జీలందరూ కలిసి గుసగుసలాడేరు. పావెల్ నుండి తమ దుర్వీక్షణాలు మళ్లించడకుండా వికారమైన ముఖభంగిమలు పెట్టారు. పావెల్ ఆరోగ్యానికీ, బలానికీ, తాజాతనానికీ వాళ్లు ఈర్ష్యచెంది, తమ దృష్టులతో అతని శరీరాన్ని కలుషితం చేస్తున్నారేమోని తల్లి అనుకుంది. ఖైదీలు తమ కామ్రేడ్ ఉపన్యాసాన్ని అతిశ్రద్ధగా విన్నారు. వారి ముఖాలు వెల్లబారేయి. కళ్లు సంతోషంతో మిలమిలలాడేయి. తల్లి అతని మాటలను ఆసక్తితో ఆస్వాదించింది. అవి ఆమె మనసులో బాగా హత్తుకుపోయాయి.

"నేను దాదాపు ముగింపు కొచ్చాను. మిమ్మల్ని నేను వ్యక్తిగతంగా అగౌరవపరచదలచు కోలేదు. పైగా, విచారణ పేరిట మీరు జరిపే ఈ తమాషాను నాకిష్టంలేక పోయినా ఇక్కడ కూర్చుని చూస్తుంటే, మీ యడల నాకు సానుభూతి కూడా కలిగింది. ఇంతకీ, మీరూ మానవులే. మానవులైనవాళ్లు, మా లక్ష్యానికి వ్యతిరేకులైనవారైనా, ఇంత సిగ్గుశరాలు లేకుండా, మానవ ప్రతిష్టకు భంగకరంగా, పశుశక్తికి గులాములు కావడం చూస్తుంటే రోత అనిపిస్తోంది...."

జడ్జీలకేసి చూడకుండానే, పావెల్ కూచున్నాడు. తల్లి ఊపిరి ఉగ్గపట్టుకుని వాళ్లని పరిశీలనగా చూసింది.

ఆమె నోటితో జవాబు చెప్పకుండానే తలూపింది. తన కొడుకంత ధైర్యంగా చెప్పినందుకు చాలా సంతోషించింది. బహుశా అతడు ముగించినందుకు ఆమెకు మరింత సంతోషం కలిగి ఉండవచ్చు. కాని ఒకే ప్రశ్న ఆమె మనసులో అడ్డం మొదలెట్టింది : "వాళ్లిప్పుడేం చేస్తారు?"

తనకు తెలియని విషయాలేమీ తన కొడుకు చెప్పలేదు. అతని భావాలు ఆమెకేమీ కొత్త కాదు. కాని కోర్టు సముఖాన ప్రప్రథమంగా ఆమెకొక విచిత్రమైన ఆకర్షణ కలిగింది. పావెల్ ప్రశాంతత ఆమెకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. అతని ఉపన్యాసం, అతను చేపట్టిన కార్యంలోనూ దాని అంతిమ విజయంలోనూ అతనికుండే విశ్వాసానికి చిహ్నంగా తేజోవంతమైన నక్షత్రంలా తోచింది.

"గౌరవనీయులైన ప్రతివాదులారా!" అన్నాడు.

అస్వస్థంగా ఉన్న జడ్జీ బిగ్గరగా కోపభరితమైన గొంతుకతో,

"మీరు జడ్జీలను సంబోధిస్తున్నారు, కాని ప్రతివాదులను కాదు" అన్నాడు. తల్లికి అన్‌ద్రేయ్ ముఖంలో ఏదో టక్కరితనం కనబడింది.

"అలాగా?.. మీరు నాకు జడ్జీలుగా కనబడ్డం లేదు. మీరు ప్రతివాదులుగా మాత్రమే కనబడుతున్నారు" అన్నాడు తలూపుతూ అన్‌ద్రేయ్.

"విషయాన్ని సూటిగా చెప్పాలా?...మీతో నేను విషయాన్ని సూటిగా ఎందుకు చెప్పాలి? ప్రస్తుతానికి మీరు తెలుసుకోవలసిన విషయాన్నంతనీ నా కామ్రేడ్ అప్పుడే చెప్పనే చెప్పేడు. సమయమొచ్చినప్పుడు మిగిలిన విషయాలను ఇతరులు చెప్తారు."

ముసలాయన కుర్చీలోంచి కొద్దిగా లేచి, "కూర్చోండి! తర్వాత గ్రిగోరియ్ సమోయ్‌లోవ్!" అని బిగ్గరగా అరిచాడు.

హోహోల్ పెదవులు బిగించి తాపీగా కూచున్నాడు. సమోయ్‌లొవ్ లేచి, తన ఉంగరాల జుట్టును విదిలించుకుని, అతని పక్కనే నిలబడ్డాడు.

"ప్రాసిక్యూటరు నా మిత్రులను ఆటవికులనీ, నాగరికతకు శత్రువులనీ అన్నాడు..."

"మీ విచారణకు సంబంధించని సంగతులను చెప్పకండి!"

"ఇది దానికి సంబంధించినదే. నిజాయితీపరులైన జనానికి సంబంధంలేని విషయముండదు. దయచేసి నా మాట కద్దుతగలకండి. మీరు దేన్ని నాగరికతంటారో తెలుసుకోవాలనుకుంటున్నాను?"

"మేమిక్కడ మీతో చర్చించడానికి కాదు వున్నది! పెదదారులు తొక్కద్దు!" అన్నాడు ముసలాయన తన కింద వరుస పళ్లు ప్రదర్శించుతూ.

అన్‌ద్రేయ్ ప్రవర్తన జడ్జీల వైఖరిలో మార్పును తెచ్చింది. పై చర్మాన్ని ఒలిచేసినట్లయింది. వాళ్ల వెల్లముఖాలు పొంగేయి. కళ్లలో ఆకుపచ్చని విస్ఫులింగాలు మెరిశాయి. పావెల్ ఉపన్యాసం వాళ్లను కలవరపరచి నొప్పించింది. కాని ఆ మాటల్లో ఉండే శక్తిచేత వాళ్లతన్ని గౌరవించక తప్పలేదు. అందుచేత పైకి గుంభితంగా ఉండవలసొచ్చింది. హోహోల్ ఆ గుంభనలోని పొరను ఒలిచేసి లోపలున్న వాస్తవికతను బయటపెట్టేశాడు. వాళ్లలో వాళ్లు గుసగుసలాడేరు. వాళ్ల శక్తికి మించి సౌంజ్ఞలు చేసుకున్నారు, వికారంగా చూసుకున్నారు.

"మీరు గూఢచారులను తర్ఫీదుచేస్తారు. ఆడవాళ్లను, పిల్లలను అవినీతి పరులనుగా చేస్తారు. మనుషులను దొంగలుగానూ, హంతకులుగానూ మారుస్తారు. మత్తు పదార్థాలతోనూ, అంతర్జాతీయ యుద్ధాలతోనూ, అబద్ధాలతోనూ, వ్యభిచారంతోనూ, పశుత్వంతోనూ వాళ్లకు విషమెక్కిస్తారు. ఇదే మీ నాగరికత! అలాటి నాగరికతకు మేము శత్రువులం!"

"ఇదిగో చెప్తున్నాను..." అని ముసలాయన హుంకరించాడు. సమోయ్‌లొవ్ ముఖం ఎర్రబారింది. కళ్లు తేజోపూరితమయాయి. అతను కూడా తిరిగి హుంకరించాడు :

"మీరెవరిని జైళ్లలో పారేసి మగ్గపెడుతున్నారో, పిచ్చివాళ్లనుగా చేసేస్తున్నారో, వాళ్లు రూపొందిస్తున్న నాగరికతను మేము గౌరవిస్తాం. దాన్ని అమూల్యమైనదిగా భావిస్తున్నాం..."

"కూర్చోండి! తర్వాత ఫ్యోదొర్ మాజిన్."

చిన్నవాడైన ఫ్యోదొర్ చటుక్కున లేచి నిటాగ్గా కత్తిలా నిలబడ్డాడు.

"నేనెల్లప్పుడూ ఇలాగే పనిచేస్తూ ఉంటానని దేవుని సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను" అని దీర్ఘంగా ఊపిరి పీల్చుకున్నాడు. కళ్లు తప్ప మరేమీ కనబడనంత ముఖం వెల్లబారింది. "మీరిదివరకే నాకు శిక్ష విధించారని నేనెరుగుదును. కాని మీరు నన్ను ఎక్కడికి పంపినా తప్పించుకు పారిపోతాననీ, ఎల్లకాలం, జీవితాంతం వరకూ పనిచేస్తూనే ఉంటాననీ దేవుని సమక్షంలో ప్రమాణం చేస్తున్నాను." అతను ప్రమాణం చేస్తున్నట్లు చెయ్యి పైకెత్తి, "నేను ప్రమాణం చేస్తున్నాను" అన్నాడు.

సిజోవ్ బిగ్గరగా మూలిగి తన స్థానంలోంచి కదిలేడు. ఉవ్వెత్తున పొంగుతూన్న ఉద్రేక తరంగంపై ఓలలాడుతూన్న ప్రేక్షకులు ప్రమాద సూచకంగా గొణగొణలాడేరు. ఒక స్త్రీ వెక్కెక్కి ఏడ్చింది. మరొకళ్లకు దగ్గుతెర వచ్చింది. పోలీసులు ఖైదీలకేసి విస్తుపోయి చూశారు. జనంకేసి కోపంతో చురచుర చూశారు. జడ్జీలు ముందుకూ వెనక్కూ ఊగిసలాడేరు.

"తర్వాత ఇవాన్ గూసెవ్!" అని కేకేశాడు ముసలాయన.

"నేనేమీ చెప్పదలచుకోలేదు."

"తర్వాత వసీలియ్ గూసెవ్!"

"నేనూ ఏమీ చెప్పదలచుకోలేదు!"

"ఫోదొర్ బూకిన్!"

పాలినట్లుండే బూకిన్ భారంగా లేచి, తల ఆడిస్తూ చెప్పడం మొదలెట్టేడు :

"మిమ్మల్ని చూసుకుని మీరే సిగ్గుపడాలి. నేను విషయాలను తెలుసుకోవడంలో కొంచెం మందకొడివాడినే. కాని నేను కూడా న్యాయం ఏదో చూడగలుగుతున్నాను." అతను చేతిని తలమీద కెత్తి, దూరంగా ఉన్నదాన్ని దేన్నో చూస్తున్నట్లుగా కళ్లు సగం మూసుకుని మౌనం దాల్చేడు.

ముసలాయన ఆశ్చర్యపడ్డాడు. చిరాకుపడ్డాడు. కుర్చీ వెనక్కి వాలి,

"ఏమిటది?" పో!"

బూకిన్ నిశ్శబ్దంగా కూచున్నాడు. అతడి మాటల్లో ఏదో నిష్కటమైన గొప్ప విశేషముంది. అందరూ దాని అనుభూతిని పొందేరు. జడ్జీలు కూడా చెవులు నిక్కపొడుచుకు విన్నారు. బూకిన్ చెప్పిన మాటలకన్న విపులమైన సంగతులు ప్రతిధ్వనిస్తాయా అన్నట్లు విన్నారు. హాలంతా గడ్డకట్టుకుపోయినట్లు నిశ్శబ్దమైపోయింది. అప్పుడప్పుడు ఏడుస్తున్న చిహ్నాలు మాత్రం

వినబడ్డాయి. చివరకు ప్రాసిక్యూటరు భుజాలెగరేసి చిరునవ్వు నవ్వేడు. మార్షల్ ఆఫ్ ది నొబిలిటీ దగ్గేడు. జనం గుసగుసలు మొదలెట్టేరు.

"జడ్జీలు మాట్లాడుతారా?" అని సిజోవ్‌ని తల్లి మెల్లగా అడిగింది.

"అంతా అయిపోయింది. శిక్ష చెప్పడమే తరువాయి" అన్నాడు.

"అంతా?"

"అంతా అయిపోయింది."

ఆ మాటనామె నమ్మలేకపోయింది.

సమోయ్‌లొవ్ తల్లి బెంచిమీద గిలగిలలాడి భుజంతోటీ, మోచేత్తోటీ సెలగేయా నీలొవ్నాను పొడిచింది.

"ఏమంటావ్? అంతా అయిపోయిందీ! నిజమే?" అని భర్తనడిగింది.

"అయిపోయింది. ఇదిగో ఇప్పుడే చూద్దువుగాని."

"మన గ్రీష కేమీ వేస్తారంటావ్?"

"మాట్లాడకూరుకో."

అందరికీ ఏదో ఒక అతిక్రమణం జరిగిందనిపించింది. ఏదో స్థానభంగమైనట్లూ, తెగిపోయినట్లూ గుర్తించారు. ఏమీ తెలుసుకోలేక విస్తుబోయి చూశారు. హద్దులు తెంచుకుని రేగుతున్న మంటలను చూస్తున్నట్లు తెల్లబోయి చూస్తున్నారు. ఈ గుంపుయొక్క విశేషం అగమ్యగోచరంగానే ఉన్నా, దాని శక్తి అభేద్యంగా ఉంది. హఠాత్తుగా తమకు బహిర్గతం చేయబడిన ఆ మహనీయ విశేషాన్ని అవగాహనచేసుకోలేక తమకు తెలిసిన చిన్న విషయాలను గురించి వ్యాఖ్యానిస్తూ తమ భావాలను వెలిబుచ్చారు.

"చూడండి! వాళ్లని మాట్లాడ నివ్వలేదేమిటి? ప్రాసిక్యూటరును ఇష్టమొచ్చినట్లు ఎంత సేపైనా మాట్లాడనిచ్చారు" అని పెద్ద బూకిన్ వినిపించీ వినిపించనట్లడిగేడు.

బెంచీల దగ్గర నిలబడిన ఉద్యోగి చెయ్యి పైకెత్తి ఆడిస్తూ,

"నిశ్శబ్దం, నిశ్శబ్దం!" అని మందలించాడు.

సమోయ్‌లవ్, భార్య వీపు వెనక అనుకుని సంగం సగం మాటలు గొణిగేడు.

"సరేనయ్యా. వాళ్లు దోషులనే అనుకుందాం. కాని వాళ్లకు చెప్పుకునేందుకు అవకాశమివ్వాలి కదా! వాళ్లెవరికి వ్యతిరేకులు? నేనదే తెలుసుకోవాలనుకుంటున్నాను!"

ఉద్యోగి సమోయ్‌లొవ్‌కేసి వేలు చూపెడుతూ "ఇష్!" అని హెచ్చరించాడు.

సిజోవ్ విచారంగా తలూపేడు.

తల్లి జడ్జీలకేసి చూస్తూ కూచుంది. వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటుంటే వాళ్ల ఆవేశం పెరిగిపోతున్నట్లామె గ్రహించింది. సానుభూతి శూన్యమై బంకలా సాగుతూన్న వాళ్ల కంఠధ్వనులామె ముఖాన్ని కొట్టినట్లయింది. ఆమె చెక్కిళ్లు వణికేయి. నోటికి వెగటనిపించింది. ఏ కారణంచేతనైతేనేమి, వాళ్లు తన కొడుకు శరీరాన్ని గురించీ, అతని స్నేహితుల శరీరాలను గురించీ మాట్లాడుకుంటున్నారని ఆమెకు తోచింది. వేడి రక్తంతో యవ్వనంతో శక్తిపూరితమైన వాళ్ల అవయవాలను గురించీ కండరాలను గురించీ చర్చించుకుంటున్నారనుకుంది. అలాంటి పుష్టికరమైన దేహాలను చూసినప్పుడు, నీచులైన బిచ్చగాళ్ల ఈర్ష్యా, రోగిష్టులూ బలహీనుల దురాశ వాళ్లలో ప్రకోపించాయని ఆమెకు స్ఫురించింది. పనిపాటులు చేసి భాగ్యవంతం కాగలిగినట్టిన్నీ, సుఖ సంతోషాలను సృష్టించి అనుభవించగలిగినట్టిన్నీ, ఆ యువకుల శరీరాలను జడ్జీలు పెదవులు చప్పరించి కాంక్షిస్తున్నారు.

పావెల్ ఆమెను ఆప్యాయతతో ప్రశాంతంగా పరికించాడు. అతని చూపులో కాస్తంత అలసట కనబడింది మధ్యమధ్య ఆమెకేసి చూసి తలూపుతూ చిరునవ్వు నవ్వేవాడు.

"త్వరలో స్వేచ్ఛ!" అనే మాటలున్న ఆ నవ్వుతో తనను పావెల్ బుజ్జగిస్తున్నట్లూహించుకుంది.

ఆ సమయంలో జడ్జీలు లేచారు. తల్లి కూడా లేచింది.

"వాళ్లెళ్లిపోతున్నారు" అన్నాడు సిజోవ్.

"శిక్ష గురించి చర్చించుకోవడానికి?" అని ఆమె అడిగింది.

"ఔను."

ఆడవాళ్లందరూ, దుఃఖంచేత కాకపోయినా, అలవాటు కొద్దీ ఏడ్చేరు. దిగ్భ్రమ కలిగించేటంత దుఃఖమేమీ లేదక్కడ. ఊహించలేనంత విచార మెవ్వరికీ కలగలేదు. కాకపోతే, బిడ్డలను వదిలేసి వెళ్లక తప్పదనే విచారం ఉంది. కోర్టులో జరిగిన విషయాలనాలోచించు కుంటుంటే ఆ బాధ కూడా చాలావరకు నివారణైంది. తల్లులూ, తండ్రులూ తమ కొడుకులను మిశ్రమ భావాలతో పరికించారు. యువకులపట్ల అపనమ్మకం, సాధారణంగా పెద్ద వాళ్లకు తమ ఆధిక్యతను గురించిన అహంకారం, రెండూ చిత్రంగా మిళితమై ఒక విధమైన గౌరవభావం వంటిది ఏర్పడింది. ఇకముందు బతుకు ఎలా సాగించాలా అనే విచారభావాలు కొంత బాధించినా, మరొక ఉత్తమ జీవితాన్ని గురించి, నిర్భయంగా, ధైర్యంగా ఈ యువకులు చెప్పిన మాటలవల్ల కలిగిన అద్భుతావేశం, ఆ విచారాన్ని మరుగుపరచింది. భావాలను మాటల్లో చెప్పలేక ఆ భావాలను దిగమింగేశారు. మాటలు అమితంగానే వచ్చాయి. కాని అవి గుడ్డలు, వాటి నుతుక్కోవడం, ఆరోగ్యం మొదలైన సామాన్య విషయాలను గురించే ఎక్కువగా వినియోగింపబడ్డాయి.

అన్నగారైన బూకిన్ తమ్ముడితో చేతులూపుకుంటూ మాట్లాడేడు :

"మరేం లేదు! న్యాయం తప్పకుండా జరగాలి!"

"పిట్టను జాగ్రత్తగా చూడు!"

"అలాగే."

సిజోవ్ తన మేనల్లుడి చెయ్యి పట్టుకుని,

"అయితే, ఫ్యోదొర్, మమ్మల్ని వదిలిపెట్టి పోతున్నావు" అన్నాడు.

ఫ్యోదొర్ ముందుకు వంగి కులాసాగా నవ్వుతూ అతని చెవిలో ఏదో చెప్పేడు. కాపలాదారు కూడా చిన్ననవ్వు నవ్వేడు. వెంటనే నవ్వాపుకుని ముఖం కఠినంగా పెట్టాడు.

తల్లి తన కొడుకుతో ఇతర స్త్రీలలాగే గుడ్డలను గురించీ, ఆరోగ్యాన్ని గురించీ మాట్లాడింది. సాషాను గురించీ, తనను గురించీ, అతన్ని గురించీ వెయ్యి ప్రశ్నలడగాలనుకుంది. కాని దీనంతటినీ మించి తన కొడుకు మీద ఉండే అపార ప్రేమ, అతన్ని సంతోషపెట్టాలనీ, అతనికి సన్నిహితంగా ఉండాలనే కోరిక రెక్కలు చాచుకొని ఎగురింది. ఏదో భయంకరమైన ప్రమాదం సంభవించబోతోందనే భయం క్రమంగా తగ్గిపోయింది.

"ఈ విచారణ గురించి నేనే మంతగా అనుకోలేదు. ఏమంత విశేషంగా ఉంటుందని నేననుకోలేదు!" అంది.

హొహోల్ కృతజ్ఞతాపూర్వకంగా మందహాసం చేసి,

"ఎందుకలా అనుకుంటున్నారు, మామ్మా?... ఏ సంగతీ తెలియచెప్పనూ లేదు. ఎవరిది తప్పో, ఎవరిది ఒప్పో తేల్చలేదు."

ప్రధాన న్యాయాధిపతి ఒక చేతిని బల్లమీదాన్చి, రెండో చేత్తో కాగితాన్ని ముఖానికడ్డెట్టుకుని, అతి మెల్లగా చదవడం మొదలెట్టేడు.

సిజోన్ ముందుకు వంగి :

"ఆయన శిక్ష చెపుతున్నాడు" అన్నాడు.

హాలంతా మౌనం దాల్చింది. అందరూ ముసలాయనకేసి తదేక ధ్యాసతో చూశారు. పొట్టిగా, సన్నంగా, నిటాగ్గా, ఏదో అదృశ్యహస్తం పట్టుకున్న కర్రలాగున ఆయన నిలబడ్డాడు. ఇతర జడ్జీలు కూడా నిలబడ్డారు.

"ప్రవాసం!" సంతోషంగా నిట్టూరుస్తూ సిజోవ్ చెప్పేడు. "దేవుడికి దణ్ణం పెట్టవచ్చు, అయిపోయింది. కఠిన శిక్ష వేస్తారేమోనని భయపడ్డాను. అమ్మా! ఇది చాలా నయం."

"ఇలాగే జరుగుతుందని నాకు తెలుసు" అంది అలసటగా తల్లి.

తల్లి మౌనంగా కొడుకునూ, ఇతరులనూ చూసి తలూపింది. ఆమెకు ఏడవాలనిపించింది. కాని సిగ్గుపడింది.

కోర్టు హాలు వదిలి వెళ్లేసరికి రాత్రి కావడం ఆమె కాశ్చర్యమేసింది. వీధుల మొగిని దీపాలు వెలుగుతున్నాయి. ఆకాశంమీద నక్షత్రాలు మెరుస్తున్నాయి. కోర్టు దగ్గర జనం గుంపులు గుంపులుగా చేరేరు. శీతగాలిలో మంచు కరకరలాడింది. యువకుల కంఠధ్వనులు వినబడుతున్నాయి. బూడిదరంగు టోపీని ధరించిన ఒక మనిషి సిజోవ్‌కేసి చూసి, ఆత్రంగా,

"ఏమిటి శిక్ష?" అని అడిగేడు.

"ప్రవాసం."

"అందరికీనా?"

"ఆహా."

"ధన్యవాదాలు."

ఆ మనిషి చరచర ముందుకు పోయాడు.

"చూశావూ? వీళ్లందరికీ ఎంత ఆసక్తో!" అన్నాడు సిజోవ్.

హఠాత్తుగా డజనుమంది యువతీ యువకులు వాళ్ళను ముట్టడించారు. వాళ్ళు ఉద్రేకంతో బిగ్గరగా మాట్లాడుతుంటే, జనం మూగేరు. తల్లి, సిజోవ్ ఆగిపోయారు. శిక్ష ఏమిటనీ, ఖైదీలు ఏ విధంగా ప్రవర్తించారనీ, ఎవరెవరు ఉపన్యాసాలిచ్చారనీ ఈ మొదలైన ప్రశ్నల నెన్నిటినో మనస్ఫూర్తిగా, అభిమానంతో అడిగేరు. వాటికన్నిటికీ తల్లి సంతోషంతో జవాబులు చెప్పింది.

"ఏమండోయ్! ఈవిడ పావెల్ వ్లాసోవ్ తల్లి" అని ఎవరో అన్నారు. వెంటనే అంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"మీతో కరచాలనం చెయ్యనివ్వండి అమ్మగారూ!"

ఎవరో బలశాలి చెయ్యి ఆమె వేళ్ళను గట్టిగా పట్టుకుంది. "మీ కొడుకు ధైర్యం మా కందరికీ ఆదర్శం" అని ఇంకెవరో ఆవేశంతో అన్నాడు.

"రష్యా కార్మికులు వర్ధిల్లాలి!" అని మరెవరో బిగ్గరగా అరిచారు.

ఆ కేకలు అంతకంతకు ఎక్కువై నాలుగు మూలల్లో నుంచీ లేచాయి. జనం అన్నివైపుల నుంచీ పరుగులెత్తుకుంటూ వచ్చి సిజోవ్‌నూ, తల్లినీ ముట్టడించారు. పోలీసులు ఈలలూదేరు. కాని జనం కేకలను అవి మించలేకపోయాయి. సిజోవ్ నవ్వేడు. తల్లికిదంతా గొప్ప

స్వప్నమనిపించింది. ఆమె మందహాసంతో వంగి వందనం చేస్తూ జనంతో కరచాలనం చేసింది. కళ్ళ వెంట ఆనందాశ్రువులు రాలేయి. అలసట చేత ఆమె కాళ్ళు లాగేయి. కాని నిండు హృదయం స్వచ్ఛమైన సరోవరంలాగా చక్కని భావాలను ప్రతిఫలిస్తోంది.

ఆమెకు దగ్గరగా ఉన్న వారెవరో విస్పష్టమైన గొంతుకతో గాద్గదికంగా మాట్లాడ్డం మొదలెట్టేడు.

కామ్రేడ్స్ రష్యా దేశపు ప్రజలను చీల్చి చెండాడుతున్న రాక్షసి, తన దవడల మధ్య...

"అమ్మా! మనం వెళ్ళిపోదాం" అన్నాడు సిజోవ్.

ఆ సమయానికి సాషా అక్కడికి వచ్చి తల్లి చెయ్యి పుచ్చుకుని రోడ్డు కవతలి వైపుకు తీసుకెళ్ళింది.

"దెబ్బలాట ప్రారంభం కాకముందే, వాళ్లెవరినీ అరెస్టు చెయ్యక ముందే పోదాం... ప్రవాసమేనా? సైబీరియాకేనా?... అని సాషా అడిగింది.

"అవును."

"అతనెలా మాట్లాడేడు? నాకు తెలుసులే అందరికన్నా అతడే ధైర్యస్థుడు. నిరాడంబరుడు. అందరికన్నా ఖచ్చితమైనవాడు. సున్నితమైన స్వభావం కలవాడు. కాని ఆ స్వభావాన్ని వెలిబుచ్చడానికి బిడయపడతాడు."

ఎంతో ఆప్యాయతతో తన చెవిలో చెప్పబడిన ఆమె ప్రేమపూరిత వచనాలు తల్లికి నూత్నమైన శక్తినిచ్చాయి.

తల్లి, సాషా చేతిని ఎంతో ప్రేమతో పట్టుకుని :

"అతని దగ్గరకు మీరెప్పుడు చేరుకుంటారు?" అని అడిగింది.

"నే చేస్తున్న పనిని చేయగలిగిన మరొకళ్లు దొరకడంతోనే" అని ఆ అమ్మాయి జవాబుచెప్పి, విశ్వాసంతో ఎదురుగా ధైర్యంగా చూసింది.

సాషా ముఖం ఈనాడు రోజుకంటె దయగానూ, నెమ్మదిగాను ఉన్నట్లు తల్లి గమనించింది.

* * *

ఇంటికి చేరడంతోనే సోఫామీద ఇద్దరూ పక్కపక్కనే కూచుని, పావెల్ దగ్గరకు సాషా నిరీక్షిత ప్రయాణాన్ని గురించి మాట్లాడుకున్నారు. తర్వాత మౌనం కొంత విశ్రాంతి నిచ్చింది.

"అప్పుడు మీకు పిల్లలు పుట్టినప్పుడు నేనొచ్చి వాళ్లకు దాదిగా ఉంటాను. అక్కడ మన జీవితం, ఇక్కడకన్న ఏమీ అధ్వానంగా ఉండదు. అక్కడ పావెల్‌కుపని దొరకడం ఏమంత కష్టమైన విషయం కాదు.. అతను చేతుల్తో ఏపనైనా చెయ్యగలడు..."

సాషా తల్లిని ప్రశ్నార్థకంగా చూసింది.

"మీరిప్పుడతనితో వెళ్లదలచుకోలేదా?" అని అడిగింది.

"ఇప్పుడు అతనికి నాతో పనేముంది..." అంది తల్లి నిట్టూర్చి. "అతను తప్పించుకు రావాలనుకుంటే, నేనడ్డొచ్చినదాన్నవుతాను. నన్నతను రావాలని కోరడం లేదు."

సాషా తలూపింది.

"మీరు చెప్పిన మాట నిజమే. అతను ఒప్పుకోడు."

అంతే కాకుండా, నేనిక్కడ చెయ్యవలసిన పని కూడా ఉంది" అని సగర్వంగా తల్లి చెప్పింది.

"ఔను. ఆ పని చాలా ముఖ్యం" అంది సాషా.

"అమ్మాయీ, మీకెంత కష్టమొచ్చింది" అంటూ ఆమెను కౌగిలించుకుంది.

సాషా చిరునవ్వు నవ్వి తల్లి కౌగిలిలో అణిగిపోయింది.

ఆ సమాయానికి ఎంతో అలసిపోయి, నికొలాయ్ లోపలికొచ్చాడు. కోటు తీసేస్తూనే,

"సావకాశముండగానే మీరెళ్లిపోవడం మంచిది సాషా" అన్నాడు. "పొద్దుటి నుంచి ఇద్దరు గూఢచారులు నన్ను బహిరంగంగా వెంటాడిస్తున్నారు. ఈ ధోరణి చూస్తే నన్ను అరెస్టు చేస్తారని తోస్తోంది. సాధారణంగా నాకు స్ఫురించిన ఆలోచన వృథాపోదు. ఏదో జరిగింది. ఆ సంగతలా ఉంచు. ఇదిగో పావెల్ ఉపన్యాసం: దీన్ని అచ్చువేయించాలని నిశ్చయించాం.

మాట్లాడుతూనే చలిచేత గడ్డకట్టుకుపోయిన చేతులను రుద్దుకున్నాడు. రాతబల్ల దగ్గర కెళ్లి సొరుగుల్లోంచి కాగితాలు తియ్యడం మొదలెట్టేడు. కొన్నిటిని అతడు చింపేశాడు. కొన్నిటిని పక్కగా పెట్టేడు. అతడు చాలా అలసట చెంది, ఎంతో కంగారుగా ఉన్నాడు.

"అలాగైతే, వెడతాను.." అని "దేవుడి దయవల్ల ఇప్పుడిక నాకు దేన్ని గురించీ ఏ విధమైన భయమూ లేదు!" అంది తల్లి.

"బాగుంది!.... కాని సూట్‌కేసూ, బట్టలూ ఎక్కడున్నాయో మాత్రం చూపించి మరీ వెళ్లండి. మీరన్నిటినీ మీ చేతుల్లోకి తీసేసుకుని, నా వస్తువులమీద నా అధికారమే లేకుండా చేస్తున్నారు!" అన్నాడు నికొలాయ్.

సాషా కాగితాలన్నీ పొయ్యిలో తగలేసి బూడిదను బొగ్గుల్లో కలిపేస్తోంది.

నికొలాయ్ చటుక్కున చేయెత్తి,

"సాషా, మీరు వెళ్లిపోవలసిన సమయమైంది. శలవు. మంచి పుస్తకాలేమైనా వస్తే నాకు పంపడం మరచిపోకండి, కామ్రేడ్, శలవు. జాగ్రత్త!" అని చెప్పేడు నికొలాయ్.

వాళ్లిద్దరూ బయటి కెళ్లడంతోనే, సాషా మెల్లగా తల్లితో ఇలా చెప్పింది :

"అతనెప్పుడైనా మృత్యువు నెదుర్కోవలసి వచ్చినా ఇంత అవలీలగానే ఎదుర్కొంటాడు. కొంచెం తొందర మాత్రం పడతాడు. మృత్యువతని ముఖంకేసి చూస్తుంటే, కళ్లద్దాలు పైకెత్తి చనిపోయే ముందు 'బేషుగ్గా ఉంది' అంటాడు"

"నాకతనంటే చాలా ప్రేమసుమా" అంది మెల్లగా తల్లి.

"అతను నన్ను దిగ్భ్రమ చెందిస్తాడు. కాని నేనతన్ని ప్రేమించను. అపారంగా గౌరవిస్తాను. అతను చాలా దయ చూపిస్తాడు. ఒక్కొక్కప్పుడు బహు మృదువుగా ఉంటాడు. కాని అతనిలో ఆర్ద్రత లేదు.... తగినంత మానవత్వం లేదు.... మనల్ని గూఢచారులు వెంబడిస్తున్నట్లున్నారు. కనుక విడిపోతే మంచిది. వాళ్లు మీ వెంట బడుతున్నారని తోస్తే లుద్మీలా ఇంటి కెళ్లకండి."

"వెళ్లను."

"వెళ్లకండి. జాగ్రత్తc! నా యింటి కొచ్చెయ్యండి. ప్రస్తుతానికి శలవు!" అని సాషా మళ్లీ చెప్పింది.

ఆమె వెనక్కు తిరిగి చరచర నడిచిపోయింది.

కొద్ది నిముషాలైన పిమ్మట, లుద్మీలా చిన్న గదిలో పొయ్యి దగ్గర కూచుని తల్లి చలికాగుతోంది. లుద్మీలా నల్లని దుస్తుల్ని ధరించి తోలు పటకా పెట్టుకుని గదిలో పచారు చేస్తోంది. గదంతా తన రాజసపు కంఠధ్వనితోనూ, గౌను రెపరెపలతోనూ నింపేసింది.

పొయ్యిలోని నిప్పు రాజుకుంటూ చిటపట శబ్దం చేస్తోంది. ఆమె స్వరం ఏక స్థాయిలో వినవస్తోంది.

లుద్మలా తనని పరీక్షగా చూస్తుండడం ఆమె కనిపెట్టింది.

"నేను పనిమీద వచ్చాను" అని ఆత్మ విశ్వాసంతో చెప్పింది.

"జనం పని లేకుండా నా దగ్గరకు రారని నాకు తెలుసు."

లుద్మీలా కంఠధ్వనిలో ఏదో విశేషాన్ని తల్లి గమనించింది. ఆమె ముఖంకేసి తదేక ధ్యాసతో చూచింది. లుద్మీలా పలచని పెదవుల మీద చిరునవ్వును చూసింది. సులోచనాల వెనుక కళ్లు మిలమిలలాడేయి. తల్లి పక్కచూపు చూస్తూ, పావెల్ ఉపన్యాసాన్ని చేతికిచ్చింది.

"ఇదిగో. మిమ్మల్ని ఎంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా దీన్ని అచ్చేసి ఇమ్మన్నారు."

తర్వాత, నికొలాయ్‌ని కూడా అరెస్టు చేస్తారని అనుకుంటున్న విషయం చెప్పింది.

లుద్మీలా ఆషామాషిగా పావెల్ ఉపన్యాసాన్ని చదవడం మొదలెట్టింది. కాని చదువుతున్న కొద్దీ ఆమెకు దాని యందభిలాష హెచ్చింది. చివరకు ఎంతో ఆసక్తితోనూ ఆత్రం గానూ అన్ని పేజీలూ చదివింది. చదవండ పూర్తిగావడంతోనే భుజాలు కట్టుకుని తల్లి దగ్గర కొచ్చింది.

"చాలా మంచి ఉపన్యాసం!" అంది.

తలొంచుకు నిలబడి ఒక్క క్షణం పాటేదో ఆలోచించింది.

"మీ కొడుకును గురించి మీ దగ్గర మాట్లాడ్డం నాకిష్టం లేకపోయింది. నేనెప్పుడూ అతన్ని కలుసుకోలేదు. కష్టం కలిగించే విషయాలను గురించి మాట్లాడ్డం నా కంతగా ఇష్టముండదు. మీకు చాలా ఆత్మీయుడైన వాడిని ప్రవాసం పంపితే ఎలా ఉంటుందో నాకు తెలుసు. కాని, నా కాశ్చర్యమేస్తోంది. మీ కలాంటి కొడుకున్నందుకు సంతోసిస్తున్నారా?"

"చాలా సంతోషిస్తున్నాను" అంది తల్లి.

"మరి భయం వెయ్యడం లేదా?"

"ఇప్పుడింకేమీ భయం లేదు" అని ప్రశాంతంగా చిన్ననవ్వు నవ్వుతూ జవాబు చెప్పింది.

"నేను త్వరగానే అచ్చు కూర్చేస్తాను. మీరు పడుకోండి. మీరు రోజంతా కష్టపడ్డారనుకుంటాను. చాలా అలసిపోయుండాలి. ఈ మంచంమీద పడుకోండి. నేను పడుకోను. రాత్రి నాకు సాయంచెయ్యడానికి అవసరమైతే మిమ్మల్ని కూడా లేపుతాను. పడుకోబోయేటప్పుడు దీప మార్పేయండి."

"ఆమె మనసు దేనికోసమో క్షోభిస్తోంది..." అనుకుంది.

తల్లి చాలా అలసిపోయింది. కాని ఏదో చిత్రమైన ప్రశాంతత పొందింది. అంతటా మృదువుగా లలితమైన వెలుగు వ్యాపించి ఆమె హృదయాన్ని ముంచేసినట్లయింది. అలాటి ప్రశాంతత ఇదివరకామె ఎరుగున్నదే. ఎప్పుడైనా ఆవేశం పొంగివచ్చిన అనంతరం, ఆమెకలాటి అనుభూతి కలిగేది. ఆ అనుభూతి కలిగినప్పుడు, ఆమె భయపడిన రోజులుండేవి. ఇప్పుడు ఆ అనుభూతి ఆత్మను వికసింపజేస్తోంది. దృఢమైన మహత్తర భావాలతో బలపరుస్తోంది. ఆమె దీపం ఆర్పేసి చల్లగా ఉన్న మంచంమీద విశ్రాంతిగా పడుకుని కంబళి కప్పుకుంది. త్వరలోనే గాఢమైన నిద్రలో మునిగిపోయింది.

ఆమె కళ్లు తెరిచేసరికి నిర్మలమైన శీతకాలదినపు చల్లని తేట వెలుతురు గదంతా వ్యాపించి ఉంది. పుస్తకం చేత్తో పుచ్చుకుని సోఫామీద పడుకున్న లుద్మీలా తలెత్తి ఆమెకేసి చూసి తన మామూలు చొప్పున కాకుండా, అదొక మోస్తరుగా మందహాసం చేసింది.

ఇటీవల అలా అనేకసార్లు జరిగినట్టే, ఇప్పుడు కూడా హఠాత్తుగా ఆమెకొక ఆవేశమొచ్చింది. అనేకమైన ఆలోచనలూ, దృశ్యాలూ మనసులో కొచ్చాయి. ఆమె మంచంమీద కూచుని నెమ్మదిగా వాటికి మాటలతో రూపకల్పనచేసింది.

"జీవితం అలగే గడిచిపోతుంది అంతా చివరకు చేరే గమ్యస్థానం ఒకటే కాని ఒక్కొక్కప్పుడు అది చాలా కష్టంగా ఉంటుంది. ప్రజలు బాధలు పడుతుంటారు దెబ్బలు తింటారు క్రూరమైన దెబ్బల పాలవుతుంటారు వాళ్లను సుఖపడనివ్వరు. అది చాలా కష్టమైన సంగతి!"

లుద్మీలా తల వెనక్కు వాల్చి ఆమెకేసి ఆప్యాయంగా తేరిపారజూసింది.

"కాని మీరు మాట్లాడే మాటలు మిమ్మల్ని గురించి కాదనుకుంటాను."

మౌనంగా ఉభయులూ ఒకళ్లకేసి ఒకళ్లు చూసుకుని చిరునవ్వులు నవ్వుకున్నారు.

"నా సమొవార్ ఏమైందో?" అంటూ లుద్మీలా గదిలోంచి బయటి కెళ్లిపోయింది.

లుద్మీలా మరలా గదిలో ప్రవేశిస్తూనే :

"నికొలాయ్ చెప్పినమాట నిజమే. వాళ్లతన్ని అరెస్టుచేశారు. మీరు చెప్పిన ప్రకారమే ఒక పిల్లవాడి నక్కడకు పంపేను. ఆవరణలో పోలీసులున్నారనీ, గేటు వెనకాల ఒక పోలీసు నక్కి ఉన్నాడనీ అతను చెప్పేడు. అన్నిచోట్లా గూఢచారులున్నారట. ఆ పిల్లవాడు వాళ్లందరినీ ఎరుగును" అంది.

"పాపం!" అని తల్లి తలూపింది.

ఆమె నిట్టూర్చింది. కాని తనకు దుఃఖం కలగనందుకు ఆమెకు ఆశ్చర్యం కలిగింది.

ఆ సమయానికి నల్లని జుట్టు, ఎర్రని బుగ్గలూ, అందమైన నీలిరంగు కళ్లు, కోసైన ముక్కూ గల ఒక పిల్లవాడు లోపలికొచ్చి,

"సమొవార్ పట్టుకొచ్చేదా? అని అడిగేడు.

"సరే, పట్టుకురా సెర్గేయ్!" లుద్మీలా తల్లికేసి తిరిగి, "అతను నా సంరక్షణలో ఉండే పిల్లవాడు" అని చెప్పింది.

ఆ పిల్లవాడు సమొవార్ పట్టుకొచ్చాడు.

"సెర్గేయ్! నిన్ను పరిచయం చేస్తాను. ఈవిడ సెలగేయా నీలొవ్నా, నిన్నటి రోజున శిక్షింపబడిన కార్మికుల్లో ఒకరి తల్లి" అంది లుద్మీలా.

సెర్గేయ్ ఏమీ మాట్లాడకుండానే వంగి నమస్కరించి, కరచాలనం చేసి వెళ్లిపోయాడు. మరల ఒక బ్రెడ్డు తీసుకొచ్చి బల్లమీద ఉంచి బల్ల దగ్గర కూచున్నాడు.

ఆ పిల్లవాడు పత్రిక చదువుకుంటూ వీళ్ల మాటలు వినిపించుకోనట్టున్నాడు. మధ్య మధ్య మాత్రం అతను తల్లి ముఖంకేసి చూస్తుండేవాడు. ప్రకాశమానమైన అతని కళ్లు తల్లి నాకర్షించాయి.

ఆ సమయానికి ఎవరో గబగబ తలుపు కొట్టేరు. పిల్లవాడు లేచి లుద్మీలా ముఖం కేసి ఆజ్ఞకోసం చూశాడు.

ఇంతకూ ఆ వచ్చినాయన పొట్టి డాక్టరే.

"మొదటి సంగతి" అంటూ గబగబ మొదలట్టేడు. "నికొలాయ్ అరెస్టయాడు. ఓహో! నీలొవ్నా! మీరిక్కడున్నారన్నమాట. అతన్ని పట్టుకున్నప్పుడు మీరింటి దగ్గర లేరన్నమాట?"

"అతనే నన్నిక్కడకు పంపేడు."

"ఉహూ, అందువల్ల ఏమీ లాభం లేదనుకుంటాను. రెండవ సంగతి. క్రితం రాత్రి కొంతమంది యువకులు పావెల్ ఉపన్యాసాన్ని ఐదు వందల ప్రతులు సైక్లోస్టైల్ తీసేరు. వాటిని నేను చూశాను... బాగానే ఉన్నాయి. వాళ్లు ఈ రాత్రే వాటిని పట్టణంలో పంచి పెట్టాలనుకుంటున్నారు. నేను దానికి వ్యతిరేకిని. అచ్చు ప్రతులను పట్టంలో పంచిపెట్టి వాటిని మరొక చోట ఉపయోగించాలని నా అభిప్రాయం."

"నేను వాటిని నతాషా దగ్గరకు తీసుకెడతాను. నాకివ్వండి" అని తల్లి ఆత్రంగా అంది.

పావెల్ ఉపన్యాసాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా వ్యాపింపచెయ్యాలని ఆమె చాలా తొందరపడుతోంది. తన కొడుకు మాటలను ప్రపంచమంతటా వెదజల్లాలని ఉబలాటపడింది.

"మీరు ఆ పని చేయడం చాలా అపాయకరం" అని తన నుదుటిని నిమురుకొంటూ లుద్మీలా చెప్పింది.

"ఎంచేతో?" అని తల్లి కొంత ఉద్రేకంతో ప్రశ్నించింది.

"ఎందుకంటారా?.. నికొలాయ్ అరెస్టుకు సరిగా ఒక గంట ముందు మీరు ఇల్లొదిలి పెట్టేరు. ఫ్యాక్టరీ కెళ్లేరు. అక్కడ మిమ్మల్ని నతాషా అత్తయ్యగా అందరూ ఎరుగుదురు. ఆ

తర్వాత కాస్సేపట్లో ఫ్యాక్టరీలో నిషిద్ధ కరపత్రాలు దొరికేయి. ఇదంతా కలిపితే, మీ మెడకు చక్కని ఉచ్చు చుట్టుకుంటుంది" అని డాక్టర్ గబగబా మాటలు విరిచేస్తూ చెప్పేడు.

"నన్నెవరూ గమనించరు. నేను తిరిగొచ్చాక, నువ్వెక్కడున్నావని అడిగితే.. ఏం చెప్పాలో నాకు తెలుసు" అని గట్టిగా అంది.

"సరే. తీసుకెళ్లండి" అని డాక్టర్ అయిష్టంతో అంగీకరించాడు.

లుద్మీలా ఏమీ మాట్లాడలేదు. ఆలోచనా నిమగ్నురాలై అటూ ఇటూ పచారుచేసింది. ఆమె ముఖం చిక్కిపోయి, కళ్లు దించుకుపోయాయి, బలిష్ఠమైన మెడరాలు ముఖాన్ని గుండెలమీదకు వాలిపకుండా బిగబట్టేయి. తల్లి ఆమె స్థితిని గమనించింది.

అదెలా జరుగుతుందో విశదంగా ఆమెకు తెలియచెప్పేడు. చెప్పడమైనాక,

"మీకు అదృష్టం కలిసిరావాలని కోరుకుంటున్నా" అన్నాడు.

వెళ్లిపోతున్నప్పుడు అతనెందుకో కొంత అసంతృప్తిగా ఉన్నట్లగుపించాడు. అతన్ని సాగనంపి లుద్మీలా తల్లి దగ్గరకొచ్చింది.

"ఆమె తల్లి భుజం పుచుకుని పచారుచేస్తూ చెప్పడం మొదలెట్టింది :

"నాకూ ఒక కొడుకున్నాడు. వాడికి పదమూడేళ్లున్నాయి. తండ్రితో ఉంటున్నాడు. నా భర్త అసిస్టెంటు ప్రాసిక్యూటరు ఉద్యోగంలో ఉన్నాడు. పిల్లవాడాయనతోటే ఉన్నాడు. వాడేమైపోతాడో? తరుచుగా నేనదే ఆలోచిస్తుంటాను...." లుద్మీలా కంఠం గద్గదమైంది. "నేనే జనాన్ని ప్రేమిస్తున్నానో, ఎవరిని ఈ ప్రపంచంలో కల్లా ఉత్తములని భావిస్తున్నానో, ఆ జనానికి శత్రువులైనవారి పెంపకంలో ఉన్నాడు. నా కొడుకే నాకు శత్రువు కావచ్చు. నేను వాడిని నాదగ్గర ఉంచుకోవడానికి వీల్లేదు. నేను మారుపేరుతో జీవిస్తున్నాను. నేను ఎనిమిదేళ్లుగా వాడిని చూడలేదు... ఎనిమిదేళ్లు! ఎంతకాలమైందో కదా!"

ఆమె కిటికీదగ్గర ఆగి, కిటికీలోంచి వెల్లబారిన శూన్యాకాశంకేసి చూసింది.

"వాడు నాతో ఉన్నట్లయితే, నాకెంతో బలంగా ఉండేది. ఇప్పుడు నా హృదయాన్ని విడవకుండా వేధిస్తున్న నొప్పి ఉండేది కాదు... వాడు చచ్చిపోయి ఉంటే ఇంతకన్న సుఖంగా ఉండేది..."

అయ్యో నా తల్లీ!" అని తల్లి తన ఆవేదనను వ్యక్తపరిచింది. జాలిచేత ఆమె హృదయం పగిలిపోయినట్లనిపించింది.

"మీరెంత అదృష్టవంతులండీ!.... తల్లీ, కొడుకూ ఒక్కటిగా ఉండడం చాలా అద్భుతమైన విషయం. చాలా అపురూపమైన సంగతి" అని లుద్మీలా కష్టంగా నవ్వుతూ చెప్పింది.

"అవును, చాలా అద్భుతమైన సంగతే" అని తల్లి అప్రయత్నంగా చెప్పింది. తర్వాత ఏదో రహస్యం చెప్పినట్లుగా మెల్లగా ఇలా చెప్పింది : "మనమంతా మీరూ, నికొలాయ్ ఇవానొవిచ్, సత్యమార్గాన్ని అనుసరించే వాళ్లందరూ మనమంతా ఒకటిగానే నిలబడుతున్నాం! హఠాత్తుగా మనమంతా బంధువులైపోయాం. మిమ్మల్నందరినీ నేనర్థం చేసుకున్నాను. మీరు చెప్పేవన్నీ ఎల్లప్పుడూ నాకర్థం కావు. కాని నాకు మిగిలిన సంగతులన్నీ అవగాహనైనాయి."

మరచిపోయిన ప్రార్థనల నామె జ్ఞప్తికి తెచ్చుకుంది. అవి ఆమె హృదయంలోంచి నెరుసుల్లా తళతళ లేచాయి. ఓ కొత్త విశ్వాసాన్ని రగుల్కొల్పేయి.

"మన పిల్లలు సబబైన సత్యమార్గాన నడుస్తున్నారు. మానవుల హృదయాలను ప్రేమతో నింపుతున్నారు. నూతనమైన స్వర్గాన్ని చూపెడుతున్నారు. ఒక నూతనమైన అగ్నితో ప్రపంచానికంతకూ వెలుగు చూపెడుతున్నారు. ఆరిపోని అగ్నిని ప్రజ్వలింప చేస్తున్నారు. ఆ జ్వాలల్లోనుంచే, యావన్మంది మానవులనూ సమానంగా ప్రేమించే మన పిల్లల ప్రేమ జ్వాలలోనుంచే నూతన జీవితం ఉత్పన్నమవుతోంది. ఈ ప్రేమజ్వాల నెవరార్పగలరు? ఎవరు? ఏ శక్తి దాన్ని ధ్వంసం చెయ్యగలదు? ఏ శక్తి దాని నెదుర్కోగలదు? భూమే దానికి మాతృక్షేత్రం. జీవితమే దాని విజయాన్ని కాంక్షిస్తోంది. స్వయంగా జీవితమే!"

ఆవేశంచేత నీరసమొచ్చి, ఆమె దీర్ఘంగా విశ్వాసం చేస్తూ దూరంగా పోయి కూచుంది. లుద్మీలా కూడా మెల్లగా అడుగులెక్కెట్టుకంటూ దూరంగా వెళ్లి కూచుంది. చప్పుడైతే ఏదో భంగమయ్యేటంత మెల్లగా నడుస్తూ గదిలో తిరిగింది. తేజోహీనమైన కళ్లతో తల్లిని చూస్తూనే ఉంది. తల్లి, ఇది వరకు కన్న పొడుగ్గా, పలచగా, నిటాగ్గా ఆమె కళ్ల కగుపడింది. కఠినమైన ఆమె పలుచని ముఖం మీద ఏకాగ్రత గోచరమైంది. ఆమె పెదవులు కరుచుకుని అదురుతున్నాయి. గదిలోని నిశ్శబ్దతవల్ల తల్లి త్వరలోనే ప్రశాతస్థితి కొచ్చింది. లుద్మీలా విభ్రాంతస్థితిని గమనించి,

"బహుశా నేను చెప్పకూడని విషయం చెప్పేను కాబోలు?" అని తల్లి క్షమాపణ పూర్వకంగా అడిగింది.

లుద్మీలా ఆమెకేసి తిరిగి దాదాపు భయపడిపోయినట్టే చూసింది. తర్వాత ఇక చెప్పద్దన్నట్లుగా ఆమె చేయి పట్టుకుంది.

"వద్దు! వద్దు! అదంతే. కాని మనమింక ఆ విషయాన్ని గురించి మాట్లాడుకోవద్దు. మీరేమి చెప్పేరో దాన్నలాగే ఉండనియ్యండి" అంది. "మీరు త్వరగా వెళ్లడం మంచిది. చాలా దూరం వెళ్లాలి కదా" అని మెల్లగా చెప్పింది.

"నా కొడుకు చెప్పిన మాటలను, నా రక్తంలో రక్తమూ మాంసంలో మాంసమూ అయిన నా కొడుకు మాటలను ఇతరులకు చెప్తూంటే నాకెంత సంతోషమో మీకు తెలుస్తేనా!... నా ఆత్మను సమర్పిస్తున్నట్లే!"

తల్లి చిరునవ్వు నవ్వింది. కాని అది లుద్మీలా ముఖంమీద స్ఫుటంగా ప్రతిబింబించలేదు. ఆమె నిగ్రహంవల్ల తన సంతోషం నీరుకారిపోతున్నట్లు తల్లికి తోచింది.

"ఇదంతా చూస్తూంటే, మానవుని కడుపున కొత్త దేవుడు అవతారమెత్తినట్టుగానే ఉంది! ప్రతి ఒక్కటీ అందరికీ అంతా ప్రతి ఒక్కడికీ! నేనా దృశ్యాన్నే చూస్తున్నాను. అసలైన నిజం చెప్పాలంటే మనమంతా కామ్రేడ్లం. ఆత్మీయులైన బంధువులం. అందరమూ సత్యమనే తల్లి బిడ్డలం!"

మళ్లీ ఆమెకు ఆవేశం పొంగివచ్చి అందులో చిక్కుకుపోయింది. అలగే నిలబడిపోయి, నిట్టూర్చి, చేతులు విశాలంగా చాచింది. "కామ్రేడ్సు" అనే మాటను నాలో నేను స్మరించే సరికి, వారు నా హృదయంలోనుంచి పొంగి వస్తుండడం నేనే వినగలుగుతున్నాను!"

ఆమె చేయదలచుకున్న పని చేసింది : లుద్మీలా ముఖం వెలుగొందింది. పెదవులు వణికేయి. బుగ్గలమీద నుండి అశ్రుబిందువుల జలజలరాలేయి.

తల్లి మందహాసం చేస్తూ, తను సాధించిన విజయానికి హృదయంలో ఆనందిస్తూ లుద్మీలాను కౌగిలించుకుంది.

వాళ్లిద్దరూ విడిపోతుంటే లుద్మీలా తల్లి ముఖంకేసి తేరిపారజూసి మెల్లగా : "మీతో ఉంటే నాకెంతో బాగుందో మీకు తెలుసా?" అంది.

ఆమె బయటికి రావడంతోనే అతి చల్లని గాలి ముఖానిక కొట్టింది. ముక్కు దిబ్బడేసి పోయింది. అక్కడే ఆగి నాలుగు వైపులా చూసేసరికి ఒక మూల చింపిరి టోపీ ధరించిన బండివాడు నిలబడున్నాడు. కొంచెం పైగా ఒక మనిషి వంగి, తలను భుజాలదాకా వంచకు నడుస్తున్నాడు. అతని ఎదురుగా ఒక సిపాయి చెవులు రుద్దుకుంటూ పరుగెత్తేడు.

"సిపాయిని దుకాణానికి పంపినట్లుంది" అనుకుంటూ ముందుకు సాగింది. కాళ్లకింద మంచు కిరకిరలాడుతుంటే బాగానే ఉందనుకుంది. రైలు వేళ కన్న చాలా ముందుగానే ఆమె స్టేషనుకు చేరుకుంది. కాని ఉన్న మూడవ తరగతి ప్రయాణీకులు కూర్చునే గది అసహ్యంగా జనంతో క్రిక్కిరిసిపోయింది.

ఒక యువకుడు, తోలు పెట్టెను చేత్తో పుచ్చుకుని తలుపు తోసుకు లోపలి కొచ్చాడు. నాలుగు మూలలా చురచుర చూసి తిన్నగా తల్లి దగ్గర కెళ్లేడు.

"మాస్కోకా ప్రయాణం?" అని అడిగేడు.

"అవును. తాన్యా దగ్గరకి" తల్లి జవాబు చెప్పింది.

"ఇదిగో!"

అతను పెట్టెను ఆమె పక్కన బెంచీమీద పెట్టేడు. సిగరెట్ ముట్టించి, టోపీ సర్దుకుని రెండవ గుమ్మంలోంచి బయటి కెళ్ళిపోయాడు. తల్లి చల్లగా ఉన్న తోలుపెట్టెను తట్టి, దానిమీద మోచేతి నాన్చి, చుట్టూ ఉన్న జనాన్ని తృప్తితో పరిశీలించడం మొదలెట్టింది. ఒక నిముషమైన తర్వాత అక్కడనుంచి లేచి, బయటికి పోయే గుమ్మం దగ్గరున్న సీటులోకి మారింది. అట్టే అంత బరువుగా లేని తోలుపెట్టెను చేత్తో పుచ్చుకుని, తల పైకెత్తుకుని, ఎదురైన మనుషుల ముఖాలన పరిశీలిస్తూ నీటుగా నడిచి వెళ్ళిది.

పొట్టి కోటు తొడుకున్న ఒక యువకుడు కాలరు పైకెత్తుకుని దారి కడ్డొచ్చాడు. మౌనంగా అతను పక్కకు తొలగి, చేతిని టోపీదాకా పైకెత్తేడు. తల్లికి అతడి నెప్పుడో చూసినట్లు జ్ఞాపక మొచ్చింది. ఆమె వెనక్కు తిరిగి చూసేసరికి, అతడామెను మెడనిగడ్చి ఒంటి కంటితో చూస్తున్నాడు. అతని చూపు కత్తిపోటంత వాడిగా ఉంది. పెట్టెను పట్టుక్ను చేయి అదిరి వణికింది. హఠాత్తుగా పెట్టె బరువెక్కింది.

"ఇంతకు ముందెప్పుడో చూసినట్టుంది" అని ఆలోచించడం మొదలెట్టింది తల్లి. అతని చూసామెకొక అ ప్రియమైన భావాన్ని కలిగించింది. క్రమంగా తన హృదయాన్ని గడ్డకట్టిస్తున్న భావాన్ని పక్కకునెట్టి ఆ ఆలోచనను తన మనస్సులో నిలబెట్టుకుంది. కాని ఆ భావమే వ్యాప్తమై కంఠంలో కొచ్చింది.నోరు పొడారిపోయి చేదెక్కింది. వద్దనుకున్నా, వెనక్కు తిరిగి అతన్ని మరొకసారి చూడకుండా ఉండలేకపోయింది. అతడు నిలబడిన చోటే నిలబడి ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తున్నట్లున్నాడు. ఎడమ చేతిని జేబులో పెట్టుకున్నాడు. కుడి చేతిని కోటు బొత్తాముల మధ్య దోపుకున్నాడు. ఎడమ భుజం కన్న కుడి భుజం పైకి లేచింది.

ఆమె ఒక బెంచి మీద కెళ్ళి నెమ్మదిగా కూచుంది. తన లోపల ఉన్నదేదో పగిలిపోతుందేమో నన్నంత భయంతో కూచుంది. ప్రమాద సూచనల వత్తిడివల్ల ఆమె జ్ఞాపకాలను శోధించింది. చివరకు ఈ మనిషిని తాను ఇదివరలో రెండు సార్లు చూసిన జ్ఞాపకం వచ్చింది. ఒకసారి, రీబిన్ జైల్లో నుండి పారిపోయి వచ్చినప్పుడు ఊరి చివర మైదానం మీద చూసింది. రెండవసారి పావెల్ విచారణప్పుడు చూసింది. రీబిన్ వెంటబడ్డప్పుడు తాను తప్పు దారి పట్టించిన పోలీసు ఉద్యోగి పక్కనే కోర్టుల్లో నిలబడ్డప్పుడు చూసింది. తనమీద పోలీసు నిఘా ఉందని అప్పుడామె గ్రహించింది. దాని కేమీ సందేహం లేదు.

"దొరికిపోయానా ఏమిటి?" అని తన్ను తానే ప్రశ్నించుకుంది.

"ఇంకా లేదేమోలే" అని వణుకుతూ జవాబుచెప్పుకుంది.

ఇలాంటి ఆలోచనలు పైనుంచి శత్రువుల్లా మీద పడుతున్నాయి. ఆమె మనస్సునవి దహింపచేశాయి. హృదయాన్ని నిప్పు దారంతో కుడుతున్నట్లనిపించింది. ఆ బాధతో ఆమెకు తనకు తానే దూరమైపోయినట్లనిపించింది.

హఠాత్తుగా ఒక్క గొప్ప ప్రయత్నం చేసి, ఈ ఆలోచనలన్నిటినీ ఆమె తోసి పారేసింది. బలహీనమైన నీచమైన ఈ నెరుసులన్నిటినీ తోసేసింది. తనలో తానే "ఛీ! సిగ్గు, సిగ్గు!" అని సగర్వంగా హెచ్చరించుకుంది.

క్షణంలో ఆమె మనస్సు కుదుటబడింది. నిజానికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. "నీ కొడుకుని అవమాన పరచకు! నువ్వు భయపడకు!" అనుకుంది.

ఆమె దృష్టికొక మకమకలాడుతూన్న బెరుకు చూపగుపడింది. మనోనేత్రానికి రీబిన్ ముఖం గోచరించింది. కొద్ది నిముషాల సంకోచం తర్వాత మరింత ధైర్య మొచ్చింది. ఇప్పుడామె గుండెలు నిదానంగా కొట్టుకొన్నాయి. నాలుగు మూలలా పరికిస్తూ,

"ఇప్పుడేమవుతుంది?" అనే ఆలోచనలో పడింది.

గూఢచారి, స్టేషన్ గార్డును పిలుచుకొచ్చి, కళ్లతో ఆమెను చూపెడుతూ అతని చెవిలో గుసగుసలాడేడు. గారు అతనికేసి చూసి వెనక్కెళ్లిపోయాడు. ఇంతలో మరొక గార్డొచ్చాడు. అతను చెప్పిన మాటలన్నీ విని చిరచిరలాడేడు. అతను ముసలివాడు. నెరిసిన జుట్టూ, మాసిన గెడ్డంతో పొడుగ్గా ఉన్నాడు. గూఢచారి వంక తలూపి, అతను తల్లి కూర్చున్న బెంచీ వైపుకు బయల్దేరేడు. గూఢచారి అదృశ్యమైపోయాడు.

ముసలి గార్డు చిరచిరలాడుతూ, తల్లికేసి తదేక ధ్యాసతో చూస్తూ, తాపీగా దగ్గర కెళ్లేడు. ఆమె బెంచీ మీద వెనక్కు చేరబడింది.

"నన్ను కొట్టకుండా ఉంటే బాగుండును!" అనుకుంది.

అతను ఆమె ఎదుట నిలబడ్డాడు. ఒక్క నిమిషం ఏమీ మాట్లాడకుండా నిలబడ్డాడు. చివరకు,

"ఏమిటలా చూస్తున్నావు?" అని అడిగేడు.

"ఏమి లేదు."

"అలాగా? ఆసి దొంగా! ఈ వయస్సులో ఇలాటి తమాషాలు చేస్తున్నావన్న మాట!"

అతని మాటలామె ముఖాన కొట్టినట్లయింది. ఒకసారి! రెండుసార్లు! అతని మాటల్లోని మోటుతనం, ద్వేషం, ఆమె దవడను పగలగొట్టినంతగా, గుడ్లు పీకినంతగా బాధించాయి.

"నేనా? నేను దొంగని కాను! నువ్వబద్ధమాడుతున్నావు!" అని గట్టిగా అరిచింది. ఆమెలో ప్రజ్వరిల్లిన నైతికాగ్రహం, చుట్టుపక్కలనున్న వస్తువులన్నిటినీ ఊపేసింది. ఆమె తోలుపెట్టె నొక్క లాగు లాగింది. పెట్టె తెరుచుకుంది.

"అందరూ చూడండయ్యా, చూడండి!" అని ఆమె కేకలేసింది. ఒక గంతేసి లేచి చేతినిండా కరపత్రాలు పుచ్చుకుని చెయ్యి పైకెత్తింది. ఆమె చెవుల్లో అరుపులూ, కేకలూ పడ్డాయి. నాలుగు మూలల్నుంచీ జనం ఆమె దగ్గరకు పరుగెత్తు కొచ్చారు.

"ఏం జరిగింది?"

"అడుగో గూఢచారి..."

"ఏమిటది?"

"ఈమె దొంగ అంటున్నారు!"

"అంత మర్యాదస్తురాలైన స్త్రీ దొంగా? ఛఛ!"

"నేను దొంగని కాను!" అని తల్లి బిగ్గరగా అరిచింది. జనం చుట్టూ మూగడంతోనే ఆమె ఆవేశం తగ్గింది.

"నిన్నటి రోజున రాజకీయ ఖైదీల విచారణ జరిగింది. నా కొడుకు పావెల్ వ్లాసొవ్ వాళ్లలో ఒకడు. అతనొక ఉపన్యాసం ఇచ్చాడు. ఇదిగో అది! నేను దాన్ని జనం దగ్గరికి తీసుకుపోతున్నాను. దాన్ని వాళ్లు చదువుకుని నిజం తెలుసుకోవాలని నా అభిప్రాయం...."

ఎవరో ఒకరు అతి జాగ్రత్తగా ఆమె చేతిలోని కరపత్రాన్నొకదాన్ని తీసుకున్నాడు. ఆమె వాటిని గాలిలో ఊపి జనం మీదకు విసిరేసింది.

"అందుకు నీకు తగిన శాస్తి చేస్తారు!" అని భయపడుతూ ఎవరో చెప్పేరు.

జనం కరపత్రాలన్నింటినీ తీసుకుని జేబుల్లోనూ, కోట్ల లోపలా కుక్కుకోవడం తల్లి చూసింది. ఈ దృశ్యమామెకు కొత్త బలాన్నిచ్చింది. పొంగి పొరలుతున్న గర్వంతో మాట్లాడ్డం మొదలెట్టింది.

"నా కొడుకునూ, అతని మిత్రులనూ వాళ్లు కోర్టుకెందుకు లాక్కొచ్చారో తెలుసునా? నేను చెపుతున్నాను వినండి. మాతృహృదయాన్నీ, పండిన జుట్టునూ నమ్మండి. వాళ్లు ప్రజలకు నిజం చెప్పిన చిన్న అపరాధానికే వాళ్లని కోర్టుకెక్కించారు! ఈ సంగతి నెవరూ కాదనేవాళ్లు లేరని నిన్న తెలుసుకున్నాను. ఒక్కరు కూడా లేరు!"

గుంపు పెద్దదైంది. నిశ్శబ్దంగా ఉంది. ఆమె చుట్టూ జనం సజీవమైన కడియం కట్టేరు.

"దరిద్రం, ఆకలి, రోగం ఇవే ప్రజలు పడే కష్టానికి ప్రతిఫలాలు! అంతా మనకు ప్రతికూలమే మన జీవితకాలమంతా, ప్రతిరోజూ శరీరంలో ఉండే శక్తినంతనీ పనికే ధారపోస్తాం. దరిద్రపు పనికి వినియోగించి దగాపడుతుంటాం. మనల్ని గొలుసులకు కట్టేసిన కుక్కల్లాగ అజ్ఞానంలో పడేసి ఉంచి, మన కష్టం నుంచి లభించిన ఆనందాన్నీ, లాభాలనూ ఇతరులు అనుభవిస్తారు. మనకేమీ తెలియదు. మనలను భయంలో ఉంచుతారు. మనం దేన్నీ చూచినా భయపడుతూ ఉంటాం. మన జీవితాలు ఒక సుదీర్ఘమైన చీకటి రాత్రి!"

"ఆ మాట నిజం" అని జనంలోంచి మెల్లగా ఆమోద సూచకంగా మాటలు వినబడ్డాయి.

"ఆమె నోరు మూయించు!"

గుంపు వెనకాల గూఢచారీ, ఇద్దరు పోలీసులు నిలబడి ఉండడం తల్లి కనిపెట్టింది. కరపత్రాలు ఆఖరువరకూ తొందరతొందరగా పంచిపెట్టేసింది. ఆఖరిసారి పెట్టెలో చెయ్యి పెట్టేసరికి, అందులో మరొకరి చెయ్యి తగిలింది.

"తీసుకోండి, తీసుకోండి" అని వంగుని చెప్పింది.

పోలీసులు జనాన్ని పక్కకు తోసేస్తూ,

"పోండి! పోండి!" అని కేకలేశారు. పోలీసుల్ని తోస్తూ జనం అయిష్టంగానే దారిచ్చారు, బహుశా అప్రయత్నంగానే వాళ్లను వెనక్కి దబాయించారు. విశాలమైన నిష్కపటమైన నేత్రాలూ, దయామయమైన ముఖమూ కలిగిన ఆ ముసలమ్మ పట్ల జనం అనివార్యంగా ఆకర్షింపబడ్డారు.

"ముసలమ్మా! వెళ్లిపో!"

"ఒక్క నిముషంలో నిన్ను పట్టేస్తారు!"

"ఆమె ఎంత ధైర్యస్తురాలో!"

"ఇక్కణ్ణుంచి పోండి! ఎవరి చోట్లకు వాళ్లు వెళ్లిపోండి!" అని పోలీసులు కేక లేసుకుంటూ ముందుకు చొచ్చుకొచ్చారు. తల్లి కెదురుగా ఉన్న జనం ఊగుతూ ఒకళ్ల నొకళ్లు గట్టిగా పట్టుకున్నారు.

జనం తన చెప్పినదంతా అర్థం చేసుకుని నమ్మడానికి సిద్ధంగా ఉన్నట్లామె గుర్తించింది. కనుక తనకు తెలిసిందంతా గబగబ చెప్పెయ్యాలనుకుంది. హృదయాంతరాళంలో నుంచి లేచి ఒక పాటగా రూపొందేయి. కాని ఆ పాటను తాను పాడలేనని ఎంతో బాధతో తెలుసుకుంది. ఆమె గొంతుక గద్గదమైంది. మాటలు ధారళంగా రావడం లేదు.

"నా కొడుకు మాటలు, ఆత్మని అమ్మేసుకోని కార్మికుని నిజాయితీగల మాటలు. వాటిలోని ధైర్యంవల్లనే అవి నిజాయితీగల మాటలని చెప్పవచ్చు!"

భయంతోనూ, తన్మయత్వంతోనూ, ఒక యువకుని కళ్లు ఆమెకేసి తదేక దృష్టితో చూసేయి.

ఎవరో ఆమెను గుండెల మీద గుద్దేరు. ఆమె బెంచీమీద పడిపోయింది. పోలీసుల చేతులు జనం నెత్తిమీద తళతళలాడుతూ నృత్యం చేశాయి. జనాన్ని మెడలు పట్టుకునీ, భుజాలు పట్టుకునీ, తోసిపారేశారు. టోపీలు లాగేసి, గది ఈ చివరనుంచి ఆ చివరకు విసిరిపారేశారు. తల్లి కళ్లు గిరగిర తిరిగిపోయాయి. పోగా మిగిలిన గొంతుకతో, అరిచేందుకుగాను, తన బలహీనతను జయించింది. "ఓ సత్పురుషులారా! కలసికట్టుగా నిలబడి, ప్రబలమైన ఐక్య శక్తి కండి!" అంటూ అరిచింది.

బలసిన పెద్దచేత్తో ఒక పోలీసు ఆమె మెడని పట్టుకుని ఊపేశాడు.

"నోర్ముయ్!"

ఆమె తల గోడకు కొట్టుకుంది. ఒక్క క్షణం ఆమె హృదయంలో భయమనే ఘాటు పొగ పుట్టింది. కాని మళ్లీ ధైర్యం భగ్గున లేచి పొగను పోదోలింది.

"ఏయ్ పద!" అన్నాడు పోలీసు.

"మీరు దేనికీ భయపడకండి! మీరు బతికే బతుకులకన్న కనాకష్టమైనదింకేమీ ఉండదు..."

"నోరు ముయ్ అని చెప్తున్నాను!"

పోలీసు ఆమె చెయ్యి పట్టుకుని ముందుకు గెంటేడు. మరొక పోలీసు రెండో చెయ్యి పట్టుకున్నాడు. ఇద్దరూ కలిసి ఆమెను లాక్కుపోయారు.

"... ప్రతిరోజూ మీ హృదయాన్ని తినేసే బాధకన్న ఇదెక్కువది కాదు. మీ ఆత్మను నమిలేదాని కన్న ఎక్కువది కాదు!"

గూఢచారి ఆమె ముఖంమీద పిడికిలి ఝుళిపిస్తూ ముందుకు పరుగెత్తేడు.

"నోరుముయ్, ముండా!" అని అరిచాడు.

గూఢచారి ఆమె ముఖం మీద ఒక్క దెబ్బ కొట్టేడు.

"మా బాగా జరిగింది ముసలిదానికి!" అని ఎవరో ద్వేషంతో అన్నారు.

ఒక నిమిషం నల్లగా ఎర్రగా ఉన్న పదార్థంతో ఆమె కళ్లు చీకట్లు కమ్మేయి. నోరు ఉప్పగా రక్తాన్ని చవిచూసింది.

సన్నని మాటల ధ్వనితో ఆమె తెప్పరిల్లింది.

వాళ్లామెను నడుం పట్టుకు గుంజేరు. మెడపట్టుకు గెంటేరు. భుజాలమీదా, తలమీదా కొట్టేరు. అంతా ధగధగమంది. కేకలు, బొబ్బలు, ఏడుపులు, ఈలల తుపానులో అన్నీ

జిగేలుమన్నాయి. ఆమె తల దిమ్మెక్కిపోయింది. చెవులు గడియలు పడిపోయాయి. గొంతుకకేదో అడ్డుపడి ఊపిరాడలేదు. నేలకిందకు దిగిపోయినట్లయింది. ఆమె మోకాళ్లు పట్టు సడలిపోయాయి. బల్లెపు పోటుల్లాంటి పోట్లతో ఆమె జంకిపోయింది. శరీరం బరువెక్కి నిస్సహాయంగా ఊగిసలాడింది. కాని ఆమె కళ్లలోని మెరుగు మాత్రం పోలేదు. ఆ కళ్లతో ఆమె ఇతరుల కళ్లను, తనకు సుపరిచితమైన, తానెంతగానో ప్రేమించే ఉజ్వల, సాహసిక జ్వాలతో భాస్వంతమైన కళ్లను చూస్తోంది.

ఆమెను గుమ్మంలోంచి ముందుకు గెంటేరు.

ఆమె ఒక చేతిని వదిలించుకుని దానితో తలుపు గడియని పట్టుకుంది.

"రక్త సముద్రం కూడా సత్యాన్ని ముంచెయ్యలేదు!"

వాళ్లామెను చేతిమీద కొట్టేరు.

"మిమ్మల్నింకా ద్వేషించేటట్లు చేసుకుంటున్నారు! మీరు మూర్ఖులు! ఇదంతా చివరకు మీ నెత్తిమీదే పడుతుంది!"

ఒక పోలీసు ఆమె గొంతుక నొక్కడం మొదలెట్టాడు. ఆమె ఉక్కిరిబిక్కిరైంది.

"ఓరి దౌర్భాగ్యులారా!..."

ఎవరో బిగ్గరగా ఆమెకు సమాధానమిచ్చాడు.

అమ్మా!.....

ప్రజాశక్తి బుక్‌హౌస్